


భక్తుల పెన్నిధి. అశేష భక్తుల ఆరాధ్యదైవం. సింహాచలం మహా పుణ్యక్షేత్రం.

పచ్చగా చూడచక్కగా గోచరిస్తున్న 'సింహగిరి' కొండని చుట్టుకొని పాములా మెలికలు తిరిగి ఉంది ఘాట్ రోడ్.

జీడి, మామిడి, అనాస, పనస పండ్ల తోటలతో పాటు సువాసనలు వెదజల్లే సంపంగిపూలు చెట్లతో కళకళలాడుతుంది కొండ కొండంతా.

కొండ పైకి ఘాట్ రోడ్ లో ప్రయాణించే భక్తులు కమ్మటి సువాసనలు ఆస్వాదిస్తూ ఆహ్లాదంగా సింహాద్రి అప్పన్న దర్శనానికి నిర్మల మనస్కులై వెళ్తుంటారు.

కొన్ని వందల ఏళ్ళ క్రితం గుర్తించబడి నిర్మించబడ్డ ఆలయం అది. పురూరవ చక్రవర్తి కాలంలో భక్తులకు చేరువైన భగవంతుడు నిత్యపూజలందుకుంటూ శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామిగా, సింహాద్రి అప్పన్నగా, చందనస్వామిగా వేనోళ్ళ కొలవబడుతున్నాడు.

ఆ రోజు -

స్థిరవారం. చందన స్వరూపుడైన సింహాద్రి అప్పన్నకు మేలిమిరోజు, వేలుపురోజు. అప్పన్నకు ప్రీతి పాత్రమైన దినము. ఆంధ్రరాష్ట్రం నలుమూలల నుండే కాక ఒడిశా, బెంగాల్ తదితర రాష్ట్రాల నుండి కూడా వేలకు వేల మంది భక్తజనులు దైవ దర్శనానికి విచ్చేశారు. క్షేత్రమంతా చాత్రలో జాతరలా ఉంది.

కొండ దిగువున ఊరు ఊరంతా భక్తులతో కిక్కిరిసి ఉంది. కొండ దిగువ బస్సు స్టాండ్ లో భక్తులు బస్సుల కోసం క్యూలో నిలబడి ఉన్నారు. కొందరు కాలినడకన మెట్ల మార్గంలో 'తొలి పావంచా' దగ్గర కాలభైరవ స్వామికి కొబ్బరికాయలు కొట్టి 'గోవిందా గోవిందా' అను అరుచుకుంటూ కాలి నడకన నడిచి వెళ్తున్నారు.

ఒకదాని వెనుక ఒకటి బస్సులు భక్తులను ఎక్కించుకుని కొండపైకి వెళ్తున్నాయి. కొండపైనుండి దర్శనాలు అయిన భక్తులను మోసుకుంటూ క్రిందకు దిగుతున్నాయి కొన్ని బస్సులు.

సింహాచలానికి చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల నుండి చేరువలోన ఉన్న ఇతర నగరాల నుండి నేరుగా కార్లలోనూ, స్కూటర్ల పైన, బైక్ లపైన వస్తున్న భక్తులు టోల్ గేట్ దగ్గర టిక్కెట్లు తీసుకుని నేరుగా ఘాట్ రోడ్ లో కొండపైకి వెళ్ళిపోతున్నారు.

కొండ ఘాట్ రోడ్డంతా వచ్చేపోయే వాహనాలతో మహారద్దీగా ఉంది. బైకులయితే ఈగల్లా అటూ ఇటూ తిరుగుతున్నాయి.

కొండపైన దేవాలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడుతుంది. దైవ దర్శనానికి భక్తులంతా క్యూలలో నిలబడ్డారు. ఆలయంలో ప్రాంగణమంతా దివ్యత్వం నిండుకుని ఏదో తెలియని మహదానందం పరచుకుని ఉంది. భక్తులంతా భక్తి పారవశ్యంలో స్వామి నామస్మరణ చేసుకుంటూ క్యూలో ముందు సాగుతున్నారు.

దేవాలయంలో ఉన్న మైకుల్లో నుండి భక్తులకు రకరకాల జాగ్రత్తలు చెప్తున్నారు. దొంగలున్నారని జాగ్రత్తలు చెప్తూ పిల్లలు తప్పిపోకుండా జాగ్రత్త పడమని చెప్తూనే క్యూలో తోపులాటలు లేకుండా వెళ్ళమని అభ్యర్ధిస్తున్నారు.

సరిగ్గా పదిగంటలు కావస్తోంది. భక్తుల రద్దీ రాను రాను మిక్కుటమవుతోంది. పోలీసులు, దేవాలయ సిబ్బంది యాత్రికులను కంట్రోల్ చేయలేకపోతున్నారు.

ఉత్తర ద్వారం గుండా దర్శనానికి వెళ్ళిన భక్తులు గాలిగోపురంలో నుండి తిరిగి వెలుపలకు వస్తున్నారు. గాలి గోపురం ప్రక్కనే ఉన్న ప్రసాదాల కౌంటర్ల దగ్గరకి పరుగందుకుంటున్నారు. అక్కడ కూడా ప్రసాదాల కోసం క్యూ చాంతాడంత సాగి ఉంది. కొందరు భక్తులు నిత్యాన్నదాన సత్రంకేసి వెళుతున్నారు.

గాలి గోపురం దగ్గరనుండి కొండపై బస్సు స్టాండ్ వరకూ దారి పొడవునా ఉన్న దుకాణాల్లో చాలామంది భక్తులు గుమిగూడి ఉన్నారు. సెనగలు, ఖర్జూరం, స్వామివారి ఫోటోలు, పిల్లల ఆటవస్తువులు ఇళ్ళల్లో పూజకోసం ఇత్తడి కుందులు గట్రా కొనుక్కునేందుకు ఆ షాపుల్లో ఈగల్లా మూగి ఉన్నారు.

కొండ దిగువకు నడిచి వెళ్ళే భక్తులు బస్సు స్టాండ్ కి ప్రక్కనే వున్న మెట్ల మార్గంలో దిగువకు దిగి వెళ్ళిపోతున్నారు. కొండపైకి వచ్చేవాళ్ళు వస్తున్నారు.

కొండ దిగువ నుండి వస్తున్న బస్సుల్లో యాత్రీకులు దిగ దిగగానే, దర్శనాలు అయిపోయిన భక్తులు కొండ క్రిందకు చేరుకునేందుకు బస్సు ఆగీ ఆగ్గానే మీద పడుతున్నారు. లోపలనుండి దిగుతున్న వాళ్ళని దిగనీయకుండా తోసుకుంటూ ఎక్కుతున్నారు. అక్కడున్న క్లీనర్ కుర్రాళ్ళు వాళ్ళని కంట్రోల్ చెయ్యలేకపోతున్నారు.

కొండ దిగువకు వెళ్ళే ఒక బస్సు యాత్రీకులతో క్రిక్కిరిసిపోయి ఉంది. క్లీనర్ కుర్రాడు బస్సులో ఉన్న యాత్రీకులందరి దగ్గర టిక్కెట్లు ఉన్నాయో లేదో చెక్ చేసి 'రైట్' అంటూ బస్సు మీద పెద్దగా ఒక్క చరుపు చరిచాడు.

బస్సు డ్రైవర్ అప్పారావు ప్రక్కనే వున్న రావిచెట్టు క్రిందనున్న పాన్ షాప్ దగ్గర నిలబడి భక్తులు

బస్సు ఎక్కుతుంటే గమనిస్తున్నాడు. జర్దాకిళ్ళీ బుగ్గన పెట్టుకుని నెమ్మదిగా నములుకుంటూ నిదానంగా నడుచుకుంటూ బస్సు దగ్గరికి వచ్చి స్టీరింగ్ సీట్లో ఎక్కి కూర్చున్నాడు.

బస్సు స్టార్ట్ చేసి హారన్ మోగించాడు. ఇంకా ఎవరైనా ఎక్కవలసి ఉన్నా ఎక్కుతారని, క్లీనర్ కుర్రాడు కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తాడని అలా హారన్ మ్రోగిస్తారు డ్రైవర్లు.

ఇంతలో పరుగు పరుగున ఓ యువకుడు పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు డ్రైవర్ దగ్గరకు వెళ్ళి ఆపమని చేతులూపుతూ వచ్చాడు. పరిగెత్తుకు మెట్లు దిగడం వలన ఆయాసంతో మాట్లాడలేకపోతున్నాడు.

"అన్నా! మా వాళ్ళు నలుగురు బస్సు ఎక్కుతున్నారు" అంటూ తను దగ్గరుండి దర్శనం చేయించి తీసుకువచ్చిన వాళ్ళని దగ్గరుండి బస్సు ఎక్కించాడు ఆ యువకుడు. ఆ యువకుడికి అక్కడ అందరూ తెలిసినవాళ్ళే.

"చాలా థాంక్స్ ఏకాంబర్! చాలా శ్రమ తీసుకుని మాకు గైడ్ గా వ్యవహరించి దర్శనాలు దగ్గరుండి చేయించావ్! నువ్వు లేకపోతే ఇంత తొందరగా మా దర్శనాలు అయ్యేవి కావు" బస్సు ఎక్కుతూ ఆ నలుగురిలో పెద్దాయన ఒకరన్నారు.

"అదేంటి సార్! మీతో పనుంటే మీరు నాకు సహాయం చెయ్యరా? ఏంటి?!" వినయంగా అన్నాడు ఏకాంబర్.

"నువ్వు రావా?!" ఇంకొకతను అడిగాడు.

"నేను ముందే మీకోసం కొండకి వచ్చా కదా సార్! అందుకే బైక్ మీద వచ్చేసాను. నా బైక్ ఇక్కడే ఉంది. ఉంటా సార్!" అంటూ వారికి వీడ్కోలు పలికాడు ఏకాంబర్.

"ఏకాంబర్ సార్! మీ కుశల ప్రశ్నలు ముందే మాట్లాడుకుంటే బాగుండేది. బస్సు బయలుదేరే ముందు ఎక్కి ఈ సోదేంటి సార్" అని ఏకాంబర్ తో అంటూనే క్లీనర్ కుర్రాడు బస్సు మీద దబదబా బాదుతూ 'రైట్ రైట్' అని అరిచాడు.

బస్సు నిండు చూలాల్లా కదల్లేక కదులుతూ ముందుకు కదిలింది. అరఫర్లాంగ్ దూరం మేర కొండ ఘాట్ రోడ్ ఎక్కాలి. క్రిక్కిరిసిన యాత్రీకులతో ఫస్టు గేర్ మార్చి రెండో గేర్ లోనే ముందుకు నడిపించాడు డ్రైవర్ అప్పారావు.

ఆ తర్వాత ఘాట్ రోడ్ అంతా పల్లంలోనే ఉంది. మలుపులు మలుపులతో జర్రున జారిపోయేలా రోడ్డంతా పల్లంలోనే సాగిపోతుంది.

'ఈ అరఫర్లాంగ్ దూరం దాటితే ఇక అంతా డౌనే. టాప్ గేర్ లోనే ఎలాంటి రేజింగ్ ఇవ్వకుండా కొండ క్రిందకు దిగవచ్చు' మనసులోనే అనుకున్నాడు అప్పారావు. ఎన్నిసార్లు బస్సు కొండపైకి, దిగువకి నడిపినా అస్తమానం కొత్తగానే జాగ్రత్తగానే బస్సు నడపడం డ్రైవర్లందరికీ అలవాటు.

కొండ ఘాటీ ఎక్కగానే ఉన్న పెద్ద మలుపు దగ్గర ట్రాఫిక్ కంట్రోల్ చేసే సెక్యూరిటీ గార్డు వచ్చే పోయే వాహనాలకి సిగ్నల్స్ ఇస్తున్నాడు. ఆ మలుపులో క్రింద నుండి వచ్చే వాహనాలు, దిగే వాహనాలను పసిగట్టలేవు. హారన్ కూడా సరిగ్గా వినిపించదు. ప్రమాదాలు జరక్కుండా దేవాలయం అధికారులు ఏర్పాటు చేసిన జాగ్రత్త చర్యల్లో అదొకటి.

పెద్ద మలుపు దాటి కొండ బస్సు పల్లం రోడ్డులో రివ్వున తారాజువ్వలా దూసుకుపోతోంది.

బస్సులో యాత్రీకులు కిక్కిరిసి ఉన్నారు. మగాళ్ళు కొందరు గుండు చేయించుకుని తలకి చందనం పూసుకొని ఉన్నారు. ఆడ, మగ, పిల్లలు, పెద్దవాళ్ళు అంతా ఒకర్నొకరు ఒరుసుకుంటూ కూర్చున్నారు. నిలబడ్డ వాళ్ళంతా ఒకరిమీద ఒకరు పడిపోతూ బస్సు కొండ దిగుతూంటే వూగిపోతూ సున్నితంగా గుద్దుకుంటూ కొండ దిగువనున్న ఊర్ని, లక్క పిడతల్లా కనిపిస్తున్న ఇళ్ళని చూస్తూ భక్తిపారవశ్యంలో ఉన్నారు.

ఎవరో పిల్లాడు ఊపిరి సలపక గుక్క పెట్టి ఏడుస్తున్నాడు. జనాల మధ్య నిలబడి పిల్లాడ్ని ఎత్తుకోలేక నానా అవస్థలూ పడుతోంది ఆ తల్లి.

సీట్లో కూర్చున్న ఎవరో పుణ్యాత్మురాలు ఆమె దగ్గర నుండి పిల్లాడ్ని తీసుకుని బుదిరించింది. కొద్ది దూరంలో ఉన్న ఫుట్ బోర్డు మీద బూరలు, చిన్న బొమ్మలు, పిల్లనగ్రోవి కర్రలు, కాగితం ఫేనులు అమ్ముకునే ముసలతను నిలువుగా నిలబెట్టిన కర్ర పట్టుకుని ఉన్నాడు. ఆ కర్రకి పుల్లలతో పిల్లల ఆటవస్తువులన్నీ గుచ్చి గుచ్చి ఉన్నాయి.

ముందు సీట్లో కూర్చున్నతని గుండు మీద వెనక కూర్చున్న పిల్లాడు ఉండుండీ తబలా వాయిస్తున్నట్టు కొడుతున్నాడు. అతను వెనక్కి తిరిగి కుర్రాడ్ని చూసి మళ్ళీ తల తిప్పుకుంటున్నాడు.

బస్సు జారుడు బల్లమీద నుండి జారుతున్న పిల్లాడిలా రివ్వు రివ్వున ముందుకు దూసుకుపోతోంది.

కొండపైకి వస్తున్న బస్సులు, కార్లు, స్కూటర్లు, బైక్ లు టాప్ గేర్లో రివ్వున పైకి ఎక్కుతున్నాయి. ఏమాత్రం స్లో చేసినా వాహనాలు ఘాట్ రోడ్ లో ముందుకు సాగటం కష్టం. అదీగాక కార్లు, బస్సులు కిక్కిరిసి ఉంటాయి.

కొండ పై నుండి క్రిందకు రివ్వున దూసుకు వస్తున్న బస్సును తప్పించుకుంటూ ముందుకు పరిగెడుతున్నాయి. వాహనాలన్నీ.

కొండమీద నుండి క్రిందకు దిగుతున్న బైక్ లు రయ్ రయ్ మని ముందున్న బస్సుని దాటి గాల్లో దూసుకుపోతున్నాయి. నాలుగు చక్రాల కార్లు, బస్సులకు ముందు వెళ్తున్న బస్సుని తప్పించుకుని ముందుకు సాగే అవకాశం దొరకటం లేదు.

ఎన్నో ఏళ్ళుగా దేవస్థానంలో డ్రైవర్ గా పనిచేస్తున్న అప్పారావు బస్సుని ముందుకు అలవోకగా నడిపిస్తున్నాడు. తన ప్రమేయం లేకుండానే ముందుకు ఉరుకుతున్న బస్సుని మలుపుల దగ్గర, చాకచక్యంగా తిప్పుతూ ఎదర వస్తున్న వాహనాలను తప్పిస్తూ ముందుకు సాగుతున్నాడు.

బస్సులో ఉన్న భక్తులంతా ఆహ్లాదంగా... ఆనందంగా కేరింతలు కొడుతూ, ఎవరి బాతాఖానీలో వాళ్ళున్నారు. ఫుట్ బోర్డు మీద నిలబడ్డ బూరల తాత దగ్గర కొందరు పిల్లలు బూరలు, కాగితం ఫేన్లు, అట్టతో చేసిన డమరుకం లాంటి ఆట వస్తువులు కొనమని తల్లిదండ్రుల్ని వేధిస్తున్నారు. పిల్లలు అలా ఏడుస్తుంటే బూరల తాత సంబరంగా వాళ్ళకేసి చూస్తూ బొమ్మలతో ఊరిస్తున్నాడు. నోట్లో బూరపెట్టుకుని ఊదుతున్నాడు. అది విని పిల్లలు మరింతగా అల్లరి చేస్తున్నారు.

రెండు చక్రాల వాహనం మీద ప్రయాణం చేస్తున్న వాళ్ళు కొండ దిగేటప్పుడు ఇంజన్ ఆపేసి, పెట్రోల్ కట్టేసి 'న్యూట్రల్' లోనే బైక్ లను ముందుకు పరిగెట్టిస్తున్నారు. వారి ప్రమేయం లేకుండానే టూ వీలర్స్, ముందున్న భారీ వాహనాలను సైతం దాటుకుంటూ పరుగులెడుతున్నాయి.

నాలుగు చక్రాల వాహనాలకు ఆ సౌకర్యం లేదు. ఇంజన్ ఆపితే 'ఎయిర్ బ్రేకులు' పని చెయ్యవు. ఒకవేళ ప్రమాదవశాత్తూ ఇంజన్ ఆగిపోతే అంతే సంగతులు. బ్రేకులు ఫెయిలయి వాహనం ఏ లోయలోనో పడిపోతుంది.

అందుకే బస్సులు, కార్లు నడిపే డ్రైవర్లు ఇంజన్ ఆన్ లోనే టాప్ గేర్లో వాహనాలను ముందుకు నడిపిస్తుంటారు. గతంలో ఇలాగే కొండపైన ఉన్న మరో ఘాట్ రోడ్డు నిర్మాణాలలో పనిచేస్తున్న కూలీలు లారీ ఎక్కి క్రిందకు దిగుతున్నప్పుడు 'లారీ' ఇంజన్ హఠాత్తుగా ఆగిపోయి బ్రేకులు పట్టక

ప్రక్కనున్న లోయలో పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలు, లారీ డ్రైవర్ తో సహా అందరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ సంఘటన ఇప్పటికీ మరువురాని దుర్ఘటనే.

అప్పట్నుండీ లారీలను కొండపైకి అనుమతించడం మానేశారు. లారీలే కాదు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రైవేటు బస్సులు కూడా కొండపైకి నేరుగా రావడానికి వీల్లేదు. కొండ దిగువనే ఆగిపోవాలి. భక్తులంతా దేవస్థానం బస్సుల్లోనే కొండపైకి చేరుకోవాలి. సుశిక్షితులైన దేవస్థానం డ్రైవర్లు నిరంతరం ఘాట్ రోడ్డులో బస్సులు నడుపుతూండడం వలన ప్రమాదాలకు ఆస్కారం లేదని అధికారుల ఆలోచన... ప్రగాఢ నమ్మకం.

డ్రైవర్ అప్పారావు బస్సుని టాప్ గేర్ లో చాలా చాకచక్యంగా ముందుకు నడిపిస్తున్నాడు. బుగ్గనున్న జర్దాకిళ్లీ నములుతూ మధ్య మధ్య హారన్ కొడుతూ ఎదర వస్తున్న వాహనాలను దూరం నుండి గమనిస్తూ ముందుకు సాగుతున్నాడు. బస్సులో ఉన్న యాత్రీకులైన ప్రయాణీకులంతా కొండపైనుండి కొండ దిగువకి విమానంలా దూసుకుపోతున్న బస్సు వేగాన్ని కూడా పట్టించుకోవటం లేదు.

హఠాత్తుగా ఎదర రెండు కార్లు ఒకదానితో ఒకటి పోటీపడుతూ ఘాట్ రోడ్డంతా ఆక్రమించి ముందుకు పరిగెడుతూ వస్తున్నాయి. ఒక కారు వేగంగా వస్తుంటే దాన్ని దాటేయాలని రెండో కారు దాన్ని దాటి ముందుకు వస్తోంది. అలా ఒకదాన్ని ఒకటి పోటీపడి రేసుగుర్రాల్లా దూసుకు వస్తున్నాయి.

దూరం నుండి వాటి పోటా పోటీ 'పరుగుల పందెం' గమనించిన అప్పారావు గతుక్కుమన్నాడు. తారాజువ్వలా ముందుకు దూసుకుపోతున్న బస్సుని కొంచెం స్లో చెయ్యకపోతే ఆ రెండు కార్లని గుద్దుకుని పెద్ద ప్రమాదం జరగవచ్చని గ్రహించాడు. గబుక్కున బ్రేకు మీద కాలేసి గట్టిగా నొక్కాడు. బ్రేకు మీద వేసిన కాలు మెత్తగా జారిపోయింది. అంతే! డ్రైవర్ అప్పారావు గుండె జారిపోయింది.




గాల్లో వదిలిన తుపాకీగుండులా దూసుకుపోతున్న బస్సుని కంట్‌రోల్ చేద్దామని బ్‌రేకు మీద కాలేసి గట్టిగా నొక్కిన డ్‌రైవర్ అప్పారావు ఒక్కసారి అదిరిపడ్డాడు.

బస్సు బ్‌రేకులు పట్టడం లేదు. బస్సు స్పీడు తగ్గడం లేదు. ఎదురున్న రెండు కార్లు 'పూనకం'తో

వూగిపోతూ ఒకదాన్ని ఒకటి తోసుకుంటూ ముందుకు వచ్చేస్తున్నాయి.

డ్రైవర్ అప్పారావు శరీరమంతా ముచ్చెమటలు పోసాయి.

కొండమీద దేవుడి దర్శనం అయిపోగానే హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు ఏకాంబరం. రెండు రోజుల్నుండీ 'సింహాచలం దర్శనానికి వస్తున్నాము. మీరే దగ్గరుండి దర్శనం చేయించాలని' ఆఫీస్ మేనేజర్ గారి నుండి ఒకటే ఫోన్ కాల్స్. అందుకే ఉదయాన్నే దగ్గరుండి వాళ్ళకి సింహాద్రి అప్పన్న ఆశీస్సులు అందించి బస్సు ఎక్కించి పంపించేశాడు.

మేనేజర్ గారు రాలేదు. వాళ్ళ బంధువుల్నే పంపించారు. ఏకాంబరం అరగంట ముందే తన బైక్ మీద కొండ మీదకు వచ్చి వారికోసం ఎదురుచూస్తూ బస్సు స్టాండ్ లో కూర్చున్నాడు. వాళ్ళు ఎలా ఉంటారో తెలీదు.

వాళ్ళ ముక్కూ మొహం తెలియకపోయినా 'సెల్ ఫోన్ ల వలన ఒకర్నొకరు కలుసుకోగలిగారు. 'ఇప్పుడు ప్రపంచమంతా చిటికెలో తిరిగొచ్చెయ్యచ్చు' అన్నంత విజ్ఞానం పెరిగిపోవడం వలన ఎవరికి ఎవరూ కొత్తకాదు. ఎవరికి ఎవరు ముందుగా పరిచయాలు అక్కరలేకుండా అంతా ఫోన్ లో కలిసిపోతున్నారు. కలుసుకుంటున్నారు. పాత పరిచయస్థుల్లా వాటేసుకుంటున్నారు.

స్కూటర్ స్టాండ్ కి వెళ్ళి తన పల్సర్ బైక్ తీసుకున్నాడు ఏకాంబరం. బైక్ వెనకే తగిలించి వున్న హెల్మెట్ తీసి తలకు తగిలించుకున్నాడు.

బైక్ స్టార్ట్ చేసి ఒకసారి బైక్ సైడ్ మిర్రర్ లో తనకి తాను ఎగాదిగా చూసుకున్నాడు. హెల్మెట్ ధరించి అచ్చం యాక్షన్ హీరోలా కనిపిస్తున్నాడు.

తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకొని మురిసిపోయాడు ఏకాంబరం. బైక్ ని ముందుకురికిస్తూ రోడ్డు మీద నడిచి వెళ్తున్న భక్తుల కేసి చూసాడు. భక్తులంతా కుటుంబాలతో పిల్లాపాపలతో అడ్డదిడ్డంగా రోడ్డు ప్రక్కన నడుస్తున్నారు. వాళ్ళ ప్రక్కనుండి బైక్ నడుపుతూ వయసులో వున్న అమ్మాయిలకోసం 'చకోరి' పక్షిలా వెదికాడు. అందరూ పల్లెటూరి వాళ్ళే. ఎవరు అమ్మలో, ఎవరు అమ్మాయిలో పసిగట్టలేకపోయాడు. బైక్ మాత్రం తన మానాన ముందుకు సాగిపోయింది.

కొండ క్రిందకు వెళ్ళే ఎత్తైన ఘాట్ రోడ్డు దాటి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గరకు చేరుకున్నాడు ఏకాంబరం. కొండ దిగువ నుండి పైకి వస్తున్న కార్లు, బస్సులు, బైకుల్ని తప్పించుకుంటూ ఎత్తైన ఘాట్ రోడ్ మలుపు తిరిగి డౌన్ లో బైక్ ని రివ్వున నడిపిస్తున్నాడు ఏకాంబరం. అప్పటికే బైక్ ఇంజన్ ఆఫేసి పెట్రోలు కూడా కట్టేశాడు. కొండ పైకి ఎక్కినప్పుడు మంచి రేజింగ్ లో బైక్ నడపాలి. దిగేటప్పుడు బైక్

మీద కూర్చుని కళ్ళు మూసుకుంటే అదే క్రిందకు తీసుకుపోతుంది అని మనసులోనే అనుకుని ఉలిక్కిపడ్డాడు ఏకాంబరం. కళ్ళు మూసుకుంటే మరిక మళ్ళీ కళ్ళు తెరవకుండా అయిపోతుందేమో కదా అని గజగజ వణికిపోయాడు. ఆ ఊహకే ఏకాంబరం భయంతో బిగుసుకుపోయాడు.

ఆ ఆలోచన కలగడంతోనే బైక్ స్టీరింగ్ రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుని కళ్ళు రెండు బయటకు పొడుచుకు వచ్చేలా రోడ్డునే తీక్షణంగా చూస్తూ ముందుకు ఉరికించాడు.

ఎదర వాహనాలు వేగంగా ఎదురొస్తుంటే వాటిని చూస్తూ తప్పిస్తూ ముందుకు సాగిపోతున్నాడు ఏకాంబరం.

కొంచెం దూరంలో కొండ బస్సు ముందుకు దూసుకుపోతోంది. ముందు వెళుతున్న బస్సు దాటి వెళ్ళాలన్న ఉద్దేశంతో కట్టేసిన పెట్రోల్ ఆన్ చేసాడు ఏకాంబరం. ఇంజన్ లాక్ కూడా ఆన్ లో పెట్టాడు.

ముందు వెళుతున్న కొండ బస్సును అందుకోవడం ఏకాంబరం తరం కావటంలేదు. 'న్యూట్రల్' ఉన్న బండి అంతకంటే వేగం అందుకోలేకపోతోంది.

ఏకాంబరం బైక్ ని పరిగెడుతుండగానే గేర్ లోనే స్టార్ట్ చేసాడు. స్టార్ట్ కాగానే ఒక్కసారే స్పీడ్ పెంచుతూ రేజ్ చేసాడు. ముందు పరిగెడుతున్న కొండ బస్సుకి చేరువవుతోంది ఏకాంబరం బైక్. ఎదురవుతున్న వాహనాలను తప్పించుకుంటూ కొండ బస్సుని అందుకోవడానికి బైక్ ని వంద కిలోమీటర్లు స్పీడ్ దాటించి పరిగెట్టిస్తున్నాడు ఏకాంబరం.

పోటాపోటీగా పరిగెట్టుకు వస్తున్న రెండు కార్లను ఎలా తప్పించాలో అర్ధం కాక ఆందోళనగా ఉన్నాడు డ్రైవర్ అప్పారావు. బస్సు వేగాన్ని తగ్గిద్దామంటే 'బ్రేకులు' పట్టటం లేదు. బస్సులో తెలిస్తే పాసింజర్లంతా భయంతో బస్సులోనుండి దూకేస్తారేమో! ఏం చేయాలో అర్ధంకాక అయోమయంగా... ఆందోళనగా... స్టీరింగ్ పట్టుకున్నాడు డ్రైవర్ అప్పారావు. బస్సులో ఉన్న పాసింజర్లు కూడా భయంతో బిగుసుకుపోయి చూస్తుండిపోయారు.

తనతో పోటీ పడుతున్న కారుని ఓడించాలన్న పట్టుదలతో కారు నడుపుతున్న ఒక డ్రైవర్ ఎదర రాకాసిలా మీదకు దూకుడుగా వస్తున్న దేవస్థానం బస్సు వాలకం గమనిస్తూనే గజగజ వణికిపోయాడు. ఆ బస్సు ముందర ఎంతో వేగంగా... పోటీ పడుతూ వస్తున్న బస్సును చూస్తూనే చటుక్కున బ్రేకు మీద కాలేసాడు ఆ కారు డ్రైవర్. రెండో కారు ముందుకు వెళ్ళగానే గభాలున దాని వెనకకు తగ్గి ఒక వారగా కారు వెనక కారును పోనిచ్చాడు ఆ డ్రైవర్.

హఠాత్తుగా కారు డ్రైవర్లు ఇద్దరూ ఒకరి వెనక ఒకరు క్యూలో వస్తూ బస్సుకు దారిచ్చేసరికి ఆనందంతో జాగ్రత్తగా వాటిని తప్పించుకుని ముందుకు పోనిచ్చాడు డ్రైవర్ అప్పారావు.

ఇదంతా గమనిస్తున్న బస్సులోని పాసింజర్లు ఒక్కసారే ఊపిరి పీల్చుకుని పెద్ద పెను ప్రమాదం తప్పిందని అరుచుకుంటూ డ్రైవర్ ని నానా దుర్భాషలూ ఆడారు. అంతవరకూ వాళ్ళకి బస్సుకి బ్రేకులు పట్టడం లేదని తెలీదు.

"ఏరా కళ్ళు మూసుకుపోయి బస్సు నడుపుతున్నావా?! ఎదర కార్లు వస్తూంటే వేగం తగ్గించలేవా?" అంటూ ఒక ముసలాడు గుండె చేత పట్టి కోపంగా అరిచాడు. క్షణంలో పెనుప్రమాదం తప్పింది. లేకపోతే ఏం జరిగేదో?!

భయంతో వణికిపోతూ ముసలాయన కోపంగా డ్రైవర్ ని తిట్టేసరికి మిగతావాళ్లు కూడా తలో మాట అంటూ తమ ఆందోళనని బయట పెట్టారు.

వాళ్ళందరి నోట తిట్ల వర్షం కురిసేసరికి డ్రైవర్ అప్పారావుకి చిర్రెత్తుకొచ్చింది. అంతే!

"బస్సుకి బ్రేకులు పట్టక ఇవతల నేను చస్తుంటే మీ అందరి గోల ఏటి?! ఎవరూ అరవకుండా... భయపడకుండా జాగ్రత్తగా ఉండండి. అందరూ ఎక్కడి వాళ్లక్కడే మీ ఎదర రాడ్లను గట్టిగా పట్టుకోండి! ఎవరికీ ఏమీ కాదు. అంతా సింహాద్రి అప్పన స్వామే చూసుకుంటాడు" అంటూ అరుస్తూనే బస్సుని చాలా చాకచక్యంగా నడిపిస్తున్నాడు డ్రైవర్ అప్పారావు. అతను అలా అరిచేసరికి అందరూ ఒక్కసారే భయంతో బిక్కచచ్చిపోయారు.

కొండ బస్సు విచక్షణా రహితంగా వేగంగా మీదమీదకు దూసుకువస్తుంటే ఎదర బైకుల మీద వస్తున్న భక్తులు రోడ్డు ప్రక్కనున్న తుప్పల్లోకి వెళ్ళి బైకులను ఆపేస్తున్నారు. కొందరు తుప్పల్లోనుండి పెద్దపెద్ద గుబురు పొదల్లోకి వెళ్ళి పడిపోతున్నారు.

బస్సులో వున్న యాత్రీకులంతా "గోవిందా! గోవిందా! అంటూ సింహాద్రి అప్పన్నని వేడుకొంటూ అరుస్తున్నారు.

బస్సు వెనుక వేగంగా బస్సుని దాటాలని వస్తున్న ఏకాంబరం దేవస్థానం బస్సులోనుండి భక్తులు అరుస్తున్న అరుపులు విని క్షణం ఆశ్చర్యపోయాడు. మరుక్షణం బైకు వేగం తగ్గించి బస్సు వెనకే తన బైకుని నడిపిస్తూ ఫాలో అయ్యాడు. ఏదో జరగరానిది జరిగిందని గ్రహించాడు ఏకాంబరం. బస్సులో యాత్రీకులు ఏడుపులు పెడబొబ్బలు వింటూనే ఏదో 'ప్రమాదం' జరగబోతోందని ఊహించాడు ఏకాంబరం.

కొండ ఘాట్ రోడ్ లో ఎదర వాహనాలను చాకచక్యంగా తప్పిస్తూనే బస్సుని ఎలా అదుపు చేయాలో అని ఆలోచిస్తున్నాడు డ్రైవర్ అప్పారావు. ఒక వైపు అంతా లోయ. రెండో వైపు కొండ చరియ. ఎలాగైనా ఎడమ చేతివైపు ఉన్న కొండ చరియల్లో ప్రమాదం లేనిచోట బస్సుని ఆపే ప్రయత్నం చేయాలని చూస్తున్నాడు డ్రైవర్ అప్పారావు.

బస్సులో ఉన్న భక్తులు భయంతో కేకలు వేస్తున్నారే గాని, ఎవరికీ తాము ప్రాణాలతో బయట పడతామని నమ్మకం లేదు. కొందరు తమదగ్గరున్న సెల్ ఫోన్ లు తీసి తమ వాళ్ళకి ఫోన్ లు చేస్తున్నారు. తాము బ్రేకులు లేని బస్సులో కొండ దిగుతున్నామని ఏం జరుగుతుందో ఆందోళనగా ఉందని ఏడుస్తూనే చెప్తున్నారు.

ఈ వార్త దావానలంలా క్రింద ఊర్లోకి చేరిపోయింది. దేవాలయ అధికారులంతా గుండెలు అరచేత్తో పట్టుకుని కొండ దిగుతున్న బస్సు కోసం బస్సు స్టాండుకొచ్చి ఎదురు చూస్తున్నారు. హుటాహుటిన అంబులెన్స్ కి ఫోన్ చేసేసారు.

అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఈ వార్త పత్రికల వాళ్ళకు కూడా చేరిపోయింది.

బస్సులో ఉన్న ముసలివాళ్ళు ఆందోళనతో అలాగే సీటుకి చేరగిలబడి సొమ్మసిల్లిపోయారు. యువకులు కూడా భయంతో బిగుసుకుపోయి నిలబడ్డారు. బస్సులోనుండి గెంతినా ఎవరూ బ్రతికి బట్ట కట్టరని ఆ ప్రయత్నం చేయలేదెవరూ. ఫుట్ బోర్డు మీద ఉన్న ప్రయాణీకులు బస్సు లోపలకు చేరేందుకు తోసుకుని నిలబడ్డారు.

ఏకాంబరం ఎదర బస్సునే అనుసరిస్తున్నాడు. అతనికీ భయంగానే ఉంది. 'పాపం! మేనేజర్ గారి బంధువుల్ని ఈ బస్సులోనే ఎక్కించాడు తను. వాళ్ళెంత ఆందోళనలో ఉన్నారో?' మనసులోనే అనుకుంటూ బస్సు ఏ దిశగా వెళ్తుందా అని దాన్నే అనుసరిస్తున్నాడు ఏకాంబరం.

బస్సులో అందరూ వూపిరి బిగబట్టి డ్రైవర్ అప్పారావు కేసి చూస్తున్నారు. అతని చేతిలోనే ఉన్నాయి అందరి ప్రాణాలు... జీవితాలు... బిక్కుబిక్కుమంటూ ఎదర రోడ్డుకేసి... ఎదర వస్తున్న వాహనాల కేసి, దీనంగా డ్రైవర్ కేసి చూపులు మార్చి మార్చి చూస్తున్నారు.

బ్రేకులు ఫెయిల్ అయి కంట్రోల్ తప్పి పిచ్చి పిచ్చిగా రెచ్చిపోయి మీదమీదకు పరిగెట్టుకు వస్తున్న దేవస్థానం బస్సు కేసి చూసి అంతవరకూ కొండపైకి దర్జాగా బైకు డ్రైవ్ చేసుకువస్తున్న వాళ్ళు భయంతో తలో దిక్కు తుప్పల్లోకి బైక్ తో సహా తప్పుకుంటుంటే బస్సులో ఉన్న ప్రయాణీకులు ఆ దృశ్యం చూసి పుసుక్కున నవ్వుకుంటున్నారు. మళ్ళీ, తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని చటుక్కున

ఏడుపు లంకించుకుంటున్నారు.

రెండో బ్రిడ్జి మలుపు తిరుగుతూనే పెద్ద లోయ. ఆ లోయలో విశాలంగా ఉన్న ప్రాంతంలో ప్రభుత్వ గురుకుల పాఠశాల కనిపించింది అప్పారావుకి. బస్సు అటు వెళ్ళాల్సింది చటుక్కున ఎడమ చేతివైపు స్టీరింగ్ వీలు తిప్పాడు. పెద్ద ప్రమాదం తప్పిందని మనసులోనే అనుకున్నాడు. బస్సు లోపల వాళ్ళు కూడా చూస్తూనే ఉన్నారు.

ఆ మలుపు దాటి ముందుకు పరుగు తీస్తున్న బస్సుకు ఎదురుగా ఎడమచేతి ప్రక్క చిన్న చిన్న గోతులు ఆ ప్రక్కనే పెద్ద చెట్టు కనిపించేసరికి డ్రైవర్ అప్పారావు మరో ఆలోచన చెయ్యకుండా బస్సుని ఆ గోతుల్లోనుండి నడిపించాడు. బస్సు ఒక్కసారే గెంతుకుంటూ వెళ్ళేసరికి లోపల వున్న భక్తులంతా ఒకరిమీద ఒకరు ఒరిగిపోయి గుద్దుకుంటూ ఒకర్నొకరు పట్టుకున్నారు.

గోతుల్లోనుండి గెంతుకుంటూ వెళ్ళిన బస్సు వేగం తగ్గి నేరుగా ఎదుర వున్న పెద్ద చెట్టును గుద్దుకుంటూ ఆగిపోయింది. బస్సు ముందే గోతుల్లో పడి అటూ ఇటూ వూగడం వలన భక్తులంతా తమ ముందరున్న రాడ్లు గట్టిగా పట్టుకోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. కొందరికి చిన్న చిన్న గాయాలయ్యాయి. కొందరికి తలలు బొప్పులు కట్టాయి. బస్సు వెనకే వస్తున్న ఏకాంబరం ఆతృతగా తన బైక్ ని అక్కడికక్కడే పడేసి ఆతృతగా చెట్టును గుద్దుకుని ఆగిన బస్సు దగ్గరకు పరుగందుకున్నాడు.

అప్పటికే బస్సులో ఉన్నవాళ్ళంతా ప్రాణాపాయం నుండి బయటపడిన ఆనందంలో ఆతృతతో తలుపులు తెరుచుకుని గాయాలని లెక్క చేయకుండా ఒకర్నొకరు తోసుకుంటూ బస్సు దిగుతున్నారు. ఎవరికీ అంతగా ప్రమాదకరమైన దెబ్బలు తగల్లేదు. కొందరికి తలకి చిన్న చిన్న గాయాలు అయితే కారుతున్న రక్తాన్ని చేత్తో అదిమిపట్టి ఏడుపు ఆపుకుంటూ బస్సు దిగుతున్నారు.

ఏకాంబరం బస్సు దిగుతున్న వాళ్ళని తోసుకుంటూ బస్సు లోపలకు వెళ్ళాడు. అప్పటికే ఏకాంబరం బస్సు ఎక్కించిన వాళ్ళు బస్సు దిగుతూ ఏకాంబరాన్ని పలకరించి తమకి ఎలాంటి గాయాలు కాలేదని చెప్పి వడివడిగా వెళ్ళిపోయారు.

ఏకాంబరం మాత్రం మేనేజర్ తాలూకా వాళ్ళని పలకరించి పలకరించకుండానే ఇంకా ఎవరికైనా 'ప్రమాదం' జరిగిందేమోనని లోపలకు వెళ్ళి బస్సంతా పరిశీలనగా చూసాడు.

అందరూ బస్సు దిగడానికి గాభరాగా ఒకర్నొకరు నెట్టుకుంటున్నారు. డ్రైవర్ అప్పారావు తలకి బస్సు అద్దాలు తగిలి గాయం అయింది. రక్తం కారుతున్నా లెక్కచెయ్యకుండా బస్సులో ఉన్న భక్తులందర్నీ జాగ్రత్తగా దిగమని... ఎవరూ గాబరా పడకండని... ఒకర్నొకరు త్రోసుకుంటే పడిపోతారని హెచ్చరిస్తూ బస్సులోనే ఉండి అందర్నీ బస్సు దింపుతున్నాడు.

ముందు సీట్లో కూర్చున్న ఎవరో నడివయసు వ్యక్తి సీట్లోనే సొమ్మసిల్లి పడి ఉన్నాడు. ఆయనని అలా చూస్తూనే ఏకాంబరం పరుగున ఆయన దగ్గరకు వెళ్ళి ఆయన్ని అమాంతం తమ భుజాల మీద వేసుకుని బస్సులోనుండి క్రిందకు మోసుకు వచ్చాడు. ఆ వ్యక్తితో వచ్చిన ఆడవాళ్ళు ఏకాంబరం వెనకే ఏడ్చుకుంటూ బస్సు దిగారు.

అప్పటికే 'బస్సు ప్రమాదవార్త' తెలిసి దేవాలయం అధికారులు, విలేఖర్లు, పోలీసులు వచ్చి చేరుకున్నారు. ఆ వెనకే అంబులెన్స్ లు కూడా వచ్చి చేరాయి. చిన్న చిన్న గాయాలైన వారిని స్థానిక ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు. స్పృహ కోల్పోయిన వ్యక్తిని ఏకాంబరమే నేరుగా అంబులెన్స్ లోకి చేర్చాడు. అంబులెన్స్ లో ఆ వ్యక్తితో పాటు వాళ్ళ బంధువు ఒకరు, ఏకాంబరం కూడా ఎక్కి కూర్చున్నారు.

అంబులెన్స్ ఎక్కుతూ తన మిత్రుడొకడు కనిపించేసరికి అతనికి తన బైక్ తాళాలు ఇచ్చి బైక్ ని ఇంటి దగ్గరకు చేర్చమని చెప్పాడు ఏకాంబరం.


టి.వి. ఛానళ్ళు వాళ్ళు కూడా బస్సు ప్రమాదవార్తని, బస్సుని సురక్షితంగా కొండ దిగువకు చేర్చిన డ్రైవర్ అప్పారావుని ఇంటర్వ్యూ చేస్తూ హడావిడి చేస్తున్నారు. కొందరు టి.వి రిపోర్టర్లు బస్సులో ప్రయాణించని వాళ్ళని కూడా ఇంటర్వ్యూ చేస్తూ ప్రశ్నలు అడిగేసరికి అవతల వాళ్ళు టి.వి లో కనిపించాలని ఆనందంలో తామూ బస్సులోనే ఉన్నామని లేనిపోని సొల్లు విషయాలు చెప్తూ కెమెరాలకు ఫోజులిస్తున్నారు.

ఇంతమందికి ఎలాంటి ప్రమాదం జరక్కుండా రక్షించిన సింహాద్రి అప్పన్నకు దండం పెట్టుకుంటూ కళ్ళ నీళ్ళు దించుకున్నాడు డ్రైవర్ అప్పారావు. తలకి గాయమై రక్తం కారుతున్నా 'వార్త' కోసం అతన్ని యక్ష ప్రశ్నలతో వేధిస్తూ ఎటూ కదలకుండా కెమేరాలతో దిగ్బంధనం చేసేసారు విలేఖర్లు.

***

విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్.

సింహాచలం కొండ బస్సు ప్రమాదంలో స్పృహ కోల్పోయిన వ్యక్తిని నేరుగా తీసుకువచ్చి కె.జి. హెచ్ లో జాయిన్ చేసారు. దేవుడి దర్శనానికి వెళ్లి బస్సు ప్రమాదంలో గాయపడ్డ హాస్పిటల్ లో ఉన్నతని బంధువులందరికీ విషయం చేరిపోయింది. బంధువులంతా అతన్ని చూడ్డానికి హాస్పిటల్ కి వచ్చారు.




అయితే, బస్సు ప్రమాదం కంటే ప్రమాదం జరుగుతుందనే భయంతో అతను గుండె ఆగి మరణించాడని డాక్టర్లు ధృవీకరించారు. అంబులెన్స్ లో హాస్పిటల్ కి చేరేసరికే అతడు మరణించాడని చెప్పారు.

మరణించినతని భార్యాపిల్లలతో పాటు దగ్గర బంధువులందరూ హాస్పిటల్ కి వచ్చి కన్నీరు మున్నీరయ్యారు. వాళ్ళతోటే ఉన్న ఏకాంబరం కూడా కళ్ళల్లో నీళ్ళు దించుకున్నాడు. ఏడుపు రాకపోయినా మరణించినతని బంధువులు కోసమన్నా ఏడవక తప్పదన్నట్టు విచారంగా మొహం పెట్టి తల దించుకుని నిలబడ్డాడు ఏకాంబరం.

చనిపోయినతని బంధువుల్లో హాస్పిటల్ కి వచ్చిన వాళ్ళల్లో యవ్వనంతో మిలమిలా మెరిసిపోతూ ఒక అమ్మాయి ఏకాంబరం కళ్ళల్లో పడింది. ఆమెని చూస్తూనే శరీరం విదిల్చుకుని కొంచెం హీరోలా ఫోజు కొడుతూ హడావిడి చేయబోయాడు ఏకాంబరం.

"ఏడవకండమ్మా! ఎవరైనా... ఎప్పుడైనా చావాల్సిందే కదా! పుణ్యాత్ముడు దేవుడ్ని చూడ్డానికి వెళ్ళి శాశ్వతంగా ఆ దేవుడి దగ్గరికే వెళ్ళిపోయాడు. దీనికి ఏడుస్తారెందుకు?!" అన్నాడు పెద్దమనిషిలా ఫోజు కొడుతూ.

ఏకాంబరం అలా అనేసరికి చనిపోయినతని భార్య, పిల్లలు ఏకాంబరం కేసి గుర్రుగా చూసి కోపంగా మొహం తిప్పుకున్నారు. వాళ్ళలా కోపగించుకునేసరికి 'ఏకాంబరం' తన తప్పు తెలుసుకుని భిన్నుడైపోయాడు.

శవాన్ని అంబులెన్స్ లో వాళ్ళింటికి తీసుకు వెళుతున్నప్పుడు కూడా ఏకాంబరం శవంతో పాటే వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. కంచరపాలెంలో గల వాళ్ళింటికి వెళ్ళి దహన సంస్కారాలు అయ్యేంతవరకూ అక్కడే ఉన్నాడు.

అక్కడ ఉన్నంత సేపూ అందరూ విచారంతో ఏడుస్తూంటే ఏకాంబరం మాత్రం ఆ అమ్మాయినే చూస్తూ గడిపేశాడు. ఎవరూ తనని గమనించకుండా దొంగ చూపులు చూస్తూ ఓ మూల నిలబడేవాడు.

ఎర్రగా బుర్రగా ఎంతో అందంగా ఉన్న ఆ అమ్మాయి ఒడ్డూ పొడుగూ ఏకాంబరానికి బాగా నచ్చేశాయి. తనలాగే రివటలాగ సన్నగా ఉన్న ఆ అమ్మాయి శరీరాకృతిని కళ్ళతోనే కొలతలు వేస్తూ కళ్ళతోనే ఆమెని అన్ని భంగిమల్లో ఫోటోలు తీసి మనసులో భద్రపరుచుకున్నాడు.

ఆ అమ్మాయి పదే పదే ఏడుస్తూ ముక్కు చీదుకుంటున్న దృశ్యాలు కళ్ళల్లో కదలాడేసరికి చిరాగ్గా కళ్ళు మూసుకుని అందమైన ఆమె రూపలావణ్యాన్ని గుర్తు చేసుకుంటూ చిరాకు కలిగించే దృశ్యాలను కళ్ళల్లోనుండి చెరిపెయ్యాలని ప్రయత్నించాడు ఏకాంబరం. అయినా, ఆ దృశ్యాలే ఏకాంబరాన్ని కలవరపెడుతున్నాయి.

ఆ అమ్మాయి చనిపోయినతని మేనకోడలు. గోపాలపట్నంలో ఉన్న చంద్రనగర్ లో ఈ మధ్యే అద్దెకు దిగారు. చనిపోయినతనికి ఇద్దరు కొడుకులు. ఒక కూతురు. కొడుకులిద్దరూ పెళ్ళిళ్ళయి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కూతురికి ఇంకా పెళ్ళికాలేదు.

శవాన్ని పాడె మీద మోసుకు వెళ్తున్నప్పుడు ఆ అమ్మాయి కళ్ళల్లో పడాలని తనూ ఓ మూల పాడె భుజాన మోస్తూ శ్మశాన వాటిక వరకూ వెళ్ళాడు ఏకాంబరం.

ఆ తర్వాత -

దశదిన కర్మకి కూడా వాళ్ళెవరూ పిలవకపోయినా పదో రోజు గుర్తు పెట్టుకుని టిప్ టాప్ గా తయారయి బైక్ మీద వెళ్ళాడు ఏకాంబరం.

బంధువులతోనూ, స్నేహితులతోనూ ఆ రోజు అక్కడ అంతా హడావిడిగా ఉంది. ఏకాంబరం ఉదయం పదో గంటకే వెళ్ళి ఆ ఇంటి ముందున్న టెంట్ లో కూర్చున్నాడు. ఎక్కడెక్కడి నుండో వచ్చిన బంధువులు కూడా ఆ టెంట్ లో కూర్చున్నారు.

ఆ ఇంటిల్లిపాది ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. ఏకాంబరం కూడా అలా ఒంటరిగా కూర్చోవడం బావుండదని లేచి వంటలు చేస్తున్న దగ్గరకెళ్ళి వంటవాళ్లకి సూచనలు, సలహాలు ఇస్తూ నిలబడ్డాడు.

అటుగా వెళ్తూ ఒకామె ఏకాంబరాన్ని చూసి టక్కున ఆగిపోయింది.

"ఓయ్ వంటాయన! నువ్వేనా ఈ వంటల కాంట్రాక్టర్ వి. ఉదయం ఆ టిఫిన్ లు ఏంటి అలా తగలడ్డాయి. ఎవరైనా తినడానికే చేసారా?" అంటూ చిర్రుబుర్రులాడింది.

ఏకాంబరానికి నోట మాట రాలేదు. అయోమయంగా ఆమెకేసి చూస్తుండిపోయాడు. వంట దగ్గర కూరగాయలు తరుగుతున్న ఆడవాళ్ళు వంట చేస్తున్న మగవాళ్ళు ముసిముసిగా నవ్వుకుంటూ తల దించుకుని ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు.

"నీకేనయ్యా! మతిగాని పోయిందా?! నీ చెవులు గాని పని చెయ్యటం లేదా?" ఏకాంబరం మీదకు వస్తూ చీర చెంగును బొడ్లో దోపుకుంది ఆమె.

"అయ్యో! అత్తా! ఆగు... ఆగు... అతను వంటలు చేసే కాంట్రాక్టర్ కాదు" ఎక్కడినుండో పరిగెత్తుకు వచ్చి చెప్పాడు చనిపోయినతని కొడుకు.

"మరీ?! ఈ గుంటడెవడ్రా! ఎర్రగా బుర్రగా... సూటు బూటు వేసుకుని అచ్చం సినిమాల్లో 'వంటలు' చేసినోడిలా ఉన్నాడు" ఏకాంబరాన్ని ఎగాదిగా చూస్తూ అంది ఆమె.

"అయ్యో! ఛాయాదేవి వదినా! అతను మా అన్నయ్య స్నేహితుడు. అన్నయ్యకి బస్సు ప్రమాదం జరిగిన దగ్గర్నుండి అన్నయ్యతోనే ఉండి చనిపోయాక కూడా దహన సంస్కారాలు అయ్యే వరకూ ఉన్న కుర్రాడితనే" నడి వయసులో ఉన్నావిడ ఇంట్లో నుండి వచ్చి అంది.

"ఇంకెక్కడన్నయ్యే రాజ్యం! ఎప్పుడో ఈ ముదనష్టపు వెధవలందరూ కలిసి కాష్టంలో కలిపేసారు కదే! నిక్షేపంలా ఉన్నోడ్ని పేకాటకని పట్టుకెళ్ళి తాగుబోతుని చేసారు కదే తల్లీ! ఇలాంటి గుంట వెధవలతో సాహసం చేసి ఒళ్ళూ, ఇల్లు గుల్ల చేసుకున్నాడు కదే రాజ్యం?" అంటూ ఏడుస్తూ శాపనార్థాలు పెట్టడం ప్రారంభించింది ఛాయాదేవి.

ఏకాంబరానికి ముచ్చెమటలు పోశాయి. ఏం మాట్లాడాలో తెలియక బిక్క చచ్చిపోయాడు.

"ఛాయ వదినా! అంతా మన ఖర్మ అనుకోవాలి. వీళ్ళందర్నీ తిట్టి ఏం లాభం చెప్పు!" అంటూ ఆమెని బుదిరించింది రాజ్యం.

"అయ్యో! ఆయనెవరో నాకు తెలీదండీ! నేను....." నసుగుతూ అన్నాడు ఏకాంబరం.

"అయ్యో! అయ్యో! మా బావ ఎవరో నీకు తెలీదా? అయితే నువ్వు దొంగతనానికొచ్చావా? అందరం ఆదమరచి ఉంటే... అమ్మో... అమ్మో... చూడవే రాజ్యం! చూడు! ముక్కు మొహం తెలీని వాళ్ళని ఇలా ఇళ్ళల్లోకి రానిస్తారా ఎవరన్నా!" లబోదిబోమంటూ తన మెళ్ళో ఉన్న బంగారాన్ని తడుముకుంటూ పైట చెంగుని ముసుగులా కప్పుకుంది ఛాయాదేవి.

"అవునా అబ్బాయ్! నీకూ మా అన్నయ్యకి పరిచయం లేదా?! మరి, ఇన్నాళ్ళూ... ఇంతలా ఎందుకయ్యా మా అన్నయ్యకి సేవ చేశావ్? మా వదినన్నట్టూ కొంపదీసి దొంగతనానికి ప్లాన్ చెయ్యటం లేదు కదా!" ఆశ్చర్యంగా ఏకాంబరం కేసి చూస్తూ అంది రాజ్యం.

"అదేం కాదండి! మాది సింహాచలమే. ఆపదలో ఎవరికైనా సహాయం చెయ్యడం మానవధర్మం కదండీ!" వినమ్రంగా అన్నాడు ఏకాంబరం.

"సహాయం చెయ్యొచ్చుగాని, ఇలా రోజూ వచ్చి వూడిగం చెయ్యరు కదా బాబు!" చిరాగ్గా అంది రాజ్యం.

"ఊడిగం చెయ్యడం కాదండి. ఇంటి పెద్ద మగ దిక్కి పోయారు కదా! ఎందుకైనా అవసరం పడుతుందేమోనని" వినయంగా అన్నాడు ఏకాంబరం.

"ఏం నాయనా! ఆళ్లింటికి అల్లుడైపోదామనుకుంటున్నావా? ఇంటికి యజమానివై ఆళ్ళ అప్పుల్ని తీర్చేద్దామనుకుంటున్నావా?" ఎకసెక్కంగా అంది ఛాయాదేవి.

"అయ్యో! అలా కాదండి! ఆయన చనిపోయారు కదా! బయట ఆఫీసు పనులు గట్రా ఏమన్నా ఉంటే సహాయం చేద్దామని" అన్నాడు ఏకాంబరం.

"అవునే రాజ్యం! ఇప్పుడంతా బ్రోకర్ల రాజ్యమే కదా! భూములమ్మే బ్రోకర్లున్నారు, అమ్మాయిల్ని అప్పచెప్పే బ్రోకర్లున్నారు. వంటలకి, పెళ్ళిళ్ళకి ఒకటేంటి అన్నింటికీ బ్రోకర్లున్నారు కదా! ఇలా సహాయం చేసి పదో పరకో తీసుకుంటారేమోనే రాజ్యం! అవునా బాబూ!" ఆశ్చర్యంగా అంది ఛాయాదేవి.

"ఛ! ఛ!! నేను అలాంటివాడ్ని కాదండి! కావాలంటే చూడండి! నా దగ్గర ఎన్ని కార్డులున్నాయో!" అంటూ జేబులో ఉన్న పర్సులోనుండి డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డులు తీసి చూపించాడు ఏకాంబరం.

"ఇవేం కార్డులు నాయనా! ఊరందరివీ ఎత్తుకొచ్చినట్టు ఇన్ని కార్డులా!" ఆశ్చర్యంగా బుగ్గ మీద చెయ్యేసుకుంటూ అంది ఛాయాదేవి.

"ఇవన్నీ నావేనండి. నేను సహాయం చేసింది మానవసేవే మాధవసేవ కదండి! అంతే!" అమాయకంగా అన్నాడు ఏకాంబరం.

"అవున్నాయనా! అందరూ అలాగే అంటారు. దొరికితే దొంగలు. దొరక్కపోతే దొరలు" వ్యంగ్యంగా అంది ఛాయాదేవి.

ఏకాంబరానికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు ఏం మాట్లాడాలో అర్ధం కాక మూగబోయాడు.

"అత్తమ్మా! ఆయన్నలా బెదరగొట్టేయకే! పాపం! పదిరోజుల్నుండీ మావయ్య మంచి చెడ్డలన్నీ ఆయనే చూసారు" అంటూ ఎక్కడినుండి వచ్చిందో ఆ అమ్మాయి ఏకాంబరాన్ని అదరగొట్టేస్తున్న 'ఛాయాదేవి'కి నచ్చచెప్పింది. ఇంతలో చనిపోయినతని కొడుకులు, భార్య కూడా అక్కడకు వచ్చారు. అందరూ ఏకాంబరం చేసిన సహాయానికి ధన్యవాదాలు చెప్పారు.

"ఈ రోజుల్లో మీలాంటివాళ్ళెక్కడున్నారు సార్! అందరూ అవకాశం దొరికితే ఏదో ఎత్తుకుపోదామనే వాళ్ళే కదా!" అన్నాడు చనిపోయినతని పెద్ద కొడుకు.

"అలా అనకండి సార్! మనుషులన్నాక మంచివాళ్ళు ఉంటారు. చెడ్డవాళ్ళు ఉంటారు. రాత్రీ పగలు, కష్టం సుఖం, బొమ్మా బొరుసూ, తూర్పు పడమర ఇలా ఒకదానికొకటి వ్యతిరేఖ పదాలున్నట్లే మనుషుల్లోనూ చట్టవ్యతిరేకులుంటారు సార్!" హుందాగా ఒళ్ళు విరుచుకుని అన్నాడు ఏకాంబర్.

"వెల్ డన్ సార్! రెండు ముక్కల్లో ఎన్ని నిజాలు చెప్పారు" అన్నాడు చనిపోయినతని రెండో కొడుకు.

"నీ మేలు ఈ జన్మకి మర్చిపోము బాబూ! మీరెవరో మాకు మీ ముక్కూ మొహం కూడా తెలీదు. అయినా, కష్టాల్లో ఉన్నప్పుడు అడక్కుండానే వచ్చి ఆ సాయిబాబాలా ఆదుకున్నారు" కళ్ళల్లో కన్నీళ్లు దించుకుంటూ అంది చనిపోయినతని భార్య.

"అయ్యో! అత్తమ్మా! ఇది ఆయన వృత్తిధర్మం. ఆయన మదర్ థెరిస్సాలా సమాజ సేవకుడు. మనం లేకపోతే ఆయనకి ఇలా సేవ చేసే అవకాశం, అదృష్టం దొరకదు అత్తయ్యా!" అవునా సార్!" ఏకాంబర్ మొహంలోకి చూస్తూ అంది ఆ అమ్మాయి. అత్తయ్య భుజం మీద చెయ్యి వేసి కళ్ళనీళ్ళు తుడుస్తూ.

"అవునమ్మా! అవును. మీకు అభ్యంతరం లేకపోతే, చనిపోయిన సార్ పేరు మీద ఇన్సూరెన్స్ పాలసీలు గట్రా ఏమైనా ఉంటే చెప్పండి వెంటనే దగ్గరుండి 'డెత్ క్లైమ్'లు పెట్టించి సార్ కి రావలసిన ఇన్స్యూరెన్స్ సొమ్ము చెక్కులు రాయించి తెస్తాను" ఈ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న ఏకాంబర్ ఆమెతో అంటూనే చనిపోయినతని కొడుకుల కేసి చూస్తూ అన్నాడు.

"ఉన్నాయి సార్!... అయినా, ఈ ఆఫీసు గొడవలు మీకెందుకు సార్! ఇప్పటికే ఎంతో సేవ చేసి అలసిపోయారు" అన్నాడు చనిపోయినతని పెద్ద కొడుకు వినయంగా.

"అవును సార్! ఇంకా మీకు శ్రమ ఇవ్వడం భావ్యం కాదు కదా!" అంది ఏకాంబరాన్ని చూస్తూ ఒయ్యారాలుపోతున్న ఆ అమ్మాయి.

ఏకాంబరం కూడా ఆ అమ్మాయిని ఓరకంట చూస్తూ ఒకోసారి తనని తనే మైమరచిపోతున్నాడు.

"అలా అంటారేంటి మేడమ్! నేను కూడా ఇన్స్యూరెన్స్ ఏజెంట్ నే. అందులో సాధకబాదకాలన్నీ తెలిసినవాడ్ని. నా ద్వారా అయితే మీ పనులన్నీ చిటికెలో అయిపోతాయి తెలుసా?" అన్నాడు

ఏకాంబరం.

"అధ్గదీ అలా చెప్పండి! మీకైతే ఇదంతా కొట్టిన పిండే. మీకే అప్పగిస్తాంలెండి. ముందు ఈరోజు కార్యక్రమాలు పూర్తి కానివ్వండి" చనిపోయినతని పెద్దబ్బాయి అంటూనే వంటవాళ్లంతా వంటలు వేగిరం కానివ్వండని చెప్పి డైనింగ్ హాల్ దగ్గరకు పరుగందుకున్నాడు.

"ఒరేయ్ నాయనా నీ పేరు సహాయం కదూ!" నడవలేక ఏకాంబరం చేయూత తీసుకుంటూ అంది ఛాయాదేవి.

"సహాయం కాదండి! ఏకాంబరం. ఇన్స్యూరెన్స్ ఏజెంట్ ఏకాంబరం" ఆనందంగా అన్నాడు ఏకాంబరం. అంటూనే తన జేబులో ఉన్న విజిటింగ్ కార్డు తీసి ఆమె చేతికి ఇవ్వబోయాడు.

"ముసలి ముండని. కళ్ళు కనిపించవు. కాళ్ళు కదలక చస్తున్నదాన్ని నాకెందుకురా ఈకార్డు ముక్కలు" అంటూ ఏకాంబరం చేతిలో విజిటింగ్ కార్డ్ తీసుకుని విసిరెయ్యబోయింది ఛాయాదేవి.

చటుక్కున ఛాయాదేవి చేతిలో ఉన్న ఏకాంబరం విజిటింగ్ కార్డును ఆ అమ్మాయి లాక్కుని చూసింది.

"మీరు ఇన్స్యూరెన్స్ కంపెనీకి చైర్మనా?" ఏకాంబరం విజిటింగ్ కార్డు చూస్తూ ఆశ్చర్యంగా అంది ఆ అమ్మాయి.

"కొంపముంచారు. చైర్మన్ క్లబ్ మెంబర్ని అని రాసానండీ బాబూ! కంపెనీకి చైర్మన్ ఎలా అవుతానండీ?" ఆ అమ్మాయి తెలిసి ఆట పట్టిస్తోందా? తెలీక తప్పుగా అర్థం చేసుకుందా?! ఆ అమ్మాయి కేసి అయోమయంగా చూస్తూ అన్నాడు ఏకాంబరం.

"ఏం చైర్మన్ కాకూడదా? ఎంతమందీ పనీపాటా లేనివాళ్ళు జిల్లా పరిషత్ లకీ, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలకి, మరెన్నో సంస్థలకి చైర్మన్ లు కావటం లేదు?" తనకే అంతా తెలిసినట్టూ అంది ఆ అమ్మాయి.

"అమ్మా! తల్లీ! నేను రాజకీయ నాయకుడ్ని కాదు. ఉద్యోగం సద్యోగం లేక, రాక రాక ఇలా ఇన్స్యూరెన్స్ ఏజెంట్ నయ్యాను. చైర్మన్ క్లబ్ మెంబర్ అంటే వరుసగా మూడేళ్ళు ఇన్స్యూరెన్స్ కంపెనీ వాళ్ళు పెట్టే రూల్స్ ప్రకారం పాలసీలు కట్టిస్తే ఇలా 'చైర్మన్' క్లబ్ లో మెంబర్ గా గుర్తిస్తారు" ఆ అమ్మాయికి బోధపరుస్తూ వినమ్రంగా అన్నాడు ఏకాంబరం.

"చైర్మన్ అంటే అందరి కంటే పెద్దే కదా" అమాయకంగా అంది ఆ అమ్మాయి.

"అవునవును. పాలసీలు ఎక్కువ చేసినవారికి ఇచ్చే పెద్ద గౌరవం. ఇంకేం చెప్పాలి... ఎలా చెప్పాలో తెలీక అన్నాడు ఏకాంబరం.

సరిసరి మీరు బాగా చదువుకున్నారులా ఉంది కదూ?" కళ్ళింత చేసుకుని అడిగింది ఆ అమ్మాయి.

"అవునవును. మా ఊర్లో పదోతరగతి పాసయ్యాక ఇంటర్ చదవడానికి ఎన్నో అవస్థలు పడ్డాను" చాలా గుంభనంగా తనేదో పెద్ద చదువు చదివినట్టూ ఫోజిస్తూ అన్నాడు ఏకాంబరం.

"అదేంటి మీరు ఇంటర్ వరకే చదువుకున్నారా? అదెలా! నేనైతే ఇంటి దగ్గరుండే డిగ్రీ వరకూ చదివేసాను. తెలుసా?" ఆనందంగా ఎగిరి గంతేస్తూ నీ కంటే నేను రెండాకులు ఎక్కువే చదివానన్న గర్వంతో అంది ఆ అమ్మాయి.

"అవునులెండి! అందుకేగా మీకింత తెలివి ఎక్కువైపోయింది. ఇంతకీ మీ పేరు ఏంటో చెప్పనేలేదు" వ్యంగ్యంగా అన్నాడు ఏకాంబరం.

"దాని పేరా బాబూ. నూకరత్నం." ప్రక్కనే ఉన్న ఛాయాదేవి టక్కున అంది.




"నీకెందుకే ముసలీ! ఇంతవరకూ నోరెత్తనిదానివి ఇప్పుడు నా పేరుందుకే చెప్పావు? ఈయనెవరో తెలీదు. ముక్కు మొహం తెలీని పరాయివాళ్ళకి ఇలా ఊరూ, పేరూ చెప్పెయ్యడమేనా?!" పక్కనే కూర్చున్న ఛాయాదేవి మీద విరుచుకుపడింది నూకరత్నం.

"అయ్యయ్యో! మిమ్మల్నెవరూ ఎత్తుకుపోరులెండి నూకరత్నం గారూ! పేరు తెలిస్తే ఏయ్... ఒయ్... ఒరేయ్... ఒసేయ్ అని పిలవక్కర్లేకుండా 'నూకరత్నం' గారూ అని పిలవచ్చని అడిగాను. అంతే" చేతులు రెండు అమ్మలక్కలా ఊపుతూ 'ఆడంగి'లా నటిస్తూ అన్నాడు ఏకాంబరం.

"ఏజెంటు... ఏజెంటులా ఉండాలి. ఏజ్ బార్ అయిన ముసలాడిలా మాట్లాడకండి! నూకరత్నం ఏంటి? నూకరత్నం. కుర్రాడిలా 'రత్నం' అనలేరా? మీ పేరు చూడండి! ఏకాంబర్... ఏం బావుంది?" అంది రుసరుసగా రత్నం.

ఆ అమ్మాయి అలా అనేసరికి ఏకాంబరానికి ఏనుగెక్కినంత సంబరపడిపోయాడు. తనపేరు ఎలా ఉంటే తనకేంటీ?! తనేమైనా ఆమెకి కావలసినవాడా?! పేరు బాగాలేదంది అంటే... తను బాగా... హుందాగా ఉన్నాడనే కదా?! ఆ ఆలోచన మనసులో కలిగేసరికి ఏకాంబర్ ఉబ్బితబ్బిబ్బయిపోయాడు.

"చెప్పండి... చెప్పండి ఎలా ఉంటే బావుంటుంది?" ఆనందంగా అన్నాడు ఏకాంబర్.

"దాని పిచ్చికబుర్లకేం నాయనా. పదండి! పదండి అక్కడ టెంట్ లో భోజనాలు ప్రారంభమయిపోయాయి. మీరిద్దరూ ఇక్కడ ఈ ముసల్దాన్ని ఒదిలేసి సొల్లు కబుర్లు చెప్పుకుంటున్నారు" విసుగ్గా లేస్తూ అంది ఛాయాదేవి.

"ఉండవే ముసలీ! మనిషి సహాయం లేంది లేవలేవు. కూర్చోలేవు ఈ 'అంకుల్' గార్ని తోడు తీసుకువెళ్ళు. దగ్గరుండి తినిపిస్తారు" ముసిముసిగా నవ్వుతూ అక్కడనుండి రివ్వురివ్వున తుర్రుమంది రత్నం.

"పిల్లలో పల్లెటూరి వాసన అమ్మాయకత్వం, చలాకీతనం కొట్టొచ్చినట్టూ కనిపిస్తున్నాయి. అందానికి అందం... అంతకు మించిన పెంకితనం చాలా బాగా నచ్చాయి ఏకాంబరానికి. నగరం వాసన... తెలివి అబ్బితే చురుకుదనానికి వన్నె చేకూరుతుంది! అనుకుంటూ ఛాయాదేవి చెయ్యి పట్టుకు నడిపిస్తూ భోజనాల దగ్గరకు తీసుకువెళ్ళాడు ఏకాంబర్.

ఏకాంబర్ అనుకున్నట్టే దశదినకర్మ అయిన మర్నాడు ఏకాంబరాన్ని పిలిచి తన తండ్రి తాలూకా ఇన్స్యూరెన్స్ పాలసీలన్నీ ఇచ్చాడు చనిపోయినతని పెద్ద కొడుకు. ఆ సమయంలో ఇంటిల్లిపాదీ ఏకాంబరం చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

"మా నాన్నగారికి రావలసిన పాలసీల సొమ్ము అంతా మీరు ఎంత వేగంగా తెప్పిస్తే ఆ వెంటనే నేనూ, మా తమ్ముడూ మా పేర్ల మీద పాలసీ కడతాం. అంతేకాదు. మా అమ్మగారి పేరు మీద మా భార్యల పేరు మీద కూడా ఇన్స్యూరెన్స్ పాలసీలు కడతాం. ఇక మీదే ఆలస్యం" అన్నాడు ఏకాంబర్ భుజాల మీద

చరుస్తూ పెద్ద కొడుకు. దానికి అవునంటూ ఇంటిల్లిపాదీ ఏకాంబరానికి హామీ ఇచ్చారు.

ఆ వారం తిరక్కుండానే చనిపోయినతనికి ఉన్న పాలసీలన్నీ 'డెత్ క్లైమ్' లు పెట్టి ఆగమేఘాల మీద చెక్కులు కూడా దగ్గరుండి రాయించి తీసుకువచ్చి వాళ్ళ చేతుల్లో పెట్టాడు ఏకాంబరం.

ఏకాంబరం ఊహించలేనంతగా వాళ్ళు అందరూ సంబరపడిపోయారు. ఏకాంబరం చేసిన మేలు మరువకుండా ఖరీదయిన బట్టలు తీసి చేతిలో పెట్టి అనుకున్న ట్టే వాళ్ళందరూ 'పాలసీలు' రాయించారు. అంతేకాకుండా వాళ్ళ ఇంటి ప్రక్క వాళ్ళ అడ్రస్ లు, బంధువుల అడ్రస్ లు ఇచ్చి వాళ్ళు కూడా ఇన్స్యూరెన్స్ కడతామన్నారని తప్పకుండా వెళ్ళమని ఏకాంబరానికి చెప్పారు.

ఏకాంబర్ కి పట్టలేనంత ఆనందం కలిగింది. ఆ క్షణం 'సాయిబాబా' ని గుండెల్లో స్మరించుకున్నాడు. అందుకే బాబా అన్నాడనుకున్నాడు. 'నువ్వు నన్ను చూడు. నిన్ను నేను చూస్తాను" అని. ఆయన అన్న జీవన సత్యం ఇదే కదా అనుకుని సంబరపడిపోయాడు ఏకాంబర్. ఆపదలో ఉన్నవారికి ఆశించకుండా సహాయపడితే ఎంత మేలు జరుగుతుందో ఏకాంబరానికి ముందే తెలుసు.

ఆ మధ్యాహ్నం వరకూ వాళ్ళింట్లోనే గడిపి మధ్యాహ్నం భోజనం చేసాక గాని వాళ్ళు వెల్లనివ్వలేదు.

అయితే, అక్కడున్న ప్రతిక్షణం ఏకాంబర్ మనసు, మెదడు అంతా నూకరత్నమే ఆక్రమించేసింది. ఆమె కోసం అనుక్షణం అతని కళ్ళు రెండూ పరితపిస్తూ అన్వేషిస్తూనే ఉండేవి. కానీ, నూకరత్నం కోసం అడగడానికి, ఆరా తియ్యడానికి సంస్కారం అడ్డొచ్చి మౌనంగానే ఉండిపోయాడు ఏకాంబర్.

'నూకరత్నం... ఇప్పుడెక్కడుందో' అనుకుంటూ మనసులోనే ఆమె కోసం పరితపించిపోయాడు ఏకాంబరం.

***

ఓ రోజు -

ఎప్పటిలాగే పాలసీల అన్వేషణకు బయలుదేరాడు ఏకాంబర్. ఉదయం లేస్తూనే ఆ రోజు కలవాల్సిన వాళ్ళ జాబితా తయారు చేసుకుని ఊరు మీదకు బయలుదేరడం అలవాటు. సింహాచలానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపాలపట్నం బయలుదేరాడు ఏకాంబరం.

రాజమండ్రి సిల్క్ హౌస్ యజమాని ఏకాంబరానికి మంచి మిత్రుడు నమ్మకమైన పాలసీదారుడు.

ఎప్పుడు ఏకాంబరం దిగాలుగా ఉన్నా ఒకటో రెండో పాలసీలు రాయించి హుషారు పరుస్తుంటాడు. తను రాయకపోయినా, తన మిత్రులకయినా చెప్పి రాయించి ఏకాంబరాన్ని సంతోషపెడుతూ ఉంటాడు ఆయన.

ఆ బట్టల షాపులో పనిచేస్తున్న పని వాళ్ళందరికీ రాజమండ్రి సిల్క్ హౌస్ యజమానే వాళ్ళ పేర పాలసీలు కట్టి వాళ్ళ జీతాల్లో కొంత, తను కొంత కలిపి పాలసీ మొత్తం చెల్లిస్తుంటాడు. అలాగే, గోపాలపట్నంలో ఉన్న షాపుల వాళ్ళందరిచేత కట్టించాడతను.

ఎవరో కొత్తగా ఆరుగురు అమ్మాయిల్ని ఉద్యోగంలో చేర్చుకున్నానని వారికి ఇన్స్యూరెన్స్ పాలసీలు కట్టాలని రమ్మని పిలిచాడు షాపు యజమాని.

ఉదయాన్నే ఆదరాబాదరాగా బయలుదేరాడు ఏకాంబరం.

తండ్రి పీతాంబరం పిలుస్తున్నా పలక్కుండా బైక్ స్టార్ట్ చేసాడు. మరోప్రక్క నుండి తల్లి కేకవేస్తున్నా పట్టించుకోలేదు. ఏకాంబరం ఏదైనా పనిలో పడితే మరో పని, పిలుపు ఏదీ దరి చేరనివ్వడు.

తమని కూడా పట్టించుకోకుండా పనిలో పడ్డ కొడుకుని చూసి ఆనందపడ్డాడు పీతాంబరం. ఎందుకూ పనికిరాడనుకున్న బడుద్దాయి ఇప్పుడు గడుగ్గాయిగా మారిపోయినందుకు సంబరపడిపోయాడు.

ఉదయం లేస్తూనే స్నానం కూడా చెయ్యకుండా మొహం కడుక్కుని, కనీసం 'టిఫిన్' కూడా తినకుండా... పిలుస్తున్నా వినకుండా పారిపోతున్న చిన్న కొడుకుని చూసి తల్లడిల్లిపోయింది తల్లి మనసు. ఎప్పుడూ అమ్మా ఇది పెట్టు, అమ్మా అది పెట్టు అంటూ వంట గదిలోనే నచ్చాడిన చిన్న కొడుకు ఈ రోజు తిండి ధ్యాసే మర్చిపోయి పారిపోతున్నాడంటే కారణం ఈయనే' అనుకుంటూ కళ్ళనీళ్ళు దించుకుంది పర్వతాలు.

ఏకాంబరం తండ్రి గోపాలపట్నం సెంటర్ లోనే పెద్ద డిపార్ట్ మెంటల్ స్టోర్ నడుపుతున్నాడు. ఒకవేళ ఏకాంబరం కూడా అటువైపు వెళ్తున్న ట్లైతే తనని షాపు దగ్గర దించమని అడుగుదాం అనుకున్నాడు పీతాంబరం. కానీ, ఏకాంబరం ఇదేదీ పట్టించుకోలేదు. పరధ్యానంలో పరుగందుకున్నాడు.

కళ్ళముందు అయిదు పాలసీలు... కమీషన్... ఆలస్యమైతే పోతాయేమోనన్నంత కంగారుగా బయలుదేరాడు. అట్నుంచి అటు మిగతా షాపులన్నీ కవర్ చేసుకురావాలన్నది ఏకాంబరం ఆలోచన.

బైక్ మీద నేరుగా రాజమండ్రి సిల్క్ హౌస్ కి చేరుకున్నాడు ఏకాంబరం. అప్పుడే షాపు షట్టర్లు తెరుస్తున్నారు. షాపు యజమాని బట్టల షాపు లోపల అన్ని మూలలా ఉప్పు జల్లుతూ, సాంబ్రాణి పొగ వేస్తూ దేవుడ్ని ప్రార్థించుకుంటున్నాడు.

ఏకాంబరానికి సిగ్గుగా అనిపించింది. 'లేడికి లేచిందే ప్రయాణం' అన్నట్టూ ఉదయం కళ్ళు నులుముకుంటూనే మొహం కడుక్కుని స్నానం చెయ్యకుండా పరిగెట్టుకు వచ్చేసాడు. ఇంకా ఎవరూ రాలేదు. ఏం చేద్దాం' అనుకుంటూ షాపు బయటే అటూ ఇటూ తచ్చాడుతూ నిలబడ్డాడు ఏకాంబర్.

"రా భయ్యా రా! నీలా ఉండాలయ్యా ఎవరైనా! పనివాళ్ళు వచ్చేవేళ అయ్యింది. నేను ముందుగా వచ్చి పూజా గట్రా చెయ్యాలి కదా!" అన్నాడు యజమాని ఏకాంబరాన్ని లోపలికి పిలుస్తూ.

"లేదన్నా! నీ కార్యక్రమాలు కానివ్వండి. నేను బయటే ఉంటాను' అన్నాడు ఏకాంబరం.

"ఏదన్నా తిన్నావా లేదా భయ్యా?" అడిగాడు షాపు ఓనరు.

"లేదు. లేదు భయ్యా. మీ పని పూర్తయ్యాక తినొచ్చని వచ్చేసా" నెమ్మదిగా చెప్పాడు ఏకాంబర్.

"మా వాళ్ళందరూ వచ్చేసరికి ఇంకో అరగంట పట్టచ్చు. నువ్వెళ్ళి ఈ పక్కనే ఉన్న హొటల్ లో కాస్త నాస్తా చేసిరా భయ్యా!" అన్నాడు ఓనరు.

"అలాగే భయ్యా!" అంటూ మరి మారుమాట్లాడకుండా బట్టల షాపు మెట్లు దిగి దానికి కొద్ది దూరంలోనే ఉన్న అన్నపూర్ణా హొటల్ కి వెళ్ళాడు ఏకాంబర్.

'అమ్మ టిఫిన్ కోసమే పిలిచినట్టుంది. నాన్న కూడా టిఫిన్ చేయకుండా వెళ్తున్నాననే పిలిచి ఉంటాడు. తనే పాలసీలు ఎక్కడ పోతాయేమోనని ఆత్రుతలో వచ్చేసాడు. అయినా, ఎప్పుడూ తనకి నెలకి ఒక్క పాలసీ అయినా ఇప్పించే 'మిత్రుడు' తనకి కాక వేరే ఎవరికి ఇచ్చేస్తాడు. తనలోని ఆత్రుత... ఆశ ఆలోచనలని ప్రక్కదోవ పట్టించేసాయి' అనుకుంటూ టిఫిన్ చేసాడు ఏకాంబర్.

పావుగంటలో టిఫిన్ చేసేసి బట్టల షాపు దగ్గరకు వెళ్ళాడు. దూరం నుండి షాపులోకి చూసి మరో పావుగంట రోడ్డు మీదే గడిపేసాడు. అరగంట దాటాక నెమ్మదిగా షాపు దగ్గరకు వెళ్ళాడు ఏకాంబర్.

షాపంతా పనివాళ్ళతో కళకళలాడుతోంది. షాపు యజమాని కేష్ కౌంటర్ దగ్గర కూర్చుని చిద్విలాసంగా నవ్వుతూ ఏకాంబరాన్ని లోపలకు ఆహ్వానించాడు.

ఏకాంబర్ బట్టలు కొనడానికి వచ్చాడనుకుని కొత్తగా చేరిన పనివాళ్ళలో ఇద్దరు, ముగ్గురు గబగబా ఏకాంబరం దగ్గరకొచ్చి 'రండి సార్! రండి మీకెలాంటి బట్టలు కావాలి. చీరలా, ఫేంట్లూ, షర్ట్ లా" అంటూ హడావిడి చేసారు.

"ఇతను తన మిత్రుడే. కస్టమర్ కాదు" అంటూ ఏకాంబరాన్ని ఓమూలనున్న బల్లమీద కూర్చోమని షాపులో కొత్తగా చేరిన పనివాళ్ళను ఆరుగుర్ని ఏకాంబరం దగ్గరకు పిలిచాడు షాపు ఓనరు.

తన మెళ్ళో ఉన్న బ్యాగ్ తీసి అందులో ఉన్న పాలసీ ప్రపోజల్ ఫారాలు తీస్తూ తన ముందుకొచ్చి నిలబడిన వాళ్ళని ఎవరినీ గమనించలేదు ఏకాంబరం. సంచిలో ఉన్న సరంజామా అంతా తీసి బైట పెట్టుకుంటూ తల ఎత్తి తన ముందున్న వాళ్ళని చూసి ఒక్కసారే అదిరిపడ్డాడు ఏకాంబర్.

ఎదురుగా చేతులు కట్టుకుని వినమ్రంగా నిలబడ్డ ఆరుగురిలో నూకరత్నం తల దించుకుని నిలబడి ఉంది.

నూకరత్నం!

తను నెలరోజులుగా నిద్రాహారాలు లేనివాడిలా నీరసించిపోయి కళ్ళు కాయలు కాచేలా తనలో తనే వెదుక్కుంటూ తిరుగుతున్న తన అభిమాన సుందరి నూకరత్నం.

నూకరత్నం కళ్ళముందే నిలబడి ఉండేసరికి ఒక్కసారే తత్తరపాటుతో... తన కళ్ళను తనే నమ్మలేనంతగా అవాక్కయి చూస్తుండిపోయాడు ఏకాంబర్.

"భయ్యా! వాళ్ళే కొత్తగా చేరినవాళ్ళు. సంతకాలు తీసుకో. నీకు సర్టిఫికెట్లు, ఫ్రూఫ్ లు ఏవికావాలో చెప్తే రేపు తెచ్చి ఇస్తారు. డబ్బు నేను నీకు ఇస్తాను" అంటూనే షాపులోకి వచ్చిన కస్టమర్ ని పలకరిస్తూ ఆహ్వానిస్తున్నాడు షాపు యజమాని.

"అలాగే అన్నా! మీరు రండి..! ఈ ప్రపోజల్ ఫారాల మీద సంతకాలు చేసి ఇవ్వండి" అంటూ ఆరుగురికీ తలో ఒక ఫారం ఇచ్చాడు ఏకాంబర్. తన ఎదురుగా దిష్టిబొమ్మలా అచేతనంగా నిలబడ్డ నూకరత్నాన్ని ఎలా పలకరించాలో అర్ధం కాలేదు ఏకాంబరానికి. చిన్నగా నవ్వుతూ ఆమె చేతికి 'ప్రపోజల్ ఫారం'

ఇచ్చాడు.

నూకరత్నం మారుమాట్లాడకుండా ఏకాంబరం చేతిలో ఫారం తీసుకుని ప్రక్కకు వెళ్ళి ఎక్కడెక్కడ సంతకాలు చెయ్యాలో గబగబా చేసేసింది. ముందు రోజు రాత్రే షాపు యజమాని అందరికీ చెప్పాడు. అందరి పేర ఇన్సూరెన్స్ కడతానని. అందులో సగం మీరు, సగం నేను కలిపి ప్రీమియం భరించాలని చెప్పాడు. అందుకే అందరూ మారుమాట్లాడకుండా సంతకాలు చేసి ఏకాంబరం చేతికి ఫారాలు అందించారు.

అందరినీ రెండేసి పాస్ పోర్టు సైజు ఫోటోలతో పాటు వయసు, అడ్రస్ ధృవీకరించే పత్రాలు తెచ్చి షాపు ఓనర్ చేతికి ఇస్తే రేపు వచ్చి తీసుకుంటానని చెప్పాడు ఏకాంబరం. అందరి వివరాలు తన డైరీలో పేరు పేరునా అడిగి రాసుకున్నాడు. తీరిగ్గా ఇంటికెళ్ళి ప్రపోజల్ నింపుకోవచ్చనుకుంటూ.

అందరూ తలలూపి తిరిగి ఎవరి కౌంటర్ దగ్గరకు వాళ్ళు వెళ్ళిపోయారు. నూకరత్నం నేరుగా చీరలు ఉండే కౌంటర్ దగ్గరకు వెళ్ళి నిలబడి ఓరకంట ఏకాంబరాన్నే గమనిస్తోంది.

షాపులో చేరి రెండు రోజులు కూడా కాలేదు. భయం భయంగా బెరుకు బెరుకుగా ఉంది. షాపు ఓనర్ కి బాగా కావలసినవాడు 'ఏకాంబర్' అని తెలియగానే గుండెల్లో ఏదో తెలియని భరోసా, నమ్మకం కలుగుతున్నాయి నూకరత్నానికి.

అమ్మని, చెల్లెళ్ళను పోషించుకోవడానికి ఏదో ఒక ఉద్యోగం తప్పలేదు. ఉన్న ఊర్లో గడవక మేనమామ ఆసరా దొరుకుతుందేమోనని వచ్చేసరికి అతను హఠాత్తుగా చనిపోయేసరికి షాకయిపోయింది నూకరత్నం.


ఎందరి కాళ్ళో పట్టుకుని వారం రోజులు తిరిగితే ఇక్కడ ఈ బట్టల షాపులో సేల్స్ గర్ల్ గా ఉద్యోగం దొరికింది! మనసులోనే అనుకుంటూ ఏకాంబరాన్ని గమనిస్తోంది నూకరత్నం.

'తెలిసిన వ్యక్తి తారసపడ్డాడు. ఇక ఇక్కడ తన ఉద్యోగానికి ఎలాంటి ఢోకా లేదు. అమ్మని, చెల్లెళ్ళని పోషించుకోవడానికి ఎలాంటి ఆటంకమూ ఉండదు' అనుకుంది నూకరత్నం.

"రేపు మధ్యాహ్నం వస్తాను భయ్యా. భోజనానికి నువ్వు ఇంటికి వెళ్లేముందే వస్తాను" అంటూ అక్కడి నుండి బయటకు వస్తూ ఓరకంట నూకరత్నాన్ని చూసాడు ఏకాంబరం.

నూకరత్నం కూడా 'ఏకాంబరం' కదలికల్ని గమనిస్తూనే ఉంది. ఆమె కూడా తనని గమనించడం చూసాడు ఏకాంబరం. కానీ, ఏం మాట్లాడలేదు. షాపులో సేల్స్ గర్ల్స్ ని సొంత చెల్లెళ్ళలా చూస్తాడు షాపు ఓనరు. ఎవరైనా పని లేకుండా సొల్లు కబుర్లాడితే వూరుకోడు. అలాంటి వాడ్ని ఆ మర్నాడే పనిలోనుండి తీసేస్తాడు. అమ్మాయిలైనా సరే ఊరికే పళ్ళికిలిస్తూ బాతాఖానీ కొడితే భరించలేడు అతను. 'పోనీలే భయ్యా! ఒక తప్పు కాయమన్నా కాయడు. ఎదిగే మొక్క ఆకుకు పురుగు పడితే పోనీలే అంటే మొక్క నాశనం అవుతుంది కదా భయ్యా! ఇలా వదిలేస్తే ఒక్కరి వలన మిగతా అందరూ భ్రష్టుపడతారు. పనినే దైవంగా భావించే నీలాంటివాళ్ళు నాకందుకే నచ్చుతారు అంటూ చెప్పేవాడు అతను.

అందుకే ఏకాంబరం తన ఎదురుగా నిలబడ్డ నూకరత్నాన్ని చూసి కూడా మాట కలపలేకపోయాడు. నవ్వుతూ పలకరించలేకపోయాడు. ఎవరో తెలీని వ్యక్తిలా ఆమె వివరాలు అడిగి రాసుకున్నాడు. అంతే!




పని వాళ్ళందరికీ ముందే వార్నింగ్ ఇచ్చాడు షాపు యజమాని. తెలిసినవాళ్ళు షాపుకొచ్చినా 'వ్యాపారం' వరకే పలకరింపులు. లేనిపోని ఊసులకు పోతే 'ఊస్టింగే' అని చాలా గట్టిగా అందరికీ వార్నింగ్ ఇచ్చాడు. అంతేకాదు, అందరిదగ్గరా ఖాళీ తెల్లకాగితాల మీద సంతకాలు తీసుకున్నాడు. ఎవరూ... ఎలాంటి అల్లరి చేయకుండా ముందే కట్టుదిట్టమైన ఒప్పందం మీద షాపులో జాయిన్ చేసుకున్నాడతను.

ఏకాంబరం షాపులో నుండి బయటకు వచ్చి బైక్ మీద కూర్చున్నాడే గాని మనసు మనసులో లేదు. కనిపించక కనిపించిన తన కలల సుందరిని కళ్ళారా చూడలేకపోయాడు. మనసారా పలకరించలేకపోయాడు.

మనసు వికలమై ఏం చేయాలో తెలీక... ఏం చేయబుద్ధికాక నేరుగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు. విశాఖపట్నం సీతమ్మపేట దగ్గరున్న ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళ్ళాడు ఏకాంబరం. పనిలో పెడితే మనసు దారికొస్తుందని వెళ్ళాడు.

***

ఆమర్నాడు మధ్యాహ్నం సరిగ్గా సిల్క్ హౌస్ మూసే సమయానికి వెళ్ళాడు ఏకాంబర్. అప్పటికే అందరూ తమతమ కేరియర్లు పట్టుకుని షాపు వెనుకే ఉన్న గోడౌన్ కేసి వెళ్తున్నారు.

ఏకాంబరాన్ని చూస్తూనే షాపు యజమాని తమ పని వాళ్ళ దగ్గర తీసుకున్న ప్రూఫ్ లన్నీ ఏకాంబరం చేతికిచ్చాడు. దానితోపాటు ఆరుగురివి క్వార్టర్లీ వాయిదాల డబ్బు కూడా లెక్కకట్టి ఏకాంబరం చేతికిచ్చాడు.

"భయ్యా! నేను షాపు మూసేసి భోజనానికి వెళ్తున్నాను. ఈ సర్టిఫికెట్లు, ఫోటోలు సరిపోయాయి కదా! ఒకవేళ ఎవరిదన్నా తేడా వస్తే అందరూ గోడౌన్ లో భోజనాలు చేస్తుంటారు. వాళ్ళతో మాట్లాడు" అంటూ షాపు యజమాని షాపు తాళాలు వేసుకుని వెళ్ళిపోయాడు.

పనిలేకపోయినా షాపు వెనకే వున్న గోడౌన్ దగ్గరకు వెళ్ళాడు ఏకాంబరం. షాపులో పనిచేసే ఆడవాళ్ళతో మాట్లాడుతూ భోజనం చేస్తోంది నూకరత్నం.

ఏకాంబరాన్ని చూస్తూనే పనివాళ్ళంతా షాపు యజమానికి ఇచ్చినంత గౌరవం ఇస్తూ లేచి నిలబడ్డారు.

"మీ పాలసీల డబ్బు తీసుకున్నాను. అన్నీ సరిపోయాయి. మీకు తిరిగి నాలుగు గంటల వరకూ విశ్రాంతి కదా! ఇక్కడే ఉంటారా?" నూకరత్నానికి వినపడేటట్టూ అన్నాడు ఏకాంబర్.

"ఏముంది సార్! భోజనాలయ్యాక అలా రోడ్డు మీద ఓ గంట తిరిగి వచ్చేసి తలో మూల సేద తీరుతాం" చెప్పాడు ఒకాయన.

"సార్! మీరు భోజనం చేసే వచ్చారా?" మరొకతను అడిగాడు.

"లేదు. ఈ చివర ఉన్న అమృతా విలాస్ హొటల్ లో భోజనం చేస్తాను. మూడు గంటల వరకూ అక్కడే ఉండాలి. దాడి అప్పారావు గారి షాపులో పాలసీ ప్రీమియమ్ తీసుకోవాలి. లంచవర్ కదా! వాళ్ళ షాపు కూడా మీకులాగే మూసేస్తారు కదా" అన్నాడు ఏకాంబరం. తన మాటలు అర్థం చేసుకున్నదైతే తప్పకుండా తనని వెదుక్కుంటూ నూకరత్నం 'అమృత విలాస్' కి వస్తుందనుకున్నాడు ఏకాంబర్ .

వాళ్ళందరికీ అలా చెప్పి అక్కడ నుండి బయటపడి అమృతా విలాస్ కెళ్ళి కూర్చున్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ ఊహించినట్టే అరగంటలో అమృతా విలాస్ కు వచ్చింది నూకరత్నం. హొటల్ లోకి వస్తూనే ఏకాంబరాన్ని చూసి సిగ్గుపడి దూరంగానే నిలబడిపోయింది నూకరత్నం.

ఏకాంబరమే గబాలున లేచి వెళ్ళి నూకరత్నాన్ని పిలిచి మరీ పలకరించి ఇద్దరూ ఫేమిలీ రూంలోకి వెళ్ళి కూర్చున్నారు.

"చెప్పండి. నాతో ఏదో మాట్లాడాలనే కదా! ఇందాక అందరూ వినేలా ఇక్కడ ఉంటానన్నారు. నేను అర్థం చేసుకోలేని దద్ధమ్మని కాను" నెమ్మదిగా అంది నూకరత్నం.

ఆమెకేసే తదేకంగా చూస్తూ మౌనంగా ఉండిపోయాడు ఏకాంబర్.

"నేను వెళ్ళిపోనా?" లేవబోతూ అంది నూకరత్నం.

"ఆగండాగండి! వెళ్ళిపోడానికా వచ్చింది. మిమ్మల్ని ఇలా ఇంత దగ్గరగా చూస్తుంటే నాకు నోట మాట పెగలటంలేదు" మౌనం వీడి అన్నాడు ఏకాంబర్.

"దెయ్యంలా కనిపించి భయపెడుతున్నానా?" తనని తాను ఒసారి ఎగాదిగా చూసుకుంటూ అంది నూకరత్నం.

"దేవతలా దర్శనం ఇచ్చారు కదా! భక్తుడిలా మైమరచి ప్రార్థించుకుంటున్నాను" తన్మయంగా అన్నాడు ఏకాంబర్.

"దేవతనా...?!" చిన్నగా నవ్వుతూ "ఏమని ప్రార్థిస్తున్నారు?" ఎగతాళిగా అంది నూకరత్నం.

"ఈ దేవత మా ఇంట్లో కొలువైతే ఎంత బాగుండునో అని" ఒరగా నూకరత్నం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

ఒక్కసారే ఉలిక్కిపడింది నూకరత్నం.

"మీరేమంటున్నారో నాకర్థం కాలేదు అంబర్ గారూ!" తీక్షణంగాఏకాంబర్ కళ్ళల్లోకి చూస్తూ అంది నూకరత్నం.

"అదేంకాదు. అవునూ! మీరు ఇంత చదువు చదివి ఇక్కడ ఇలా ప్రత్యక్షమయ్యారేమిటండీ బాబూ!" మాట మారుస్తూ అన్నాడు ఏకాంబరం.

"ఏం చెయ్యమంటారు?! నేను చదివిన ఎండాకాలం చదువుకి ఇదే గొప్ప" తల దించుకుంటూ అంది నూకరత్నం.

"నిరాశ పడకూడదండి! అయినా, ఈ రోజుల్లో నోట్లో మాట, ఒంట్లో శక్తి ఉంటే ఉద్యోగాలెందుకండి! డబ్బు సంపాదించడానికి సవాలక్ష మార్గాలున్నాయి తెలుసా!" అన్నాడు ఏకాంబర్.

ఇంతలో బేరర్ వచ్చి వాళ్ళ టేబుల్ దగ్గర నిలబడ్డాడు.

"చెప్పండి సార్! మీకేం ఆర్డర్ ఇవ్వమంటారు" నమ్రతగా అడిగాడు.

"నాకు మినీ మీల్స్ పట్రా బాబూ. మీకు... మీరు ఇప్పుడే కంచం ఖాళీ చేసి వచ్చినట్లున్నారు కదా! లైట్ గా... కాఫీ... టీ..." నూకరత్నం కేసి చూస్తూ అడిగాడు ఏకాంబరం.

"నాకేం అక్కర్లేదు. ముందు మీ పని కానివ్వండి" వాచీకేసి చూసుకుంటూ షాపు తెరిచే టైమ్ అయిపోతోందని గాభరా పడుతూ అంది నూకరత్నం.

"ఇక్కడ జ్యూస్ దొరుకుతుందా?" బేరర్ కేసి చూస్తూ అడిగాడు ఏకాంబర్.

"ఉంటుంది సార్! మేడమ్ గారికి జ్యూస్ పట్రామ్మంటారా?" ఇద్దరికేసి అదోలా చూస్తూ అన్నాడు బేరర్.

"గ్రేప్ జ్యూస్ ఒకటి పట్రా! నాకు మినీ మీల్స్" బేరర్ తో చెప్పాడు ఏకాంబర్.

"అలాగే సర్!" అంటూ బేరర్ ఇద్దర్నీ ఎగాదిగా చూసుకుంటూ వెళ్ళాడు.

"మీరసలు నన్నెందుకు ఇక్కడకు రమ్మన్నారో నాకర్థం కాలేదు" చిరాగ్గా అంది నూకరత్నం.

"నాతో మాట్లాడడానికి మీకు చికాగ్గా ఉంది?" నవ్వుతూ అన్నాడు.

"మాట్లాడడానికి కాదు. షాపు తెరిచే టైమ్ అవుతోంది. మా ఓనర్ అసలే తిక్కలోడు. తేడా వస్తే వెంటనే ఊస్టింగ్ ఇచ్చేస్తాడట కదా" భయంభయంగా అంది నూకరత్నం.

"పోతేపోనివ్వండి! ఇంతకంటే మంచి ఉద్యోగం నేను చూస్తాగా" ఆమెకేసి ప్రేమగా చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"మీరిప్పుడు ఇలాగే అంటారా? మళ్ళీ ఎప్పుడు కనిపిస్తారో?! అమ్మ, చెల్లెళ్ళని తీసుకుని మావయ్యదగ్గరకు వచ్చేసరికి మా ఖర్మ కాలి ఆయన గుటుక్కుమన్నాడు. మమ్మల్ని ఆదుకునే దిక్కులేక ఈ నెలరోజులూ ఉద్యోగం కోసం తిరగని దుకాణం లేదు. కనీసం కలో గంజో త్రాగడానికి ఈ చిన్న ఉద్యోగమే నాకు కొండంత అండ" కళ్ళల్లో నీళ్ళు దించుకుంటూ అంది నూకరత్నం.

ఆమె అలా బాధపడేసరికి ఏకాంబరానికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. చదువుకున్న యువతీయువకుల్లో ఆర్థిక స్వావలంబన కరువైతే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారనడంలో సందేహం లేదు.

"ఇన్నాళ్ళు ఎక్కడున్నారు?" సందేహంగా అడిగాడు.

"పల్లెటూర్లో నాన్న చిన్న ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేసేవారు. పల్లెటూరు కావడం వలన ఇంటికి అద్దె

కూడా అడిగేవారు కాదు. మేము ఉండడమే అదృష్టంగా భావించి వాళ్ళ పిల్లల్ని నాన్న దగ్గరకు 'చదువు' నేర్పమని పంపేవారు. పైపెచ్చు ఆ ఊర్లో పిల్లల తల్లిదండ్రులంతా వారం వారం కాయగూరలు తెచ్చి ఇస్తూండేవారు. హాయిగా జీవితం సాగిపోతున్నదనుకున్న సమయంలో నాన్న గుండెపోటుతో చనిపోయారు. నాకాస్కూల్లో చదువు చెప్పే వయసు కాదని స్కూలు పెద్దలు ఉద్యోగం ఇవ్వననేసారు. ఇక అక్కడ బ్రతకలేక మావయ్య సలహా సహాయం తీసుకుందామని వచ్చాము. మేము వచ్చిన నెల రోజులకే ఇలా జరిగింది. వాళ్ళింట్లోనే తల్లి నలుగురం ఆధారపడి ఉండడం ఇష్టం లేక మావయ్యే చంద్రనగర్ ఇల్లు అద్దెకు తీసి మమ్మల్ని ఉంచారు. మావయ్య పోయాక ఏం చేయాలో తోచలేదు. ఇదిగో... ఇలా ఈ ఉద్యోగంలో చేరాను" క్లుప్తంగా తన గోడంతా విన్నవించుకుంది.

ఏకాంబరానికి కళ్ళు చెమ్మగిల్లాయి. మొట్టమొదటిసారిగా ఏకాంబరానికి గుండె కలుక్కుమంది.

"మీకు నా మీద నమ్మకం ఉంటే నేను మీకు భరోసా ఇస్తాను. ఇంతకంటే మంచి 'ఆదాయం' సంపాదించే దారి కనుక్కుందాం సరేనా?" అప్రయత్నంగా ఆమె చెయ్యి మీద చెయ్యేసి చిన్నగా నొక్కుతూ ధైర్యం చెప్పాడు ఏకాంబర్.

ఏకాంబర్ ఉన్నట్టుండి తన చేతి మీద చెయ్యి వేసేసరికి ఛటుక్కున తన చెయ్యి వెనక్కి లాక్కుంది నూకరత్నం.

"మీమీద నమ్మకం లేకపోతే ఇలా ఇక్కడికెందుకొస్తానండి" అంది నూకరత్నం ఓరగా ఏకాంబర్ కళ్ళల్లోకి చూస్తూ.

"సరే! మీరిక్కడ ప్రస్తుతానికి పని చెయ్యండి. నేను ఈ నెల్లోపల ఓ ఆఫీసు ప్రారంభించాలనుకుంటున్నాను. నేను చేసిన పాలసీదారులకు సహాయ సహకారాలు అందించడానికి ఇక్కడే ఓ షాపు అద్దెకు తీసుకుంటున్నాను. మీరు కూడా అక్కడే పని చెయ్యొచ్చు. వీలైతే ఇతర బ్యాంకుల దగ్గర ఫ్రాంచైజీలు దొరుకుతాయేమో కనుక్కుంటాను" బేరర్ తన ముందర పెట్టిన మినీమీల్స్ తింటూ అన్నాడు ఏకాంబర్ .

"ఫ్రాంచైజీలంటే...?" అర్థం కాక అయోమయంగా చూస్తూ అంది నూకరత్నం.

"పెద్ద బ్యాంకులు తమ ఖాతాదారులు దగ్గరనుండి ఇచ్చిన అప్పులకు రావలసిన వాయిదా బకాయిలు వసూలు చేయడానికి 'కమీషన్' పద్ధతి మీద ఒకరికి కాంట్రాక్టు అప్పగిస్తారు. దాన్నే ఫ్రాంచైజీలంటారు. ఆ సంస్థ తరపున మీరు మీదగ్గర పదిమంది యువతీయువకుల్ని ఉద్యోగులుగా నియమించి వారికి రావలసినది బకాయిలు వసూలు చెయ్యాలి. దానికి మీకు 'కమీషన్' ఇస్తారు. అందులోనుండి మీరు మీ దగ్గర ఉన్న సిబ్బందికి జీతాలు ఇవ్వాలి." నూకరత్నం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబరం.

"అమ్మో! నేనే ఉద్యోగం దొరక్క అల్లల్లాడినదాన్ని నా దగ్గర పదిమందికి ఉద్యోగమా?! వినడానికే వింతగా ఉంది సార్!" అయోమయంగా అంది నూకరత్నం.

"నేనున్నా కదండి! మీ వెనుక ఈ 'ఏకాంబర్' ఉన్నాడన్న ధీమాతో గుండెల మీద చెయ్యేసి పడుకోండి" నూకరత్నం కళ్ళల్లోకి చూస్తూ తన చెయ్యి ఆమె గుండెల మీదకు చూపిస్తూ చిన్నగా నవ్వి అన్నాడు ఏకాంబర్.

"మీ చెయ్యెందుకండి మధ్యలో. నా చెయ్యి కదా వేసుకుని పడుకోవాలి. అయినా, మీ పేరు ఏకాంబర్ అంటే ఎందుకో నాకు 'ఏక్' పుట్టిస్తోందండి." అంది సిగ్గుగా తల దించుకుంటూ.

ఆమె అలా అనేసరికి అదిరిపడ్డాడు ఏకాంబర్.

"నేనేం చెయ్యగలనండి. మా తాతముత్తాతల నుండి వస్తోందట ఈ 'అంబరం'. ఆకాశమంత ఎత్తుకి ఎదగాలని ఆశతో మా ముత్తాత్తాత ఎవడో తగిలించాడండీ బాబూ! నా పేరు ఏకాంబరం, మా నాన్న పేరు పీతాంబరం. మా అన్న పేరు నీలాంబరం. ఇంకా ఎక్కడన్నా అంబరాలు దొరికుంటే మా చెల్లెలికి కూడా తగిలించేద్దురు. అదృష్టం కొద్దీ ఇంకెక్కడా 'అంబరం' పేరు దొరకలేదు" చిరాగ్గా సిగ్గుతో తల దించుకుంటూ అన్నాడు ఏకాంబర్.

ప్రేమించిన అమ్మాయికి తన పేరు నచ్చలేదనేసరికి తల కొట్టేసినట్టూ ఫీలయిపోయాడు ఏకాంబర్.

"పోనీలెండి సార్! పేరులో ఏముంది. మన ప్రవర్తన బావుంటే ఆ పేరుకే మారు పేరు తేగలరు. అవునా!" ఏకాంబరం బాధపడడం చూసి అనునయంగా అంది నూకరత్నం.

ఆ అమ్మాయి అలా అనేసరికి ఛటుక్కున తల ఎత్తి ఆమె కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ అనుకున్నాడు ఏకాంబర్ 'ఈ అమ్మాయి అమాయకురాలు కాదు. తెలివైనదే. ప్రపంచజ్ఞానం లేని పిల్లనుకున్నాడు. ఇంగితజ్ఞానం ఉన్నదే!" అని.

"సార్! మీరేమి అనుకోనంటే మిమ్మల్ని "అంబర్" అని పిలవచ్చా?" మళ్ళీ ఆ అమ్మాయే అంది.

"ఓ ఎస్ మీరెలా పిలిచినా పలకడానికి... పరిగెత్తుకు రావడానికి నేనీ రోజు నుండి మీ పెంపుడు చిలకననుకోండి" అన్నాడు ఏకాంబరం ఆనందంగా.

"మీరు చిలకైతే నేను గోరింకనా!?... ఎవరైనా వింటే నవ్వుతారు" పకపకా నవ్వబోయి అది హొటల్ అని గ్రహించి చుట్టూరా చూస్తూ చేత్తో నోరు మూసుకుని నవ్వాపుకుంది నూకరత్నం.

ఆ అమ్మాయి అలా తనని, ఆమెని కలిపి చిలకా గోరింకా అని పోల్చి చెప్పేసరికి ఏకాంబరం మనసు దూదిపింజలా తేలిపోయింది. ఆనందం ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది. మనసులో ఉప్పొంగుతున్న ప్రేమతరంగాల్ని అదుపు చేసుకుంటూ గుంభనంగా చిరునవ్వు చిందిస్తూ ఆమెకేసి తన్మయంగా చూస్తుండిపోయాడు.

"మరి మనం ఇక వెళ్దామా?" ఏకాంబరం భోజనం ముగించి ఖాళీ ప్లేటులో అలా ఎంగిలి చేత్తోనే కెలుకుతూ కూర్చునేసరికి అతన్ని ఇహానికి లాక్కు వస్తూ అంది నూకరత్నం.

ఉలిక్కిపడి తన వైపు ఒకసారి చూసుకుని "సారీ! అక్కడున్న వాష్ బేసిన్ లో చెయ్యి కడుక్కుని వస్తా!" అంటూ లేచి వెళ్ళాడు ఏకాంబరం.

డైనింగ్ టేబుల్ దగ్గర నుండి హుందాగా లేచి నిలబడి ఠీవిగా నడిచి వెళ్తున్న ఏకాంబరాన్ని తదేకంగా గమనిస్తూ కూర్చుంది నూకరత్నం.

'అందగాడే! అణకువ, అల్లరి రెండూ ఉన్నాయి ఇతగాడిలో. అహం మాత్రం ఏ కోశానా కనిపించటం లేదు. అయినా, ఇతను తన దగ్గర్నుండి ఏమాశించి సహాయం చేస్తానంటున్నాడు?! 'పరోపకారం ఇదం శరీరం' అన్నారు కదూ! నిజమే. 'మానవ సేవే మాధవ సేవ' అన్నది ఇతని సిద్ధాంతమైతే ఎక్కడో అనాధాశ్రమంలోనో, వృద్ధాశ్రమంలోనో పని చేసుకు బ్రతకొచ్చు కదా! ఏజెంటుగా డబ్బు సంపాదన కోసం ఈ తాపత్రయం ఎందుకు?'

ఏకాంబరం వాష్ బేసిన్ దగ్గరనుండి తిరిగొచ్చేవరకూ పరిపరివిధాలా ఆలోచిస్తూనే ఉంది నూకరత్నం.

"మీ పేరు నూకరత్నం అంటే ఎబ్బెట్టుగా ఉంది. 'రత్నం' గారని పిలవచ్చా?" కర్చీఫ్ లేకపోవడంతో జేబులో చెయ్యి పెట్టుకుని జేబు లోపలే చెయ్యి తుడుచుకుంటూ కూర్చున్నాడు ఏకాంబర్.




"ఇంకా గార్లు, బూర్లు ఎందుకండీ! రత్నం అని పిలవండి" ఒరగా ఏకాంబరం కళ్ళల్లోకి చూస్తూ అంది నూకరత్నం.

"మీరు కూడా నన్ను అండి పొండి అనకండి! అంబర్ సాబ్ అని పిలవండి! సరేనా?!" గోముగా అన్నాడు

ఏకాంబర్.

"అంబర్ అంటే పోలా! మళ్ళీ ఆ 'సాబ్' ఎందుకండీ. సాయిబులాగా" అంది నవ్వుతూ.

"మీరు నన్ను 'అంబర్' అని ఏకవచనంలో పిలిస్తే చూసేవాళ్ళు మీ కంటే నేను 'గుంటడ్ని' అనుకుంటారు. అందుకే అందంగా 'అంబర్ సాబ్' అనండి బావుంటుంది."

హొటల్ లో నుండి బయటకు వస్తూ అన్నాడు ఏకాంబరం.

"అలాగే స్వామీ! అలాగే! ఇక నన్ను వదిలి పెడతారా అంబర్ సాబ్" నవ్వుతూ అంది నూకరత్నం.

"ఇప్పటికి ఓకే! మీకు రేపు వచ్చే 'మంగళవారం' షాపు సెలవుకదా! మనం ఇద్దరం కలుసుకోవాలి. తప్పదు. వస్తారు కదా!" ఆర్డర్ వేస్తూ అన్నాడు ఏకాంబరం.

"అలాగే! అమ్మతో చెప్పి వస్తాను. రోజులసలే బాగాలేవు ఒంటరిగానే తిరుగుగాని, ఎవరినీ నమ్మి వారితో తిరక్కు అంటూ అమ్మ చెప్తూంటుంది." అంది రత్నం ఓరగా ఏకాంబరాన్ని చూస్తూ.

"అదేంటి!?! నేనుంటాగా నీకు తోడుగా" అమాయకంగా అన్నాడు ఏకాంబర్.

"అదేగా అమ్మ భయం. తోడున్న వాళ్ళే తోడేళ్ళు అయిపోతారట. పేపర్లు చదివి చదివి అమ్మ బుర్ర అలా మారిపోయింది... మంగళవారం కదా!... మీ నెంబరివ్వండి. వీలునుబట్టి మీకు ఫోన్ చేస్తాను" అంది నూకరత్నం.

నూకరత్నం ఫోన్ నెంబరు అడిగేసరికి ఉత్సాహంతో గబగబా తన జేబులో ఉన్న విజిటింగ్ కార్డు తీసి ఇచ్చాడు ఏకాంబర్.

"వస్తా! అంబర్ సాబ్!" కళ్ళల్లో ఆనందం నింపుకుంటూ ఏకాంబరాన్ని చూసింది నూకరత్నం.

ఇతను తనని వంటరిగా విడిచి పెట్టడు. తన నీడను కూడా లాలనగా చూస్తున్నాడు. ఇలా జీవితాంతం తనని అక్కున చేర్చుకోగలుగుతాడా? ఆస్తులు, అంతస్థులు, కులాలు మతాలు ఇతని మనసుని మార్చేయవు కదా! తనే లేనిపోని ఆశలకు పోతోందా?! పరిపరివిధాల ఆలోచిస్తూ ఏకాంబరం

సాన్నిహిత్యాన్ని సంబరంగా ఆస్వాదిస్తూ ముందుకు సాగిపోయింది నూకరత్నం.

వడివడిగా నడుచుకుంటూ తల దించుకు సాగిపోతున్న 'నూకరత్నాన్ని' చూస్తూ క్షణం నిస్తేజంగా నిలబడిపోయాడు ఏకాంబర్. తన గుండెల్లో నుండి 'ఆనందం' ఆవిరైపోతున్న భావనతో ఆమెనే కన్నార్పకుండా చూస్తుండిపోయాడు.

***

ఆ నాలుగురోజులూ ఏకాంబరం ఏకాగ్రతగా గడపలేకపోయాడు. పాలసీ హోల్డర్ లని కలవలేకపోయాడు. ఏ పని చేద్దామన్నా నూకరత్నమే కళ్ళల్లో మెదులుతోంది. మనసంతా కల్లోలమైపోతుంది. తన మాట మన్నించి వస్తుందా? రానంటుందా? ఏకాంబరానికీ ఏదీ నిర్ధారణ కావటంలేదు. 'పోనీ, ఒకసారి రాజమండ్రి సిల్క్ హౌస్ కి వెళ్ళి కలుద్దామంటే షాపు యజమాని దృష్టిలో పడితే తను ఇన్నాళ్ళు ఎంతో కష్టపడి సంపాదించుకున్న పరువు పోతుందేమోనని భయం... భయం కాదు, సంస్కారంతో కూడిన విచక్షణ మాత్రమే.

రోజూ ఉదయం లేస్తూనే ఆ రోజు కలవాల్సిన వాళ్ళ పేర్లు రాసుకోవడం, ఆ రోజు వసూలు చేయాల్సిన పాలసీల వాయిదాలు ఎవరు కడతారో వారి పేర్లు రాసుకోవడం, కొత్తగా పాలసీల వేట కోసం మరో జాబితా... ఇలా రోజూ కనీసం ఓ ఏభైమందినన్నా కలుస్తాడు ఏకాంబర్.

అయితే, ఈ నాలుగు రోజులూ బైక్ తో ఊరి మీద పడ్డా అటూ, ఇటూ అన్ని వీధులూ, అన్ని ప్రాంతాలు, అన్ని వార్డులూ తిరిగినా ఒకరి కోసం వెళ్ళాల్సింది... మరొకరిని కలవడం... వెళ్ళాల్సిన ఏరియా బదులు వేరే ఏరియా వెళ్ళడం... అలా అంతా అయోమయంగా గడిపేసాడు ఏకాంబరం.

ప్రతి పదిహేను రోజులకి ఏజెంటు కమీషన్ బ్యాంకు పాస్ బుక్ లో జమ అవుతుంది. కనీసం ఎంత కమీషన్ వచ్చిందో చూసుకోవడానికి కూడా సమయం కేటాయించలేకపోయాడు ఏకాంబర్.

ఆ రోజు మధ్యాహ్నం సెల్ ఫోన్ లో మెసేజ్ వచ్చింది. మెసేజ్ రాగానే అన్యమనస్కంగానే చూసి బ్యాంకు మెసేజ్ లే అని చూసీ చూడనట్టు వదిలేసాడు.

ఆ సాయంత్రమే ఇన్స్యూరెన్స్ బ్రాంచి మేనేజర్ నుండి ఫోన్ కాల్ వచ్చింది ఏకాంబరానికి.

"కంగ్రాట్స్ ఏకాంబర్! హార్టీ కంగ్రాట్యులేషన్స్" ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ ఫోన్ చేసాడతను.

బ్రాంచి మేనేజర్ అంతలా ఎందుకు ఆనందపడిపోతున్నాడో అర్ధం కాలేదు. ఈ మధ్య బ్రాంచి లెవల్ లో గాని,, డివిజన్ లెవల్ లో గాని, జోనల్ లెవల్ లో గాని ఎలాంటి వ్యాపార పోటీలు జరగలేదు. అందులో తను ఎక్కువ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసానని చెప్పి ఆనందించడానికి! మరెందుకు ఈయన ఇంత ఇదిగా ఎగిరి

గంతేస్తున్నాడు! అనుకుంటూనే సెల్ చెవి దగ్గర పెట్టుకుని నిరాశక్తిగా అన్నాడు ఏకాంబరం.

"చెప్పండి సార్! ఏమిటి విశేషం?"

"నా అదృష్టం కొద్దీ ఈ బ్రాంచి మేనేజర్ ని అయ్యాను. నేనెప్పుడో పూర్వజన్మలో ఎంతో పుణ్యం చేసుకోబట్టి నువ్వు నేను పని చేస్తున్న బ్రాంచిలో ఏజెంటుగా చేరావు. నీ మేలు మర్చిపోలేను. నీ ఋణం తీర్చుకోలేను... గడగడా 'మార్కెటింగ్ మోటివేషన్ థాట్' తో గుక్క తిప్పుకోకుండా మాట్లాడేస్తున్నాడు బ్రాంచి మేనేజర్.

"సార్... సార్... ఆగండాగండి! నేను కొత్త ఏజెంట్ ని కాదు. నేను వ్యాపారం చేయకుండా పడుకునే బద్ధకస్తుడ్ని కూడా కాదు మీరు నాకు ఎందుకింత ఎంకరేజ్ మెంట్ ఇస్తున్నారు?" విసుగ్గా అనకపోయినా వూకదంపుడు పొగడ్తలకు చిరాగ్గా అనేసాడు ఏకాంబర్.

"యూ ఆరే గ్రేట్ ఏకాంబర్! యూ ఆరే జీనియస్... యువర్ ఫెర్మార్మెన్స్ మార్వలెస్. మెమరబుల్ ఎచీవ్ మెంట్. మైండ్ బ్లోయింగ్!" తెలుగు మర్చిపోయి ఆంగ్లం లో అదరగొట్టేస్తున్నాడు బ్రాంచి మేనేజర్.

"సార్ మీరేం చెప్తున్నారో నాకర్థం కావడంలేదు. నేనేం చేసానో నాకే అంతుచిక్కడం లేదు" అయోమయంగా అన్నాడు ఏకాంబర్.

"అంతా నువ్వే చేసావు ఏకాంబర్! ఈ నెల నీ కమీషన్ ఎంత వచ్చిందో తెలుసా! బాప్ రే! మన జోన్ మొత్తంలో 'టాప్' కమీషన్ తీసుకున్నది నువ్వే. యూ ఆరే టాపర్! మన జోనల్ మేనేజర్ గారు నీకు ప్రత్యేకంగా ఫోన్ చేసి అభినందిస్తామన్నారు" చెప్పాడు బ్రాంచి మేనేజర్.

'హమ్మయ్యా అదా విషయం' అని అనుకుంటూ ఛటుక్కున తన దగ్గరున్న సెల్ లో బ్యాంకు వాళ్ళిచ్చిన మెసేజ్ చూసాడు. ఇన్ కంటాక్స్ కట్ చేసి మిగతాది అకౌంట్ లో జమ అయింది. అంత మొత్తం తను జాయిన్ అయిన తర్వాత ఇదే చూడ్డం. ఆశ్చర్యం... ఆనందం కలగాపులగమైపోయాయి. అయినా, మనసులో ఇంకా ఏదో వెలితి. మనస్ఫూర్తిగా సంతోషపడలేకపోతున్నాడు.

ఇదే ఇంకో సమయంలో అయితే ఎగిరి గంతేసి వెళ్ళి అమ్మకి చెప్పేసేవాడు. డిపార్ట్ మెంటల్ స్టోర్స్ కి వెళ్ళి తండ్రికి చెప్పేవాడు.

కానీ, ఎందుకో ఈ క్షణం బ్రతుకంతా శూన్యంగానూ, మనసంతా వెలితిగానూ, గుండెంతా బరువుగానూ ఉంది.

'ఈ రోజు వరకూ నూకరత్నం నుండి ఫోన్ రాలేదు. వస్తుందా! రాదా?! తనంటే ఆమెకు ఇష్టం లేదా?! లేదా వేరే ఏమైనా ఇబ్బందులు ఏర్పడ్డాయా'

పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు ఏకాంబర్.

ఇంతలో సెల్ రింగయింది. ఎవరో తెలియని వ్యక్తి నెంబరు. పేరు రావడం లేదు. ఎవరో కొత్త వ్యక్తి. పాలసీ కోసం... ఏదో ఎంక్వయిరీ కోసం చేస్తూ ఉండి ఉండాలి. ఎత్తి మాట్లాడాక ఒకంతట వదిలిపెట్టరు. తను కూడా ఆప్యాయంగా పలకరించి వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు లాగేస్తాడు. అడ్రస్ తో సహా అంతా తెలుసుకున్నాక చివర అతనికి కావలసిన సమాచారం ఇస్తాడు. అప్పటికప్పుడు అతని పేరు, అడ్రస్ సెల్ లో ఫీడ్ చేసుకుంటాడు. అందుకే ప్రతీ ఫోన్ కాల్ రిసీవ్ చేసుకుంటాడు ఏకాంబర్.

'ఎత్తాలా వద్దా' అని క్షణం ఆలోచిస్తూ అప్రయత్నంగానే ఫోన్ తీసాడు ఏకాంబర్. అవతల వ్యక్తితో మాట్లాడే లోపల 'నూకరత్నం చేస్తుందేమో... ఫోన్ ఎంగేజ్ అని విసుక్కుని అసలు చెయ్యడమే మానేస్తుందేమోనని 'ఏకాంబరం' ఆలోచన... ఆందోళన.

"హలో ఏజెంట్ ఏకాంబర్ స్పీకింగ్..." అలవాటు ప్రకారం అవతల వ్యక్తిని పలకరించాడు ఏకాంబర్.

"నేనండి..." అని అవతలనుండి తియ్యని గొంతు వినిపించేసరికి ఏకాంబరం గుండె లబ్ డబ్ మని వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది.

"మీరు..." ఆనందం... ఆశ్చర్యం... ఆతృత... అణుచుకోలేకపోతున్నాడు ఏకాంబర్.

"నేను రత్నాన్నండి! మీరు కలుద్దామన్నారుగా..." నెమ్మదిగా, తియ్యగా, మృదుమధురంగా అంటోంది నూకరత్నం.

"ఆ... అవును... అవును... ఎక్కడ...?!" గాబరాగా అన్నాడు ఏకాంబర్.

"నాకేం తెలుసు?! మీరే చెప్పండి. నాకసలే ఈ పట్నం కొత్త కదా!" ఎవరైనా వింటారేమోనని నసిగి నసిగి మాట్లాడుతోంది రత్నం.

"అవును కదా! మీకు ఉడా పార్కు తెలుసా... అమ్మో అంత దూరం మీరొక్కరూ ఎలా రాగలరు. ఒక పని చెయ్యండి. మీరు ఇంటి దగ్గర నుండి బయలుదేరి ఎన్ ఏ డి కొత్తరోడ్ దగ్గరుండండి. నేను వస్తాను. నా బైక్ మీద వెళ్దాం." అన్నాడు ఏకాంబర్.

"అమ్మో! ఎవరైనా చూస్తేనో?" అవతలనుండి భయంగా అంది నూకరత్నం.

"ఎవర్ని నన్నా? మిమ్మల్నా?" అడిగాడు ఏకాంబరం.

"నన్ను... నన్నెవరైనా గుర్తు పడతారేమో?" అనుమానంగా అంది.

"మీదీవూరే కాదన్నారు కదా? మిమ్మల్నెవరు గుర్తిస్తారు! ఈ మహానగరంలో నన్నే ఎవడూ పట్టించుకోడు" తేలిగ్గా అన్నాడు ఏకాంబర్.

"సరిసరి! అమ్మ వస్తున్నట్టుంది ఫోన్ పెట్టేస్తాను. సరిగ్గా పది గంటలకి ఎన్.ఏ.డి జంక్షన్ లో ఉన్న పెట్రోల్ బంక్ దగ్గర మీకోసం వెయిట్ చేస్తాను" అంటూ ఫోన్ కట్ చేసేసింది నూకరత్నం.

నూకరత్నం తో ఫోన్ మాట్లాడగానే వెయ్యేనుగుల బలం వచ్చింది ఏకాంబరానికి. గుండెల్నిండా వూపిరి పీల్చుకున్నాడు. ఒక్క నిమిషం తనూ నూకరత్నం కలవబోయే ఆనంద క్షణాల కోసం ఊహించుకున్నాడు.

చటుక్కున లేచి వాచీ కేసి చూసుకుని ఆత్రుతగా బాత్ రూమ్ లోకి పరుగందుకున్నాడు ఏకాంబర్.

ఆ క్షణం –

జోన్ లోనే 'టాపర్'నని గాని, ఆ వార్త అమ్మా నాన్నలకి చెప్పాలన్న విషయమే విస్మరించాడు. మరికొద్ది

నిమిషాల్లో నూకరత్నంతో కలిసే ఆనందకర సన్నివేశాన్ని తలచుకుంటూ బాత్ రూమ్ లోకి దూరాడు ఏకాంబర్.

***

టంచన్ గా పదో గంటకి ఎన్.ఏ.డి కొత్త రోడ్ దగ్గరకు చేరుకున్నాడు ఏకాంబరం. అప్పటికే అక్కడ కాచుకుని కూర్చుంది నూకరత్నం. బైక్ మీద హీరోలా వచ్చిన ఏకాంబరాన్ని చూస్తూనే ఆనందంతో గంతు వేసింది ఆమె హృదయం. అయితే, బయటకు ఎలాంటి భావన ప్రకటించకుండా మౌనంగా ఏకాంబరాన్నే చూస్తూ నిలబడింది.

బైక్ ని నేరుగా నూకరత్నం నిలబడి ఎదురు చూస్తున్న పెట్రోల్ బంక్ ప్రక్కకు తీసుకెళ్ళి ఆపాడు.

బైక్ తన ముందాగినా ఎక్కడానికి తటపటాయిస్తూ అటూ ఇటూ చూస్తూ నిలబడింది నూకరత్నం.

తలకి పెట్టుకున్న హెల్మెట్ తీసి 'రత్నం గారూ! నేనే! కిడ్నాపర్ ని కాదు. నన్ను దూరం నుండే గుర్తుపట్టారు కదా!" నూకరత్నాన్ని బైక్ ఎక్కమని సైగ చేస్తూ అన్నాడు ఏకాంబర్.

"మీ బైక్ చూసే గుర్తుపట్టాను. హెల్మెట్ పెట్టుకుని ఉంటే దొంగెవరో, దొరెవరో ఎలా తెలుస్తుంది" అంటూ నవ్వి ఏకాంబరం వెనుకే నాజూగ్గా ఎక్కి ప్రక్కనున్న హుక్కు గట్టిగా పట్టుకుంటూ కూర్చుంది నూకరత్నం.

"ఇది ఆటో కాదు. బైక్. బాగా కూర్చోండి. బెదిరిపోనక్కరలేదు. బాగానే డ్రైవ్ చేస్తాను" అంటూ ఒక్కసారే బైక్ ని ముందుకురికించాడు ఏకాంబరం. ఆ దూకుడికి నూకరత్నం ఒక్కసారే తూలి ఏకాంబరం మీద వాలిపోయింది. హఠాత్తుగా బైక్ వేగం పుంజుకునేసరికి అమాంతం, ఏకాంబరం మీద పడుతూ గబాలున వెనుకనుండి ఏకాంబరం నడుము చుట్టూ రెండు చేతుల్తో చుట్టి గట్టిగా వాటేసుకుంది నూకరత్నం.

అలా నూకరత్నం వాటేసుకోగానే ఒళ్లు జలదరించి మనసు పులకించి బైక్ ని మరింత స్పీడుగా ముందుకు ఉరికించాడు ఏకాంబర్.

"అంబర్ గారూ! మనం అంబరంలో లేము. అందరి మధ్యా ఉన్నాము. కొంచెం స్పీడు తగ్గించండి. బ్రేకులు ఫెయిలయితే బ్రతుకులు బూడిదైపోతాయి" ఏకాంబరాన్ని గట్టిగా గిల్లుతూ చెప్పింది నూకరత్నం.

"బైకు మీదున్నాను. మీరలా కితకితలు పెడితే నేనే కాదు. మీరూ క్రింద పడతారు" స్పీడు తగ్గిస్తూ అన్నాడు ఏకాంబర్.

"అందుకేగా కొంచెం స్లోగా వెళ్ళమంటున్నది." ఏకాంబరం నడుంచుట్టూ బిగుసుకున్న చేతులు విడదీసి వెనక్కి జరిగి మళ్ళీ బైకు ప్రక్కనే ఉన్న హుక్కుని గట్టిగా పట్టుకుంది నూకరత్నం.

"గాల్లో తేలినట్టుందే..." అంటూ హుషారైన పాటని హమ్ చేసుకుంటూ బైక్ ని డ్రైవ్ చేస్తున్నాడు ఏకాంబరం.

"సార్!... మీరు గాల్లో తేల్తే నేను భూమ్మీద వాల్తాను. మందు కొట్టినట్టు నడపకుండా ముందు చూస్తూ నడపండి" అనేసరికి పాట ఆపేసి ముసిముసిగా నవ్వుకున్నాడు ఏకాంబర్.

నేషనల్ హైవే లో నేరుగా వెళ్ళి పెదవాల్తేరు రోడ్డులోనుండి ఉడాపార్క్ దగ్గర ఆగాడు ఏకాంబర్.

"అమ్మో! ఇక్కడ చాలామందున్నారే! ఎవరైనా చూస్తేనో?!" టక్కున అంది నూకరత్నం.

"చూస్తే ఏమైంది?! భయపడితే బ్రతకలేరు. అయినా, మనం ఇలా కలిసి తిరగడం తప్పా?! భలేవారే! మీ ఊరి జ్ఞాపకాలు,... కట్టుబాట్లు వదిలి ఒక్కసారి 'నగరం'లో నాల్రోజులు తిరిగి చూడండి! తెలుస్తుంది" అంటూ బైక్ ని ఓ ప్రక్క పార్క్ చేసి పార్క్ లోపలకు వెళ్ళడానికి ఎంట్రన్స్ టిక్కెట్లు తీసుకున్నాడు ఏకాంబర్.


ఇద్దరూ పార్క్ లో అన్ని మూలలూ తిరిగి తిరిగి ఎక్కడైనా ఏకాంతం దొరుకుతుందేమోనని వెదికి చివరికి స్కేటింగ్ పార్క్ ప్రక్కనే గుబురుగా ఉన్న చోట సిమ్మెంటు బల్ల మీద కూర్చున్నారు.

"మా ఊరు ఎలా ఉంది?" నూకరత్నం మొహంకేసి చూస్తూ అన్నాడు ఏకాంబరం. ఉలిక్కిపడి ఏకాంబరం కేసి చురుగ్గా చూసింది నూకరత్నం.

"ఇది ఊరా?! నన్నెగతాళి చేస్తున్నారా? ఎన్నో వందల ఊర్లు కలిసిన మహా సముద్రంలాంటి నగరం..." తన్మయంగా తన సంతోషం వ్యక్తపరుస్తూ హుషారుగా అంది.

"కదా! ఇది మహా సముద్రం. 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టు ప్రక్కవాళ్ళ గురించి పట్టించుకునేంత ఓపిక, తీరిక లేని జనం. మీరిక రిలాక్స్ డ్ గా కూర్చోండి" బల్లమీద వెనక్కి సర్దుకు కూర్చుంటూ అన్నాడు ఏకాంబర్.

"అలాగే! చెప్పండి! ఎందుకు పిలిచారు?" గోముగా అంది.




"పిలవకూడదా?!" కొంటెగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబరం.

"అలా అనుకుంటే ఇలా రాను కదా!" చురుగ్గా ఏకాంబరం కళ్ళల్లోకి చూస్తూ అంది.

"థేంక్స్!" అన్నాడు ఏకాంబరం.

"ఎందుకు?" అంది నూకరత్నం.

"నా మీద నమ్మకంతో వచ్చినందుకు!" అన్నాడు అతను.

"పరోపకారులు అపకారులు కాలేరు" అంది ఆమె.

"వేమన శతకం బట్టీ పట్టేసారే" నవ్వుతూ అన్నాడు ఏకాంబరం.

"మీరు వేమన అవతారం ఎత్తేసారు కదా!" చిలిపిగా నవ్వుతూ అంది.

ఆమె అలా అనేసరికి ఉలిక్కిపడ్డాడు ఏకాంబరం . తనని తాను ఓసారి ఎగాదిగా చూసుకున్నాడు. గబాలున నిలబడి ఫేంట్ జిప్ ఉందో లేదో చూసుకున్నాడు. బాగానే ఉంది. షర్టు ఫేంటు ఎక్కడన్నా చిరిగిందేమోనని కిస్తా గిస్తా చెక్ చేసుకున్నాడు. ఎక్కడా ఎలాంటి లోపం లేదు.

"అదేంటి రత్నంగారూ! అలా అన్నారేమిటి? కొంపదీసి నా 'అవతారం' అలా లేదు కదా!" తనలో ఎక్కడ తేడా ఉందోనని కంగారుతో బెగిలిపోతూ అన్నాడు ఏకాంబర్.

"మీరు కాదు మీ మనసు. 'పరోపకారాయ ఇదం శరీరం' అని కనిపించిన వాళ్ళందరికీ సహాయపడుతుంటారు కదా! 'వేమన' శతకాన్ని ఒంటబట్టించుకుని ఆ సూత్రాల్ని అమలు చేస్తున్నారుగా!" ఓరగా ఏకాంబరం కళ్ళల్లోకి చూస్తూ అంది నూకరత్నం.

'హమ్మయ్య! బ్రతికించింది' మనసులోనే కుదుటపడ్డాడు ఏకాంబర్.

'అమ్మో! ఈ అమ్మాయి అమాయకురాలు కాదు. తెలివైనది. సమయస్ఫూర్తి కలది' మనసులోనే నూకరత్నాన్ని మెచ్చుకున్నాడు ఏకాంబరం. నూకరత్నంతో మాట్లాడుతుంటే ఆమెలో దాగివున్న సహజసిద్ధమైన తెలివి, తెగింపు, చమత్కారం, సమయస్ఫూర్తి ఒకొక్కటిగా అర్ధమౌతున్నాయి ఏకాంబరానికి.

"ఇంత తెలివైన వారు, తిన్నగా వెళ్ళి బట్టల షాపులో సేల్స్ గర్ల్ గా జాయిన్ అయ్యారెందుకు?" సూటిగా అడిగాడు ఏకాంబర్.

ఉన్నట్టుండి ఏకాంబర్ ఆ ప్రశ్న వేస్తాడని ఊహించలేకపోయింది నూకరత్నం. హెటల్ లో కూడా ఇదే ప్రశ్న అడిగాడు. సమాధానం చెప్పింది. అయినా మళ్ళీ అదే ప్రశ్న. ఇతనికి మతి గాని పోలేదు కదా' మనసులోనే తర్కించుకుంది నూకరత్నం.

"మీరేమంటున్నారో... నాకర్థం కాలేదు" ఏకాంబర్ కేసి చూస్తూ అంది.

"డిగ్రీ చదువుకుని ఇంత చురుకైన మీరు పోయి పోయి ఎదుగు బొదుగు లేని కూపస్థమండూకం లాంటి బట్టల షాపులో 'కొలువు'కు చేరాలంటే నాకు బాధగా ఉంది." అన్నాడు ఏకాంబర్.

"మొన్నే చెప్పాను కదా సార్ మా ఇంటి పరిస్థితి. అవసరం కోసం ఏదో ఒకటి" బాధగా కళ్ళల్లో నీళ్ళు దించుకుంటూ అంది నూకరత్నం.

"ప్లీజ్ ఏడవకండి రత్నం గారూ! ప్లీజ్ మిమ్మల్ని ఇక్కడకు పిలిచింది ఏడిపించడానిక్కాదు... నవ్వించడానికి" భయం... భయంగా ఆమె చేతిని తాకుతూ బుదిరించడానికి ప్రయత్నిస్తూ అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా తాకేసరికి చటుక్కున తల ఎత్తి చూసింది రత్నం.

"మీరు అలా కన్నీళ్లు దించుకుంటూ... ఉంటే... చూసిన వాళ్లెవరైనా నేను మిమ్మల్ని ఏదో చేసేసానని వచ్చి నాలుగు బాదినా బాదేస్తారండీ బాబూ! కనీసం ఏమైందని కూడా అడగరు. ప్లీజ్ ఆపండి బాబోయ్!" నూకరత్నం కళ్ళు తుడవబోయాడు ఏకాంబర్.

"ఆగండి! నా దగ్గర కర్చీఫ్ ఉంది" అంటూ కర్చీఫ్ తీసి కళ్ళు తుడుచుకుంది ఆమె.

"మీకు అభ్యంతరం లేకపోతే నేను నా కస్టమర్ల కోసం 'పాలసీ సర్వీస్ సెంటర్' ప్రారంభిస్తున్నాను. అందులోనే మీరు సొంతంగా నిర్వహించేలా "ఆల్ ఇన్ వన్ సర్వీస్ సెంటర్" స్టార్ట్ చేద్దాం. దానికి మీరే ఓనర్. మీరే క్లీనర్." తన ఆలోచన నూకరత్నానికి చెప్పాడు ఏకాంబర్.

"ఆల్ ఇన్ వన్" సర్వీస్ సెంటర్ అంటే...?! పైగా నేనే ఓనరు... నేనే క్లీనరా...?! నాకర్థం కాలేదాస్సర్!" కళ్ళింత చేసుకుని ఏకాంబర్ కేసి చూస్తూ అంది నూకరత్నం.

"ఏం చేయాలో... ఎలా చేయాలో... నేను చెప్తా కదా! బ్యాంకులకు, ఇన్స్యూరెన్స్ కంపెనీ' లకు మీరు 'కార్పొరేట్ ఏజెంట్' గా చేరతారు. బ్యాంకు రుణాల వాయిదాలు వసూలు చేయడం, అలాగే ఇన్స్యూరెన్స్ కంపెనీల ప్రీమియం వసూలు చేయడం ఇంకా మీరు చేయగలిగితే సెల్ ఫోన్ కంపెనీల కస్టమర్ల సర్వీసు కూడా ఫ్రాంచైజీ తీసుకుందాం!" విడమర్చి చెప్పాడు ఏకాంబర్.

"మొన్నే చెప్పారుగా. దీనివలన మనకేంటి లాభం! నేనే ఓనర్ అది కరెక్ట్. కాని నేనే క్లీనర్ అంటున్నారే?" ఆశ్చర్యంగా అంది నూకరత్నం.

"అయ్యో! అది ఏదో వేళాకోళానికి మాటవరసకి అన్నాను. అయినా, మొదట అన్ని పనులూ మనమే చేసుకోవాలి కదా! షాపు తియ్యడం, మయ్యడం, గచ్చులు తుడవడం వగైరా 'క్లీనర్' జాబ్. అందుకే అలా అన్నాను" నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"సరి సరే. మీకంతా నవ్వులాటగానే ఉంటుంది. పిల్లికి చెలగాటం ఎలుకకి ప్రాణసంకటంలాగా వుంది నా పరిస్థితి" బాధతో అలిగి మొహం తిప్పుకుంటూ అంది నూకరత్నం.

"సారీ! సారీ! సరదాకి అన్నాను" రత్నానికి క్షమాపణలు చెప్తున్నట్లు బుగ్గలమీద కొట్టుకుని చెవులు పట్టుకుని గుంజీలు తీస్తున్నట్టు నటించాడు ఏకాంబర్.

"ఈ వేషాలేం అక్కరలేదు. ఆ సంస్థలన్నింటికీ వాయిదాలు, బిల్లులు, రుణాలు వసూలు చేయడం వల్ల నాకేంటండీ లాభం!?! నేనొక్కదాన్నే అన్ని పనులూ చెయ్యగలనా?!" అమాయకంగా అడిగింది నూకరత్నం.

"మీరొక్కరే కాదు. మీ క్రింద నలుగురైదుగురు కుర్రాళ్ళని కలెక్షన్ బోయ్స్ గా వేసుకుంటాం. వాళ్ళు వసూలు చేస్తారు" చెప్పాడు ఏకాంబర్.

"సరిపోయింది. తినడానికి తిండి లేదు గాని మీసాలకి సంపెంగనూనె కావాలన్నాడట వెనకటికి మీలాంటివాడు. సరైన ఉద్యోగం దొరక్క బట్టల షాపులో చేరితే తిడుతున్నారు మీరే. ఇప్పుడు నేను నా క్రింద నలుగురైదుగురు కలక్షన్ బోయ్ లు! బావుందండీ! తడి తక్కువ తమాషా ఎక్కువలా వుంది. నాకేమొస్తుందో తెలీదు. ఎలా చెయ్యాలో తెలీదు. అసలు ఇంతకీ వాళ్ళంతా 'ఫ్రాంచైజీ'లు నాకిస్తారో

లేదో తెలీదు. నెల జీతాలకి బోయ్ లు. వాళ్ళకి ఎలా చెల్లిస్తామండీ జీతాలు? బావుందండీ భాగోతం" వెటకారంగా నవ్వుతూ అంది ఆమె.

"మీకు 'కమీషన్' వస్తుందండి. మీరు నెలనెలా వసూలు చేసే మొత్తం మీద నెలకి నూటికి పది రూపాయల వరకు కమీషన్ రావచ్చు. కొన్ని కంపెనీలు ఇంకా ఎక్కువ ఇస్తాయి. కొన్ని తక్కువ ఇస్తాయి. సపోజ్! మీరు అన్ని కంపెనీలని కలుపుకుని ఓ ఇరవై లక్షలు వసూలు చేసారనుకోండి. రెండు లక్షల వరకూ రావచ్చు మీ కమీషన్"

"ఆ!..." అంటూ ఆశ్చర్యంతో వెనక్కి పడిపోబోయింది నూకరత్నం. వెంటనే ఆమెని రెండు చేతుల్తో పట్టుకున్నాడు ఏకాంబర్.

"మీరు జోకులు బాగా చెప్తారండి!" తేరుకుంటూ అంది నూకరత్నం.

"నేను వస్తాయనలేదండి. రావచ్చు అన్నాను. మనం బాగా అన్ని 'కంపెనీ'లతో టై అప్ అయి, కుర్రాళ్ళని పెట్టి నెల వాయిదాలు సక్రమంగా సక్సెస్ ఫుల్ గా వసూలు చేస్తే నెలకి ఇరవై లక్షలు చెయ్యగలిగితే అంత కమీషన్ వస్తుందని అంచనా చెప్తున్నాను" అన్నాడు ఏకాంబర్.

"నాయనా! నేను మీకులా పగటి కలలు కనలేను. ఇన్ని వేషాలు వెయ్యలేను. గంతకు తగ్గ బొంత లాగా నామొహానికి ఆ బట్టల షాప్ కరెక్ట్! దయచేసి నాకు రంగుల కలలు చూపించి నన్ను రోడ్డు మీదకి లాగెయ్యకండి! ప్లీజ్" ఏకాంబరానికి రెండు చేతుల్తో దండం పెడుతూ అంది నూకరత్నం.

"నిజమే రత్నంగారూ! మీ ఆవేదన నాకు అర్ధమైంది. తీవ్రమైన మనస్థాపానికి గురైన వారికి ఆత్మ స్థైర్యం దెబ్బ తినడమేకాదు, చుట్టూ గాఢాంధకారమే గోచరిస్తుంది కాదనను. ఒక్కమాట! ఒకప్పుడు మీకులాగే నేనూ 'ఏం చేయగలననుకునేవాడ్ని. నేను చదివిన అట్టెసరు చదువుకి పనే దొరకదు అనుకునేవాడ్ని. మా ఇంట్లో కూడా నన్ను ఓ పురుగును చూసినట్టు చూసేవారు. నిజంగా... నాకు నేనే గడిచిన గతాన్ని నెమరు వేసుకూంటుంటే ఆశ్చర్యం కలుగుతుంది" తీవ్రమైన ఆందోళనతో ఆత్మ స్థైర్యం కోల్పోయి విచారవదనంతో తల దించుకున్న నూకరత్నం కేసి చూస్తూ లాలనగా అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ చెప్తున్న విషయం వింటూనే దిగ్గున తల ఎత్తి ఆశ్చర్యంగా అతని కళ్ళలోకి చూసింది నూకరత్నం.

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ గడిపే ఏకాంబర్ కళ్ళల్లో కన్నీటి తెర లీలగా కదలడం గమనించిన నూకరత్నం మరింత అబ్బురంగా చూస్తూ గబాలున ఏకాంబర్ చెయ్యి పట్టుకుని అభిమానంగా అంది.

"ఏయ్! అంబర్ సాబ్! క్యాకరో! మీ కళ్ళల్లో కన్నీళ్ళు కనిపిస్తున్నాయి. ఆనందమా?! ఆవేదనా?!" ఏకాంబరాన్ని నవ్వించడానికి ప్రయత్నిస్తూ అంది నూకరత్నం.

"ఛ! ఛ! ఆవేదనెందుకు? ఆనందభాష్పాలే! ఛీత్కారాలు పొందిన చోటే సత్కారాలు అందుకుంటున్నాను. తలచుకుంటేనే అంతా గమ్మత్తుగా అనిపిస్తోంది" చిన్నగా నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"ఆ గమ్మత్తేదో నాకూ చూపించరా! ప్లీజ్! ప్లీజ్!" ఏకాంబరాన్ని మామూలు మూడ్ లోకి రప్పించాలని అల్లరిగా అంది నూకరత్నం.

చిన్నగా నవ్వుతూ తనని పట్టి కుదుపుతూ తన గతాన్ని... దాని గమ్మత్తుని చెప్పమని అడుగుతున్న నూకరత్నం కళ్ళల్లోకి సూటిగా చూసాడు ఏకాంబరం. ఆ కళ్ళల్లో ఏదో తెలియని అనిర్వచనీయమైన ఆకర్షణ... ఆదరణ... ఆప్యాయత... ఇంకా... ఏదో... మరేదో తెలీని 'వశీకరణజాలం' ఏకాంబరాన్ని వశపరచుకుంటోంది.

ఆత్మనూన్యతతో బాధపడుతున్న 'నూకరత్నాన్ని' కార్యోన్ముఖురాలిని చేసి తన మార్గంలో పయనించేలా చేయాలంటే తన అనుభవాలు... అపచారాలు... అవమానాలు... అన్నీ విడమర్చి చెప్పాలి. మనిషి తలచుకుంటే దేన్నైనా సాధించగలడనే నమ్మకాన్ని రగిలించాలి. ఆమెలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించాలి' మనసులోనే అనుకున్నాడు ఏకాంబర్. మౌనంగా తల దించుకుని అయిదేళ్ళ క్రితం తాను ఎలా ఉండేవాడో వెనక్కి తిరిగి చూసుకున్నాడు.

అల్లరి చిల్లరగా ఆకతాయిగా... ఆటా పాటా తప్ప చదువూ సంధ్యలు అబ్బని మొద్దబ్బాయిగా... ఇంట్లోనూ వీధిలోనూ ఎందుకూ కొరగాని గడుగ్గాయిగా... ఊరంతా తననో 'వూక'లా వూదేసినప్పుడు... ఇంట్లో అమ్మనాన్న అన్నలు కూడా తననో 'డస్ట్ బిన్'లా చూసినప్పుడు... ఆ రోజుల్లో... ఆ క్షణాల్లో... గతం బ్లాక్ అండ్ వైట్ సినిమాలా కనిపించేసరికి ఏకాంబర్ కళ్ళల్లో ఒక్కసారే జలపాతంలా నీళ్ళూరాయి. టపటపా కన్నీటి బొట్లు రాలి క్రింద పడుతూంటే చూసిన నూకరత్నం చటుక్కున ఏకాంబర్ భుజం మీద చెయ్యి వెయ్యబోయింది. సున్నితంగా ఆమె చేతిని అడ్డుకుంటూ చెప్పడం ప్రారంభించాడు ఏకాంబర్.

ఆ రోజు - డోలా పౌర్ణమి.

అసలే స్థిరవారం. దానికి తోడు డోలా పౌర్ణమి. సింహాచలం సింహాద్రి అప్పన్నను దర్శించుకోవడానికి ఉత్తరాంధ్రా ప్రాంతాలనుండి గ్రామాలు గ్రామాలు మూకుమ్మడిగా తరలి వచ్చేసాయా అన్నట్టు

యాత్రీకులు కుమ్మేసారు. లక్షల్లో వచ్చిన భక్తులు క్రింద వూరంతా ఆక్రమించేసారు. సింహాచలం వూర్లో తోటల్లోనూ, పొలాల్లోనూ, ఎక్కడ ఖాళీగా వుంటే అక్కడ బస చేసి వంటలు వండుకుంటున్నారు. చాలామంది ఎడ్ల బళ్ళలో వచ్చారు. తోటల్లో చెట్ల కింద మకాం వేసారు.

శుక్రవారం రాత్రి నుండి భక్తుల రాక ప్రారంభమయింది. గుంపులు గుంపులుగా భక్తులు దర్శనానికి వస్తున్నారు. ఒకో గుంపులో చిన్నా, పెద్దా, ముసలి, ముతకా, ఆడామగా అంతా కలిసి రెండొందల నుండి మూడొందల మంది కూడా ఉన్నారు. చిన్న చిన్న గుంపుల్లో కూడా పాతిక ముప్పై మందికి తగ్గి లేరు.

డోలా పౌర్ణమి అంటే 'సింహాద్రి అప్పన్న' తీర్థ మహోత్సవాల్లో ముఖ్యమైనది. ఏడాదికోమారు జరిగే చందనోత్సవం తర్వాత అంత రద్దీ డోలా పౌర్ణమి రోజే ఉంటుంది. అదే రోజు అప్పన్నకి బొట్టినడిగే రోజు. స్వామి కళ్యాణోత్సవానికి ముందు సోదరి పైడి తల్లమ్మని కలిసి 'బొట్టిని' అడిగే తంతు నిర్వహిస్తారు. ఆ సందర్భంగా ఉద్యానమంటపంలో పానకం పంచుతారు. ఆ తర్వాత నెలలోనే కళ్యాణోత్సవం నిర్వహిస్తారు.

యాత్రకు వచ్చిన యాత్రీకులంతా పల్లెటూర్లనుండి వచ్చిన వాళ్ళే. తమ ఇలవేల్పయిన సింహాద్రి అప్పన్నకి ఏడాది పొడవునా ఇళ్ళల్లోనే పూజలు జరిపి మొక్కుకున్న మొక్కులు, కట్టుకున్న 'ముడుపులు' తీసుకువచ్చి అప్పన్న హుండీలో వేస్తారు. ఇదే తరుణంగా భావించి ఎంతోమంది తమ ఇలవేల్పుకి 'తలనీలాలు' కూడా సమర్పించుకుని భక్తిని చాటుకుంటారు.

ఒకో గ్రామంలో అయితే వూరంతా ఒకే మాటపై ఇంటికి ఇంతా అని కొంత మొత్తం ఎత్తుకుని గ్రామ పెద్దల నేతృత్వంలో అందరూ ఒకే కుటుంబంగా కలిసి దేవుడి దర్శనానికి వస్తూంటారు.

శుక్రవారం రాత్రే ఎక్కువమంది వచ్చి ఆ రాత్రి సింహాచలం పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడ 'బిచాణాలు' పరుచుకుని వంట వార్పూ చేసుకుని భోజనాలు చేసి పడుకుంటారు. అర్థరాత్రి పన్నెండు గంటలు దాటగానే నిద్రలేచి దేవుడి దర్శనానికి బయలుదేరుతారు. ముందుగా దేవుడి కోనేరులో స్నానమాచరించి గాని కొండ పైకి బయలుదేరరు.


కొండ దిగువనే ఉన్న 'వరాహ పుష్కరిణి'కి (దేవుడి కోనేరు) వెళ్ళి తలారా స్నానాలు చేసి కాలి నడకనే మెట్ల మార్గంలో నడుచుకుంటూ కొండ పైకి చేరుకుంటారు. నడవలేని ముసలివాళ్లు సైతం ఓపిగ్గా మెట్లెక్కడానికి ఇష్టపడతారు.

మెట్ల మార్గంలో ఉన్న పన్నెండు దారల్లో మునుగుతూ తడిబట్టలతోనే అంత చలిలోనూ 'గోవిందా గోవింద' అని గొంతెత్తి స్వామివారిని స్మరించుకుంటూ భక్తి పారవశ్యంతో కొండపైకి చేరుకుంటారు.

మెట్ల మార్గం మధ్యలో ఉన్న 'ఆంజనేయస్వామి' ని దర్శించుకుంటారు.

ఆ రోజు -

విశాఖపట్నంలో ఉన్న పోలీసు బెటాలియనంతా సింహాచలంలోనే మకాం వేసింది. యాత్రీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గస్తీకి వస్తారు. వూర్లో వున్న లాడ్జీలు, సత్రాలు అన్నీ నిండిపోయి ఇంకా చాలక వూర్లో వున్న తోటలు, పొలాల్లో సైతం భక్తులు 'బిచాణాలు' పరుచుకుని ఆ రాత్రి కాలక్షేపం చేసేస్తారు. సింహాచలం పుణ్యక్షేత్రానికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి ఎడ్లబండ్ల మీద వచ్చిన భక్తులు తమతోపాటు దేవునికి సమర్పించడానికి కోడి దూడలను తీసుకువచ్చి దేవాలయానికి అప్పగిస్తుంటారు.




కొందరు భక్తులు సింహాచలానికి మూడు కిలోమీటర్ల దూరంలో వున్న 'భైరవస్వామి' ని దర్శించుకోవడానికి భైరవవాక వెళ్లారు. 'సింహాద్రి అప్పన్న' ఆలయాన్ని పరిరక్షించే దేవతల్లో 'కాలభైరవస్వామి' ఒకరు.

అదే రోజు - అర్ధరాత్రి -

సింహాచలంలోనే మారుమూల ఉన్న విజినిగిరిపాలెం, సింహాచలానికి ఉత్తరాన కూతవేటు దూరంలో వుంది. మూడొందల గడపలు ఉన్న చిన్న గ్రామం. సింహాచలం పుణ్యక్షేత్రం చేరువలో ఉన్నందునే వేరే గ్రామంగా ఎవరూ తలచరు. సింహాచలంలో భాగంగా మారిపోయిందా పాలెం. ఊరు ఊరంతా నిద్రావస్థలో వుంది.

ఊర్లో అందరూ వ్యవసాయదారులు. ఇప్పుడిప్పుడే యువత అంతా చదువుల పేరుతో, ఉద్యోగాలు, ఇతర ఉపాధి వెదుక్కుంటూ నగరాన్ని చేరుకుంటున్నారు. రోజూ ఉదయాన్నే 'నగరం' చేరి తమ వ్యాపారాలు, ఉద్యోగాలు, వృత్తులు నిర్వహించుకుని ఏ రాత్రికో అపరాత్రికో ఇల్లు చేరుకుంటారు.

సరిగ్గా మూడుగంటలు కావస్తోంది. ఎక్కడినుండో కోడికూతలు... కొక్కొరొకో..." అంటూ ఉండుండీ ఊర్ని నిద్ర లేపుతున్నాయి.

ఆ ఊర్లో ఓ మోస్తారుగా వున్న ఇంటిముందు నిలబడి ఇద్దరు కుర్రాళ్ళు అరుస్తున్నారు. తమ 'అరుపు' ఎవరికీ వినపడకూడదన్నట్టు లోగొంతులో అరుస్తూ లోపల ఉన్న వ్యక్తిని పిలుస్తున్నారు.

"ఏకాంబర్... ఒరేయ్ ఏకాంబర్" గొంతు పెగల్చి అరవాలన్నా గట్టిగా అరిస్తే వూరువూరంతా ఉలిక్కిపడి లేస్తుందన్న భయంతో చాలా గమ్మత్తుగా అరుస్తూ పిలుస్తున్నారు వాళ్లు.

ఇంతలో ఆ ఇంటి ప్రధాన ద్వారం నెమ్మదిగా తెరుచుకుంది ఓ ఆకారం అడుగులో అడుగు వేసుకుంటూ బయటకు వచ్చింది. చీకట్లోనే తడుముకుంటూ ఒంగి ఒంగి పాక్కుంటూ వస్తోందా ఆకారం.

చీకటిగా వుందా ప్రాంతం అంతా. ఆ చీకట్లోనే తడుముకుంటూ ఎలుగుబంటిలా ఉన్న ఓ నల్లటి ఆకారం తమ వైపే నెమ్మదిగా వస్తుంటే అరుస్తున్న కుర్రాళ్ళు క్షణం భయంతో జడుసుకుని కర్రల్లా బిగుసుకుపోయారు.

"అరేయ్! ఆ వస్తోన్న ఆకారం మన ఏకాంబర్ గాడేనా లేదా...?!" ప్రక్కవాడి చెవిలో భయంగా అన్నాడొకడు.

"ఏమోరా! వాడైతే చీపురుపుల్లలా పొడుగ్గా కొరివిదెయ్యంలా ఉంటాడు కదరా! ఇదెవర్రా! పొట్టిగా...

చీకట్లోనే దొర్లుకొస్తున్న గుండ్రాయిలా కనిపిస్తోంది ఎవరో...?" ఆ కుర్రాడు కూడా మొదటి కుర్రాడ్ని గట్టిగా పట్టుకుంటూ భయంగా అన్నాడు.

ఇంతలో ఆ ఆకారం వాళ్ళకు అతి సమీపంలో వచ్చేసింది. ఆ కుర్రాళ్ళు ఇద్దరూ నెమ్మది నెమ్మదిగా... భయం... భయంగా... "ఒ..రే..య్... ఏకాంబర్... ఏకాం.. బర్..!" అని నీళ్ళు నములుతున్నట్టు అంటూ గజగజ వణికిపోతూ పారిపోవడానికి కాళ్ళు కదలకపోయేసరికి బిక్క మొహం వేసుకుని చూస్తూండిపోయారు.

"ఎందుకురా! అలా అరుస్తారు. ఇంకో అరగంటలో నేనే వచ్చేవాడ్ని కదా! మీరెందుకు వచ్చారు" ఆ ఆకారం వాళ్ళ దగ్గరకు చేరుకుని అంది.

"ఒరేయ్. ఏకాంబర్ నువ్వేనా! ఏదో అనుకుని జడుసుకు చచ్చేం కదరా!" అన్నారిద్దరూ ఒక్కసారే.

ఆ ఇద్దరూ ఎదురుగా నల్లటి రగ్గు కప్పుకుని బుట్టలా ఒంగిపోయి నడిచి వచ్చిన ఏకాంబరాన్ని చూసి ఉలిక్కిపడ్డారు.

"ఇంట్లో అందరూ ఆదమరచి నిద్రపోతున్నారు కదరా! మీరిలా అరిస్తే లేచిపోరా?!" వాళ్ళిద్దరితో గుసగుసగా అంటూ "పదండి! పదండి!" అంటూ వాళ్ళిద్దరి భుజాల మీద చేతులు వేసాడు ఏకాంబర్ నిటారుగా నిలబడి.

నిటారుగా నిలబడి ఏకాంబర్ అలా వాళ్ళ భుజాల మీద చేతులు వేసేసరికి ఇద్దరూ ఒక్కసారే ఏకాంబర్ కేసి తల ఎత్తి చూసారు.

ఏపుగా ఉన్న కరెంటు స్తంభంలా కనిపించాడు. వాళ్ళిద్దరూ ఏకాంబర్ ప్రక్కన చిన్న సైజు టెలిఫోన్ స్తంభాల్లా కనిపిస్తున్నారు. ఏకాంబర్ చంకలోకి రాలేదు ఇద్దరూ.

"ఏకాంబర్ గాడు పక్కనుంటే చెట్టు ఎక్కక్కరలేకుండా మామిడి కాయలు కొసెయ్యవచ్చు" అనుకున్నారిద్దరూ మనసులోనే.

"రండిరా! మొన్నే చెప్పారు కదరా! చెరువుగట్టు దగ్గరకు రావాలని. ఈ రోజు శనివారం కదా! అదీ డోలా పౌర్ణమి" గబగబా నడుస్తూ అన్నాడొక కుర్రాడు.

"నేనే వస్తాను కదా! మీరెందుకొచ్చారు?" నడుస్తూ అన్నాడు ఏకాంబర్.

"అవును! మూడైనా నువ్వు రాలేదు. అక్కడ యాత్ర చూస్తేనా..." ఆ ఇద్దర్లో ఒకడన్నాడు.

"అవున్రా! ఏకాంబర్! ఈ రోజు మనందరి పంట పండిపోద్ది తెలుసా!" ఆనందంగా అన్నాడు రెండోవాడు.

అదే సమయంలో -

దూరంగా... ఎవరెస్టు శిఖరంలా కనిపిస్తున్న కొండ మీద 'మిణుగురు' పురుగుల్లా వెలుగులు జరజరా ప్రాకుతున్నట్లు కనిపిస్తున్నాయి. సింహగిరి శిఖరం చివరి మలుపులో ఉన్న శంఖచక్రాలు, నామాలు విద్యుత్ కాంతులతో ధగధగా మెరిసిపోతున్నాయి.

సింహగిరి శిఖరం పైన కట్టిన 'టీవీ టవర్' పైనున్న ఎర్రలైటు దేవాలయమంతా పహారా కాస్తున్నట్టూ గిర్రున తిరుగుతూ వెలుగుతోంది. ఆ వెలుగు కొండ దిగువకు స్పష్టంగా కనిపిస్తోంది.

ఇంతలో కొండమీద నుండి గాల్లో తేలుతూ సింహాద్రి అప్పన్న సుప్రభాతం శ్రావ్యంగా ప్రారంభమయింది.

"అదిగోరా! అప్పుడే గుడి కూడా తెరిచేసారు. కొండ బస్సులు కూడా యాత్రీకుల్ని కొండకు తీసుకుపోతున్నాయి. అదిగో చూడు" మొదటి వాడు ఏకాంబరానికి చూపిస్తూ అన్నాడు.

"అవునవునురా! పదండి! మనవాళ్లు అక్కడ మనకోసం ఎదురు చూస్తూంటారు" అంటూ వడివడిగా నడిచాడు ఏకాంబర్.

సింహాచలానికి ఉత్తరాన ఉంది విజినిగిరిపాలెం. ఈరెండు ఊర్ల మధ్య రహదారిలోనే వుంది వరాహపుష్కరిణి. వూర్లోవాళ్ళు చెరువు అంటారు... భక్తులు కోనేరు అంటారు. అయితే, ఆ కోనేరు పేరు వరాహపుష్కరిణి.

పాలెం నుండి అరమైలు దూరంలోనే ఉంది దేవుడి కోనేరు.

ముగ్గురూ మాట్లాడుకుంటూ చెరువు గట్టు దగ్గరకు చేరుకున్నారు.

అక్కడంతా కన్నుల పండుగలా ఉంది. 'వరాహ పుష్కరిణి' ఘాట్ దగ్గర వందలమంది యాత్రీకులు స్నానాలు చేస్తున్నారు. చెరువుకు నైరుతీ మూలన ప్రవేశ ద్వారం ఉంది. పెద్దగేటు. అందులో నుండే పుష్కరిణీ గట్టుకు చేరుకోవాలి.

పుష్కరిణిలోకి దిగడానికి మెట్లు ఉన్నాయి. అర్ధచంద్రాకారంలో చుట్టూరా మెట్లు కట్టారు. ఆ మెట్ల మీద నిలబడి భక్తులు స్నానాలు చేస్తున్నారు. స్త్రీలు స్నానాలు చేసి తడి వస్త్రాలు మార్చుకోవడానికి ఓ మూల వరుసగా గదులు కట్టి ఉన్నాయి. అయితే, ఎక్కువమంది భక్తులకు అవి చాలక రద్దీగా ఉండడంతో ఆడవాళ్ళంతా అక్కడక్కడే నానా యాతనా పడుతూ బెరుగ్గానే పాపం చీరలు మార్చుకుంటున్నారు. ఎవరైనా మగాళ్ళు గమనిస్తారని సిగ్గు పడ్డా చేసేది లేక చాలామంది స్త్రీలు అలాగే చీరలు మార్చుకుంటున్నారు. వయసులో ఉన్న అమ్మాయిలు మాత్రం ఆ గదుల దగ్గరకు వెళ్తున్నారు. ఆలస్యమైనా అక్కడే ఎలాగో చీరలు మార్చుకుని వస్తున్నారు.

పాలెంనుండి మిత్రులు ముగ్గురూ అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న కుర్రాళ్లు 'ఏకాంబర్'ని చూస్తూనే 'ఏందన్నా! నువ్వే ఇంత ఆలస్యంగా వస్తే ఎలా' అంటూ ఏకాంబర్ ని ఓ మూల కూర్చోమని చెప్పారు.

ఏకాంబర్ ని పిలవడానికి వచ్చిన కుర్రాళ్ళు కూడా తమ ఒంటి మీద వున్న బట్టలు విప్పేసి ఓ మూల గుట్టగా ఉన్న బట్టల మీద పడేసారు. ఆ ప్రక్కనున్న బండ మీద కూర్చున్నాడు ఏకాంబర్.

ఆ కుర్రాళ్ళంతా చెరువులో దిగి ఈత కొడుతూ భక్తులు నీళ్ళల్లో విసిరిన డబ్బులు ఏరుకుని ఒడ్డుకు వచ్చి ఏకాంబర్ చేతికి ఇస్తున్నారు.

భక్తులు స్నానాలు ముగించి చెరువు మధ్యలో ఉన్న 'రాతి మండపం' కేసి చూస్తూ దండాలు పెట్టుకుని పళ్ళు, చిల్లర డబ్బులు నీట్లోకి విసురుతున్నారు. ఎవరి స్థోమతకు తగ్గట్టు వాళ్లు చెరువులోకి దిగి దండం పెట్టుకుంటూ రెండు చేతుల్తో అరటిపండ్లు, చిల్లర నాణేలు విసురుతూ వెనక్కి తిరిగి వచ్చేస్తున్నారు. ఆ రాతిమండపంలో దేవుడు దేవేరులతో వివాహానికి వచ్చినప్పుడు సేదతీరుతాడు. ఆ రోజే తెప్పోత్సవం పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు.

ఏకాంబర్, అతని మిత్రులు ప్రతి 'శనివారం' ఇలా తెల్లారగట్లే చెరువుకు రావడం భక్తులు విసిరేసిన 'నాణేలు' మిగతా మిత్రులు ఏరి తీసుకువస్తే 'ఏకాంబర్' దగ్గర భద్రపరచడం అలవాటు. ఎందుకంటే ఏకాంబరానికి ఈత రాదు.

కోనేట్లో అందరితో పాటు ఎప్పుడన్నా స్నానం చేసినా మెట్ల మీద నిలబడి మునిగి బయటకు వచ్చేస్తాడు.

కోనేటినిండా తామరపూలు ఎక్కువ. చెరువు మధ్యలో ఉన్న రాతి మండపం చుట్టూ తామరాకులు, తామర పూవులతోనే నీరంతా నిండి ఉంది. ఆ పుష్కరిణిలో నేలబావులు ఎన్నో ఉన్నాయి. తామరాకుల వలన చెరువంతా నాచు పట్టి ఉంది. అందుకే ప్రవేశద్వారం దగ్గర మాత్రమే ప్రమాదం లేని చోట 'ఘాట్' ఏర్పాటు చేసారు దేవస్థానం అధికారులు.

'వరాహ పుష్కరిణి' ఘాట్ దగ్గర నీరు స్వచ్ఛంగా కనిపిస్తుంది. భక్తులు స్నానాలు చేసే ప్రాంతం అంతా బాగానే ఉంది. మిగతా ప్రాంతం అంతా తామరాకులు, తామరపూవులతో నిండిపోయింది.

తెల్లవార్లూ చెరువు దగ్గర ఉన్న ఏకాంబర్ మిగతా భక్తులు రద్దీ తగ్గేక అక్కడే ప్రక్కనున్న వేపచెట్టు పుల్లలు విరిచి పళ్ళు తోముకున్నారు. అతనితో ఉన్న మిగతా మిత్రులు యాత్రీకుల రాక తగ్గిపోగానే ఏకాంబర్ దగ్గర పోగైన డబ్బులు లెక్క కట్టి తమతో సమానంగా ఏకాంబరానికి కూడా వాటా క్రింద ఏభై రూపాయలు ఇచ్చారు.

స్కూలుకెళ్ళాలని ఏకాంబర్ ఆ పిల్లల్ని అక్కడే వదిలేసి ఇంటి ముఖం పట్టాడు. ఆ కుర్రాళ్ళు దుంపలబడిలో చదువుతున్న కుర్రాళ్ళు. వాళ్ళు ఉండేది కూడా చెరువుగట్టు ప్రక్కనే కనుక ఏకాంబరాన్ని పంపేసి తాము అక్కడే కబుర్లాడుకుంటూ ఉండిపోయారు.

ఏకాంబర్ చెరువులో స్నానం చేసి ఇంటికి చేరేసరికి వీధిలోనే కుర్చీ వేసుక్కూర్చున్న 'పీతాంబరం' పెద్ద కర్ర పట్టుకుని కొడుకు వీపు మీద నాలుగు బాదాడు.

"నాన్నా! చెరువుకి స్నానానికి వెళ్ళానన్నా నాన్నా!" అంటూ తండ్రి పీతాంబరానికి దొరక్కుండా పరిగెత్తాడు ఏకాంబర్.

అప్పటికే శుచిగా తయారయి స్కూలుకు బయలుదేరుతున్న ఏకాంబర్ అన్న నీలాంబర్ తండ్రికి సహాయంగా నిలబడి ఏకాంబరాన్ని పట్టుకున్నాడు.

"వెధవా! పోరంబోకు వెదవల్తో తిరిగి ఇప్పుడా ఇల్లు చేరేది? ఎన్నిసార్లు చెప్పాన్రా! చెరువు గట్టుకు ఆ వెధవల్తో కూడి వెళ్లొద్దని అర్థరాత్రి... అందరూ లేవకముందే వెళ్ళి ఇదా రావడం" అంటూ ఏకాంబరాన్ని ప్రక్కనే స్తంభానికి కట్టి కర్రతో దబదబా బాదేసాడు పీతాంబరం.

"చంపేస్తారా! ఏదో తెలీక వెళ్ళాడు. అంతమాత్రానికే ఇంతలా దొంగని బాదినట్టు బాదాలా?" అంటూ ఏకాంబరానికి అడ్డుగా నిలబడి కట్లు విప్పేసింది ఏకాంబర్ తల్లి పర్వతాలు.

"వెధవ పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. వీధిబడిలో ఆరో తరగతి, ఏడో తరగతి చదివే ఆ గుంట వెధవలతో స్నేహం చెయ్యద్దురా అంటే వింటున్నాడా! ఎద్దులా ఎదిగాడు. వీడికంటే చిన్న పిల్ల నయం. అప్పుడే వీడ్ని దాటి కాలేజీకి వెళ్ళిపోయింది. వీడింకా పదో తరగతి మూడోసారి చదువుతున్నాడు." చేతిలో కర్ర విసురుగా నేలకేసి కొట్టి రుసరుసా ఇంట్లోకి వెళ్లిపోయాడు ఏకాంబర్ తండ్రి పీతాంబరం.

"ఏరా నాన్నా! నాన్న కోప్పడేది నిజమే కదా! చదువుకోకుండా ఈ తిరుగుళ్ళేమిట్రా!" అంటూ ఏకాంబరాన్ని బెదిరించింది పర్వతాలు.

ఏకాంబర్ మారుమాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళి స్కూలు బట్టలు మార్చుకుని బ్యాగ్ భుజాన తగిలించుకుని జేబులో ఉన్న చిల్లర తల్లి చేతికిచ్చాడు ఏకాంబర్.

"తప్పు నాన్నా! ఈ చిల్లర కోసం వాళ్ళతో వెళితే నిన్ను చిల్లర వెధవని అంటారు. వెళ్ళు. వెళ్ళి బుద్ధిగా చదువుకో" అంటూ ఏకాంబర్ తల్లి తనకి ఏకాంబర్ ఇచ్చిన ఏభై రూపాయల్లో అయిదు రూపాయలు ఏకాంబర్ చేతికి ఇచ్చింది.

అప్పటికే ఏకాంబర్ అన్న నీలాంబర్ కాలేజీకి వెళ్ళిపోయాడు. అన్నతోపాటు ఏకాంబర్ చెల్లి కూడా కాలేజీలోనే చదువుతోంది. వాళ్ళిద్దరూ గోపాలపట్నం వెళ్ళాలి. ఏకాంబర్ మాత్రం సింహాచలంలోనే ఉన్న హైస్కూల్లో చదువుతున్నాడు.

ఆ ఏడాది ఎట్టకేలకు పదవతరగతి పాసయ్యాడు ఏకాంబర్. తల్లి ఎంతగానో పొంగిపోయింది. కాలేజీలో సీటు ఎక్కడా దొరకలేదు. ఏకాంబర్ సాధించిన అత్తెసరు మార్కులకి పేరున్న  కాలేజీల్లో సీటు దొరకడం కష్టమయింది.

గోపాలపట్నంలో ఉన్న ప్రైవేటు కాలేజీలో జాయిన్ అయ్యాడు ఏకాంబర్. అన్నా, చెల్లి ఇద్దరూ మరో కాలేజీలో చదువుతున్నారు. వాళ్ళది కార్పొరేట్ కాలేజి.

తండ్రి పీతాంబరం తన డిపార్ట్ మెంటల్ స్టోర్ కు వెళ్ళేముందు ఏకాంబరాన్ని తీసుకుని వెళ్లి కాలేజీలో దించి తన షాపుకి వెళ్ళిపోతాడు. పీతాంబరం కూడా వ్యాపారం బాగా సాగుతుందని గోపాలపట్నంలోనే షాపు తెరిచాడు.

రాత్రి అయ్యేసరికి అందరూ ఇల్లు చేరుకుంటారు.

నగరానికి దూరంగా ఉన్నా ఉన్న ఊరు కన్న తల్లి ఒక్కటంటారు. విజినిగిరిపాలెం నుండి రోజూ కాలినడకన సింహాచలం వెళ్లి అక్కడనుండి ఎవరి పనుల మీద వాళ్ళు వెళ్ళడం కొంచెం కష్టంగా ఉందని పీతాంబరమే పెళ్ళాన్ని ఒప్పించి సింహాచలంలో మంచి ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. అదీ ఏకాంబరం కాలేజీలో చేరాక. తండ్రి పిల్లలు నలుగురూ సింహాచలం దాటి వెళ్లాలని పాలెం నుండి రావడం కష్టమని చెప్పి పెళ్ళాన్ని ఒప్పించాడు పీతాంబరం.


ఎంత అపరాత్రి వచ్చినా సింహాచలం లో బస్సు సౌకర్యానికి ఇబ్బంది లేదు. రాత్రీ పగలూ బస్సులు తిరుగుతాయి. పుణ్యక్షేత్రం కావడం వలన నిత్యం సింహాచలం నిత్యనూతనంగానే ఉంటుంది.

***

ఇంటర్ లో జాయిన్ అయిన ఏకాంబర్ కూడా రోజూ కాలేజీ ఉన్నా లేకపోయినా ఉదయాన్నే తల్లి చేతికందించిన కేరియర్ పట్టుకుని బయలుదేరుతున్నాడు. తండ్రి పీతాంబరం తనతో దగ్గరుండి తీసుకువెళ్ళి ఏకాంబరాన్ని కాలేజీ దగ్గర దించేసి షాపు తెరవడానికి వెళ్ళిపోతున్నాడు.

కాలేజీలో జాయిన్ అయిన నెల్లోనే స్టూడెంట్ పాస్ తీసుకుని ఆర్టీసీ బస్సులో ప్రయాణం మొదలుపెట్టాడు ఏకాంబర్. ఉదయం అయితే తండ్రితో వెళ్ళగలిగినా తిరుగు ప్రయాణంలో తండ్రి షాపు కట్టేసే వరకూ అక్కడ ఉండడం ఏకాంబరానికి ఇష్టం లేదు. అందుకే తండ్రితో వాదించి బస్ పాస్ తీసుకున్నాడు.

ఏకాంబరానికి బస్సులోనే పరిచయమయ్యారు ఎంతోమంది. బస్సు కోసం బస్ స్టాండ్ లో ఎదురుచూస్తూ నిలబడి ఉన్నప్పుడు ఏకాంబర్ లాగే నగరంలో నలుమూలలా ఉన్న కాలేజీలకు వెళ్ళాల్సిన ఆ ఊరి విద్యార్థులు మాటా మాటా కలిపి ఏకాంబరానికి మిత్రులయ్యారు. అందులో నలుగురు మాత్రం బాగా సన్నిహితులయిపోయారు.




వాళ్ళంతా రకరకాల కాలేజీల్లో చదువుతున్నవాళ్ళు. ఒకే వయసువాళ్ళు కావడం వలన తొందరగానే 'ఏరా... పోరా' అనుకునేంత జిగిరీ దోస్తులు అయిపోయారు. అయితే, వాళ్ళంతా ఏకాంబర్ తో దుంపలబడిలో చదివినవాళ్ళే! ఇప్పుడు కలుసుకున్నాక చిన్నప్పటి జ్ఞాపకాలు నెమరవేసుకుని ఒకటయ్యారు.

రోజూ బస్ స్టాండ్ కి ఎవరు ముందొచ్చినా మిగతా నలుగురి కోసం ఎదురు చూసే స్థాయికి ప్రాణ మిత్రులయిపోయారు. ఏకాంబరే అందరికంటే ముందుగా బస్సు దిగిపోతాడు. మిగతా నలుగురూ విశాఖపట్నంలో తలో దిక్కులో ఉన్న తమ తమ కాలేజీలకి వెళ్ళిపోతారు.

అనిల్ బుల్లయ్య కాలేజీలోనూ, రామకృష్ణ పూర్ణామార్కెట్ దగ్గరున్న ఏ.వి.యన్ కాలేజీలోనూ, శంకరరావు కాంప్లెక్స్ దగ్గరున్న బి.వి.కె. కాలేజీలోనూ, ఆచారి ఇసుకతోట దగ్గరున్న కృష్ణా కాలేజీలోనూ చదువుతున్నారు. ఈ అయిదుగురిలో అనిల్ ఒక్కడే డిగ్రీ చదువుతున్నాడు. మిగతావాళ్ళు ముగ్గురూ ఇంటర్ రెండో సంవత్సరంలో ఉన్నారు. ఏకాంబర్ ఒక్కడే మొదటి ఏడాదిలో జాయిన్ అయ్యాడు.

ఏకాంబరానికి కూడా అనిల్ ని చూడగానే నల్ల బెల్లం దిమ్మలాగా లావుగా, నల్లగా కనిపించగానే చిన్నతనంలో రోజూ తనకి బిళ్ళలో, బిస్కట్లో తెచ్చి ఇచ్చే అనిల్ గాడు గుర్తొచ్చాడు. వాడేనా వీడు అనుకుంటూ సిగ్గుతో తల దించుకున్నాడు. వాడే వీడని తెలిసి మురిసిపోతూ బలంగా వాటేసుకున్నాడు ఏకాంబర్.

"ఏరా! అయిదు వరకూ నాతోనే కదా చదివావ్! ఇప్పుడు ఇంకా ఇంటర్ లోనే ఉన్నా వేంట్రా" మొదట్లో చనువుగా 'ఒరేయ్' అని సంబోధించింది అనిలే.

"మా బాబేరా! మార్కులు సరిగ్గా రావటం లేదని పదో తరగతి మూడుసార్లు పరీక్షలు రాయించాడు. లేకపోతే నీతోనే డిగ్రీలో ఉండేవాడిని" అని తెలివిగా నెపం తండ్రి మీదకు నెట్టేసాడు ఏకాంబర్.

"పోరా! నీ పోకిరీ కబుర్లు ఇంకా పోలేదు" అంటూ అనిల్ రివటలా ఉన్న ఏకాంబరాన్ని ఒక్క తోపు తోసాడు. ఆ వూపుకి ఎటో వెళ్ళి పడబోతూ నిలదొక్కుకుని పకపకా నవ్వేసాడు.

ఆ తర్వాత ఆ ప్రస్తావనే మర్చిపోయారు మిత్రులిద్దరూ.

ఆదివారం వస్తే చాలు అయిదుగురూ రామకృష్ణా బీచ్ కో, భీమిలి బీచ్ కో, ఏరాడ కొండకో, సముద్రం ఒడ్డున ఉన్న ఎర్రమట్టి దిబ్బ దగ్గరకో షికారుకు వెళ్లిపోయేవారు.

సెలవు దొరికితే చాలు సందడంతా వాళ్ళదే. సినిమాకి వెళ్ళాలన్నా, షికారుకి వెళ్ళాలన్నా అయిదుగురూ కలిస్తేనే వెళ్ళేవారు.

అయితే, అందరిలోకి అనిల్ మాత్రం చదువు మీద శ్రద్ధతో వీళ్ళ మాట కాదనలేక వచ్చినా అక్కడ కూడా కాలేజీ బుక్స్ తెచ్చుకుని చదువుకుంటూ ఉండేవాడు. మిగతావాళ్ళు అనిల్ ని ఆట పట్టించేవారు పుస్తకాల పురుగని, సరదా సందడి తెలీని మొద్దని ఎగతాళి చేస్తూ అల్లరి పెట్టేవారు.

అనిల్ కూడా ఎన్ని అన్నా ఆనందంగా స్వీకరించి నవ్వి ఊరుకునేవాడు. తన కోసం తెచ్చుకున్న తిను బండారాలు తీసి మిత్రులకు పంచేవాడు.

ఈ అయిదుగురిలో 'రామకృష్ణ' మాత్రం అమ్మాయిల్ని చూస్తే కళ్ళు మిటకరించేవాడు. శంకు మాత్రం అమ్మాయిలకేసి చూసీ చూడనట్టు నటించేవాడు కాని, రామకృష్ణ మాటలకి చేష్టలకి సై అనేవాడు. మిగతా ముగ్గురూ ఆ జోలికెళ్ళేవారు కాదు. 'అమ్మాయిలు ఆటంబాంబులు ఒకటిరా బాబూ! జాగ్రత్తగా 'డీల్' చెయ్యాలి. తేడా వస్తే శాల్తీలు గల్లంతయిపోతాయ్' అని జోకులేస్తూ తన మానాన తను పుస్తకాల్లో మునిగిపోయేవాడు అనిల్.

"తప్పురా! వాళ్ళు మనలాంటి వాళ్ళే కదా! వాళ్ళని అల్లరి చేయడం సరికాదు" అనేవాడు అనిల్.

అనిల్ మాటలకి ఆచారి, ఏకాంబర్ వంత పాడేవారు. ఎందుకంటే అనిల్ బ్యాగ్ లో ఏమున్నాయో తడుముతూ 'అనిల్'ని పొగిడేవారు. వాడిచ్చే తినుబండారాల కోసం మద్దతు పలికేవారు. అలా కాలక్షేపంతో గడిపేశారు.

ఏకాంబర్ ఇంటర్ రెండో ఏడాది పరీక్షలు రాసేసరికి అందరూ డిగ్రీల్లో ఉన్నారు. అనిల్ డిగ్రీ కాగానే యూనివర్సిటీలో ఎమ్మెస్సీ లో జాయిన్ అయ్యాడు. మిగతా ముగ్గురూ డిగ్రీలు అత్తెసరు మార్కులతో ప్యాసయినా ఏకాంబర్ మాత్రం ఇంటర్ పూర్తి చేయడానికి మూడు సంవత్సరాలు ఒక్కటొక్కటీ పాసై చివరికి హమ్మయ్య అనుకున్నాడు.

ఏకాంబర్ ఇంటర్ పూర్తి చేసేసరికి మిగతా మిత్రులు నలుగురూ చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు దొరక్క ఊర్లోనే బజార్లో కేంటీన్ల దగ్గర పకోడీ బళ్ళ దగ్గర, చెరువు గట్టు దగ్గర బాతాఖానీ వేసుకుంటూ కాలక్షేపం చేసేవారు.

అందరిలో అనిల్ కి విశాఖలోనే నేవల్ సైంటిఫిక్ లేబోరేటిరీలో సైంటిస్ట్ గా ఉద్యోగం దొరికింది. శంకు మెడికల్ రిప్రెజెంటేటివ్ గా జాయిన్ అయితే ఆచారి ప్రైవేట్ చిట్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గా జాయిన్ అయ్యాడు.

ఏకాంబరానికి మాత్రం ఎక్కడా దారి తెన్నూ దొరకలేదు.

'తను చదివిన చదువుకి ఎవడిస్తాడులే ఉద్యోగం' అనుకుంటూ ఆ ప్రయత్నాలే మర్చిపోయాడు.

ఆదివారాలు, సెలవురోజుల్లో మాత్రం మిత్రులు అయిదుగురూ కలుసుకోవడం మానలేదు. అందరూ ఉండేది సింహాచలంలోనే కావడం వలన ఏ అపరాత్రికి వచ్చినా అందరూ బజార్లో కేంటీన్ దగ్గర కూర్చుని అరగంట అసుకేసుకోవడం పరిపాటయింది.

అయితే -

ఏకాంబర్ మాత్రం వీధిలో మిత్రులతో ఎంతసరదాగా సందడిగా గడిపినా ఇంటికెళ్ళేసరికి మాత్రం పిల్లిలా నక్కి నక్కి దాక్కుని తిరుగుతుంటాడు.

తండ్రి పీతాంబరం కళ్ళకు కనిపించకుండా ఇంట్లో జొరబడి తల్లి దగ్గరకు పిల్లిలా చేరుకుంటాడు ఏకాంబర్. దారితప్పి తండ్రి పీతాంబరం కళ్ళల్లో పడ్డాడా అంతే సంగతులు. తిట్లు, చీవాట్లు తప్పవు కాక తప్పవు.

ఏకాంబర్ అన్న నీలాంబర్ కూడా క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం సంపాదించి పూనే వెళ్ళిపోయాడు. చెల్లెలు అలివేలుమంగ డిగ్రీ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటూ తల్లికి వంటలో సహాయపడుతుంది.

ఎటొచ్చీ చదువుసంధ్యలు అబ్బని ఏకాంబర్ జులాయిగా తిరుగుతూ పోకిరీ వేషాలు వేస్తున్నాడని తండ్రి పీతాంబరానికి ఒళ్ళు మంట. షాపులో పెడదామని తీసుకువెళ్తే ఒక నెల్లో షాపంతా ఖాళీ చేసేసాడు. ఏకాంబర్ ఇంటర్ పాసవగానే ఏ పనీ పాటూ లేకుండా ఇంట్లో ఉంచితే బలాదూర్ గా తిరిగి పోరంబోకులా మారిపోతాడని భయపడి తనతో పాటు షాపుకు లాక్కుపోయాడు పీతాంబరం.

ఏపుగా ఎదుగొచ్చిన కొడుకు తన కంటే ఎత్తుగా ఎవరెస్ట్ శిఖరంలా కనిపించేసరికి షాపు బాధ్యతలు ఏకాంబరానికి అప్పగించి 'సరుకులు' తేవడానికి పూర్ణామార్కెట్ కు వెళ్ళేవాడు పీతాంబరం.

నెల రోజుల వరకూ ఏదీ గమనించలేదు పీతాంబరం. రోజూ బుద్ధిగా తనతోపాటు వస్తున్న కొడుకు రాత్రి పదయినా ఒపిగ్గా... బుద్ధిగా... బుద్ధిగా తనతో పాటు ఉండి షాపు కట్టేశాక ఇంటికి వచ్చే ఏకాంబరాన్ని చూసి పీతాంబరం సంబరపడిపోయేవాడు.

అయితే, ఆ నెల తర్వాత షాపులో సరుకులు అన్నీ ఖాళీ అయిపోయి గాని అమ్మకం

కనిపించకపోయేసరికి అదిరిపడి ఆ నెలరోజులు అమ్మకాల్ని సరి చూసుకున్నాడు పీతాంబరం.

అన్నీ 'అరువు' ఖాతాలే. ఎవరూ డబ్బులు చెల్లించి సరుకులు కొనలేదు. దాంతో ఏకాంబర్ మీద అగ్గి మీద గుగ్గిలంలా ఎగిరిపడ్డాడు పీతాంబరం.

"ఏరా! షాపులో సరుకులన్నీ ఊరందరికీ ఇలా దారాదత్తం చేస్తే మళ్ళీ సరుకులు ఎలా తేగలనురా! రొక్కానికి అమ్మమంటే తొక్కలోది ఈ అరువు ఖాతాలేంట్రా" కోపంతో ఊగిపోయాడు పీతాంబరం.

"ఎవరో కాదు నాన్నా! మన ఊరి వాళ్ళే. అందరూ తెలిసినవాళ్ళేగా. ఇచ్చేస్తారు. ఎక్కడికి పోతారు" తండ్రికి ఎదురు చెప్పాడు ఏకాంబర్.

"ఎప్పుడిస్తార్రా!... ఏదీ నెలయింది. ఇచ్చారా! ఇప్పుడు షాపులో సరుకులు నిండుకున్నాయి. తిరిగి మదుపు ఎవడు పెడతాడ్రా?" చెట్టంత ఎదిగిన కొడుకుని చెయ్యెత్తి కొట్టలేక కోపంతో ఎగాదిగా చూస్తూ అరిచాడు పీతాంబరం.

అంతే! ఆ రోజు నుండి ఏకాంబరాన్ని షాపు దరిదాపులకు రానివ్వలేదు. 'అరువు'లన్నీ వసూలు చేసుకురమ్మని షాపులో నుండి తరిమేశాడు పీతాంబరం.

అప్పట్నుండీ ఏకాంబర్ పని తినడం, తిరగడం అంతే! ఉదయం లేస్తూనే తండ్రి పీతాంబరం కంట్లో పడకుండా తయారయి రోడ్డు మీదకు రావడం, బజార్లో ఉన్న దేవస్థానం కేంటీన్ సింహశైలలో కూర్చోవడం, బాతాఖానీ, మిత్రులతో సినిమాలు, షికార్లు. మధ్యమధ్యలో 'అరువులు' తీసుకున్న వాళ్ళింటికి బాకీల కోసం తిరగడం.

ఆ రోజు -

ఎప్పటిలాగే ఏకాంబర్ మిగతా నలుగురు మిత్రులూ ఉదయాన్నే కేంటీన్ దగ్గర కలుసుకున్నారు.

ఆదివారం!

సింహాద్రి అప్పన్నని దర్శించుకోవడానికి వస్తున్న యాత్రీకుల రద్దీ కూడా ఎక్కువగానే ఉంది. కేంటీన్ లో ఓ మూలనున్న టేబుల్ దగ్గర మిత్రులు అయిదుగురితో పాటు కొత్తగా వచ్చేవారితో కలిసి

గంటలు గంటలు అసుక్కొడుతూ కూర్చున్నారు. మధ్యమధ్యలో ఎవరో ఒకరు త్రీ బై సిక్స్ అనో, త్రీ బై ఫైవ్ అనో అక్కడ ఎంతమంది ఉంటే అంతమందికీ 'టీ' లు ఆర్డరిస్తూ కాలక్షేపం చేసేస్తూ కూర్చున్నారు.

అయితే, ఆ రోజు యాత్రీకుల రద్దీ ఎక్కువగా ఉండడంతో కేంటీన్ కూడా ఎక్కడా ఖాళీ లేకుండా అయిపోయింది. సర్వర్ లు సప్లై చేయలేకపోతున్నారు. టేబుల్లన్నీ నిండుకుంటున్నాయి.

కేంటీన్ ఓనర్ ఉండుండీ ఏకాంబర్ వాళ్ళూ కూర్చున్న టేబుల్ కేసి గుర్రుగా చూస్తున్నాడు. కస్టమర్లు కూర్చోవడానికి 'టేబుల్'లు ఎక్కడా ఖాళీ లేవు.

సర్వర్ వచ్చి ఓనర్ కి మొరపెట్టాడు "సార్! ఆ మూలనున్న 'బేవార్స్ బేచ్'ని లేవమని చెప్పండి సార్! కస్టమర్స్ నిలబడిపోయారు." గుసగుసగా ఓనర్ చెవిలో చెప్పి వాళ్ళకేసి అదోలా చూస్తూ తన పనిలో పడ్డాడు సర్వర్.

కేంటీన్ ఓనర్ సర్వర్ ఇద్దరూ తమకేసి చూసి మాట్లాడుకునేసరికి వారికి విషయం అర్ధమైపోయింది.

"లేవండ్రా బాబూ! ఇంకా మనం ఇక్కడే కూర్చుంటే కేంటీన్ ఓనర్ వచ్చి చొక్కా పట్టుకుని బయటకు లాగేసినా లాగేస్తాడు. పరువు పోతే తిరిగి సంపాదించలేం. రేపట్నుండీ ఈ బల్ల దగ్గరకు రాలేం. లేవండి పోదాం" అంటూ అని లేచి నిలబడ్డారు. మిగతా అందరూ అనిల్ ని ఫాలో అయి కేంటీన్ లో నుండి బయటకి వచ్చారు.

కేంటీన్ ప్రక్కనే స్టేట్ బ్యాంక్ కు వెళ్ళే మెట్లు ఉన్నాయి. కేంటీన్ పైభాగంలో స్టేట్ బ్యాంక్ ఉంది. ఆ మెట్ల దగ్గర నిలబడి మిత్రులంతా ఆర్టీసీ బస్సు స్టాండ్ నుండి కొండ బస్సు స్టాండ్ కు నడిచి వెళ్తున్న యాత్రీకుల్ని చూస్తూ నిలబడ్డారు.

అసలే ఆదివారం!

అంతా క్లాస్ భక్తులు. శనివారం అయితే మాస్ యాత్ర ఎక్కువ. ఆదివారం అందరికీ ఆఫీసులు సెలవు కావడం వలన ఎక్కువమంది నగరవాసులే దైవదర్శనానికి వస్తుంటారు. ఏదో కొద్దిమంది మాత్రం పల్లెలనుండి వస్తుంటారు.

రామకృష్ణ, శంకర్‌రావు ఓ మూలన నిలబడి దారి పొడవునా నడిచి వెళ్తున్న రంగురంగుల చీరలకేసి,

చూడీదారులకేసి చూస్తూ చొంగలు కార్చుకుంటున్నారు.

"చూడరా! వాళ్ళు కళ్ళతోనే కోర్కెలు తీర్చేసుకుంటున్నారు" మిత్రులిద్దరికేసి చూస్తూ ఆచారి అన్నాడు.

"ఎవడి ఆనందం వాడిది. మనకెందుకులేరా?!" అన్నాడు ఏకాంబర్.

ఇంతలో సూటు బూటు తొడుక్కుని మెళ్ళో ఖరీదయిన లెదర్ బ్యాగ్ తగిలించుకుని టిప్ టాప్ గా ఉన్నతను వారి దగ్గరకు వచ్చాడు.

అతన్ని చూస్తూనే మిత్రులందరూ ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టేసారు.

"ఒరేయ్!... నువ్వు... నువ్వు..." ఆశ్చర్యంగా అన్నాడు ఆచారి. మిగతా నలుగురూ అతడినే చూస్తూ నిలబడిపోయారు.

"నేనేరా! రాజనాల రాజేంద్రని... గుర్తు పట్టలేదా?" తన ఎదురుగా ఉన్న అయిదుగురి మిత్రుల చేతులు లాక్కొని మరీ షేక్ హేండ్ ఇచ్చాడు అతను.

"రా... జ... నా... ల...?!" ఆశ్చర్యంగా కళ్ళింత చేసుకుని చూసాడు ఏకాంబర్.

"గుర్తుకు రాలేదురా!... మనతో దుంపలబడిలో ఆరోతరగతి నుండి ఏడు వరకే చదివి మానేసి వెళ్ళిపోయాడు కదరా! వాడే! రౌడీ రాజనాలగాడు. వాడే... వీడు!" ఏకాంబర్ బుర్రమీద ఒక చరుచు చరిచి అన్నాడు అనిల్.

"ఆ! గుర్తొచ్చిందిరా! రౌడీ... రాజనాల!... తెలుగు మేష్టారు గారి మీద తిరగబడిన... రాజనాలగాడేనా... సారీ! నువ్వు... రాజనాలవా?" ఆనందంగా రాజేంద్రని వాటేసుకుంటూ అన్నాడు ఏకాంబర్.

"అవున్రా! చిన్నప్పుడే వైజాగ్ వెళ్ళిపోయాం కదా! మీ అందరికీ నేను గుర్తుంటానో... లేదోనని మిమ్మల్ని వెదుక్కుంటూ ఇక్కడకు వచ్చాను" ఆనందంగా అన్నాడు రాజేంద్ర.

"ఏంటబ్రా! సూటూ బూటూ... మెళ్ళో తళతళా మెరుస్తున్న బ్యాగ్... ఏదైనా బ్యాంకులో పని చేస్తున్నావా?" రాజేంద్ర తొడుక్కున్న కోటు బటన్ లు చూసి ముట్టుకుని మురిసిపోతూ అన్నాడు ఆచారి.

"అలాంటిదేరా!! బ్యాంకు కాదు గాని... బ్యాంకులాంటిదే!" చిన్నగా నవ్వుతూ అన్నాడు రాజనాల రాజేంద్ర.

"బ్యాంకు కాదంటావ్!... బ్యాంకులాంటిదే అంటావ్! కొంపదీసి ఈ మధ్య కుదేలైపోతున్న ఫైనాన్స్ కంపెనీల్లాంటిది కాదు కదా!" భయంగా అన్నాడు అనిల్.

"అంత భయమెందుకురా! అలాంటిదేం కాదులే!" రాజేంద్ర మాటలు విని కొంచెం భయంగా రెండడుగులు వెనక్కి వేసిన అనిల్ భుజం మీద చెయ్యేసి అన్నాడు రాజనాల రాజేంద్ర.

"నీకు అలాగే ఉంటుందిరా బాబూ! ఈ మధ్య దివాళా తీసిన ఫైనాన్స్ కంపెనీ యజమానులే కాదు. అందులో పనిచేసిన ఉద్యోగుల్ని, వాళ్ళతో తిరిగిన స్నేహితుల్ని, అందులో పొరపాటున డబ్బు దాచుకుని మోసపోయిన బాధితుల్ని సైతం 'పోలీసులు' వదలటంలేదురా నాయనా. మా బాబు వూరికే ఊరి మీద పడి తిని తిరిగితే తిరుగు గాని అలాంటి 'బోగస్'ల జోలికి వెల్లొద్దని తిట్టాడ్రా!" అన్నాడు ఏకాంబర్.

"ఓరి నాయనో! నేను అలాంటివాడ్ని కాదు. మా ఇన్స్యూరెన్స్ కంపెనీ అలాంటిది కాదు. పక్కా గవర్నమెంట్ సంస్థ మాది." మిత్రులందరి వాలకం చూసి తల మీద చెయ్యేసుకుని ప్రమాణం చేస్తున్నట్టు చెప్పాడు రాజేంద్ర.

"ఆ! నువ్వు ఇన్స్యూరెన్స్ వాడివా!!" అంటూ మిత్రులందరూ అవాక్కయి రాజేంద్రకి కాస్త దూరంగా జరిగారు.

"ఇన్స్యూరెన్స్ అంటే భయపడతారేమిట్రా! ఈ రోజు మనల్ని, మన కుటుంబాల్ని ఆదుకుని ఆసరాగా నిలబడేది ఇన్స్యూరెన్స్ కంపెనీయేరా బాబూ! మీకెవరికీ ఇంకా పెళ్ళి, పెళ్ళాం, పిల్లలు ఉన్నట్టూ లేదు" నిష్ఠూరంగా అన్నాడు రాజనాల రాజేంద్ర.




"ఎవరికి పెళ్ళి కాలేదు? వీళ్ళ నలుగురికీ ఎప్పుడో పెళ్ళిళ్ళయిపోయాయి. నాకే ఇంకా కాలేదు" అంటూ తలదించుకుని విచారంగా అన్నాడు ఏకాంబర్ ముదర బ్రహ్మచారిలా మిగిలిపోయానన్నట్టు!

"ఇంతకీ ఇన్స్యూరెన్స్ కంపెనీలో నువ్వు చేస్తున్న ఉద్యోగం ఏమిట్‌రా బాబూ!" ఆచారి కల్పించుకుని

అడిగాడు.

"డెవలప్ మెంట్ ఆఫీసర్!" కొంచెం హుందాగా అన్నాడు రాజేంద్ర.

"దేన్ని డెవలప్ చెయ్యడానికిరా" కుతూహలంగా అన్నాడు రామకృష్ణ.

"ఓర్నాయనో! మీకర్థమయి అడుగుతున్నారో? అర్థం కాక ఇలా అడుగుతున్నారో నాకు అర్థం కావటంలేదురా బాబూ! ఇన్స్యూరెన్స్ ని అభివృద్ధి చేయడమే నా ఉద్యోగం రా." అందరికీ అర్థమయ్యేలా చెప్పాడు రాజేంద్ర.

"నువ్వు ఇన్స్యూరెన్స్ పాలసీలు చేయిస్తావా?" రాజేంద్ర కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు అనిల్.

"నా ఉద్యోగం అది కాదు. 'ఇన్స్యూరెన్స్ కట్టించడానికి 'ఏజంట్ల'ని నియమిస్తాను. నా అండర్ లో నిరుద్యోగులైన యువకుల్ని పట్టుకుని వారిని 'ఏజెంట్లు' గా నియమిస్తాను. వారు ఇంటింటికి తిరిగి, మనిషి మనిషిని పట్టుకుని 'పాలసీ'లు రాయిస్తారు" పూస గుచ్చినట్లు చెప్పాడు రాజనాల రాజేంద్ర.

"ఐసీ. మరి ఇలా వచ్చావేరా! నిజంగా నువ్వు మమ్మల్ని వెదుక్కునే వచ్చావా?!" రాజనాల రాజేంద్ర కేసి చూస్తూ అన్నాడు రామకృష్ణ.

"అవున్రా బాబు! ఇందులో జాయిన్ అయి రెండు నెలలయింది. ఒక్కడంటే ఒక్కడు కూడా దొరకలేదు. ఎవర్ని కలిసినా ఏదో పని చేస్తున్నామని తప్పించుకుంటున్నారు. చిన్నప్పుడు చదువుకున్న వూరు కదా! పనీ పాటూ లేకుండా ఉన్నవాళ్ళు ఒక్కరు దొరకరా అని ఇలా మిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చాను" చెప్పాడు రాజేంద్ర.

"నువ్వనుకున్నట్టూ మేమందరం ఖాళీగా లేమురా బాబు! ఇదిగో వీడొక్కడే ప్రస్తుతానికి పనీపాటూ లేకుండా తిరుగుతున్నది" అంటూ మిగతా నలుగురూ 'ఏకాంబరాన్ని' చూపిస్తూ చెప్పారు.

వాళ్ళు నలుగురూ ఒక్కసారే అలా అంటూ ఏకాంబరాన్ని చూపించేసరికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టు తెగ సంబరపడిపోతూ ఏకాంబర్ కేసి ఆశగా ఆనందంగా చూసాడు రాజనాల రాజేంద్ర.

మిత్రులు నలుగురూ ఒక్కసారే తనకేసే చూస్తూ, తనని అమాయకుడ్ని చేసి 'బలి పశువు' గా రాజనాల

గాడికి అప్పగించడం గమనించిన ఏకాంబర్ అదిరిపడ్డాడు.

అంతే!

"ఒరేయ్! ఉండండిరా! మా అమ్మ కూరగాయలు తెమ్మంది ఆ విషయమే మర్చిపోయాను" అంటూ ఇక ఒక్క క్షణం అక్కడ నిలబడకుండా పరుగందుకున్నాడు ఏకాంబర్.

"ఒరేయ్... ఏకాంబర్..." అంటూ మిగతా మిత్రులంతా గొంతు చించుకు అరుస్తున్నా వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయాడు ఏకాంబర్.

***

"అంబర్ సార్! ఏంది సార్! సరదాగా పార్క్ కి రమ్మని ఇలా బుర్ర తినేస్తున్నారేమిటి సార్!" సిమ్మెంటు కుర్చీకి జారగిలబడి ఏదో ట్రాన్స్ లోకి వెళ్లిపోయి తన గతమంతా పూస గుచ్చినట్టు చెప్తున్న ఏకాంబర్ ని పట్టి కుదుపుతూ అంది నూకరత్నం.

ఆమె అలా రెండు చేతుల్తో పట్టుకుని కుదిపేసరికి ఉలిక్కిపడి ఇహానికి వచ్చాడు ఏకాంబర్.

"ఏదో చెప్తానని... ఇంకేదో చెప్తున్నారేమిటి సార్!" ఏకాంబర్ కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ అంది నూకరత్నం.

"ఏం చెప్పాను. నేనీ స్థితికి రావడానికి ఎన్ని అవస్థలు అగచాట్లు పడ్డానో చెప్తున్నాను" అన్నాడు ఏకాంబర్.

"మీ గోడు వింటూంటే ఇక్కడ నాకు కడుపులో గోలగోలగా ఉంది. ఆకలి దంచేస్తోంది సార్! ఇక మీ సినిమా కష్టాల మీద మనసెలా పెట్టగలను" పొట్ట మీద చేతులు వేసుకుని దీనంగా ఏకాంబర్ కేసి చూస్తూ అంది నూకరత్నం.

ఆమె అలా ఆకలి అని చెప్పేసరికి అదిరిపడి ఛటుక్కున వాచీ కేసి చూసాడు ఏకాంబర్.

మిట్ట మధ్యాహ్నం పన్నెండు దాటి ఒంటిగంట కావస్తోంది. 'పాపం! ఉదయాన్నే ఎప్పుడో టిఫిన్ చేసి ఉంటుంది' అనుకుంటూ గబుక్కున లేచి నిలబడ్డాడు ఏకాంబర్.

"పదండి! అలా వెళ్ళి నాస్తా చేసి వద్దాం" నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"నాకు నాస్తా గీస్తా జాన్తానై. ఖానా... కావాలి ఉదయం ఎప్పుడో రెండిడ్లీ తిన్నాను. తృప్తిగా, పుష్టిగా భోజనం లాగించెయ్యాలి" అంది లేస్తూ.

"అలాగే! మీ అభిప్రాయమే మా అభిప్రాయం. పదండి మేడం గారు!" రెండు చేతుల్తో దారి చూపిస్తూ అన్నాడు ఏకాంబర్.

పార్క్ లో నుండి ఇద్దరూ బయటకు వచ్చారు.

"ఈ దగ్గర్లో ఎక్కడా హొటల్స్ లేనట్టున్నాయే" చుట్టూరా చూస్తూ అంది నూకరత్నం.

"ఈ ప్రక్కనే ఉందిగా పార్క్ హొటల్. ఆ ప్రక్కనే పామ్ బీచ్ హొటల్. మనం తినే తిండికి ఈ రెండూ చాలవా" కొంటెగా నూకరత్నం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"అమ్మో! ఇవి పెద్ద హొటళ్ళు కదా! స్టార్ హొటల్లో భోజనం అంటే... నా నెల రోజుల జీతం" ఆశ్చర్యంగా అంది నూకరత్నం.

"ఈ రోజే కదా మనం కలిసింది. ఈ మాత్రం ఖర్చు పెద్ద లెక్కలోంది కాదు లెండి" అంటూ పార్క్ బీచ్ హొటల్ కేసి దారి తీస్తూ అన్నాడు ఏకాంబర్.

"వద్దండి అంబర్ గారూ! వద్దు ఏదైనా చిన్న హొటల్ కి వెళ్దాం" ఏకాంబరాన్ని బ్రతిమాలాడుతూ అంది నూకరత్నం.

"ఫర్వాలేదు. మీతో మొదటిసారిగా ఇలా కలిసి తినే అవకాశం అదృష్టం దొరికింది. దాన్ని ఎంత అందంగా... ఆకర్షణీయంగా మలచుకోవాలో నాకు తెలీదు. కనీసం, మీకు కలకాలం గుర్తుండిపోయేలా ఈ ఆతిధ్యమైనా స్వీకరించండి రత్నం గారూ!" నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"సరే పదండి సార్! మీ ఆనందం ఎందుకు కాదనాలి" సిగ్గుతో ముడుచుకుపోతూ అంది నూకరత్నం.

ఇద్దరూ పామ్ బీచ్ హొటల్ మెయిన్ గేట్ దగ్గరకు వెళ్ళేసరికి అక్కడ సెక్యూరిటీగా నిలబడ్డ గార్డు నిటారుగా నిలబడి వాళ్ళిద్దరికీ స్వాగతం పలుకుతూ సెల్యూట్ చేసాడు.

మనిషంత మనిషి పాలమీగడ లాంటి తెల్లటి యూనిఫారంలో తల మీద రాజకిరీటం లాంటి కుచ్చు టోపీ పెట్టుకుని ఎంతో వినయంగా నిలబడి తమ ఇద్దరికీ వంగి వంగి నమస్కారాలు చేస్తుంటే ఆశ్చర్యంతో చూస్తుండిపోయింది నూకరత్నం.

ఏకాంబరం ఈ మర్యాదలన్నీ ఎప్పుడో అంది పుచ్చుకున్నాడు. ఇన్స్యూరెన్స్ ఏజెంటుగా జాయిన్ అయిన కొత్తలోనే అంతా వింతగా విడ్డూరంలా చూసేవాడు. ఆ తర్వాత తర్వాత విశాఖనగరంలో ఉన్న స్టార్ హొటళ్ళన్నింటిలోనూ కంపెనీ ఖర్చులతోనే ఎన్నో రకాల ఆతిధ్యాలు స్వీకరించాడు.

పామ్ బీచ్ హొటల్ లోకి నూకరత్నాన్ని దగ్గరుండి తీసుకువెళ్తూ ఆమె మొహంలో కనిపిస్తున్న ఆనందాన్ని ఆశ్చర్యాన్ని ఆమె కళ్ళల్లో విరిసిన అబ్బురాన్ని తిలకిస్తూ ఏదో తెలియని ఆనందానికి లోనయ్యాడు ఏకాంబర్.

మొట్టమొదటిసారిగా తన సంపాదనతో తనకి ఇష్టమైన ఒక అమ్మాయిని ఇంత తన్మయానికి లోను చేయగలగడం మరింత సంతోషాన్ని కలిగించింది ఏకాంబరానికి.

తాను ఇన్స్యూరెన్స్ ఏజెంటుగా మూడేళ్ళు పూర్తి చేసుకుని బ్రాంచి మేనేజర్ క్లబ్ లో చేరినప్పుడు ఇన్స్యూరెన్స్ కంపెనీవారు విశాఖ నగరంలోనే పేరెన్నికగన్న తాజ్ రెసిడెన్సీ స్టార్ హొటల్ లో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు అమ్మ, నాన్న, చెల్లెల్ని తనతోపాటు తీసుకువెళ్ళాడు. ఆ రోజు... వాళ్ళ కళ్ళల్లో కనిపించిన సంబరం చూసి ఎంత ఆనందపడ్డాడు. ఆ ఆనందమే మళ్ళీ ఈ రోజు కలుగుతోంది.

ఏ వ్యక్తి అయినా ఎంత ఉన్నత శిఖరాల్ని అధిరోహించినా ఆ సంతోషాన్ని తన వారితో పంచుకుంటేనే ఆ ఆనందం తృప్తి పుష్టిగా లభించేది. ఎక్కడో ఖండాంతరాల అవతల... ఏడు సముద్రాల ఆవల మనం 'బంగారం' తింటే ఎవరు చూస్తారు?! ఆ ఆనందం ఎవరికి పంచగలం?

తమ ఎదుగుదల... సుఖ సంతోషాలు తమ వారి మధ్య ఉంటూ పంచుకోగలిగితేనే ఉంది అందులో మజా. అదిప్పుడు తనకి కళ్ళారా కనిపిస్తోంది. మనసారా ఆస్వాదిస్తున్నాడు. మనసులోనే ఎన్నో ఆలోచనలతో, ఆనందాశ్చర్యాలతో రెస్టారెంట్ లోకి అడుగుపెట్టాడు ఏకాంబర్.

ఏకాంబర్ వెనుకే మంత్రముగ్ధలా గాలిలో తేలిపోతూ నడిచి వెళ్ళింది నూకరత్నం.

రెస్టారెంట్ ఇంద్రసభలా ఉంది. ఖరీదయిన కుర్చీలు, టేబుళ్ళు, గాల్లో తేలియాడుతున్న లైట్లు, ఖరీదయిన సూట్లు ధరించిన వెయిటర్లు, అప్సరసలకు మల్లే రెస్టారెంటు నలుమూలలా నిలబడి అందాలు గుమ్మరిస్తున్న అమ్మాయిలు.

ఖాళీగా ఉన్న టేబుల్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నారిద్దరూ. ఆ రెస్టారెంట్ లో అక్కడక్కడా యువజంటలు, పెద్దవాళ్ళు నడివయసువాళ్ళు, ముసలివాళ్ళు... అందరూ ఖరీదయిన మనుషులే!

రెస్టారెంట్ చుట్టూ అద్దాల గోడలు. ఆ అద్దాల్లో నుండి చూస్తుంటే దూరంగా కెరటాలతో ఉరకలు వేస్తున్న సముద్రం. రెస్టారెంట్ ప్రక్కనే స్విమ్మింగ్ పూల్.

ఆ స్విమ్మింగ్ పూల్ లో విదేశీయులు ఆడా మగా అర్ధనగ్నంగా ఈత కొడుతూ ఆనందిస్తున్నారు.

ఆ స్విమ్మింగ్ పూల్ గట్టు మీద పెద్ద పెద్ద గొడుగులు ఆ గొడుగుల క్రింద విదేశీయులు, స్వదేశీయులు ఒకో గొడుగు క్రింద ముగ్గురూ నలుగురూ ఆడా మగా అని బేధం లేకుండా కూర్చుని ఉన్నారు.

అందరిముందు ఖరీదైన మద్యం అందమైన గాజు గ్లాసుల్లో రకరకాల రంగుల్లో తేలిపోతూ విలాసంగా నవ్వుతోంది. కొందరు గ్లాసులు చేతుల్తో పట్టుకుని సుతారంగా పెదవులకందిస్తూ ఎదురుగా ఉన్న మగువల అందాల్ని ఆనందిస్తూ మత్తుగా మందుతో మజా చేస్తున్నారు.

నూకరత్నం కుర్చీలో కూర్చుందే గాని తల వాలకం, తన బట్టలకేసి ఓసారి చూసుకుని మనసులోనే నొచ్చుకుంది. తన బట్టలకున్న మురికి వలన తను కూర్చున్న కుర్చీ మాసిపోతుందేమోనని బాధపడింది. తనని ఎవరైనా గమనిస్తున్నారేమోనని క్షణం తటపటాయిస్తూ కూర్చుంది.

రెస్టారెంట్ చుట్టూరా చూస్తూ తల దించుకుని మౌనంగా కూర్చుండిపోయింది. తనకి అత్యంత చేరువలోనే గోడలా అడ్డుగా ఉన్న అద్దానికి ఆవల విదేశీయులు అర్ధనగ్నంగా కనిపిస్తూంటే అటు చూడలేక సిగ్గుపడిపోయి తల దించుకుంది. కానీ, ఆమె తన 'మనసు'ని అధీనంలో ఉంచుకోలేకపోతోంది.

"ప్లీజ్! వాడ్డూ యూ వాంట్ సార్!" ఓ అందమైన అమ్మాయి చేతిలో చిన్న పేపర్ పేడ్ పట్టుకుని వచ్చి

వారి దగ్గర నిలబడి అడిగింది.

"టూ ఇండియన్ తాళీ" స్టైల్ గా ఆర్డరిచ్చాడు ఏకాంబర్.

"నార్త్ ఇండియనా సార్!" మళ్ళీ ఆ అమ్మాయి అడిగింది.

"నో! నో! సౌత్ ఇండియన్ ఫుడ్" మళ్ళీ ఏకాంబరే అన్నాడు.

"ఒకే సార్! ఫైవ్ మినిట్స్ లో సర్వ్ చేస్తాం సార్" అంటూ ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

ఆమె అలా వెళ్ళిన వెంటనే సూటూ బూటు వేసుకున్న సర్వర్ వచ్చి రెండు గ్లాసుల్లో జ్యూస్ తెచ్చి వారి ముందుంచాడు.

"ఇదెందుకు అంబర్ గారు?" నెమ్మదిగా గుసగుసగా అంది నూకరత్నం.

"తాగడానికి" అని ఆమె చెవిలో ఊది వెంటనే తన గ్లాసు తీసుకుని స్టైల్ గా నెమ్మది నెమ్మదిగా సిప్ చేస్తున్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ జ్యూస్ చేత్తో తీసుకోగానే తను కూడా జ్యూస్ గ్లాసు చేత్తో పట్టుకుని గడగడా త్రాగేసి గ్లాసు క్రింద పెట్టింది నూకరత్నం.

ఏకాంబర్ మాత్రం చుట్టూ ఓరకంట గమనిస్తూ నెమ్మదినెమ్మదిగా జ్యూస్ చప్పరిస్తున్నట్టు గ్లాసు పట్టుకుని కూర్చున్నాడు.

ఇంతలో సర్వర్ మీల్స్ ప్లేట్లు తెచ్చి వారి ముందుంచి వెళ్ళిపోయాడు.

"వేగంగా త్రాగండి అంబర్! అందరూ మిమ్మల్నే చూస్తున్నారు" అమాయకంగా అంది నూకరత్నం.

నూకరత్నం మాటలకి ఏకాంబర్ గతుక్కుమన్నాడు. ఆమె గడగడా జ్యూస్ త్రాగడం చూసి అందరూ

ఎగతాళిగా చూస్తున్నారేమోనని అనుకున్నాడు. కానీ, తననే అందరూ గేలి చేస్తున్నట్టు చూస్తున్నారని రత్నం అంటోంది అనుకున్నాడు ఏకాంబర్.

సర్వర్ మీల్స్ ప్లేట్స్ తెచ్చి ముందు పెట్టగానే ఆబగా పళ్ళెంలో వున్న పదార్థాల మీదకు దాడి చేసింది నూకరత్నం. రెస్టారెంట్ లో అంతా ఒక్కసారి పరిశీలనగా చూసి తమని ఎవరూ గమనించలేదని గ్రహించి ఏకాంబర్ కూడా తేలిగ్గా ఊపిరి పీల్చుకుని భోజనానికి ఉపక్రమించాడు.

ఇద్దరూ హాయిగా కబుర్లాడుకుంటూ భోజనం చేసారు. అందరూ తమనే గమనిస్తారేమోనని కంగారుపడ్డ ఏకాంబర్ రెస్టారెంట్ లో ఉన్న అందరూ ఎవరి మానాన వాళ్ళు కబుర్లాడుకుంటూ కూర్చునేసరికి బిడియం వదిలి నూకరత్నాన్ని మాటల్లోకి దింపాడు.

నూకరత్నం కూడా అలా ఏకాంబరంతో కలిసి కబుర్లాడుకుంటూ భోజనం చేయడం ఆమె మనసుకి ఎంతో ఉల్లాసాన్ని కలిగించింది.


భోజనం కాగానే పెద్ద పెద్ద కప్పులతో ఐస్ క్రీమ్ లు తెచ్చి ఇచ్చాడు సర్వర్. దాంతో పాటు కిల్లీలు కూడా అందంగా ప్యాక్ చేసి తెచ్చి టేబుల్ దగ్గర పెట్టాడు.

ఐస్ క్రీమ్ తిని కిళ్ళీ వేసుకుని ఇద్దరూ ఓ పావుగంట సముద్రం కేసి చూస్తూ గడిపారు. స్విమ్మింగ్ పూల్ దగ్గర రాను రాను విదేశీయులు పెరిగిపోతున్నారు.

స్విమ్మింగ్ పూల్ లో ఈత కొట్టిన కొందరు విదేశీయులు అక్కడనుండి నేరుగా నడుచుకుంటూ హెటల్ లో ఉన్న గార్డెన్ దాటి కొద్ది దూరంలో ఉన్న బీచ్ కు దగ్గరగా వెళ్ళి కూర్చుంటున్నారు.

బీచ్ దగ్గర స్విమ్మింగ్ చేసినవాళ్ళు కూర్చోడానికి, పడుకోడానికి వీలుగా పెద్ద పెద్ద బల్లలు, కుర్చీలు అమర్చి ఉన్నాయి. వాటిపైన రంగురంగుల్లో పెద్ద పెద్ద గొడుగులు ఉన్నాయి. ఆ బల్లల మీద ఎవరైనా కూర్చున్నా, పడుకున్నా వారి మొహాలకు ఎండ తగలకుండా ఏర్పాటు చేసినట్టున్నాయి ఆ గొడుగులు.

ఆ దృశ్యం చూస్తూంటే ఇద్దరి మనసుల్లోనూ ఏవేవో కోర్కెలు రగులుతూనే ఉన్నాయి. కానీ, ఏమీ తెలియనట్లు... తమకేమీ కానట్టు ఇద్దరూ గుంభనంగా ఒకర్నొకరు క్రీగంట చూసుకుంటూ కూర్చుని ఉన్నారు.




"ఇక వెళ్దామా రత్నంగారూ!" నెమ్మదిగా అన్నాడు ఏకాంబర్.

"బిల్లు రాలేదుగా!" సర్వర్ కేసి చూస్తూ అంది నూకరత్నం.

"ఇదిగో వచ్చేసింది" అంటూ తన ముందున్న బిల్ పేడ్ చూపించాడు ఏకాంబర్.

ఛటుక్కున బిల్లు తీసి చూసింది నూకరత్నం.

బిల్లు చూస్తూనే నోరు ఆవులించి "బాప్ రే! ఇంతయిందా?" ఆశ్చర్యంగా ఏకాంబర్ కళ్ళల్లోకి చూస్తూ అంది నూకరత్నం.

చిన్నగా నవ్వుతూ జేబులో వున్న డెబిట్ కార్డు తీసి బిల్లు ఉన్న ఫోల్డింగ్ పేడ్ లో పెట్టాడు ఏకాంబర్.

కేష్ కౌంటర్ దగ్గర నిలబడి వీళ్ళనే చూస్తున్న సర్వర్ బిల్లు ఫోల్డింగ్ పేడ్ లో ఏకాంబర్ 'కార్డు' పెట్టడం చూస్తూనే దగ్గరకు వచ్చి పట్టుకువెళ్ళాడు.

అయిదు నిమిషాల్లో డెబిట్ కార్డు ఇచ్చేసి 'బిల్లు' మీద సంతకం చేయించుకున్నాడు సర్వర్.

జేబులో నుండి ఇరవై రూపాయలు నోట్ తీసి సర్వర్ కి టిప్ గా ఇచ్చాడు ఏకాంబర్.

ఏకాంబర్ ప్రతిచర్య ఒరకంట గమనిస్తూనే ఉంది నూకరత్నం. హుందాగా బేరర్ కి టిప్ ఇవ్వడం చూసి మనసులోనే మురిసిపోయింది నూకరత్నం. పదే పదే ఏకాంబరాన్నే వెదుకుతున్న తన కళ్ళల్లో ఏదో తెలియని గమ్మత్తైన మత్తు ఆవహించేస్తోందని నూకరత్నం గ్రహించేసింది. రాను రాను ఏకాంబర్ మీద ఆరాధన పెరుగుతోంది.

"పదండి!..." అంటూ ఏకాంబర్ లేవగానే అతన్ని అనుసరించింది నూకరత్నం.

***

పామ్ బీచ్ హొటల్ లో నుండి బయటపడి ఉడాపార్క్ వైపు నడుస్తున్నారు ఇద్దరూ. ఒకర్నొకరు రాసుకుంటూ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నారు.

"ఇంత ఆలస్యమైంది కదా! మీ ఇంట్లో వాళ్ళు ఏమీ అనరా?" ముభావంగా ఉన్న నూకరత్నం కేసి చూస్తూ అడిగాడు ఏకాంబర్.

"అమ్మేగా! అయినా, ఇప్పుడు నేనేగా ఇంటిని నెట్టుకొస్తున్నది. షాపులో కొత్త స్టాక్ వచ్చింది. బేల్స్ విప్పి వాటికి రేటు టేగ్ లు అతికించాలని అబద్ధమాడి వచ్చా! నేనింకా షాపులోనే ఉన్నాననుకుంటుంది అమ్మ!" నెమ్మదిగా అంటూనే ఓరగా ఏకాంబర్ కళ్ళల్లోకి చూసింది నూకరత్నం. తన కళ్ళలాగే అతని కళ్ళు కవ్వింతగా ఉన్నాయి.

"ఈ రోజంతా... ఇక్కడే... నాతోనే గడపాలి" చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"ఆశ... దోశ... అప్పడం... వడ! అదేం కుదరదు. మీరు వేగంగా నాకేం చెప్పాలనుకుంటున్నారో చెప్పండి! ఇంటికెళ్ళి బట్టలు ఉతుక్కోవాలి. రేపట్నుండీ మళ్ళీ షాపులో పని తప్పదు కదా" అంది నూకరత్నం.

"మీకింకా నా మీద నమ్మకం కుదిరినట్టు లేదు" నిష్ఠూరంగా అన్నాడు.

"నమ్మకం లేకపోతే ఇలా ఎందుకొస్తానండి. ఇందాకే చెప్పా కదా!"

"రావడం వేరు, నమ్మడం వేరు. మీకు తోడు నేనుంటాను. ఈ బట్టల కొట్టు విషయం మర్చిపోండి" నడుస్తున్న వాడల్లా ఆగి నూకరత్నం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"మహానుభావా! మంచి చేస్తానంటే ఎందుకొద్దంటాను. కానీ రోజు తప్పించి రోజు పస్తులుండే కుటుంబం మాది. అలాంటప్పుడు ఉన్న ఈ ఒక్క ఆధారం వదిలేస్తే ఎలా చెప్పండి?" అనునయంగా అంది నూకరత్నం.

"సరిసరి! ఈ వారంలోనే నేను మీ షాపు దగ్గర్లోనే 'కష్టమర్స్ సర్వీస్ సెంటర్' ఏర్పాటు కోసం ఓ అపార్ట్ మెంటు అద్దెకు తీసుకున్నాను. అందులో కార్యాలయం ప్రారంభోత్సవం జరుగుతుంది. ఆరోజు తమరు తప్పక విచ్చేయండి" సీరియస్ గా మారిపోయి నిర్లిప్తంగా అన్నాడు ఏకాంబర్.

"సార్! ఎందుకండి అంత కోపం? మీ ఆఫీసులో 'గుమస్తా'గా జాయిన్ చేసుకోవచ్చు కదా!" ఏకాంబర్ చెయ్యి పట్టి చిన్నగా గిల్లుతూ అంది నూకరత్నం.

నూకరత్నం అలా అనేసరికి ఒక్కసారే ఆనందంగా ఆమె వైపు చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"కరెక్టే కదా! ఈ విషయమే మర్చిపోయాను. ముందు మా ఆఫీసులో గుమస్తాగా చేరండి. ఆ తర్వాత మీకోసం నేను ఏం చేస్తానో చూద్దురుగాని..." సంతోషంగా అంటూ నూకరత్నం భుజంమీద చెయ్యి వెయ్యబోయాడు ఏకాంబర్.

"సార్! ఆనందంలో అన్నీ మర్చిపోతున్నారు" అంటూ గభాలున వెనక్కి జరిగింది నూకరత్నం.

"సారీ! అలవాటులో పొరపాటు" కొంటెగా చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"ఏమిటీ? అమ్మాయిల మీద చెయ్యి వెయ్యడం అలవాటా?" ఏకాంబర్ కళ్ళల్లోకి కోపంగా చూస్తూ అంది నూకరత్నం.

"అయ్యో! అమ్మాయిలు కాదమ్మా తల్లీ! ఫ్రెండ్స్ తో మాట్లాడుతూ వాళ్ళ భుజాల మీద చేతులు వేయడం ఆలవాటంటున్నాను" అన్నాడు ఏకాంబర్.

"ఇంతకీ మీరు ఇంత పెద్ద ఏజెంటు ఎలా అయ్యారో చెప్పారు కాదు" ఏకాంబర్ కేసి చూసి నవ్వుతూ అంది నూకరత్నం.

"అదే చెప్తూంటే ఆకలి ఆకలి అంటూ ఆపేసారు కదా" అన్నాడు ఏకాంబర్.

"అసలు విషయం చెప్పకుండా మీ సోదంతా చెప్పుకొచ్చారు. వినడానికి బావున్నా ఓపిక ఉండాలిగా!" అంది నూకరత్నం.

"ఇకనుండి తమరు మా అధీనంలోనే కదా... సారీ! మా ఆఫీసులోనే కదా ఉంటారు. ఖాళీ దొరికినప్పుడు బుర్ర తింటానులెండి" అన్నాడు ఏకాంబర్.

"ఆలూ లేదు చూలూ లేదు 'అయ్య' పేరు సోమలింగం అన్నాట్ట ఎవరో! మీరు ముందు ఆఫీసు ప్రారంభించండి. ఆ రోజే షాపులో మానేసి మీ దగ్గర జాయిన్ అవుతాను" అంది నూకరత్నం.

"థాంక్యూ! నా మీద నమ్మకంతో ఉన్నందుకు" అన్నాడు ఏకాంబర్.

"థేంక్స్ నేనే మీకు చెప్పాలి. నిలబడి ఉండి బట్టలు అమ్ముకోవల్సినదాన్ని కుర్చీలో కూర్చోబెడుతున్నందుకు" అంది.

"మిమ్మల్ని 'ఓనర్ని' చేసేదాకా నిద్రపోను. ఇదే ఈ ఏకాంబర్ చేస్తున్న భీష్మ శపథం' అన్నాడు ఏకాంబర్.

"నిద్ర లేకపోతే నీరసించిపోతారు సార్! ఆ తర్వాత ఆరోగ్యం చెడి మీరు ఆసుపత్రుల పాలైతే నా గతి 'రెంటికీ చెడ్డ రేవడి' బ్రతుకైపోతుంది అంత పని చెయ్యకండి!" బ్రతిమలాడుతున్నట్టు నటిస్తూ చిన్నగా నవ్వుతూ ఏకాంబర్ చెయ్యి పట్టుకుని అంది నూకరత్నం.

"అదేంటండీ బాబూ! నేను మీ బాగు కోరితే మీరు నా రోగాల సంగతి మాట్లాడతారు అలా అనకండి. పైన తథాస్తు దేవతలుంటారుట. మీరూ నేనూ కూడా రోడ్డునపడాల్సి వస్తుంది" అంటూనే గభాలున నూకరత్నం చెయ్యి పట్టుకుని ప్రక్కకు లాగేసాడు ఏకాంబర్.

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటూ వస్తూ ఎదురుగా వస్తోన్న ఆటోని చూడలేదు నూకరత్నం. అనుకోకుండా మీద మీదకొస్తున్న ఆటోని చూస్తూనే నూకరత్నాన్ని చెయ్యి పట్టి ప్రక్కకు లాగేసాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా చెయ్యి పట్టి లాగేసరికి అమాంతం వెళ్ళి ఏకాంబర్ మీద పడిపోయింది నూకరత్నం. ఆమెని అలాగే ఒడిసి పట్టుకుని ఉడాపార్క్ ప్రక్కనే వున్న స్కూటర్ పార్కింగ్ దగ్గరకు తీసుకువెళ్ళాడు.

"చాలా థేంక్స్ అంబర్ గారూ! ఈ రోజు ఆ ఆటోవాడి దెబ్బకు నేను హాస్పిటల్ లో పడుదును" భయంగా అంది నూకరత్నం.

"నేనుండగా అలా జరగనిస్తానా రత్నం గారూ!" అంటూ నూకరత్నాన్ని మరింత గట్టిగా హత్తుకున్నాడు ఏకాంబర్.

"సార్! వదలండి! ఎవరైనా చూస్తే అసహ్యంగా అనుకుంటారు" అంటూ ఏకాంబర్ చేతులనుండి విడిపించుకుంటూ దూరంగా జరిగింది.

"ఇంకాసేపు కూర్చుందామా?!" నెమ్మదిగా అన్నాడు ఏకాంబర్.

"అమ్మో! వద్దండి! వెళ్దాం!" అంది నూకరత్నం.

"మీ ఇష్టం" అంటూనే స్కూటర్ స్టాండ్ దగ్గరకు వెళ్ళి తన బైక్ బయటకు తీసాడు ఏకాంబర్.

"నన్ను ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర దించెయ్యండి. బస్సెక్కి వెళ్ళిపోతాను" నెమ్మదిగా అంది నూకరత్నం.

"ఇద్దరం ఒక వైపే కదా! మిమ్మల్ని ఇందాకటిలా ఎన్.ఏ.డి. జంక్షన్ దగ్గర దించేస్తాను" అన్నాడు ఏకాంబర్.

"వద్దండి. మా మావయ్య తాలూకా వాళ్ళెవరు చూసినా బాగుండదు" అంది నూకరత్నం.

"ఎవరూ చూడకపోతే ఫరవాలేదా?" కొంటెగా చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"ఈ వేషాలకి భయపడే వెళ్ళిపోదామంటున్నాను. పదండి! పదండి" అంటూ ఏకాంబర్ వెనుక అతని నడుం మీద చెయ్యి వేసి కూర్చుంటూ అంది నూకరత్నం.

ఆమె అంత చనువుగా, అనువుగా మీద మీదకు పడి రాసుకుంటూ కూర్చునేసరికి ఏకాంబర్ శరీరం జలదరించింది.

హాయిగా ఆనందంగా బైక్ ని ముందుకు ఉరికించాడు ఏకాంబర్.

***

ఆదివారం తిరక్కుండానే గోపాలపట్నం మౌర్య థియేటర్ ఎదురుగా ఉన్న ఓ అపార్ట్ మెంట్ లో 'కస్టమర్ సర్వీస్ సెంటర్' ప్రారంభించాడు ఏకాంబర్. దాని ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు గారిని ముఖ్య అతిధిగా ఆహ్వానించాడు. అలాగే సర్వీస్ కౌంటర్ ఓపెన్ చెయ్యడానికి ఇన్సూరెన్స్ కంపెనీ మార్కెటింగ్ మేనేజర్ ని, ఇతర ఇన్సూరెన్స్ అధికారులను ఆహ్వానించాడు.

తాను అయిదేళ్ళుగా పాలసీలు చేయించిన పాలసీదారులనందర్నీ పేరుపేరున ఇళ్ళకు వెళ్ళి మరీ ఆహ్వానించాడు ఏకాంబర్. ఆహ్వానంతో పాటు ప్రతీ పాలసీదారుడికి 'శివరామ నేతిమిఠాయి' చిన్న చిన్న పేకట్లుగా తయారు చేయించి ఆహ్వానపత్రికతో పాటు ఇచ్చి మరీ పిలిచాడు.

ఎంతో ఆదరంగా ఏకాంబరం పిలవడంతో అందరూ ఆనందంగా వస్తామని చెప్పడమే కాకుండా ప్రారంభోత్సవం రోజున కొత్త పాలసీలు రాస్తామని ఏది మంచిదో ముందే చెప్పమని ఏకాంబరాన్ని అడిగి మరీకనుక్కున్నారు.

ఆరోజు -

ఆదివారం!

ఉదయాన్నే ఏకాంబరం మిత్రులందరూ వచ్చి చేరుకున్నారు. ముందు రోజు రాత్రే లోపల అలంకరణ అంతా కానిచ్చేసారు. బుడగలు, రంగురంగుల పేపర్లతో లోపలంతా అలంకరించారు.

అపార్ట్ మెంట్లో గ్రౌండ్ ఫ్లోర్ లో పార్కింగ్ స్థలం లో 'కస్టమర్ సర్వీస్ సెంటర్' ప్రారంభోత్సవానికి వచ్చిన అతిథులందరూ కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేసారు. మొదటి అంతస్థులో ఉంది 'కస్టమర్ సర్వీస్ సెంటర్'.

వచ్చిన వాళ్ళందరికీ ఏకాంబర్ చెల్లెలు అలివేలుమంగ, నూకరత్నం ఆహ్వానం పలుకుతూ ఇన్స్యూరెన్స్ పాంప్లెట్ లతో పాటు ప్రతి ఒక్కరికి ఒక సంపంగి పువ్వు చేతిలో పెడుతున్నారు. వచ్చిన వాళ్ళల్లో కొందరు పువ్వు తీసుకుని 'చెవి'లో పెట్టుకోమంటారా, చేత్తో పట్టుకోమంటారా?" అని జోకులేస్తూ వెళ్తున్నారు.

ఏకాంబరం అంతా హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. అనిల్,రామకృష్ణ, ఆచారి, శంకర్రావులు నలుగురూ వచ్చిన అతిథులందరికీ సాదరంగా ఆహ్వానించడమే కాకుండా డ్రింకులు అందిస్తున్నారు.

సరిగ్గా -

సుముహూర్తానికే ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు గారు మందీ మార్బలంతో విచ్చేసారు. ఏకాంబర్

ఆనందంగా ఎదురువెళ్ళి స్వాగతం పలికాడు.

ఏకాంబర్ అమ్మానాన్నలు అపార్ట్ మెంటులో ఆఫీసు రూమ్ లో అతిథులందరితో పాటూ కూర్చున్నారు.

ఎమ్మెల్యే అబద్ధాలరావుని లిఫ్ట్ లో మొదటి అంతస్థులో ఉన్న కార్యాలయానికి తీసుకువెళ్ళగానే లోపల ఉన్న అతిథులందరూ ఆయనకి నమస్కరిస్తూ బయటకు వచ్చేసారు.

అప్పటికే ద్వారానికి ప్రారంభోత్సవ రిబ్బన్ కట్టి ఉండడం వలన లోపలనుండి వచ్చిన వాళ్ళంతా ఒంగి ఒంగి రిబ్బన్ క్రిందనుండి దూరి వస్తుంటే అందరూ తనకి ఎంతో గౌరవమర్యాదలతో వంగిపోయి మరీ నమస్కరిస్తున్నారనుకుని ఎమ్మెల్యే అబద్ధాలరావు కూడా పదే పదే తనూ వంగి వంగి అందరికీ నమస్కారాలు చేస్తున్నాడు.

ఏకాంబర్ అమ్మానాన్నలు కూడా లోపలనుండి బయటకు రాగానే ఎమ్మెల్యే అబద్ధాలరావుకి వాళ్ళిద్దర్నీ పరిచయం చేసాడు ఏకాంబర్.

"సార్! ఈయన మా నాన్న పీతాంబరం గారు. ఇక్కడే డిపార్ట్ మెంటల్ స్టోర్స్ నడుపుతున్నారు. ఆమె మా అమ్మగారండి" ఎంతో వినయంగా ఎమ్మెల్యేకి తల్లితండ్రుల్ని పరిచయం చేసాడు ఏకాంబర్.

"బావున్నారా సార్! మీరు నా నియోజకవర్గంలోనే వ్యాపారం చేస్తున్నారన్న మాట. మీకేమైనా అవసరమైతే కలవండి. మా ఏకాంబరం నాన్నగారు కదా! ఏ పని కావాలన్నా చిటికెలో చేసి పెడతాను" నవ్వుతూ అన్నారు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు.

"అయ్యయ్యో! మీతో మాకు ఏం పనుంటుంది సార్, మీ దయ వలన ఏదో చిన్న వ్యాపారం చేసుకుని బ్రతుకుతున్నాం" నమ్రతగా అన్నాడు పీతాంబరం.


ఏకాంబరం తండ్రి పీతాంబరం అలా అనేసరికి ఎమ్మెల్యే మొహం ఒక్కసారే నల్లగా మాడిపోయింది. అది గమనించిన ఏకాంబరం రండి సార్ రండి" అంటూ రిబ్బన్ కట్ చేయడానికి తొందర చేసాడు.

వేద పండితులు వేదోచ్చారణ చేస్తూండగా పురోహితుడు మంత్రాలు చదువుతూ ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు గారితో సముహూర్తానికి రిబ్బన్ ని రెండుముక్కలు చేయించాడు.

ఎమ్మెల్యే గారు వస్తున్నారనేసరికే ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా విలేఖర్లు గుంపులుగుంపులుగా వచ్చి చేరుకున్నారు. ఏకాంబర్ కస్టమర్లు కూడా ఊహించనంతమంది వచ్చి చేరుకోవడంతో ఆ అపార్ట్ మెంట్ కారిడారంతా జనాలతో జాతరలా మారిపోయింది.

ఎమ్మెల్యే ప్రారంభోత్సవానికి అపార్టుమెంటుకు చేరుకోగానే గ్రౌండ్ ఫ్లోర్ లో అతిథులను ఆహ్వానిస్తూ రిసెప్షన్ కి కూర్చున్న ఏకాంబర్ చెల్లెలు అలివేలుమంగ, నూకరత్నం ఇద్దరూ అక్కడ దుకాణం కట్టేసి మొదటి అంతస్థుకి వచ్చి చేరుకున్నారు.

ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించినప్పుడు పళ్ళెంలో కత్తెర పట్టుకుని నిలబడింది నూకరత్నమే. ఆమెకి తోడుగా అలివేలుమంగ పూల బొకే చేత పట్టుకుని నిలబడి ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించగానే అతని చేతికి బొకే ఇచ్చి లోపలకు ఆహ్వానించింది.




లోపల ఉన్న మిగతా కౌంటర్లను ఇన్స్యూరెన్స్ అధికారులు ప్రారంభించారు. రెండు కౌంటర్లలో ఒకటి పాలసీలు తీసుకునేది, రెండోది నగదు కట్టించుకునేది. ఆ ప్రక్కన పొడవుగా ఉన్న కౌంటర్ పాలసీదారులు కూర్చుని వివరాలు తెలుసుకోవడానికి, పాలసీ దరఖాస్తులు, ఫిర్యాదుల దరఖాస్తులు నింపడానికి వీలుగా ఏర్పాటు చేసారు.

రెండు కౌంటర్లలోనూ ఒక దాంట్లో నూకరత్నం, రెండో దాంట్లో ఏకాంబరం చెల్లెలు కూర్చున్నారు.

ఏకాంబర్ పిలవగానే ఎంతో ఆనందంగా వచ్చిన కస్టమర్లంతా ఒకరు మీద ఒకరు పోటీ పడి వరుస పెట్టి పాలసీలు కడతామని కౌంటర్ చుట్టూ మూగేసారు.

ఏకాంబర్ ఒక్కడూ వాళ్ళకి పాలసీల వివరాలు చెప్పలేక పోయేసరికి ఇన్సూరెన్స్ అధికారులు కూడా ఆ కౌంటర్ లో కూర్చుని పాలసీదారులకు ఎలాంటి పాలసీ కావాలో వారి ఆర్థిక పరిస్థితిని బట్టి దరఖాస్తు ఫారం నింపించారు.

ఏకాంబరాన్ని ఏజెంటుగా నియమించిన ఇన్సూరెన్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్ర తన బ్యాగ్ లో తెచ్చిన దరఖాస్తు ఫారాలన్నీ అక్కడ కౌంటర్ నిండా పరిచాడు. తనూ ఒక కుర్చీలో కూర్చొని పాలసీ దరఖాస్తులు నింపి ఎవరి వయసుకు తగ్గట్టు వారికి వారు ఎంత ప్రీమియం కట్టాలో వాయిదాల వారీగా విడమర్చి చెప్తున్నాడు.

ఏకాంబరం మధ్యమధ్యలో కౌంటర్ దగ్గరనుండి లేచి కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన వాళ్ళందర్నీ పలకరిస్తూ ఆఫీసు గురించి చెప్తున్నాడు.

ఆ హడావిడి అంతా ఓ అరగంట పాటు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చొని చూసాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు. తనకి వేరే చోట కూడా ఇలా ప్రారంభోత్సవమే ఉందంటూ ఏకాంబరానికి చెప్పి ఇక తను బయలుదేరుతానని కుర్చీలో నుంచి లేచి నిలబడ్డాడు. ఆయన అలా కదిలీ కదలగానే ఆయన వెంట వచ్చిన మందిమాగదులందరూ హడావిడిగా ఆయన చుట్టూ ఈగల్లా మూగేసారు...

"చాలా థేంక్స్ సార్! పిలవగానే నా మీద అభిమానంతో వచ్చినందుకు" ఎమ్మెల్యేకి షేక్ హేండ్ ఇస్తూ అన్నాడు ఏకాంబర్.

"భలేవాడివయ్యా! నా నియోజకవర్గంలో కార్యక్రమానికి నేను రాక మరెవరు వస్తారు. ఇది నా సామ్రాజ్యం. ఏదైనా ప్రారంభించాలన్నా, పాడు చెయ్యాలన్నా నా చెయ్యే పడాల" అంటూ పకపకా నవ్వాడు ఎమ్మెల్యే.

"ధన్యవాదాలు సార్! మీ మేలు మర్చిపోలేను" రెండు చేతుల్తో నమస్కరిస్తూ అన్నాడు ఏకాంబర్.

అప్పటికే ఏకాంబర్ తండ్రి తల్లి ఎమ్మెల్యే గారు వెళ్ళిపోతున్నారని తెలిసి అక్కడకు వచ్చారు. వారు కూడా ఎమ్మెల్యే గారికి నమస్కరించి ధన్యవాదాలు తెలిపారు.

"మంచి చురుకైన కొడుకుని కన్నారండి! బాగా పైకొచ్చే లక్షణాలున్నాయి మీ వాడిలో" అంటూ మీసం మెలివేస్తూ "ఇక వస్తానయ్యా!" అంటూ కారిడార్ లోకి నడిచాడు ఎమ్మెల్యే.

అతనికి బాడీగార్డులుగా వచ్చిన గన్ మెన్లు, ఎమ్మెల్యే అనుచరులు అతని చుట్టూ వలయాకారంలో మూగి ఎవరూ అతని మీద పడకుండా కాపలా కాస్తూ తీసుకువెళ్ళారు.

అనుచరులంతా వీధి రౌడీల్లా కండలు తిరిగిన శరీరాల్తో ఎనుబోతుల్లా ఉన్నారు. ఎవరినీ 'ఎమ్మెల్యే' దరి చేరనివ్వటంలేదు వాళ్ళు.

ఎమ్మెల్యే వెళ్ళగానే అక్కడ వాతావరణం అంతా తుఫాన్ వెలిసిపోయినట్టూ అనిపించింది.

మధ్యాహ్నం రెండు గంటల వరకూ కస్టమర్లు వస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే వెళ్ళిన అరగంటకే ఇన్స్యూరెన్స్ అధికారులు కూడా వెళ్ళిపోయారు.

ఏకాంబర్ మిత్రులు, ఇన్స్యూరెన్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్ర, ఏకాంబర్ అమ్మానాన్నలు చెల్లెలు అలివేలుమంగ, నూకరత్నం మిగిలారు.

అప్పటికి దాదాపు రెండొందల పాలసీలు వరకూ కట్టించారు. ఆ పాలసీల దొంతర చూస్తూనే ఏకాంబరానికి ఆనందం కట్టాలు తెంచుకుంది. ఇన్స్యూరెన్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాలకైతే మతిపోయింది.

'తను ఉద్యోగంలో చేరిన తర్వాత ఇలాంటి అద్భుతమైన 'మోటివేషన్ కేంపైన్' ఎక్కడా చూడలేదు. కనీ వినీ ఎరుగలేదు. ఎంతైనా ఏకాంబర్ ఉండాల్సిన వాడే' మనసులోనే ఉప్పొంగిపోయాడు రాజనాల.

మధ్యాహ్నం భోజనాలు కూడా అక్కడికే రప్పించాడు ఏకాంబర్. ముందురోజే వందమంది వరకూ ఉంటారన్న అంచనాతో కేటరింగ్ వాళ్ళకి భోజనాలు ఆర్డర్ ఇచ్చాడు.

వాళ్ళు భోజనాలు తెచ్చి సర్దుకు కూర్చున్నారు.

రెండు గంటలకి అందరూ భోజనాలు చేసాకే తల్లితండ్రుల్ని, చెల్లాయి అలివేలుమంగని తీసుకుని ఇంటికి వెళ్ళిపోమని చెప్పాడు ఏకాంబరం.

ఎందుకూ పనికిరాడనుకున్న చిన్న కొడుకు ప్రయోజకుడై పదిమందిలోనూ అదీ స్థానిక ఎమ్మెల్యే దృష్టిలో ఎంతో ఉన్నతుడిగా గుర్తింపు పొందేసరికి ఏకాంబర్ తండ్రి పీతాంబరం లోలోనే తెగ మురిసిపోయాడు. తల్లి పర్వతాలు ఆనందం పట్టలేకపోయింది.

ప్రారంభోత్సవం జరుగుతున్నంత వరకూ ఓ మూలన కూర్చున్న ఏకాంబర్ తల్లి పర్వతాలు అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్న కొడుకును చూస్తూ మహదానందపడిపోయింది. పీతాంబరం సరేసరి.

అందర్లోకి పొడవుగా జెండా కొయ్యలా కనిపిస్తూ అక్కడ అంతా తానై తిరుగుతున్న ఏకాంబరాన్ని చూస్తున్న పీతాంబరం "ఊరు మీద బలాదూర్ గా తిరుగుతున్నాడని ఆడిపోసుకున్నాడు గాని ఊరందర్నీ తన చుట్టూ తిప్పుకుంటున్నాడనుకోలేదు ఇన్నాళ్ళు' అని మనసులోనే మననం చేసుకుంటూ మురిసిపోయాడు.

ఇద్దరికీ ఇంటికి వెళ్ళాలని లేదు. కానీ కొడుకే దెబ్బలాడి ఇక మీరు ఇంటికి వెళ్ళిపొండని చెప్పేసరికి కూతుర్ని తీసుకుని ముగ్గురూ ఆటోలో సింహాచలం బయలుదేరారు.

సాయంత్రం వరకూ మిత్రులందర్నీ తనతో ఉండమని చీకటి పడుతుందనగా నూకరత్నాన్ని ఇంటికి వెళ్ళిపోవలసినదిగా చెప్పి పంపేసాడు ఏకాంబర్.

ఆ రోజు వచ్చిన డబ్బంతా పేరు పేరునా ఎవరు ఎంత ఇన్స్యూరెన్స్ కట్టింది ఓ జాబితా రాసి ఏకాంబర్ చేతికి ఇవ్వబోయింది నూకరత్నం.

"మీ దగ్గరే ఉంచండి. ఉదయాన్నే మనం ఇన్స్యూరెన్స్ ఆఫీసుకి వెళ్ళి అందరి పేరునా ఈ డబ్బుకట్టేయ్యాలి, పాలసీలు అన్నీ ఈ వారంలో పూర్తి వివరాలతో నింపి రాజనాల సార్ చేతికి ఇద్దాం" మిత్రులతో మాట్లాడుతూ అన్నాడు ఏకాంబర్.

"అమ్మో! ఇంత డబ్బా! నా దగ్గర వద్దు. మీ దగ్గరే ఉంచండి" భయంగా అంది నూకరత్నం.

"అది డబ్బని ఎవరన్నారు. కాగితాలే అనుకోండి. మీది నాది కాదు కదా! కష్టమర్ల డబ్బు. మనకి

తెల్లకాగితాల క్రిందే లెక్క... మీ దగ్గర ఉంచండి భయంలేదు" నూకరత్నం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"అవునండి. ఈ చిన్న బాధ్యత మోయలేకపోతే రేపు మీరే సొంతంగా ప్రాంచైజీలు తీసుకుని ఎలా నడుపుతారు" డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల చిన్నగా నవ్వుతూ అన్నాడు.

ఆ మాటతో అందరూ ఏకీభవిస్తూ నూకరత్నానికి ధైర్యం చెప్తూ పాలసీదారులు కట్టిన సొమ్మంతా ఒక బ్యాగ్ లో పెట్టి ఆమె చేతికి ఇచ్చారు.

అందరూ అంతలా చెప్పేసరికి మరిక మారు మాట్లాడలేకపోయింది నూకరత్నం.

కానీ, మనసులో భయం భయంగానే ఉంది. చంద్రనగర్ లో తాముంటున్న ప్రాంతమంతా రైల్వే ట్రాక్ ప్రక్కనే ఉంది. అక్కడంతా తమలా ఏ ఆధారంలేని ఆస్తిపాస్తుల్లేని బీదా బిక్కీ ఉంటున్నారు. అందులో చాలామంది సినిమాహాళ్ళ దగ్గర బ్లాక్ టిక్కెట్లు అమ్ముకునేవాళ్ళు, రోడ్ల మీద తినుబండారాలు అమ్ముకునేవాళ్ళు, కూలీనాలీ చేసుకు బ్రతికే వాళ్ళు అందరూ.

'ఈ బ్యాగ్ తో ఇలా తను ఒంటరిగా ఇంటికెళ్తున్నప్పుడు చూసి మీద పడి లాక్కుంటే?! మగ దిక్కులేని ఆడ కుటుంబం కదా అని ఇంటి మీదకొచ్చి లూటీ చేస్తే... అమ్మో!'

నూకరత్నం అందరి మాట విని బ్యాగ్ చేత పట్టుకుని ఇంటికి బయలుదేరిందే గాని భయం భయంగా గుండెలు అదిమి పట్టుకుని చేతిలో బ్యాగ్ గుండెలకు అదుముకుని మెయిన్ రోడ్ లో నడుస్తోంది.

రోడ్డంతా రద్దీగా ఉంది, వచ్చేపోయే వాహనాల రణగొణ ధ్వనులు. బిక్కుబిక్కుమంటూ జనాలందర్నీ తప్పించుకుంటూ రోడ్డు వారగా నడుస్తోంది నూకరత్నం.

గోపాలపట్నం రైల్వే స్టేషన్ బ్రిడ్జీపై నుండి నడుచుకుంటూ అవతలకు చేరాలి. నిత్యం రద్దీగా ఉండే రైల్వే స్టేషన్ బ్రిడ్జీ దాటితే అవతల చంద్రనగర్.

ఇంతలో ఏదో బైక్ హారన్ చెవి దగ్గరే బిగ్గరగా వినిపించేసరికి ఉలిక్కిపడింది నూకరత్నం.

ఉలిక్కిపడి కేష్ బ్యాగ్ ను మరింత బలంగా గుండెలకు అదుముకుంది. బైక్ తో ఎవరో తనని

గుద్దేసాడేమోనన్నంత కంగారుపడిపోయింది నూకరత్నం.

"మేడమ్! కంగారుగా ఉందా?! నేనే!" బైక్ నేరుగా వచ్చి నూకరత్నానికి రాసుకుంటూ ఆగింది.

బైక్ తనని రాసుకుంటూ వచ్చేసరికి ఉలిక్కిపడి చటుక్కున ప్రక్కకు తప్పుకుంది నూకరత్నం. ఆగీ ఆగగానే ఎవరో తననే పిలిచినట్లనిపించి భయంగానే తల ఎత్తి బైక్ వైపు చూసింది నూకరత్నం.

'హమ్మయ్య!' అనుకుంటూ గుండెల్నిండా ఊపిరి పీల్చుకుంది. బైక్ మీద కూర్చుని తననే చూస్తూ చిన్నగా నవ్వుతున్న వ్యక్తిని కళ్ళార్పకుండా చూసి అంతవరకూ తనని పట్టి పిండేసిన భయాన్ని పటాపంచలయ్యేలా మనసులోనుండి తరిమేసింది.

"మీరా!... నా వెనుకే నీడలా వెంటాడుతూ వచ్చారా??" అతని కళ్ళల్లోకి చూస్తూ అంది నూకరత్నం.

"అదేమీలేదు ఒంటరిగా ఇంటికెళ్ళగలవా? లేదా అని డౌట్ వచ్చి వచ్చాను" అన్నాడతను.

"ఏం! ఈ డబ్బుతో ఇలా ఎటైనా పారిపోతాననుకున్నారా?" కొంటెగా అతని కళ్ళల్లోకి చూస్తూ అంది నూకరత్నం.

"అలా అనుకుంటే అంత డబ్బు మీ చేతికివ్వను కదా!"

"మరి, ఏమనుకున్నారు?!"

"నా మనిషే అని నమ్మకంతో" ఆమె కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ అన్నాడు అతను.

"ఓయ్! ఇది రోడ్డనుకున్నావా? పార్క్ అనుకున్నావా? ట్రాఫిక్ కి అడ్డంగా బైక్ ఆపి ఆ అమ్మాయితో ఉప్పర్ మీటింగ్ ఏమిటి?" ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చి లాఠీతో అతని వీపు మీద రెండు దెబ్బలు తగిలీ తగలకుండా కొడుతూ అన్నాడు.

"రండి నూకరత్నం. బైక్ ఎక్కండి! మిమ్మల్ని ఇంటి దగ్గర దించేస్తాను" నూకరత్నాన్ని గాభరా పెడుతూ అన్నాడు ఏకాంబర్.

కానిస్టేబుల్ అలా అనేసరికి నూకరత్నం కూడా గజగజా వణికిపోతూ గభాలున ఏకాంబర్ వెనుక బైక్ మీదకు ఎక్కి కూర్చుంది.

బైక్ ని ముందుకు నడిపించాడు ఏకాంబర్.

"ఆ కానిస్టేబుల్ బెదిరించేసరికి జడుసుకున్నారా?" ఏకాంబర్ వెనుక నెమ్మదిగా అతని మీద వాలుతూ అంది నూకరత్నం.

"మనదే కదా తప్పు. రోడ్డు మీదే అలా బైక్ తో నిలబడి హస్కు కొట్టకూడదు కదా!" అన్నాడు ఏకాంబర్.

"నిజమే. నాకూ భయమేసింది" అంది నూకరత్నం.

"మీరు ఒంటరిగా ఈ బ్యాగ్ తో నడిచి వెళ్ళడం సేఫ్ కాదని వచ్చాను" బైక్ నడుపుతూ అన్నాడు ఏకాంబర్.

"నిజమే కానీ, నడిచి వస్తే రైల్వే బ్రిడ్జి దాటితే చంద్రనగరే కదా! ఆ దారే దగ్గర కదా! ఇలా బైక్ మీదంటే ఇదిగో ఇలా చుట్టూరా తిరిగి మూడు కిలోమీటర్లు పైనే వెళ్ళాలి. ఎందుకింత శ్రమ" అంది నూకరత్నం.

"నడిచి... హారిబుల్! బైక్ అలవాటయ్యాక కాలు కదిపి రెండడుగులు వెయ్యాలంటే... అమ్మో! టైమ్ వేస్ట్ కదా!" బైక్ ని కొత్తపాలెం దార్లోకి మళ్ళిస్తూ అన్నాడు ఏకాంబర్.

"మీరంతా బిజీ బిజినెస్ మేన్ లు కదా సార్!" అంది నూకరత్నం.

"ఈ రోజు మన ఆఫీస్ ఓపెనింగ్ ఎలా జరిగింది?" నెమ్మదిగా ఆనందంగా అడిగాడు ఏకాంబర్.

"అయ్యో! మీరక్కడ లేరా సార్?" ఆశ్చర్యంగా నటిస్తూ అంది.

"జోక్ లు ఆపి చెప్పండి. బాగా జరిగింది కదూ?!" మురిసిపోతూ అన్నాడు ఏకాంబర్.

"బాగానా... అదిరిపోయింది. అంతమంది వస్తారనుకోలేదు. మీరు పిలిచారు గాని, పిలిచినా ఎమ్మెల్యేగారు వస్తారా అనుకున్నాను. కానీ, ఆయన... ఆయన మందీ మార్బలంతో బాగానే టైమ్ కి వచ్చారు." సంతోషంగా అంది నూకరత్నం.

"ఇప్పటికైనా నా మీద మీకు నమ్మకం కలిగింది కదా!" అడిగాడు ఏకాంబర్.

"నమ్మకంతోనే కదా సార్ మీ వెంట పడింది. రేపట్నుండీ మీ ఆఫీసుకు రమ్మంటారా!" తెలివిగా అడిగింది రత్నం.

"ఈ రోజే మొదటి అడుగు పెట్టి మళ్ళీ రావాలా అంటారేమిటి?! రెండో అడుగు వెయ్యరా?!" అన్నాడు ఏకాంబర్.

"మీరు నాతో ఎన్ని 'అడుగులు' వేయిస్తారో చూస్తా కదా! మీమీద భరోసాతో నిన్ననే షాపులో చెప్పేసాను. పని మానేస్తున్నానని" అంది నూకరత్నం.


"అలా అంటే ఆయనేమన్నాడు?" నవ్వుతూ అడిగాడు ఏకాంబర్.

"మీరు ముందే చెప్పేసారట కదా! నన్ను మీ 'సర్వీస్ సెంటర్'లో గుమస్తాగా జాయిన్ చేసుకుంటాను మీరు ఒప్పుకుంటే అని అడిగారట కదా!" ఆశ్చర్యంగా అంది నూకరత్నం.

"ఆయనకి నేనంటే ఎంతో నమ్మకం. అభిమానం. అలాంటప్పుడు ఆయనతో నిజం చెప్పకుండా దొంగతనంగా మిమ్మల్ని నా దగ్గర జాయిన్ చేసుకోవడం సంస్కారం కాదు కదా! అందుకే మీతో మాట్లాడక ముందే బట్టలషాపు ఓనర్ గారితోనే మాట్లాడి ఆయన కూడా సంతోషంగా ఒప్పుకోబట్టే మీకు నా దగ్గర ఆఫర్ ఇచ్చాను" విడమర్చి చెప్పాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా అనేసరికి ఒక్కసారే నూకరత్నం మనసు చిన్నబోయింది.

"ఆయన ఒప్పుకోకపోతే...?!" కొంచెం బాధగా అంది నూకరత్నం.




"లేదు లేదు ఆయన అలాంటివారు కాదు. మంచి మనిషి. ఒప్పుకుంటారని తెలిసే ముందు చెప్పాను" అన్నాడు ఏకాంబర్.

ఎందుకో తెలీదు బాధనిపించింది నూకరత్నానికి. తన మీద అభిమానంతో ప్రేమతో తనని తన

ఆఫీసులో జాయిన్ చేసుకున్నాడనుకుంది. తమ బట్టల షాపు ఓనర్ గారు చెప్పాక, ఒప్పుకున్నాకనే కదా తనని ఆయన ఆఫీసులో పని చేయమని అడిగాడు?! తన అవసరం ఉందనే తనని జాయిన్ చేసుకుంటున్నాడు నిజమే కదా!

ఏకాంబర్ వెనుక కూర్చున్న నూకరత్నం ఉన్నట్టుండి ఒద్దికగా కూర్చుని మౌనంగా ఉండిపోయేసరికి ఉలిక్కిపడ్డాడు ఏకాంబర్.

నూకరత్నం ఎందుకో బాధపడుతోందని గ్రహించాడు. ఆమె మీద ప్రేమతో కాకుండా తన ఆఫీసులో పని చేయడానికి చదువుకున్న అమ్మాయి అవసరమయ్యే తనని జాయిన్ చేసుకున్నాడని అనుకుంటోందని కని పెట్టేసాడు ఏకాంబర్.

"ఇలా మా ఇంటికి వెళ్దామా?!" ఉన్నట్టుండి అన్నాడు ఏకాంబర్.

"ఎందుకూ?" ఉలిక్కిపడి అడిగింది నూకరత్నం.

"అమ్మా నాన్న నిన్ను తీసుకురమ్మన్నారు" అబద్ధం చెప్పాడు ఏకాంబర్.

"ఎందుకూ?" మళ్ళీ అదిరిపడి అడిగింది.

"ఎందుకూ? తప్ప 'అలాగే' అనలేవా?" అడిగాడు ఏకాంబర్.

"ఎలా అనగలను?!"

"ఏం? ఎందుకనలేవు?"

"మళ్ళీ మా ఇంటి దగ్గర దించేస్తారా?"

"రేపు ఉదయమే వద్దాం"

"అమ్మో! అమ్మకు చెప్పకుండా ఈ రాత్రంతా మీ ఇంట్లో ఎలా ఉండగలను?" ఆశ్చర్యంగా అంది నూకరత్నం.

"అవును కదా? మీ ఓనర్ కి తెలీకుండా నేను నిన్ను మా ఆఫీసులో జాయిన్ చేసుకుంటే ఇన్నేళ్ళు మా పరిచయం, స్నేహం ఏమౌతుంది? నువ్వు కూడా మీ ఓనర్ కి చెప్పకుండా పని మానెయ్యలేదు కదా? ఇది అంతే!" తనకి బట్టల షాపు ఓనర్ కి గల అవినాభావ సంబంధం గురించి చెప్పి మా ఇద్దరి మధ్యా ఎలాంటి దాపరికాలు ఉండకూడదని అందుకే నీ గురించి ముందే ఆయనకి చెప్పి ఆయన అనుమతి తీసుకున్నానని నూకరత్నానికి నచ్చచెప్పాడు ఏకాంబర్.

"మీరు మాటకారులు సార్! ఎవర్నైనా మాటలతోనే బురిడీ కొట్టించగలరు" చిన్నగా నవ్వుతూ అంది నూకరత్నం.

"నిజమే కదా! ఇంతదూరం ఆలోచించలేదు తను. తన వలన ఎన్నో ఏళ్లుగా వాళ్ళ మధ్య ఉన్న సత్సంబంధాలు చెడిపోకూడదు కదా!" అని మనసులోనే అనుకుంది నూకరత్నం.

"మిమ్మల్ని బురిడీ కొట్టించలేకపోతున్నాను కదా" తెలివిగా అన్నాడు ఏకాంబర్.

"మీ మాటల్లో పడబట్టే కదా సార్! ఈ బ్యాగ్ బరువు మోస్తున్నాను" మరింత తెలివిగా అంది నూకరత్నం.

"అవును కదా!" అంటూండగానే చంద్రనగర్ లోకి బైకు చేరుకుంది.

"మీ ఇల్లెక్కడో...?!" బైక్ ని చంద్రనగర్ బ్రిడ్జ్ దగ్గర ఆపి అడిగాడు.

"ఇంటి దగ్గరకి తీసుకెళ్ళి ఆపుతారా. వద్దు. మా ఏరియాలో ఉన్నవాళ్ళు నోళ్ళు నొక్కుకుంటారు. అమ్మ మనసు బాధ పడుతుంది. ఆ వీధి చివర ఆపెయ్యండి. అక్కడ నుండి మా ఇల్లు దగ్గరే!" అంది నూకరత్నం.

"అలాగే!" క్షణాల్లో బైక్ ని ఆ వీధి చివరకు చేర్చాడు ఏకాంబర్.

బైక్ దిగి ఇంటికి వెళ్ళబోతూ సడన్ గా ఆగి అంది నూకరత్నం.

"ఈ బ్యాగ్ మీతో పట్టుకువెళ్ళొచ్చు కదా!" వెనక్కి తిరిగి అంది నూకరత్నం.

"ఉండనివ్వండి! అందులో సుమారు మూడు లక్షల చిల్లరేగా ఉంది. ఫరవాలేదు. ఉదయం తొమ్మిది గంటలకల్లా ఆఫీసుకు వచ్చెయ్యండి." అంటూ బైక్ ని గిర్రున వెనక్కి తిప్పి రయ్ మని ముందుకురికించి క్షణాల్లో అక్కడనుండి కనుమరుగయ్యాడు ఏకాంబర్.

'అమ్మో! మూడు లక్షలే!' అనుకుంటూ బ్యాగ్ ని గుండెలకు హత్తుకుని భయం భయంగా ఇంటికేసి అడుగులు వేసింది నూకరత్నం.

ఎదురుగా పాన్ షాపు దగ్గర నలుగురు కుర్రాళ్ళు పాన్ పరాగ్ నములుతూ బ్యాగ్ తో నడిచి వస్తున్న నూకరత్నాన్నే చూస్తూ ముందుకు అడుగులు వేసారు.

వాళ్ళు తన వైపే రావడం గమనించిన నూకరత్నం గుండెలు జారిపోయాయి. 'కొంపదీసి ఈ బ్యాగ్ లో మూడు లక్షల రూపాయలు ఉన్నాయని ఏకాంబర్ సార్ అన్నప్పుడు వీళ్ళు వినేసారా?!' మనసులోనే అనుకుని భయంతో బిగుసుకు పోయింది నూకరత్నం.

***

"ఏమండీ! భోజనం పెట్టనా?" వంటగదిలో నుండే అరిచింది పర్వతాలు. ఆ రోజు ఆదివారం కావడంతో పనేమీ తోచక వీధి వరండాలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు పీతాంబరం.

పేపరు చదువుతున్నాడే గాని ఉదయం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమం అతని మదిలో మెదులుతూనే ఉంది.

"ఎందుకూ కొరగానివాడనుకున్నాడు! ఎంతమందికి తల్లో నాలుకయ్యాడో?! చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది. పెద్దోడే బాగా చదువుకొని 'కంప్యూటర్ ఇంజనీర్' గా ఉద్యోగం చేస్తూ నాలుగురాళ్లు సంపాదిస్తున్నాడు వీడు ఎందుకూ పనికిరాకుండా పోయాడనుకున్నాడు ఇన్నాళ్ళూ'

ఆరేళ్ళయి ఉద్యోగం చేస్తున్నా ఎప్పుడూ జీతం చాలటం లేదు ఖర్చయిపోతుందనే అంటున్నాడు పెద్దోడు. తనే నోరు జారి ఈ నెల దుకాణంలో బేరాలు సరిగ్గా లేవురా అంటే పాతికవేలో ముప్పై వేలో తన ఖాతాలో వేస్తున్నాడు. అంతే కానీ, నెలనెలా నాకింత జీతం వస్తోంది నాన్నా! ఇదిగో! ఇది మిగిలింది. మీ దగ్గరుంచండని ఏనాడూ తనకి పంపించలేదు.

చిన్నోడు - ?!

తనకంతా ఆశ్చర్యంగా ఉంది. ఇంటర్ చదవడానికి ఎన్ని యాతనలు పడ్డాడు. అలాంటివాడు. ఈ రోజు... నగరంలో ఉన్న ప్రముఖలందరికీ పరిచయస్థుడయ్యాడు. పదిమందిలో ఒకడిగా పేరు తెచ్చుకుంటున్నాడు?

"ఏమండోయ్! ఆకలి లేదా? భోజనానికి రారా?" వంటగదిలో నుండి వీధిలో కూర్చున్న మొగుడు దగ్గరకు వచ్చి అతని చేతిలో ఉన్న న్యూస్ పేపరు గభాలున లాక్కుని అంది పర్వతాలు.

"ఆకలెయ్యటం లేదే పర్వతం! ఉదయం నుండి ఆనందంతో నా గుండె నిండిపోయింది. ఎందుకో ఆకలే దరి చేరటంలేదు" భార్యకేసి చూసి తృప్తిగా అన్నాడు పీతాంబరం.

"మీకు ఆకలెయ్యకపోతే, చిన్న పిల్ల దానికి ఆకలెయ్యదా? రండి ముగ్గురం కబుర్లాడుకుంటూ తినేద్దాం" పీతాంబరం చెయ్యి పట్టి లేపుతూ అంది పర్వతాలు.

"ఉండవే! చిన్నోడు కూడా వస్తాడు కదా! మనం వచ్చేసాక అక్కడ విశేషాలు ఏమిటో కనుక్కుని అందరం కలిసి తిందాం" కొడుకు కోసం రోడ్డుకేసి చూస్తూ అన్నాడు పీతాంబరం.

"కొడుకు మీద ప్రేమ ఉన్నపళంగా ఇంతలా పెరిగిపోయిందేమిటో? ఈ అయిదేళ్ళుగా వాడెప్పుడు ఇంటికి టైమ్ కి వచ్చాడండి? పనీ పాటు లేకుండా తిరిగినప్పుడే నయం. టైమ్ కి భోజనానికి టంఛన్ గా హాజరయ్యేవాడు. ఇన్సూరెన్స్ ఏజెంట్ అయ్యాక ఎప్పుడొస్తున్నాడో... ఎప్పుడు వెళ్తున్నాడో నాకే తెలియడంలేదండి ఏ అపరాత్రికో వస్తాడు. వాడే వడ్డించుకుని తిని పడుకుంటాడు. ఉదయం మనం అందరం లేవకముందే స్నానం చేసి పారిపోతాడు. పోనీ ఆదివారాలన్నా దొరుకుతాడంటే స్నేహితులు... సరదాలు... ఈ రోజే నిండుగా మన కళ్ళముందు కనిపించాడు" బాధగా అంది పర్వతాలు.

"ఊరుకో అమ్మా! చిన్నన్న అలా కష్టపడబట్టే కదా నీకూ నాకూ కష్టం లేకుండా ఇంటి నిండా ఇన్ని సామాన్లను తెచ్చి పడేశాడు." ఇంట్లో నుండి వీధిలోకి వస్తూ ఏడుస్తున్న తల్లిని బుదిరిస్తూ అంది అలివేలుమంగ.

"నిజమేలేవే తల్లీ! పెద్ద సాఫ్ట్ వేర్ ఇంజనీర్ నంటాడు. పెద్దోడు ఇంటికోసం ఒక్కటంటే ఒక్క వస్తువు కొన్నాడా? చిన్నోడే నయం. చూడు. పైసా ఖర్చు పెట్టకుండా ఇంటినిండా సామాన్లు ఎలా సర్దేసాడో"

ఆనందంగా కళ్లొత్తుకుంటూ అంది పర్వతాలు.

"కొనకుండానా?! ఎవరిస్తారే!" ఆశ్చర్యంగా పెళ్ళాంకేసి చూస్తూ అన్నాడు పీతాంబరం.

"మీకు ఏది పట్టిందిలెండి? ఎన్నిసార్లు చెప్పాను మీకు, ఫ్రిజ్ ఓసారి, వాషింగ్ మెషిన్ ఓసారి, ఏసి ఓసారి, వాడు వాడుతున్న బైక్ ఓసారి ఇలా ఇంట్లో వున్న ప్రతీ వస్తువూ వాడు చేస్తున్న ఇన్స్యూరెన్స్ కంపెనీలో అందరికంటే ఎక్కువ పాలసీలు చేసినందుకు బహుమతులుగా వచ్చాయని. నమ్మారా?" చేతులు త్రిప్పుతూ ఇంట్లోకి వెళ్ళిపోయింది పర్వతాలు.

తల్లి వెంట అలివేలు మంగ కూడా వెళ్ళిపోయేసరికి పీతాంబరం కూడా పెళ్ళాన్ని పిలుస్తూ వెనకే వెళ్ళాడు.

"నిజంగా నిజమేనంటావా? కమీషన్ కి కమీషన్, ఇలా బహుమతులకు బహుమతులు ఇచ్చేస్తారంటే నాకు నమ్మబుద్ధి కావటంలేదు పర్వతాలు" ఇంట్లోకొచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ అన్నాడు.

"మిమ్మల్ని ఎవరు నమ్మమన్నారు! మానెయ్యండి! ఇన్నాళ్ళయింది మీరెప్పుడన్నా వాటి గురించి ఆలోచించారా? ఎప్పుడో మన పెళ్లయినప్పటి మిక్సీ పాడైంది కొత్తది కొనండి అంటే దాన్నే ముప్పై మూడుసార్లు బాగు చేయించి తెస్తున్నారు" మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది పర్వతాలు.

"అమ్మా! నాకు ఆకలేస్తోందే! అన్నం పెడుతూ నాన్న మీద అరవొచ్చుకదమ్మా!" డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ అంది అలివేలుమంగ.

"నిజమేలేవే! చిన్నప్పట్నుండీ చిన్నోడ్ని నేను నమ్మలేదు. ఎప్పుడూ ప్రేమగా అక్కున చేర్చుకోలేదు. బలాదూర్ గా తిరిగి పాడైపోతున్నాడనే బాధపడేవాడ్ని గాని ఒక్క క్షణం కూడా వాడి కోణంలో ఆలోచించలేకపోయాను." అంటూ ఛటుక్కున డైనింగ్ టేబుల్ దగ్గర నుండి లేచి ఏదో గుర్తొచ్చినవాడిలా పెరట్లోకి పరుగందుకున్నాడు పీతాంబరం.

"భోజనం పెడుతూంటే కంచం ముందు నుండి లేచి అలా పరుగులెడతారేమిటండీ!" కంగారుగా వెళ్తున్న మొగుడికేసి ఆశ్చర్యంగా చూస్తూ అంది పర్వతాలు.

"ఉండవే! పెరట్లో బాత్ రూం అటక మీద మన చిన్నోడు ఇచ్చిన బోర్డు ఒకటి పడేశాను. అది గుర్తుకు వచ్చి..." అంటూ బాత్ రూం దగ్గరకు పరుగందుకున్నాడు పీతాంబరం.

"బావుంది! మీ పిచ్చి! భోజనం చేసాకో, రేపు ఉదయమో చూడొచ్చు కదా! ఇంత రాత్రివేళ దాంతో మీకు పనేంటో...?" అరుస్తూ అంది పర్వతాలు.

"మీరు భోజనం చెయ్యండి. నేను వస్తాను" అంటూ ప్రక్కనే ఉన్న స్టూల్ పైకెక్కి బాత్ రూం అటక పైన ఉన్న చెత్త సామాన్లన్నీ కెలికి కెలికి వెదికాడు ఏకాంబర్.

"మీ నాన్నకి ఏదొచ్చినా పట్టలేం. రాత్రీ పగలూ చూడరు. లేడికి లేచిందే ప్రయాణం అంటారు ఇందుకే" సణుక్కుంటూ కూతురికి అన్నం వడ్డించింది పర్వతాలు.

అటక మీద చేతికందేంత దూరంలోనే ఏకాంబర్ ఇచ్చిన బోర్డు కనిపించేసరికి మునివేళ్ళ మీద నిలబడి ఆ బోర్డును తీసాడు పీతాంబరం.

ఆ బోర్డు నిండా దుమ్మూ ధూళీ పేరుకుపోయి బూజు పట్టి ఉంది. బోర్డు పట్టుకుని బల్ల మీద నుంచి క్రిందకు దిగాడు పీతాంబరం. ఇంతలో సరసరా పాకుతూ అటక మీద నుండి గోడవారగా ప్రాకుతూ పెద్ద పాము పీతాంబరం ప్రక్కనుండే పరుగుపరుగున పారిపోయింది.

అది చూస్తూనే పీతాంబరం భయంతో జడుసుకుని బిర్రబిగుసుకుపోయి గోడకి అతుక్కుపోయాడు. ఏమాత్రం అలికిడి అయినా వెళ్ళిపోతున్న పాము వెనక్కి తిరిగి వస్తుందేమోనని బెదిరిపోయాడు.

అంతే! అక్కడనుండి ఎలా వచ్చాడో తెలీదు. శరీరమంతా చెమటలు పట్టేయడంతో భయం భయంగా హాల్లోకి పరిగెట్టుకు వచ్చాడు పీతాంబరం.

భర్త అలా పరిగెట్టుకు వచ్చేసరికి పర్వతాలు అయోమయంగా చూస్తుండిపోయింది.

"ఏమైందండి! ఎందుకంత కంగారుగా వచ్చారు?" ఆందోళనగా అడిగింది పర్వతాలు.

"పాము... పాము... పెరట్లో బాత్ రూమ్ దగ్గర పామును చూసాను" గుండె అరచేత్తో పట్టుకుని అన్నాడు పీతాంబరం.

"పామా?! బాత్ రూమ్ దగ్గరా...?!"

"అవును! ఇదిగో! ఈ బోర్డు కోసం వెళ్ళాను కదా అప్పుడు నా ముందు నుండే బాత్ రూమ్ గోడ మీద నుండి ప్రాకుతూ పెరట్లో ఉన్న తుప్పల్లోకి పారిపోయింది" ఆగాగి చెప్పాడు పీతాంబరం.

తండ్రి అలా భయం భయంగా పామును చూశానని చెప్పేసరికి భోజనం చేస్తున్న అలివేలుమంగ భయంతో బిగుసుకుపోతూ వింటూ ఉండిపోయింది.

"అమ్మో! తెల్లారగట్లే బాత్ రూమ్ కి ఎలా వెళ్లను" భయంగా అంది అలివేలుమంగ.

"ఛ! ఊరుకోవే. పాము ఎప్పుడో పెరట్లో నుండి బయట తోటలోకి పారిపోయిందట కదా! భయమెందుకు" అంది పర్వతాలు. కూతురికి అలా చెప్పిందే గాని ఆమెకి కూడా మనసులో ఏదో ప్రక్క భయం పీకుతూనే ఉంది.

ఇంతలో ఏకాంబర్ బైక్ శబ్దం వినిపించింది. బైక్ ఇంజన్ ఆగినట్లనిపించింది. ఇంట్లో ఉన్న ముగ్గురూ ఒక్కసారే వీధిలోకి తొంగి చూసారు.

"చిన్నన్నయ్య వచ్చాడు" గట్టిగా అరిచింది అలివేలుమంగ.

ఇంట్లోకి వస్తూనే తల్లి తండ్రి భయం భయంగా ఏదో మాట్లాడుకోవడం వింటూనే నేరుగా డైనింగ్ హాల్లోకి వచ్చాడు ఏకాంబరం.

"ఏమైందమ్మా! ఎందుకలా ఉన్నారు?" జడుసుకున్నట్టున్న తండ్రి వాలకం చూసి అడిగాడు ఏకాంబర్.

"ఏం లేదురా! మన పెరట్లో మీ నాన్నగారు పామును చూసారట. ఇదిగో! భయంతో వణికిపోతున్నారు" నువ్వు రాకపోయినా నవ్వడానికి ప్రయత్నిస్తూ అంది పర్వతాలు.

"ఓస్ అంతేనా! ఇల్లన్నాక మనుషులు, అడవన్నాక జంతువులు, తుప్పలున్నాక పాములు, పురుగులు ఉండక మరేంటి ఉంటాయి నాన్నా" జోక్ పేలుస్తున్నట్టు అన్నాడు ఏకాంబర్.

"నిజంగానే చూసాన్రా! ఒట్టు!" మళ్ళీ భయంగా అన్నాడు పీతాంబరం.




"అవును ఉండక చస్తాయా! వద్దు మొర్రో అంటే గత పదేళ్ళనుండి ఈ పాడు కొంప వదలటం లేదు. అద్దె తక్కువ. ఇంతకంటే మంచి ఇంటికి వెళ్ళాలంటే దొరకద్దా? అంటూ కాలం నెట్టుకొస్తున్నాడు.

నిక్షేపం లాంటి సొంత ఇల్లుంది. అక్కడే ఉందామంటే విన్నారా?! పాలెం లో ఉంది - తెల్లారగట్లే రావడం కష్టం అని ఇక్కడకు తెచ్చి కుదేసారు" కోపంగా అంటూ విసురుగా వంట గదిలోకి వెళ్ళిపోయింది పర్వతాలు.

"ఎందుకమ్మా! నాన్నగారేం చేసారు! ఎప్పట్నుండో ఉంటున్న ఇల్లు. బాగు చేయించాలంటే సొంతం కాదు కదా! పోనీ తిరిగి అందరం పాలెంలో మన పాత ఇంటికి వెళ్ళిపోదామా?" ఆనందంగా అడిగాడు ఏకాంబర్.

"ఉన్న ఊరు కన్నతల్లి ఒక్కటంటారు. అక్కడ మన ఇల్లు ఎలాగైనా సర్దుకోవచ్చు. బాగు చేసుకోవచ్చు. తోట ప్రక్కనుంది ఈ ఇల్లు. ప్రహారీ కట్టడానికి ఇంటి ఓనర్ కి చెయ్యి రావటం లేదు. అద్దె మాత్రం తగ్గదు కదా!" సొంతిల్లు అనేసరికి నవ్వుతూ వచ్చి అంది పర్వతాలు.

"ఇప్పుడు పాలెం పోయి ఎప్పుడో వదిలేసిన ఇంటిని మళ్ళీ బాగు చేయించాలంటే ఎంత ఖర్చవుతుందో తెలుసా' బెంగగా అన్నాడు పీతాంబరం.

"ఏం ఫర్లేదు నాన్నా! నా పేర ఇల్లు కట్టుకోవడానికి పాతిక లక్షల వరకూ అప్పు ఇస్తారట. ఇన్స్యూరెన్స్ ఆఫీసులో బ్రాంచి మేనేజరుగారు చెప్పారు. నా కమీషన్ ఆధారంగా అప్పు ఇస్తారట. తీసుకుందాం! పాలెంలోనే పాత ఇల్లు పడగొట్టి పెద్ద డూప్లెక్స్ కట్టుకుందాం! ఏమంటావమ్మా!" తల్లికేసి చూస్తూ అడిగాడు ఏకాంబర్.

"చాలా సంతోషం నాయనా! మాకంటే ఏడెనకాతల పెళ్ళయిన వాళ్ళంతా పెద్ద పెద్ద భవంతులు కట్టారు. ఇదిగో! మీ నాన్నగారి ఆదాయం గొర్రె తోకలా ఎప్పుడూ ఎదుగూ బొదుగూ ఉంటేనా. కోమటెంకమ్మ కొలువు అంటే ఇదే" నిష్ఠూరంగా అంది పర్వతాలు.

"ఎవరితోనో మనకెందుకమ్మా పోలిక. మనకి నచ్చినట్టు మనం కట్టుకుందాం! రేపే లోన్ పెడతాను. సరేనా!" స్థిరంగా అన్నాడు ఏకాంబర్.

"హమ్మయ్య! ఈ ఇంటి గొడవ వదిలిపోతుంది! అమ్మో! ఉదయం బాత్ రూమ్ కి వెళ్ళాలంటే ఎలా అమ్మా! అక్కడ పాము ఉందన్నారు నాన్న!" భోజనం చేస్తూ ఏకాంబర్ అన్న మాటలు వింటూ ఆనందంగా లేవబోయి పాము విషయం గుర్తొచ్చి మళ్ళీ భయంగా కూర్చుంటూ అంది అలివేలుమంగ.

"పాములా... అవి మనల్నేం చేస్తాయమ్మా! వాటి జోలికి వెళ్తేనే అవి మన మీదకు వస్తాయి... నువ్వెంత భయంగా ఉన్నావో... అవి కూడా మనం వాటిని ఎక్కడ చంపేస్తామోనని భయపడి పారిపోయి పుట్టల్లో దాక్కుంటాయి. ఎవరిని ఎవరూ ఏదీ అనకుండా ఎవరూ ఊరికే మన మీదకు రారమ్మా! పామైతే మనం

భయపడతామని బుసలు కొడుతుంది దాన్ని మనం భయంతో చంపాలని ప్రయత్నిస్తే అది మన మీదకు వచ్చి కాటేయాలని చూస్తుంది. అంతే! నీకు అంతగా భయమైతే ఒంటరిగా వెళ్ళకు. నీతో అమ్మని తోడు తీసుకెళ్ళు" చెల్లికి ధైర్యం చెప్పాడు ఏకాంబర్.

"లేదురా! ఉదయాన్నే పెరట్లో బలిసిన పిచ్చి మొక్కలు, తుప్పలు నరికించేద్దాం! అంతవరకూ భయమే!" నెమ్మదిగా అన్నాడు ఏకాంబర్ తండ్రి పీతాంబరం.

"అలాగే నాన్నా! అలాగే బాత్ రూమ్ దగ్గర, పైన అటక మీద ఎలాంటి చెత్తా చెదారం పెట్టకండి! అవసరమైనవి ఉంచి మిగతావి బయట పారెయ్యండి. చెత్తా చెదారం ఎక్కడుంటే అక్కడ పురుగూ పుట్రా చేరుతాయి కదా!" అన్నాడు ఏకాంబర్.

"నువ్వు కాళ్ళు చేతులు కడుక్కు రారా చిన్నా! భోజనం చేద్దువుగాని' ఏకాంబరానికి డైనింగ్ టేబుల్ మీద కంచెం పెడుతూ అంది పర్వతాలు.

"అలాగే! ఇంతకీ పామెక్కడ కనిపించింది?" బాత్ రూమ్ కేసి వెళ్తూ ఆగి అడిగాడు ఏకాంబర్.

"మీ నాన్నగారికి ఇదిగో... ఎప్పుడో ఇచ్చావట కదా ఆ బోర్డు. ఆ బోర్డు కోసం బాత్ రూమ్ మీద ఉన్న అటక ఎక్కి సామాన్లు కెలికారట. అప్పుడే పాము బాత్ రూమ్ గోడ మీద నుండి ప్రాకుతూ పెరట్లో ఉన్న తుప్పలకేసి అలా తోటలోకి వెళ్ళిపోయిందంటున్నాడు" చెప్పింది పర్వతాలు.

"బాత్ రూమ్ దగ్గర" అంటూ క్షణం ఆగి "మీరూ రండి నాన్నా చూద్దాం" అంటూ తండ్రి చెయ్యి పట్టుకుని బాత్ రూమ్ వరకూ తోడు లాక్కుపోయాడు ఏకాంబర్.

అలివేలుమంగ గబగబా లేచి వెళ్లి పెరట్లో లైటు వేసింది. అటూ ఇటూ దిక్కులు చూస్తూ కొళాయి దగ్గర చేతులూ కాళ్ళూ కడుక్కున్నాడు ఏకాంబర్.

తండ్రి కొడుకులు పెరట్లోకి వెళ్ళగానే తల్లీ కూతుళ్ళు కూడా వారి వెనుకే పెరట్లోకి వచ్చారు.

"ఏరా అన్నాయ్! నువ్వు నాకు భయపడొద్దని చెప్పి నువ్వెందుకురా అంత కంగారు పడుతున్నావ్!" ఎగతాళిగా అంది అలివేలుమంగ.

"భయం కాదే తల్లీ! జాగ్రత్త! పాము ఈ పరిసరాల్లో మళ్ళీ ఎక్కడున్నా తిరుగుతొందేమోనని చూస్తున్నా!" అంటూ చేతులు కడుక్కుని వచ్చేసాడు ఏకాంబర్.

నలుగురూ డైనింగ్ హాల్లో కూర్చుని కబుర్లాడుకుంటూ భోజనాలు కానిచ్చారు. ముందే భోజనం చేసేసిన అలివేలుమంగ తండ్రికి, అన్నకి కొసరి కొసరి వడ్డిస్తూంటే ఉదయం జరిగిన మీటింగ్ విశేషాలు మాట్లాడుకుంటూ ఆనందంగా ముగ్గురూ భోజనాలు ముగించారు.

తల్లితండ్రులతో కలిసి నవ్వుతూ మాట్లాడుతున్నాడే గాని తండ్రి అటక మీద నుండి తీసిన బోర్డు కేసే పదే పదే చూస్తూ భోజనం చేయడం ముగించాడు ఏకాంబర్.

ఆ బోర్డు

ఏజెంటు ఏకాంబర్, సి.బి.ఐ 007, సీతమ్మ పేట, విశాఖపట్నం అని రాసి ఉంది. నల్లని బోర్డు మీద తెల్లటి అక్షరాలు మిలమిలా మెరుస్తూ కనిపిస్తున్నాయి.

అయిదేళ్ళ తర్వాత మూల పడ్డ ఆ బోర్డు బయటకు తీసినందుకు సంతోషపడాలో... ఇన్నాళ్ళూ అటక మీద పడి ఉన్నందుకు బాధపడాలో అర్థం కాలేదు ఏకాంబరానికి.

ఆ రోజు - ఆ బోర్డు విషయంలో తానెంత అవమానంతో కృంగిపోయాడు... ఎన్ని రోజులు పడి పడి ఏడ్చాడో గుర్తొచ్చేసరికి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

చటుక్కున ఎవరికీ కనిపించకుండా తల దించుకున్నాడు ఏకాంబర్.

***

తెల్లారుతోందనగానే బ్యాగ్ భుజాన తగిలించుకుని బయలుదేరాడు ఏకాంబర్. అప్పటికే పీతాంబరం లేచి బయట పేపరు చదువుతూ కూర్చున్నాడు. రాత్రి పామును చూసిన దగ్గరనుండి అతనికి నిద్ర పట్టలేదు.

"నేను వెళ్తున్నాను నాన్నా! మీకు వీలైతే పాలెంలో ఉన్న మన ఇంటి కాగితాలు తీసి ఉంచండి" టిప్ టాప్ గా తయారయి వెళ్తూ అన్నాడు ఏకాంబర్.

"అలాగేరా! ఇదిగో! మన పెరట్లో తుప్పలు కొట్టిద్దామని తొందరగా లేచాను. గాంధీనగర్ లో ఉండే నాగలి అప్పారావుకి కబురు చెయ్యాలి" చెప్పాడు పీతాంబరం.

"అలాగే చెయ్యండి. పదే పదే ఆ పాము విషయమే గుర్తు పెట్టుకుని కంగారు పడకండి! అదేం చెయ్యదు. అమ్మ, చెల్లి భయపడితే అస్సలు పెరటి వైపే వెళ్ళరు" తండ్రికి ధైర్యం చెప్పి బైక్ బయటకు తీసి శుభ్రంగా తుడిచి స్టార్ట్ చేసాడు ఏకాంబర్.

"నువ్వు ఊరిమీద తిరగడానికి వెళ్తే ఆఫీసులో ఎవరుంటార్రా?" కుతూహలంగా అడిగాడు పీతాంబరం.

"నిన్న చూసారే! ఆ అమ్మాయి ఉంటుంది నాన్నా. ఇంకో ముగ్గుర్ని కూడా తీసుకోవాలి. వాళ్ళ కోసం వెదుకుతున్నాను. మనకు తెలిసిన వాళ్ళయితే బావుంటుంది." బైక్ మీద కూర్చుని ముందుకు ఉరికించబోతూ అన్నాడు

"సరేలే! నీకంతా తెలుసు కదా! జాగ్రత్త చిన్నా!" మొట్టమొదటి సారి చిన్న కొడుకుని అంత ఆప్యాయంగా పలకరించాడు పీతాంబరం. తాను ఇన్నాళ్ళూ వాడిని ఎంత చిన్న చూపు చూసాడో గుర్తొస్తుంటే బాధతో మెలికలు తిరిగిపోయాడు.

"మీరు మన ఇంటి డాక్యుమెంట్లు తీసి ఉంచండి. వస్తా" అంటూ బైక్ ని ఉరికించాడు ఏకాంబర్.

కొడుకులు ఇద్దరూ ప్రయోజకులయ్యారు. వాళ్ళని ఓ ఇంటి వాళ్ళని చెయ్యాలి. ఎదిగిన కూతురు ఇంట్లో తచ్చాడుతుండగా మగపిల్లల ఆలోచన రావటంలేదు. ముందు ఆడపిల్లకి మంచి సంబంధం చూసి ప్రయోజకుడైన కుర్రాడికిచ్చి పెళ్ళి చెయ్యాలి. ఆడపిల్లని అత్తవారింటికి సాగనంపాకే వీళ్ళిద్దరికీ పెళ్ళి సంబంధాలు చూడాలి.

పరిపరివిధాలా ఆలోచిస్తూ కూర్చున్నాడు పీతాంబరం.

"ఏమిటీ ఈవేళ ఇంత తొందరగా లేచిపోయారు? ఏమైనా విశేషమా?" నిద్ర కళ్ళు నులుముకుంటూ వీధి తలుపులు బార్లా తెరుచుకున్నాయని గుమ్మం దగ్గరకువచ్చిన పర్వతాలు భర్త పీతాంబరం గుమ్మంలో కూర్చుని ఉండడం చూసి ఆశ్చర్యంగా అడిగింది.

"నిద్ర పట్టలేదు. మంచం మీద దొర్లుతూ గడపలేక లేచాను. అప్పటికే మన చిన్నోడు తయారయిపోయి

బయటకు వెళ్ళిపోతున్నాడు" సంతోషంగా అన్నాడు పీతాంబరం.

"ఈ రోజే చూసారా?! ఈ అయిదేళ్ళ నుండి వాడింతేగా! ఎందుకురా ఇంత పెందరాళే అని అడిగితే 'మనకోసం పాలసీదారులు ఇంట్లో కూర్చోరు కదమ్మా! వాళ్ళు ఇంట్లో నుండి బయటకు వెళ్ళే లోపల మనమే తెల్లారగట్ల వెళ్ళి కలిస్తే వాళ్ళు సంతోషిస్తారు. మన పని కూడా పూర్తవుతుంది' అంటూ నాకే క్లాస్ తీసుకునేవాడు" మొగుడు ప్రక్కనే క్రింద అరుగు అంచు మీద కూర్చోబోతూ అంది పర్వతాలు.

"లేచావుగా! వేడి వేడి టీ పెట్టి తీసుకురావచ్చు కదా. నే ప్రక్కనే చతికిల పడితే 'టీ' ఎవరు పెడతారు?" పెళ్ళాం కేసి చూస్తూ పేపరు క్రింద పెట్టి అన్నాడు పీతాంబరం.

'క్షణం తీరిగ్గా కూర్చుంటే చూడలేరు కదా! ఇంత సేపు 'టీ' గుర్తు రాలేదులా ఉంది." విసుక్కుంటూ విసురుగా వంటగదిలోకి వెళ్ళింది పర్వతాలు.

స్టౌవ్ వెలిగించి 'టీ' పెట్టింది.

ఇంట్లో ఏవో మాటలు వినిపిస్తూంటే ఆ అలికిడికి గబాలున నిద్ర లేచింది. రాత్రంతా చిన్నోడు 'ఆఫీసు' హడావిడే కళ్ళల్లో సినిమా రీల్లా తిరుగుతూ ఉంది. నిద్ర పట్టకపోయినా హాయిగా ఆనందంగా మంచం మీద దొర్లుతూనే గడిపేసింది.

తెలివి వచ్చి చూస్తే వీధి గుమ్మం బార్లా తెరిచి ఉంది. దొంగలు గాని ఇంట్లో దూరారేమోనని ఎంతో కంగారుపడిపోయింది. వీధి గుమ్మం దగ్గరకొస్తే ఈయన పేపరు చదువుతూ కూర్చున్నాడు.

ఎప్పుడూ ఇంత పెందరాలే లేవలేదు. చిన్నోడు లేచి స్నానం చేసి బయలుదేరుతున్నప్పుడు లేవాలని ప్రయత్నిస్తే 'వాడే వద్దు వద్దు పడుకో అమ్మా' అంటూ తన మానాన తను తయారయి వెళ్ళిపోయేవాడు.

ఆలోచిస్తూ 'టీ' పెడుతోంది పర్వతాలు.

మనసంతా ఉల్లాసంగా వుంది. ఇద్దరు కొడుకులూ ప్రయోజకులయ్యారు. ఇక వాళ్ళకి పెళ్ళిళ్ళు చేసెయ్యాలి. అన్నలిద్దరికీ పెళ్ళి చేసాక ఆఖరున కూతురికి పెళ్ళి చేస్తే ఎంతో సంబరంగా... అట్టహాసంగా చెయ్యొచ్చు. ఎప్పుడూ లేందీ ఆయనగారు ఖాళీగా వీధిగుమ్మంలో కూర్చున్నారు కదా! పిల్లలు పెళ్ళి విషయాలే చూచాయగా మాట్లాడవచ్చని కూర్చోబోయింది.

ఎప్పుడన్నా క్షణం విశ్రాంతి ఉండనిస్తాడా ఈయనగారు! ఖాళీగా కనిపిస్తే షాపులో పని పిల్లలకి పని చెప్పినట్టు చెప్తారు!

మనసులో సణుక్కుంటూ 'టీ' వడకట్టింది. రెండు గ్లాసుల్లో 'టీ' నిండుగా పోసి రెండు గ్లాసులూ రెండు చేతుల్తో పట్టుకుని వీధి గుమ్మం దగ్గరకు వచ్చింది పర్వతాలు.

వేడి వేడి టీ పొగ కక్కుతుంటే చూసి 'ఆబ' గా భార్య చేతిలో ఉన్న ఒక గ్లాసు గభాలున కుర్చీలోనుండి లేచి అందుకున్నాడు పీతాంబరం.

చెయ్యి కాలుతుంటే చీర చెంగుతో గ్లాసు పట్టుకుని నెమ్మదిగా సిప్ చేస్తూ వీధి అరుగు గుమ్మంమీద కూర్చుంది పర్వతాలు.

ఇంతలో వీధిలోనుండి ఎవరో అబ్బాయి వెళ్ళడం చూసాడు పీతాంబరం. గభాలున కుర్చీలోనుండి లేచి రోడ్డు మీదకు పరుగందుకున్నాడు. 'టీ' గ్లాసు ప్రక్కనే టక్కున పెట్టి పరిగెత్తాడు పీతాంబరం.

'ఈ మనిషికి ఇంత తొందరెందుకు?! ఆ కుర్రాడితో ఈయనకి పనేంటో?' టీ త్రాగుతూనే ఆలోచిస్తూ వాళ్ళిద్దరి కేసి చూస్తూ అనుకుంది పర్వతాలు.

ఆ అబ్బాయితో మాట్లాడి వెంటనే తిరిగి వచ్చేసాడు పీతాంబరం.

"ఆ కుర్రాడెవరండీ? అంత గాభరాగా పరిగెట్టారెందుకు?" అడిగింది.

"గాంధీనగర్ కుర్రాడు. నాగల అప్పారావుని రమ్మని కబురు చెప్పమని చెప్పాను" కుర్చీలో కూర్చుని 'టీ' తీసుకున్నాడు పీతాంబరం.

"అతనెవరు? ఆయనతో పనేంటండీ?" కుతూహలంగా అడిగింది పర్వతాలు.

"నీకన్నీ అనుమానాలే! పెరట్లో పిచ్చిమొక్కలు పీకిద్దామని. అలాగే పనిలో పనిగా బాత్ రూమ్ అటకమీద సామాన్లని దించేసి శుభ్రం చేయిద్దామని" చెప్పాడు పీతాంబరం.

"మీకెంత భయమండి! రాత్రి కనిపించిన పాము గురించేనా?" చిన్నగా నవ్వుతూ అంది పర్వతాలు.

"భయమే. కానీ, నా గురించి కాదు, మీ గురించి. నేను మరో గంటలో షాపుకని వెళ్ళిపోయి ఏ రాత్రికో వస్తాను. నువ్వూ, అమ్మాయి ఇంట్లోనే ఉంటారు. నీళ్ళని, బట్టలని, అంట్లని పొద్దస్తమానం మీరు ఆ పెరట్లోనే తిరుగుతుంటారు. ఏ క్షణం ఏం జరుగుతుందోనని నేనక్కడ మీకోసం ఆలోచిస్తూ భయం భయంగా గడపాలి. నిర్లక్ష్యం తగదు. మన జాగ్రత్తలో మనం ఉండాలి" చెప్పాడు పీతాంబరం.

అలా అంటున్నప్పుడు పీతాంబరం గొంతులోనూ, కళ్ళల్లోనూ భార్యాపిల్లల మీద ప్రేమ ద్యోతకమయ్యేసరికి పర్వతాలు మనసులో ఆనందంతో పొంగిపోయింది.

ఎప్పుడూ పీనాసిగా ఆలోచించే మొగుడి మనసులో తన పట్ల, పిల్లల పట్ల ఉన్న అనురాగం గమనించేసరికి ఉప్పొంగిపోయింది. గబాలున వెళ్ళి మొగుడి మొహాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దాడాలనిపించింది. కానీ, అందుకు సిగ్గు అడ్డొచ్చింది. వయసు మీద పడ్డాక ఇలాంటి పిచ్చి ఊహలు తగునా అనుకుంది పర్వతాలు.

మనసులోనే ముసిముసిగా నవ్వుకుంటూ మొగుడి మొహంలోకి సూటిగా చూసింది పర్వతాలు. అదే సమయంలో పీతాంబరం కూడా పెళ్ళాంకేసి చూసాడు.

"అదేం అలా చూస్తున్నావ్?" టీ త్రాగడం ముగించి గ్లాసు క్రింద పెడుతూ అన్నాడు పీతాంబరం.




"ఏంలేదండీ! ఈ లేలేత వెలుగులో మీలో ఇంకా అప్పటి ఛాయలు కనిపిస్తూంటేనూ... చూడాలనిపించి చూస్తున్నాను" తనూ 'టీ' తాగడం పూర్తిచేసి గ్లాసు అరుగుమీద పడేసింది.

"ఎప్పటి ఛాయలు?" అయోమయంగా అడిగాడు పీతాంబరం.

"ఎప్పటివో... అదేంటీ? మీ బుగ్గ మీద ఆ నల్లటి మచ్చ!" అంటూ గబాలున లేచి దగ్గరకు వెళ్లి పీతాంబరం మీద ఒంగి చీర చెంగుతో బుగ్గని తుడుస్తున్నట్టు నటించి తన మొహాన్ని మొగుడి మొహానికి తాకించి సుతారంగా అతని బుగ్గల మీద తన పెదవులతో స్పృశించింది పర్వతాలు.

"చీర చెంగుతో తుడవడానికి మీద పడిపోవాలా?" అంటూ పెళ్లాన్ని రెండు చేతులతో పట్టుకుని నెట్టబోయిన పీతాంబరం చేతులు అనుకోకుండా ఆమె ఉదరాన్ని, ముడతలు పడ్డ నడుముని తాకేసరికి ఒక్కసారిగా చురుగ్గా పెళ్లాం కళ్లల్లోకి చూశాడు పీతాంబరం. శరీరం జలదరించినట్టయింది. ఫీజు పోయేముందు చురుగ్గా వెలిగిన బల్బులా అయిపోయింది పీతాంబరం వడలంతా.

ఇదింకా పిటపిటలాడుతూనే ఉంది. పెళ్ళయి ముప్పైఏళ్లు అయినా పట్టుసడలినట్టు లేదు. మనసులో కదలిన గిలిగింతల సవ్వడికి తట్టుకోలేకపోతూ అనుకున్నాడు పీతాంబరం.

"పర్వతాలూ! ఇవేళ నీలో ఏదో తేడా కనిపిస్తోందే!" నెమ్మదిగా, మత్తుగా అన్నాడు పీతాంబరం.

"మీ కళ్లే పాడైనట్టున్నాయి. కళ్లద్దాలు మార్చుకోలేకపోయారా?" చిన్నగా నవ్వుతూ అని మళ్లీ కింద అరుగు మీద కూర్చుంది పర్వతాలు.

"ముగ్గురు పిల్ల తల్లివైనా నీలో ఇంకా ఈ తుళ్లింతలేమిటే?" నవ్వుతూ అన్నాడు పీతాంబరం.

"మీ పెళ్లినాటి ముచ్చట్లు ఆపి పిల్లల పెళ్ళిళ్ల సంగతి ఆలోచించండి!" నవ్వుతూ అంది పర్వతాలు.

"పిల్లలేమిటి? ముందు అలమేలుమంగకి సంబంధం చూసి పెళ్లి చేసేద్దాం. ఆ తర్వాత మగపిల్లలు!" అన్నాడు పీతాంబరం.

"మీకు మతి చెడినట్టుంది. ముందు మగపిల్లల పెళ్లిళ్లయితే కట్నకానుకలు వస్తాయి. ఆ తర్వాత ఆడపిల్ల పెళ్లి ఎంతో ఘనంగా చెయ్యొచ్చు" భర్తకి నచ్చజెప్తూ అంది పర్వతాలు.

"నీవన్నది నిజమే! కానీ, పెళ్లయ్యాక పిల్లలు పెద్దాళ్లవుతారు. అప్పుడు ఇప్పటిలా నీ మాటా, నా మాటా వింటారన్న నమ్మకం వుందా? వచ్చే అమ్మాయిలు మంచివాళ్లయితే ఫరవాలేదు. కాకపోతే, అప్పుడు మన గతేంకాను? అదీ ఆలోచించాలి కదా!" అన్నాడు పీతాంబరం.

"అవినండీ మీరన్నదీ నిజమే!" ఆలోచనలో పడింది పర్వతాలు.

"ముందు అమ్మాయి పెళ్లి ఘనంగా చేద్దాం. అప్పుడు ఎవరూ ఆక్షేపించరు. ఆ తర్వాత మగపిల్లలిద్దరికీ తీరిగ్గా చేద్దాం. ఏమంటావు?" అడిగాడు.

మీ ఇష్టమేనండీ! అదేదో తొందరగా చేస్తే బాగుంటుంది" అంది పర్వతాలు.

"ఇదిగో! ఇవేళ మన పెరట్లో తుప్పలు కొట్టించాక షాపుకెళ్తాను. అక్కడనుండే పెద్దోడికి ఫోన్ చేసి విషయం చెప్తాను. చిన్నోడు సరేసరి. ఇద్దరికీ చెప్పి వాళ్లేమంటారో కూడా తెలుసుకుందాం" అన్నాడు పీతాంబరం.

"అలాగే చెయ్యండి! నేను వంట చేసుకోవాలి, పెరట్లో కెళ్లి అంట్లు తోముకోవాలి" అంటూ లేచి నిలబడింది పర్వతాలు.

అదే సమయంలో పెరట్లో నూతిగట్టు పక్క నుండి సరసరా పాక్కుంటూ నాగుపాము బుసలు కొడుతూ కప్ప వెంట పరుగులు పెడుతోంది.

విశాఖపట్నం సీతమ్మ పేట ఇన్సూరెన్స్ ఆఫీసు.

సోమవారం కావడంతో మహా రద్దీగా వుంది ఇన్సూరెన్స్ ఆఫీసు. ముందురోజు సెలవు కావడంతో పాలసీ ప్రీమియం వాయిదాలు చెల్లించడానికి వచ్చినవారు, పాలసీల మీద అప్పుకోసం వచ్చినవారు, పాలసీదారులు చనిపోయి పాలసీ తాలూకా క్లైం సెటిల్మెంట్ కోసం తిరుగుతున్నవారు, ఏజెంట్లు, డెవలప్ మెంట్ ఆఫీసర్లతో ఆఫీసంతా హడావిడిగా వుంది.

మేనేజర్ కేబిన్లో డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్ర మేనేజర్ తో మాట్లాడుతూ కూర్చున్నాడు. ఏజెంట్ల కోసం ఏర్పాటు చేసిన కేబిన్ నిండా కొత్త, పాత ఏజెంట్లంతా ఎవరి పనుల్లో వాళ్లున్నారు. దానికెదురుగానే డెవలప్ మెంట్ ఆఫీసర్ల రూం వుంది. అందులో ఆ బ్రాంచ్ లో వున్న డెవలప్ మెంట్ ఆఫీసర్లందరి పేరు మీద ఒక్కో టేబుల్, దానికెదురుగా కుర్చీలు వేసి వున్నాయి.

ఇన్సూరెన్స్ ఆఫీసు ప్రవేశ ద్వారం దగ్గర పెద్ద బోర్డు వుంది. అందులో ఆ నెలలో ఏ ఏజెంటు ఎంత ఇన్సూరెన్స్ వ్యాపారం చేశాడో టాప్ టెన్ ర్యాంక్ వరకు మాత్రమే రాసి ప్రదర్శనకు వుంచారు.

ఆ బోర్డులో మొదటగా ఏకాంబర్ పేరే కనిపిస్తోంది. దానికెదురుగా ఆ ఏజెంట్ డి.ఒ. పేరు కూడా రాశారు. ఆ నెలలో చేసిన పాలసీల వివరాలు రాశారు.

"సార్! ఈ ఏడాది మా ఏజెంట్ ఏకాంబర్ 'ఎం.డి.ఆర్.టి.' క్లబ్ లో చేరే అవకాశం వుంది సార్!" చాలా ఆనందంగా మేనేజర్ తో చెప్పాడు రాజేంద్ర.

"అవును. నిన్న కస్టమర్ సర్వీస్ సెంటర్ ప్రారంభోత్సవం రోజున పాలసీ దారుల ఉత్సాహం

చూస్తూంటే తెలిసిపోతోంది. ఖచ్చితంగా ఈ ఏడాది మీవాడు 'ఎం.డి.ఆర్.టి.' క్లబ్ కి అర్హత సాధిస్తాడు" మేనేజర్ కూడా ఆనందంగానే అన్నాడు.

"ఇలామీ ఏజెంట్లు మరొక్కరుంటే చాలు సార్! మన బ్రాంచ్ టార్గెట్ కంప్లీట్ అయిపోతుంది" డి.ఒ. రాజనాల రాజేంద్ర.

"మన బ్రాంచ్ టార్గెట్ అంటారేంటి రాజేంద్రా? జోనల్లోనే మన బ్రాంచ్ టాప్ లోకి వెళ్ళిపోతుంది. కానీ ఏకాంబర్ లాంటి మరో ఏజెంట్ దొరకడం ఆషామాషీ కాదు. మీ అదృష్టం, నా అదృష్టం, మన బ్రంచ్ అదృష్టం. బావుంటే దొరికినా దొరకొచ్చు" ఎదురుగా వున్న మానిటర్ లో ఆఫీసుకి వచ్చిన జి మెయిల్స్ చెక్ చేస్తూ అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

"చూద్దాం సార్!... ఈ ఏకాంబరాన్ని ఏజెంటుని చేయడానికి నేనెన్ని తిప్పలు పడ్డానో ఆ భగవంతుడికే తెలుసు" అన్నాడు రాజేంద్ర.

"ఎన్ని తిప్పలు పడ్డా ఇప్పుడు ఆ ఒక్కడి వల్ల మీరు టాప్ లో వున్నారు. డి.ఒ.ల్లో నంబర్ వన్ గా మీరు, డివిజనల్ లెవెల్లో మన బ్రాంచ్ టాప్ గేర్లో వున్నాయి కదా సార్!" చిన్నగా నవ్వుతూ అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

"సార్! నిన్న చాలామంది పాలసీలు కట్టారు సార్! ఇప్పటివరకూ ఆ పాలసీలు, వాటి తాలూకా ప్రీమియం డబ్బు పట్టుకుని ఏకాంబర్ ఇంకా రాలేదు సార్! ఎందుకు లేటయిందో నాకు అర్థం కావడం లేదు" ఆలోచిస్తూ అన్నాడు రాజనాల రాజేంద్ర.

"ఎస్! నిజమే కదా! అప్పుడే పదకొండు గంటలు దాటిపోతోందే! ఓసారి ఫోన్ చేసి చూడండి!" ఎదురుగా వున్న గోడగడియారానికేసి చూస్తూ అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

"అలాగే సార్! నేను ఏకాంబర్ కోసమే ఎదురు చూస్తూ కూర్చున్నాను. ఈ క్లైంకి, ఈరోజు ఎండాడలో కొత్తగా రిక్రూట్ చేసిన ఏజెంట్ దగ్గర వుండాలి. ఆ కుర్రాడు ఏవో రెండు కాల్స్ వున్నాయి, వాళ్ళింటికి వెళ్ళాలన్నాడు. పాపం! నెలో, రెండు నెలలో ఆ కుర్రాడికి పాలసీలు చేయించడం దగ్గరుండి నేర్పించాలి. కస్టమర్ తో ఎలా మాట్లాడాలో తర్ఫీదు ఇవ్వాలన్నాడు డి.ఒ.

ఇలా ఒక్కొక్కరికీ తర్ఫీదులిచ్చే బదులు మీ కింద పని చేస్తున్న ఏజెంట్లందరికీ ఏ స్టార్ హోటల్లోనో విందు ఏర్పాటు చేసి రోజంతా క్లాసులు పెట్టొచ్చు కదా రాజేంద్రగారూ!" అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

"పాతవాళ్ళందరికీ చేశాం కదా సార్!" అన్నాడు డి.ఒ.

"కొత్తవాళ్ళ సంగతంటున్నాను" అన్నాడాయన.

"పాత, కొత్త అందరూ కలసి వందమంది పైనే వుంటారు సార్! హోటల్లో బిల్లు చాలా అయిపోతోందని ఆలోచిస్తున్నాము" సాలోచనగా అన్నాడు డి.ఒ. రాజనాల.

"బావుంది. వాళ్లు చేసిన వ్యాపారం మీద లాభం, ఆదాయం కావాలి మీకు. వాళ్ల కోసం ఖర్చంటే భయం మీకు. వాళ్లుంటేనేగా మీరుండేది? వాళ్లు బాగా తర్ఫీదు పొంది, బాగా పాలసీలు తెస్తే మీకు దానిమీద ఇన్సెంటివ్ కూడా వస్తుంది. మీ భవిష్యత్తే వాళ్లు కదా రాజేంద్రగారూ! మీ ఆలోచనే తప్పు" డి.ఒ. రాజనాల రాజేంద్ర మొహంలోకి సూటిగా చూస్తూ అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

"నేను వేరే ఆలోచనతో అన్నాను సార్! ఆ ఖర్చులో సగం మీరు మన బ్రాంచ్ నుండి ఇప్పిస్తే బావుంటుందనీ..." నసుగుతూ అన్నాడు డి.ఒ. రాజేంద్ర.

"అంతేనా! మీటింగ్ ఏర్పాటు చేయండి. నేను ఎంత ఇవ్వాలో చెప్పండి. డివిజనల్ ఆఫీసుకి రాసి ఆర్డర్ తెప్పిస్తాను. మీకే కాదు, మీ డెవలప్ మెంట్ ఆఫీసర్లందరికీ ఆ ఆర్డర్ ఉపయోగమే కదా!" అన్నాడతను.

"థాంక్యూ సార్... థాంక్యూ. ఈ మీటింగ్లోనే నా టీంలో బాగా ఇన్సూరెన్స్ బిజినెస్ తెస్తున్న టాప్ పదిమందినీ ఎంపిక చేసి వారికి షీల్డులూ, సత్కారాలు ఏర్పాటు చేస్తాను సార్! దీనివల్ల మిగతావాళ్లు కూడా స్ఫూర్తి పొందుతారు" ఆనందంగా అన్నాడు డి.ఒ. రాజనాల రాజేంద్ర.

"ఎస్! గుడ్ ఐడియా... అలాగే కానివ్వండి. ముందు ఈరోజు ఏకాంబర్ కి కాల్ చేసి అతను నిన్న చేయించిన పాలసీలన్నీ రసీదులు రాయించండి. ఆ పాలసీలన్నీ ఈ నెలలో ఫుల్ ఫిల్ అయ్యేటట్టు చూడండి" అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

"అలాగే సార్! వస్తా సార్!" అంటూ మేనేజర్ కాబిన్ లో నుండి వెలుపలికి వచ్చాడు డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్ర.

'వెధవ! ఇంతవరకూ ఎక్కడికి వెళ్లాడో... చేతినిండా అన్ని పాలసీలు వుంచుకుని వూరిమీద ఎక్కడ తిరుగుతున్నాడో... ఎంత వ్యాపారం చేసినా ఇంకా యావ చావదు వాడికి. ఉదయం లేస్తే యాతన. ఫోన్ చేస్తే ఇదిగో ఈ కస్టమర్ దగ్గరున్నాను, అదిగో ఆ కస్టమర్ ని కలవాలి అంటాడు ' విసుక్కుంటూ ఏకాంబర్ కి కాల్ చేశాడు డి.ఒ. రాజనాల.

రింగ్ అవుతోంది గానీ, అవతల నుండి రెస్పాన్స్ లేదు. రెండు, మూడుసార్లు కాల్ చేశాడు. అవతల ఏకాంబర్ ఫోన్ లిఫ్ట్ చేయకపోయినా విసుగనిపించడం లేదు. మంచి రింగ్ టోన్ వినిపిస్తోంది. పాట ఎంతో ఉత్తేజంగా వుంది. వింటున్నకొద్దీ మళ్లీ మళ్లీ వినాలనిపించే పాట.

'మౌనంగానే ఎదగమనీ మొక్క నీకు చెబుతుంది. ఎదిగినకొద్దీ ఒదగమనే అర్థమందులో వుంది...'

'ఎంత అద్భుతంగా వుందీ పాట... విన్నవాళ్లు ఉత్తేజితులు కావడం ఖాయం' మనసులోనే అనుకున్నాడు డి.ఒ. రాజనాల రాజేంద్ర.

ఉదయాన్నే బయల్దేరి నగరం నలుమూలల్లో వున్న ఆరోజు కలవాల్సిన కస్టమర్లందరినీ కలసి వచ్చాడు ఏకాంబర్.

ప్రీమియం వాయిదాలతో పాటు కస్టమర్ల సమస్యలను తెలుసుకుని వారి దగ్గర లిఖితపూర్వక అభ్యర్థనల్ని తీసుకుని పదకొండు గంటలకు గోపాలపట్నం చేరుకున్నాడు.

అప్పటికే ఆఫీసు తెరచి కూర్చుని వుంది నూకారత్నం. ఆమెతోపాటు ఓ నడివయసు స్త్రీ కూడా సహాయకారిగా వుంది. కార్యాలయం ప్రారంభోత్సవంలాడే ఆ అపార్టుమెంట్ కిందే వుంటున్న వాచ్ మెన్ భార్యను ఆఫీస్ అసిస్టెంటుగా పనిచేయమని అడిగాడు ఏకాంబర్. ఆమె అంగీకరించడంతో ఉదయాన్నే ఏడుగంటలకే ఆఫీసు తెరచి తుడవడం, అన్నీ ఎక్కడివక్కడ సర్దడం, మంచినీళ్లు తెచ్చి ఫిల్టర్లో పోయడం వగైరాలన్నీ ఆమెకు అప్పగించాడు ఏకాంబర్.

ఏకాంబర్ వెళ్లేసరికి నూకారత్నం, ఆమె పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కూర్చున్నారు. కంప్యూటర్ వున్నా ఏంచేయాలో నూకారత్నానికి తెలీదు. ఇంకా ఏ పని చేయాలో అర్థంకాక ఉదయాన్నే వచ్చి కూర్చుంది.

"గుడ్! ఉదయాన్నే వచ్చేశారా? క్యాష్ బ్యాగ్ తెచ్చేశారు కదా!" ఆఫీసంతా కలయతిరిగి అడిగాడు ఏకాంబర్.

"తెచ్చేశాను. అంత డబ్బు పట్టుకుని రాత్రంతా మా అమ్మా, చెల్లాయీ, నేనూ నిద్రపోకుండా కాపలా కాశామండీ బాబూ!"

చిన్నగా నవ్వి వూరుకున్నాడు ఏకాంబర్.

"మీరు బయల్దేరండి. సీతంపేట ఆఫీసుకి వెళ్లి ఈ డబ్బు కట్టి వచ్చేద్దాం!" నూకారత్నంతో అన్నాడు ఏకాంబర్.

"నేనెందుకు సార్! ఇక్కడ వుంటాను" అంది నూకారత్నం.

"రెండుకోజులు పోతే ఆఫీసు బిజీ అవుతుంది కదా! అప్పుడు మీరు నాతో వస్తానన్నా రానివ్వను. ఇప్పుడు మీకు కొంత మార్కెటింగ్ అవగాహన కూడా అవుతుందని రమ్మంటున్నాను" నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"అయితే నేను రెడీ. పదండి" హుషారుగా లేస్తూ అంది నూకరత్నం.

"అమ్మా నువ్వు ఆఫీసు చూస్తూండు. నీకు పనేమైనా వుంటే తలుపులకు తాళాలు వేసుకుని వెళ్లు. కిందే వుంటావుగా, ఎవరొచ్చినా నీకు తెలుస్తుంది" అన్నాడు ఆమెతో ఏకాంబర్.

"అలాగే బాబూ!" ఎంతో వినయంగా తలవూపింది ఆమె.

"రండి నూకరత్నం" అని నూకరత్నాన్ని పిలుస్తూనే బయటకు నడిచాడు ఏకాంబర్.

"అంబర్ సార్! ఈ బ్యాగ్ తేవాలా?" కేష్ బ్యాగ్ చూపిస్తూ అడిగింది నూకరత్నం.

ఆ మాటకు నూకరత్నం కేసి ఆశ్చర్యంగా చూస్తూ నవ్వుతూనే అన్నాడు.


"మరి వెళ్తున్నది ఎందుకండీ! మీకు ముందే చెప్పాను. ప్రతిక్షణం చాలా అలర్ట్ గా వుండాలి ఈ ఫీల్డ్ లో. మనం కనురెప్ప కదిపితే చాలు ప్రక్కవాడు మనల్ని దాటేస్తాడు. మనల్ని తొక్కేసి ముందుకు పరిగెడతాడు.మనవాళ్ళు అనుకున్న కస్టమర్లనే ఎత్తుకుపోతాడు. రండి1 వెళ్ళి ఆ బ్యాగ్ పట్టుకురండి" అంటూ లిఫ్ట్ దగ్గరకు వెళ్ళాడు ఏకాంబర్.

కేష్ బ్యాగ్ తగిలించుకుని ఏకాంబర్ వెంటే అడుగులు వేస్తూ లిఫ్ట్ దగ్గరకు చేరుకుంది.

"మీరన్న ఒక్క ముక్క కూడా అర్ధంకాలేదు. కేష్ బ్యాగ్ పట్టుకురండి అన్నది మాత్రం అర్ధమైంది" లిఫ్ట్ లో ఏకాంబర్ ప్రక్కనే నిలబడి అంది నూకరత్నం.

"అర్ధమౌతుంది. ముందు ముందు అంతా మీకే తెలుస్తుంది. ఇది పోటీ ఫీల్డ్ పరుగుల పందెంకైనా స్టార్ట్ చెప్తారు. టైం ఇస్తారు. ఇక్కడ అలాంటిదేమి ఉండదు. మనకు మనమే పోటీ అనుకుని పరిగెట్టాలి. మనలో ఎవరికి ఎవరూ పందెం కట్టరు.మనమే పందెం పుంజులా పోటీ పడాలి.రండి" లిఫ్ట్ ఆగగానే ముందుకు సాగిపోతూ బైక్ దగ్గరకు వెళ్ళాడు ఏకాంబర్.

బైక్ స్టార్ట్ చేసి నూకరత్నం కేసి చూసాడు ఏకాంబర్.




అతనలా చూడగానే చటుక్కున బైక్ ఎక్కి కూర్చుంది నూకరత్నం.

" కేష్ బ్యాగ్ మెడకు తగిలించుకుని ఒళ్ళొ పెట్టుకోండి " అంటూ తన బ్యాగ్ ముందర పెట్టుకుని బైక్ ముందుకు ఉరికించాడు ఏకాంబర్.

ఆ నెల తిరక్కుండానే ఏకాంబర్ సర్వీస్ సెంటర్ బాగా పాపులర్ అయింది. నూకరత్నంతో పాటు మరో ముగ్గురమ్మాయిల్ని ఉద్యోగులుగా జాయిన్ చేసుకున్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ ఉన్నా లేకపోయినా నూకరత్నమే పాలసీ కస్టమర్లందరికీ వారికి కావలసిన సహకారం అందించగలుగుతోంది. పాలసీలు కూడా రాయించడం, ప్రీమియం వసూలు చేయడం నేర్చుకుని మిగతా అమ్మాయిలతో స్నేహంగా ఉంటూ నడిపిస్తోంది.

ఏకాంబర్ కావాలనే రెండు రోజులకొకసారి సర్వీస్ సెంటర్ కి వెళ్తున్నాడు. తాను లేని రెండు రోజుల్లో ఎంతమంది కస్టమర్లు వసున్నది, వాళ్ళ సమస్యలు వారికి కావలసిన సహాయం అంతా ' రికార్డు ' బుక్ లో రాయించి ఉంచడం అంతా పరిశీలిస్తూనే ఉన్నాడు.

నూక రత్నంలో తనకు తాను ఏ పనైనా నిర్వహించగలననే ఆత్మవిశ్వాసం కనిపించడం గమనించాడు. ఇక ఉపేక్షించకూడదనుకున్నాడు. తను నూక రత్నానికి మాట ఇచ్చినట్టూ, తనని తన కాళ్ళ మీద నిలబడేలా ఏర్పాటు చేయాలని అనుకున్నాడు.

నూకరత్నం మీద నమ్మకం కలగగానే మొబైల్ కంపెనీ వాళ్ళతో మాట్లాడి వారియొక్క కస్టమర్ల నుండి నెలవారీ బిల్లులు వసూలు చేయడానికి నూకరత్నం పేరు మీద ' ఫ్రాంచైజీ ' తీసుకున్నాడు.

ఆ కంపెనీ వారు పోస్టులో ఆర్డర్ పంపించాక అది చూస్తూనే నూకరత్నం ఆశ్చర్యపోయింది.

" అమ్మో! ఈ కంపెనీ కస్టమర్ల తాలూకా బిల్లులు నేను వసూలు చేయాలా..!? ఎలా?! కష్టం కదా ? " ఆందోళనగా అంది.

" ఎందుకు కష్టం? నువ్విక్కడ ఉంటావు. నీ దగ్గర ఓ అయిదుగురు కుఋఋఆళ్ళని జాయిన్

చేసుకుంటావు. నేనున్నా కదా! నీకెందుకు కంగారు? " నూకరత్నానికి భరోసా ఇస్తూ అన్నాడు ఏకాంబర్.

" నువ్వంత తేలిగ్గా తీసుకుంటావ్.! నాకైతే భయంగా ఉంది..చాలా " అంది నూకరత్నం. ఈ నెలరోజుల్లోనూ ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం బాగా పెరిగింది. ఒకరికోసం ఒకరు ఎదురు చూడ్డం, ఒకరి మీద ఒకరు జోకులు వేసుకోవడం...నవ్వుకోవడం అలవాటైపోయి ఒకర్నొకరు ఏకవచనంలో నువ్వంటే నువ్వు అనే స్థాయికి ఎదిగింది వారి మధ్య స్నేహం. ఆ మారు చూసేవాళ్ళు గమనించగలుగుతున్నారు. కానీ వాళ్ళిద్దరూ మూడో వ్యక్తిని పట్టించుకునే స్థితిలో లేరు.

ఆఫీస్ లో అటెండర్ ఆయాతోపాటు మరో ముగ్గురమ్మాయిలు పని చేస్తున్నారన్న విషయం మర్చిపోయి ఇద్దరూ ' మొబలి ఫ్రాంచైజీ ' కోసం తర్జన భర్జనలు పడుతున్నారు.

" మనం అందరం ఉన్నాం కద మేడం! మనకి అండగా ఏకాంబర్ సార్ కూడా ఉంటారు. మీకు భయమెందుకు? " నూకరత్నం ప్రక్కనే కూర్చుని కంప్యూటర్ లో కష్టమర్ల వాయిదాల వివరాలు ప్రింట్ తీస్తున్న ఆమాయి మధ్యలో కల్పించుకుంటూ అంది. ఆ అమ్మాయి సడెన్ గా మధ్యలో దూరి మాట్లాడేసరికి ఏకాంబర్ ఒక్కసారే అదిరిపడ్డాడు. వీళ్ళందరూ ఉన్నారన్న విషయం కూడా మర్చిపోయి ఇద్దరూ అంత చనువుగా మాట్లాడుకోవడం తప్పనిపించింది.

" ఓకే నూకరత్నం! రేపు న్యూస్ పేపర్లో ' యువతీ యువకులు కావలెను ' అని ఒక ప్రకటన ఇవ్వండి వచ్చే ఆదివారం మన ఆఫీసులో వాళ్ళకి ఇంటర్వ్యూలు పెడదాం. అందులో మనకి అవసరమైన వాళ్ళని ఎంపిక చేసుకోవచ్చు. "

అంటూ మరి మాట్లాడకుండా ఆఫీసులోనే నైరుతి మూలన ఉన్న తన క్యాబిన్ లోకి వెళ్ళి కూర్చున్నాడు ఏకాంబర్.

ఇంతలో ఆఫీసు మూసే సమయానికి ఏకాంబర్ మిత్రులు రామకృష్ణ, ఆచారి, అనిల్ ముగ్గురూ కలిసి వచ్చారు. వాళ్ళని చూస్తూనే ఆనందంగా కేబిన్ లో నుంచి బయటకి వచ్చి ఆహ్వానించాడు ఏకాంబర్.

" ఏంట్రా ! త్రిమూర్తులు ఒక్కసారే ఊడిపడ్డారు? " ఆనందంగా అన్నాడు.

" నువ్వు దొరికితే కదరా! ఆదివారాలు దొరికే వాడివి. ఇప్పుడు అదీ లేదు. కొత్త ఆఫీసు..కొత్త మోజులు..ఏం చేస్తాం? తమ దర్శనానికి మేమే వచ్చాం " రామకృష్ణ అన్నాడు.

" శంకు గాడు రాలేదా? " శంకర్రావు కనిపించకపోయేసరికి ఆశ్చర్యంగా అన్నాడు ఏకాంబర్.

ఊర్లో ఉండేవాడివి నువ్వే దొరకడం లేదు. ఊర్లు పట్టుకు తిరిగే మెడికల్ రిప్రజెంటేటివ్ వాడెక్కడ దొరుకుతాడ్రా ! " ఆచారి చురక వేస్తూ అన్నాడు.

" ఊరక రారు మహాత్ములు ! విషయం చెప్పండ్రా! " ఆఫీసు అసిస్టెంట్ గా చేస్తున్న అపార్ట్ మెంట్ వాచ్ మెన్ భార్యను పిలిచి అందరికీ టీలు తీసుకురమ్మన్నాడు ఏకాంబర్.

అప్పటికి అమ్మాయిలందరూ నూకరత్నంతో మాట్లాడుతూ కేరియర్లు పట్టుకుని వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. వాచ్ మెన్ భార్య వాళ్ళ దగ్గరకు వెళ్ళి తిరిగి వచ్చింది.

" సార్ ! వాళ్ళందరూ వెళ్ళిపోతారట. మీ నలుగురికే " టీ ' లు తెమ్మంటారా? " అని అడిగింది.

" తాళాలు నువ్వేకదా వేస్తావు. అయితే వాళ్ళని వెళ్ళిపొమ్మను " అంటూ మిత్రులతో మాటల్లోకి దిగాడు ఏకాంబర్.,

" ఏం లేదురా! మనం అయిదుగురు రాజనాలతో కలుపుకుని ఆరుగురం ఆదివారం ఉదయం అరకు వెళ్ళడానికి ప్లాన్ చేస్తున్నాం. శంకు ఈరోజు రాత్రికే కేంప్ నుండి వచ్చేస్తానని ఫోన్ చేసాడు " చెప్పాడు రామకృష్ణ.

" ఆదివారమా?! చంపావ్‌రా! ఇప్పుడే ఆదివారం చిన్న మీటింగ్ అనౌన్స్ మెంట్ చేసాన్‌రా! మార్కెటింగ్ టీం కావాల్సి వచ్చి పేపర్లో యాడ్ వేస్తున్నాం. ఆదివారం అందర్నీ ఇక్కడికే రమ్మని రాసాము. ఎలారా మరి? " మిత్రుల కేసి ప్రశ్నార్థకంగా చూస్తూ అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా అనేసరికి ముగ్గురూ ఒకర్నొకరు మొహామొహాలు చూసుకుంటూ మౌనంగా ఉండిపోయారు.

" ప్లీజ్..వచ్చే వారానికి ప్లాన్ చెయ్యండిరా! మనం ఆరుగురమే కాదు మీ ఫేమిలీస్ ని కూడ రమ్మనండి! కుటుంబాల్తో వెళ్తే సరదాగా ఉంటుంది. నేనూ మా అమ్మా నాన్నా, చెల్లాయిని కూడా రమ్మంటాను. మా ఆఫీసులో పని చేస్తున్న ఆమ్మాయిల్ని కూడా పిలుద్దాం. " మౌనంగా కూర్చున్న మిత్రుల్ని చైతన్య పరుస్తూ అన్నాడు ఏకాంబర్.

" తినడానికి తిండి లేదుగానీ మీసాలకి సంపెంగ నూనె కావాలన్నాడట నీలాంటివాడే! మనం ఒకరికొకరు కలవడమే కష్టంగా ఉంది ఊరందర్నీ ఉసిగొల్పుతున్నాడు. అంతమందితో అయ్యే పనేనా? " చిరాగ్గా అన్నాడు ఆచారి.

" ఎందుకు కాదు? నాకొదిలెయ్యండి. వచ్చే ఆదివారం అందరం తప్పకుండా అరకు వెళ్తున్నాం.ఎలా అన్నది నేను చెప్తాను. సరేనా " బల్ల గుద్ది మరీ చెప్పినట్టు చెప్పాడు ఏకాంబర్.

" నీ ఇష్టం రా! మేము ఎంతివ్వాలో ఇచ్చేస్తాం! మిగతా ఏర్పాట్లన్నీ నువ్వే చూడు. రేపు ఆదివారం ప్రోగ్రాం లేనట్లే. ఆ వచ్చే ఆదివారం కన్ ఫర్మే కదా! " అంటూ కుర్చీలోనుంచి లేవబోతూ అన్నాడు అనిల్. కూర్చోమని సైగ చేసాడు ఏకాంబర్.

" ఆ వచ్చే ఆదివారం అరకు నువ్వే అన్ని ఏర్పాట్లు చేస్తున్నావు ఈ విషయంలో ఎలాంటి ఢోకా లేదు " ఆచారి , రామకృష్ణ నొక్కి నొక్కి అన్నారు .

" కన్ ఫర్మేరా బాబూ ! మీ ఫేమిలీస్ తో బయలుదేరండి.అరకులో మా మిత్రుడు ఉన్నాడు. రూం లు, అక్కడి భోజనం వగైరా ఏర్పాట్లన్నీ ఆయనకి ఫోన్ చేసి చెప్తాను. అందరం కల్సి ఇరవై మంది వరకూ ఉంటాం కదా! మినీ వ్యాన్ ఒకటి మాట్లాడతాను. పాతిక మంది వరకూ కూర్చునేది. దారిలో బొర్రా గుహలు కూడా చూసుకుంటూ వెళ్ళొచ్చు. " చెప్పాడు ఏకాంబర్.

" బావుందిరా ! మంచి ఐడియా ! ట్రైఅఈన్ అయితే అక్కడా ఇబ్బంది పడాలి. ఇక్కడనుండి మనం వ్యాన్ లో వెళితే ఆకడ అన్ని ప్రాంతాలూ తిరిగి చూడడం తేలికౌతుంది. ఒకే అదే కంఫర్మ్ చెయ్యి. " గట్టిగా ఏకాంబర్ ఆలోచనని బలపరుస్తూ ముగ్గురు మిత్రులొ ఒకేసారి అన్నారు.

ఇంతలో కప్పులతో టీ తీసుకువచ్చి వాళ్ళ ముందు ఉంచింది ఆఫీసు అసిస్టెంటు అయిన వాచ్ మెన్ భార్య.

" రేపు ఆదివారం మాకు ఖాళీ కదా ! మేమందరం ఇక్కడికే వచ్చేస్తాం. నీ మీటింగ్ అయ్యాక టైం ఉంటే మూవీకి పోదాం. " టీ సిప్ చేస్తూ అన్నాడు రామకృష్ణ.

" సరే అలాగే చేద్దాం. మీరు ఉదయం పదో గంటకి ఇక్కడికి వచ్చేయండ్రా! కనీసం పాతిక ముప్పై మందన్నా నిరుద్యోగులు వస్తారని ఆశిస్తున్నాను. వాళ్ళల్లో చురుకైన వాళ్ళని ఎంపిక చెయ్యాలి. మీరూ ఉంటే నాకు పని కొంత సులువుగా ఉంటుంది. " అన్నాడు ఏకాంబర్ " టీ " రెండు గుక్కల్లో త్రాగేసి కప్పు కింద పెడుతూ.

" సార్ ! టీ చల్లగా ఉందంటారా? " కేబిన్ బయట కప్పులు తీయడానికి సిద్ధంగా ఓ మూలన నక్కి నిలబడ్డ వాచ్ మెన్ భార్య గభాలున కేబిన్ తలుపు తోసుకుని లోపలికి వచ్చి అంటూ ఓ ప్రక్కన నిలబడింది.

" వాడంతేనమ్మా! సలసలా మరుగుతున్న ' టీ ' కూడా ఒక్క గుక్కలో త్రాగెయ్యగలడు. ' టీ ' బానే ఉంది " అన్నాడు ఆచారి. ఆమె వినయంగా వంగి కేబిన్ వెలుపలకు వెళ్ళి నిలబడింది.

" రేపు ఆదివారం మీరిక్కడకు వస్తున్నారు. వచ్చే ఆదివారం అందరం విత్ ఫామిలీస్ అరకు వెళ్తున్నాం. దట్సాల్." స్థిరంగా అన్నాడు ఏకాంబర్.

" నువ్వు నొశాచరుడివి. ' పాలసీ ' దొరుకుతుందంటే పగలు రాత్రి తేడా తెలీదు కదరా నీకు? ఇప్పుడు కూడా నువ్వు ఎవరైనా కస్టమర్ల కోసం ఎదురు చూస్తున్నావేమోనని మేము వెళ్ళిపోదాం అనుకున్నాం. " అన్నాడు ఆచారి.

" పోండ్రా ! మీ కుళ్ళు జోకులూ మీరూనూ! అమ్మా మేము వెళ్తున్నాం! తలుపులు జాగ్రత్తగా వెయ్యి " అంటూ కేబిన్ బయట నిలబడ్డ వాచ్ మెన్ భార్యతో చెప్పి మిత్రులతో మాట్లాడుతూ బయటకు వచ్చాడు ఏకాంబర్.

అపార్ట్ మెంట్ లిఫ్ట్ దిగి గ్రౌండ్ ఫ్లోర్ లోకి వచ్చిన మిత్రులకు ఒక వ్యక్తి చిన్న బ్రీఫ్ కేస్ చేత్తో పట్టుకుని గాభరాగా వస్తూ ఎదురయ్యాడు.

టిప్ టాప్ గా తయారయి టక్ చేసుకుని ఉన్నాడు. అతను యువకుడు కాదు. మధ్య వయస్కుడు. బహుశా అపార్ట్ మెంట్లో ఎవరింటికో వచ్చుంటాడులే అనుకుంటూ ఏకాంబర్ ముందుకు నడిచాడు. వాచ్ మెన్ ఆ వ్యక్తిని అడ్డగనిచి ప్రశ్నిస్తున్నాడు.

' పైన కస్టమర్ సర్వీస్ సెంటర్ కి వెళ్ళాలని ' అతను వాచ్ మెన్ తో చెప్తూంటే విన్న ఏకాంబర్ ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. అతను వాచ్ మెన్ తో ఇంకా ఏదో చెప్పబోతున్నాడు.

" ఎవరు కావాలి సార్ ? " వెనక్కి వచ్చి వినయంగా అడిగాడు ఏకాంబర్. మిత్రులు ముగ్గురూ గేటు దగ్గర కబుర్లాడుకుంటూ నిలబడ్డారు.

' కస్టమర్ సెంటర్ ' వాళ్ళని కలవాలి " హుందాగా అన్నాడతడు.

" చెప్పండి సార్ ! నేనే ! " అన్నాడు ఏకాంబర్. వాచ్ మెన్ తన మానాన తన పనిలో నిమగ్నమైపోయాడు.

ఇంతలో పైనుండి ఆఫీసు తాళాలు వేసుకుని లిఫ్ట్ దిగింది వాచ్ మెన్ భార్య. ఆమె నేరుగా అపార్ట్ మెంట్ లో ఓ మూలన ఉన్న తమ గది దగ్గరికు వెళ్ళిపోయింది.

" మీరు...? " సంశయంగా అన్నాడతను.

" ఏజెంట్ ఏకాంబర్ నేనే సార్ ! మీకేం కావాలి ? " అడిగాడు ఏకాంబర్.

" బిగ్ పాలసీ ఒకటి చెయ్యాలనుకుంటున్నాను. " ఏకాంబర్ కేసి ఎగాదిగా చూస్తూ అన్నాడు అతడు.

" చెప్పండి సార్ ! ఎంత పాలసీ తీసుకుందామంకుంటున్నారు? "

మీరు ఎంత పాలసీ వరకు ఇవ్వగలరు ? " అతను తిరిగి ప్రశ్నించాడు.

" మీరు ఎంత ప్రీమియం కట్టగలరో చెప్తే....?! " సంశయంగా అన్నాడు ఏకాంబర్.

" నేనా..." పకపకా నవ్వుతూ నిలబడిపోయాడు అతను.

" నిజమే సార్ ! మీరు ఎంత ప్రీమియం చెల్లించాలనుకుంటున్నారో చెప్తే దానిబట్టి ఫేస్ వాల్యూ లెక్క కట్ట వచ్చు. లేదా ఎంత మొత్తానికి పాలసీ కావాలో దాన్ని బట్టి ఎంత మొత్తానికి పాలసీ కావాలో దాన్ని బట్టి మీరు ప్రీమియం ఎంత కట్టాలో " రెడీ రెక్ నార్ " చూసి చెప్తాను.." విడమర్చి చెప్తూ అన్నాడు ఏకాంబర్.

" కోటి....కోటి రూపాయలు పాలసీ కట్టగలను! మీరు దానికి తగ్గ పాలసీ ప్రీమియం ఎంతో రాసివ్వగలరా?? " ఏకాంబర్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు అతడు.

అంతవరకు గేటు దగ్గర నిలబడి ఏకాంబర్ కోసం ఎదురు చూస్తున్న మిత్రులు ముగ్గురూ ఎంతకీ ఏకాంబర్ సంభాషణ ముగించి రాకపోయేసరికీ వాళ్ళూ అక్కడకు చేరుకున్నారు.

అదే సమయం లో అతను ' కోటి ' రూపాయల పాలసీ కడతాననేసరికి ఏకాంబర్ కళ్ళు బైర్లు కమ్మాయి. మిత్రులు ముగ్గురూ కళ్ళు తిరిగి పడిపోబోయి ఒకర్నొకరు గట్టిగా పట్టుకుని అతనికేసి ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు.

' కొంపదీసి ఇతను ఏ టాటా బిర్లా వారసుడో కాదు కదా ' మనసులోనే అనుకుని అతనికేసి వింతగా చూసారు.

" ఇంత పెద్ద పాలసీలయితే మా ఆఫీసర్లతో మాట్లాడి మీకు చెప్తాం. " తేరుకుంటూ అన్నాడు ఏకాంబర్.

" అందుకే మీ దగ్గర ...మీరు చేయించగల పాలసీ అడుగుతున్నాను..ఓ యాభై లక్షలకు పాలసీ రాసుకోండి.." వచ్చే నెలలో మరో యాభై లక్షల పాలసీ మా ఆవిడ పేర రాద్దురు గాని అవుతుందా?! " అతను సూటిగా ఏకాంబర్ కేసి చూస్తూ అడిగాడు. ఏకాంబర్ నోట మాట రావడం లేదు. తను

అయిదేళ్ళలో ఎంతోమంది కష్టమర్లని కలిసాడు. ఎన్నో పాలసీలు చేయించాడు. తను చేయించిన అత్యధిక ప్రీమియం చెల్లిస్తున్న పాలసీ ఒకటే. అదీ జగదాంబ థియేటర్ ఓనర్ గారితో కట్టించాడు.' పాతిక లక్షల ' రూపాయలకి పాలసీ రాసాడతను. అంతే..!

ఏకాంబర్ కి మతి పోతోంది.కళ్ళు బర్లు కమ్మేస్తున్నాయి. బుర్ర మొద్దుబారిపోతోంది. ఒక్కసారి నిటారుగా నిలబడి గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని చుట్టూరా చూసాడు. అంతా మసగ్గా కనిపిస్తోంది....




ఇద్దరిలో ఒకడన్నాడు.

"ఏరా! నిజమేన? ఆటోలు తోలుకు బ్రతకండిరా అని ఈ ఆటోలు మీకిస్తే నాకే ఎగనామం పెట్టి మోసం చేద్దామనుకున్నార్రా?" కోపంగా  ఇద్దర్నీ  ఒకరి తర్వాత ఒకర్ని బలంగా తన్నాడు ఎమ్మెల్యే అబద్ధాలరావు.

ఎమ్మెల్యే అలా ఎగిరి తంతాడని ఊహించని ఆటో డ్రైవర్లు ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు ఎగిరి పడ్డారు.

" ఈ ఆటోలు అమ్మేయడానికి వీళ్ళ దగ్గర్నుంచి జెరాక్స్ కాగితాలే కదరా!" ఆలోచిస్తూ అన్నాడు ఎమ్మెల్యే.

" ఇదిగోనయ్యా అక్కడ ఈళ్ళ దగ్గర లాక్కున్న కాగితాలు" అంటూ ఇద్దర్లో ఒకడు " సీ" బుక్స్ రికార్డు, ఇన్సూరెన్స్ పేపర్లు అన్నీ ఎమ్మెల్యే చేతికిచ్చాడు.

అవి చూస్తూనే ఎమ్మెల్యే అదిరిపడ్డాడు.

"అమ్మ నా కొడుకుల్లారా! దొంగ సీ బుక్ పుట్టిస్తార్‌రా? అరేయ్, ఈ నాకొడుకుల్ని బొక్కలిరగదియ్యండ్‌రా !" అంటూ పోర్టికోలో ఉన్న కుర్చీలో కూర్చున్నాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు.

అంతే!

ఎమ్మెల్యే నోట ఆమాట రాగానే చుట్టూ రాక్షసుల్లా నిలబడ్డ రౌడీలు కబేళా మీద పడ్డ రాబందులకుమల్లే ఆ ఆటో డ్రైవర్లి మీదపడి ఇష్ట మొచ్చి నట్టు కాళ్ళతో తంతూ, చేతుల్తో పిడిగుద్దులు గుద్దుతూ బంతాట ఆడుకున్నారు.

ఆటో డ్రైవర్లు ఇద్దరూ బట్టలు చిరిగి శరీరమంతా అక్కడక్కడా గీరుకుపోయి రక్తం చిందుతూ శవాల్లా పడిఉన్నారు.

"ఇక చాలు, వీళ్ళని ఆ బీచ్ దగ్గర పడేసి రండ్‌రా!" అన్నాడు గంభీరంగా ఎమ్మెల్యే.

ఆ దృష్యం చూడలేక ఏకాంబర్ కి ముచ్చెమటలు పట్టాయి. గూండాయిజమంటే ఇలా ఉంటుందా అనుకున్నాడు. నూకరత్నమైతే ఆ దృశ్యం చూడలేక తల దించుకుని మౌనంగా ఉండిపోయింది.

ఆ ఆటో డ్రైవర్లిద్దర్నీ బీచ్ దగ్గర పడేసి వచ్చిన ఎమ్మెల్యే గూండాలందరూ తిరిగి ఎవరి స్థానంలో వాళ్ళు మరబొమ్మల్లా వెళ్ళి నీబడి వేటకుక్కల్లా కాపలా కాస్తూ నిలబడ్డారు.

ఆటో వాళ్ళని లాకువచ్చిన ఇద్దరు రౌడీలు ఎమ్మెల్యే దగ్గర చేతులు కట్టుకుని నిలబడి జరిగిందంతా చెప్తున్నారు." అయ్య! మన ఆటో డ్రైవర్ పి.యే. గారికి ఫోన్ చేసి చెప్పాడయ్యా!వీళ్ళిద్దరూ పది రోజులుగా ఇదే ప్లాన్ లో ఉన్నారట. ఈరోజు ఆటోలు తీసుకుని ఆర్టీవో ఆఫీసు కాడకు వెళ్ళడం చూసి పి.యే. గారికి ఫోన్ చేసాడట. ఆ వెంటనే మేమిద్దరం వెళ్ళాం. " ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు వినయంగా చెప్పారు.

"సరిసరి!ఆటో అద్దెలన్నీ రోజూ సక్రమంగా వసూలు చేస్తున్నారా?" గదమాయిస్తూ అడిగాడు ఎమ్మెల్యే." అయ్యో! రోజూ ఆటో బాడుగలన్నీ వసూలు చేసి పి.యే.గారికి అణా పైసలతో కట్టేస్తున్ నామయ్యా!" అన్నారిద్దరూ.

"సరే ఇక మీరు వెళ్ళండి" అన్నాడు ఎమ్మెల్యే. వాళ్ళిద్దరూ తమతం స్థానాల్లోకి వెళ్ళి నిలబడ్డారు.ఎమ్మెల్యే పోర్టికోలోనుంచి పి.ఏ. గదిలోకి వచ్చాడు.

"పి.యే గారూ ఇలాంటి దొంగవెధవలకి ఎలా అయ్యా ఆటోలు అద్దెకిచ్చావ్? నీకు బుద్ధుందా??" కోపంగా పి.యే.మీద విరుచుకు పడ్డాడు." లేదండయ్యా! మన ఆటో డ్రైవర్లలోనే ఎవరో వీళ్ళని తీసుకువచ్చి పని లేదు. ఆటో ఇస్తేతోలుకు బ్రతుకుతాడంటే కొత్త ఆటోలు తెప్పించి ఇచ్చానయ్యా" నమ్రతగా అన్నాడు పి.యే.

ఎమ్మెల్యే గదిలోకి రావడంతోటే ఏకాంబర్,నూకరత్నం గబాలున లేచి నిలబడ్డారు."మీరు అందరి దగ్గరా కాగితాల మీద సంతకాలు పెట్టించుకుంటే ఎంత డబ్బు కట్టాలో లెక్కేసి చెప్పండి మా పి.యే ఇస్తాడు తీసుకోండి.! రశీదులు రేపు సాయంత్రానికల్లా మా పి.యే చేతికి అప్పగించండి." అన్నాడు ఎమ్మెల్యే.

" అలాగే సార్!" నమ్రతగా అన్నాడు ఏకాంబర్.

"పి.యే.గారూ ఇందాకల వచ్చాడే, అతనిచ్చిన డబ్బు ఆ సూట్ కేస్ లో ఉంది కదా! వీళ్ళని ఎంతో అడిగి ఇచ్చెయ్యండి! ఏజెంట్ గారితో వచ్చిన అమ్మాయికి ఆ సూట్ కేస్ బహుమతి గా ఇచ్చెయ్యండి." అంటూ ఏకాంబర్ కేసి, నూకరత్నం కేసి నవ్వుతూ చూసాడు ఎమ్మెల్యే."

థేంక్సండీ!" వినయంగా అంది నూకరత్నం.

" ఉదయం నుండీ ఈయనతో పడిగాపులు పడి ఉన్నారు కదా! అందుకు..ఆ! ఏకాంబర్ గారూ రేపు రశీదులన్నీ తెచ్చి ఇవ్వడం మర్చిపోకండి. మీ పనంతా ఈరోజే కంప్లీట్ చేసుకోండి. ఆ రశీదులు చాలా ముఖ్యం. ఇంకం టాక్సు కోసం మా ఆడిటర్ గారు తెమ్మన్నారు. ఇవి కడితే ఏదో కొంత ట్యాక్స్ మిగులుద్దటటకదా  మీకు లాభం, మాకు లాభం  అందుకే మీరు అడగ్గానే మా పి.యే.గారుచెప్పింది గుర్తొచ్చి ఈల్లందరి పేర పాలసీలు కడుతున్నాను. నేను వెళ్ళాలి. పని కానివ్వండి." అంటూ ఎమ్మెల్యే లోపలకు వెళ్ళిపోయారు.

బయట ఉన్న ఇద్దర్నీ పిలిచి సంతకాలు తీసుకున్నాడు ఏకాంబర్. ఇరవై మందికి నలభై పాలసీ పేపర్ల మీద సంతకాలు తీసుకున్నాడు. వాటికి కావల్సినపేపర్లన్నీ తీసుకున్నాడు. బ్యాంకు పాస్ బుక్స్, పాన్ కార్డులు, ఆధార్ కార్డులు, అన్నీ తీసుకుని ఎమ్మెల్యే గారింటికి కొద్ది దూరంలో ఉన్న జిరాక్స్ సెంటర్ కి వెళ్ళాడు ఏకాంబర్.

క్షణాల్లో జెరాక్స్ తీయించుకుని వచ్చేసాడు. ఎందుకైనా మంచిదని అన్ని కాపీలు నాలుగేసి జెరాక్స్ తీయించి తన దగ్గర భద్రపరుచుకున్నాడు.

ఇంటి దగ్గర ఉండిపోయిన ఇద్దరి గురించి పి.యే. ని అడిగాడు ఏకాంబర్.

" సార్ మిగతా ఇద్దరి సంగతి?"

" మీరు వెళ్తార? మా వాడ్ని ఒకడ్ని మీతో పంపిస్తాను. వీళ్ళందరి ఇళ్ళు ఒకే దగ్గర. కంచరపాలేం హైవే ప్రక్కన " వాంబే గృహాలు" ఉన్నాయి చూశారా, అందులోనే ఉంటున్నారు" చెప్పాడు పి.యే.

" ఓ, తెలుసు సార్!" ఆనందంగా అన్నాడు ఏకాంబర్." వాళ్ళిద్దరి దగ్గరా సంతకాలు తీసుకోండి. ఈ ఇరవైమందికి ఏడాదికి ఎంత ప్రీమియం కట్టాలో చెప్తే, ఆ డబ్బు ఆ కొత్త సూట్ కేస్ తో సహా ఇచ్చేస్తాను " నవ్వుతూ అన్నాడు పి.యే.

" సుమారు పన్నెండు లక్షల వరకూ అవుతుంది సార్.! అన్ని రైడ్ లు జత చేసి కాలిక్యులేట్ చేయ్యాలి. మా డెవలప్ మెంట్ ఆఫీసరు గారుంటే పని క్షణాల్లో అయ్యేది" నీళ్ళు నములుతూ అన్నాడు ఏకాంబర్.

ఓ పని చెయ్యండి సార్. పన్నెండు లక్షలూ ఇచ్చేస్తాను. మిగిలితే రశీదులతోబాటు తెచ్చివ్వండి. ఏమైనా కట్టాల్సివస్తే నాకు ఫోన్ చెయ్యండి. మావాడితో మీకు ఆ డబ్బు పంపిస్తాను." చెప్పాడు పి.యే.

" మీఇష్టం సార్. సార్, మరో విషయం. మన వాళ్ళందరికీ ఒకే ముద్దగా పది లక్షల రూపాయల పాలసీ కడితే మెడికల్ ప్రాబ్లం వస్తుందని రెండుగా చీల్చి అయిదేసి లక్షల చొప్పున రెండు పాలసీలు రాసాను పర్వాలేదు కదా" భయం భయం గా అడిగాడు ఏకాంబర్, పి.యే. ని."

గొప్పగా చెప్పారు. పళ్ళు రాలగొట్టుకోవడానికి ఎన్ని రాళ్ళైతే ఏం సార్! ఎమ్మెల్యే గారు చెప్పినట్టు పదిలక్షలయింది కదా!" అన్నాడు పి.యే. పకపకా నవ్వుతూ.

" థేంక్యూ సార్! మీరేమంటారోనని భయపడ్డాను." అన్నాడు ఏకాంబర్.

" ఉండండి! లోపల ఉన్న సూట్ కేస్ తెస్తాను" అంటూ వెళ్ళాడు పి.యే.

ఆనందంగా నూకరత్నం కేసి చూసాడు ఏకాంబర్.

" నిజంగా మెడికల్ ప్రాబ్లం అవుతుందా?" గుసగుసగా అంది నూకరత్నం.

"పది లక్షలు కాదు, పాతిక లక్షలున్నా ఆ ప్రాబ్లం రాదు. వీళ్ళంతా ముప్పై ఏళ్ళలోపు వాళ్ళే కదా! చిన్న అబద్ధం....తప్పదు కదా!" అన్నాడు ఏకాంబర్.

లోపలినుండి సూట్ కేస్ తో డబ్బు తెచ్చి ఏకాంబర్ ముందు పెట్టాడు పి.యే.

టీ పాయ్ మీద సూట్ కేస్ తెరిచి   లోపల ఉన్న నోట్ల కట్టలన్నీ ఏకాంబర్ కి చూపించి పన్నెండు లక్షలు లెక్క అప్పజెప్పాడు పి.యే." ఇక మేము వెళ్తాము సార్. మీవాడ్ని పంపిస్తే దార్లో మిగిలిన ఇద్దరి దగ్గరా సంతకాలు తీసుకుని ఆఫీసుకు వెళ్ళిపోతాం" చెప్పాడు ఏకాంబర్.   "అలాగే!" అంటూ బయట నిలబడ్డ ఒక అనుచరుడ్ని పిలిచి ఏకాంబర్ వాళ్ళతో పంపించాడు పి.యే.

" ఇదిగో, నా బైక్ మీద వెళ్ళి వీళ్ళకి మనవాళ్ళ ఇల్లు చూపించి వెంటనే వచ్చేయ్, అదును దొరికింది కదాని ఇంట్లో కూర్చోక" అంటూ మిగిలిన ఇద్దరి పేర్లూ చెప్పాడు పి.యే.

ఆ అనుచరుడు బైక్ మీద ముందు వెళ్తూంటే అతన్ని ఫాలో అయ్యారు ఏకాంబర్, నూకరత్నం లు. ఎమ్మెల్యే ఇంటి దగ్గర బైక్ స్టార్ట్ చేసే ముందే డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్రకి ఫోన్ చేసి విషయం అంతా చెప్పాడు ఏకాంబర్ ఆనందంగా. ఏకాంబర్ చెప్పింది వింటూనే ఎగిరి గంతేసి ' క్షణాల్లో గోపాలపట్నంలో ఉంటానూ అంటూ ఫోన్ పెట్టేసాడు రాజనాల   రాత్రి పది గంటలకి ఇల్లు చేరుకున్నాడు ఏకాంబర్.

ఇంట్లో అందరూ టీవీ ముందు కూర్చుని ఉన్నారు. వస్తూనే ఆకలిగా ఉందని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు ఏకాంబర్." ఏరా! నీ టార్గెట్ ఎంత వరకూ వచ్చింది?"   టీవీ ముందునుండి లేస్తూ అడిగింది ఏకాంబర్ తల్లి పర్వతాలు.

" అయిపోయిందమ్మా! ఒక్కరోజులో అద్భుతం జరిగినట్టు జరిగింది " ఆనందంగా అన్నాడు ఏకాంబర్."

నమ్మకంతో పనిచేస్తే ఏ పనన్నా తప్పకుండా సక్సెస్ అవుతుందిరా !" అంటూ తండ్రి పీతాంబరం కూడా టీవీ ముందు నుండి కొడుకు దగ్గరకు వస్తూ అన్నాడు.

" మీ ముగ్గురూ ఇంతవరకూ పడుకోలేదేం? ఎప్పుడూ నేను వచ్చే సరికి గాఢ నిద్రలో ఉండేవారు" అన్నాడు ఏకాంబర్.

"ఉదయం   నువ్వు ఆందోళనగా వెళ్ళడం చూసాం కదరా   టైం కూడా లేదు, టార్గెట్ కంప్లీట్

కాలేదన్నావు కదా! ఏం చేస్తున్నావో?!" ఎలా నీటార్గెట్ కంప్లీట్ అవుతుందోనని మాకూ ఆందోళన కలిగిందిరా." అంది తల్లి.

" నిజమేనమ్మా! ఈసారి నేను వెనకబడిపోతానేమోననే అనుకున్నాను. కానీ రత్నం ఉంది కదా! మంచి ఐడియా ఇచ్చింది. అంతే. నా కళ్ళను నేనే నమ్మలేనంతగా పాలసీలు దొరికాయి" సంతోషంగా అన్నాడు ఏకాంబర్.

" అదే అనుకున్నాన్రా, మన షాపుకొస్తావని ఎదురుచూసాను. నువ్వు రాకపోయేసరికి ఏదో పనిలో ఉన్నావనుకున్నాను. నేనూ నాకు బాగా తెలిసిన కష్టమర్లని పాలసీ గురించి అడిగాను. కడతాను, మీ అబ్బాయిని నా దగ్గరకు పంపమన్నార్రా" కొడుక్కి ఎదురుగా డైనింగ్ టేబుల్ మీద కూర్చుంటూ అన్నాడు తండ్రి పీతాంబరం.

" మీరూ ఇంకా భోజనం చెయ్యలేదా ?" తండ్రి తన ఎదురుగా కూర్చోవడంతో ఆశ్చర్యంగా అడిగాడు ఏకాంబర్." లేదురా, నువ్వు వస్తే కలిసి భోంచేస్తానని టీవీ ముందు కూర్చున్నారు. " తల్లి పర్వతాలు అంది.

ఎప్పుడూ లేంది తండ్రి తనకోసం ఆలోచించడం ఏకాంబరానికి ఆనందం కలిగించింది. తను వచ్చేవరకూ భోజనం కూడా చెయ్యకుండా తండ్రి ఎదురు చూస్తున్నాడని తల్లి చెప్పగానే మనసంతా ఉప్పొంగిపోయింది. అదీగాకుండా షాపుకొచ్చిన కష్టమర్స్ ని తన కోసం, తన టార్గెట్ కంప్లీట్ చేయడం కోసం తండ్రి నోరు విడిచి పాలసీ అడిగాననేసరికి ఆనందం పట్టలేకపోయాడు.

" థేంక్స్ నాన్నా! నాకోసం పాలసీ కూడా అడిగారు." అంటూండగానే ఏకాంబర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గబుక్కున నీళ్ళు తుడుచికున్నాడు.

" మేము కాకపోతే నీకోసం ఇంకెవరు ఆలోచిస్తార్రా? భోజనం చెయ్యి నాన్నా!"కొడుకు తల ప్రేమగా నిమురుతూ అంది తల్లి పర్వతాలు." నువ్వు బాగుంటే మేము బావున్నట్టే కదరా! నీ ఆనందమే మా ఆనందం. ఉదయం నువ్వింత ఆందోళనగా కనిపించడం నేనెప్పుడూ చూడలేదు. షాపులో ఉన్నానేగానీ నీగురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. అంతలో ఒక కష్టమర్ వచ్చాడు. అడిగాను. అంతే! ఇందులో గొప్పతనం ఏముంది? పర్వతాలూ..ఆ చారు ఇలా అందుకో!" కంచంలో పప్పు అన్నం కలుపుకుంటూ అన్నాడు పీతాంబరం.

" మీ తండ్రీ కొడుకుల ముచ్చట్లు ఆపి ముందు భోజనాలు చెయ్యండి" ముసిముసిగా నవ్వుతూ అంది తల్లి పర్వతాలు.

" అమ్మా నాకు నిద్రొస్తోంది. టీవీ కట్టేస్తున్నాను. " అంటూ అంతవరకూ టీవీ ముందు కూర్చున్న మంగ టీవీ కట్టేసి వెళ్ళిపోయింది." అలాగే! వెనక స్విచ్ కూడా ఆపేసి వెళ్ళు" డైనింగ్ టేబుల్ దగ్గర నుండే అరిచింది పర్వతాలు." అవునంట! మీరు షాపు దగ్గరకు రమ్మన్నారట కదా, ఎందుకు నాన్న?" భోజనం చేస్తూ అడిగాడు ఏకాంబర్.

"అదేరా! మన ఇంటి గురించి" అన్నాడు పీతాంబర్.

" అదా, మనం అన్నీ సబ్ మిట్ చేసాక రెండు మూడు నెలలకు మా హెడ్డాఫీసు నుండి ఆర్డర్ వస్తుందట నాన్నా! ఈలోగా మనం ఇల్లు పడగొట్టి చదును చేయించాలి." అన్నాడు ఏకాంబర్.

" మీ ఇద్దరూ ఇంటి గురించే ఆలోచిస్తున్నారు గానీ ఇంట్లో ఆడ పిల్ల ఉంది, దాన్నో ఇంటిదాన్ని చెయ్యాలని చూడరా?" కోపంగా అంది పర్వతాలు. " సంబంధాలు చూస్తున్నాం కదా కుదరనీ" అన్నాడు పీతాంబరం.

" మంచి సంబంధం చూడండి నాన్న! కట్న కానుకలకి వెనుకాడకండి! ఇల్లు కట్టడం ఆపేసైనా ముందు చెల్లెలి పెళ్ళి ఘనంగా చేద్దాం" అన్నాడు ఏకాంబర్.

" మానాయనే! చూడండి..చిన్నోడికున్నంత బాధ్యత కూడా మీకు లేదు" మొగుడి మీద విరుచుకుపడుతూ అంది పర్వతాలు.




ఆదివారం ఏకాంబర్ అనుకున్న దానికంటే ఎక్కువమందే యువతీయువకులు ఇంటర్వ్యూకొచ్చారు. ఏకాంబర్ ఇచ్చిన ప్రకటన కూడా ఆకర్షణీయంగా ఉండడంతో డిగ్రీలు, పి.జీ లు, చివరికి బిటెక్ చేసిన వాళ్ళు కూడా ఇంటర్వ్యూకొచ్చారు.

అప్పటికే నూకరత్నం పేరు మీద పేరున్న చిట్ ఫండ్ కంపెనీల్లో ఏజెన్సీ తీసుకున్నాడు. కొత్తగా ప్రారంభించిన ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్ళు 'బిజినెస్ డెవలప్ మెంట్ అఫీసర్' పేరు మీద కమీషన్ ప్రాతిపదికన డిగ్రీ అయిన వాళ్ళకు ఏరియాల వారీగా నియమిస్తున్నారని తెలిసి నూకరత్నాన్ని తీసుకువెళ్ళి అక్కడ కూడా జాయిన్ చేసాడు. ఆ ఇన్సూరెన్స్ కంపెనీని రెండు పెద్ద బ్యాంకులు కలిసి ప్రారంభించాయి. సెల్ ఫోన్ కంపెనీల బకాయిలు ' రికవరీ ' చేసే బాధ్యత కూడా 'ఫ్రాంచైజీ' తీసుకున్నాడు ఏకాంబర్.

ఆ వారంలోనే ' ఎక్కడ కమీషన్ ' వస్తుందో... ఏ వ్యాపారం సులువుగా చెయ్యొచ్చో గ్రహించిన ఏకాంబర్ అన్నిట్లోనూ ' నూకారత్నాన్ని ' చేర్చాడు.

అయితే, నూకరత్నం దానికి అడ్డు చెప్పలేదు. ఆశ్చర్యంగా ఏకాంబర్ కేసి చూసిందేగాని దేనికీ అడ్డుచెప్పలేదు. ఏకాంబర్ వ్యవహారం పూర్తిగా అర్థంచేసుకుంది ఆమె. సమర్థుడైనవాడు, సమస్యనైనా, సంపాదనైనా తెలివిగా, తేలిగ్గానే సాధిస్తాడు.

తను తీసుకున్న ఫ్రాంచైజీలనన్నీ దృష్టిలో పెట్టుకుని పదిమందిని చాకుల్లాంటి వారిని ఎంచుకుని జాయిన్ చేసుకున్నాడు ఏకాంబర్. మిగతా వారిని కూడా నిరుత్సాహపరచకుండా అందరి ఫోను నెంబర్లు తీసుకుని అవసరమైతే కబురు చేస్తానని చెప్పాడు.

ఏకాంబర్ మిత్ర బృందం కూడా ఆదివారం అంతా అక్కడే గడిపారు. యువతీయువకుల ఎంపికలో వారు కూడా సహాయపడ్డారు. నూకరత్నం మాత్రం బొమ్మలా అంతా చూస్తూనే కూర్చుంది.

ఎంపికైన వాళ్ళందర్ని కూర్చోబెట్టి తమ దగ్గర వాళ్ళు చేసిన పనికి జీతంతో పాటు ఇన్సెంటివ్ కూడా ఇస్తామని, ఎవరు ఎంత చురుగ్గా పనిచేస్తే అంత ఎక్కువ సంపాదించవచ్చని చెప్పాడు.

ఒక్క జీతమే కాకుండా తాము పడ్డ కష్టానికి ' ఇన్సెంటివ్ ' కూడా ఇస్తామనడం వారందరికి ఎంతో బాగా నచ్చింది.

ఆ రోజు సాయంత్రమే అందరికీ తమ వ్యాపార వివరాలు, పనుల్లో మెలకువలు వగైరా ఎన్నో విషయాలు వివరిస్తామని చెప్పి వాళ్ళను ఇళ్ళకు పంపేసాడు ఏకాంబర్.

సాయంత్రం ఆరుగంటలకల్లా అందరూ వచ్చి చేరుకున్నారు.

ఉదయం నుండి ఏకాంబరాన్నే అవటి పెట్టుకున్న మిత్రులంతా మధ్యాహ్నం అక్కడే భోజనం చేసి సాయంత్రం వరకూ కాలక్షేపం చేసేసారు. నూకరత్నంతో పాటు మిగతా ముగ్గురు అమ్మాయిలు,

ఏకాంబర్ మిత్ర బృందంతో పాటు అప్పుడే అక్కడకు వచ్చిన రాజనాల రాజేంద్ర కూడా కుర్చీల్లో కూర్చున్నారు.

వారికి ఎదురుగా ఏకాంబర్ ఒక్కడే లీడర్ కు మల్లే కూర్చున్నాడు. అతని ప్రక్కన రెండు కుర్చీలు వేయించాడు. ఈలోగా వాచ్ మెన్ భార్య అందరికీ 'టీ'లు తెచ్చి ఇచ్చింది. అందరూ 'టీ' కప్పులు ఖాళీ చేసే పనిలో ఉన్నారు.

ఏకాంబర్ లేచి నిలబడి హేండ్ మైక్ పట్టుకున్నాడు. బ్యాటరీ తో నడిచే చిన్న సైజు మైకు. చిన్న చిన్న వీధి సభల్లో వాడే బ్యాటరీ మైక్ సెట్ అది. దానికి టేప్ రికార్డర్ తో అనుసంధానించి సౌండ్ బాక్స్ లు ఏర్పాటు చేసారు. "నిరుద్యోగంలో నుండి 'సద్యోగం' లోకి విచ్చేస్తున్న యువతీయువకులకు స్వాగతం. 'సద్యోగం' ఎందుకన్నానంటే రోజుకు 'ఎనిమిది గంటలు' లెక్కల మీదే చేసి 'వెట్టిచాకిరీ' ఉద్యోగం కాదు ఇది. మీకు నచ్చినంత సేపు నచ్చినంత కష్టపడే మీ మనసు మెచ్చిన పని ఇది. దీనికి నెలకి ఇంత 'ఆదాయం అని లేదు. మీరు 'పని చేసే' విధానం మీద అధారపడి ఆదాయం వస్తుంది. ఏదో 'ఫైనాన్స్ కంపెనీ' లా డిపాజిట్లు, మనీ సర్క్యులేషన్ స్కీముల్లాంటి మోసపూరితమైన పని కూడా కాదు ఇది.

ఇక్కడ మీరు చేయవలసిందల్లా 'సెల్ ఫోన్ ల కంపెనీ' ల తరపున వాయిదా వసూలు ఏజెంట్లుగా, చిట్ ఫండ్ కంపెనీల తాలూకా చిట్టీలు కట్టించడం మన 'సర్వీసు సెంటర్' చేపట్టే ఇతర ప్రాజెక్టులలో కూడా పాలుపంచుకోవడం అంతే... అంతే అన్నానని ఇదేదో కళ్ళు మూసుకుని చేసే పని కాదు. ప్రతిక్షణం అప్రమత్తతతో... అనుక్షణం ఇదే ధ్యాసలో 'పనే ధ్యేయం' గా చేయాల్సి ఉంటుంది.

మీ అందరికీ మరో ముఖ్య విషయం చెప్పాలి. నేను మీ అందరి లాగా డిగ్రీలు చదువుకోలేదు. ఎన్నో అవస్థలు పడి ఎట్టకేలకు ఇంటర్మీడియట్ వరకూ చదువుకోగలిగాను. కానీ, నేనీ రోజు ఇలా ఉన్నానంటే దానికి కారణం ఆయనే. దయచేసి ఇన్స్యూరెన్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్ర గారు ఇక్కడకు రావలసినదిగా కోరుతున్నాను.

ఏకాంబర్ చెప్పింది విని అందరూ ఒకేసారి 'రాజనాల' కేసి తలలు త్రిప్పి చూసారు. రాజనాల కుర్చీ లోనుండి లేచి వెళ్ళి ఏకాంబర్ ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"ఇకపోతే నేనీరోజు ఇక్కడ మీ ముందు ఈ స్థాయిలో ఎలా ఎదిగానో చెప్పేముందు మీ అందరికీ మరో వ్యక్తిని పరిచయం చెయ్యాలి. మీలాగే డిగ్రీ చదివి ఏం చెయ్యాలో తెలీక... తోచక బట్టల షాపులో సేల్స్ గర్ల్ గా జాయిన్ అయిన నూకరత్నం గారు మీకందరికీ 'బాస్' గా వ్యవహరిస్తారు. రండి నూకరత్నం గారూ!" అంటూ నూకరత్నం కేసి చూసి చెయ్యి వూపి పిలిచాడు ఏకాంబర్.

కుర్చీలో నుండి లేచి నిలబడి అందరికీ నమస్కారం చేసి ఏకాంబర్ దగ్గరకు వెళ్ళి అతనికి కుడివైపున

ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చుంది నూకరత్నం.

"సార్! నాదో చిన్న సందేహం?! అడగొచ్చా?!" ఎంపికైన యువతీయువకుల్లో ముందు వరుసలో కూర్చున్న యువకుడు లేచి అడిగాడు.

"సందేహం అడిగి తెలుసుకోవడమే కాదు మీకు తోచిన మంచి సలహా... అదే 'సందేశం' కూడా ఇవ్వడంలో తప్పులేదు. అడగండి" నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"చిట్ ఫండ్" కంపెనీలో చిట్స్ కట్టించాలంటున్నారు. అవి నమ్మదగ్గవేనా?! తర్వాత మాకు ఎలాంటి ఇబ్బంది లేదు కదా?" కుతూహలంగా అడిగాడా యువకుడు.

"గుడ్! ప్రశ్న మంచిదే! మనం ఏజెన్సీ తీసుకున్న రెండు చిట్ ఫండ్ కంపెనీలు గత నలభై సంవత్సరాలుగా ఎంతోమంది కస్టమర్ల నమ్మకాన్ని చూరగొన్నవి. ముఖ్యంగా అవి రాష్ట్రవ్యాప్తంగానే కాదు. ఇతర రాష్ట్రాల్లో కూడా 'చిట్ ఫండ్' వ్యాపారం చేస్తున్న పెద్ద కంపెనీలు. వాటి పేర్లు వింటే మీరే ఆమోదిస్తారు. వాటిలో మీరు చిట్ లు కట్టిస్తే ఎక్కువ ఇన్సెంటివ్ ఇస్తాము. మిగతా కంపెనీల వీలునామా వసూలుకు ఒక విధంగా ఇన్సెంటివ్ ఉంటుంది. ఉదాహరణకు 'సెల్' కంపెనీ వాయిదాల వసూలు తెచ్చారనుకోండి. ఆ నెల మొత్తం మీరు వసూలు చేసిన మొత్తం మీద మీకు ఇన్సెంటివ్ వస్తుంది. అదే చిట్ కట్టించారనుకోండి. ఒక్కసారే చిట్ విలువలో అర శాతం ఇస్తాం. లక్ష రూపాయల చిట్ అయితే అయిదు వందల రూపాయలు అదే పాతిక లక్షల చీటీ అయితే పన్నెండు వేల అయిదు వందలు ఇస్తాం. మీరు నెలంతా ఇతర వాయిదాలు సుమారు రెండు లక్షల వసూలు చేస్తే జీతంతో పాటు మీరు మీకు రెండు వేలు అదనంగా అందుతుంది. అదే మీరు ఒకరోజు ఒక చీటీ కట్టిస్తే ఆ మొత్తం మీద ఒకసారే చిట్ వాటాలో అర్ధరూపాయి మీకు అందుతుంది." చెప్తూ అగాడు.

"అర్థమయ్యింది సార్! మీరు చెప్పిన రెండు చిట్ కంపెనీల్లో ఎవరు చిట్ కట్టమన్నా కడతారు. అది ఒకప్పుడు! ఇప్పుడు బ్యాంకులే ఇంటింటికి తిరిగి అప్పులిచ్చేస్తుంటే ఇక ఎవరు సార్ చిట్స్ కడతారు" ఆ కుర్రాడు మళ్ళీ అన్నాడు.

"మీ పేరు.." ఆ కుర్రాడికేసి చూస్తూ అడిగాడు ఏకాంబర్.

"కుమార్! సార్!" అన్నాడో అబ్బాయి.

"చూడు కుమార్! నువ్వు చేస్తున్న పని మీద ముందు నీకు నమ్మకం కలగాలి. ఏజెంటు అనేవాడి నోట కాదు...లేదు...రాదు...అవదు... అనే వ్యతిరేక పదాలు రాకూడదు. 'ఇసుకను పిండి తైలం' తియ్యగల సత్తా ఉన్నవాడే ఏజెంటు. అవునా!" అంటూ ఆ కుర్రాడి కేసి చూసాడు ఏకాంబర్. అతను మౌనంగా ఉండిపోయాడు.

"సార్! మేము 'ఇన్సూ్యరెన్స్' లాంటివి కట్టించక్కరలేదు కదా?" మరో కుర్రాడు అడిగాడు.

"ఇన్సూ్యరెన్స్ కట్టించాలనుకునే వారికి మేం జీతాలు ఇవ్వం. ఇన్సెంటివ్ లు కూడా ఉండవు. అయితే, వారిని ఏజెంట్లుగా పరీక్ష రాయించి ఇన్సూ్యరెన్స్ కోడ్ తెప్పించి వారు చేసే ఇన్సూ్యరెన్స్ వ్యాపారానికి చేదోడుగా ఉంటూ దగ్గరుండి అతని అభివృద్ధికి కృషి చేస్తాం. మీలో ఎవరైనా ఏజెంటుగా జాయిన్ అవ్వాలని కోరిక ఉంటే చెప్పండి.!" అడిగాడు ఏకాంబర్.

"నో సర్!" అందరూ ముక్త కంఠంతో ఒక్కసారే అరిచారు. వాళ్ళ అరుపు పేలిని చూసి లేడి అరచిన అరుపులా అనిపించింది.

ఏకాంబర్ ఆశ్చర్యపోలేదు. రాజనాల ముసిముసిగా నవ్వుకున్నాడు. నూకరత్నం మొహం కందగడ్డలా మారిపోయింది. అన్నీ ఎంతో సులువుగా అయిపోతాయనుకుంది. కానీ, యువతీయువకులు స్పందన చూసి అవాక్కయిపోయింది.

"ఒకే! మీకు ఇష్టం లేని పని చెయ్యమని చెప్పములెండి! మిమ్మల్నందర్ని సెల్ కంపెనీ రికవరీకి, చిట్ ఫండ్ కట్టించడానికి తీసుకున్నాం. కానీ మీకో విషయం చెప్పనా?" అంటూ అగాడు ఏకాంబర్.

"చెప్పండి సార్!" ఉత్సాహంగా అరిచాడు అందరూ.

"మీ అందరితో పాటు మీతో కూర్చున్న ఆ నలుగురూ నా మిత్రులు" ఏకాంబర్ అలా అనేసరికి అందరూ ఒక్కసారే అటు తిరిగి చూసారు. అప్పటికే మిత్రులు నలుగురూ లేచి నిలబడి చిన్నగా నవ్వి నమస్కారాలు చేసారు.

"అందులో లావుగా ఉన్నాయన అనిల్, ఎన్.ఎస్.టి.యల్ లో సైంటిస్ట్. అతనికి నెల జీతం ఎంతో తెలుసా ఎనభై వేలకు పైగానే అందుతుంది. రెండో అతను రామకృష్ణ, చిట్ ఫండ్ కంపెనీలో మేనేజర్ గా చేస్తున్నాడు. పాతిక వేలకు పైగానే జీతం వస్తుంది. సంవత్సరానికి లక్ష రూపాయల వరకూ ఇన్సెంటివ్ కూడా అందుకుంటున్నాడు. మూడో ఆయన శంకర్రావు. మెడికల్ రిప్రజెంటేటివ్, నాలుగో అతను ఆచారి. నాలాగే ఇన్సూ్యరెన్స్ ఏజెంటు. కానీ, ఆయన పేరుకే ఏజెంటుగా చేస్తున్నాడు. అతనికి తాత ముత్తాతల నుండి సంక్రమించిన తరగని ఆస్తి ఉంది. అందుకే ఆయన పెద్దగా శ్రద్ధ చూపించడటంలేదు.

ఈ సోదంతా ఎందుకనుకుంటున్నారా? నా నెలసరి ఆదాయం ఎంతో చెప్పమంటారా?" అంటూ కేబిన్

లో ఉన్న సూట్ కేస్ తెరచి ఒక బిల్లు తీసి  అందరికీ చూపించాడు ఏకాంబర్.

"ఇది నాకు పదిహేను రోజులకు వచ్చే ఆదాయం. నేరుగా నా బ్యాంకు ఖాతాలోకి వెళ్ళిపోతుంది. ఇదిగో చూడండి!" అంటూ ఎదురే కూర్చున్న కుమార్ అనే యువకుడి చేతికిచ్చాడు ఏకాంబర్.

కుర్చీలోనుండి నిలబడి ఏకాంబర్ ఇచ్చిన బిల్లు చూసి అదిరిపడ్డాడు. అతని చేతిలో ఉన్న బిల్లు ఒక్కొక్కరూ లాక్కుని చూసి ఆ పదిమందీ కళ్ళు తేలేసారు.

"సార్! ఇది సాధ్యమా? పదిహేను రోజులకే రెండున్నర లక్షలా?!" ఆశ్చర్యంగా అన్నాడు కుమార్. అతనో యువకుడు.

"ఇది పెరుగుతుంది. తరుగుతుంది. అయితే నెలయ్యేసరికి నా ఆదాయం ఐదు లక్షలు దాటే ఉంటుంది. నిజమో అబద్ధమో మీరే మీ కళ్ళతో చూస్తున్నారు కదా. అయితే ఇది చూపించింది నా మిత్రుల్ని కించపరచాలని కాదు. మీరంతా బాగా చదువుకున్న వాళ్ళు. నేను కేవలం ఇంటర్గాడ్ని. డిగ్రీలు చదివిన మీరే ' నెగిటివ్ ' మూడ్ తో ఆలోచిస్తూంటే మరి నేనెలా ఇదంతా సాధించానంటారు" అందరికేసి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"ఎలా సార్! నమ్మశక్యంగా లేదు" అందరూ ఆశ్చర్యంగా అన్నారు.

"నేను ఈ రోజు ఇలా వున్నానంటే ఇదిగో ఈయనే! సార్! ఇన్స్యూరెన్స్ కంపెనీలో డెవలప్ మెంట్ ఆఫీసర్ మారుమూల గ్రామంలో బలాదూర్ గా తిరుగుతున్న నన్ను వెదుక్కుంటూ వచ్చిన దేవుడు. నజం... నా పాలిట నిజంగా దేవుడే మా అమ్మ,...నాన్న...అన్న అందరూ నేనెందుకూ పనికిరానని వదిలేసారు. నేను చదివిన ఎండాకాలం చదువుకి ఎక్కడా ఉద్యోగం దొరకదన్న నిరాశతో నైరాశ్యం లో బలాదూర్ గా తిరిగేవాన్ని అప్పుడు....అప్పుడు...ఇతను నన్ను  వెతుక్కుంటూ వచ్చాడు. మొట్టమొదట మా కలయిక గురించి చెప్తే మీరు ఆశ్చర్యపోతారు." ఆగాడు ఏకాంబర్ . అప్పటికే అతని కళ్ళల్లో నీళ్ళూరుతున్నాయి.

"చెప్పండి సార్! ప్లీజ్ చెప్పండి" యువతీయువకులు అందరూ ముక్తకంఠంతో అడిగేసరికి ' నూకరత్నం ' మొహంలో ఆనందం వెల్లివిరిసింది. మిత్రులు నలుగురూ నవ్వుతూ ఏకాంబర్ కేసి చూసారు.

"వీడు అసాధ్యుడే... అందర్నీ ట్రాన్స్ లోకి లాక్కుపోతున్నాడు." అనిల్ చెవిలో గుసగుసగా అన్నాడు ఆచారి.

"డి.వో రాజనాల గారికి నన్ను ఇదిగో మా మిత్రులు ముగ్గురూ గొప్పగా పరిచయం చేసారు. రాజనాల ఆనందంగా నాకేసి తిరిగేసరికి నేనక్కడనుండి పరుగోపరుగు... ఎందుకంటే నన్నెక్కడ ఈయన ఇన్స్యూరెన్స్ ఏజెంట్ గా చేయమని అడుగుతాడోనని భయం తో పరారయిపోయాను." అంటూ నవ్వాడు ఏకాంబర్. ఆనాటి సంఘటన, గుర్తొచ్చి మిత్రులంతా పకపకా నవ్వారు. మిగిలిన వాళ్ళంతా వారికేసి వింతగా చూస్తుండిపోయారు.

ఏకాంబర్ తన విజయగాథ చెప్పడం కోసం కుర్చీలో కూలబడి మైకుని సవరించాడు గొంతులాగా...

తెల్లవారుతోంది. చీకటి కర్పూరం లా నెమ్మదిగా హరించుకుపోతోంది.


కొండమీద దేవుడి గుడిలో సుప్రభాతం మొదలయ్యింది. కొండ మీద ఎక్కడో ప్రారంభమైన సుప్రభాత సేవ మెట్ల మార్గం నుండి క్రింద వూళ్ళో దేవస్థానానికి చెందిన పురూరవ, పుష్కరిణి, జయ, విజయ, తిరుమల తిరుపతి దేవస్థానం భవనాల పైన అమర్చిన మైకుల ద్వారా వూరంతా శ్రావ్యంగా వినిపిస్తోంది.

కొండమీద దేవుడి గుళ్ళో సుప్రభాతం వింటూనే మెలకువ వచ్చేస్తుంది ఏకాంబరానికి. సరిగ్గా నాలుగంటలయ్యేసరికి దేవాలయం లో సుప్రభాత సేవలు ప్రారంభమవుతాయి.

గబాగబా లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాడు ఏకాంబర్.

గాంధీనగర్ లో బాల్యమిత్రుడు ఎర్రాజీ ఇంట్లో వాళ్ళ అక్క పెళ్ళి. వారం రోజులుగా కార్డులు పంపకం, పెళ్ళి పనుల్లో బిజీగా గడిపాడు. ఈరోజు రాత్రి పెళ్ళి. ఉదయాన్నే వంటలు మొదలవుతాయి. ఎర్రాజీ మరీ మరీ చెప్పాడు. తెల్లారగట్లే వస్తే 'వంట' వాళ్ళకి సహాయంగా ఉండొచ్చని, ఏమైన సరుకులు లేకపోతే తేవాల్సి

జరిగిన కథ




టిప్ టాప్ గా తయారయి ఇంట్లో నుండి బయటకు వస్తూ టక్కున ఆగిపోయాడు ఏకాంబర్.

గుమ్మం దగ్గర నిలబడి వున్నాడు తండ్రి పీతాంబరం.

తండ్రిని చూస్తూనే అదిరిపడ్డాడు ఏకాంబర్.

ఎప్పుడూ తెల్లారితే గానీ నిద్రలేవని తండ్రి, ఈరోజు ఇంత పెందరాళే నిద్ర లేచిపోయాడెమిటబ్బా! అనుకున్నాడు ఏకాంబర్.

"ఏరా! ఊరిమీదకు బయలుదేరావా?! ఏం రాచకార్యాలు వెలగబెడుతున్నారో తెలుసుకోవచ్చా?" కోపంగా, కొంచెం వ్యంగ్యంగా అన్నాడు పీతాంబరం.

"ఈరోజు పెళ్లి... నిన్న... మొన్న... రోజూ ఇదేవేళకి ఇంట్లోనుండి పరారవుతున్నావు!? ఏంట్రా నీ ఉద్దేశం? ఇలా కాలం గడిచిపోతుందనుకుంటున్నావా?" కోపంగా అరిచాడు పీతాంబరం.

తండ్రి ఏం చెప్తున్నాడో ఏకాంబర్ బుర్రకి ఎక్కలేదు. అయోమయంగా తల ఎత్తి తండ్రి కళ్లల్లోకి చూశాడు.

"రోజూ నీ కోసం ఎవరో మీ ఫ్రెండుట. ఉదయం... సాయంత్రం ఇంటికొచ్చి అడిగి వెళ్తున్నాడు. కొంపదీసి ఆయన దగ్గర ఏమైనా డబ్బులు చేబదులు తీసుకున్నావా? ఏంటి? అతనికి దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నావా కొంపదీసి?" కూపంగానే అడిగాడు పీతాంబరం.

'తన కోసం కోజూ ఇంటికెవరొస్తారబ్బా?! అనిల్ గాడు ఉద్యోగం చేసుకోవడానికి పోతాడు. రామకృష్ణగాడు కాదు. ఆచారిగాడు, శంకు... శంకుగాడు వస్తున్నాడా?! ఎందుకబ్బా?! అయినా, వాడు మెడికల్ రిప్రజెంటేటివ్ కదా? వాడికంత ఖాళీ ఎక్కడ దొరికిందీ! వారం రోజులుగా తను కూడా మిత్రులెవరినీ కలవటం లేదు. అందుకోసం వస్తున్నారా? అయినా ఈ వ్యక్తి ఎవరై ఉంటారు?' పరిపరివిధాల ఆలోచిస్తూ నిలబడ్డాడు ఏకాంబర్.

"అలా బొమ్మలా నిలబడ్డావేరా? అప్పుగానీ తీసుకుని వుంటే చెప్పు! ఎంతివ్వాలో చెప్తే ఇచ్చి తగలడతాను. నిన్ను కన్నందుకు రుణభారం తప్పదు కదా?" కోపంగా అంటూనే కొడుకుకేసి చీదరింపుగా చూశాడు పీతాంబరం.

"నేనెవరి దగ్గరా అప్పులు తీసుకోలేదు నాన్నా! వాడెవడో నాకు అర్థం కావడంలేదు" ఆలోచిస్తూ అన్నాడు ఏకాంబర్.

"నీకు తెలీకపోవడమేంట్రా! ఎవరో పెద్ద హోదాలో ఉన్నవాడిలాగే ఉన్నాడతను. బైక్ మీద

వస్తున్నాడు. మెళ్లో పెద్ద బ్యాగ్ ఒకటి. సూటుబూటు వేసుకుని దొరబాబులా ఉన్నాడు. నేనుండగానే రెండు మూడుసార్లు వచ్చాడు" ఆ వ్యక్తిని వర్ణిస్తూ చెప్పాడు పీతాంబరం.

అప్పుడర్థమయింది ఏకాంబరానికి. ఇంకెవడు. ఇన్స్యూరెన్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజెంద్రగాడే! తనని పట్టుకోవడానికి ఆ రోజు నుండి పట్టు వదలని విక్రమార్కుడిలాగా తిరుగుతున్నాడు కాబోలు"

"అయ్యో వాడా నాన్నా! వాడు ఇన్స్యూరెన్స్ కంపెనీలో చేస్తున్నాడు" గుర్తొచ్చాక చిన్నగా నవ్వుతూ చెప్పాడు ఏకాంబర్.

"ఇన్స్యూరెన్స్ కంపెనీ కుర్రాడా!! నీకే దారీతెన్నూ లేదు. నువ్వేం కడతావ్ రా పాలసీలు గ్రేట్రా! నీకంటే తలమాసినవాడు ఎవడూ దొరకలేదా ఆ కుర్రాడికి. పనిగట్టుకుని రాత్రీ, పగలూ అనవసరంగా తిరుగుతున్నాడు" చిరాగ్గా అంటూ గదిలోకి వెళ్లిపోయాడు పీతాంబరం.

తండ్రి మాటలు విని మనసులోనే ముసిముసిగా నవ్వుకున్నాడు ఏకాంబర్.

'ఈసారి రాజనాలగాడు ఇంటికొస్తే నాన్నే గట్టిగా చెప్తాడు. మావాడ్ని ఒదిలెయ్యమని క్లాస్ తీసుకుంటాడు!' మనసులోనే అనుకున్నాడు ఏకాంబర్.

తండ్రి అలా గుమ్మానికి అడ్డులేచి గదిలోకి వెళ్లిపోవడంతోనే పరుగందుకున్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ ఇంట్లోనుండి వెళ్లిన అరగంటకే రాజనాల రాజేంద్ర అక్కడకు చేరుకున్నాడు.

వీధిలైట్లు వెలుగుతున్నాయి. వూరకుక్కల అరుపులు. కొండమీద దేవాలయంలో నుండి వినిపిస్తున్న వేదమంత్రాలు శ్రావ్యంగా వినిపిస్తూంటే వింటూ గేటు తీసుకుని ఏకాంబర్ వాళ్ల ఇంట్లోకి వెళ్లాడు రాజనాల.

వీధి తలుపు దగ్గరున్న కాలింగ్ బెల్ నొక్కాడు. రెండోసారి కాలింగ్ బెల్ నొక్కేసరికి తలుపులు తెరచుకుని పీతాంబరం వచ్చాడు.

"నువ్వా బాబూ! వాడిప్పుడే వెళ్లిపోయాడు. అయినా వాడు నీకేం పాలసీ కట్టగలడనుకుని ఇలా తిరుగుతున్నావ్!" వచ్చీ రావడంతోనే రాజనాలను చూసి చిరాగ్గా అన్నాడు పీతాంబరం.

"లేదంకుల్! నేను ఏకాంబరాన్ని పాలసీ కోసం అడగటంలేదు. మా కంపెనీలో చేరమని అడుగుదామని తిరుగుతున్నాను." వినమ్రంగా చెప్పాడు రాజనాల.

"మీ కంపెనీలోనా? దేనికి?!" ఆశ్చర్యంగా అన్నాడు పీతాంబరం.

"అదే అంకుల్! ఇన్స్యూరెన్స్ ఏజెంటుగా జాయిన్ చేద్ధామని" నసుగుతూ అన్నాడు రాజనాల రాజేంద్ర.

"వాడా?! ఏజెంటా?!" పకపకా నవ్వాడు పీతాంబరం.

"అదేంటంకుల్! వాడికేం?! ఒపిగ్గా తిరగ్గలడు కదా!" అన్నాడు రాజనాల.

"ఊరిమీద తిరిగితే సరిపోతుందా?! వీడ్ని ఎవరైనా నమ్మాలా?! వీడిమీద అందరికీ నమ్మకం కలగాలా? వీడికి కూడా అంత ఒపిక ఉండాలా? అయినా, ఇన్స్యూరెన్స్ పాలసీలు కట్టించమంటే కంచం ముందు కూర్చుని ఖాళీ చేయడం కాదు. వీడ్ని నమ్ముకుని నీ టైమంతా పాడు చేసుకోకు. వెళ్లయ్యా" నిష్కర్షగా అన్నాడు పీతాంబరం.

"అలా అంటారేంటంకుల్! వీడంటే మా మిత్రులందరికీ మంచి అభిప్రాయం ఉంది. నమ్మకం ఉంది." చెప్పాడు రాజనాల.

"వీడు చదివిందే అత్తెసరు చదువు. వాడి పేరే వాడు సరిగా రాసుకోలేడు. అయినా ఈరోజుల్లో ఇన్స్యూరెన్స్ ఎవడు కడతాడు బాబూ!!

ఇన్స్యూరెన్స్ ఏజెంటుని చూస్తే జనాలు జడుసుకుని పారిపోతున్నారు. నీ శ్రమ వృధా" అన్నాడు ఖరాఖండీగా...

"ఇంతకీ ఏకాంబర్ ఇంత పెందరాళే ఎక్కడికి వెళ్ళిపోయాడంకుల్. రోజూ తెల్లారేక వస్తుంటే దొరకట్లేదని ఈరోజు ఎలాగైనా వాడ్ని పట్టుకుందామని మరీ ఇంత పెందరాళే వచ్చాను." విచారంగా అన్నాడు రాజనాల.

రాజనాల ఒక్కసారే డీలా పడిపోతూ అలా అనేసరికి అతని మీద పీతాంబరానికి జాలేసింది. పాపం!

కుర్రాడు. ఏకాంబర్ వయసువాడు. కానీ, ఎంత బాధ్యతగా తిరుగుతున్నాడు?! వీడు కుర్రాడంటే...!' మనసులోనే అనుకుంటూ ఏకాంబర్ ఎక్కడికి వెళ్లాడో క్షణం ఆలోచనలో పడిపోయాడు పీతాంబరం.

"వస్తానంకుల్!... రాత్రి పది గంటలకైనా దొరుకుతాడంటారా?" విచారంగా వెనుదిరుగుతూ అన్నాడు రాజనాల.

"ఆగు బాబూ! ఈరోజు వాడి ఫ్రెండ్స్ అక్క పెళ్లన్నాడు. బహుశా గాంధీనగర్ వెళ్లి వుండొచ్చు" అన్నాడు పీతాంబరం.

"థాంక్స్ అంకుల్!" ఆనందగా అంటూ బయటకు వచ్చి బైక్ స్టార్ట్ చేశాడు రాజనాల.

'ఈరోజు ఏకాంబర్ గాడ్ని ఎలాగైనా ఒడిసి పట్టుకోవాలి!" మనసులోనే స్థిరంగా అనుకున్నాడు రాజనాల. ఆ రోజుకి నెలరోజులవుతోంది ఏకాంబరాన్ని బజార్లో కేంటీన్ దగ్గర కలసి. ఆ తర్వాత నుండి అసలు కనిపించడమే మానేశాడు. ప్రతి ఆదివారం మిత్రులందరూ కలసి కేంటీంకి వస్తున్నారు. ఏకాంబర్ తప్ప అందరూ కలుసుతున్నారు. ప్రతిసారీ అప్పుడే వెళ్లిపోయాడని చెప్తున్నారు. ఇంటి దగ్గర కూడా దొరకటంలేదు. ఉదయం, సాయంత్రం తప్పకుండా ఎన్నిసార్లు తిరిగినా దొరకలేదు.

"ఇప్పుడు ఎలాగైనా ఆ పెళ్లిలోనే వాడ్ని పట్టుకోవాలి ' స్థిరంగా అనుకున్నాడు ఇన్స్యూరెన్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల.

పీతాంబరం చెప్పిన విషయం వింటూనే ఏకాంబర్ ని వెదుక్కుంటూ గాంధీనగర్ చేరుకున్నాడు రాజనాల.

దేవుడి కోనేటికి ఈవల ఈశాన్యంలో చెరువుగట్టును ఆనుకునే వుంది గాంధీనగర్. మూడే మూడు వీధులున్న ప్రాంతం గాంధీనగర్.

అక్కడున్న వాళ్లంతా 'కల్లుగీత ' కార్మికులే. ఇప్పుడిప్పుడే యువత చదువుకుని ఇతర వృత్తుల్లో స్థిరపడుతున్నారు.

దేవుడి కోనేటికి ఆవల విజినిగిరిపాలెంకు వెళ్లే రోడ్డు చెరువుగట్టును ఆనుకునే వుంది. ఆ రోడ్డు నుండి ఇటు గాంధీనగర్ రావడానికి ఈ మధ్య కోనేటికి దక్షిణ భాగంలో గట్టునానుకుని రోడ్డును నిర్మించారు.

పాత అడివివరం నుండి నేరుగా గాంధీనగర్ చేరుకున్న రాజనాల, పెళ్లి జరుగుతున్న ఇంటిని తేలికగానే కనుక్కోగలిగాడు.

పెళ్లిపందిరిలో బైక్ ని పార్క్ చేసి అక్కడ నిలబడ్డతన్ని అడిగాడు రాజనాల. "సార్! ఏకాంబర్ వచ్చాడు. ఏక్కడున్నాడు సార్?" అని.

"ఏకాంబర్ గారా! ఇంతవరకూ ఇక్కడే ఉండాలే! వంట దగ్గర కూర్చోవడం చూశాను. ఏదో పనిమీదే వెళ్లినట్టున్నాడు. వెళ్లి అక్కడ అడగండి" అంటూ వంటలు చేస్తున్న ప్రాంతాన్ని చూపించాడు అతను.

'ఏకాంబరానికి అందరూ దోస్తులే! వూరంతా 'ఏకాంబరాన్నీ ఏరా, పోరా అనేవాళ్లే! అది ఆప్యాయతో, అవహేళనో అర్థం కావడం లేదు ' ఆలోచిస్తూ అటుకేసి నడచి వెళ్లాడు రాజనాల.

అదే క్షణంలో ఏవో సామాన్లు కొనడానికి గోపాలపట్నానికి వెళ్లిన ఏకాంబర్, అతని మిత్రుడు బైక్ మీద వస్తున్నారు. దూరం నుండే 'రాజనాల ' వంటల దగ్గరకు నడచి వెళ్లడం చూసిన 'ఏకాంబర్ ' అదిరిపడ్డాడు.

"ఒరేయ్ రంగా! బైక్ ఆపరా! నాకోసం వంటల దగ్గరకు ఆ 'జిడ్డుగాడు ' వెళ్తున్నాడు. దొరికితే నా పని అంతే!" అంటూనే బైక్ స్లో కాగానే గెంతేసి ప్రక్కకి వెళ్లి దాక్కున్నాడు. బైక్ మీదున్న మిత్రుడికి తను గోపాలపట్నంలోనే ఉండిపోయానని చెప్పమని చెప్పి వేరే ఇంకో మిత్రుడి ఇంట్లోకి వెళ్లి దాక్కున్నాడు ఏకాంబర్.

"ఒరేయ్ ఏకాంబర్!..." అని అతను ఏదో చెప్పభోతున్నా వినకుండా పరిగెట్టాడు ఏకాంబర్.

వంటల దగ్గర చాలామంది కూర్చుని వున్నారు. వంట పంతులు పర్యవేక్షణలో సహాయకులు పనిలో నిమగ్నమై వున్నారు. ఓ మూల ఆడవాళ్లు కూరగాయలు కోస్తున్నారు.

కుర్చీలో కూర్చున్నవాళ్లంతా పెళ్లివాళ్ల బంధువులు, స్నేహితులు. తిన్నగా వెళ్లి కూర్చున్నతన్ని అడిగాడు రాజనాల.

"ఎవరూ! పొడవుగా... బక్కగా... సరుగుడు చెట్టు మాదిరి రివటలా ఉంటాడే అతనా! అవునండీ! ఉదయం నుండి ఇక్కడే ఉన్నాడు. ఏదో 'వస్తువు ' అవసరమై కొనడానికి రంగాతో పాటు వెళ్లాడాయన." అంటూ

చెప్పాడు ఒకతను.

ఇంతలో వేరే వ్యక్తి గబాలున "అదిగో సార్! రంగా వచ్చేస్తున్నాడు. వాడ్ని అడగండి. మీరు వెదుకుతున్న వ్యక్తి గురించి వాడికే తెలుస్తుంది. ఇద్దరూ కలిసే వెళ్లారు" దూరం నుండి బైక్ మీద వస్తున్న రంగాని చూస్తూ అన్నాడు.

అతను అలా అనేసరికి మహదానందంగా గిర్రున వెనక్కి తిరిగి చూశాడు రాజనాల.

బైక్ మీద 'రంగా' అనే వ్యక్తి ఒక్కడే రావడం చూసి ఒక్కసారే నిరుత్సాహంతో నీరసించిపోయాడు రాజనాల.రంగా బైక్ కు ఎదురెళ్లి నిలబడ్డాడు.

బైక్ స్టాండ్ వేసి తను తెచ్చిన సామాన్లను వంటవాళ్లకి ఇచ్చివచ్చాడు రంగా.

"సార్! మీతో ఏకాంబర్ వచ్చాడట కదా సార్! ఇక్కడకు వచ్చాడా?" దీనంగా అడిగాడు. ఆయనతో ఏకాంబర్ కనిపించకపోయేసరికి షాకయిపోయాడు రాజనాల.

"లేద్ సార్! వాడు గోపాలపట్నంలో ఎవర్నో కలవాలని దిగిపోయాడు. మీరెవరు? వాడితో పనుందా?" అడిగాడు రంగా.

"చిన్న పనుంది సార్! ఏకాంబర్ నాకు ఫ్రెండ్ సార్!" అన్నాడు రాజనాల.

"అంతేనా? లేక మీకైమైనా ఏకాంబర్ గాడు డబ్బులివ్వాలా?!" చిన్నగా ఎగతాళిగా నవ్వుతూ అన్నాడు రంగ.

"ఛ! ఛ! అదేంలేదు. ఏకాంబర్ ని కలవాలి. అంతే! మీరేం చేస్తుంటారు" అప్రయత్నంగానే అడిగాడు రాజనాల.

అతనికి యువకులు ఎవరు కనిపించినా వాకబు చేయడం అలవాటు. ఒక విధంగా వృత్తిధర్మం. వాళ్లు పనేంలేదు... ఖాళీగా వున్నామంటే టక్కున వాళ్లని పట్టేసి తన అండర్ లో ఏజెంటుగా జాయిన్ చేసుకోవాలని ఆలోచిస్తూ ఉంటాడు. కొందరు డెవలప్ మెంట్ ఆఫీసర్లయితే పేపర్లలో ప్రకటనలు ఇచ్చి కూడా యువతీయువకుల్ని ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ ప్రయత్నంలో నమ్మశక్యంగాని ప్రకటనలు ఇస్తుంటారు. 'మీరు నిరుద్యోగులా! కొద్ది సమయం వెచ్చించి లక్షలు ఆర్జించండి అనో, మీరెవరినా, ఏ పని చేసినా పార్ట్ టైంగా ఇంటి దగ్గర ఉండే నెలనెలా కాలు

కదపకుండా వేలకు వేలు సంపాదివచ్చనో' రకరకాల పిచ్చి పిచ్చి ప్రకటనలు ఇస్తుంటారు. అందులో 'వీసమెత్తు ' నిజమున్నా, నమ్మశక్యంగాని ఆదాయం చూసి ఎవరూ అంతగా విశ్వసించరు.

అయితే, రాజనాల అలాంటి ప్రకటనల ద్వారా ముక్కూ, మొహం తెలీని వాళ్లని ఏజెంట్లుగా నియమించేకంటే మిత్రులద్వారా, బంధువుల ద్వారా, తెలిసినవాళ్ల ద్వారా మెరికల్లాంటి యువతని పట్టి సాన పెడితే మంచిదని నమ్ముతాడు.

అదే తోవలో నడుస్తున్నాడు. అయితే, అతను జాయిన్ అయి ఆర్నెల్లు గడుస్తున్నా ఒకర్ని కూడా ఏజెంటుగా నియమించలేకపోయాడు. దొరక్క దొరక్క దొరికిన ఏకాంబరాన్ని ఎలాగైనా ఏజెంటుగా నియమించాలనే పంతం, పట్టుదలతో విసుగు, విరామం లేకుండా తిరుగుతున్నాడు రాజనాల.

రంగా చెప్పింది వినేసరికి ఏకాంబర్ మిస్సయ్యాడని గ్రహించిన రాజనాల పెద్దగా బాధపడలేదు. 'రంగా' ఏంచేస్తున్నాడో తెలిస్తే మంచిదని, తనకి పని చేస్తాడేమో అన్న ఆశతో అడిగాడు.

"నేనా సార్! పెయింటర్ ని సార్! రోజు కూలీకి బిల్డింగులకి రంగులు వెయ్యడానికి వెళ్తుంటాను" చెప్పాడతను.

"ఏం చదివారు?" కుతూహలంగా అడిగాడు రాజనాల.

"అమ్మానాన్న చదువుకోమన్నప్పుడు శ్రద్ధగా బడికి వెళ్లి వుంటే నాకీ ఖర్మెందుకు సార్! అయిదో తరగతిలోనే డుమ్మా కొట్టాను" బాధగా చెప్పాడు రంగా.

రాజనాలలో ఒక్కసారే ఆశ ఆవిరైపోయింది. ఏకాంబర్ కోసం తిరుగుతూనే దొరికిన వాళ్లనందర్నీ మనసులో మిణుకుమిణుకుమంటున్న ఆశతో వారినందర్నీ వాకబు చేస్తూనే వున్నాడు.

డిగ్రీ చదువుకున్న వాళ్లు దొరికినా ఏదో... ఎక్కడో చిన్నా చితకా ఉద్యోగం చేస్తున్నామన్న వాళ్లే! వాళ్లకి







జరిగిన కథ : టిప్ టాప్ గా తయారయ్యి వెళ్తున్న ఏకాంబరాన్ని, తండ్రి పీతాంబరం వ్యంగ్యంగా, కోపంగా తిడుతాడు. దాంతో ఏకాంబర్ తండ్రిని చూసి అదిరిపడుతాడు.

ఇన్స్యూరెన్స్ గురించి చెప్పేసరికి రెండు చేతులూ ఎత్తి నమస్కరించి పారిపోతున్నారు.

ఏంచేయాలో అర్థం కావడం లేదు రాజనాలకి.

ఉద్యోగంలో చేరాక తిరగ్గా తిరగ్గా బాల్య స్నేహితుడు ఏకాంబర్ తగిలాడు.

'ఏజెంటూకు కావలసిన కనీస విద్యార్హత వున్నవాడు, ఉద్యోగం సద్యోగం లేకుండా వున్నవాడు దొరికాడని ఎంతో సంబరపడ్డాడు.

కానీ, ఏకాంబరాన్ని పట్టుకోవడమే కష్టమౌతోంది. కనీసం, మనిషి దొరికితే వాడి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకోవచ్చు.

వద్దన్నా, కాదన్నా తన ప్రయత్నాన్ని వదలకూడదు.

ఆలోచిస్తూనే అక్కడనుండి బయలుదేరాడు రాజనాల...

ఆరోజు సాయంత్రం మూడు గంటలకే మళ్లా సిమ్హాచలం చేరుకున్నాడు రాజనాల రాజేంద్ర. ఏకాంబర్ కోసం ఉదయం పదిగంటల వరకూ తిరిగి తిరిగి విసిగిపోయి వైజాగ్ వెళ్లిపోయాడు. ఇంటిదగ్గర భోజనం చేసి మళ్లీ సిమ్హాచలానికి చేరుకున్నాడు.

'బైక్ మీద వైజాగ్ వెళ్లడానికి అర్థగంట సమయం పడుతుంది. ఇన్స్యూరెన్స్ లో చేరాక రోజూ పదహారు గంటలు వూరిమీదే తిరుగుతున్నాను. అదీ బైక్ మీదే. తప్పదు. తన ఉద్యోగమే తిరుగుడు ఉద్యోగం ' మనసులోనే అనుకుంటూ పట్టువదలని విక్రమార్కుడిలాగా మళ్లీ సిమ్హాచలానికి చేరుకున్నాడు.

కేంటీన్ దగ్గరకొచ్చాడు. ఏకాంబర్ మిత్రులందరూ కూర్చునే టేబుల్ దగ్గర చూశాడు. ఖాళీగానే వుంది. హొటల్ లో కూడా కస్టమర్లు అంతంత మాత్రంగానే వున్నారు. హొటల్ లో కూర్చుని టిఫిన్ ఆర్డరిచ్చి తింటూ కూర్చున్నాడు. ముందు రామకృష్ణ వచ్చి చేరాడు. ఆ తర్వాత ఆచారి, ఆ తర్వాత శంకరరావు, చివరగా ఆరు గంటలకు అనిల్ వచ్చాడు. అప్పటికే నాలుగుసార్లు టీలు త్గ్రారు. మిత్రులందరూ ఒక్కొక్కరుగా వస్తూంటే అందరికీ ఒకరి తర్వాత ఒకరికి టిఫిన్ ఆర్డరిచ్చాడు రాజనాల.

అయిదుగురూ ఏకాంబర్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు.

ఏకాంబర్ కు కూడా మిత్రుల్ని కలవాలనిపించింది. అప్పటికే మిత్రుల్ని కలసి మూడు వారాలు దాటిపోతోంది. మధ్యలో కలసినా మొహం చూపించి పారిపోతున్నాడు. ఏ క్షణాన రాజనాల వస్తాడోనని భయం. ఎందుకో ఏకాంబరానికి అర్థం కావడం లేదు. 'వస్తే రానీ... వాడేం చేస్తాడనీ' ఒక్కోసారి తనకు తనే సర్ది చెప్పుకుంటాడు. తీరా మిత్రులతో మాట్లాడుతూ మాట్లాడుతూ 'రాజనాల ' వస్తే దొరికిపోతాన్రా' అంటూ పారిపోతుంటాడు.

సాయంత్రం ఆరవుతోంది. హోటల్ లో మిత్రులుంటారని తెలుసు. చూద్దామని బయలుదేరాడు. అంతవరకూ గాంధీనగర్ లో పెళ్లి దగ్గరే మిత్రులతో కూర్చున్నాడు. మధ్యానం ఇంటికి కూడా వెళ్లలేదు. పెళ్లి దగ్గరే భోజనం చేశాడు.

కేంటీన్ దగ్గరకు రాగానే ఏకాంబర్ గుండెలు దడదడలాడాయి. తప్పు చేసినవాడిలా భయం భయంగా కేంటీన్ దగ్గరకు చేరుకున్నాడు.

కేంటీన్ ముందు రాజనాల బైక్ నిలబెట్టి వుండడం చూస్తూనే అదిరిపడ్డాడు ఏకాంబర్.

'రాజనాల వచ్చినట్టున్నాడు. ఇప్పుడెలా?' ఆలోచిస్తూనే స్టేట్ బ్యాంక్ మెట్ల దగ్గరకు వెళ్లి అక్కడున్న కిటికీ గుండా తొంగి తొంగి లోపలకు చూశాడు.

మిత్రులందరితో కూర్చుని అసుక్కొడుతున్నాడు రాజనాల.

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ కిటికీ ప్రక్కన లోపలికి ఓరకంట చూస్తూ నిలబడ్డాడు ఏకాంబర్.

లోపల మిత్రులు మాట్లాడుకుంటున్న మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఈ మధ్య ఏకాంబర్ గాడు ఎందుకో దొరకడంలేదు. కనీసం ప్రతిరోజూ ఎంత రాత్రన్నా కనిపించి ఇంటికి వెళ్లేవాడు. నువ్వు కలిశావ్! వాడు కలవడం మానేశాడు" అనిల్ అన్నాడు.

"ఏముంది?! రాజనాల వాడ్ని 'ఏజెంటు 'గా పని చెయ్యమని ఎక్కడ బుక్ చేసేస్తాడోనని భయంతో తప్పించుకు తిరుగుతున్నాడేమో!?" రామకృష్ణ అన్నాడు.

"కరెక్టుగా చెప్పావురా! అదే అయుంటుంది" అన్నాడు ఆచారి.

"దానికి తప్పించుకు తిరగడమెందుకురా! నేను చెయ్యను అనేస్తే పోలా?!" శంకర్‌రావు అన్నాడు.

"అరే! వాడికసలే మొహమాటం ఎక్కువ. ఎదరపడి మాట్లాడితే మౌనంగా తల వంచేస్తాడు. అందుకే తప్పించుకు తిరుగుతున్నాడు" అన్నాడు ఆచారి.

"ఇలాంటి మొహమాటం మనుషులు నీకు ఎలా పని చేస్తార్‌రా! వదిలెయ్యి. వేరొకడ్ని వెదుక్కోవచ్చు కదా!" అనిల్ అన్నాడు.

"లేదురా! వీడు పట్టుకుంటే వదిలే రకం కాదు. మొహమాటం అంటావా? సముద్రంలోకి తోసేస్తే ఒడ్డుకు చేరడానికి కాళ్లూ, చేతులూ ఎలా ఊపుతామో... వీడూ అంతే! ఈత నేరపాడానికి ప్రక్కనే నేనుంటా కదా! నలుగుర్ని కలిస్తే మొహమాటం పటాపంచలైపోతుంది" అన్నాడు రాజనాల.

"వాళ్లింట్లోనే 'ఏకాంబర్' గాడి మీద నమ్మకం వదిలేశారు. నువ్వేంట్‌రా వాడిలో ఏదో 'మహత్తు' వున్నట్లు వెనకేసుకొస్తున్నావు. నువ్వు ఒకవేళ ఏజంటుగా వాడ్ని జాయిన్ చేసినా ఒకటంటే ఒక్కటి పలసీ రాయించగలిగితే నా చెవులు కోసుకుంటాను" అన్నాడు అనిల్.

వాళ్ల మాటలు వింటూంటే ఏకాంబరానికి మతిపోయింది. మిత్రులందరికీ తనమీద వున్న నమ్మకం ఎలాంటిదో తెలిసేసరికి మనసు క్షణం బాధతో మూలిగింది.

ఎన్నాళ్లనుంచో కలసిమెలసి తిరిగిన 'మిత్రులు' తననో చవట వాజమ్మలా చూస్తున్నారు. ఎన్నాళ్ల క్రితమో విడిపోయి ఈ మధ్యే కలసిన 'రాజనాల'కి తనమీద వున్న నమ్మకానికి ఆనందంతో కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఏకాంబర్ ఒక్కక్షణం నిరుత్తరుడై నిలబడిపోయాడు. మిత్రులందరి దృష్టిలో తను చేతగాని చవట. పనిపాటు చేయని సోంబేరిగాడు. అంతేనా! తన విలువ ఇంతేనా!

మిత్రులందరితో గడపడం... వాళ్ల అవసరమే తన ఆనందమని కాలం విలువ మర్చిపోయి వాల్లకోసం తిరిగిన తను తిరుగుబోతయ్యాడు' మనసులో పదే పదే తర్జనభర్జన పడ్డాడు ఏకాంబర్.

కిటికీ ప్రక్కన దొంగలా దాక్కున్న ఏకాంబర్ గుండెల్నిండా తాలి పీల్చుకుని నిటారుగా నడచుకుంటూ కేంటీన్ లోకి ప్రవేశించాడు.

వాళ్లందరి కోసమన్నా తను 'ఏజెంటు 'గా మారాలి. రాజనాల నమ్మకాన్ని నిజం చెయ్యాలి. మిత్రులందరి ఆలోచనల్లో తనేమిటో నిరూపించాలి! స్థిరంగా అనుకున్నాడు ఏకాంబర్.

దర్జాగా, ధైర్యంగా అడుగులో అడుగు వేసుకుంటూ హుందాగా పూర్తి ఆత్మవిశ్వాసంతో కేంటీన్ లో అడుగుపెట్టాడు ఏకాంబర్.

దూరం నుండే ఏకాంబరాన్ని చూసిన మిత్రుల్లో ముందుగా "అదిగోరా రాజనాలా, మీ హీరో వస్తున్నాడు" వ్యంగ్యంగా అన్నాడు అచారి.

రాజనాల ఆశ్చర్యంగా, ఆనందంగా తల త్రిప్పి ఏకాంబరాన్ని చూస్తూనే షాకయిపోయాడు.

ఎప్పుడూ లేనిది... ఎన్నడూ లేనిది ఠీవిగా, ధైర్యంగా, ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతున్న మొహంలో చిన్న చిర్నవ్వు మెరిపిస్తూ వాళ్లకేసి నడచి వస్తోన్న ఏకాంబరాన్ని చూసి మిత్రులంతా కళ్లింత చేసుకుని చూస్తూండిపోయారు.

రాజనాల మొహం ఆనందంతో వెలుగులు విరజిమ్మింది.

మిత్రుల ఈసడింపులు తట్టుకోలేక 'ఏజెంట్ 'గా జాయిన్ అవడానికి అంగీకరించిన ఏకాంబర్ హుషారుగానే సంతకాలు చేసి ఫోటోలు, తన సర్టిఫికెట్లను ఇచ్చాడు. రాజనాలకి కూడా 'ఏకాంబర్ ' ఆమోదం ప్రమోదాన్ని కలిగించింది.

ఆరోజు -

ఏకాంబరాన్ని బైక్ మీద వెంటబెట్టుకుని విశాకపట్నంలో వున్న ఇన్సూరెన్సు ఆఫీసుకు తీసుకువెళ్లాడు రాజనాల.

బ్రాంచి మేనేజర్ కి పరిచయం చేసి ఏజెంటు ఫారాలూ, అవీ ఇచ్చేసి ఇద్దరూ బయటకు వస్తున్నప్పుడు మేనేజర్ అన్నాడు...

"రాజనాలగారూ! అదేదో తొందరగా 'ఎగ్జాం' కూడా రాయించేస్తే పోలా?"

రాజనాలతో మేనేజర్ ని కలసి బయటకు వస్తోన్న ఏకాంబర్ 'ఎగ్జాం' పదం విని ఒక్కసారే షాకయ్యాడు. మళ్లీ తేరుకుని మనకి సంబంధించినది కాదులే! అనుకుంటూ ముందుకు నడిచాడు.

"అలాగే సార్" అంటూ మేనేజర్ గారికి సైగ చేసి చెప్పి ఏకాంబర్ తో కలసి బయటకు వచ్చాడు రాజనాల.

"అయితే, నాతో ఇంక పనిలేదు కదా! వెళ్లిపోనా?" రోడ్డుమీదకు వచ్చాక అడిగాడు ఏకాంబర్.

"ఎలా వెళతావ్! నేను తీసుకువచ్చా కదా! నేనే నిన్ను ఇంటి దగ్గర దించుతాను. సరేనా?" అన్నాడు రాజనాల.

"నీకు శ్రమ ఎందుకు! నేనే వెళ్తాగా!" అన్నాడు ఏకాంబర్.

"శ్రమ ఎలా అవుతుంది. ఇకనుండి మన ఇద్దరం కలిసే కదా తిరగాలి" ఏకాంబర్ భుజం మీద చెయ్యి వేసి గ్రౌండ్ ఫ్లోర్ లోకి లాక్కుపోయాడు రాజనాల.

బైక్ తీసి స్టార్ట్ చేసాడు రాజనాల.

"ఎక్కరా ఏకాంబర్!" అంటూ బైక్ ముందుకు ఉరికించడానికి సిద్ధంగా ఎక్కి కూర్చున్నాడు రాజనాల.
"ఎక్కడికి?" కుతూహలంగా అడిగాడు ఏకాంబర్.

"ఇప్పుడు నీకేం పనిలేదుగా?!" అడిగాడు రాజనాల.

"నాకా? పనా?! గొప్పగా అడిగావ్! పద!" రాజనాల భుజం మీద చెయ్యేసి అన్నాడు ఏకాంబర్.

బైక్ తో ఇద్దరూ బీచ్ రోడ్ లో పడ్డారు.

అప్పటికే పన్నెండు అయిపోతోంది. బైక్ తో నేరుగా తాజ్ రెసిడెన్సీ హోటల్ కి వెళ్ళాడు రాజనాల. పార్కింగ్ లో బైక్ పార్క్ చేసాడు.

"తాజ్ కొచ్చామా?! ఇక్కడ పనేమైనా వుందా?" కుతూహలంగా అడిగాడు ఏకాంబర్.

"పనేముంది? టైమైంది కదా! భోజనం చేద్దాం" ఓరగా ఏకాంబర్ కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు రాజనాల.

"ఇందులోనా?!... సరే! పద! నీ ఆనందం ఎందుకు కాదనాలి?!" గుంభనగా అన్నాడు ఏకాంబర్.ఎప్పుడూ మిత్రులందరూ కలిసి బీచ్ కి వచ్చినా రోడ్డు మీద నిలబడే ' తాజ్ రెసిడెన్సీ ' హోటల్ కేసి కళ్ళప్పగించి చూస్తుండిపోయేవారు. కనీసం చూడ్డానికి కూడా లోపలికి వెళ్ళాలంటే భయపడేవారు. అంత జీతగాడు అనిల్ కూడా ధైర్యం చేయలేదెప్పుడూ. డబ్బుంటే సరి కాదు. అనుభవించడానికి కూడా అదృష్టం కావాలి.... మనసులోనే పరిపరి విధాల ఆలోచిస్తూ రాజనాల రాజేంద్ర వెనుకే బెరుగ్గా నడిచాడు ఏకాంబర్. ఏకాంబర్ కోసం ఎదురు చూడకుండా నేరుగ బార్ లోకి దారి తీసాడు రాజనాల. మంత్రముగ్ధుడిలా రాజనాల వెనుకే నడిచి వెళ్ళాడు ఏకాంబర్.

ఖాళీగా వున్న ఓ మూలకు వెళ్ళి కూర్చుంటూ ఏకాంబర్ ని ఆహ్వానించాడు రాజనాల. లోపలికి వెళ్ళి రాజనాలకెదురుగా కూర్చుంటూ చుట్టూ పరికించి చూసి ఉలిక్కిపడ్డాడు ఏకాంబర్.

'అరె ఇది బార్ లా వుందే?" ఆష్చర్యంగా అన్నాడు ఏకాంబర్.

"బార్ లా వుండడమేమిటీ? బారే కదా!" నవ్వుతూ అన్నాడు రాజనాల.

"ఇప్పుడా?!... మిట్ట మధ్యాహ్నం?" ప్రశ్నార్ధకంగా అన్నాడు ఏకాంబర్.

'వాళ్ళందరీ్ని చూడు. పాపం.! వళ్ళు రాత్రనుకున్నారేమో?!" ఏకాంబర్ తొడ మీద ఒక చరుచు చరిచి నవ్వి అన్నాడు రాజనాల.

'ఇక్కడ మందు కొట్టి నన్నెలా డ్రాప్ చేస్తవ్?" సూటిగా అడిగాడు ఏకాంబర్.

'మనం ఇక్కడ తప్పతాగి పడిపోవడానికి రాలేదు. జస్ట్! చరో బీరు త్రాగి భోజనం చేసి వెళ్ళిపోదాం" అన్నాడు రాజనాల.

'నాకు అభ్యంతరం లేదు. బైక్ డ్రైవ్ చేసేది నువ్వే! మధ్యలో ఎక్కడన్నా పోలీసులు పట్టుకుంటే నీకే

కష్టం" నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"ఓర్నాయనో! ఇంతమందికి లేని భయం నీకెందుకురా బాబూ!"

"భయం కదు, పోలీసులు పట్టుకుంటే సిగ్గుపడాలి. నువ్వైనా, నేనైనా తప్పు తప్పేకదా!" స్థిరంగా అన్నాడు ఏకాంబర్.

"అయితే ఏం చేద్దాం! నకిప్పుడు నీతో చీర్స్ కొట్టలన్నంత ఆనందంగా వుంది. ఈ అవకాశాన్ని వదులుకోలేను" మరింత స్థిరంగా అన్నాడు రాజనాల.

'ఓకే, ఓ పని చేయ్యి. నన్ను బస్సు ఎక్కించెయ్. నువ్వు ఈ రోజుకి సెలవు ఇచ్చేసి ఇంటికి పోయి పడుకోవాలి. అలా అయితే నాకూ ఒకే!" నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

"డన్!... ఏం చెప్పమంటావ్.!" ఆనందంగా అన్నాడు రాజనాల. ఈ లోగా సూటూ బూటూ వేసుకున్న బేరర్ వచ్చి వాళ్ళముందు నిలబడ్డాడు. ఇంగ్లీష్ లో అడిగేసరికి ఏకాంబర్ అవాక్కయి కూర్చుండిపోయాడు.

రాజనాల రాజేంద్ర ఆర్డర్ ఇచ్చాడు.

'రాజనాల! వీళ్ళు ఏం చదువుకుని వుంటార్రా? ఇంగ్లీష్ అంత ఈజీగా దంచేస్తున్నారు" నెమ్మదిగా రాజనాల చెవి దగ్గర అన్నాడు ఏకాంబర్.

"నిజం చెప్పాలంటే నీకన్నా, నాకన్నా ఏడాకులు ఎక్కువే చదివి ఉంటారు. వీళ్ళంతా హొంసైన్స్ లోనూ, మార్కెటింగ్ లోనూ డిగ్రీలు, పిజీలు చేసిన వాళ్ళు" చెప్పాడు రాజనాల.

"పాపం! అంత చదువుకుని ఇక్కడ...?!" వాళ్ళ మీద సానుభూతి చూపిస్తూ అన్నాడు ఏకాంబర్.

"దేనికి పాపం! వీళ్ళ జీతం ఎంతో తెలుసా? వీళ్ళ నెలసరి ఆదాయం తెలిస్తే నీకు కళ్ళు బైర్లు కమ్ముతాయి. ఇక్కడకొచ్చే కస్టమర్స్ ఇచ్చే టిప్పే వీళ్ళకి రోజూ ఓ ఉద్యోగి నెల జీతాన్ని మించి వస్తుంది. గవర్నమెంట్ ఎంప్లాయిస్లాగా అన్ని రూల్స్ వర్తిస్తాయి. ఈ ఉద్యోగం సంపాదించాలంటే సాదాసీదాగా చదువుకున్న కుర్రాళ్ళ వళ్ళ కాదు. బ్రిలియంట్ లయి ఉండాలి. నీకు వాళ్ళు తక్కువలా

కనిపిస్తున్నార్‌రా!" చెప్పాడు రాజనాల.

రాజనాల చెప్పిందంతా వింటూనే ఆశ్చర్యం తో కళ్ళు తేలేసాడు ఏకాంబర్.





జరిగిన కథ: రాజనాల రాజేంద్ర, ఏకాంబరాన్ని కలవడానికి సిం హాచలానికి వెళ్తాడు. అయితే ఏకాంబర్, అతని    మిత్రులు కలిసే హెూటల్ కు వెళ్తాడు రాజనాల రాజేంద్ర. ఏకాంబర్ వీరందరినీ కలవక మూడువారాలైందని అందరూ ఆ హెూటల్ లో వుంటారని తెలిసి అక్కడకు వస్తాడు. అక్కడ రాజనాల రాజేంద్రను చూడగానే భయంతో వణికిపోతాడు ఏకాంబర్.

ఇంతలో బేరర్ బీర్ గ్లాసుల్లో పోసి తెచ్చాడు. పెద్ద జగ్గుల్లా ఉన్న గాజు జార్ లు అని, ఇద్దరూ కష్ట సుఖాలు మాట్లాడుకుంటూ సిప్ చేస్తున్నారు.

"నువ్వు నాకో ఫేవర్ చెయ్యాలిరా ఏకాంబర్!" నెమ్మదిగా ఏకాంబర్ కళ్ళల్లోకి చూస్తూ అడుగాడు రాజనాల.

బీరు జోరుగా త్రాగిన మైకంలో ఉన్నాడు ఏకాంబర్. మొదటి జగ్గే పూర్తి చేయ్యలేదు. నెమ్మదిగా సిప్ చేస్తూ కూర్చున్నాడు. ఏకాంబర్ మూడ్ చూసి అడుగుదామని అంతవరకూ ఊరందరి విషయాలు చర్చించుకున్నారు.

ఉన్నట్టుంది రాజనాల ఏదో సహాయం చేయాలనేసరికి 'కుబేరుడికి కుచేలుడు ఏం సాయం చేయగలడు? అని అనుకుని దిగ్గున తల ఎత్తి చూసాడు ఏకాంబర్."నేనా అన్నా నీకేం సాయం చేయగలను. చూసావుగా నా పరిస్థితి" అన్నాడు ఏకాంబర్.

"నువ్వే చేయ్యగలను. చూసావుగా నా పరిస్థితి" అన్నాడు ఏకాంబర్.

"నువ్వేం చేయగలవు. నన్ను ఇబ్బంది పెట్టకుండా చేస్తానంటే చెప్తాను" నెమ్మదిగా చెప్పాడు రాజనాల.

"నేనా... నన్ను నువ్వే కషమించన్నా! ఈ నెల్లాళ్ళు నిన్ను కుక్కను తిప్పినట్టు తిప్పాను. నీ గొప్పతనం తెలుసుకో    రెండో జగ్గు కూడా పూర్తి చేసి చిప్స్ తింటూ కూర్చున్నాడు ఏకాంబర్.

'బేరర్.. " వెళ్ళిపోతున్న బేరర్ని పిలిచాడు రాజనాల.

'సార్.." అతను వినయం గా వచ్చి నిలబడ్డాడు.

"మరో జగ్గు బీర్ ప్లీజ్!" నమ్రతగా ఆర్డర్ చేసాడు రాజానల

ఏకాంబర్ మాత్రం ఈ లోకం లో లేడు. అయినా, బాగానే వున్నట్టు నటిస్తున్నాడు.

"నేనంటే నీకు నమ్మకమే కదా!" ఏకాంబర్ కేసి చూస్తూ అడిగాడు రాజనాల.

"వాళ్ళందరికంటే నీ మీదే నాకు నమ్మకం. ఒట్టు!" చెప్పాడు ఏకాంబర్.

"నా కోసం.. నువ్వు "ఎగ్జాం" రాయాలి.. ప్లీజ్" నెమ్మదిగా అన్నాడు రాజనాల."

"ఎగ్జామా? అంటే.. పరీక్షలు... నో.. నెవర్! పరీక్ష పేరెత్తితే పారిపోతాను" అంటూ గబాలున లేవబోయాడు ఏకాంబర్.

"అబ్బ! అందుకేగా ముందు నిన్ను సహాయం చేయమన్నది." గట్టిగా అన్నాడు రాజనాల.

"అంబలి తాగే వాడికి మీసాలు ఎత్తేవాడొకడా?! నీ పరీక్షలు నేను రాయడమేమిటీ?! "ఇంటర్ పూర్తిచేయడానికే ఇళ్ళు పీకి పందిరేసినంత పనైంది. ఏదో బాబా దయ వల్ల గట్టెక్కానూ త్రాగిన మైకం వదిలేసింది ఏకంబరానికి.

"బీరు" కదా త్రాగినంత వరకే వుంటుంది. గొంతు దిగాక యూరిన్ గా మారిపోతుందంటారు అందరూ.

"నా పరీక్ష కాదు. నీ పరీక్షే!. "ఏజెంట్" కావాలంటే "ఐ.ఆర్.డి.ఏ" ఎగ్జాం రాయాలి" చెప్పాడు రాజనాల.

పరీక్ష రాయకపోతే"ఏజెంట్ గా చేయనివ్వరా?!" ఆశగా అన్నాడు ఏకాంబర్.

"అంత మాటనుకురా నాయనా! నాకు దొరికిన ఒకే ఒక వజ్రానివి. మొదటివాడివి. నన్ను, నా జీవితాన్ని నువ్వే కాపాడాలి." బ్రతిమిలాడుతూ అన్నాడు రాజనాల.

"సరి సరి! ఏం రాయాలి. పుస్తకాల్ గట్రాల్లేవు. నేను ఇంటర్ పాసయ్యానో లేదోనని మళ్ళీ పరీక్షలు పెడతారా కొంపదీసి?!' కంగారు పడుతూ అన్నాడు ఏకాంబర్.

"పరీక్ష ఆంటే అలాంటి పరీక్షలు కాదు" చెప్పాడు రాజనాల

"అమ్మో1 మరీ అంత భయంకరంగా వుంటాయా?" భయం గా అన్నాడు ఏకాంబర్.

"అబ్బా! నువ్వు కంగారు పడి నన్ను కంగారు పెడతావెందుకురా! ఇన్స్యూరెన్స్ పాలసీలు ఎలా చెయ్యాలో తెలియజేసే పరీక్షలు... అదీ ఓ గంట వుంటుంది. " అనునయంగా అన్నాడు రాజనాల.

"గొప్పగా చెప్పావు! ఇన్స్యూరెన్స్ అంటేనే ఏమిటో నాకింకా బుర్రకెక్కలేదు. అప్పుడే దాని గురించి నేనేం రాయగన్రా!" దీనంగా అన్నాడు ఏకాంబర్.

"ఓర్నాయనో! నువ్వు కూర్చుంటావు. మిగతా వ్యవ్హారం నేను నడిపిస్తాను కదా! పేపరు రాయక్కరలేదు. జవాబులు కూడా అందులోనే వుంటాయి. ఒక ప్రశ్నకి నాలుగు జవాబులు వుంటాయి. అందులో ఒకదనికి టిక్కు పెట్టాలి. అదే కరెక్టు జవాబు అన్నమాట" చెప్పాడు రాజనాల.

"ఇదేం తికమక పరీక్షరా? రాయక్కరలేదంటావు. ప్రశ్నలు, జవాబులు ప్రక్కప్రక్కనే ఉంటాయంటావు. ఈ మాత్రం దానికి పరీక్షలెందుకు. వాళ్ళే ఆ టికులేవో కరెక్టుగా పెట్టుకోవచ్చు కదా" త్రాగిందంతా దిగిపోయిందన్న చిరాకుతో అన్నాడు ఏకాంబర్.

"నీకు హాస్యంగానే ఉంటుందిరా! నువ్వు ఆ టిక్కులేవో కరెక్టుగా పెట్టి పాసయితే నేనో ఏజెంటుని నియమించినట్లు లెక్క, నువ్వు కూడా ఏజెంటువు అయినట్టు లెక్క! విచారంగా అన్నాడు రాజనాల.

"సరేరా! ఆ నాలుగు జవాబుల్లో ఏది కరెక్ట్ అని నేనేలా తెలుసుకోగలను" ఆశ్చర్యంగా అన్నాడు ఏకాంబర్.

"నేనున్నా కదరా! దానికి అన్ని ఏర్పాట్లు చేస్తాను. నువ్వు కూర్చో. ఎక్కడెక్కడ 'టిక్కులు" లు పెట్టాలో నీకు స్లిప్ పంపిస్తాను.దాన్ని చూసి దడదడలాడీంచేసేయ్!" తనచేతిలో బీరు జగ్గు ఖాళీ చేస్తూ అన్నాడు రాజనాల.|

దీనికీ స్లిప్ లేనా!? చచాన్రా నాయనా ఇంటర్లో రాసీఎ రాసీ... ఎవడొస్తాడోనని భయంతో క్షణ క్షణంచచ్చి చెడి ఎలాగో పరీక్షలన్నీ గట్టెక్కించాను. మళ్ళీ ఈ స్లిప్పుల గోల ఇక్కడా వదలటం లేదేమిట్రా బాబూ!"నెత్తి మీద చేత్తో కొట్టుకుంటూ అన్నాడు ఏకాంబర్.

"బాబ్బాయ్! ఇది ఆఖరిసారనుకో! ప్లీజ్ కాదనకు! నువ్వు పాసయితే నా ఉద్యోగం ఉంటుంది. లేకపోతే ఈ ఆరు నెలల్లో ఒక్కడ్ని జాయిన్ చేయలేకపోయానని తీసినా తీసేస్తారు" ఏకాంబర్ చేతులు పట్టుకుంటూ అన్నాడు రాజనాల.

"తప్పదు కదరా! సముద్రం లో దిగాక ఈత రాక పోయినా నేర్చుకోవాలి కదా! నా జీవితం కూడా నీ చేతుల్లో పెట్టేస్తాను. స్లిప్లతో గట్టెక్కిస్తావో... సింపుల్ గా మెట్టెక్కిస్తావో ఎలా చేస్తావో నీ ఇష్టం. కానీయ్! పరీక్షేగా! ఇది ' నాదీ నీదీ ' ఉమ్మడి జీవిత పరీక్షనుకుంటాను. నిదానంగా అన్నాడు ఏకాంబర్.

"హమ్మయ్య! థ్యాక్స్ రా! నువ్వు ఎక్కడ ఒప్పుకోవో అని తెగ భయపడ్డాను. మళ్ళీ మొదటికొస్తుందేమోనని ఆందోళనలో చచ్చిపోయాను. పోటె ఫానీ వెధవ బీర్లు రెండో మూడో ఖర్చయినా మనకిప్పుడు హాయిగా వుంది. కదరా!" బేరర్ కి బిల్లు కోసం జేబులో వున్న క్రెడిట్ కార్డు తీసి ఇచ్చాడు రాజనాల.

రాజనాల జేబులో ఉన్న పర్సు తీసి ఇస్తున్నప్పుడు అందులో తళ తళ మెరుస్తున్న వెయ్యినోట్లు, గలగల లాడుతున్న క్రెడిట్, డెబిట్ కార్డులు చూసి ఆశ్చర్యపోయాడు ఏకాంబర్.

జేబులో అంత డబ్బుంచుకుని స్టైల్ గా కార్డు తీసి ఇచ్చాడు రాజనాల. తను కూడా ఇలా.. ఇంత దర్జాగా ఖర్చు పెట్టగలడా1 తను ఇలా సంపాదించగలడా?" ఆలోచిస్తూ క్షణం మౌనంగా ఉండిపోయాడు ఏకాంబర్.

"పదరా పోదాం! బైక్ మీద కూర్చోగలవా?! ఏకాంబరాన్ని అడుగుతూ ముందుకు కదిలాడు రాజనాల.

"ఏదో ఫుల్ బాటిల్ మందు పట్టించేసినట్టూ చెప్తున్నావ్‌రా! నాలిక మీద మూడు చుక్కలు పోసినట్టూ.. అదీ బీరు.. బయటకి వెళ్ళి గోడ ప్రక్కన నిలబడితే సరి జారిపోయే బీరు ఇప్పించి.. కిక్కించ్చిందా... తల తిరుగుతోందా? కూర్చోగలవా...? బడాలాపి పద" దర్జాగా నడిచి ముందు కెళుతూ అన్నాడు ఏకాంబర్.

' ఇందాకా మత్తెక్కిన వాడిలా మాట్లాడిన వీడు ఇప్పుడు ఇంత దర్జాగా నడుస్తున్నాడు...?! కొంపదీసి కిక్కిచ్చినట్టూ ఇంతవరకూ నటించాడా..?? మనసులోనే ఏకాంబర్ కోసం ఆలోచిస్తూ బైక్ దగ్గరకు వెళ్ళాడు రాజనాల.

"నన్ను ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర దించెయ్" బైక్ ఎక్కుతూ అన్నాడు ఏకాంబర్.

'ఏరా! భోజనం చెయ్యమా? అలకాపురి అదిరిపోతుంది. అక్కడికెళ్ళి బిర్యాని తిందాం" అంటూ జగదాంబ జంక్షన్ కేసి బైక్ ను ఉరికించాడు రాజనాల.

ఆ నెల్లోనే ఏకాంబర్ ఏజెంట్ ఎగ్జాం కూడా రాసాడు. రికార్డ్ స్థాయిలో ఒకే ప్రయత్నం లో పాసైపోయాడు.

ఏకాంబరమే తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. అక్కడి వాళ్ళు ఎక్కడెక్కడ టిక్కులు పెట్టాలో చిన్న స్లిప్పు ఇచ్చినా అది చూసి పెట్టడం కూడా కష్టమే కదా అనుకున్నాడు ఏకాంబర్. కానీ, వాళ్ళే దగ్గరుండి పెన్ను లాక్కుని మరీ ఏకాంబర్ కి శ్రమ తగ్గించాడు. పరీక్ష పాసైన మర్నాడే ట్రైనింగ్ అంటూ వారం రోజులు భోజనాలు పెట్టి మరీ ఇన్స్యూరెన్స్ పాలసీల గురించి వివరించి చెప్పారు. ఒప్పుకున్నందుకు తప్పదన్నట్లు శిక్షణకి కూడా హాజరయ్యాడు ఏకాంబర్.

ఇన్స్యూరెన్స్ పాలసీల వేట మొదలయ్యింది. ఎవరికి ఎలాంటి పాలసీ ఇవ్వాలో శిక్షణా కాలంలో చెప్పారు.

"ఏకాంబర్! నీకు తెలిసిన వాళ్ళందరి పేర్లు రాసుకో. రోజూ ఒక్కకరిక్రి ఇంటికి వెళ్దాం. నేనూ నీకు తోడుగా వస్తాను. నెల రోజుల్లో నువ్వే నేర్చుకుంటావు" ఎంతో బోధపర్చి చెప్పాడు రాజనాల.

అంతా అర్థమయినట్లే. బుర్ర ఊపాడు ఏకాంబర్.

రాజనాల రాజేంద్ర చెప్పినట్లుగానే తనకి తెలిసిన వాళ్ళందరి పేర్లు రాసుకున్నాడు. ఎవరెవరిని అడగాలో గుర్తు తెచ్చుకుని మరీ పేర్లు రాసుకున్నాడు ఏకాంబర్. ఏజెంటు ఎగ్జాం పాసవగానే తనకో కోడ్ ఇచ్చారు బ్రాంచిలో, ఆ కోడ్ నంబర్ రాగానే పాలసీలు చేయించడం కోసం సన్నద్ధమయ్యాడు.

ఆ రోజు ఉదయాన్నే రాజనాల పాలసీ ప్రపోజల్ ఫారాలు అవీ పట్టుకొచ్చి ఏకాంబర్ ఇంట్లో పడేసాడు. అవసరమైన కొన్ని ఫారాలు పట్టుకుని ఇద్దరూ ఊరిమీద పడ్డారు.

ముందుగా బంధువుల ఇళ్ళకి తీసుకెళ్ళాడు ఏకాంబర్. అందరూ వ్యాపారస్తులే. ఒక్కరు కూడా పాలసీ తీసుకుంటామనలేదు సరి కదా, ఏకాంబర్ ని ఎగతాళి చేసారు. పనీపాటూ లేకుండా ఊరి మీద తిరిగేవాడికైనా ఇంటికి పిలిచి టీ ఇస్తారు. గానీ, ఇలా ఇన్స్యూరెన్స్ కట్టాలని వస్తే నిన్ను చూసి తలుపులు బిడాయించుకుంటారు.నువ్వేం చెయ్యగలవురా! అయినా ఇప్పటికే ఊరంతా ఏజెంట్లే నీ దగ్గర ఎవరు కడతారు?" అంటూ ఎగతాళిగా అని నిరుత్సాహపరిచారు.

ఏకాంబర్ కి బుర్ర తిరిగిపోయింది. తనేం పొరపాటు చెయ్యలేదు కదా! తను ఏజెంటుగా ఒక్క పాలసీ అయినా కట్టించగలడా?! ఆ రోజంతా తిరిగితిరిగి ఇల్లు చేరుకున్నారు ఇద్దరూ.

ఏకాంబరానికైతే మొహం లో నెత్తురు చుక్కలేదు.

"నువ్వేం కంగారు పడకురా ఏకాంబర్! విత్తనం వెయ్యగానే మొక్క మొలవదు కదా! మొక్క మొలకెత్తగానే పండ్లు ఇయ్యడు కదా! ఇది కూడా అంతే! ఇలాంటివి ఇంకా ఎన్నో అటు పోట్లు తింటేగాని రాటు దేలము" ఏకాంబర్ కి ధైర్యం చెప్పాడు రాజనాల.

రాజనాల మాటలు బుర్రకెక్కలేదు. ' అల్లరి చిల్లరగా ఇన్నాళ్ళు తిరిగినంత కాలం ఒక్కరు ఒక్క మాట అనలేదు. ఈ రోజు వాళ్ళ దగ్గరికి వెళ్ళబట్టే కదా ఇన్ని మాటలన్నారు. అయినా, ఈ పని తను స్వయంగా సవ్యంగా చేయగలడా?!" మనసులో మధనపడ్డాడు ఏకాంబర్.

ఆ రాత్రి విచారం గా కూర్చున్న కొడుకుని అడిగింది తల్లి   పర్వతాలు.

'ఏరా ఏకాంబర్? అలా వున్నావేం! ఒంట్లో బాగాలేదా?" గదిలో మంచం మీద కూర్చున్న ఏకాంబర్ దగ్గరకు వెళ్ళి అనునయం గా అడిగింది.

"హాయిగా తిరిగేవాడ్ని, తగుదునమ్మా అంటూ ఇందులో దూరాను. ఈ పని నేను చెయ్యలేననిపిస్తోందమ్మా! అందరూ ఎగతాళి చేస్తున్నారు. సిగ్గుగా తల కొట్టేసినట్టు అనిపిస్తోంది." బాధగా అన్నాడు ఏకాంబర్.

"నువ్వేం కాని పని చెయ్యటం లేదు కదమ్మా! నువ్వొక్కడివే కట్టించడం లేదు కదా! అయినా, ఇది దొంగ పనా? రంకు పనా? నువ్వు ఇలా బాధపడడానికి, తప్పు చేస్తే సిగ్గు పడాలి. పెద్ద పెద్దోళ్ళు ఇంటింటికీ తిరిగి ఒట్లడుగుతున్నారు. అందరూ వారికీ ఓటు వెయ్యరని తెలిసినా అందరి ఇళ్ళకి వెళ్ళి అడగడం లేదా?! వాళ్ళు సిగ్గు పడుతున్నారా?" అనునయం గా అంది తల్లి.

తల్లి అన్న మాటలు శ్రద్ధగా విన్నాడు ఏకాంబర్. మనసుకు కొంత ఊరట కలిగినట్లనిపించింది. నిజమే కదా! తను తప్పు చేయటం లేదు. తను చేస్తున్నది కూడా మంచి పనే. మరి, అందరూ ఎందుకిలా ఆలోచిస్తున్నారో అర్థం కాలేదు ఏకాంబరానికి.

ఆ మర్నాడు తెల్లవారుతూనే ఏకాంబర్ ఇంటికి చేరుకున్నాడు రాజనాల రాజేంద్ర. అప్పటికింకా ఏకాంబర్ లేవలేదు. రాత్రంతా ఆలోచనల్లో నిద్ర పట్టక తెల్లారగట్ల ఎప్పుడో నిద్రలోకి జారుకున్నాడు.

రజనాలకి భయంగానే వుంది. ఏకాంబర్ ఎక్కడ కురుక్షేత్రం లో   అర్జుండిలాగా మధ్యలో నాకొద్దూ...నన్నొదిలై అంటూ విరమించుకుంటాడోనన్న భయం ఏ కొసనో పీకుతూనే వుంది. అందుకే ఏకాంబరాన్ని ఒంటరిగా ఒదలకూడదని ఎలాగైనా ఈ రోజు   ఎక్కడైనా పాలసీ పుట్టించాలన్న పంతంతో వచ్చాడు. ఏకాంబర్ పరీక్ష పాసవగానే ఏజెన్సీ కంఫర్మ్ కావడం కోసం తనే ఏదో చిన్న పాలసీ తీసుకుని ఏకాంబర్ కోడ్ రావడం కోసం కట్టేసాడు. దాంతో వెంటనే ఏకాంబరానికి ఏజెంటు కోడ్ వచ్చింది.

ఏకాంబరానికి తెలియకుండానే అందంగా... అకర్షణీయంగా ఏజెంటు ఏకాంబర్ చి.బి.ఐ 007 అని రాయించి కింద తమ ఇన్స్యూరెన్స్ కంపెనీ పేరు రాయించి ఇంటి ముందు తగిలించడానికి వీలుగా బోర్డు చేయించి తీసుకువచ్చాడు. అది తన మొదటి బహుమతిగా అందివ్వాలని వచ్చాడు. కనీ, ఏకాంబర్ ఏ మూడ్ లో ఉన్నాడో? ఏమో?! అని ఆలోచిస్తూ ఏకాంబర్ ఇంటిముందు బైక్ ఆపాడు రాజనాల.వరండాలో కుర్చీ వేసుకుని ఉన్నాడుపీతాంబరం. ఆ రోజు పేపరు పట్టుకుని చదువుతూ కూర్చున్నాడు. అదే సమయం లో పర్వతాలు టీ గ్లాసులతో గుమ్మం దగ్గరకు వచ్చింది.

రాజనాలను చూస్తూనే 'రా బాబూ రా ... మీ స్నేహితుడు ఇంకా ఈ రోజు లేవలేదు. ఎప్పుడూ ఈ సరికి తయరయి వెళ్ళిపోయేవాడు" ఆదరంగా ఆహ్వానిస్తూ అంది.

బైక్ స్టాండ్ గుమ్మంలో అడుగు పెట్టాడు రాజనాల.

తనకోసం అని తెచ్చుకున్న టీ గ్లాసు రాజనాలకు 'ఇదిగో! టీ తీసుకో బాబూ! నేను వాడ్ని లేపి వస్తాను అంటూ లోపలకు వెళ్ళింది పర్వతాలు.

అంకుల్! ఈ రోజు మీకు లేదా? ఊరికే ఉండలేక ఏదో ఒకటి అడగాలని అన్నాడు రాజనాల.





జరిగిన కథ:

ఏకాంబర్, రాజనాల రాజేంద్ర బార్ లో మందు తాగుతూ పాలసీల గురించి చర్చించుకుంటుండగా, ఇంతలో బేరర్ డబ్బుల గురించి వస్తాడు. రాజేంద్ర తన పర్సులోంచి ఏ.టి.ఎం కార్డును తీసి ఇస్తుండగా ఏకాంబర్ దృష్టి అతని పర్సులో వున్న నోట్ల కట్టలపై పడి తనెప్పుడు అంత స్థితికి చేరుకుంటాడో ఆలోచిస్తుంటాడు.

"ఎందుకు లేదు, వెళ్తాను. మీరేంటి, ఇంత పెందరాళే బయలుదేరారు? ఏమిటో పని?" వ్యంగ్యంగా అన్నాడు పీతాంబర్.

"నేను ఇన్స్యూరెన్స్ కంపెనీలో డెవలప్ మెంట్ ఆఫీసర్ గా చేస్తున్నా కదా అంకుల్. మీకు తెలుసు కదా!" ఆష్చర్యంగా అన్నాడు రాజనాల.

"తెలుసు. వీడితో పనేంటా అని?!" అన్నాడు పీతాంబరం.

"అదేంటంకుల్! ఏకాంబరాన్ని ఏజెంటుగా జాయిన్ చేశాను కదా! వాడు మీకు చెప్పలేదా?" వినయంగా అన్నాడు రాజనాల.

"వాడా?! నాకా?! నా కంటికి కనిపించకుండా తిరుగుతాడు. ఎప్పుడొస్తాడో... ఎప్పుడెళతాడో వాడికే తెలీదు. ఇంకా వాడి గురించి నాకెలా తెలుస్తుంది? పోనీ, తండ్రినన్న గౌరవం వుంటే తనేం చేస్తున్నాడో, ఏంచేయాలనుకుంటున్నాడో చెప్తాడు. నీకు తెలుసా! చదువు సంధ్యలు అబ్బలేదని నాతో షాపుకు తీసుకువెళ్తే నెలలో లక్ష రూపాయలు నష్టపరచాడు. వూరందరికీ అరువులిచ్చేసి షాపులో సరకులు ఖాళీ చేసేశాడు. అదిగో! వాటిని వసూలు చేస్తానని వూరిమీద పడి తిరిగడం అలవాటు చేసుకున్నాడు. ఏంచెప్పమంటావ్?" తన మనసులో గోడంతా కసిగా వెళ్లగక్కేశాడు పీతాంబరం.

రాజనాల నోరు ఆవులించుకుని వుండిపోయాడు. మరేం మాట్లాడాలో అర్ధం కాలేదు. తనేం చెప్పినా ఇక వ్యతిరేకమే వస్తోందని భయపడిపోయాడు. ఇతనికి ఏకాంబర్ ఏజంటుగా జాయిన్ అయిన విషయం తెలీదని అర్ధమైపోయింది. ఎందుకైనా మంచిది, మౌనంగా వుండడమే మేలనుకున్నాడు రాజనాల.

ఇంతలో కళ్లు నులుముకుంటూ ఏకాంబర్ అక్కడకు వచ్చాడు. అతని వెనకే తల్లి పర్వతాలు రెండు గ్లాసులతో వేడి వేడిగా 'టీ' పట్టుకుని వచ్చింది. ఏకాంబర్ కి ఒక గ్లాసు ఇచ్చి తనో గ్లాసులో తాగుతూ వరండాలో గుమ్మం మీద కూర్చుంది. రాజనాల పీతాంబర్ పక్క పక్క కుర్చీల్లో కూర్చున్నారు.

ఏకాంబర్ 'టీ' గ్లాసు చేతో పట్టుకునే గుమ్మం దగ్గర తండ్రి వెనక నిలబడి వున్నాడు.

"నాన్నా! మీకో విషయం చెప్పాలి" టీ సిప్ చేస్తూ అన్నాడు.

చిన్న కొడుకు మాట చెవిన పడగానే ఆశ్చర్యంగా టక్కున తలతిప్పి ఏకాంబర్ కేసి చూస్తూ 'ఏమిటన్నట్లు ' కళ్లతోనే సైగ చేశాడు పీతాంబరం.

"మీరు నాకో పాలసీ కట్టాలి" స్థిరంగా అన్నాడు. 'తెల్లవార్లూ కునుకు రాక తంటాలు పడుతూ అలోచించింది అదే. ముందు తమ ఇంట్లో నుండే తన ప్రయాణం మొదలుపెట్టాలి. అన్నకి కూడా ఫోన్ చేసి పాలసీ అడగాలి.'

'నవ్వీన నాపచేనే పండుతుందని ' అమ్మ ఎప్పుడూ చెప్తూంటుంది. తను గెలవాలి. గెలిచి చూపించాలి. తన మొదటి అడుగు... ముందడుగు ఇంటినుండే ప్రారంభం కావాలి ' స్థిరంగానే నిర్ణయించుకుని నిద్రలేచాడు ఏకాంబర్.

"పాలసీ ఏమిట్రా?! పడుకునే పలవరిస్తున్నావా ఏంటి?!" మరింత ఆశ్చర్యంగా అన్నాడు పీతాంబరం.

గభాలున ఏదో చెప్పాలని నోరు తెరవబోయిన రాజనాల ఎదురుగా టీ తాగుతూ తనకేసే చూసి కళ్లతోనే వద్దని వారిస్తున్న పర్వతాలు సైగలతో టక్కున ఆగిపోయాడు రాజనాల.

"నేను ఇన్స్యూరెన్స్ ఏజంటుగా జాయిన్ అయ్యాను" చెప్పాడు ఏకాంబర్.

"నువ్వా! ఇన్స్యూరెన్స్ చేయిస్తావా?! నమ్మే విషయమేనా?! అయినా, నీకెవర్రా పాలసీలిస్తారు?! చేతిలో పేపరు పక్కన పెడుతూ కుర్చీలో నుండి లేచి నిలబడి అన్నాడు పీతాంబరం.

"ముందు మీరో పాలసీ కట్టండి!" సూటిగా తండ్రి మొహంలోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"తాటిచెట్టంత ఎదిగావ్! చెప్తే అర్థంకాదా?" తల పైకెత్తి కొడుకు కళ్లలోకి చూడాలని ప్రయత్నిస్తూ అన్నాడు పీతాంబరం.

"మీ సోదాపి వాడు అడిగింది ఇవ్వండి. పడ్డవాడికి నొప్పి వుండాలి గానీ, పక్కనుండే మీకుందుకండీ బాధ" చిరాగ్గా మొగుడికేసి చూస్తూ అంది పర్వతాలు.

"నీ వెనక మీ అమ్మ వుందని ధైర్యమా?! అయినా, నేనేం కట్టగలన్రా! షాపులో వ్యాపారం అంతంత మాత్రమే! పైగా, పోటీకాలం. ఒకసారి కడితే సరిపోదు కదా! ఆర్నెల్లకో, మూడు నెలలకో ఒకసారి కట్టాలి కదా!... ఇంతకీ ఎన్నాళ్లు కట్టాలట?!" ఇంట్లోకి వెళ్తూనే అన్నాడు పీతాంబరం.

"ముందు మీరు ఈ మొదటి వాయిదా కట్టండి. తర్వాత నేను చూసుకుంటాను" నెమ్మదిగా అన్నాడు ఏకాంబర్.

"ఏలా?! వాయిదాలు సరిగ్గా కట్టకపోతే మొదట కట్టిన సొమ్ము పోదూ??" గిర్రున వెనక్కి తిరిగి అన్నాడు పీతాంబరం.

"తర్వాత వాయిదాలన్నీ నేను కడతానులెండి నాన్నా!" స్థిరంగా అన్నాడు ఏకాంబర్.

"అదే ఎలారా?!" వింతగా కొడుకుకేసి చూస్తూ అన్నాడు.

"నాకు కమీషన్ వస్తుంది కదా! అందులోనుండి" తండ్రి కళ్లలోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

ఆ మాటకు పకాలున నవ్వాడు పీతాంబరం.

"వెర్రివెంగళప్పలా వున్నావే! నేను కట్టిన ఒక్క వాయిదాకే నీకు నెలనెలా అంత కమీషన్ వచ్చేస్తుందా?" విరగబడి నవ్వుతూ అన్నాడు పీతాంబరం.

గుమ్మం అవతల కూర్చున్న రాజనాలకి చిరాగ్గా అనిపిస్తోంది. ఎంతో ఆత్మవిశ్వాసంతో వున్న ఏకాంబరాన్ని ఇతను నిరుత్సాహ పరుస్తున్నాడన్న ఉక్రోషం నిలవనివ్వటం లేదు. అంతే! చటుక్కున లేచి గదిలోకి అడుగు పెట్టాడు రాజనాల.

"మీరే వెర్రివాడిలా ఆలోచిస్తున్నారు. మీరొక్కరు కడితే సరిపోతుందా?! మిగతా అందరిచేత కట్టించగలనన్న ధీమాతో 'కమీషన్' వస్తే పోనీలే తండ్రిదే కదా పాలసీ, కమీషన్ లోంచి కడదామనుకుని చెప్పాడు. అది మీకు వెటకారంగా అనిపిస్తోందా?" మొగుడిమీద విరుచుకుపడింది పర్వతాలు.

"సరేలేరా! ఎక్కడ సంతకాలు పెట్టాలో చెప్పు. ఎంత కట్టాలో చెప్తే మీ అమ్మ దగ్గర డబ్బులడిగి తీసుకో! నాకు షాపుకు టైమయింది. స్నానం చేసి వస్తాను. ఈలోగా పేపర్లన్నీ తీసి వుంచు" అంటూ గాబరాగా పెరట్లోకి వెళ్లిపోయాడు పీతాంబరం.

ఏకాంబరానికి పట్టలేని సంతోషం కలిగింది. తండ్రి ముందన్న మాటలన్నీ వదిలేశాడు. చివరగా అన్న మాటలు అతనికి ఎనలేని ఆనందాన్ని కలిగించాయి. ఇంట్లోకి అడుగు పెట్టిన రాజనాలకి కూడా ఆయన మాటలు ఎంతో ఉత్సాహాన్ని కలిగించాయి.

అంతే! మిత్రులిద్దరూ గబగబా పేపర్లన్నీ సిద్ధం చేశారు. ఏకాంబర్ గబాలున వెళ్లి తండ్రి జేబులో వున్న పాన్ కార్డ్ తీసి రాజనాలకి చూపించాడు. అందులో వున్న పుట్టిన తేదీ ప్రకారం ప్రీమియం చూసి ఎంత కట్టాలో కాగితం మీద రాసుకుని సిద్ధంగా కూర్చున్నారు ఇద్దరూ.

పీతాంబరం పెరట్లో నుండి రాగానే ఎదురెళ్లి ఎంత కట్టాలో చెప్పాడు ఏకాంబర్.

"ఏడాదికి నాలుగుసార్లు గుర్తు పెట్టుకుని కట్టడం కష్టం కదా! ఏడాది మొత్తం ఒకేసారి కట్టేలా రాయండి! పాలసీ ఎక్కువకాలం పెట్టకమడి. ఓ పదిహేను సంవత్సరాలకి రాయించండి! పదేళ్ల లోపున అయితే, మరీ మంచిది" బట్టలు వేసుకుంటూ అన్నాడు పీతాంబరం.

"తక్కువయితే 'ఏజంటు 'కి కమీషన్ తగ్గిపోతుందంకుల్!" నెమ్మదిగా అన్నాడు రాజనాల.

చురుగ్గా కొడుకుకేసి, రాజనాలకేసి చూశాడు పీతాంబరం.

"మీ కమీషన్, మీ లాభాల కోసం ఆలోచించి 'పాలసీ'లు కట్టేవారికి కష్టం, నష్టం కలిగించకండి. వాళ్ల స్థోమతను అంచనా వేసి వాళ్లకి నచ్చజెప్పి రాయించండి. ఎవరినీ బలవంత పెట్టి చేయించకండి. ఆ తర్వాత వాళ్లు కట్టలేమని చేతులు ఎత్తేస్తే మీకే కాదు, కంపెనీకి కూడా చెడ్డపేరు. మీరు ముందుకెళ్లలేరు" చెప్పాడు పీతాంబరం.

"అలాగే అంకుల్!" అన్నాడు రాజనాల.

తండ్రి మాటల్లో నిజం వుందనిపించింది. తమ లాభం, స్వార్థం అలోచించి కట్టలేని వాళ్లకు వాళ్ల స్థోమతని మించి పాలసీ చేయించకూడదు. నిజమే కదా!' మనసులోనే తండ్రి మాటలను మననం చేసుకున్నాడు, మదిలో ముద్రించుకున్నాడు.

తండ్రి పీతాంబరం పాలసీ దరఖాస్తుల మీద సంతకాలు చేస్తూంటే ఏకాంబర్, తననుకున్నది సాధించేశానన్న తృప్తితో, ఆనందంతో ఉల్లాసభరితుడయ్యాడు.

ఆరోజంతా వారికి సాదర స్వాగతమే లభించింది.

తన చిన్ననాటి మిత్రుల ఇళ్లకు తీసుకుని వెళ్లాడు. గాంధీనగర్ లో ప్రతి ఇంటి తలుపు తట్టి మిత్రులందరికీ తను ఇన్స్యూరెన్స్ ఏజంటునయ్యానని తనని జాయిన్ చేసింది ఇతనేనని డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్రని అందరికీ పరిచయం చేశాడు.

అందరూ ఆనందంగా ఇన్స్యూరెన్స్ పాలసీలు కడతామని వాగ్దానం చేశారు. అయితే, తామందరూ వ్యాపారం, కూలీనాలీ చేసుకు బతికే వాళ్లమని, తమకు తగ్గట్టు ఎంతో కొంత చిరు మొత్తంలో పాలసీలు కడతామని చెప్పారు. ఏదైనా పాలసీయే కదా అంటూ వారి సహృదయతకు ధన్యవాదాలు తెలుపుకుని కడతామన్న వాళ్లందరి దగ్గరా దరఖాస్తులు తీసుకున్నారు ఇద్దరూ.

ఆ రోజు పదిహేను మందికి పైగా అందరూ చిన్నా పెద్దా పాలసీలు కట్టేసరికి ఏకాంబర్ ఆనందానికి అవధుల్లేవు. రాజనాలకు కూడా నమ్మకం కలిగింది. 'ఏకాంబర్ ' ఆంజనేయుడిలాంటివాడనీ, అతడి బలం అతడికే తెలీదని అర్థం చేసుకున్నాడు. నెలరోజులు క్రమ తప్పకుండా ఏకాంబరాన్ని ఫీల్డులో తిప్పితే ఇక ఎవరి అవసరమూ లేకుండా ముందుకు సాగిపోతాడని గ్రహించాడు.

ఆ రాత్రి - ఆనందంగా ఆరోజు జరిగినదంతా తల్లికి చెప్పాడు. తండ్రి పీతాంబరం ఇల్లు చేరగానే తన సంతోషాన్ని తెలియజేశాడు. పీతాంబరం కూడా ఆనందపడినా గుంబనంగా 'ఇంకా బాగా తిరగాలి, బాగా చెయ్యాలి ' అంటూనే 'ఇల్లు అలకగానే సంబరం కాదు. ఒళ్లు వంచి పని చెయ్యాలి ' అని పెరట్లోకి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత నుండీ రోజూ ఇన్స్యూరెన్స్ వేటలో పడ్డాడు ఏకాంబర్. ముందురోజు రాత్రే మర్నాడు కలవాల్సినవాళ్ళ పేర్లు రాసుకుని అందరినీ కలిసేవాడు. ఏకాంబర్ తో పాటు రాజనాల కూడా వెళ్తున్నాడు.

ఓ రోజు అనుకోకుండా కొండ మీదకు వెళ్లి సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నాక కొండమీద షాపుల వాళ్లందర్నీ కలసి ఇన్స్యూరెన్స్ గురించి చెప్పాడు ఏకాంబర్. అందరూ ఉన్నాయనేశారు గానీ, ఒక్కరంటే ఒకరు కూడా కడతామనలేదు. అయినా, ఏకాంబర్ పట్టించుకోలేదు.

కొండ దిగిపోదామని బస్సుస్టాండ్ లో నిలబడ్డ ఏకాంబరానికి బాల్య స్నేహితుడు బంటుబల్ల త్రినాథ్ కనిపించాడు.

అతను కొండమీద శానిటరీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఏకాంబరాన్ని చూస్తూనే నవ్వుతూ వచ్చి పలకరించాడు.

"ఏరా! దర్శనానికి వచ్చావా?" ఎదురొచ్చి త్రినాష్ అడిగాడు.

"అరే త్రినాథ్! ఇక్కడే చేస్తున్నావా? మొన్నటివరకూ కొండ దిగువన కదా పనిచేశావు" ఆశ్చర్యంగా అన్నాడు ఏకాంబర్.

"వారం రోజులయింది ఇక్కడకు బదిలీ అయి. కొత్తగా మెళ్లో ఆ బ్యాగ్ ఏమిట్రా! ఏదైనా ఫైనాన్స్ కంపెనీలో చేరావా?" అడిగాడు త్రినాథ్.

"నీకు తెలియదు కదూ! ఇన్స్యూరెన్స్ ఏజెంటుగా చేరాను. ఇదిగో! ఈ షాపులవాళ్లు ఎవరైనా పాలసీ ఇస్తారేమోనని వచ్చాను" విచారం దాచుదామన్నా దాగటంలేదు. విషణ్ణ వదనంతో అన్నాడు ఏకాంబర్.

"ఇన్స్యూరెన్స్ అంటే లైఫ్ ఇన్స్యూరెన్స్ పాలసీలేనా?!" అడిగాడు త్రినాథ్.

"అవున్రా! 'జీవితభీమా' పాలసీలే చేయిస్తూంటాను" చెప్పాడు ఏకాంబర్.

"అయితే, నేనూ కడతాను. నా దగ్గర పదిహేనుమంది వరకూ పనిచేస్తున్నారు. వాళ్ల చేత కూడా కట్టిస్తాను. జీతాల్లో వసూలు అయిపోతుంది కదా!" కుతూహలంగా అడిగాడు త్రినాథ్.

"అలాగే చేద్దాం! అలాగే! మా డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్ర అనీ... ఆయన్ని పట్టుకుని వస్తాను. ఎప్పుడు చేయిద్దాం అంటావు?" ఆతృతగా అడిగాడు ఏకాంబర్.

""రేపు ఉదయాన్నే ఎనిమిదో గంటకే ఇక్కడికే వచ్చేయండి. అందరం ఉంటాం. వస్తారా! ఎక్కడా చెత్తా చెదారం లేకుండా చూడ్డమే నా పని. ఈవోగారు వచ్చే టైం అవుతోంది. ఇలా నేను బాతాఖానీ వేస్తూ కూర్చోవడం మంచిది కాదు" అంటూ అక్కడనుండి వేరేచోటుకు పరుగందుకున్నాడు అతడు.

త్రినాథ్ చెప్పింది వినేసరికి హుషారొచ్చింది. హాయిగా గుండెల్నిండా గాలి పీల్చుకుని ధైర్యంగా నిలబడ్డాడు.

"ముందు తను 'ఇన్స్యూరెన్స్ ఏజెంట్'నన్న విషయం అందరికీ తెలియజేయాలి. పాలసీ కట్టినా, కట్టకపోయినా తను 'ఏజెంటు 'నన్న విషయం తెలుస్తుంది. పేరు సంపాదిస్తే పాలసీలవే వస్తాయి" మనసులోనే స్థిరంగా అనుకున్నాడు ఏకాంబర్.

ఆ మర్నాడు త్రినాథ్ చెప్పిన సమయానికి అరగంట ముందే కొండ పైకి చేరుకున్నారు ఏకాంబర్, రాజనాల. అనుకున్న ట్టే తనూ, తనవాళ్ల చేత పాలసీలు రాయించి నెలకి ఒక్కొక్కరికి అయిదొందల రూపాయలు దాటకుండా 'పాలసీలు ' రాయమన్నాడు త్రినాథ్. ప్రీమియం ను బట్టి వాళ్ల వయసుకు తగ్గట్టు 'పాలసీ' ఎంత రాయాలో లెక్క కట్టి అంతంత పాలసీలు రాయించాడు రాజనాల. ఎవరూ ఒక పైసా కట్టలేదు. రాజనాల కూడా అడగలేదు.

"వచ్చేనెల జీతాల్లోనుండి నెలనెలా వాయిదా వసూలు జరిగేలా చూడండి సార్!" అంటూ రాజనాలకు చెప్పి వెళ్లిపోయాడు త్రినాథ్. తన అనుచరుల్ని ఎక్కడెక్కడకు వెళ్లి పని చెయ్యాలో చెప్పి వెళ్లిపోతూ ఏకాంబర్ కు కూడా ఒక సలహా ఇచ్చాడు త్రినాథ్.

"ఒరేయ్ ఏకాబర్! మా అందరికీ ఈ నెల్లో జీతాలు పెరిగాయి. నువ్వు సార్ ని తీసుకుని దేవాలయంలోకి వెళ్లు. అక్కడ పని చేస్తోన్న మాలీలు, బోయీలు, ఫిర్కాలు, అర్చకులు, ఫేద పండితుల్ని అందర్నీ ఒకసారి కలసి చూడు. నీకు చాలా పాలసీలు వచ్చే అవకాశం వుంది" అన్నాడు త్రినాథ్.

రాజనాల ఆనందంతో ఎగిరి గంతేశాడు. ఏకాంబర్ సరేసరి. కానీ, పాలసీలు రాసిన పదిహేను మందీ ఒక్క రూపాయి కూడా ప్రీమియం ఇవ్వకపోయేసరికి అయోమయంగా రాజనాల కేసి చూశాడు ఏకాంబర్.

"ఇవి 'సాలరీ సేవింగ్స్ స్కీం' పాలసీలు. ఉద్యోగులు కడతారు. మూడో నెల నుండి జీతాల్లో రికవరీ





జరిగిన కథ: ఏకాంబర్ కొండ మీదకు వెళ్ళి సిం హాద్రి అప్పన్నను దర్శించుకుని, కొండ దిగి పోదామని బస్టాండులో నిబడ్డాడు. ఇంతలో తన బాల్య మిత్రుడు త్రినాథ్ కనిపిస్తాడు. అతని క్షేమ సమాచారాలు అడిగి, త్రినాథ్ కు పరిచయం వున్న వారితో పాలసీలు కటిస్తాడు.

అయిపోతాయి. పాలసీ కాలమంతా జీతాల్లో వసూలు అవుతూనే వుంటాయి. ఏజెంట్ కి నెలనెలా వసూలు చేసి కట్టే బాధ తప్పుతుంది" విడమర్చి చెప్పాడు రాజనాల.

"మరి, ముందు రెండు నెలలు?" అన్నాడు ఏకాంబర్.

"మనం కట్టాలి. రెండు వాయిదాల డబ్బు మనం కట్టి పాలసీ పూర్తి చేశాక మూడో నెల నుండి వారి జీతాల్లో రికవరీ అయిపోతుంది. ఇక పాలసీ కాలమంతా కష్టపడకుండా ఏజుంటుకి కమీషన్ వస్తుంది. ఇలాంటి పాలసీలు దొరికితే ఆ ఏజెంట్ కాలు మీద కాలేసుకు కూర్చోవచ్చు" అన్నాడు రాజనాల.

రాజనాల రాజేంద్ర చెప్పిందంతా విన్నాడు. అయినా, ఏకాంబర్ బుర్రకి ఎక్కలేదు. మౌనంగా వుండిపోయాడు.

అక్కడనుండి నేరుగా దేవాలయంలోకి వెళ్లారు. దేవుడి దర్శనం చేసుకుని ఆండాళ్ అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ఆలయంలోనే దక్షిణ భాగంలో వుంది అమ్మవారి ఆలయం. స్వామివారి దేవేరి గుడి. అక్కడ తీర్థం, శఠగోపం తీసుకుని ఆలయ బేడా మండపంలో కూర్చున్నారిద్దరూ.

అందరూ ఎవరి హడావిడిలో వాళ్లున్నారు. అర్చకులు కొందరు గర్భాలయంలోనూ, మరికొందరు ఆండాళ్ సన్నిధి దగ్గర వున్నారు. ఎవరిని పలకరిద్దామన్నా వీరిని పట్టించుకున్నవాళ్లు లేరు.

"ఏకాంబర్! నీకు తెలిసిన వాళెవరైనా వున్నారా?" అన్నాడు రాజనాల.

"అందరూ తెలిసినవాళ్లే కదా!" ఆశ్చర్యంగా రాజనాలకేసి చూస్తూ అన్నాడు ఏకాంబర్. ఇక్కడే పుట్టి పెరిగినవాళ్లకి ఈ ఊరివాళ్లు తెలియకపోవడమేమిటా? అని ఏకాంబర్ ఆలోచన. రాజనాల అంటే ఎప్పుడో చిన్నప్పుడు దుంపలబడిలో చదువుకుని ఊరు వదలి వెళ్లిపోయాడు. వాడికి అందరూ కొత్త కావచ్చు. కానీ, తనకు ఎవరూ తెలియకపోవడం లేదు కదా! అని మనసులోనే అనుకున్నాడు ఏకాంబర్.

"తెలియడం కాదు. నీకు బాగా పరిచయం, చనువు వున్న ఉద్యోగులు ఎవరున్నారు? అని అడిగాను" అన్నాడు రాజనాల.

"నాకు బాగా పరిచయమున్నది... ఆ! అవున్రా! పడిరాజు. శిడగం పైడిరాజని ఈ మధ్యనే నాతోనే ఇంటర్ వరకూ చదివాడు. ఇక్కడే వాళ్ల నాన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఈ మధ్యే జాయిన్ అయ్యాడు" గుర్తు చేసుకుంటూ అన్నాడు ఏకాంబర్.

"వాళ్ల నాన్న ఉద్యోగమా?!" ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు రాజనాల.

"అబ్బ! వాళ్ల నాన్న చనిపోతే వీడికి ఆ ఉద్యోగమిచ్చారు. కోవెల్లోనే మాలీగా చేస్తున్నానని చెప్పాడు" అన్నాడు ఏకాంబర్.

అదే సమయంలో బేడా మండపమంతా పెద్ద చీపురుతో ఊడ్చుకుంచ్చూ ఒకతను అటుగా వస్తున్నాడు. అతన్ని చూసి గబాలున అటుగా వెళ్లాడు ఏకాంబర్.

"గురూ! ఇక్కడ శిడగం పైడిరాజు పని చేస్తున్నాడు కదా! ఎక్కడున్నాడు?" అంటూ అతన్ని సమీపించి అడిగాడు ఏకాంబర్.

"పైడిరాజా! గుడి బయట ఆవరణ వుంది కదా! ప్రసాదాల కౌంటర్ దగ్గర వాడి డ్యూటీ. అక్కడుంటాడు వెళ్లండి" అంటూ తనపనిలో తలు నిమగ్నమైపోయాడు అతను.

ఇద్దరూ అతను చెప్పిన వెంటనే గుడిలో నుండి బయటకు వచ్చారు. ఆలయం చుట్టూ వున్న ఆవరణలో నలుగురైదుగురు చీపుర్లు పట్టుకుని శుభ్రం చేస్తున్నారు.

ఆ నలుగురిలో పైడిరాజును సులువుగానే గుర్తుపట్టాడు ఏకాంబర్.

"ఒరేయ్ రాజూ!... ఎలా వున్నావురా?" హుషారుగా వెళ్లి పైడిరాజు భుజం మీద చరుస్తూ పలకరించాడు ఏకాంబర్.

"ఎవరో హఠాత్తుగా వెనకనుండి భుజం మీద గట్టిగా చరిచేసరికి అదిరిపడి చేతిలో వున్న చీపురును కింద పడేసి పరుగందుకున్నాడు పైడిరాజు. కొద్దిదూరం పారిపోయి వెనక్కి తిరిగి చూశాడు.

ఎదురుగా ఏకాంబర్ కనిపించేసరికి హమ్మయ్య అనుకుంటూ వచ్చి కింద పడేసిన చీపురును తీసుకున్నాడు.

"నువ్వేనా వెనకనించి చరిచింది?" ఏకాంబరాన్ని చూస్తూ అన్నాడు పైడిరాజు.

"నేనేరా! ఏం అంత కంగారు పడ్డావ్?!" అయోమయంగా అడిగాడు ఏకాంబర్.

"గొప్పోడివేరా బాబూ! ఇక్కడ్ ఓ పిచ్చోడు తిరుగుతున్నాడులే! వాడు వెనకనుండి వచ్చి దబదబా బాదేసి పారిపోతూంటాడు. వాడేమోనని కంగారుపడి చచ్చాను" తనలో కలిగిన ఉలికిపాటును అణచుకుంటూ అన్నాడు అతను.

"సరేరా బాబూ! నువ్వు కనిపించావనే ఆనందంలో సరదాగా వచ్చి హఠాత్తుగా నిన్ను ఆశ్చర్యపరచాలనుకున్నాను" అన్నాడు ఏకాంబర్.

"హడలెత్తించావు కదరా! పిచ్చోడనుకుని హడలి చచ్చాన్రా బాబూ! ఒకోజు ఇలాగే వెనకగా వచ్చి చేతిలో వున్న దుడ్డుకర్రతో బాదేశాడు. వారం రోజులు నడుమ్నొప్పితో చచ్చాను" భయంగా అన్నాడు

పైడిరాజు.

"మీరా పిచ్చోడ్ని ఇక్కడినుండి తగిలెయ్యలేదా?" అడిగాడు ఏకాంబర్.

"పిల్లల్నీ, పిచ్చోళ్లనీ ఎవరు పట్టించుకుంటార్రా! నిత్యం భక్తులతో రద్దీగా వుంటుంది దేవాలయం. ఎంతోమంది వస్తూంతారు, వెళుతూంటారు. పిచ్చోళ్లు, బిచ్చగాళ్లు ఎక్కడుంటారో వాళ్లకే తెలీదు. వాళ్లను ఎవరు పట్టించుకుంటార్రా?" అన్నాడు పైడిరాజు.

"నిజమేలేరా! కింద వూళ్లో తొలి పావంచా దగ్గర, బజార్లోనూ ఎంతోమంది పిచ్చోళ్లు తిరుగుతుంటారు. ఒకోసారి సడెన్ గా కనిపించరు. మళ్లీ మరోరోజు ఇంకో కొత్త పిచ్చోడు దర్శనమిస్తూంటాడు. అవును, నువ్వన్నది కరెక్టే!" అన్నాడు ఏకాంబర్.

"దర్శనానికి వచ్చారా? దర్శనం చేయించాలా?" అంటూ అడిగాడు పైడిరాజు.

"దర్శనం అయిందిరా! నీతోనే పనిబడి వచ్చాను" అన్నాడు ఏకాంబర్.

"నాతోనా? నీకా? చెప్పరా!" చీపురును పక్కనబెట్టి అడిగాడు పైడిరాజు..

ఇంతలో అటుగా వెళ్తున్నతని దగ్గరకు వెళ్లి బాట్లాడి వచ్చాడు పైడిరాజు.

"పదరా! సార్ దగ్గర పర్మిషన్ తీసుకున్నాను. అలా కల్యాణమండపంలోకి వెళ్లి కూర్చుందాం" అన్నాడు పైడిరాజు ఏకాంబర్ తో.

మిత్రులిద్దరూ మాట్లాడుకుంటూంటే దూరంగా నిలబడి గమనిస్తున్నాడు రాజనాల.

"ఒక్క నిమిషం. మా ఫ్రెండ్ని పరిచయం చేస్తాను" అంటూనే రాజనాలకేసి చూసి రమ్మన్నట్టు సైగ చేసి పిలిచాడు ఏకాంబర్.

"ఆయనెవరు?" కుతూహలంగా అడిగాడు పైడిరాజు.

"నీకూ తెలిసే వుంటుంది. మనతో దుంపలబడిలో చదువుకున్నాడు. అయిదో తరగతి తర్వాత వైజాగ్ కి వెళ్లిపోయాడు. పేరు రాజనాల రాజేంద్ర. ఇప్పుడు ఇన్స్యూరెన్స్ డెవలప్ మెంట్ ఆఫీసర్ గా పనిచేస్తున్నాడు" అంటూ పరిచయం చేశాడు ఏకాంబర్.

"ఏమోరా! వూళ్లో వున్న వాళ్లం. మనమే తరచూ కలుసుకోలేక ఒకరినొకరు మరచిపోతున్నాం. నాకు గుర్తులేదు" రాజనాలకేసి చూస్తూ అన్నాడు పైడిరాజు.

"నమస్తే!" వాళ్లిద్దరి దగ్గరకూ చేరుతూనే నమస్కరించాడు రాజనాల.

"నమస్తే! నేనూ, ఏకాంబర్ కలసి చదువుకున్నామండీ! మీరు నాకు గుర్తు రావడం లేదు" అన్నాడు పైడిరాజు.

"వందలమంది ఎవరికి ఎవరు ఎలా గుర్తుంటారు? అయినా, చిన్నప్పటి మిత్రులు గుర్తుండొద్దా?! అయినా ఎప్పుడూ మనం కలిసిన గుర్తు లేదు" అన్నాడు రాజనాల.

"రండి! అక్కడ కల్యాణ మండపంలో కూర్చుందాం. ప్రసాదం తీసుకురానా!" ఏకాంబర్ కేసి చూస్తూ అన్నాడు పైడిరాజు.

"నీకు శ్రమ ఏందుకులేరా!" ప్రసాదం పేరెత్తేసరికి ఏకాంబర్ కి నోరూరింది. తినాలనే వుందిగానీ, అనలేకపోయాడు ఏకాంబర్.

"మీరు ఇద్దరూ వెళ్లి మండపంలో కూర్చోండి. నేను వెళ్లి ప్రసాదం పట్టుకొస్తాను" అంటూ పరుగు పరుగున రామనుజకూటం దగ్గరకు వెళ్లాడు పైడిరాజు.

దేవుడి ప్రసాదాలను తయారు చేసే వంటశాలనే రామానుజకూటం అంటారు. అందులో వష్ణవస్వాములే ప్రసాదాలు తయారు చేస్తారు.

ఏకాంబర్, రాజనాల నేరుగా ధ్వజస్తంభం పక్కనుండి వెళ్లి విశాలంగా వున్న కల్యాణ మండపంలో కూర్చున్నారు.

కల్యాణమండపంలో పూర్వం ఎప్పుడో దేవుడి కల్యాణ మహొత్సవాన్ని జరిపించేవారు. భక్తుల రద్దీ పెరగడంతో ఆరుబయటే పెద్ద పెద్ద పందిళ్లు వేసి ప్రత్యేకంగా కల్యాణవేదికను నిర్మించి కల్యాణం జరిపిస్తున్నారు.

ఆ కల్యాణ మండపమంతా పెద్ద పెద్ద నల్లరాతి పలకలతో నిర్మించినది. రాతి స్తంభాలు కూడా అద్భుతమైన శిల్పాలతో మదపుటేనుగులకు మల్లే నిలబడి వున్నాయి. ప్రతి స్తంభం ఒకదానికొకటి పోటీపడి తయారు చేసినట్టు అద్భుత శిల్పసౌందర్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఇద్దరు మిత్రులు ఓ మూలకు వెళ్లి కూర్చున్నారు. అప్పటికే ఆ కల్యాణ మండపంలో చాలామంది భక్తులు గుంపులు గుంపులుగా కుటుంబాలతో కూర్చుని ప్రసాదాలు తింటున్నారు. కొందరు కొబ్బరి చెక్క పగులతొష్టి కొబ్బరి ముక్కలనే ప్రసాదంగా తింటున్నారు.

ఎంతో చల్లగా, ఆహ్లాదంగా వున్న ఆ మండపం దగ్గర ఇద్దరు ముగ్గురు పిల్లలు అటూయిటూ పరిగెడుతూ ఆడుకుంటున్నారు.

ఆ మండపంలోనే ఓ మూల గరుత్మంతుని రూపంలో వున్న పల్లకీ, స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించే ఇతర వాహనాలు వరుసగా పేర్చినట్టున్నాయి.

రాజనాల, ఏకాంబర్ ఇద్దరూ పైడిరాజుతో ఏం మాట్లాడాలి, ఎలా మొదలుపెట్టాలి అన్న విషయమై చర్చించుకుంటూ కూర్చున్నారు.

ఇంతలో పైడిరాజు రెండు చేతుల్తో ప్రసాదం పొట్లాలను పట్టుకుని వచ్చాడు.

"నీకెందుకురా శ్రమ! నీతో మాట్లాడాలని రాజనాల అంటే తీసుకు వచ్చాను" నెమ్మదిగా అన్నాడు ఏకాంబర్.

"శ్రమేముందిరా! కలవక కలవక కలిసిన మిత్రుల్ని ఎలా వదిలెయ్యగలన్రా! ఇది మా స్వామివారి ప్రసాదం. పొంగలి, దధ్ధోజనం, చక్రపొంగలి. వీటిని బయట అమ్మరు. ఉదయాన్నే స్వామివారికి నైవేద్యం పెట్టాక పంచుతారు" అంటూ వారి పక్కన కూర్చుని ఇద్దరికీ ఇచ్చాడు పైడిరాజు.

"నువ్వు కూడా కొంచెం తినరా!" అన్నాడు ఏకాంబర్.

"నేను మీరు రాకముందే తినేశాను. మీ ఇద్దరి కోసమే తీసుకొచ్చాను. తినండి. ఈలోగా నా పని పూర్తి చేసుకుని పది నిమిషాల్లో వచ్చేస్తాను. అదిగో అక్కడ మంచినీళ్ల కొళాయి వుంది. నా డ్యూటీ టైం కూడా అయిపోయింది. వచ్చేయడమే!" అన్నాడు పైడిరాజు.

"అలాగే. తీరిగ్గా రండి! గాభరా ఏంలేదు. మేము వుంటాం" చెప్పాడు రాజనాల.

వాళ్లిద్దర్నీ అక్కడే కూర్చోబెట్టి పరుగుపరుగున వెళ్లిపోయాడు పైడిరాజు.

రాజనాల, ఏకాంబర్ ఇద్దరూ తృప్తిగా తిన్నా ఇంకా ప్రసాదం మిగిలిపోయింది. పొంగలి, పులిహోర, దద్ధోజనం మూడూ మిగిలిపోయాయి.

చక్రపొంగలి మాత్రం తక్కువే వుండడం, పైపెచ్చు అమృతంలా మధురంగా వుండడంతో ఇద్దరూ ఆకుల్ని సైతం నాకేశారు.

"మిగిలిన ప్రసాదాన్ని నేను ఇంటికి పట్టుకెళ్తాను రాజేంద్రా! అమ్మకీ, చెల్లికీ దేవుడి ప్రసాదమంటే ఎంతో ఇష్టం. నువ్వింక తినవు కదా?" రాజనాలకేసి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"చాలురా బాబూ! ఎక్కువైపోయింది. ఉదయం మనం టిఫిన్ చేయ్యకుండా వుండి వుంటే తినేద్దును. మిగిలిన ఆ పొట్లాలను అమ్మకి పట్టుకెళ్లివ్వు" అన్నాడు రాజనాల. పొట్లాలను జాగ్రత్తగా కట్టి బ్యాగులో సర్దుకున్నాడు ఏకాంబర్.

పది నిమిషాల్లో వస్తానన్న పైడిరాజు అరగంట తర్వాత నలుగురైదుగురు మిత్రుల్ని వెంటబెట్టుకుని వాళ్ల దగ్గరకు వచ్చాడు.వస్తూనే ఆ నలుగురినీ ఏకాంబరానికి పరిచయం చేశాడు.

"వీళ్లందరూ నాతోనే పని చేస్తున్నారు. మా డ్యూటీ అయి దిగి ఇళ్లకు వెళ్లిపోతున్నాం. మీరిక్కడ వున్నారని చెప్పి తీసుకువచ్చాను" అంటూ ఏకాంబరానికి పరిచయం చేశాక రాజనాలతో చెప్పాడు పైడిరాజు.

మనసులోనే ఉప్పొంగిపోయాడు ఏకాంబరం.

పైడిరాజుకి లోలోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. బయటకు మాత్రం గుంభనంగా వాళ్ల నలుగురికీ షేక్ హేండ్ ఇచ్చి నవ్వుతూ పలకరించాడు.

"మీరు ఇన్స్యూరెన్స్ చేస్తారని మా పైడిరాజు చెప్పాడు. మా అందరికీ ఒక్కొక్కరికీ ఈ నెల నుండి అయిదువందల నుండి వెయ్యి వరకూ జీతం పెరిగింది. దానికి తగ్గట్టు మంచి పాలసీలుంటే చేయించండి సార్" అన్నారు ఆ నలుగురు.

పైడిరాజు "అలాగే" అన్నాడు.

వాళ్లు అనడమేమిటి కల్యాణ మండపంలోనే ఓ మూల కూర్చుని వాళ్లందరికీ వారి వారి వయసుని బట్టి మనీబ్యాక్ బాలసీలు ఇద్దరికీ జీవనమిత్ర పాలసీలు ఇద్దరికీ, ఎండోమెంట్ పాలసీ ఒక్కరికి రాయించాడు ఏకాంబర్.

రాజనాలకి కూడా ఏకాంబర్ పద్ధతి అర్థం కాలేదు.

అందరికీ ఏదో ఒక పాలసీ రాస్తే పోలా అని అడిగాడు పైడిరాజు. దానికి మిగతా అందరూ సరే అన్నారు. రాజనాలకి కూడా చిరాగ్గానే వుంది. కట్టేవాడికి ఏం కావాలో అది రాయించక మధ్యలో వీడి పెత్తనం ఏమిటో అనుకుంటూ మౌనంగా వుండిపోయాడు.

"సార్! మీకు పిల్లలు పెద్దయిపోయారు. ఇంకా సర్వీసు పదిహేనేళ్లు వుంటుందంటున్నారు. మనీబ్యాక్ అయితే మధ్యలో వస్తుంది. ప్రీమియం కూడా ఎక్కువ పడుతుంది. అవసరం లేని సొమ్ము వచ్చాక దుబారా తప్ప ప్రయోజనం

"నువ్వు కూడా కొంచెం తినరా!" అన్నాడు ఏకాంబర్.

"నేను మీరు రాకముందే తినేశాను. మీ ఇద్దరి కోసమే తీసుకొచ్చాను. తినండి. ఈలోగా నా పని పూర్తి చేసుకుని పది నిమిషాల్లో వచ్చేస్తాను. అదిగో అక్కడ మంచినీళ్ల కొళాయి వుంది. నా డ్యూటీ టైం కూడా అయిపోయింది. వేచ్చయండమే!" అన్నాడు పైడిరాజు.

"అలాగే. తీరిగ్గా రండి! గాభరా ఏంలేదు. మేము వుంటాం" చెప్పాడు రాజనాల.

వాళ్లిద్దర్నీ అక్కడే కూర్చోబెట్టి పరుగుపరుగున వెళ్లిపోయాడు పైడిరాజు.

రాజనాల, ఏకాంబర్ ఇద్దరూ తృప్తిగా తిన్నా ఇంకా ప్రసాదం మిగిలిపోయింది. పొంగలి, పులిహోర, దద్ధోజనం మూడూ మిగిలిపోయాయి. చక్రపొంగలి మాత్రం తక్కువే వుండడం, పైపెచ్చు అమృతంలా మధురంగా వుండడంతో ఇద్దరూ ఆకుల్ని సైతం నాకేశారు.

"మిగిలిన ప్రసాదాన్ని నేను ఇంటికి పట్టుకెళ్తాను రాజేంద్రా! అమ్మకీ, చెల్లికీ దేవుడి ప్రసాదమంటే ఎంతో ఇష్టం. నువ్విక తినవు కదా?" రాజనాలకేసి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"చాలురా బాబూ! ఎక్కువైపోయింది. ఉదయం మనం టిఫిన్ చేయ్యకుండా వుండి వుంటే తినేద్దును. మిగిలిన ఆ పొట్లాలను అమ్మకి పట్టుకెళ్లివ్వు" అన్నాడు రాజనాల. పొట్లాలను జాగ్రత్తగా కట్టి బ్యాగులో సర్దుకున్నాడు ఏకాంబర్.

పది నిమిషాల్లో వస్తానన్న పైడిరాజు అరగంట తర్వాత నలుగురైదుగురు మిత్రుల్ని వెంటబెట్టుకుని వాళ్ల దగ్గరకు వచ్చాడు.వస్తూనే ఆ నలుగురినీ ఏకాంబరానికి పరిచయం చేశాడు.

"వీళ్లందరూ నాతోనే పని చేస్తున్నారు. మా డ్యూటీ అయి దిగి ఇళ్లకు వెళ్లిపోతున్నాం. మీరిక్కడ వున్నారని చెప్పి తీసుకువచ్చాను" అంటూ ఏకాంబరానికి పరిచయం చేశాక రాజనాలతో చెప్పాడు పైడిరాజు.

మనసులోనే ఉప్పొంగిపోయాడు ఏకాంబరం. పైడిరాజుకి లోలోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. బయటకు మాత్రం గుంభనంగా వాళ్ల నలుగురికీ షేక్ హేండ్ ఇచ్చి నవ్వుతూ పలకరించాడు.

"మీరు ఇన్స్యూరెన్స్ చేస్తారని మా పైడిరాజు చెప్పాడు. మా అందరికీ ఒక్కొరకీ ఈ నెల నుండి అయిదువందల నుండి వెయ్యి వరకూ జీతం పెరిగింది. దానికి తగ్గట్టు మంచి పాలసీలుంటే చేయించండి సార్" అన్నారు ఆ నలుగురు.


పైడిరాజు "అలాగే" అన్నాడు.

వాళ్లు అనడమేమిటి కల్యాణ మండపంలోనే ఓ మూల కూర్చుని వాళ్లందరికీ వారి వారి వయసుని బట్టి మనీబ్యాక్ బాలసీలు ఇద్దరికీ జీవనమిత్ర పాలసీలు ఇద్దరికీ, ఎండోమెంట్ పాలసీ ఒక్కరికి రాయించాడు ఏకాంబర్.

రాజనాలకి కూడా ఏకాంబర్ పద్ధతి అర్ధం కాలేదు.

అందరికీ ఏదో ఒక పాలసీ రాస్తే పోలా అని అడిగాడు పైడిరాజు. దానికి మిగతా అందరూ సరే అన్నారు. రాజనాలకి కూడా చిరాగ్గానే వుంది. కట్టేవాడికి ఏం కావాలో అది రాయించక మధ్యలో వీడి పెత్తనం ఏమిటో అనుకుంటూ మౌనంగా వుండిపోయాడు."సార్! మీకు పిల్లలు పెద్దయిపోయారు. ఇంకా సర్వీసు పదిహేనేళ్లు వుంటుందంటున్నారు. మనీబ్యాక్ అయితే మధ్యలో వస్తుంది. ప్రీమియం కూడా ఎక్కువ పడుతుంది. అవసరం లేని సొమ్ము వచ్చాక దుబారా తప్ప ప్రయోజనం.



జరిగినకథ: ఏకాంబర్ తన చిన్ననాటి మిత్రుడైన పైడిరాజుని కలుసుకున్నాడు. మిత్రులిద్దరూ కళ్యాణ మండపంలో కూర్చుని మాట్లాడుకుంటారు. ఏకాంబర్, రాజనాలకు, మిత్రుడు పైడిరాజును

పరిచయం చేస్తాడు.

"ఏరా! నీకు చాలా వయసుంది కదా! అందుకే, నీ సర్వీసు వరకూ ఒక పాలసీ ఎండోమెంట్ పెట్టి మిగిలిన మొత్తంతో మనీబ్యాక్ పాలసీ పని చేస్తుంది" అని అందరికీ వారి స్థితిగతులను కనుక్కుని పాలసీలు పెట్టానని చెప్పాడు. మరొకతను మనిషిని చూస్తూనే పచ్చి తాగుబోతని గ్రహించి అతడి సర్వీసు చివరకు అందేలా ఎండోమెంట్ పాలసీ రాయించాడు ఏకాంబర్.

ఏకాంబర్ చెప్పిన వివరణ వింటూనే రాజనాల ఆశ్చర్యంతో నోరు అవులించేశాడు. పైడిరాజు, అతడి మిత్రులు నలుగురూ ఆనందంగా "మంచి ఆలోచన చేశారు సార్" అంటూ ఏకాంబరాన్ని అభినందించారు.

"ఏకాంబర్! నీకు తీరిక వున్నా, లేకపోయినా ఈవారం రోజులూ ఉదయం, సాయంత్రం కొండపైకి వచ్చి మా ఉద్యోగుల్ని కలిస్తే పాలసీలు ఎక్కువ వస్తాయి. అందరూ కడతారు. మాతో దిగుతున్నవాళ్లు ఇంకో పదిమంది ఇక్కడకు వస్తారు. వాళ్లచేత రాయించండి. ఎవరైనా రాయనంటే వదిలెయ్ రాసేవాళ్లు బోల్డుమంది వున్నారు" అన్నాడు పైడిరాజు.

"థాంక్సండీ! మీ మేలు మరచిపోలేము" రాజనాల అన్నాడు.

"గొప్పోలే! ఎవరెవరో, ఎక్కడెక్కడినుండి వాళ్ల తాలూకా, వీళ్ల తాలూకా అని చెప్పి మా ఎంప్లాయీస్ దగ్గర పాలసీలు

రాయించుకుపోతున్నారు. నా బాల్యమిత్రుడు ఏకాంబర్ గాడికి సయానం చేయడం కూడా పెద్ద ఉపకారమే" అని నవ్వాడు పైడిరాజు.

వాళ్లలా మాట్లాడే లోపలే మరో పది, పదిహేనుమంది అక్కడకు వచ్చి చేరుకున్నారు.

వాళ్లందరిలో అర్చకులు, వేదపండితులున్నారు. బోయీలి, గుమాస్తాలు కూడా వున్నారు.

ఆ పదిమందిలో ఒకరిద్దరు మాకిప్పటికే బొచ్చుడు పాలసీలున్నాయి. వద్దురా బాబూ! వద్దు జీతం చేతికి రావతం లేదంటూ వెళ్లిపోయారు. అందులో అందరూ ఏకాంబర్ కి తెలిసినవాళ్లే.

"ఏకాంబర్! నువ్వా? పోనీలేరా! ఇప్పటికైనా ఏదో పని పట్టుకున్నావ్! మంచిదే! ఊరూ, పేరూ తెలీని వళ్లెవరికో పాలసీలు కట్టేస్తున్నారు మా ఎంప్లాయీస్ అందరూ. నీకు మేమందరం చేయిస్తాం. రోజూ

కనిపించు. మా ఉద్యోగులు నాలుగొందలమంది. అందర్నీ కలిస్తే నీ పంట పండిపోద్ది" గుమాస్తా హోదాలో వున్నతను అన్నాడు.

వాళ్లందరి అభిమానానికి ఏకాంబరే కాదు, రాజనాల కూడా ఆనందంతో పొంగిపోయాడు.

ఆరోజు దాదాపు నలభై పాలసీల వరకూ దండుకోదలిగాడు ఏకాంబర్. అయితే, అందరూ పాలసీలు రాశారు గానీ, ఒక్కరు కూడా డబ్బులు ఎంతివ్వాలని గానీ, ఎప్పుడివ్వాలని గానీ అడగలేదు.

రాజనాల కూడా పెదవి విప్పలేదు.

ఏకాంబరానికి మాత్రం మనసులో అనుమానం దొలిచేస్తోంది. ఈ పాలసీలు ఎలా కట్టాలా? అని.

మధ్యాహ్నం రెండయ్యేసరికి ఇద్దరూ కొండ దిగువకు చేరుకున్నారు. వూళ్లోకి వచ్చాక ఇద్దరూ హొటల్ సిమ్హశైలకు వెళ్లి కూర్చున్నారు.

ఆరోజు వచ్చిన నలభైమంది పాలసీలకు రెండు వాయిదాల డబ్బు ముందుగా ఎంత కట్టాలో లెక్క కట్టి రాసి చూసి షాకయిపోయాడు రాజనాల.

"ముప్పైవేల పైచిలుకు కట్టాలి!" ఆ లిస్టు రాసి ఏకాంబర్ చేతికిచ్చాడు రాజనాల.

"ఈ ముప్పైవేలు ఎవరు కడతారు?! వాళ్లను అడగాలి కదా!" కుతూహలంగా అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా అనేసరికి పకాలున నవ్వాడు రాజనాల.

"సాలరీ సేవింగ్ స్కీం పాలసీలంటే తప్పదు. ముందు రెండు వాయిదాలు ఏజెంటు కట్టుకోవాలి. మూడోనేల నుండి వారి జీతాల్లో కట్ అయి కంపెనీకి వెళ్తుంది" చెప్పాడు రాజనాల.

"అదేంటన్నా! పాలసీలు వాళ్లవి కట్టేది ఏజెంటా?" ఆశ్చర్యంగా అన్నాడు ఏకాంబర్.

"నాయనా ఏకాంబర్! నువు కొత్త ఏజెంటువి. ఇది పోటీ వ్యాపారం. వాళ్ల పాలసీల మీద నీకు కమీషన్

ఎంతౌస్తుందో అందరికీ తెలుసు. మొదటి ఏడాది 35 శాతం వరకూ ఏజెంటుకి కమీషన్ కింద కంపెనీ ఇస్తుంది. ఎందుకంటావ్?! ఇలాంటివెన్నో ఖర్చులుంటాయని" అన్నాడు రాజనాల.

"ఇస్తే!?... అందరికీ కట్టడంలేదు కదా! చేతో ప్రతి ఏడాదీ కట్టుకునే వాళ్లకు కట్టడంలేదు కదా!" అన్నాడు ఏకాంబర్.

వాళ్ల దగ్గరకు ప్రతి మూడు నెలలౌ ఏజెంట్ వెళ్లి వాయిదాలు వసూలు చూసి ఆఫీసులు కట్టాలి. ఇలా పాలసీ కాలం పాతికేళ్లయినా ఏజెంటు సర్వీసు ఇవ్వాలి. అందువల్ల వాళ్లకు ఏ ఏజెంటు రాయితీ ఇవ్వడు. ఇక్కడ అలా కాదు. ఒక్కసారి పాలసీ కట్టించి సాలరీ రికవరీ పెడితే పాలసీ కాలం మొత్తం రికవరీ అవుతూ నీ ప్రమేయం లేకుండానే పాలసీ ప్రీమియం కంపెనీకి చేరుతుంది. నీకు మాత్రం కమీషన్ ఏ శ్రమా లేకుండా అందుతుంది. పాపం! పాలసీలు కట్టేవాళ్లెప్పుడూ ఈ రాయితీలు కోరలేదు. పాలసీల వెదుకులాటలో ఏజెంట్లే పోటీపడి ముందు మీరు కట్టాల్సిన రెండు వాయిదాలను మేమే కడతామని ఈ ఆచారాన్ని దేశమంతా ప్రచారం చేశారు. ఇప్పుడు ఏజెంట్లంతా ముందు రెండు వాయిదాలు కట్టాలని బలంగా నమ్ముతున్నారు. తప్పదు. ఇంత పెద్ద వ్యాపారం నువ్వు కూడా వదులుకోలేవు కదా!" విడమర్చి చెప్పాడు రాజనాల.

"నిజమేరా! కానీ, నా దగ్గర ఇంత డబ్బు వుండాలి కదా! ఏంచేద్దాం!!" దిగాలుగా అన్నాడు ఏకాంబర్.

"మీ నాన్ననే అడుగుదాం!" ఏకాంబర్ కళ్లల్లోకి చూస్తూ అన్నాడు రాజనాల.

"అమ్మో! ఇప్పుడు వద్దు. పైపెచ్చు తిడతాడు. గొడ్డు ఆవుకు గడ్డి మేతే దండగంటూ సామెతలు సంధిస్తాడు" భయంగా అన్నాడు ఏకాంబర్.

"చూద్దాంలే! నువ్వు నీ ప్రయత్నం వదలకు. ముందు పాలసీలు సేకరించు. మిగతా విషయం నేను చూసుకుంటాను" అంటూ ఏకాంబరానికి ధైర్యం చెప్పి, ఆరోజు సేకరించిన పాలసీలన్నింటినీ పట్టుకుపోయాడు రాజనాల.

ఆ వారంలోనే తన దగ్గరున్న పాలసీలన్నింటికీ డబ్బు కట్టేసి రశీదులు తెచ్చి ఏకాంబర్ చేతిలో పెట్టాడు రాజనాల.

ము;;ఐవేల రూపాయలు తనే కట్టి రశీదులు ఇస్తున్న రాజనాలకేసి చూస్తూ "ఇంత డబ్బు నువ్వే కట్టావా?" ఆనందాశ్చర్యాలతో అన్నాడు ఏకాంబర్.

"బ్రాంచి మేనేజరుగారూ, నేనూ కలసి మాట్లాడుకుని కట్టాం. ఆలస్యం చేస్తే మూడో నెల రికవరీ

రాకపోతే మీ మిత్రులు ఇవే పాలసీలు వేరొకరికి కట్టేసినా కట్టేస్తారు. ఆలస్యం అమృతం కూడా విషమే అవుతుంది" అన్నాడు రాజనాల.

"ఇంత డబ్బు ఇప్పటికిప్పుడు నాకెలా వస్తుంది?" సంశయంగా అన్నాడు ఏకాంబర్.

"నీకొచ్చే కమీషన్ లో తీసుకుందామని చెప్పారు మేనేజర్ గారు. అందుకే నా జీతం అందగానే నీ పాలసీలకి డబ్బు సర్దేశాను. ఈ పాలసీల మీద ఎలాగూ పదిహేను రోజుల్లో పదివేల వరకూ కమీషన్ వస్తుంది. మిగతాది కమీషన్ వచ్చినప్పుడల్లా తీసుకుంటాను" అన్నాడు రాజనాల.

"చాలా థాంక్సన్నా! నేనైతే ఇంత సాహసం చెయ్యలేను. ఇంత డబ్బు పెట్టలేను" అంటూ ఆనందంగా రాజనాలని ఆలింగనం చేసుకున్నాడు ఏకాంబర్.

అదే వారాంతంలో మరో నలభై పాలసీలను సేకరించాడు ఏకాంబర్. దేవస్థానం ఉద్యోగులు ఎక్కడెక్కడ పని చేస్తున్నారో అక్కడకు వెళ్ళి వాళ్లను కలసి కట్టించాడు.

స్వామివారి పూలతోటలో పదిమంది మాలీలు పని చేస్తున్నారని తెలిసి ఉదయం ఆరో గంటకు అక్కడకు వెళ్ళి వాళ్లను కలిశాడు. అలాగే విజయనగరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన విద్యార్థి భోజన సత్రంలో పదిహేనుమంది ఉద్యోగులున్నారని తెలిసి ఆ వూరికి వెళ్ళి మరీ పదిహేనుమందిని కలిశాడు ఏకాంబర్.

ఇప్పుడు రాజానల్ సహాయం లేకుండానే తనొక్కడే పాలసీదారులను కలసి బోధపర్చగలుగుతున్నాడు ఏకాంబర్.

ఇన్స్యూరెన్స్ పాలసీ చేయించగల ధైర్యాన్నీ, తెలివినీ, మాటకారితనాన్నీ అలవర్చుకున్నాడు. ఇన్స్యూరెన్స్ పాలసీ వద్దన్న వాళ్లను కూడా వదలకుండా నాలుగైదుసార్లు కలసి తనదారికి తెచ్చుకోగలుగుతున్నాడు.

కొత్తగా ఏకాంబర్ సాధించిన నలభై పాలసీలు చూస్తూనే రాజనాలకి ఆనందం కలిగింది. కానీ, అంతలోనే ఆందోళన కలిగింది. ముందు కట్టిన ముప్పైవేలలో పదివేలు కమీషన్ రూపంలో వచ్చేసింది. మిగతా ఇరవై వేలు రావాలంటే ఇంకా మూడు నాలుగు నెలలు పడుతుందేమో! మళ్లీ నలభై పాలసీలకు మరో ముప్పై నలభైవేలు సర్దడం తనవల్ల కాదు. బ్రాంచి మేనేజర్ ని కలసినా మాట సహాయం చేస్తాడు గానీ, మూట సహాయం చేయడు. ఏకాంబర్ బాగా ఇన్స్యూరెన్స్ వ్యాపారం చేస్తే, తనకు లాభంగానీ మేనేజర్ కి ఏం లాభం? బ్రాంచికి పేరొస్తుంది, మేనేజర్ కి ప్రశంసలు లభిస్తాయి. కానీ, పైసలు రావు. తనకైతే ఏకాంబర్ లా తనకింద పనిచేసిన ఏజెంట్లు అందరి బిజినెస్ మీద ఏడాదికి ఓసారి ఇన్సెంటివ్ అందుతుంది. అదీ లక్షల్లో. ప్రమోషన్ వస్తుంది. అంతేకాదు. ఇంకా ఎన్నో

లాభాలున్నాయి.

అయినా, తనిప్పుడు ఈ లనబై పాలసీలకు అంత డబ్బు ఎలా తేగలడు? తను కూడా ఈ ఉద్యోగానికి కొత్తే కదా! ఏకాంబర్ కి కూడా అంత డబ్బు కట్టే స్థోమత లేదు.

'ఏం చేయాలి? ఏం చేస్తే ఈ పాలసీలకు అవసరమైన డబ్బు దొరుకుతుంది ' అని పరిపరి విధాల ఆలోచిస్తూ రెండు రోజులు గడిపేశాడు రాజనాల.

ఏకాంబర్ ఇవేమీ పట్టించుకోవడంలేదు. తన మానాన తను రోజూ ఉదయాన్నే వూరిమీద పడి పాలసీలను సేకరించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడు. వాటిని తీసుకువచ్చి రాజనాల చేతిలో పెడుతున్నాడు. వాటిని నింపడం, రశీదులు రాయడం అంతా రాజనాల చూసుకుంటున్నాడు.

పాలసీలకి, పాలసీదారులకు సర్వీసు అంటే చేయగలడు గానీ, ఆర్థిక సహాయమంటే మాటలా? అదీ పదేపదే మదుపు పెట్టడానికి వుండొద్దా?

ఆరోజు...

బ్రాంచి మేనేజర్ ని తీసుకుని ఏకాంబర్ ఇంటికి కారులో వచ్చాడు రాజనాల. కొత్త కారు. తళతళలాడిపోతోంది. బ్రాంచి మేనేజర్ కి ఇన్స్యూరెన్స్ కంపెనీ ఇచ్చిన కారది.

ఆ వీధిలోకి పడవలాంటి పెద్ద కారు వచ్చేసరికి వీధిలో తిరుగుతున్న పిల్లలంతా ఆ కారు వెంట పరిగెడుతూ వచ్చారు.

పీతాంబరం వీధి అరుగుమీద కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు. ఏకాంబర్ ఇంటికి బ్రాంచి మేనేజర్ తో సహా వస్తున్నట్టు రాజనాల ముందుగానే ఫోన్ చేసి ఏకాంబరానికి చెప్పాడు.

ఏకాంబర్ రెడీ అయి ఇంట్లో తల్లితో మాట్లాడుతూ వంటగదిలోనే తచ్చాడుతున్నాడు. పర్వతాలు ఆశ్చర్యపోయింది. రోజూ ఈపాటికి వూరి మీదకు వెళ్లిపోయే చిన్న కొడుకు ఇంట్లోనే వున్నాడేమిటా అనుకుంది గానీ, ఏకాంబరాన్ని అడగలేదు. తన వెనకే తోకలా తిరుగుతూ టిఫిన్ అయిందా అంటూ ఆ కబురు, ఈ కబురు చెప్తున్న కొడుకుతో ముచ్చటిస్తూ పని చేసుకుంటోంది పర్వతాలు.

పడవలాంటి ఖరీదైన కారు వచ్చి ఇంటిముందు ఆగేసరికి పీతాంబరం గాబరా పడిపోయాడు. గబాలున కుర్చీలో నుండి లేచి గేటు దగ్గరకు పరుగందుకున్నాడు. అప్పటికే కారు డోర్ తీసుకుని రాజనాల

దిగాడు. తనే కారు డ్రైవ్ చేస్తూ వచ్చిన ఇన్స్యూరెన్స్ బ్రాంచి మేనేజర్ ఓ పక్కగా కారుని పార్క్ చేసి నెమ్మదిగా కారు దిగి రాజనాల దగ్గరకు వచ్చాడు.

గేటు దగ్గర ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డ పీతాంబరం కారు దిగి వస్తోన్న రాజనాలని చూస్తూనే హాయిగా వూపిరి పీల్చుకున్నాడు.

అంతవరకూ ఆందోళనగా ఎవరై వుంటారన్న ఆత్రుతతో పరిగెత్తుకు వచ్చి గేటు దగ్గర నిలబడ్డ పీతాంబరం తేరుకుని నవ్వుతూ రాజనాలని పలకరించాడు.

"రా అమ్మా రా! మీ మిత్రుడి కోసమేనా వచ్చారు?" అని అడిగాడు.

"లేదంకుల్! మీతో మాట్లాడాలనే నేనూ, మా బ్రాంచి మేనేజర్ గారూ వచ్చాము" నర్మగర్భంగా అన్నాడు రాజనాల.

"నాతోనా?... మొన్నే కదా... ఏకాంబరానికి అవసరమంటే మొదటి పాలసీ కట్టాను..." సంశయంగా వారికి లోపలకు తీసుకువెళుతూ అన్నాడు పీతాంబరం.

వంటగదిలో తల్లితో సంభాషిస్తున్న ఏకాంబర్ వాళ్లను చూస్తూనే ఉత్సాహంగా ఎదురుగా వచ్చి పలకరించాడు.

"నమస్తే సార్!... రండి! రండి!" అంటూ హాల్లో వున్న సోఫాల్లో కూర్చోబెట్టాడు. వాళ్లిద్దరికీ ఎదురుగా పీతాంబరం కూర్చున్నాడు.

ఏకాంబర్ తల్లి దగ్గరకు వెళ్లి తమ ఇన్స్యూరెన్స్ బ్రాంచి మేనేజర్ గారొచ్చారని ఆనందంగా చెప్పాడు. ఆయనతోపాటు తన మిత్రుడు రాజనాల కూడా వచ్చాడనీ, ఇద్దరికీ కాఫీ పెట్టమనీ పురమాయించి తిరిగి హాల్లోకొచ్చేశాడు.

ముగ్గురూ మౌనంగా కూర్చున్నారు. ఏకాంబర్ నేరుగా వచ్చి తండ్రి పక్కనే కూర్చున్నాడు.

"మీరు ఏదో షాపు నడుపుతున్నారుట కదా సార్?" మేనేజర్ గారే పీతాంబరాన్ని కదిపారు.

"అవునండీ! డిపార్ట్ మెంటల్ స్టోర్స్!" ముక్తసరిగా చెప్పాడు.

"బాగానే సాగుతోందంటారా?!" మళ్లీ మేనేజరే అడిగాడు.

"ఏం బాగు సార్! ఎక్కడ చూసినా పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, బిగ్ బజార్ లు పోటాపోటీగా వచ్చేస్తున్నాయి. ఇక మాలాంటి చిన్న చిన్న డిపార్ట్ మెంటల్ స్టోర్స్ కి వ్యాపారం ఎలా సాగుతుంది చెప్పండి! ఏదో అలా నడుస్తోంది. షాపు అద్దె, వర్కర్ల జీతాలు ఇవ్వడమే కష్టంగా వుంది. ఇక పెట్టిన పెట్టుబడికి వడ్డీ లెక్కేస్తే నష్టమే!" నిర్లిప్తంగా అన్నాడు పీతాంబరం.

'వీళ్లు ఎందుకొచ్చారో అర్థం కావడం లేదు. వచ్చినవాళ్లు తనతో మాట్లాడకుండా తండ్రితో అనవసర ప్రసంగం చేస్తున్నారెందుకో!' మనసులోనే అనుకున్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ ఆలోచిస్తూ కూర్చున్నాడు.





జరిగిన కథ: ఏకాంబర్ పాలసీలకు కావలిసిన డబ్బు ఎలాగా అని ఆలోచిస్తుండగా రాజనాల, పీతాంబరాన్ని అడుగుదామని సలహా ఇస్తాడు. దాంతో మరుసటి రోజు బ్రాంచి మేనేజరుని వెంట తీసుకుని ఏకాంబర్ ఇంటికి వస్తాడు రాజనాల.

"షాపుకి ఎంత మదుపు పెట్టమంటారు?" రాజనాల కుతూహలంగా అడిగాడు.

"ఎంత మదుపు పెట్టినా ఏముందమ్మా! అమ్మకం వుండాలి గానీ" అయోమయంగా అన్నాడు పీతాంబరం.

'వీళ్లేంటీ, ఇన్ కం టాక్స్ వాళ్లలాగ ఆరాలు తీస్తున్నారు. కొంపదీసి తను టాక్స్ కట్టటం లేదని తెలిసిపోయిందా?'

"నిజమే అంకుల్!... మీరన్నది కరెక్టే! ప్రతి వ్యాపారంలోనూ పోటీ బాగా పెరిగిపోయింది" అన్నాడు రాజనాల.

"కనీసం పది లక్షలకన్నా మీరు షాపులో సామాన్లు మోపు చేసి వుంటారు కదా సార్!" మేనేజర్ సూటిగా పీతాంబరం కళ్లల్లోకి చూస్తూ అన్నాడు.

"అవును సార్! బ్యాంకులో డిపాజిట్ చేసుకున్నా నెలకి పదివేల వరకూ వడ్డీ వచ్చేది. అంత కూడా మిగలడం కష్టమవుతోంది" దిగాలుగా అన్నాడు పీతాంబరం.

"మీరే కాదు సార్! ప్రతిచోటా అలాగే వుంది. మా ఏజెంట్ల వ్యవహారమే చూడండి! విపరీతమైన పోటీ. ఒక్క పాలసీ కోసం పదిమంది ఏజెంట్లు వెళ్లి తన్నుకు చస్తున్నారు. పాపం! పాలసీ కట్టే పాలసీదారు కూడా ఎక్కడ కట్టాలో, ఎవరికి కట్టాలో అలోచించుకోలేకపోతున్నారు. పైపెచ్చు కొందరు ఏజెంట్లు పాలసీ కట్టే పాలసీదారుకి బహుమతులు పట్టుకెళ్లి ఇస్తున్నారు. వాళ్లు కట్టాల్సిన మొదటి ప్రీమియం ఏజెంట్లే కడతామని చెప్పి మరీ పాలసీలు రాయించుకుంటున్నారు" చెప్తూ ఆగి ఎదర టీపాయ్ మీదున్న మంచినీళ్ల గ్లాసు అందుకున్నాడు బ్రాంచి మేనేజర్.

పీతాంబరం, ఏకాంబర్ ఇద్దరూ అయోమయంగా బ్రాంచి మేనేజర్ కేసి చూస్తూండిపోయారు.

ఈయన ఈ కథంతా ఇప్పుడు ఎందుకు చెప్తున్నట్టు!' ఆలోచిస్తూ అయోమయంగా చూస్తున్నాడు పీతాంబరం.

'ఏజెంటుగా తనకింకా ఇలాంటి కష్టాలింకా ఎదురు కాలేదే! ఇంతకీ వీళ్లిద్దరూ పనిగట్టుకుని తెల్లారక ముందే ఇక్కడకెందుకు వచ్చారు?! రాజనాల కూడా తనకి కనీసం ఎందుకొస్తున్నదీ చెప్పలేదు. వస్తున్నాం, వుండు అని మాత్రం ఆర్డర్ వేశాడు ' ఆలోచిస్తూ గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాడు ఏకాంబర్.

"కానీ, మాకు మాత్రం మీ అబ్బాయి రూపంలో ఓ మంచి ఆణిముత్యంలాంటి ఏజెంటు దొరికాడు. పాలసీలు దొరక్క ఏజెంట్లంతా జుట్టు పీక్కుంటూంటే మీవాడు కట్టలు కట్టలు పాలసీలు సేకరించి మా మతి పోగొడుతున్నాడు" చిన్నగా నవ్వుతూ ఏకాంబరాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ చెప్పాడు బ్రాంచి మేనేజర్.

బ్రాంచి మేనేజర్ అలా అనేసరికి తండ్రీకొడుకులిద్దరూ ఉబ్బితబ్బిబ్బయిపోయారు. వంటగది

గుమ్మం దగ్గర నిలబడి హాల్లో వీళ్ల సంభషణంతా ఓ చెవి పారేసి వింటున్న ఏకాంబర్ తల్లీ, చెల్లెలు కూడా ఆనందంతో పొంగిపోయారు.

"అంతా మీ ఆశీర్వాదం సార్! ఎందుకూ పనికిరాడనుకున్న, వట్టిపోయిన గొడ్డులాంటి మావాడిని పాడి ఆవులా మార్చేశారు. ఈ గొప్పతనమంతా ఈ కుర్రాడిది, మీదే సార్!" వినమ్రంగా అన్నాడు పీతాంబరం.

తనని గొడ్డు ఆవుతో పోల్చేసరికి అదిరిపడి తండ్రి కళ్లలోకి కోపంగా చూశాడు ఏకాంబర్. మళ్లీ చటుక్కున తల దించుకున్నాడు.

"అలా అనకండి సార్! మీవాడు హనుమంతుడిలాంటివాడు. అతని బలం అతనికి తెలీదు. చూడండి! ఈ రంగంలో ఎలా దూసుకుపోతాడో!" గర్వంగా అన్నాడు బ్రాంచి మేనేజర్.

"మీ నోటి వాక్కు ఫలించి మావాడు అంత అందలమెక్కితే అందరం ఆనందిస్తాం కదా సార్!" సంతోషంగా అన్నాడు పీతాంబరం.

"నిజమే సార్!... మీవాడిలో ఆ సత్తా వుంది. కానీ, పునాదే బలహీనమనిపిస్తోంది సార్!" తల దించుకుని ఓరగా పీతాంబరం కళ్లల్లోకి చూస్తూ అన్నాడు బ్రాంచి మేనేజర్.

పునాదే బలహీనంగా వుందనేసరికి తండ్రీకొడుకులిద్దరికీ తల గిర్రున తిరిగిపోయింది. పాలసీలకి... పునాది కట్టాలా?! ఇంటికైతే పునాది అవసరం! ఏజెంటుగా నిలబడాలన్నా పునాది కావాలా?!'

తండ్రీకొడుకులిద్దరూ బుర్రని నేలకేసి కొట్టుకుంటున్నట్టు పిచ్చిపిచ్చిగా ఆలోచించినా బ్రాంచి మేనేజర్ అన్నదాంట్లో అర్థాన్ని గ్రహించలేకపోయారు.

"పు...నా...దా?! దేనికి సార్"!" బలహీనమైన గొంతుతో అన్నాడు ఏకాంబర్.

"మీరుండండి! నేను మాట్లాడుతున్నది మీ నాన్నగారితో..." చిరాగ్గా అన్నాడు బ్రాంచి మేనేజర్.

"మీరన్నది నాకర్థం కాలేదు" సంశయంగా అన్నాడు పీతాంబరం.

"అర్థం కావడానికేముంది సర్!? ఇల్లు కట్టాలంటే పునాది కావాలి. ఏదైనా దుకాణం తెరవాలంటే మదుపు కావాలి. అవునా!" అన్నాడు బ్రాంచి మేనేజర్.

"మరి, మీవాడు ఏజెంటుగా బాగా ఎదగాలంటే మీ సపోర్ట్ వుండాలి కదా సార్!" విషయానికొస్తూ అన్నాడు మేనేజర్.

"లేదని చెప్పాడా మావాడు?" ఆశ్చర్యంగా అన్నాడు పీతాంబరం.

తండ్రి అలా అనేసరికి అదిరిపడ్డాడు ఏకాంబర్. 'తనెప్పుడలా అన్నాడు?' మనసులోనే అనుకుంటూ బ్రాంచి మేనేజర్ కేసి, రాజనాలకేసి మార్చి మార్చి చూస్తూ ఏదో అనబోయాడు. ఏకాబర్ వాలకాన్ని గమనిస్తూనే బ్రాంచి మేనేజర్ చేత్తోనే మాట్లాడవద్దని వారించాడు.

"మీవాడు చెప్పడం కాదు సార్! నేనే అంటున్నాను. మీ ఏకాంబర్ టాప్ గేర్ లో పాలసీలు చేయించుకుపోతున్నాడు. కాదనను. కానీ, ఇక్కడే చిన్న చిక్కొచ్చిపడింది. ఈ మధ్య ఏకాంబర్ చేస్తున్న పాలసీలన్నీ సాలరీ సేవింగ్స్ స్కీములే. వాటికి ఏజెంట్ రెండు వాయిదాలు కట్టాల్సి వస్తోంది. తప్పదు. పోటీ అలా వుంది. కానీ, మీవాడు ఇప్పుడిప్పుడే ఏజెంటుగా కెరీర్ స్టార్ట్ చేశాడు. డబ్బు ఎలా వస్తుంది? అయితే, ముందు మదుపు పెడితే ఆరునెలల్లో మీవాడికి ఆ మదుపు కమీషన్ రూపంలో వసూలయిపోతుంది. ఇకపై వచ్చేదంతా ఆదాయమే!" విడమర్చి చెప్పాడు మేనేజర్.

మేనేజర్ మాటలు విన్నాక అసలు విషయం అర్థమై ఆనందంగా రాజనాలకేసి చూశాడు ఏకాంబర్.

దేవుడు వరాలిచ్చినట్టు చెయ్యెత్తి ఏకాంబర్ ని ఆశీర్వదిస్తున్నట్టు సైగ చేశాడు రాజనాల.

'నిజమే కదా! మొన్నటికి మొన్న తను తెచ్చిన పాలసీలకు రాజనాలే డబ్బు సర్దాడు. మళ్లీ తన దగ్గర పోగైన ఈ నలభై పాలసీలకు ఎలా సర్దగలడు? ఆ డబ్బు రికవరీ కావాలంటే కనీసం ఆరునెలలైనా కమీషన్ అంతా పోగు చేసి ఇవ్వాలి. ఆ తర్వాత వచ్చే కమీషనంతా పాతికేళ్లపాటు అప్పనంగా ఆరగించవచ్చు. కానీ, ఇప్పుడు మదుపు ఎవరు పెడతారు?' మనసులోనే తర్జనభర్జన పడ్డాడు ఏకాంబర్.

"ఎంతుండాలంటారు?" విషయం అర్థమై అడిగాడు పీతాంబరం.

"ఓ ఏభైవేల వరకు అవసరమవుతుంది సార్!" అంటూ ఠక్కున అందుకున్నాడు రాజనాల.

"అమ్మో! ఏభైవేలా?! అంత నేనెక్కడ సర్దగలను సార్! ఓ మూడువేలో, ఐదువేలో అయితే అప్పుగా తేగలను" నసుగుతూ అన్నాడు

పీతాంబరం.

'ఈ వెధవవల్ల పైసా రాబడి లేదు. వస్తుందో, రాదో తెలీదు. కానీ తిరిగి మదుపు పెట్టాలంట! ఇప్పటికే షాపులో కూర్చోబెట్టి తప్పు చేశాను. అప్పులపాలైపోయాను. మళ్లీ ఇదో దండగా?!' లోలోనే కారాలు మిరియాలు నూరుకుంటూ కసితో రగిలిపోయాడు పీతాంబరం.

"అదేంటి సార్! తండ్రి మీరే అలా అంటే మీ అబ్బాయి భవిష్యత్తు ఏంకాను చెప్పండి" తన ఎత్తుగడ వీగిపోతోందని గ్రహించగానే దీనంగా అన్నాడు బ్రాంచి మేనేజర్.

"వాడికి ముందే చెప్పాను సార్! ఇన్స్యూరెన్స్ ఏజెంటు అంటే అల్లాటప్పా కాదురా! నువ్వు చెయ్యలేవు. ఏదైనా పొరపాటు జరిగితే మన ఇంటి మీదకు వచ్చి వెంట తరిమి తంతారని చెప్పాను. విన్నాడా!? అదిగో... మీరిచ్చని జోలిని తగిలించుకు తిరుగుతున్నాడు" వ్యంగ్యం మేళవించి కోపంగా అన్నాడు పీతాంబరం.

"సార్....!" ఇంకా ఏదో అనబోయాడు బ్రాంచి మేనేజర్.

"క్షమించండి సార్! ఇంతకంటే నేనేం చెప్పలేను. అడ్డగాడిదలా వీధులు పట్టుకు తిరిగినా పట్టించుకోలేదంటే... ఉన్నదేదో తిని తిరుగుతున్నాడులే అని వదిలేశాను. ఇప్పుడు వీడి కోసం నేను కూడా అప్పులు చేసి రోడ్డుమీద పడలేను" నిక్కచ్చిగా అన్నాడు పీతాంబరం.

"వాడికి ముందే చెప్పాను సార్! ఇన్స్యూరెన్స్ ఏజెంటు అంటే అల్లాటప్పా కాదురా! నువ్వు చెయ్యలేవు. ఏదైనా పొరపాటు జరిగితే మన ఇంటి మీదకు వచ్చి వెంట తరిమి తంతారని చెప్పాను. విన్నాడా!? అదిగో... మీరిచ్చని జోలిని తగిలించుకు తిరుగుతున్నాడు" వ్యంగ్యం మేళవించి కోపంగా అన్నాడు పీతాంబరం.

"సార్....!" ఇంకా ఏదో అనబోయాడు బ్రాంచి మేనేజర్.

"క్షమించండి సార్! ఇంతకంటే నేనేం చెప్పలేను. అడ్డగాడిదలా వీధులు పట్టుకు తిరిగినా పట్టించుకోలేదంటే... ఉన్నదేదో తిని తిరుగుతున్నాడులే అని వదిలేశాను. ఇప్పుడు వీడి కోసం నేను

కూడా అప్పులు చేసి రోడ్డుమీద పడలేను" నిక్కచ్చిగా అన్నాడు పీతాంబరం.

తండ్రి మాటలను వింటూనే ఏకాంబర్ హతాశుడైపోయాడు. కన్న తండ్రే తనను ఇంతలా వాజమ్మను చేసి మాట్లాడతాడనుకోలేదు. గుండెల్లో నుండి ఏడుపు పెల్లుబుకుతున్నా బయట పడకుండా పకపకా నవ్వేస్తూ "సార్! మా నాన్న అలాగే అంటాడు. నేను మాట్లాడతాను. మీరు వెళ్లండి సార్!" రాజనాలా, ప్లీజ్ ఏమీ అనుకోవద్దు" గబాలున నిలబడి బ్రాంచి మేనేజర్ చెయ్యి పట్టి క్షమించమన్నట్టుగా చూస్తూ అన్నాడు ఏకాంబర్.

బ్రాంచి మేనేజర్, రాజనాల ఒకరి వంక ఒకరు మొహామొహాలు చూసుకుని, చేసేది లేక వస్తామని వెళ్లిపోయారు. వాళ్లు అలా వెళ్లగానే ఏకాంబర్ కూడా తన బ్యాగ్ తీసుకుని బయలుదేరబోయాడు.

అరగంటనుండీ వంటగది ద్వారం దగ్గరే నిలబడి జరిగినదంతా చూస్తున్న పర్వతాలు గబాలున వచ్చి మౌనంగా వెళ్లిపోతున్న ఏకాంబర్ ని అడ్డుకుంది.

"వుండరా! మీ నాన్న కాదంటే నేను లేనా? ఇదిగో, ఇది తీసుకో! దీన్ని అమ్మేసి ఆ పాలసీలన్నీ కట్టెయ్" అంటూ తన మెడలో వున్న బంగారం చైను చేతిలో పెట్టేసరికి అంతవరకూ అదిమిపెట్టిన ఏడుపు ఒక్కసారే పెల్లుబికేసరికి గొంతునైతే నొక్కేశాడు గానీ కళ్లల్లో కన్నీళ్లని మాత్రం అదిమిపట్టలేకపోయాడు ఏకాంబర్.

"అమ్మా!" అంటూ తల్లిని పట్టుకుని వలవలా ఏడ్చేశాడు.

తల్లీకొడుకులు అలా కావలించుకుని ఏడవడం చూసి పీతాంబరం మరేం మాట్లాడలేకపోయాడు. 'ఎలా పోతే అలా పోనీ, నాకుందుకు!' అనుకుంటూ విసురుగా పెరట్లోకి వెళ్లిపోయాడు.

"ఏడవకురా! ఎవరైనా చూస్తే నవ్వుతారు. ఏడ్చే మగాడిని, నవ్వే ఆడదాన్ని నమ్మకూడదంటారు తెలుసా?! నీమీద నాకు నమ్మకముంది. వెళ్లు! వెళ్లి ఇది అమ్మేస్తే అరవై వేలైనా వస్తాయి కదా! నీకు ఎలా తోస్తే అలా వాడుకో! నువ్వు బాగా సంపాదిస్తే, అదంతా నాకే ఇస్తావు కదరా! వెళ్లు!" కొడుకు భుజం తడుతూ అంది పర్వతాలు.

ఏకాంబర్ కి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. తల్లి తనమీద వుంచిన నమ్మకానికి గుండె అంతా బరువెక్కిపోయింది.

తల్లి ఇచ్చిన బంగారు గొలుసుని భద్రంగా జేబులో దాచుకుని గుండెల్నిండా గాలి పీల్చుకుని అమ్మ నమ్మకం వమ్ము కాకూడదనుకుంటూ ఎనలేని ఆత్మవిశ్వాసంతో ఇంట్లో నుండి బయటపడ్డాడు ఏకాంబర్.

ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు ఏకాంబర్.

ఇన్స్యూరెన్స్ కంపెనీవాళ్లు ఏ పోటీ పెట్టినా అందులో ఏకాంబర్ ముందుండేవాడు. బ్రాంచి పరిధిలోనూ, ఏజెంట్ల పోటీలోనూ, డివిజనల్ పరిధి, జోనల్ పరిధిలో పోటీ పెట్టినా ఎక్కువ పాలసీ, ఎక్కువ వ్యాపారం చేసి బహుమతులతో పాటు అవార్డులు, రివార్డులను చేజిక్కించుకునేవాడు.

ఇన్స్యూరెన్స్ కంపెనీవాళ్లు పెట్టే ప్రతి పోటీలోనూ విజేతలైన వారికి ఒక స్టార్ హొటల్లో మీటింగ్ ఏర్పాటు చేసి బహుమతులనిచ్చి ప్రోత్సహించేవారు. ఆ మీటింగులవల్ల మిగతా కొత్త ఏజెంట్లు కూడా ప్రేరణ పొందుతారని అలా చేసేవారు.

ఏకాంబర్ ఏజెంటుగా జీవితాన్ని ప్రారంభించిన ఏడాదికే ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు. ఆ ఏడాది చివరలో తల్లికి అయిదు తులాల బంగారు గొలుసు తెచ్చి తన చేతిలో పెట్టాడు ఏకాంబర్.

అంతవరకూ ఇంట్లో ఏవేవో వస్తువులు తెచ్చి పెడుతున్న కొడుకు ఏజెంటుగా బాగానే వున్నాడనుకుంది. అయిదు తులాల బంగారు గొలుసు తెచ్చి తన చేతిలో పెట్టేసరికి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోయింది పర్వతాలు.

"ఇంత ఖరీదుది ఎందుకు కొన్నావురా!" గొలుసును చేత్తో పట్టుకుని మురిసిపోతూ అంది పర్వతాలు.

"నీకే కదమ్మా! బావుంటుంది! ఈ ఏడాదిలో మిగిలిన కమీషన్ తో కొన్నానమ్మా! చెప్పడం మరిచాను ఈ ఏడాది మన బ్రాంచి ఏజెంట్లందరిలో నేనే ఎక్కువ ఇన్స్యూరెన్స్ చేయించానని సన్మానం ఏర్పాటు చేశారమ్మా! నాలా మన బ్రాంచిలో ఎక్కువ వ్యాపారం చేసిన పదిమందిని ఎంపిక చేసి డాల్ఫిన్ హొటల్లో పార్టీ పెడుతున్నారు. భోజనాలు కూడా అక్కడే! మనందరం వెళ్దామమ్మా!" అన్నాడు ఏకాంబర్.

"అంతకన్నా నా! నాన్నకు చెప్పు. అన్నయ్య కూడా ఈరోజు వస్తున్నాడు కదా! అందరం వెళ్దాం" అంది పర్వతాలు.

"పాపు దగ్గరకు వెళ్తే చెప్తాలే అమ్మా! రేపు సయంత్రమే! అయిదు గంటలకు బయలుదేరాలి" ఆనందంగా అన్నాడు ఏకాంబర్.

"అలాగే! అన్నయ్యని తీసుకు రావడానికి రైల్వే స్టేషన్ కి వెళ్తావా?" అని అడిగింది తల్లి.

"అలాగేనమ్మా! ట్రైను వచ్చేది రెండున్నరకి కదా! మా ఆఫీసుకు వెళ్లి అలా వెళ్తాను" అన్నాడు ఏకాంబర్.

"ఈరోజుకి నాన్నగారి బండి అడిగి తీసుకోలేకపోయావా?" అంది పర్వతాలు.

"అక్కర్లేదమ్మా! ఆటోలు భోల్డన్ని. ఇట్నుంచి బస్సులో వెళ్తాను. అట్నుండి అన్నయ్యా, నేనూ ఆటోలో వచ్చేస్తాం. సరేనా?" అన్నాడు ఏకాంబర్.

"సరేలే! నాన్నగారికి రేపటి విషయం చెప్పు. అరే! మరచిపోయాను. నువ్వు స్టేషనుకి వెళ్తావో, వెళ్లవో అని నాన్నగారు కంగారు పడతారు. ఆ విషయం కూడా చెప్పు. జాగ్రత్తగా వెళ్లిరా!" అంటూ కొడుకు తెచ్చిచ్చిన బంగారు గొలుసును చూస్తూ మురిసిపోయింది పర్వతాలు.

ఇంతలో పెరట్లో అంట్లు తోమి వచ్చిన అలివేలుమంగ తల్లి మెళ్లో ధగధగా మెరిసిపోతున్న గొలుసును చూసి ఆనందంతో ఎగిరి గెంతులేస్తూ వచ్చింది.

"అమ్మా! ఎక్కడిదే? ఓసారి ఇవ్వవా! వేసి చూసుకుంటాను. నాన్న చేయించారా! నాకు చూపించలేదే!" అని గలగలా మాట్లాడుతూ తల్లి తీసిచ్చేలోపలే తనే తల్లి మెళ్లో గొలుసు తీసి చూసి మురిసిపోతూ మెళ్లో వేసుకుంది.

"అబ్బ! ఎంత బావుందో! అమ్మా! నా గొలుసు బాగా చిన్నదైపోయిందే! ఇది నేను తీసుకుంటాను" అంటూ మురిపెంగా తల్లిని పట్టి కుదిపేస్తూ అంది కూతురు.





జరిగిన కథ:     రాజనాల బ్రాంచి మేనేజర్ ను తీసుకుని ఏకాంబర్ ఇంటికి వస్తాడు. ఏకాంబర్ తండ్రి వాళ్ళతో అన్ని విషయాలు చర్చిస్తాడు. ఏజెంటు     కావాలంటే మీసపోర్ట్ కావాలి, కొంత డబ్బు     కావాలి అని బ్రాంచి మేనేజర్ అనగానే పీతంబరం తన దగ్గర లేవని చెపుతాడు. ఇదంతా వింటోన్న పర్వతాలు తన దగ్గర వున్న బంగారాన్ని ఏకాంబర్ కు ఇచ్చి నువ్వు పాలసీలు కట్టు అని ధైర్యం చెపుతుంది. "చిన్నన్నయ్య తెచ్చాడమా! ఇప్పుడే ఇచ్చాడు. రెండు రోజులు పోయాక నువ్వే తీసుకుందువులే! ఈ రెండు రోజులన్నా నా మెడలో లేకపోతే వాడు బాధపడుతాడు" అంది పర్వతాలు.

"చిన్నన్నయ్య!... నిజమే !..." ఆశ్చర్యం గా అంది అలివేలుమంగ.

"అవును! అంత ఆశ్చర్యమెందుకు! ఇంట్లో ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వాడు తెచ్చినవే కదా! గర్వంగా అంది పర్వతాలు.

"అవంటే ఏదో పోటీలో వచ్చాయన్నాడు కదా! ఇదీ అలాగే బహుమతిగా వచ్చిందా?!" ఆశ్చర్యంతో కళ్ళింత చేసుకుని అంది అలివేలుమంగ.

"పోటీలో కాదు, ఏడాది పొడుగునా వచ్చిన 'కమీషన్ కూడబెట్టి కొన్నాడట" సంతోషంగా చెప్పింది పర్వతాలు.

"నీ చైను ఇచ్చావు కదమ్మా! అందుకే కొన్నాడేమో?!" ఎలాగైతేనేం అన్న కొన్నదేగా! అది నాకే!" ఆశగా అంది అలివేలు.

"అలాగేలేవే తల్లీ! రేపు చిన్నన్నయ్యకి ఏదో హోటల్లో సన్మానం వుందట కదా! అప్పుడు నువ్వేసుకుందువుగానీ' కూతురుని ఆప్యాయం గా దగ్గరకు తీసుకుని అలివేలుమంగ మెడలో వున్న కొత్త గొలుసు తడిమి చూస్తూ అంది ఆమె.

"పెద్దన్న ఇన్నాళ్ళ నుండి ఉద్యోగం చేస్తున్నాడు. ఒకటీ కొనలేదు. రానీ అడుగుతాను" మురిపెం గా అంటూ తల్లి మీద గోముగా వాలిపోయింది అలివేలుమంగ.

"పెద్దన్న కేమే ! పెద్ద ఉద్యోగం. వస్తున్నాడు కదా! నీకూ నాకూ మంచి ఖరీదైన వస్తువులు కొని తెస్తాడు చూస్తుండూ" ఆనందంగా అంది పర్వతాలు.

"నిజమేనమ్మా! చిన్నన్నే అయిదు తులాల బంగారం కొన్నాడంటే పెద్దన్న అంతకు రెట్టింపుదే కొంటాడు" ఆశగా అంది అలివేలుమంగ.

"అ..వు..ను.." కొడుకు రాక కోసం ఎదురు చూస్తున్న ఆమె కళ్ళల్లో ఏదో అవ్యాజమైన ప్రేమాభిమానాలు ద్యోతకమయ్యాయి.

"అన్న వెళ్ళి ఎన్నాళ్ళయిందో?! ఏడాది కానవస్తోంది. మళ్ళీ ఇదే కదా రావడం!" పెద్దన్నని గుర్తు చేసుకుంటూ అంది అలివేలుమంగ.

"నెలా నెలా నాన్నకి కూడా పైకం పంపటం లేదు కదా! అంతా కూడేసి ఒక్కసారే ఇస్తాడేమో కదా!" కళ్ళల్లో వెలుగులు నింపుకుంటూ అంది పర్వతాలు/

"అవునమ్మా! నువ్వన్నది నిజమే! నాకూ ఏదైనా కొనే వుంటాడు" ఉప్పొంగిపోతూ అంది అలివేలుమంగ.

"సరిసరీ.. రేపు చిన్నన్నకి సన్మానం కదా! మంచి బట్టలు తీసి వుంచు. నేను పండక్కి మీ నాన్నగారు కొన్న చీర తీసి కట్టుకుంటాను. అన్నయ్య వస్తే ఇక తీరిక వుండదు. వాడితో కబుర్లతోనే రోజంతా గడిచిపోతుంది. వెళ్ళు" కూతురితో అంటూనే అలివేలుమంగ మెడలో వున్న గొలుసు తీసుకుంది పర్వతాలు.

"ఉండనియ్యమ్మా!... ప్లీజ్!" మారాం చేస్తూ మెళ్ళో గొలుసు తీసింది.

"చిన్నన్న ఇచ్చాడని నాన్నగారు చూసేవరకైనా నా మెడలో వుండనివ్వవే తల్లీ! పెద్దన్న నీ కోసం తెస్తాడు కదా! తొందరెందుకు?!" అంటూ పెద్ద కొడుకు కోసం 'ఏం కూర వండాలో' అని ఆలోచిస్తూ వంట గదిలోకి వెళ్ళిపోయింది పర్వతాలు.

"పెద్దన్నయ్య సాఫ్ట్ వేర్ ఇంజనీర్. లక్షల్లో జీతం. రెండేళ్ళయిపోతోంది జాబ్ లో జాయిన్ అయి.

అమ్మకి, తనకి తప్పకుండా బంగారం వస్తువులే తెస్తాడు ... తప్పకుండా తెస్తాడు."

మనసులోనే అన్న రాక కోసం ఆశగా ఎదురుచూస్తూ అతను తీసుకురాబోయే వస్తువుల్ని ఊహించుకుంటూ గదిలోకి వెళ్ళింది అలివేలుమంగ.

విశాఖపట్నం లోనే పేరొందిన స్టార్ హొటల్.

సాయంత్రం అయిదవుతోంది. ఇన్సూర్యరెన్స్ ఏజెంట్లంతా బైక్ల మీద, కార్లలోనూ వస్తున్నారు. హొటల్ ప్రవేశ ద్వారం దగ్గరే బ్రాంచి మేనేజర్, బ్రాంచిలో పని చేస్తున్న డెవలెప్ మెంట్ ఆఫీసర్లంతా తమ తమ ఏజెంట్లను సాదరం గా ఆహ్వానిస్తూ నిలబడ్డాడు.

ఒక్కో డెవలెప్ మెంట్ ఆఫీసర్ అండర్ లో ఏభై, అరవై మంది దాకా ఏజెంట్లు వుంటారు. అందులో సీనియర్లు, జూనియర్లు అయిన కొత్త, పాత ఏజెంట్లందరూ వస్తున్నారు.

రాజనాల రాజేంద్ర కొత్తగా ఉద్యోగం లో జాయిన్ కావడం వలన పదిహేను మందిని ఏజెంట్లను చేర్చుకోలేకపోయాడు. అయితే అందరిలో ముందున్న ఏకాంబర్ ఒక్కడే రాజనాల టర్గెట్ ని పూర్తి చేసేస్తున్నాడు. పైపెచ్చు అన్ని పోటీల్లోనూ ముందుంటున్నాడు.

సమావేశానికి వస్తున్న ఏజెంట్లందరికీ నవ్వుతూ ఆహ్వానం పలుకున్నారు బ్రాంచ్ సిబ్బంది. హొటల్లోనే ఓ మూలగా ఉన్న మీటింగ్ హాల్ చూపిస్తూ ఏజెంట్లందరికీ అందంగా ఉన్న గులాబీ పువ్వు అందిస్తున్నారు.

హాలంతా నిండిపోయింది. బయట ఉన్న బ్రాంచ్ మేనేజర్, డెవలప్ మెంట్ ఆఫీసర్లంతా హాల్లోకి వచ్చి కూర్చున్నారు.

ప్రత్యేక ఆహ్వానితులు, అతిధులు, కూడా వచ్చేసారు. జోనల్ మేనేజర్, డివిజనల్ స్థాయి అధికారులు అందరూ వచ్చి ముందు వరసలో కూర్చున్నారు.

సమావేశం ప్రారంభించడానికి బ్రాంచ్ మేనేజర్ వేదికనెక్కి మైక్ చేతిలోకి తీసుకున్నాడు.

" మై డియర్ ఫ్రెండ్స్ ! ఈరోజు మనందరి ఆనందోత్సవ దినం మీ అందరి విజయం. అయితే, అందులో కొందరు ముందుంటారు.కొనదు వెనకుంటారు ఇది పరుగుల పందెం. ఒకసారి ఒకరు, మరొకసారి మరొకరు అతన్ని దాటి ఒకడుగు ముందుకేస్తారు. ప్రతి ఒక్కరి ధ్యేయం ఒక్క టే కావాలి. తన మున్ దున్న వారిని దాటి మనం ముందుండాలి. అప్పుడు మీరు ఎదుగుతారు. మన ఇన్స్యూరెన్స్ కంపెనీ కూడా అనుకున్న ఫలితాలను సాధిస్తుంది.

మీకు తెలుసు. ఒకప్పుడు మనమే ఈ రంగంలో ఉండేవాళ్ళం. ఇప్పుడు ప్రభుత్వ సరళీకృత విధానాల వలన ఎన్నో ప్రైవేటు ఇన్స్యూరెన్స్ కంపెనీలు ఈ రంగంలో అడుగుపెట్టాయి. పోటీ పెరిగింది. ఒకర్నొకరు నెట్టుకు పరిగెట్టాలనే కసి పెరిగింది. రోజుకో కొత్త ఇన్స్యూరెన్స్ కంపెనీలు వస్తున్నాయి. అయితే అన్నిటి ధ్యేయం ఒక్క టే ! ప్రతి పౌరునికీ జీవిత బీమా కల్పించడం, ప్రతి కుటుంబానికీ ఆర్ధిక రక్షణ తద్వారా జీవిత భద్రత అందివ్వడం.

ఇది ఆరోగ్యకరమైన పోటీ మాత్రమే! ఇలాంటి పోటీ వాతావరణంలో మన బ్రాంచి ఏజెంట్లకు ప్రోత్సాహకరమైఅన పోటీలు పెట్టి మూణ్ణెల్లకోసారి ఇలా స్మావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నదే మన కంపెనీ ఆలోచన. ఏడాది చివరలో ఇలాంటి స్టార్ హొటల్లో విందు వినోదాలతో సమావేశం ఏర్పాటు చేసి ఈ ఏడాది అత్యధికంగా ఇన్స్యూరెన్స్ వ్యాపారం చేసిన ఏజెంట్లలో టాప్ టెన్ క్యాటగిరీలో ఉన్న పది మందికి సముచిత రీతిలో సన్మానించాలని మన కంపనీ నిర్ణయం. వారితోపాటు పోటీ పడి

చేయించిన ఏజెంట్ మిత్రులందరికీ అభినందన పురస్కారాలు అందజేయబడుతుంది "

అంటూ వేదిక మీదకు జోనల్ మేనేజర్ ని, డివిజనల్ స్థాయి అధికారులైన మార్కెటింగ్ మేనేజర్ ని పరిపాలనాధికారులను ఆహ్వానించాడాయన.

అతిథులందరూ వేదిక మీద ఆసీనులు కాగానే సభ ప్రారంభమైంది.

ఇన్స్యూరెన్స్ అధికారులంతా జీవిత బీమా పాలసీల గురించి చెప్తూ ఏజెంట్లు పాలసీదారులతో ఎలా మెలగాలో, ఎలా ఎదగాలో చెప్తూ ఏజెంట్లందరినీ కార్యోన్ముఖులను చెయ్యడానికి ఎన్నో రకాలుగా ఉపన్యాసాలు దంచేసారు.

చివరగా ఆ ఏడాది బాగా ఇన్స్యూరెన్స్ చేసిన టాప్ టెన్ ఏజెంట్ల గురించి చెప్తూ ప్రసంగించాడు బ్రాంచ్ మేనేజర్.

" మీ అందరకీ తెలుసు. మన బ్రాంచ్ లో కొత్తగా జాఇనయిన ఒకే ఒక ఏజెంట్ రాకెట్ లా దూసుకుపోతున్న విషయం. నిన్న మొన్నటి వరకూ మన బ్రాంచికే టాప్ ఏజెంట్లయిన ఏజెంటు గోపాలరావు, ఏజెంటు శంకర్రావు లాంటి వాళ్ళందరితో పోటీ పడి ముందు వరుసలో నిలబడ్డ ఏజెంటు ఎవరో కాదు" అంటూ ఏజెంట్లతోనూ, వాళ్ళ బంధువులతోనూ కళ కళలాడుతున్న సభకేసి చూసాడు నవ్వుతూ.

అప్పటికే ఆయన ప్రసంగిస్తుంటే సభలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. అందరూ ఆనందంగా ఆగకుండా చప్పట్లు కొడుతూనే వున్నారు. సభలో వున్న ఏజెంట్ల తాలూకా బంధువులందరూ ఆశ్చర్యంగా ఎవరా ఏజెంటు?" అన్నట్టు సభలో కూర్చున్న అందరికేసి మార్చి మార్చి చూస్తూ చప్పట్లు కొడుతున్నారు.

'అవును, ఈ ఏడాది టాప్ టెన్ లో మొదటి స్థానం కైవసం చేసుకున్న ఏజెంటు ఏకాంబర్ .. ప్లీజ్ వెల్కం టు ది డయాస్!" గట్టిగా అరిచి చెప్పాడు బ్రాంచి మేనేజర్.

అంతే!

హాలు హాలంతా చప్పట్లతో మారుమోగిపోయింది. వెనుక ఎక్కడో ఓ మూల తల్లితండ్రులతో పాటు కూర్చున్న ఏకాంబర్ బెరుకు బెరుకుగా లేచి నిలబడి బిడియం తో రివటలా ఒంగిపోతూ నడిచి వెళ్ళాడు వేదిక వద్దకు.

ఏకాంబర్ అమ్మ, నాన్న, అన్న, చెల్లి నలుగురూ ఆనందంగా చప్పట్లు కొడుతూ పొంగిపోయారు. ఏకాంబర్ తల్లితండ్రులు పీతాంబరం, పర్వతాలు సంతోషం పట్టలేకపోతున్నారు. వేదిక వద్దకు వెళ్తోన్న కొడుకును చూస్తూనే ఉన్నారు. కళ్ళు మసకబారిపోయాయి. వారికి తెలీకుండానే కళ్ళల్లో ఆనందబాష్పాలు కట్టలు తెంచుకుంటున్నాయి.

"అమ్మా!.. నువ్వెందుకు ఏడుస్తున్నావ్? ఎవరైనా చూస్తే నవ్వుతారు. చూడు నీ బుగ్గల మీద కన్నీరెలా జారుతోందో" కూతురు అలివేలుమంగ తల్లిని చేత్తో గుద్దుతూ అంది.

'నేనా? ఏడుస్తున్నానా?!" అంటూ గబాలున బుగ్గలు తుడుచుకుంది పర్వతాలు.

స్టేజి మీద ఏకాంబర్ ని రాజా చైర్ లో కూర్చోబెట్టి సన్మానం చేసారు. జోనల్ మేనేజర్ శాలువా కప్పి మొమెంటో ఇచ్చాడు. డివిజనల్ మేనేజర్ మెళ్ళో దండ వేసాడు.

ఇతర ఇన్స్యూరెన్స్ సిబ్బంది ఏకాంబర్ కి సన్మానం చేస్తూ పూల రెక్కలు అక్షింతలుగా జల్లారు.

"మీ అందరికీ తెలుసా? ఈ రోజు ఏకాంబర్ ఈ స్థాయికి చేరుకోవడానికి వాళ్ళ అమ్మానాన్నలే కారణం.

ఇన్స్యూరెన్స్ పాలసీ సంపాదించడమే దుర్లభమైన ఈ రోజుల్లో ఏకాంబర్ ఒకే వారం లో దాదాపు వంద పాలసీలు సంపాదించాడు. అయితే అవి అన్నీ సేలరీ సేవింగ్స్ పాలసీలు మీకు తెలుసు, అవి సాధించడం ఒకెత్తయితే.. వాటి పాలసీ బాండ్లు కోసం, వాటి నెల వారీ రికవరీ కోసం ఎన్ని వ్యయ ప్రయాసలు పడాలో ...! అయితే, వీటన్నింటికీ కొండంత అండగా అతని తల్లితండ్రులతో పాటు మన డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్ర కృషి కూడా మెచ్చుకోదగ్గది.

ఇక ముమ్ముందు కూడా ఏకాంబర్ ఇంతకంటే గొప్పగా ఎదగాలని కోరుకుంటూ అతన్ని అభినందిస్తున్నాను." అన్నాడు మేనేజర్.

ఆ తర్వాత వరుసగా ఏజెంట్లందరినీ పిలిచి సన్మానించి అందర్నీ పేరు పేరున పొగడ్తలతో ముంచెత్తారు.

సమావేశం అయిన తరువాత భోజనాలు కనీ వినీ ఎరుగని రీతిలో ఏర్పాటు చేసారు. అందరూ బారులు తీరి "ఐ ఫే" కౌంటర్ల ముందు నిలబడ్డారు.

"ఇలాంటి హొటల్ కి మనం రాగలమా పర్వతం!" 'ఐ ఫే ' కౌంటర్ దగ్గరకు వెళ్తూ భార్య చెవిలో గుసగుసగా అన్నాడు పీతాంబరం.

"అవునండి, భోజనాలు చూడండి. ఎన్ని రకాలు, ఎవరు ఏం తింటే అది , మీరు ఈ రోజు నీచు తినేస్తారు కదా!" మొగుడ్ని మోచేత్తో గుద్దుతూ అడిగింది పర్వతాలు.

"అమ్మా! నేను ఈ రోజు చికెన్ తినేస్తాను. స్టార్ హొటల్ కదా! ఎలా వుంటుందో!" తల్లి పక్కనుండి ప్లేటు పట్టుకుని ఎన్వీ సర్వ్ చేస్తున్న ఐ ఫే కౌంటర్ దగ్గరకు నడిచింది అలివేలుమంగ. పెద్దన్న నీలాంబర్ కూడా చెల్లితోనే వెళ్ళాడు.

ఏకాంబర్ తనకి ఇచ్చిన మెమెంటో,పూలదండ, శాలువా పట్టుకుని ఒక పక్కన నిలబడ్డాడు.

తండ్రి పీతాంబరమే కొడుక్కి,తనకి రెండు ప్లేట్లలో బిర్యానీ, చికెన్ కర్రీ, మటన్ కర్రీ వడ్డించుకుని పట్టుకువచ్చాడు.

పర్వతాలు మాత్రం వెజిటేరియన్ కర్రీస్, బిర్యానీ వడ్డించుకుని వచ్చింది.

" ఒరేయ్ చిన్నా! అవి ఆ ప్రక్కనున్న బల్లమీద పెట్టరా! ఇదిగో ఈ పళ్ళెం తీసుకో! " అంటూ తండ్రి తన దగ్గరకు భోజనం తెచ్చేసరికి ఏకాంబరం ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు.

తండ్రి చెప్పినట్టే ప్రక్కనే ఉన్న బల్లమీద దండ, బొకే, షీల్డ్, శాలువా పెట్టి తండ్రి ఇచ్చిన ప్లేటు అందుకున్నాడు.

ఈలోగా తల్లి, చెల్లి, అన్న అక్కడకు చేరుకున్నారు. అయిదుగురు కలిసి మాట్లాడుకుంటూ భోజనం చేస్తున్నారు.

ఏజెంట్లు, వారి బంధువులు అటుగా వస్తూ ఏకాంబర్ ని చూస్తూనే నవ్వుతూ పలకరిస్తూ కంగ్రాట్స్ చెప్తున్నారు.

భోజనం చేస్తున్న పీతాంబరం, పర్వతాలు చిన్నకొడుకుని అందరూ వచ్చి పొగుడుతూంటే

మురిసిపోతూ భోజనం చేస్తున్నారు.

ఏకాంబర్ చెల్లి, అన్న పరిసరాలను గమనిస్తూ నెమ్మదిగా భోజనం చేస్తున్నారు. అలివేలుమంగ భోజనం చేస్తుందేగానీ కొంచెం దూరంలో ఐస్క్రీం కౌంటర్ దగ్గర ఉన్న క్యూ కేసి, అక్కడ నిలబడి ఐస్క్రీం లు తింటున్న పిల్లలకేసి లొట్టలేసుకుంటూ భోజనం చేస్తోంది.

ఏకాంబర్ చెప్తున్నది శ్రద్ధగా వింటూ కూర్చున్నారు అందరూ. ఏ ఒక్కరూ తలలు దించలేదు. తలలు వాల్చలేదు. ఎంతో ఉత్సుకతతో చూస్తూ కూర్చున్నారు. ఏకాంబర్ గొంతు ఒక్కసారే ఆగిపోయేసరికి అందరూ ఏదో మత్తులో నుండి బయటకు వచ్చినవాళ్ళలా ఉలిక్కిపడ్డారు.

" ఏం సార్ ! ఏమైంది ? ఆపేసారు? " చటుక్కున అంది నూకరత్నం.

చిన్నగా నవ్వి అందరికేసి చూసాడు ఏకాంబర్.వాచీకేసి చూసాడు. ఒంటిగంట అయిపోతోంది. ఉదయం పదిన్నర నుండి అతను చెప్తూ వస్తున్నాడు. ఒక కథలాగా చెప్పడం వలన అందరూ ఎంతో ఆతృతగా ఉత్కంఠతో విన్నారు. ' తను చెప్పింది అందరి బుర్రల్లోకి దూరి టంకంలా అతుక్కుపోయే ఉంటుంది ' మనసులోనే అనుకున్నాడు




జరిగిన కథ : సమావేశం లో బ్రాంచ్ మేనేజర్, డివిజినల్ ఆఫీసర్ మాట్లాడుతారు. ఈ ఏడాది టాప్ టెన్ లో మొదటి స్థానం సంపాదించిన ఏకాంబరాన్ని వేదికపైకి పిలుస్తారు. ఇంత మంది సమక్షం లో ఏకాంబర్ కు సన్మానం జరుగుతుంది. తరువాత తల్లి, తండ్రి, చెల్లి తో కలిసి భోజనం చేస్తాడు ఏకాంబర్ .

ఏకాంబర్.

"ఒంటిగంట అవుతోంది కదా! భోజనాలు వచ్చేసే వుంటాయి. కింద గ్రౌండ్ ఫ్లోర్ కెళ్లాలి. పదండి!" ఇక

అప్పటికి సమావేశాన్ని ముగిద్దామన్నట్టుగా అన్నాడు ఏకాంబర్.

"సార్! కథ మధ్యలోనే ఆపేశారు!" ఎవరో కుర్రాడు లేచి అన్నాడు.

"కథా...?!" ఆశ్చర్యంగా అన్నాడు ఏకాంబర్

ఆ కుర్రాడికేసి చూసి. "అదే సార్. మీరు అచ్చు సినిమా కథలాగా అద్భుతంగా చెప్పారు. ఆ తర్వాత ఏమైందని...?!" కుతూహలంగా అన్నాడు కుర్రాడు. "ఆ తర్వాతా? ఏమవుతుంది? మీరే చెప్పండి... ఎవరైనా చెప్పగలరా?" అందరికేసి చూస్తూ అన్నాడు

ఏకాంబర్."ఏముంది సార్! అతడో టాప్ మోస్ట్ ఏజెంటవుతాడు. రెండుచేతులా డబ్బు సంపాదిస్తూంటాడు. అది మీరే కదా!" మరో కుర్రాడు నవ్వుతూ అన్నాడు.

"కరెక్టు! మిగతా కథ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, ఏజెంటు అనేవాడు ఎలా వుండాలనేదే మనకు కావాలి. ఏదైనా సాధించాలనుకుంటే ఏంకావాలో తెలిసింది కదా!" అడిగాడు ఏకాంబర్.

"సార్! మీలా అందరికీ అదృష్టం కలసి రావాలి కదా!" అన్నారు ఎవరో వున్నట్టుండి.

ఆ మాటకు అదిరిపడ్డాడు ఏకాంబర్. ఇంత శ్రమపడి తను చెప్పినదంతా బూడిదలో పోసిన పన్నీరయిందా? కొంపదీసి తను చెప్పింది వీరందరికీ అర్థం కాలేదా?

"అదృష్టం!... అదృష్టం అంటే మీలో ఎవరికైనా తెలుసా?" చాలా తీక్షణంగా అన్నాడు ఏకాంబర్.

"అప్పనంగా వచ్చేది. అడక్కుండా, కష్టపడకుండా అందే ఫలం" అన్నాడు ఎవరో తెలివైన కుర్రాడు. "కదా!

ఇప్పుడు మీ అందరికీ నేను ఉద్యోగమిస్తానన్నది మీ అదృష్టాని బట్టా, మీలో వున్న కష్టపడే గుణాన్ని బట్టా?" అని ప్రశ్నించాడు ఏకాంబర్.

అందరూ ఒక్కసారే అవాక్కయిపోయారు. ఎవరూ గొంతు విప్పి మాట్లాడలేకపోయారు.

"చెప్పండి! పని చేయకుండా మనల్ని అదృష్టం వరిస్తుందా?! కనీసం ఎవరైనా మనల్ని ఇష్టపడతారా?! తల్లిదండ్రులు గానీ, పెళ్లాంగానీ సోమరిపోతులమైన మనల్ని ప్రేమిస్తారా? భరిస్తారా?! చెప్పండి!" గద్దించాడు

ఏకాంబర్

అందరూ అవాక్కయిపోయారు. అదృష్టమంటే గాలిలో దీపం పెట్టి దేవుడా నువ్వే వున్నావని మొక్కినట్టు అవుతుందన్న విషయం వారికి అర్థమైంది. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు పెద్దలు. కృషి వుంటే మనుషులే ఋషులవుతారని తెలుసు అందరికీ. పనిచేసేవాడి వెనకే 'అదృష్టం' కూడా తిరుగుతుందని వారికి స్పష్టంగా అవగతమైంది.

"అర్థమైంది సార్! అర్థమైంది. తొందర్లో ఆకతాయిగా అనేశాను" అంటూ తల దించుకున్నాడో కుర్రాడు లేచి నిలబడి... అతడే వునకనుండి 'అదృష్టం' వుండాలని అరచిందని అందరూ గ్రహించారు.

"సరిసరి! మీతో నేను వాదించటం లేదు. సోమరిపోతులు వాడే పదం 'అదృష్టం' అందుకే అంతలా స్పందించాను. పదండి! కింద గ్రౌండ్ ఫ్లోర్ లో మీ అందరి కోసం ఆహార పదార్థాలు కుతకుత ఉడుకుతూ ఎదురు చూస్తున్నాయి. వేడివేడిగా లాగించేద్దాం. అర్ధగంట విశ్రాంతి తీసుకున్నాక మధ్యాహ్నం మన తదుపరి కార్యక్రమాల్లోకి వెళ్దాం" అంటూ నూకరత్నంకేసి చూశాడు ఏకాంబర్.

అమ్మాయిల్నందర్నీ తీసుకుని కిందకు దిగింది నూకరత్నం. అబ్బాయిలతో మాట్లాడుతూ దిగాడు ఏకాంబర్.

అప్పటికే ఏకాంబర్ మిత్రులు నలుగురూ గ్రౌండ్ ఫ్లోర్ లో భోజనాల ఏర్పాట్లలో తలమునకలై వున్నారు. డెవల్ప్ మెంట్ ఆఫీసర్ రాజనాల కూడా ఏకాంబర్ వెంటే నడుస్తున్నాడు.

వున్నది పాతికమందైనా ఆదివారం కావడంవల్ల ఎవరికి నచ్చింది వారు తింటారని వెజ్, నాన్ వెజ్ కూరలు ఆర్డరిచ్చాడు ఏకాంబర్. తినేవాళ్ళు తక్కువగా వున్నా పదార్థాలు మాత్రం ఎక్కువైపోయాయి.

మార్కెటింగ్ లో ప్రధానమైనది ఆకట్టుకోవడం, తమవద్ద పని చేయడానికి వచ్చిన యువతీ యువకుల్లో మొదటి ఘట్టంలోనే ఇక్కడే పని చేయాలన్న ఆశని, ఆలోచనని కలిగించాలన్నదే ఏకాంబర్ ఊహ!

అందుకే ఖర్చుకు వెనుకాడకుండా ఏర్పాట్లు చేశాడు. ఒక విధంగా ఇది అందరికీ మోటివేషన్ క్యాంపెయిన్ లాంటిది.

నూకరత్నం అమ్మాయిలందరితో గలగలా మాట్లాడుతూ ఒరకంట ఏకాంబర్ నే గమనిస్తోంది. తనకోసం అతడు తీసుకున్న ప్రతిచర్యనీ నిశితంగా గమనిస్తోంది. తన ఉన్నతి కోసం పడుతున్న శ్రమని, అతనిలోని ప్రేమని పసిగడుతూనే వుంది. ఏకాంబర్ ప్రతి అడుగూ ఆమె మనసు దరి చేరుతూనే వుంది. నూకరత్నం కూడా పరవశిస్తూనే వుంది. ఆమె హృదయం పరిమళిస్తూనే వుంది.

ఏకాంబర్ ఊహించినట్టే నూకరత్నం తన పేర తీసుకున్న ఫ్రాంఛైజీలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతోంది.

రోజూ ఉదయం ఎనిమిదో గంటకల్లా ఆఫీసుకు వచ్చేస్తోంది. అందరికంటే, ముందు తనే రావడం, ఆరోజు ఎవరు, ఏ పని చేయాలో చార్ట్ తయారు చేసుకుని ఏరియాల వారీగా తనవద్ద అసిస్టెంట్లుగా పనిచేస్తున్న యువకుల్ని ఒకో ఏరియాకి పంపిస్తోంది.

ఆఫీసులో వున్న అమ్మాయిలతో పాలసీల వివరాలను ప్రింట్లు తీయిస్తూ ఆ నెలలో వాయిదాలు చెల్లించాల్సిన పాలసీదారుల జాబితా కూడా రెడీ చేయిస్తోంది.

ఏకాంబర్ తెల్లారగట్లే నగరం మీదపడి పాలసీదారులను కలసి పదో గంటకల్లా ఆఫీసుకి చేరుకుంటున్నాడు. ఆఫీసులో ఓ అరగంట వుండి తిరిగి వైజాగ్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళ్లిపోతున్నాడు.

ఇప్పుడు నూకరత్నం కూడా ఒంటరిగా తనకి తెలిసిన కస్టమర్ల దగ్గరకు వెళ్లి చిన్నా చితకా చిట్స్ సేకరించగలుగుతోంది.

కస్టమర్లను కలసి వారి అవసరాలకు తగ్గట్టు చిట్స్ కట్టించగలుగుతోంది.

ఆరోజు

ఉదయాన్నే ఫ్రాంఛైజీ ఆఫీసుకు హడావిడిగా బయలుదేరుతోంది నూకరత్నం. అప్పటికే తల్లితో కలసి వంట తయారుచేసి తనకోసం మధ్యాహ్నానికి క్యారేజీ కట్టేసుకుంది.

రోజూ తన క్యారేజీలో తనతోపాటు మరో వ్యక్తికి కూడా సరిపోయేలా భోజనం తెస్తుంది నూకరత్నం. ఒకరోజు అనుకోకుండా భోజనం వేళకి ఏకాంబరం వస్తే ఇద్దరూ కబుర్లాడుకుంటూ తింటూంటారు.

రోజూ ఏకాంబరం మధ్యాహ్నం వేళకి రాకపోయినా క్యారేజీ మాత్రం నిండుగా తెచ్చి ఏకాంబరం కోసం

రెండుగంటల వరకూ ఎదురుచూసి ఈ తర్వాత భోజనం చేస్తోంది నూకరత్నం. ఒంటిగంట నుండి ఏకాంబరాన్ని ఎక్కడున్నావంటూ వాకబు చేసి ఆ తర్వాతే తను క్యారేజీ విప్పుకుని తింటుంది. ఏకాంబరం రాని రోజు బిగిలిన అన్నం, కూరలు తమ అపార్టుమెంట్ బయట రోడ్డు మీద చెప్పులు కుట్టుకునే కుర్రాడికి తీసికెళ్లి ఇచ్చేస్తుంది.

ఆరోజు

ఎప్పటిలాగే క్యారియర్ సర్దుకుని ఫ్రాంఛైజీ ఆఫీసుకు బయలుదేరింది నూకరత్నం.

ఇంతలో ఏకాంబర్ ఫోన్. చంద్రనగర్లో నుండి నడుస్తూ రైల్వేస్టేషన్ పైనున్న వంతెన మీదకు చేరుకోగానే కాల్ వచ్చింది. క్యారియర్ చేతబట్టి వ్యానిటీ బ్యాగ్ చంకలో తగిలించుకు నడుస్తోన్న నూకరత్నం బ్యాగులో నుండి సెల్ రింగ్ వినగానే ఠక్కున నిలబడి సెల్ బయటకు తీసింది.

ఫ్రాంఛైజీ ప్రారంభించిన దగ్గర నుండీ ఎలాంటి ఫోన్ కాల్ కూడా నిర్లక్ష్యం చేయడం లేదు నూకరత్నం. ఏ కస్టమర్ ఏ సమయంలో కాల్ చేస్తాడో! ఎవరికి ఎలాంటి అవసరం ఏర్పడుతుందోనన్న ఆలోచనతో ఎప్పుడూ అలర్ట్ గా వుంటుంది.

సెల్ తీసి డిస్ ప్లే చూడగానే 'ఏజెంట్ ఏకాంబర్ ' అన్న పేరు చూడగానే ఆతృతగా కాల్ రిసీవ్ చేసుకుంది నూకరత్నం.

హలో! చెప్పండి!" చిన్నగా నవ్వుతూ అంది నూకరత్నం.

"ఎక్కడున్నావు?" ఆతృతగా అడిగాడు ఏకాంబర్.

"మన ఆఫీసుకే బయలుదేరాను. దార్లో ఉన్నాను" చెప్పింది.

"దార్లో అంటే..?" అడిగాడు ఏకాంబర్.

"రైల్వే స్టేషన్ బ్రిడ్జి మీద నడుస్తూ అంది నూకరత్నం.

ఓఖ్! నేను స్టేషన్ ఎంట్రన్స్ గేటు దగ్గర వుంటాను. అర్జెంటుగా రా!" అంటూనే అవతల ఫోన్ కట్ చేసాడు ఏకాంబరం.

ఏకాంబర్ అంత గాబరాగా ఫోన్ చేసేసరికి నూకరత్నం ఆశ్చర్యపోయింది. ఫ్రాంఛైజీ ఆఫీసు తెరచి రెండు నెలలు కావస్తోంది. ఏ రోజు ఎక్కడున్నావ్? అని అడగలేదు. ఈ రోజు ఏమిటో?! ఆశ్చర్యపోయింది.

ఉదయాన్నే పదో గంటకి ఆఫీసుకు రావడం ఒకసారి అందర్నీ పలకరించడం వెంటనే వెళ్ళిపోవడం, మధ్యాహ్నం ఆఫీసులో పనుంటే గాబరాగా రావడం,భోజనం వేళయితే తనతో రెండు ముద్దలు గబ గబా మింగేయడం మళ్ళీ పరుగు పరుగున పారిపోవడం, సాయంత్రం పూట ఆఫీసు మూసే వేళకి వస్తే రావడం లేకపోతే మర్నాడే పుందర్శనం కలిగించే ఏకాంబరం ఈ రోజు ఇంత ఉదయాన్నే ఇంత హఠాత్తుగా తనను కలవాలనే సరికి ఆశ్చర్యం కలుగుతోంది. ఏం1 పనబ్బా ఈ రెండు రోజులు నెలలుగా తను చేసే ప్రతి పని చాలా సునిశితం గా పరిశీలిస్తున్నాడే!?!

ఏ రోజుకారోజు వాయిదా వసూళ్ళు ఆయా కంపెనీలకి సొమ్ము వసూలు అయిన మర్నాడే ఆయా కంపెనీల ఖాతాల్లో జమ చేస్తోందే! మరి, తనతో ఇంత అర్జెంటు పన్నేటబ్బా?!

ఆలోచిస్తూనే గబగబా రైల్వే బ్రిడ్జ్ కిందకు దిగింది నూకరత్నం.

బ్రిడ్జి దిగుతూండగానే కొద్ది దూరం లో బైక్ మీద కూర్చుని తన కోసమే ఎదురుచూస్తున్న ఏకాంబరాన్ని చూసింది నూకరత్నం.

ఒక్క కషణం ఎందుకో మనసులో ఆందోళన కలిగింది. కాళ్ళూ చేతులూ ఒణుకు పుట్టాయి నూకరత్నానికి.

"కొంపదీసి తనెక్కడన్నా తప్పు చేసిందా?! ఈ రెండు నెలల్లో ఏ కంపెనీ కలెక్షన్ ఆ కంపెనీకి అణా పైసలతో సహా ఆ కంపెనీ అకౌంట్లకు బ్యాంకుల్లో డబ్బు కట్టేసిందే?! పొరపాటున ఒకరికి కట్టాల్సింది మరొకరికి కట్టేసిందా?! ప్రతి రోజు ప్రతి ఉద్యోగి తెచ్చిన రోజువారీ కలెక్షన్ మనీ సరిగ్గానే నమోదు

చేసుకునేది కదా! అలాగే ఏ కంపెనీకి ఆ కంపెనీ డబ్బు వేరు చేసేసి కట్టేసింది.కదా! తప్పు ఎలా జరిగిందబ్బా!? ఏమంటాడో!" రకరకాలుగా ఆలోచించుకుంటూ భయం భయం గా మనసులో జడుసుకుంటూ నెమ్మదిగా ఏకాంబర్ దగ్గరకు వెళ్ళి ఆలోచించుకుంటూ భయం భయం గా మనసులో జడుసుకుంటూ నెమ్మదిగా ఏకాంబర్ దగ్గరకు వెళ్ళి నవ్వడానికి ప్రయత్నిస్తూ విష్ చేసింది నూకరత్నం.

"బైక్ మీద కూర్చో!" గంభీరం గా అన్నాడు ఏకాంబర్.

మౌనం గా మారు మాట్లాడకుండా ఏకాంబర్ బైక్ మీద ఒద్దికగా ఎక్కి కూర్చుంది నూకరత్నం.

'ఆఫీసు తాళాలు వాచ్మెన్ భార్య దగ్గర ఉన్నాయి కదా?" బైక్ ని ముందుకి ఉరికిస్తూ అడిగాడు ఏకాంబర్.

ఒక సెట్ తాళాలు పద్మక్క దగ్గర వున్నాయి     అని అంది నూకరత్నం.

ఈ రెండు నెలల్లో వాచ్మెన్ భార్యని పద్మక్క అని పిలవడం అలవాటయింది నూకరత్నానికి. ఆమెనే కాదు అందర్నీ అన్నా, అక్కా, తమ్ముడు, చెల్లని సంభోదిస్తూ పిలవడం అలవాటయింది నూకరత్నంకి.

ఫ్రాంచిజీ ఆఫీసులో పనిచేస్తున్న యువతీ యువకులందరినీ అలాగే పెద్దవాళ్ళందరినీ అన్న, అక్క,అని చిన్నవాళ్ళందరినీ తమ్ముడు, చెళ్ళి అని ఆప్యాయం గా పిలుస్తోంది నూకరత్నం..

పద్మక్క దగ్గర తాళాలు ఉన్నాయి కదా! నాతో ఇప్పుడు రావడానికి ఎలాంటి ఇబ్బంది లేదు కదా!" అడిగాడు ఏకాంబర్.

లేదు లేదు ఈ రోజు ఎవరు ఏ ఏరియాకెళ్ళాలి, ఏ కస్టమర్లని కలవాలో కంప్యూటర్లో "బాకీల జాబితా' తీసి రెడీగా టేబుల్ మీద వుంచాను. మనవాళ్ళు వచ్చి లిస్ట్ వాళ్ళు తీసుకుని వెళ్ళిపోతారు. వర్క్ ఏం సఫర్ కాదు" అంది నూకరత్నం.

"ఓకే! జాగ్రత్తగా కూర్చో!" అంటూనే బైక్ ని స్పీడుగా పరుగులు పెట్టించాడు ఏకాంబర్.

"మహానుభావుడు! ఏదీ చెప్పకుండా ఎక్కడికి లాక్కుపోతున్నాడో! దేనికో అర్ధం కావడం లేదు" అనుకుంటూనే ఒక్కసారి వాచీకేసి చూసుకుంది నూకరత్నం.

తొమ్మిది గంటలు దాటిపోయింది. ఈ సరికి తను ఆఫీసులో ఏదో పని మీద వుండేది, పని పూర్తి అయ్యాక శ్రీ రాం చిట్స్ ఆఫీసుకు బయలుదేరేది. ఈ రోజు ఓన్లేక్ చిట్స్ రెండు కట్టాల్సినవి ఉన్నాయి.

కష్టమర్ల దగ్గర చిట్ మొత్తం కూడా వసూలు చేసింది. ఆ చిట్స్ రెండిటి డబ్బు కట్టి చిట్స్ పాస్ బుక్ రాయించుకుని ఆ చిట్స్కి కంపెనీ వాళ్ళిచ్చే ప్రోత్సాహక బహుమతులు తీసుకుని పార్టీలకు అందజేయాలి. ఈ రోజు ఇదే చాలా ఇంపార్టెంట్ వర్క్ పార్టీ దగ్గర డబ్బు తీసుకున్నాకా ఒక్క రోజు కూడా తన దగ్గర ఉంచుకోకూడదు. వారికి రశీదు, పాస్ బుక్ వాటితో పాటు చిట్ గిఫ్ట్స్ అందజేయాలి. అప్పుడే వారికి తన మీద నమ్మకం కలుగుతుంది.

ఈయన చూస్తే ఏమీ చెప్పకుండా బైక్ మీద టౌన్ లాక్కుపోతున్నాడు. ఎందుకో! ఏమో! చూద్దాం!" మనసులోనే పరి పరి విధాల ఆలోచిస్తోంది.

జగదాంబ థియేటర్ దగ్గరకు రావడంతోనే నూకరత్నం ఒక్కసారే



అదిరిపడింది.

జరిగిన కథ : సమావేశం లో బ్రాంచ్ మేనేజర్, డివిజినల్ ఆఫీసర్ మాట్లాడుతారు. ఈ ఏడాది టాప్ టెన్ లో మొదటి స్థానం సంపాదించిన ఏకాంబరాన్ని వేదికపైకి పిలుస్తారు. ఇంత మంది సమక్షం లో ఏకాంబర్ కు సన్మానం జరుగుతుంది. తరువాత తల్లి, తండ్రి, చెల్లి తో కలిసి భోజనం చేస్తాడు ఏకాంబర్ .

ఏకాంబర్.

"ఒంటిగంట అవుతోంది కదా! భోజనాలు వచ్చేసే వుంటాయి. కింద గ్రౌండ్ ఫ్లోర్ కెళ్లాలి. పదండి!" ఇక అప్పటికి సమావేశాన్ని ముగిద్దామన్నట్టుగా అన్నాడు ఏకాంబర్.

"సార్! కథ మధ్యలోనే ఆపేశారు!" ఎవరో కుర్రాడు లేచి అన్నాడు.

"కథా...?!" ఆశ్చర్యంగా అన్నాడు ఏకాంబర్

ఆ కుర్రాడికేసి చూసి. "అదే సార్. మీరు అచ్చు సినిమా కథలాగా అద్భుతంగా చెప్పారు. ఆ తర్వాత ఏమైందని...?!" కుతూహలంగా అన్నాడు కుర్రాడు. "ఆ తర్వాతా? ఏమవుతుంది? మీరే చెప్పండి... ఎవరైనా చెప్పగలరా?" అందరికేసి చూస్తూ అన్నాడు

ఏకాంబర్."ఏముంది సార్! అతడో టాప్ మోస్ట్ ఏజెంటవుతాడు. రెండుచేతులా డబ్బు సంపాదిస్తూంటాడు. అది మీరే కదా!" మరో కుర్రాడు నవ్వుతూ అన్నాడు.

"కరెక్టు! మిగతా కథ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, ఏజెంటు అనేవాడు ఎలా వుండాలనేదే మనకు కావాలి. ఏదైనా సాధించాలనుకుంటే ఏంకావాలో తెలిసింది కదా!" అడిగాడు ఏకాంబర్.

"సార్! మీలా అందరికీ అదృష్టం కలసి రావాలి కదా!" అన్నారు ఎవరో వున్నట్టుండి.

ఆ మాటకు అదిరిపడ్డాడు ఏకాంబర్. ఇంత శ్రమపడి తను చెప్పినదంతా బూడిదలో పోసిన పన్నీరయిందా? కొంపదీసి తను చెప్పింది వీరందరికీ అర్థం కాలేదా?

"అదృష్టం!... అదృష్టం అంటే మీలో ఎవరికైనా తెలుసా?" చాలా తీక్షణంగా అన్నాడు ఏకాంబర్.

"అప్పనంగా వచ్చేది. అడక్కుండా, కష్టపడకుండా అందే ఫలం" అన్నాడు ఎవరో తెలివైన కుర్రాడు. "కదా!

ఇప్పుడు మీ అందరికీ నేను ఉద్యోగమిస్తానన్నది మీ అదృష్టాని బట్టా, మీలో వున్న కష్టపడే గుణాన్ని బట్టా?" అని ప్రశ్నించాడు ఏకాంబర్.

అందరూ ఒక్కసారే అవాక్కయిపోయారు. ఎవరూ గొంతు విప్పి మాట్లాడలేకపోయారు.

"చెప్పండి! పని చేయకుండా మనల్ని అదృష్టం వరిస్తుందా?! కనీసం ఎవరైనా మనల్ని ఇష్టపడతారా?! తల్లిదండ్రులు గానీ, పెళ్లాంగానీ సోమరిపోతులమైన మనల్ని ప్రేమిస్తారా? భరిస్తారా?! చెప్పండి!" గద్దించాడు

ఏకాంబర్

అందరూ అవాక్కయిపోయారు. అదృష్టమంటే గాలిలో దీపం పెట్టి దేవుడా నువ్వే వున్నావని మొక్కినట్టు అవుతుందన్న విషయం వారికి అర్థమైంది. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు పెద్దలు. కృషి వుంటే మనుషులే ఋషులవుతారని తెలుసు అందరికీ. పనిచేసేవాడి వెనకే 'అదృష్టం' కూడా తిరుగుతుందని వారికి స్పష్టంగా అవగతమైంది.

"అర్థమైంది సార్! అర్థమైంది. తొందర్లో ఆకతాయిగా అనేశాను" అంటూ తల దించుకున్నాడో కుర్రాడు లేచి నిలబడి... అతడే వునకనుండి 'అదృష్టం' వుండాలని అరచిందని అందరూ గ్రహించారు.

"సరిసరి! మీతో నేను వాదించటం లేదు. సోమరిపోతులు వాడే పదం 'అదృష్టం' అందుకే అంతలా స్పందించాను. పదండి! కింద గ్రౌండ్ ఫ్లోర్ లో మీ అందరి కోసం ఆహార పదార్థాలు కుతకుత ఉడుకుతూ ఎదురు చూస్తున్నాయి. వేడివేడిగా లాగించేద్దాం. అర్ధగంట విశ్రాంతి తీసుకున్నాక మధ్యాహ్నం మన తదుపరి కార్యక్రమాల్లోకి వెళ్దాం" అంటూ నూకరత్నంకేసి చూశాడు ఏకాంబర్.

అమ్మాయిల్నందరీన్ని తీసుకుని కిందకు దిగింది నూకరత్నం. అబ్బాయిలతో మాట్లాడుతూ దిగాడు ఏకాంబర్.

అప్పటికే ఏకాంబర్ మిత్రులు నలుగురూ గ్రౌండ్ ఫ్లోర్ లో భోజనాల ఏర్పాట్లలో తలమునకలై వున్నారు. డెవల్ప్ మెంట్ ఆఫీసర్ రాజనాల కూడా ఏకాంబర్ వెంటే నడుస్తున్నాడు.

వున్నది పాతికమందైనా ఆదివారం కావడంవల్ల ఎవరికి నచ్చింది వారు తింటారని వెజ్, నాన్ వెజ్ కూరలు ఆర్డరిచ్చాడు ఏకాంబర్. తినేవాళ్ళు తక్కువగా వున్నా పదార్థాలు మాత్రం ఎక్కువైపోయాయి.

మార్కెటింగ్ లో ప్రధానమైనది ఆకట్టుకోవడం. తమవద్ద పని చేయడానికి వచ్చిన యువతీ యువకుల్లో మొదటి ఘట్టంలోనే ఇక్కడే పని చేయాలన్న ఆశని, ఆలోచనని కలిగించాలన్నదే ఏకాంబర్ ఊహ!

అందుకే ఖర్చుకు వెనుకాడకుండా ఏర్పాట్లు చేశాడు. ఒక విధంగా ఇది అందరికీ మోటివేషన్

క్యాంపెయిన్ లాంటిది.

నూకరత్నం అమ్మాయిలందరితో గలగలా మాట్లాడుతూ ఓరకంట ఏకాంబర్ నే గమనిస్తోంది. తనకోసం అతడు తీసుకున్న ప్రతిచర్యనీ నిశితంగా గమనిస్తోంది. తన ఉన్నతి కోసం పడుతున్న శ్రమని, అతనిలోని ప్రేమని పసిగడుతూనే వుంది. ఏకాంబర్ ప్రతి అడుగూ ఆమె మనసు దరి చేరుతూనే వుంది. నూకరత్నం కూడా పరవశిస్తూనే వుంది. ఆమె హృదయం పరిమళిస్తూనే వుంది.

ఏకాంబర్ ఊహించినట్టే నూకరత్నం తన పేర తీసుకున్న ఫ్రాంఛైజీలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతోంది.

రోజూ ఉదయం ఎనిమిదో గంటకల్లా ఆఫీసుకు వచ్చేస్తోంది. అందరికంటే, ముందు తనే రావడం, ఆరోజు ఎవరు, ఏ పని చేయాలో చార్ట్ తయారు చేసుకుని ఏరియాల వారీగా తనవద్ద అసిస్టెంట్లుగా పనిచేస్తున్న యువకుల్ని ఒకో ఏరియాకి పంపిస్తోంది.

ఆఫీసులో వున్న అమ్మాయిలతో పాలసీల వివరాలను ప్రింట్లు తీయిస్తూ ఆ నెలలో వాయిదాలు చెల్లించాల్సిన పాలసీదారుల జాబితా కూడా రెడీ చేయిస్తోంది.

ఏకాంబర్ తెల్లారగట్లే నగరం మీదపడి పాలసీదారులను కలసి పదో గంటకల్లా ఆఫీసుకి చేరుకుంటున్నాడు. ఆఫీసులో ఓ అరగంట వుండి తిరిగి వైజాగ్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళ్లిపోతున్నాడు.

ఇప్పుడు నూకరత్నం కూడా ఒంటరిగా తనకి తెలిసిన కస్టమర్ల దగ్గరకు వెళ్లి చిన్నా చితకా చిట్స్ సేకరించగలుగుతోంది.

కస్టమర్లను కలసి వారి అవసరాలకు తగ్గట్టు చిట్స్ కట్టించగలుగుతోంది.

ఆరోజు

ఉదయాన్నే ఫ్రాంఛైజీ ఆఫీసుకు హడావిడిగా బయలుదేరుతోంది నూకరత్నం. అప్పటికే తల్లితో కలసి వంట తయారుచేసి తనకోసం మధ్యాహ్నానికి క్యారేజీ కట్టేసుకుంది.

రోజూ తన క్యారేజీలో తనతోపాటు మరో వ్యక్తికి కూడా సరిపోయేలా భోజనం తెస్తుంది నూకరత్నం. ఒకరోజు అనుకోకుండా భోజనం వేళకి ఏకాంబరం వస్తే ఇద్దరూ కబుర్లాడుకుంటూ తింటూంటారు.

రోజూ ఏకాంబరం మధ్యాహ్నం వేళకి రాకపోయినా క్యారేజీ మాత్రం నిండుగా తెచ్చి ఏకాంబరం కోసం

రెండుగంటల వరకూ ఎదురుచూసి ఈ తర్వాత భోజనం చేస్తోంది నూకరత్నం. ఒంటిగంట నుండి ఏకాంబరాన్ని ఏక్కడున్నావంటూ వాకబు చేసి ఆ తర్వాతే తను క్యారేజీ విప్పుకుని తింటుంది. ఏకాంబరం రాని రోజు బిగిలిన అన్నం, కూరలు తమ అపార్టుమెంట్ బయట రోడ్డు మీద చెప్పులు కుట్టుకునే కుర్రాడికి తీసికెళ్లి ఇచ్చేస్తుంది.

ఆరోజు

ఎప్పటిలాగే క్యారియర్ సర్దుకుని ఫ్రాంఛైజీ ఆఫీసుకు బయలుదేరింది నూకరత్నం.

ఇంతలో ఏకాంబర్ ఫోన్. చంద్రనగర్లో నుండి నడుస్తూ రైల్వేస్టేషన్ పైనున్న వంతెన మీదకు చేరుకోగానే కాల్ వచ్చింది. క్యారియర్ చేతబట్టి వ్యానిటీ బ్యాగ్ చంకలో తగిలించుకు నడుస్తోన్న నూకరత్నం బ్యాగులో నుండి సెల్ రింగ్ వినగానే ఠక్కున నిలబడి సెల్ బయటకు తీసింది.

ఫ్రాంఛైజీ ప్రారంభించిన దగ్గర నుండీ ఎలాంటి ఫోన్ కాల్ కూడా నిర్లక్ష్యం చేయడం లేదు నూకరత్నం. ఏ కస్టమర్ ఏ సమయంలో కాల్ చేస్తాడో! ఎవరికి ఎలాంటి అవసరం ఏర్పడుతుందోనన్న ఆలోచనతో ఎప్పుడూ అలర్ట్ గా వుంటుంది.

సెల్ తీసి డిస్ ప్లే చూడగానే 'ఏజెంట్ ఏకాంబర్' అన్న పేరు చూడగానే ఆత్రుతగా కాల్ రిసీవ్ చేసుకుంది నూకరత్నం.

హలో! చెప్పండి!" చిన్నగా నవ్వుతూ అంది నూకరత్నం.

"ఎక్కడున్నావు?" ఆత్రుతగా అడిగాడు ఏకాంబర్.

"మన ఆఫీసుకే బయలుదేరాను. దార్లో ఉన్నాను" చెప్పింది.

"దార్లో అంటే..?" అడిగాడు ఏకాంబర్.

"రైల్వే స్టేషన్ బ్రిడ్జి మీద నడుస్తూ అంది నూకరత్నం.

ఓఖ్! నేను స్టేషన్ ఎంట్రన్స్ గేటు దగ్గర వుంటాను. అర్జెంటుగా రా!" అంటూనే అవతల ఫోన్ కట్ చేసాడు ఏకాంబరం.

ఏకాంబర్ అంత గాబరాగా ఫోన్ చేసేసరికి నూకరత్నం ఆశ్చర్యపోయింది. ఫ్రాంచైజీ ఆఫీసు తెరచి రెండు నెలలు కావస్తోంది. ఏ రోజు ఎక్కడున్నావ్? అని అడగలేదు. ఈ రోజు ఏమిటో?! ఆశ్చర్యపోయింది.

ఉదయాన్నే పదో గంటకి ఆఫీసుకు రావడం ఒకసారి అందర్నీ పలకరించడం వెంటనే వెళ్ళిపోవడం, మధ్యాహ్నం ఆఫీసులో పనుంటే గాబరాగా రావడం,భోజనం వేళయితే తనతో రెండు ముద్దలు గబ గబా మింగేయడం మళ్ళీ పరుగు పరుగున పారిపోవడం, సాయంత్రం పూట ఆఫీసు మూసే వేళకి వస్తే రావడం లేకపోతే మర్నాడే పుందర్శనం కలిగించే ఏకాంబరం ఈ రోజు ఇంత ఉదయాన్నే ఇంత హఠాత్తుగా తనను కలవాలనే సరికి ఆశ్చర్యం కలుగుతోంది. ఏం1 పనబ్బా ఈ రెండు రోజులు నెలలుగా తను చేసే ప్రతి పని చాలా సునిశితం గా పరిశీలిస్తున్నాడే!?!

ఏ రోజుకారోజు వాయిదా వసూళ్ళు ఆయా కంపెనీలకి సొమ్ము వసూలు అయిన మర్నాడే ఆయా కంపెనీల ఖాతాల్లో జమ చేస్తోందే! మరి, తనతో ఇంత అర్జెంటు పన్నేటబ్బా?!

ఆలోచిస్తూనే గబగబా రైల్వే బ్రిడ్జ్ కిందకు దిగింది నూకరత్నం.

బ్రిడ్జి దిగుతూండగానే కొద్ది దూరం లో బైక్ మీద కూర్చుని తన కోసమే ఎదురుచూస్తున్న ఏకాంబరాన్ని చూసింది నూకరత్నం.

ఒక్క కషణం ఎందుకో మనసులో ఆందోళన కలిగింది. కాళ్ళూ చేతులూ ఒణుకు పుట్టాయి నూకరత్నానికి.

"కొంపదీసి తనెక్కడన్నా తప్పు చేసిందా?! ఈ రెండు నెలల్లో ఏ కంపెనీ కలెక్షన్ ఆ కంపెనీకి అణా పైసలతో సహా ఆ కంపెనీ అకౌంట్లకు బ్యాంకుల్లో డబ్బు కట్టేసిందే?! పొరపాటున ఒకరికి కట్టాల్సింది మరొకరికి కట్టేసిందా?! ప్రతి రోజు ప్రతి ఉద్యోగి తెచ్చిన రోజువారీ కలెక్షన్ మనీ సరిగ్గానే నమోదు

చేసుకునేది కదా! అలాగే ఏ కంపెనీకి ఆ కంపెనీ డబ్బు వేరు చేసేసి కట్టేసింది.కదా! తప్పు ఎలా జరిగిందబ్బా!? ఏమంటాడో!" రకరకాలుగా ఆలోచించుకుంటూ భయం భయం గా మనసులో జడుసుకుంటూ నెమ్మదిగా ఏకాంబర్ దగ్గరకు వెళ్ళి ఆలోచించుకుంటూ భయం భయం గా మనసులో జడుసుకుంటూ నెమ్మదిగా ఏకాంబర్ దగ్గరకు వెళ్ళి నవ్వడానికి ప్రయత్నిస్తూ విష్ చేసింది నూకరత్నం.

"బైక్ మీద కూర్చో!" గంభీరం గా అన్నాడు ఏకాంబర్.

మౌనం గా మారు మాట్లాడకుండా ఏకాంబర్ బైక్ మీద ఒద్దికగా ఎక్కి కూర్చుంది నూకరత్నం.

'ఆఫీసు తాళాలు వాచ్మెన్ భార్య దగ్గర ఉన్నాయి కదా?" బైక్ ని ముందుకి ఉరికిస్తూ అడిగాడు ఏకాంబర్.

ఒక సెట్ తాళాలు పద్మక్క దగ్గర వున్నాయి     అని అంది నూకరత్నం.

ఈ రెండు నెలల్లో వాచ్మెన్ భార్యని పద్మక్క అని పిలవడం అలవాటయింది నూకరత్నానికి. ఆమెనే కాదు అందర్నీ అన్నా, అక్కా, తమ్ముడు, చెల్లని సంభోదిస్తూ పిలవడం అలవాటయింది నూకరత్నంకి.

ఫ్రాంచిజీ ఆఫీసులో పనిచేస్తున్న యువతీ యువకులందరినీ అలాగే పెద్దవాళ్ళందరినీ అన్న, అక్క,అని చిన్నవాళ్ళందరినీ తమ్ముడు, చెళ్ళి అని ఆప్యాయం గా పిలుస్తోంది నూకరత్నం..

పద్మక్క దగ్గర తాళాలు ఉన్నాయి కదా! నాతో ఇప్పుడు రావడానికి ఎలాంటి ఇబ్బంది లేదు కదా!" అడిగాడు ఏకాంబర్.

లేదు లేదు ఈ రోజు ఎవరు ఏ ఏరియాకెళ్ళాలి, ఏ కస్టమర్లని కలవాలో కంప్యూటర్లో "బాకీల జాబితా' తీసి రెడీగా టేబుల్ మీద వుంచాను. మనవాళ్ళు వచ్చి లిస్ట్ వాళ్ళు తీసుకుని వెళ్ళిపోతారు. వర్క్ ఏం సఫర్ కాదు" అంది నూకరత్నం.

"ఒకే! జాగ్రత్తగా కూర్చో!" అంటూనే బైక్ ని స్పీడుగా పరుగులు పెట్టించాడు ఏకాంబర్.

"మహానుభావుడు! ఏదీ చెప్పకుండా ఎక్కడికి లాక్కుపోతున్నాడో! దేనికో అర్ధం కావడం లేదు" అనుకుంటూనే ఒక్కసారి వాచీకేసి చూసుకుంది నూకరత్నం.

తొమ్మిది గంటలు దాటిపోయింది. ఈ సరికి తను ఆఫీసులో ఏదో పని మీద వుండేది. పని పూర్తి అయ్యాక శ్రీ రాం చిట్స్ ఆఫీసుకు బయలుదేరేది. ఈ రోజు ఓ న్లేక్ చిట్స్ రెండు కట్టాల్సినవి ఉన్నాయి.

కష్టమర్ల దగ్గర చిట్ మొత్తం కూడా వసూలు చేసింది. ఆ చిట్స్ రెండిటి డబ్బు కట్టి చిట్స్ పాస్ బుక్ రాయించుకుని ఆ చిట్స్కి కంపెనీ వాళ్ళిచ్చే ప్రోత్సాహక బహుమతులు తీసుకుని పార్టీలకు అందజేయాలి. ఈ రోజు ఇదే చాలా ఇంపార్టెంట్ వర్క్ పార్టీ దగ్గర డబ్బు తీసుకున్నాకా ఒక్క రోజు కూడా తన దగ్గర ఉంచుకోకూడదు. వారికి రశీదు, పాస్ బుక్ వాటితో పాటు చిట్ గిఫ్ట్స్ అందజేయాలి. అప్పుడే వారికి తన మీద నమ్మకం కలుగుతుంది.

ఈయన చూస్తే ఏమీ చెప్పకుండా బైక్ మీద టౌన్ లాక్కుపోతున్నాడు. ఎందుకో! ఏమో! చూద్దాం!" మనసులోనే పరి పరి విధాల ఆలోచిస్తోంది.

జగదాంబ థియేటర్ దగ్గరకు రావడంతోనే నూకరత్నం ఒక్కసారే అదిరిపడింది.





జరిగిన కథ:

ఏకాంబర్ , నూకరత్నానికి ఫోన్ చేసి ఎక్కడున్నావ్ అని అడుగుతాడు. తను ఆఫీసుకు బయలుదేరానని చెప్పుతుంది. తనను అక్కడే వుండమని చెప్పి. ఏకాంబర్ తనని కలుసుకుని బండిపై జగదాంబ థియేటర్ కు తీసుకెళతాడు

....................ఇకచదవండి...

ఎప్పుడూ లేనిది చెప్పా పెట్టకుండా తిన్నగా సినిమా హాలుకి తీసుకువచ్చాడేమిటబ్బా! అనుకుంది మనసులోనే.

బైక్ ఆగుతూనే వెనక్కి తిరిగి దిగు అన్నాడు ఏకాంబర్.

బైక్ దిగి ఓ పక్కగా నిలబడింది నూకరత్నం.

పది గంటలు కావస్తోంది. అప్పటికే జగదాంబ థియేటర్ కేసి తేపారా చూసింది నూకరత్నం.

మూడు థియేటర్ల తాలూకా సినిమా పోస్టర్లూ ప్రక్కప్రక్కనే దర్శనమిస్తున్నాయి. జగదాంబ లో ఏదో ఇంగ్లీష్ సినిమా ఆడుతోంది. వాల్ పోస్టర్ చూస్తుంటే శరీరం అంతా జలదరించింది నూకరత్నానికి. ఆడామగా ఇద్దరూ నగ్నం గా వున్న పోస్టర్ అది. పోస్టర్ చూస్తూ గబుక్కున తల దించుకుంది. రెండో థియేటర్ శారదలో ఏదో హిందీ సినిమా. అదీ అలాగే వుంది. కాక పోతే చిన్న గుడ్డ పీలికలు చుట్టుకుని వుండడంవలన కొంత నయం. ఇక మూడో థియేటర్ రమాదేవి లో మలయాళ సినిమా ఆడుతోంది.

మూడు పోస్టర్లు ముక్కున వేలేసుకుంది నూకరత్నం. ఈ మహానుభావుడికి మతి గానీ పోలేదు కదా! చెప్ప పెట్టకుండా సినిమాకి తీసుకువచ్చాడు. పోనీ అదేదో మంచి సినిమాకి తీసుకువెళ్ళొచ్చు కదా! అయినా ఎప్పుడూ పనీ, మనీ, కస్టమరు , సర్వీసు అని తిరిగే ఈ మహానుభావుడికి ఈ రోజు ఇంత తెల్లారగట్లే ఇటు కేసి మనసు మళ్ళిందేమిటబ్బా!

బైక్ ప్రక్కనే తల దించుకుని నిలబడి పరిపరివిధాల ఆలోచిస్తోంది నూకరత్నం. అందరూ తానే వింతగా చూస్తున్నట్టున్నారేమో! అనుకుంది నెమ్మదిగా తల ఎత్తి చూసింది.

అందరూ ఎవరి గోల్లో వారున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలు చెట్టాపట్టాలేసుకు వచ్చారు. ఎవరూ ఎవరినీ పట్టించుకునే పరిస్థితిలో లేరు. అందరూ ఎవరి జంటలతో వాళ్ళు ఏ సినిమా హాల్లో దూరేద్దామా? అన్న ఆతృతతో టిక్కెట్టు బుకింగ్ లైన్లో తోసుకుంటన్నారు.

ఇంతలో బైక్ దగ్గర నూకరత్నాన్ని విడిచి పెట్టి గాబరాగా లోపలకు వెళ్ళిన ఏకాంబరం పరుగున వచ్చాడు.

రా! రత్నం ! సార్! లోపలే వున్నారు. అర్ధగంటలో బయటకు వెళ్ళాలట" అంటూనే నూకరత్నాన్ని

చెయ్యి పట్టి దాదాపు లాక్కుపోతున్నట్టే లాక్కుపోయాడు ఏకాంబర్.

మర బొమ్మలా ఏకాంబర్ వెంట నడిచింది నూకరత్నం. సార్! ఎవరు? అరగంటలో వెళ్ళిపోవడమేమిటీ? అనుకుంటూనే వెళ్ళింది.

జగదాంబ థియేటర్ లోపల ఓ మూల విసిరేసినట్టు వున్న ఓ గది దగ్గరకు నూకరత్నాన్ని తీసుకువెళ్ళాడు ఏకాంబర్. ఆ గది ముందు బయట నాలుగైదు చెప్పులు విడిచి వున్నాయి. ఆ చెప్పుల్ని చూస్తూనే అప్రయత్నం గా ఏకాంబర్, నూకరత్నం కూడా చెప్పులు అక్కడే విడిచి పెట్టేసారు.

గది తలుపులు తోసుకుని లోపలకు అడుగు పెట్టారు ఏకాంబర్, నూకరత్నం. ఆ గదిలో ఎవరో ఇద్దరు ముగ్గురు నిలబడి ఎదురుగా రివాల్వింగ్ చైర్ లో కూర్చున్న అతనితో మాట్లాడుతున్నారు.

ఏకాంబర్ ని, నూకరత్నాన్ని చూస్తూనే ఆయన వాళ్ళని వెళ్ళిపొమ్మని సైగ చేసి వీళ్ళిద్దరికేసి తిరిగి చూసాడు.

"నమస్తే సార్!" అన్నాడు ఏకాంబర్. ఏకాంబర్ అలా అతనికి నమస్కారం చేయడం చూస్తూనే నూకరత్నం కూడా అప్రయత్నం గా రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది.

గదం తా ఏసి తో నిండిపోయి వుందేమో ఎండనపడి వచ్చిన నూకరత్నం మనసుకి ఎంతో హాయిగా వుంది.

ఎంతో ఆహ్లాదం గా వున్న ఆ గదిని ఓ కంట నిశితం గా పరిశీలించింది. గది అంతా సినిమాల తాలూకా షీల్డ్ ల తోనే నిండిపోయింది.

"కూర్చోండి " హుందాగా అన్నాడతను.

ఏకాంబర్ ఆయన ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. నూకరత్నం కేసి చూసి తన ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చోమని సైగ చేసాడు.

"ఏకాంబర్ గారు! ఈ అమ్మాయి గురించేనా మీరు చెప్పింది?" నూకరత్నం కేసి చూస్తూ అన్నాడు అతను.

అవును సార్! ఈమె పేరు నూకరత్నం. అంటూ నూకరత్నం కేసి చూసి చిన్నగా నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

'నీకు ముందే చెప్పాను కదా సార్! ఈ థియేటర్ల యజమాని. రంగారావుగారు. నాకు బాగా కావలిసిన వారు. మా గురువు గారు. అంటూ ఆయన గురించి చెప్పి నూకరత్నానికి పరిచయం చేసాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా అనేసరికి ఏం మాట్లాడాలో అర్థం కాక నవ్వుతూ అవునండి అనేసింది నూకరత్నం.

మీరు ఈ సహాయం చేసి పెట్టండి చాలు! రెండు, మూడు నెలల్లో డబ్బు చేతికందితే చాలు రంగారావుగారన్నారు.

అలాగే సార్! ఆ విషయం ఈమె తోనే మీకు చెప్పిద్ధామని తీసుకువచ్చాను. అన్నాడు ఏకాంబర్.

నూకరత్నానికి తల గిర్రున తిరిగిపోతోంది.. ఏం చెప్పాడు?! ఏం చేయాలి? రెండు మూడు నెలలు ఏమిటీ?! నేను ఈయనకి సహాయం చేయడమేమిటీ? అంతా అగమ్య గోచరం గా వుంది. నూకరత్నానికి

ఇంతలో జగదాంబ థియేటర్ యజమాని రంగారావు గారికి ఫోన్ వచ్చింది.

"మీరు కూర్చోండి! నేను పది నిముషాల్లో వచ్చేస్తాను" అంటూ సెల్ఫోన్ లో మాట్లాడుకుంటూ రంగారావు గారు బయటకు వెళ్ళిపోయారు. గది తలుపులు దబ్ మని మూసుకున్న శబ్దం విని ఒక్కసారే వెనక్కి తిరిగి చూసింది నూకరత్నం. ఆ గదిలో తామిద్దరే మిగిలారు.

ఏంటండీ! ఏదీ చెప్ప చెయ్యకుండా బైక్ మీద లాక్కొచ్చేసారు. తీరా ఇక్కడకొచ్చాక నాకు చెప్పనంటుంన్నారు. ఈ గోలంతా ఏంటండీ బాబూ!" తలమీద చెయ్యేసుకుని ఎదురున వున్న టేబుల్ మీద ముడుకు ఆంచి విచారంగా అంది నూకరత్నం..చెప్పాలనే అనుకున్నాను. ఈయన ఉదయాన్నే ఫోన్ చేసి తనకి డబ్బు అవసరమని చెప్పి ఎవరైనా తెలిసిన వాళ్ళు ఉన్నారా? అని అడిగితే నిన్ను గాబరాగా లాక్కు వచ్చాను" అన్నాడు ఏకాంబర్.

అతని అవసరం నేనెలా తీర్చగలను. మీకు మతిపోయిందా?" చిరుకోపం గా అంది నూకరరత్నం.

రత్నం! నేను చెప్పింది విను. ఈయన మీ శ్రీ రాంచిట్స్ లో కోటి రూపాయల చిట్ కడతాడట. రెండు నెలల్లో నువ్వు ఇప్పించేలా కమిట్ మెంట్ ఇస్తే వెంటనే కడతానంటాడు." నూకరత్నం కళ్ళల్లోకి చూసి చెప్పాడు ఏకాంబర్.

ఏకాంబర్ మాట వింటూనే అదిరిపడింది నూకరత్నం. ఒక్క క్షణం తన చెవులను తానే నమ్మలేకపోయింది. ఏకాంబర్ చెప్పింది నిజమేనా?!" నమ్మలేని నిజం వింటున్నట్టూ మొహం పెట్టి

ఆశ్చర్యం,, ఆనందం, ఆతృత కలగలిపి అంది నూకరత్నం.

నేనైతే అబద్ధం ఆడతాను. విన్నావుగా?! సారే అడుగుతున్నారుగా!" నూకరత్నం మొహం లోకి సూటిగా చూస్తూ అన్నాడు ఏకాంబర్.

"కో...టి...?! ఒక్క చిట్టీ కోటి రూపాయలు... ఎస్! విన్నాను. మా బ్రాంచి మేనేజరు ఎవరికో చెప్పగా విన్నాను. ఆయన్నే అడుగుదాం?! అంటూనే ఎన్.ఎ.డి బ్రాంచి మేనేజరు కరీం కి ఫోన్ చేసింది నూకరత్నం.

"చెప్పండి మేడం అడుగుదాం/" అట్నుండి ఎంతో మర్యాదగా అడిగాడు కరీం.

సార్! మన శ్రీరాం కంపెనీలో కోటి రూపాయల చిట్ వుందా?!" ఆతృతగా అడిగింది నూకరత్నం.

కోటి రూపాయల చిట్టా?! ఇక్కడెక్కడా లేదు. ఈ నెల్లోనే హైద్రాబాద్ జోన్ లో స్టార్ట్ చేస్తున్నారు ఉండండి. నేను రీజనల్ మేనేజర్ గార్ని కనుక్కుంటాను" అంటూనే ఫోన్ కట్ చేసాడు బ్రాంచిమేనేజర్ కరీం.

"సార్ ఆర్.ఎం గార్ని కనుక్కుని చెప్తానన్నారు. నిజంగా ఈయన మన దగ్గర కోటి రూపాయల చిట్ కడతారంటారా??" ఆశ్చర్యం గా అడిగింది నూకరత్నం.

"కడతాననే నాకు ఉదయాన్నే ఫోన్ చేసి ఎవరైనా ఏజెంటు నీకు తెలిసుంటే తీసుకురా ఏకాంబర్ అని పిలిచారు. ఈయన నా దగ్గర ఇన్స్యూరెన్స్ ఎంత కట్టారో తెలుసా? ఏభై లక్షల రూపాయల పాలసీ! వాళ్ళ ఇంట్లో అందరి పేర పాల్సీలున్నాయి" చెప్పాడు ఏకాంబర్.

నాకు ఆశ్చర్యంగా వుంది. నా చెవుల్ని నేనే నమ్మలేకపోతున్నాను. నేనింతవరకూ పాతిక, ఏభై వేలు, లక్ష రూపాయల వరకే చిట్లు కట్టగలిగించాను. నువ్వే మొన్న ఐదు లక్షల రూపాయల చీటీ కట్టావ్! అదే ఎంతో గొప్పగా ఫీలయ్యాను. కానీ ఇది నిజంగా.. మనం కట్టించగలిగితే.. ఎంత బాగుంటుందో?!"

ఆనందం గా అంది నూకరత్నం.

"కట్టడం.. కట్టకపోవడం అంత మీ చేతుల్లోనే వుంది. ఎందుకైనా మంచిది మీ బ్రాంచి మేనేజర్ ని రమ్మను. సార్ కి ఏమైనా డౌట్స్ ఉంటే అడుగుతారు. అవి నీవు తీర్చలేవు." అన్నాడు ఏకాంబర్

"ఎస్! అలాగే!" అంటూ సెల్ తీసి రింగ్ చేద్దామనుకునేంతలోనే బ్రాంచి మేనేజరే ఫోన్ చేసాడు.

చెప్పండి సార్! సెల్ చెవి దగ్గర పెట్టుకుంటూ అంది.

"మేడం! మీరిప్పుడు ఎక్కడున్నారు? నేనూ, మన ఆర్. ఎం గారు కూడా అక్కడకు వస్తాం . మీరు చిట్ కోసం వస్తాం ఎక్స్ ప్లైన్ చెయ్యలేరు" అంటూ అడిగాడు కరీం.

ఆనందం గా జగదాంబా థియేటర్ అడ్రస్ చెప్పింది నూకరత్నం. కోటి రూపాయల చిట్ అంటే మాటలా? ఆర్. ఎం గారే స్వయం గా వచ్చేస్తున్నారు. మనసులోనే సంబరపడింది నూకరత్నం.

"ఏమైంది? వస్తున్నారా?" ఆతృతగా అడిగాడు ఏకాంబర్.

'ఆర్.ఎం గార్ని తీసుకుని వస్తున్నారట. పది నుఇముషాల్లో ఇక్కడ వుంటామన్నారు. సంతోషం గా అంది నూకరత్నం.

"పది నిముషాల్లోనా? ఎలా రాగలరు? చూద్దాం? అని ఏకాంబర్ అంటున్నంతలోనే ఎవరితోనో ఫోన్ లో మాట్లాడుతూ బయటకు వెళ్ళిన జగదాంబ థియేటర్ యజమాని రంగారావు గారు లోపలకు వచ్చారు.

"ఏమమ్మా! నేను చెప్పింది అర్ధమయ్యిందా?" అంటూ లోపలికి వస్తూ రివాల్వింగ్ చెయిర్ లో కూర్చుంటూ అడిగాడు ఆయన. సార్! మీతో మాట్లాడ్డానికి మా బ్రాంచి మేనేజరు, రీజనల్ మేనేజర్లు ఇద్దరూ వస్తున్నారు సార్! నేను కమిట్ మెంట్ ఇవ్వలేను కదా! వాళ్ళయితే మీకూ నమ్మకం వుంటుంది" నమ్రతగా అంది నూకరత్నం.

చాలా కరెక్టుగా చెప్పావమ్మా! కొందరు ఏజెంట్లు అంతా తమ చేతుల్లోనే వున్నట్టు లేనిపోని వాగ్దానాలు చేసేస్తారు. తీరా చిట్టీ కట్టాక మాట నిలబెట్టుకోరు. చిట్ కట్టాక మానెయ్యలేము కదా! మానేస్తే మొదట కట్టిన దాంట్లో ఒక్క రూపాయి కూడా రాదు. ఇలా చాలా మంది దగ్గర దెబ్బ తిన్నాను. అందుకే ఏకాంబర్ మీద నమ్మకం తో తనకు తెలిసిన వాళ్ళను తీసుకురమ్మాన్నాను. అంటూ చిన్నగా నవ్వాడాయన.

నిజమే సార్! మోసం చేసి ఎంత దూరం పారిపోగలం సార్! అంది నూకరత్నం.

ఎదిగేవాడు ఎదరే హుందాగా నిలబడతాడమ్మా. ఎగరాలనుకునేవాడు ఎవరికీ కనిపించకుండా పోతారు. ఎవరైనా ఎవర్నైనా ఒక్కసారే మోసం చెయ్యగలరు. అంతే! నవ్వుతూ అన్నాడాయన.

చాలా బాగా చెప్పారు సార్ అన్నాడు ఏకాంబర్.

"వాళ్ళు ఎంత సేపట్లో వస్తారో? కాఫీ, టీ ఏం తీసుకుంటారు?" అడిగాడు థియేటర్ ఓనర్ రంగారావు గారు.

సార్! అవేం వద్దు సార్! ఇంటి దగ్గర తీసుకునే బయల్దేరాం" అన్నాడు ఏకాంబర్.

"పోనీ ఒక పని చెయ్యండి. వాళ్ళు వచ్చేవరకూ థియేటర్లో కూర్చుని సినిమా చూస్తారా? అడిగారు రంగారావు గారు.

అయ్యో! వద్దండి. అలా బయట తిరిగి వస్తాం" అంది నూకరత్నం గాబరాగా.

"అలాగే చెయ్యండి. నేనీ లోపల నా కోసం ఒకరిద్దరు బయట వెయిట్ చేస్తున్నారు. వాళ్ళతో మాట్లాడి పంపించేస్తాను." అన్నారాయన.

అలాగే సార్ అంటూ కుర్చీలోనుండి లేచి వెలుపలకు వచ్చారు ఇద్దరు. జగదాంబ సెంటర్ అంతా వచ్చీపోయే వాహనాలతో మహా రద్దీగా వుంది.

"ఎక్కడికీ వెళ్దాం?" ఆలోచిస్తూ అన్నాడు ఏకాంబర్.

"ఎక్కడికి వెళ్దాం అదిగో! ఆ బస్సు స్టాండులో కూర్చుందాం. మా బ్రాంచి మేనేజరు రాగానే నాకు ఫోన్ చేస్తారు కదా! అంది నూకరత్నం.

"అక్కడ్దొద్దులే" ఎవరనా చూస్తే మనల్ని కూడా పనీ పాటు లేని పోరంబోకులో జమకట్టేస్తారు. ఈ ప్రక్కనే ఆర్య భవన్ హొటల్ వుంది. లైట్ గా ఏదైనా తిని వద్దాం." అంటూ అటుకేసి నడిచాడు ఏకాంబర్.

ఏకాంబర్ ని అనుసరించింది నూకరత్నం.

ఇద్దరూ ప్రక్క ప్రక్కనే నడుస్తూ జగదాంబ నాలుగు రోడ్ల జంక్షన్ లో వున్న ఆర్యభవన్ హొటల్ కేసి వెళ్తున్నారు. ఇంతలో ఎదురుగా బైక్ మీద వస్తున్న ఓ వ్యక్తిని చూస్తూనే గబుక్కున ఏకాంబర్ వెనక్కి వెళ్ళి నక్కి దాక్కుంది నూకరత్నం. ఏకాంబర్ చేయి పట్టుకుని తల ఏకాంబర్ భుజం మీద వాల్చేసి నక్కి నక్కి నడుస్తూ ఏకాంబర్ ని అంటుకుపోయింది నూకరత్నం.

ఏమైంది? అలా దాక్కుని నడుస్తున్నావ్? నూకరత్నం అలా తనని హత్తుకుపోయేసరికి ఏకాంబర్ శరీరం జలదరించింది. నెమ్మదిగా ఆమె బుజాల మీద చెయ్యి వేసి ఆప్యాయం గా పట్టుకుంటూ అన్నాడు ఏకాంబర్.

" మా మామయ్య గారి అబ్బాయి, బైక్ మీద వెళ్తున్నాడు. ఇలా చూస్తే చంపేస్తారు. భయం గా అంది నూకరత్నం.

"నువ్వేం తప్పు చెయ్యటంలేదు కదా! అయినా నువ్విప్పుడు సంపాదిస్తున్నావ్ కదా! నీ ప్రొఫేషన్ లో ఇలాంటివి తప్పు కాదు కదా" నవ్వుతూ అన్నాడు.

సంపాదిస్తే సాంప్రదాయాన్ని సంస్కారాన్ని వదిలెయ్యాలా?! సంపాదన కోసం గౌరవ మర్యాదల్ని చంపేసుకోవాలా?" కొంచెం దూరం వెళ్ళాక ఏకాంబర్ చేయి విడిచి పెట్టి నడుస్తూ అంది నూకరత్నం.


29వ
భాగం
సీరియల్
ఏజెంట్ ఏకాంబర్
ఇందూరమణ



జరిగిన కథ:

ఏకాంబర్, నూకరత్నాన్ని థియేటర్ ఓనర్ రంగారావు గారి దగ్గరకు తీసుకువస్తాడు. రంగారావు గారు కోటి రూపాయల చిట్టీ కడతారనేసరికి నూకరత్నం ఆనందాశ్చర్యాలకు లోనవుతుంది......... ఇంకా చదవండి.....

ఇది భయం కాదు బాబూ! బాధ్యత. నా మీద నాకున్న గౌరవం. అది పోతే బ్రతికినా చచ్చినట్టే కదా! అంది తల దించుకుని.

"సార్.... అంటూ హొటల్ కి వెళ్ళి ఖాళీగా ఉన్న టేబుల్ దగ్గర కూర్చున్నాడు ఏకాంబర్. పక్కనే కుర్చీలో కూర్చుంది నూకరత్నం.

'ఏం తీసుకుంటావ్?" నూకరత్నాన్ని అడిగాడు ఏకాంబర్.

"మాకు లేదా?" వెనుక నుండి అడిగేసరికి ఏకాంబర్. నూకరత్నం. ఒక్కసారి ఉలిక్కిపడి వెనక్కి చూసారు.

ఎవరో ఇద్దరు వ్యక్తులు టిప్ టాప్ గా తయారయి వున్నారు. ఇద్దరూ టక్ చేసుకుని దొరబాబుల్లా వున్నారు.

ఆ వ్యక్తి మెడలో లెదర్ బ్యాగ్ వేలాడుతోంది.

ఆ ఇద్దరినీ ఆశ్చర్యం గా చూసాడు ఏకాంబర్. అంతలో వాళ్ళెవరో గ్రహించి చిన్నగా నవ్వేసాడు. నమస్తే సార్...! మేమిక్కడ వున్నామని ఎలా తెలిసింది సార్. ఆశ్చర్యం గా అడిగింది .

"మీరు అట్నుండి నడిచి వస్తూ ఈ హొటల్ లో దూరడం బైక్ మీద వస్తూనే చూసాం. నవ్వుతూ చెప్పాడు బ్రాంచి మేనేజర్ కరీం.

ఏకాంబర్ కూడా కుర్చీలోనుండి లేచి నిలబడి వాళ్ళిద్దరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాడు.

'బై ది బై " నా పేరు ఏకాంబర్ సార్! నేను జీవిత భీమా ఏజెంటు గా చేస్తున్నాను." తనని తాను వాళ్ళిద్దరికీ

పరిచయం చేసుకున్నాడు.

రండి సార్ టిఫిన్ చేద్దాం! వాళ్ళిద్దరినీ ఆహ్వానిస్తూ అంది నూకరత్నం.

లేదు లేదు మేమిప్పుడే తినేసి వచ్చాం. మీరు కానివ్వండి మేము బయట వెయిట్ చేస్తాం. అన్నారు రీజనల్ మేనేజర్.

మాకూ ఆకలి లేదు సార్! మీ కోసం రోడ్డు మీద నిలబడలేక ఈ హెూటల్ కి వచ్చాం. పదండి వెళ్దాం.' అంటూ ఏకాంబర్ హెూటల్ లోనుండి బయటకు వచ్చేసాడు. అతని వెనుకే నడిచింది నూకరత్నం.

నలుగురూ అరక్షణం లో జగదాంబ థియేటర్ దగ్గరకు వెళ్ళారు. థియేటర్ ఓనర్ రంగారావు గారు థియేటర్ ఆవరణలో ఎవరితోనో పచ్చాపాటి మాట్లాడుతూనే ఏకాంబర్ రావడం గమణించి ఆయనే వారిని పలకరించారు.

రండి!..రండి! ఏకాంబర్! వాళ్ళొచ్చినట్టున్నారు కదా! పదండి నా కేబిన్ లో కూర్చుందాం!" అంటూ ఆయన తన గదికేసి వడివడిగా నడిచారు.

రంగారావు గారి వెనుక నలుగురూ ఆయన గదిలోకి వెళ్ళారు. థియేటర్ యజమాని రంగారావు గారు కుర్చీలో కూర్చుంటూనే అటెండర్ ని పిలిచి అయిదుగురికీ కూల్డ్రింక్ లు తెమ్మన్నారు

నమస్తే సార్! వీరు మా శ్రీరాం చిట్స్ రీజనల్ మేనేజర్ గారు సార్! వీరు బ్రాంచి మేనేజరు కరీం గారు! ఇద్దర్నీ రంగారావు గారికి పరిచయం చేసింది నూకరత్నం.

ఏకాంబర్ మౌనం గా కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ  అతనికి పరిచయం లేదు. తను రెండు, మూడు ప్రైవేట్ కంపెనీలకు తీసుకెళ్ళి నూకరత్నాన్ని పరిచయం చేసాడు. అవి స్థానికం గా వున్న వాళ్ళవి. ఎవరైనా చీటీ పాడుకున్నా జామీను విషయం లో అంతగా పట్టుబట్టరు. ఇలాంటి రాష్ట్ర వ్యాప్త కంపెనీల్లో అయితే నూకరత్నం నెగ్గుకురాగలదో లేదోనని నీటి జోలికే వెళ్ళలేదు.

కానీ, తన కంటే రెండడుగులు ముందుకేసి శ్రీరాం చిట్స్ లోనూ, మార్గదర్శి చిట్స్ లోకూడా ఏజెంటుగా జాయిన్ అయ్యానని చెప్పింది. ఆమెను నిరుత్సాహ పరచకూడదని మౌనంగా అర్ధాంగీకారం గా తల ఊపేసాడు తను. ఈ రెండు నెలల్లో రెండు చోట్లా బాగానే వ్యాపారం చేస్తోంది. తనకి కూడా నూకరత్నం మీద నమ్మకలిగింది.

చాలా మంది ఈ రెండిటిలోనైతేనే చిట్స్ కడతామని మిగతావి అయితే వద్దని అంటున్నారు. అందుకే

నీకు చెప్పకుండానే ఈ రెండు కంపెనీల్లో     ఏజెంటు గా జాయిన్ అయ్యాను. క్షమిచ్.అండి అంది ఆ తరువాత

"నిజమే రత్నం! నేను నీకు స్విమ్మింగ్ ఫూల్ లో ఈత నేర్పాలనుకున్నాను. నువ్వు ఏకంగా సముద్రం లోనే ఈత కొడతానంటావ్! అది నీమీద నీకున్న నమ్మకం. ఆల్ దిబెస్ట్ అంటూ ఆమెని వెన్ను తట్టాడు.

ఆ తరువాత తనూ ఐదు లక్షల రూపాయల చిట్ కట్టాడు. ఆమెలో ఆత్మ విశ్వాసం మెండుగా వుంది.

దానికి ప్రోత్సాహం కావాలి. అందుకే జగదాంబ థియేటర్ యజమాని రంగారావుగారు డబ్బు అవసరం వుందని ఎలా అని అడిగితే ఈ చీటీ సలహా తనే ఇచ్చాడు. అయన కూడా వెంటనే నీకు బాగా తెలిసిన ఏజెంటుని పట్టుకురా అని చెప్పాడు. వెంటనే నూకరత్నాన్ని తీసుకువచ్చాడు.

"ఏకాంబర్ నాకు బాగా కావలిసినవాడు. నాకు వెల్ విషర్! ఆయన తరుపున వచ్చారు కనుక మిమ్మల్ని నేను విశ్వసిస్తున్నాను. నాకు అర్జెంటుగా డబ్బు అవసరముంది. బ్యాంకులకు వెళ్తే అంత తొందర అయ్యేది కాదు. అందుకే మీ దగ్గర చీటీ కట్టాలనుకున్నాను" అన్నారు రంగారావుగారు.

రంగారావుగారు ఏమన్నారో ఏకాంబర్ వినలేదు. పక్కనే కూర్చున్న నూకరత్నం ఏకాంబర్ తొడ మీద గట్టిగా గిల్లేసరికి ఇహానికి వచ్చి సర్దుకు కూర్చున్నాడు.

అవునా ఏకాంబర్ మళ్ళీ రంగారావుగారే అన్నారు.

ఆ1.. ఆ!.. అవును సార్! తడబడుతూ అనేసాడు ఏకాంబర్.

"సార్! మా కంపెనీలో కోటి రూపాయల చిట్ ఉంది. కానీ ఇక్కడ మన వైజాగ్ జోన్ లో ఎక్కడా లేదు. మీకు అభ్యంతరం లేకపోతే హైదరాబాద్ జోన్ లో ఈ నెల్లోనే స్టార్ట్ చేస్తారు. అందులో చేరండి " చెప్పాడు రీజినల్ మ్నేజర్.

"ఎక్కడైతే నాకేంటి! అది మీ కంపెనీ నాక్కావలసింది మనీ... రెండు నెలల్లో చిట్ పాడి ఇప్పించగలరా? అడిగారు రంగారావుగారు.సార్! కమిట్మెంట్ అయితే మా చేతుల్లో లేదు. హైదరాబాద్ జోనల్ ఆఫీసులో మాట్లాడి చెబుతాను.జస్ట్ ఫైవ్ మినిట్స్" అంటూనే రీజినల్ మేనేజర్ వెంటనే హైదరాబాద్ కి ఫోన్ చేసాడు. ఫోన్ కలవగానే గది బయటకు వెళ్ళి మాట్లాడి వచ్చాడు

సార్! మాట్లాడాను. ఒక్క చిట్ కడితే కమిట్ మెంట్ ఇవ్వడం జరగదట సార్! డ్రాలో వస్తే మీ లక్. కానీ, అది కష్టం. రెండో నెలలోనే చిట్ కావాలంటే కనీసం మీ ద్వారా మూడు చిట్ లు వుంటేనే గానీ కమిట్మెంట్ ఇవ్వలేమంటున్నారు. సార్!' చెప్పాడు ఆర్.ఎం.

రీజినల్ మేనేజర్ అలా అనేసరికి నూకరత్నం గుండెల్లో రాయి పడ్డట్టయింది. ఇలా అయితే ఆయనెందుకు చిట్ కడతాడు.. మనసులోనే డీలా పడిపోయింది నూకరత్నం.

మూడు చిట్ లంటే కట్టాలి కదా సార్! ఒక చిట్ కి నెలకు రెండు చిట్లు కట్టాలి[' ఆలోచిస్తూ అన్నాడు రంగారావుగారు.నెలకు రెండు లక్షలైనా మీకు డెబ్భైవేల వరకూ డివిడెండ్ వస్తుంది కదా సార్1 లక్షా ముప్పై వేల వరకూ కట్టాల్సి వస్తుంది. ఇది ఇలా ఓ ఇరవై నెలల వరకూ గ్యారెంటీగా వుంటుంది. మళ్ళీ ఆర్.ఎం గారే అన్నారు.

"రెండు చిట్స్ అయితే నేను కట్టగలనండి. నాకు వేరే ఇంకా చాలా కమిట్ మెంట్లు వుంటాయి కదా! ఒక చిట్ రెండో నెల ఇప్పిస్తే రెండోది మీ ఇష్టం! ఎప్పుడు తక్కువగా వెళ్తే అప్పుడు పాడుకుందాం. మీ వాళ్ళతో మాట్లాడి చెప్పండి.! హుందాగా అన్నారు రంగారావుగారు.

రంగారావు గారు రెండు చిట్ లనేసరికి నూకరత్నం గుండెల్లో ఆనందం కట్టలు తెంచుకుంది. భగవంతుడా ఆయన అడిగినట్టు రెండో నెల కమిట్మెంట్ ఇచ్చేలా చూడు స్వామి అంటూ దేవుళ్ళందరికీ మొక్కుకుంది నూకరత్నం మనసులోనే.

సార్! హైద్రాబాద్ ఫోన్ చేసి చెప్తాను. సార్ మీ గురించి కూడా చెప్పాను. మీ ప్రొఫైల్ అడిగారు చెప్పాను. అంటూ సెల్ పట్టుకుని గది బైటకు వెళ్ళాడు రీజినల్ మేనేజర్.

సార్! మీలాంటి వాళ్ళు మా కంపెనీ కస్టమర్లయితే ఎంతో అదృష్టం సార్! మీకు తప్పకుండా కమిట్ మెంట్ ఇప్పించి తీరుతారు. మా ఆర్.ఎం. సార్! మీకు అభ్యంతరం లేకపోతే ఈ గ్రూప్ లో మీకు తెలిసిన ఫ్రెండ్స్ ఎవరైనా చిట్ కడతారేమో పేర్లు చెప్తే మేము వెళ్ళి కలుస్తాము సార్! నమ్రతగా అడిగాడు బ్రాంచి మేనేజర్ కరీం.కడతారు. చాలామంది కడతారు. వెళ్ళి అడగండి! నా పేరు చెప్పండి పర్వాలేదు. నేను కూడా కడుతున్నానని చెప్పండి! పర్వాలేదు. ఇందులో దాపరికం ఏముంది? నవ్వుతూ అన్నారు రంగారావు గారు.

థేంక్యూ సార్! ఆనందంగా అన్నాడు కరీం. ఇంతలో రీజనల్ మేనేజర్ వచ్చాడు గదిలోకి.సార్ వాళ్ళను ఒప్పించాను సార్! మీలాంటి పెద్ద కస్టమర్ ని ఒదులుకోలేం కదా సార్1 కానీ చిన్న రిక్వెస్ట్! రెండో నెల చిట్ పాడితే మూడో నెలలో పేమెంట్ అందుతుంది. లిక్విడ్ షూరిటీ మాత్రం తప్పనిసరి కావాలి సార్! అలాగే ఇంకంట్యాక్స్ రిటన్స్ కావాలి. ఇవి రెడీ చేసుకోండి సార్. నవ్వుతూ చెప్పాడు రీజినల్ మేనేజర్.

ఆ మాట వింటూనే జగదాంబ థియుఏటర్ రంగారావు కంటే అమితంగా ఆనందపడింది నూకరత్నం.అయితే తన హావభావాలను ఎక్కడా బయటపెట్టకుండా కూర్చుంది.నేనిప్పుడు మీకెంతకు చెక్ ఇవ్వాలి? చెక్ బుక్ తీస్తూ అడిగారు థియేటర్ ఓనర్ రంగారావు గారు.

సార్! ఈ రెండు చిట్స్ అప్లికేషన్స్ నింపాలి సార్! రెండు చిట్స్ కు విడివిడిగా రెండు చెక్కులు రాసి ఇవ్వండి. అంటూనే ధరఖాస్తులు తీసి గబగబా నింపేసాడు ఆర్.ఎం.

సార్! మీరు చిట్ లు అయితే తీసుకుంటామన్నారు . అంత గౌరవంగానే చిట్ పాట కాగానే మా సార్ కి అనుకున్న సమయానికి చెక్ పేమెంట్ చెయ్యాలి. మళ్ళీ మాకు మాట రాకూడదు. అంతవరకూ మౌనం గా ఉన్న ఏకాంబర్ గొంతు విప్పి అన్నాడు.

అదేం లేదు సార్! మీకు,మేడం గారికి మాట రాకుండా చూసే భాద్యత మాది అన్నాడు బ్రాంచి మేనేజర్ కరీం.|

చిట్ ధరకాస్తు నింపిన వెంటనే వారు చెప్పినట్లు శ్రీరాం చిట్స్ కంపెనీ పేర రెండు చెక్కులురాసి ఇచ్చేసారు జగదాంబ థియేటర్ ఓనర్ రంగారావుగారు.

రంగారావు గారు చెక్కులు రెండూ రాసి సంతకం చేసి నూకరత్నం చేతికే ఇచ్చారు. ఆయన అంత గౌరవం గా తన చేతికే చెక్కులు ఇవ్వడంతో ఎంతో సంతోషం గా అవి అందుకుని "థేంక్యూ సార్" అంది అప్రయత్నం గానే.సార్! వస్తాం సార్! మీకెలాంటి అవసరం కలిగిన మా మేడం కి చెప్పండి సార్! మేం వెంటనే వస్తాం సార్! చిన్న రిక్వెస్ట్ మీకు తెలిసిన వాళ్ళెవరైనా వుంటే పేర్లు చెప్తే మేమే వెళ్ళి కలుస్తాం! ప్లీజ్" మర్యాదగా షేక్ హేండ్ ఇస్తూ అడిగారు రీజినల్ మేనేజర్.

ఇప్పుడె మీ బ్రాంచి మేనేజర్ కూడా అడిగారు. చెప్పాను. ఈ వైజాగ్ లో ఏ థియేటర్ వారినైనా, షాపిగ్ మాల్ వాళ్ళనైనా సరే నా పేరు చెప్పి అడగండి. కావాలంటే మీరు కలిసాక నాకు ఫోన్ చెయ్యండి

నేను చెప్తాను. అంటూ ఆయన ముగ్గురికీ షేక్ హేండ్ ఇచ్చి నూకరత్నం తో అన్నారు.

"నీ గురించి మా ఏకాంబర్ చెప్పాడమ్మా! కష్టపడితే ఫలితం ఉంటుంది. ఆల్ ది బెస్ట్ అన్నారు.

"చాలా థాంక్స్ సార్! అంది నూకరత్నం.

సార్! మళ్ళీ కలుస్తాం" ఏకాంబర్ అన్నాడు. నలుగురూ ఉత్సాహంగా, ఆనందంగా ఆ గదిలోనుండి బయటకి వచ్చారు. థియేటర్ ఆవరణ దాటి రోడ్డు మీదకి వచ్చారు.

మేడం కంగ్రాట్స్! మీరింకా ఇలాంటి పెద్ద పెద్ద చిట్స్ చాలా చెయ్యాలి. మన జోనల్ లో అయితే పాతిక లక్షలు వరకే వున్నాయి. వాటి మీద దృష్టి పెట్టండి. సార్ పేరుతో మనం మిగతా థియేటర్ వాళ్ళని, షాపింగ్ వాళ్ళని కలుద్దాం. మీకు వీలయితే రోజుకు ఒకరిద్దరినీ కలుద్దాం. ఆల్ ది బెస్ట్ అంటూ రీజినల్ మేనేజర్ నూకరత్నానికి అభినందనలు తెలిపాడు.

అలాగే సార్! మీ సహాయ సహకారాలు వుంటే ఇంకా బాగా చేస్తాను. సార్! థేంక్యూ సార్! శ్రమ అనుకోకుండా వచ్చారు" ఆనందం గా అంది నూకరత్నం.

ఇది మా డ్యూటీ మేడం అన్నారిద్దరూ ఒక్కసారే. కలుద్దాం సార్! వుంటాను అంటూ వాళ్ళిద్దరికీ ఏకాంబర్ కూడా థేంక్స్ చెప్పి షేక్ హేండ్ ఇచ్చాడు. రీజినల్ మేనేజర్, బ్రాంచి మేనేజర్ అలా వెళ్ళగానే ఏకాంబర్ బైక్ వెనుక కూర్చుంటూనే ఆనందం గా ఏకాంబర్ మీద వాలిపోతూ బుగ్గ మీద చిన్నగా ముద్దు పెట్టుకుంది నూకరత్నం.

నూకరత్నం బైక్ మీద కూర్చుంటూ మీద పడి స్ప్లిట్ సెకండ్ లో అంత తియ్యగా ముద్దిస్తుందని ఏకాంబర్ ఊహించనైనా ఊహించలేదు. ఆశ్చర్యం ఓ షాకయ్యాడు.


ఏంటిది? చిన్న పిల్లలా! పట్టపగలు... నడిరోడ్డుమీద... జనాలతో రద్దీగా వుండే జగదాంబ జంక్షన్ లో పబ్లిక్ గా బైక్ మీద ఒక మగాన్ని ఒక ఆడపిల్ల ఇంత ధైర్యం గా ముద్దుపెట్టుకుంటూనే ఎంతమంది చూసుకుంటారో కదా! ఔరా! నీకు సిగ్గు లేదా? బైక్ స్టార్ట్ చేసినా బ్రేకు మీద కాలేసి నూకరత్నం కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

ఈ క్షణం ..... ఈ ఆనందం.... ఈ తన్మయత్వం... నువ్వే కదరా నా జేంస్ బాండ్! బెస్ట్ బాయ్ ఫ్రెండ్! అందుకే సంతోషం పట్టలేక చిన్న కిస్... అదీ బుగ్గ మీదే కదా ఇచ్చాను. ఎవరూ లేకపోతే ? చుట్టేసుకుంటూ అంది నూక రత్నం.

'సరి సరి! జాగ్రత్తగా కూర్చో ! అంటూ బైక్ ని ముందుకు ఉరికించాడు ఏకాంబర్.

రెండు కోట్లు... రెండు లక్షలు... రెండు కోట్లు... రెండు లక్షలు మనసులో ఉబ్బితబ్బిబవుతూ.....



జరిగిన కథ:

జగదాంబ థియేటర్ ఓనర్ రంగారావు గారు ఎట్టకేలకు రెండు చెక్కులు రాసి సంతకం చేసి నూకరత్నం చేతికి ఇస్తారు. నూకరత్నం ఆనందంతో ఉబ్బితబ్బిబవుతుంది.

ఆనందోత్సాహాలతో తేలిపోతూ కూర్చుంది నూకరత్నం. రాబోయే రెండు లక్షల కమీషన్ కళ్ళముందు

కనిపిస్తోంది నూకరత్నానికి

ఆ రోజు ఎప్పటిలాగే తెల్లారేసరికి తయారయ్యి బయలుదేరాడు ఏకాంబర్. ఆ నెలంతా సరిగ్గా ఇన్స్యూరెన్స్ బిజినెస్ జరగలేదని కంగారుగా వున్నాడు ఏకాంబర్.

పై పెచ్చు జోనల్ లెవల్ లో కాంపిటీషన్ ఒకటి అనౌన్స్ చేసి ఏజెంట్లకు బహుమతులు, విదేశాలకు ట్రిప్స్ ప్రకటించారు. ఆ నెలం తా కాస్త డల్ గా వుండేసరికి ఏకాంబర్ రెండో స్థానానికి పడిపోయాడు. దాంతో బ్రాంచి మేనేజర్, డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల కూడా ఏకాంబర్ కు క్లాసు తీసుకున్నారు.

"ఏకాంబర్ నీ వ్యాపారం దెబ్బ తింటోంది. ఎవరికో సాయం చేద్దామని నీ వునికిని నువ్వు కోల్పోతున్నావ్ జాగ్రత్త! ఈ కేంపెయిన్ లో ఫెయిల్ అయితే తర్వాత తర్వాత వెనుకబడిపోతావ్.! అంటూ మిత్రుడు, డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల చాలా సున్నితం గా ఏకాంబరాన్ని హెచ్చరించాడు.

ఏకాంబరానికి కూడా పంతంగానే వుంది. ఐదేళ్ళలో ఇదే మొదటిసారి రెండోస్థానానికి దిగజారడం. తన ఏకాగ్రత సడలిపోతుందేమోనని భయపడిపోయాడు.

బ్యాగ్ భుజాన తగిలించుకుని బయలుదేరుతూ తల్లిని కేకేసి పిలిచాడు ఏకాంబర్.

అమ్మా! నేను వెళ్తున్నాను.! తలుపువేసుకో ! అని గట్టిగా కేకేసేసరికి తండ్రి పీతాంబరం లేచివచ్చాడు.

మద్యాహ్నం ఇంటికొస్తావా? అని అడిగాడు. పీతాంబరం.

ఏమో! టైం ను బట్టి వస్తాను. లేదా బయట భోజనం చేస్తాను చెప్పాడు ఏకాంబర్.

"పోనీ మధ్యలో ఎప్పుడైనా షాపు దగ్గరకు వస్తావా? అడిగాడు తండ్రి పీతాంబరం

ఎందుకు నాన్న? నా కసలే వ్యాపారం జరగక చాలా చిరాగా వుంది. నాతో ఏమన్నా పని వుందా? అసహనం గా అడిగాడు ఏకాంబర్.

ఇంటికోసం ప్లాన్ వేయించమన్నావు కదా! ఆ ఇంజనీర్ గారు నిన్నేమన్నా కలవమన్నారా? చెప్పాడు తండ్రి.

అంతే కదా! సాయంత్రం వేగంగా వస్తాను. ఇద్దరం కలిసి ఆయన దగ్గరకు వెళ్దాం. సరేనా?" అన్నాడు ఏకాంబర్.

అలాగే నువ్వెళ్ళిరా! అంటూ ఏకాంబరాన్ని సాగనంపి తలుపులు వేసాడు పీతాంబరం.

ఇంతలో పర్వతాలు నిద్ర కళ్ళతో లేచివస్తూ ఏంటండీ? దేనికి పిలిచారు? అంటూ హాల్లోకొచ్చింది.

నేను కాదు, నీ కొడుకు వెళ్ళిపోయాడు. అంటూ గదిలోకి వెళ్ళి మంచం మీద బద్ధకంగా వాలిపోయాడు పీతాంబరం.

వంట గదిలోకి వెళ్ళి స్టవ్ వెలిగించి టీ పెట్టింది పర్వతాలు.

టీ మరిగించి గ్లాసులో పోసి భర్త పీతాంబరం దగ్గరకు వచ్చింది . గదిలో మంచం మీద బోర్లా పడుకున్న మొగుడ్ని తట్టి గట్టిగా లేపింది.

ఈ రోజు ఎందుకో నీరసం గా వుంది. కాస్త పడుకోనివ్వవే చిరాగ్గా    అన్నాడు పీతాంబరం.

పడుకోండి ఎవరొద్దన్నారు. కాస్త ఈ టీ త్రాగేసి పడుకోండి. అంటూ గ్లాసు చేతికందిచ్చింది.

మంచం మీదే టీ సిప్ చేస్తూ కూర్చున్నాడు.

పర్వతాలు కూడా తనకోసం ఒక గ్లాసులో టీ తెచ్చుకుని మొగుడు ప్రక్కనే మంచం మీద కూర్చుంది. ఏంది విషయం? పనుంటేగనీ పక్కకు రావుకదా! ఏదైనా చెప్పాలా?! పెళ్ళాన్ని అడిగాడు పీతాంబరం.

"కూతురి విషయం మర్చిపోయారా? అడిగింది పర్వతాలు.

లోపల గదిలో పడుకుంది కదా! అడిగాడు.

మీ తెలివి సంతకెళ్ళా, దాని పెళ్ళి సంగతి నిలదీసింది.

చూసెళ్ళారు కదా! వాళ్ళడిగినంత ఇచ్చుకోవద్దా? ఆలోచిస్తూ అన్నాడు పీతాంబరం.

ఎంతడిగారండీ? అదేదో ఇద్దరు పిల్లలముందు పెడితే వాళ్ళే ఏదో చెప్తారు. కాస్త మీరు చెయ్యేస్తే అదేమంత కట్నం? అంది పర్వతాలు.

చిన్నోడు ఏం చెప్పినా సరే అంటాడు. పెద్దోడి పరిస్థితి అర్థం కాదు. జీతం పంపడు? ఎంతో చెప్పడు.? ఇవ్వగలదో లేదో తేల్చడు! చూద్దాం కష్టమంతా చిన్నోడి మీద నెట్టేయడం భావ్యం కాదు. అన్నాడు పీతాంబరం.

కష్టాలు, నష్టాలు సంగతి సరేనండి. ఆలస్యం చేస్తే మనకే ఇష్టం లేదని పెళ్ళివారు వేరేదారి వేరే సంబంధాలు వెదుకుతే సంసయే కదా! అంది పర్వతాలు.

నిజమేలేవే తెల్లారనీ , పెళ్ళిళ్ళ పేరయ్యకి కబురు చేద్దాం. ఈ వారం లో మంచిది చూసి మనమూ పెళ్ళివారింటికీ వస్తామని కబురు పెట్టమని చెప్తాం . అన్నాడు పీతాంబరం.

పిల్ల పెళ్ళయ్యేవరకూ ఇళ్ళు కట్టే ప్రయత్నం మానుకోండి. అటో కాలు ఇదో కాలు అయిపోతుంది. సీరియస్ గానే అంది పర్వతాలు.

ఇంకా లేదే! ప్లాన్ గట్రా అయ్యాక చిన్నోడు వాళ్ళ ఇన్సూరెన్స్ కంపెనీలో ధరఖాస్తు చెయ్యాలి కదా! అది ఆమోదం పొంది రావాలి. ఆ తర్వాత కదా ఇంటి నిర్మాణం. ఈ లోగా పిల్ల పెళ్ళయిపోతుంది. అన్నాడు పీతాంబరం.

అలా అయితే పర్లేదు చూస్కోండి.! పెళ్ళికి ఎటువంటి ఆటంకం కలుగకూడదు. అంది పర్వతాలు

చిన్నోడు ఈ రోజు ఎందుకో చిరాగ్గా వున్నాడు. ఎప్పుడూ వాన్ని అలా చూడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు పీతాంబరం.

పాలసీలేవో తక్కువయ్యాయట., రాత్రి చెప్పాడు. ఈ నెలాఖరులోగా తన టార్గెట్ ఏదో పూర్తి చెయ్యాలట, వివరం గా చెప్పాడు అంది.

ఈన్నాళ్ళయింది ఏనాడూ ఇంత దిగులు పడలేదు. కొత్తలోనే ఉత్సాహం గా తిరిగాడు. ఇప్పుడు ఏం కష్టమొచ్చిందే? అడిగాడు పీతాంబరం.

వీడి వీడు చేసుకుంటే బాగుండేది. మధ్యలో ఆ పిల్లకెవరికో ఆఫీసు పెట్టిమహాడు కదా! రోజంతా ఆ పిల్లకి సహాయం చేయడం కోసం తిరిగితే మరి వీడు వెనుకపడడా?! అడిగితే బాధపడుతాడని అడగలేదు నిష్టూరం గా అంది పర్వతాలు.

అవునవును నేను చూస్తున్నాను. మొదట వీడి ఆఫీసులో పనికి కుదిరించుకున్నాడు. కాదని అక్కడున్న అమ్మాయిలు చెప్పారు. ఆ పిల్లకి కూడా ఏదో ఏజెన్సీలు వీడే ఏర్పాటు చేసాడట. పెళ్ళానికి చెప్పాడు పీతాంబరం.

ఆ విషయం మీ కొడుకే నాకు చెప్పాడు. పోనీలేరా నలుగురికి దారి చూపించడం మంచిదేలే అని నేనే అన్నాను. నా మతిమండ దారిచూపిస్తాడనుకున్నాను గాని, దారి పొడవునా తోడుంటాడనుకోలేదు. నిన్నటికి నిన్న ఎక్కడో జగదాంబ జంక్షన్ దగ్గరకెళ్ళి రెండు కోట్లు చిట్ లు కట్టారట. ఇంటికొచ్చి ఆనందం గా నాకు చెప్పాడు. కమీషన్ అమ్మాయికి కష్టం వీడికి కష్టం వీడికి అంది పర్వతాలు కోపంగా..

"వాడు నీతో అన్నాడా?" ఆశ్చర్యంగా అన్నాడు పీతాంబరం.

వాడెందుకంటాడు? వాడు ఆనందంగానే వున్నాడు. నేనే అంటున్నాను. రెండు లక్షలు.... రెండు లక్షలు    కమీషనొస్తోందట. అందులో సగమన్నా ఆ పిల్ల వీడికివ్వాలి కదా! అంది పర్వతాలు.

ఏమో! ఇస్తుందేమో నీ కొడుకు అంత తెలివితక్కువ వాడు కాదు కదా? అన్నాడు పీతాంబరం.

ఆ పిల్ల ఇచ్చినా వీడు పుచ్చుకుంటాడో లేదో ? కదా!    రోకు మీద వున్నాడు. ఆ పిల్ల రోకలి మింగమన్నా మింగేసేలా వున్నాడు విచారంగా అంది పర్వతాలు.

పోనీలేవే ? కక్కిన కూడుకు ఆశ పడకూడదు. మన వాడి డబ్బేం ఇచ్చెయ్యటం లేదు కదా! ఆ పిల్ల కూడా అనువైనదే! మనవాడికి అంతకన్నా మించిన దాన్ని తేగలమా!? ఎవరి తలరాత వాళ్ళది? నువ్వూ నేనూ మార్చగలమా చెప్పు" భార్యకు బోధపరుస్తూ అన్నాడు.

సరి సరే! లెండి తెల్లగా తెల్లారిపోయింది. బోలెడన్ని పనులు అంటూ లేచి వంట గదిలోకి వెళ్ళిపోయింది పర్వతాలు.

పెళ్ళాం పర్వతాలు రుసరుసగా వెళ్ళడం చూసి ముసిముసిగా నవ్వుకున్నాడు పీతాంబరం.

ఉదయాన్నే కష్టమర్లందర్నీ కలిసి పదో గంటకి గోపాలపట్నం చేరుకున్నాడు ఏకాంబర్.

అప్పటికే ఆఫీసు తెరచి వుంది. నూకరత్నం కంప్యూటర్ లో ఆ రోజు వాయిదాలు కట్టవలిసిన వారి జాబితా మరోసారి సరిచూసుకుంటూ కూర్చుంది. అమ్మాయిలిద్దరూ ముందు రోజు వసూలు అయిన కలెక్షన్ జాబితా రాసుకుంటూ కూర్చున్నారు.

బైక్ అపార్ట్ మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ లో పెట్టి నేరుగా ఆఫీసులోకొచ్చి తన కేబిన్ లో కెళ్ళి కూర్చున్నాడు. మనసంతా ఆందోళంగా వుంది. ఉదయం నుండి తిరిగినా ఒక్క పాలసీ రాయించలేకపోయాడు. కేంపైన్ గడువు చూస్తే దగ్గర పడిపోయింది.

ఆలోచిస్తూ కూర్చున్నాడు. మనసంతా చిందరవందరగా వుంది. ఇంతలో కలెక్షన్ కుర్రాళ్ళు, అమ్మాయిలు పదిమంది వచ్చారు. ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు.

ఏకాంబర్ అలా విచారం గా ఉండడం ఎప్పుడూ చూడలేదు నూకరత్నం. ఎప్పుడూ ఇంత హుషారుగా నవ్విస్తూ, కవ్విస్తూ వుండే వ్యక్తి ఈ రోజు ఎంత డల్ గా వున్నాడా? అనుకుంది.

ఇంతలో వాచ్ మెన్ భార్య పద్మక్క అందరికీ ,టీ పట్టుకువచ్చింది. ఆఫీసులో వున్న యువతీయువకులందరికీ ఇచ్చింది. నూకరత్నానికి కూడా టీ ఇచ్చింది. తన గ్లాసుతో పాటు ఏకాంబర్ కోసం కూడా టీ తీసుకుని కేబిన్ లోకి వెళ్ళింది నూకరత్నం.

టీ త్రాగండి అంటూ టీ గ్లాసు ఏకాంబర్ ముందు టేబుల్ మీద పెట్టింది నూకరత్నం.

ఏదో ఆలోచనలో వున్న ఏకాంబర్ ఒక్కసారే నూకరత్నం కేసి చూసి అన్యమనస్కంగానే టీ గ్లాసు అందుకున్నాడు.

ఏమైంది? ఈ రోజు చాలా డల్ గా వున్నారు. ఏకాంబర్ కి ఎదురుగా కూర్చుంటూ అంది నూకరత్నం.

ఏం లేదు ఏదో చిన్న సమస్య అంటూ టీ గ్లాసు నోటి దగ్గర పెట్టుకుంటూ అన్నాడు.

చిన్నదయినా, పెద్దదయినా సమస్యే కదా! చెప్పండి పరిష్కారం ఆలోచిద్దాం. అంది చిన్నగా నవ్వుతూ.

నూకరత్నం అలా అనేసరికి చురుగ్గా ఆమె కళ్ళల్లోకి చూసాడు. అత్మవిశ్వాసంతో తొణికిసలాడుతున్న ఆమె మోము లో మెరుస్తున్న చిరునవ్వు గమణించి నిర్మలం గా అన్నాడు ఏకాంబర్.

ఇన్స్యూరెన్స్ కేంపేయిన్ టార్గెట్ కంప్లీట్ కాలేదు. ఎప్పుడూ బ్రాంచి లో మొదటి స్థానం లో వుండే నేను రెండో స్థానం లో వున్నాను చెప్పాడు.ఓస్ అంతేనా? దానికేముంది. నాలుగు పాలసీలు ఎక్కువ చేస్తే మళ్లీ మీరే ముందుంటారు. అంది.      తేలిగ్గా,ఎలా వారం రోజుల్నుండీ తిరుగుతున్నాను. అంతా డల్ గా వుంది. విచారం గా అన్నాడు ఏకాంబర్.

మీరే ఇలా డీలా పడితే ఎలా? మాకందరికీ మోరల్... మోడల్ మీరేకదా! ఆలోచిస్తే    ఏ సమస్యా ఓ కొలిక్కి రాదు. కొంచెం ప్రశాంతం గా ఆలోచించండి. అంది నూకరత్నం. అలా అందే గానీ, ఏకాంబర్ వెనుకబడడం తను కూడ తట్టుకోలేకపోతోంది.డివిజన్ లెవల్ లో టాప్ ఏజెంటు గా ప్రశంసలందుకున్న ఏకాంబర్ ఇంతలా డీలా పడి కూర్చోవడం చూడలేకపోతోంది నూకరత్నం.రత్నం! టైం అంతగా లేదు.. ఏటూ అంతగా లేదు ఎటూ పాలుపోవడం లేదు. కస్టమర్లందరినీ కలిసాను. కొత్తవారిని కలుస్తున్నాను. కానీ ప్రయోజనం కనిపించలేదు. ఈ రెండు రోజుల్లో కోటి రూపాయలు వరకూ పాలసీలు సంపాదించాలంటే జరిగే పని కాదు. పాలసీలే కాదు కస్టమర్ల సంఖ్య కూడా ముఖ్యం. నలభై పాలసీలు వుండాలి. కోటి రూపాయలు ఇన్స్యూరెన్స్ చేయించాలి.    ఇదెలా సాధ్యం?! విచారం గా అన్నాడు ఏకాంబర్.

రెండు రోజులు ! నూకరత్నం కూడా ఒక్కసారే డీలా పడిపోయింది. నలభై మంది కస్టమర్ల దగ్గర కోటి రూపాయలు పాలసీలు సేకరించాలి    ఎలా? ఆమె మెదడు పాదరసం లా పనిచేస్తోంది.ఏకాంబర్ .. మన ఎమ్మెల్యే .. అదే మన ఫ్రాంచైజీ ని ప్రారంభించారే మేడిపండు అబద్ధాల రావు ఎమ్మెల్యే గారిని కలిస్తేనో? ఆనందం గా అంది నూకరత్నం.

ఎందుకు చేయరు. ఎమ్మెల్యే గారికి ఎందరో పరిచయస్థులు వుంటారు. మనకి ఆయన తప్పక సహాయం చేస్తారు.    అంది నూకరత్నం.ఎస్! పద ఇప్పుడే వెళ్దాం. అంటూ గబాలున లేచి నిలబడ్డాడు ఏకాంబర్.ఎమ్మెల్యే గారికి ఇప్పుడే ఫోన్ చేయండి. ఆయన ఉన్నారో లేదో తెలుస్తుంది. అంది నూకరత్నం.

కరెక్టే! ప్రయాసపడి వెళ్ళాక ఆయన లేకపోతే బీచ్ రోడ్ లో నుండి తిరిగి రావాలి. అంటూ సెల్ లో వున్న ఎమ్మెల్యే నెంబర్ కి కాల్ చేసాడు ఏకాంబర్.అట్నుండి వెంటనే ఫోన్ రిసీవ్ చేసుకున్నారు.

"సార్1 నమస్తే! మర్యాదగా పలకరించాడు ఏకాంబర్.ఎవరూ? అటునుండి ఎమ్మెల్యే గొంతు.సార్! నేను సార్ ఏజెంటు ఏకాంబర్ ని అన్నాడు ఏకాంబర్.

హలో ఏకాంబర్ ఎలా వున్నారు? మీ పాలసీల వేట బాగా సాగుతోందా?! మీ అఫీసు బాగా నడుస్తోందా?!

నవ్వుతూ పలకరించాడు ఎమ్మెల్యే.బాగానే వుంది సార్! మిమ్మల్ని ఈ రోజు కలవాలనుకుంటున్నాను రమ్మంటారా1 వినయంగా అడిగాడు ఏకాంబర్.

రండి! రండి! ఏకాంబర్. నేను రోజంతా ఇంట్లోనే వుంటాను. నవ్వుతూనే ఆహ్వానించాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు.థేంక్యూ సర్! ఇప్పుడే బయలుదేరుతున్నాను సార్! అన్నాడు ఏకాంబర్.






జరిగిన కథ:

పీతాంబరం తో పర్వతాలు కూతురి పెళ్ళి విషయం చర్చిస్తుంది. తన ఇద్దరి కొడుకులతో పెళ్ళిగురించి మాట్లాడి,సంబంధం వాళ్ళకి కబురు చేయమని పీతాంబరంతో చెపుతుంది.

రండి! ఇంట్లోనే వుంటాను. అంటూ ఫోన్ కట్ చేసాడు అవతల ఎమ్మెల్యే.

ఎమ్మెల్యే తో ఫోన్ లో మాట్లడగానే ఎంతో సంతోషం తో ఉప్పొంగిపోయాడు ఏకాంబర్.

రత్నం! ఎమ్మెల్యే గారు ఇప్పుడే రమ్మన్నారు. పద! ఇద్దరం వెళ్దాం ఆనందంగా అన్నారు.పదండి! ఎమ్మెల్యే గారింటికి వెళ్ళి వచ్చేద్దాం అంటూ హుషారుగా బ్యాగ్ భుజాన తగిలించుకుని ఆఫీసులోంచి బయటకు వచ్చాడు ఏకాంబర్.

ఆఫీసులో వున్న అమ్మాయిలకు బాధ్యతలు అప్పగించి నూకరత్నం కూడా ఏకాంబర్ వెంట నడిచింది.

ఇద్దరూ బైక్ మీద బీచ్ రోడ్లో వుంటున్న ఎమ్మెల్యే మేడిపండు అబ్బాలరావు ఇంటికి బయలుదేరారు.

గోపాలపట్నం!

డిపార్ట్ మెంట్ స్టోర్ లో కూర్చున్నాడు పీతాంబరం. కేష్ కౌంటర్ లో కూర్చున్నాడే గాని ఏకాంబర్ వస్తాడా? రాడా? అని ఎదురు చూస్తున్నాడు.

షాపులో వున్న సేల్స్ గర్ల్స్ ఇద్దరూ కస్టమర్లకి సామాన్లు చూపిస్తున్నారు. కేష్ కౌంటర్ లో కూర్చున్న పీతాంబరం ఎవరో ఇద్దరు నడి వయసు వ్యక్తులు వచ్చారు వాళ్ళని చూస్తూనే కస్టమర్లనుకుని ఉత్సాహం గా కుర్చీలోనుండి లేచాడు.

రండి సార్! రండి లోపలకు రండి! ఆదరం గా పిలిచాడు

సార్! ఏజెంట్ ఏకాంబర్ గారి ఆఫీసు ఎక్కడుంది? అంటూ ఆ ఇద్దరిలో ఒక వ్యక్తి అడిగాడు.

ఏకాంబర్ మా అబ్బాయే నండి అదిగో! ఎదురుగా కనిపిస్తోందే! ఆ అపార్ట్ మెంట్లో మొదటి అంతస్థులోనే వుంది ఆఫీసు. వెళ్ళండి సార్! ఆనందంగా అన్నడు పీతాంబర్.

ఓహో! అలాగా! మాకు ఏకాంబర్ గారు బాగా తెలుసండి. మీ డిపార్ట్ మెంట్ స్టోర్ లో అన్ని సరుకులు దొరుకుతాయి కదండి.! రెండో అతను అన్నాడు.

అన్నీ దొరుకుతాయి సార్! మా షాపులోకి ఒకసారి రండి సార్! చూడండి సాదరంగా ఆహ్వానించాడు పీతాంబరం.

పీతాంబరం అంత ఆదరం గా ఆహ్వానించేసరికి వారిద్దరూ కాదనలేకపోయారు. డిపార్ట్ మెంట్ స్టోరంతా తిరిగి చూసి తమకి అవసరమైన సరుకులు ఇద్దరూ కొన్నారు.

మీ షాపు బాగుంది సార్.! అన్నీ వున్నాయి. మా ఇంట్లో వాళ్ళకి కూడా చెపతాను. వస్తామండీ! అంటూ కేష్ పే చేసి ఇద్దరూ అక్కడనుండి ఏకాంబర్ ఆఫీసుకు వెళ్ళారు.

వాళ్ళిద్దరికేసి ఆనందం గా చూస్తూ కేష్ కౌంటర్ లో కూర్చున్నాడు పీతాంబరం. తన షాపు బయట గోడకి ఏకాంబర్ నేం బోర్డ్ తగిలించాక వాడికెంత ఉపయోగం జరిగిందో తెలీదు కాని, తన షాపులో బేరం మాత్రం గణనీయం గా పెరిగింది. రోడ్డున వెళ్తున్న వాళ్ళు షాపు గోడకి వున్న ఏకాంబర్ బోర్డు చూస్తూనే షాపులోకి వచ్చి ఏకాంబర్ అఫీసు కోసం వాకబు చేస్తున్నారు. పనిలో పనిగా షాపులోకి దూరి ఏదో ఒక వస్తువు కొనుక్కుపోతున్నారు. మనసులోనే అనుకున్నాడు పీతాంబరం.

అలా ఆలోచిస్తూనే అనాలోచితం గా డిపార్ట్ మెంటల్ స్టోర్స్ గోడకి వ్రేలాడుతున్న బోర్డ్ కేసి చూసాడు పీతాంబరం.

"ఏజెంట్ ఏకాంబర్, ఇన్సూరెన్స్ ఏజెంట్ సలహాకి సహాయానికి సంప్రదించండి. మీ క్షేమమే మాకు శ్రీ రామ రక్ష అని రాసి క్రింద సెల్ నెంబర్ రాసి ! వుంది.

పాపం! ఈ బోర్డ్ కోసం ఏకాంబరాన్ని ఎన్ని మాటలన్నాడు తను. ఎంత హేళన చేసాడు? ఎంత చులకనగా మాట్లాడాడు.

ఆ రోజు జరిగిన సంఘటన గుర్తుకు రాగానే పీతాంబరం ఒక్క క్షణం మౌనం గా వుండిపోయాడు. ఆ రోజు ఏకాంబర్ కళ్ళల్లో కదిలిన కన్నీటి పొర ఇప్పటికీ తన కళ్ళముందు కదులుతూనే వుంది.

నాన్న మీరు షాపుకి వెళ్తున్నారా? గబగబా బయటకు వచ్చి స్కూటర్ స్టార్ట్ చేస్తున్న తండ్రిని అడిగాడు ఏకాంబర్.

అవును, తమకి ఎందుకంట? వ్యంగ్యంగా అన్నాడు పీతాంబరం.

ఈ బోర్డు మన షాపు దగ్గర తగిలిస్తారని భయం గా అన్నాడు ఏకాంబర్.

అదేం బోర్డ్? ప్రశ్నార్ధకం గా అన్నాడు పీతాంబరం.

నాదే నేం బోర్డు. కొంచెం ధైర్యం గా అన్నాడు ఏకాంబర్.

నీదా? అదెందుకు షాపు దగ్గర ఊరు మీద పడి తిని తిరుగుతున్నానని ఊఊరందరికి తెలియాలా? చిరాగ్గా అన్నాడు ఏకాంబర్.

ఇంకా నయం నా మెడలో వేసుకుని ఊరేగమన్నారు కాదు. ఈ బోర్డ్ తగిలిస్తే నేనే ఇన్స్యూరెన్స్ ఏజెంట్ నని అడపాదడపా వచ్చే ఆ ఇద్దరు ముగ్గురు కస్టమర్లు కూడా రాకుండా పారిపోతారు. అంటూ ఏకాంబర్ చేతిలో బోర్డు తీసుకుని గుమ్మం దగ్గరికి కోపంగా విసిరికొట్టాడు పీతాంబరం.

అప్పటికే తండ్రీకొడుకుల సంభాషణ విని గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడింది పర్వతాలు.

తల్లి వెనుకే నిలబడి తండ్రికేసి, అన్న కేసి ఆశ్చర్యంగా చూస్తోంది అలివేలుమంగ.

తండ్రి అలా తన నేం బోర్డు గుమ్మానికేసి విసిరికొట్టేసరికి హతాషుడైపోయాడు. ఏం మాట్లాడాలో అర్ధం కక కళ్ళల్లో నీల్లు దించుకుంటూ తల దించుకుని నిలబడిపోయాడు ఏకాంబర్.

కూసే గాడిదొచ్చి మేసే గాడిదని చెడగొట్టినట్లు నా వ్యాపారం ఇలాగైనా నడవకూడదనా నీ ఉద్దేశం. నీ పాట్లు నువ్వే పడు. నీ ఇన్స్యూరెన్స్ రొచ్చు నాకు అంటించక, నా వ్యాపారానికి చిచ్చు పెట్టక అంటూ చెడామడా నాలుగు తిట్లు తిట్టి స్కూటర్ మీద  వెళ్ళిపోయాడు ఏకాంబర్ తండ్రి పీతంబరం.

తల్లీ, చెల్లిలి ముందు తండ్రి అలా తనని, తన వృత్తిని తూలనాడేసరికి నిలువెల్లా నీరైపోయాడు. ఏకాంబర్ బావురుమని ఏడవలేక దుఖాన్ని గుండెల్లోనే దిగమ్రింగుకుని ఇంట్లోనుండి బయటపడ్డాడు.

కొంత దూరం వెళ్ళిన పీతాంబరం షాపు తాళాలు మర్చిపోవడంతో   వెంటనే వెనక్కి తిరిగి వచ్చాడు.

షాపుకని వెళ్ళిన మొగుడు తిరిగి రావడం చూసి ఆశ్చర్యంగా అంది పర్వతాలు.

ఏం మళ్ళీ కొడుకు మీద జాలి వేసిందా?! బోర్డు పట్టుకెళ్ళడానికి వచ్చారా? అంది గుమ్మం దగ్గర నిలబడి. తండ్రి తిరిగి రావడంతో అలివేలుమంగ పెరట్లోకి పరుగందుకుంది. నూతి గట్టున పెట్టిన బట్టలు తియ్యడానికి వెళ్ళింది. తండ్రి చూస్తే చివాట్లు పెడతాడని భయం. ఉతికిన బట్టలు నూతిలో పడితే ఏం చేస్తావ్? అంటూ ఎన్నోసార్లు తండ్రి కేకలేసాడు. ఆ విషయం గుర్తొచ్చి పరిగెట్టింది అలివేలుమంగ షాపు తాళాలు మర్చిపోయాను అంటూ తన గదిలోకి వెళ్ళాడు పీతాంబరం.

ఇంతలో పెరట్లో నుండి భయం గా పరుగుపరుగున ఇంట్లోకి వచ్చింది అలివేలుమంగ.

ఎమైందే? ఎందుకలా? కంగారుగా వచ్చావ్? ! పెరట్లోనుండి పరుగెత్తుకు వచ్చిన కూతుర్ని చూసి అంది పర్వతాలు.

నూతి దగ్గర... అమ్మో! భయం గా అంది అలివేలుమంగ.

ఏమైంది? గదిలోనుండి షాపు తాళాలు తీసుకుని వస్తూ అన్నాడు పీతాంబరం.

నూతి దగ్గర ఏదో చూసిందటండి. అంటూ పెరట్లోకి వెళ్ళింది పర్వతాలు. భార్యను అనుసరించాడు పీతాంబరం.

నూతి చుట్టూ వున్న సిమెంటు పళ్ళెం మీద పెద్ద జెర్రి పాకుతూ కనిపించింది.

ఓస్!   ఇదేనా ? జెర్రి అంటూ ప్రక్కనే వున్న రోకలితో జెర్రిని కొట్టి చంపేసాడు పీతాంబరం.

ఇది కుడితే ప్రమాదం కాదా!? ఆశ్చర్యం గా అంది అలివేలుమంగ.

అమ్మో ఇంకేమన్నా వుందా? ఇది ప్రమాదకరమైన జెర్రి. కుడితే ప్రాణం మీదకు వస్తుంది. అంటూ ప్రేమతో గట్టిగా కూతుర్ని కౌగిలించుకుంది పర్వతాలు.

పెరట్లో చూసుకుని నడవండి.. అంటూ బయటకు వెళ్ళబోయాడు పీతాంబరం.

వాడేదో ఆశ పడి అడిగితే అంతలా కోప్పడాలా?! ఆ బోర్డేదో షాపు గోడకి తగిలిస్తే మీ సొమ్ము ఏం పోదు కదా? భర్తకి నచ్చజెప్పుతూ అంది పర్వతాలు.

అది మామూలు బోర్డు కాదే! అది చూసినోళ్ళందరూ జడుసుకుని మన షాపుకేసే రావడం మానేసారనుకో! ఇంటిల్లిపాదీ పస్తులతో చావాలి. ఇలాంటి పురుగు కుడితే ఒక్కరికే ప్రమాదం. ఆ బోర్డు పుణ్యమా అని ఇంటిల్లిపాదీ క్షక్షణం పస్తులతో చావలి. అంటూ విసురుగా వెళ్ళిపోయాడు పీతాంబరం.

భర్త మాటలు విని అవాక్కయి నిలబడింది పర్వతాలు.

ఆ రోజు జరిగిన సంఘటన కళ్ళముందు కదిలేసరికి పీతాంబరానికి సిగ్గనిపించింది. ఎంత తప్పుగా ఆలోచించాడు? అదే ఆలోచనతో.. భయం తో చెట్టంత ఎదిగిన కొడుకుని పూచికపుల్లలా తీసిపారేసాడు. పాపం! ఆ క్షణం వాడెంత బాధపడి వుంటాడో?!

ఈ రోజు ఇంటిని ఆదుకున్నది వాడే. కుటుంబమంతా ఇంత సంతోషం గా గడగలుగుతున్నారంటే ఆ ఇన్సూర్యెరెన్స్ వలనే.ఏకాంబర్ ప్రయోజకత్వం గుర్తించిన రోజే అటక మీద పడేసిన బోర్డు తీసి షాపు దగ్గర తగిలించాడు . అప్పట్నుండి వ్యాపారం పదింతలు పెరిగింది.ఆ బోర్డు కేసి  తృప్తిగా చూస్తూ నగదు పెట్టెలో వున్న నోట్లు వేలకు వేలు, అయిదు వందలకు అయిదు వందలు, వందల నోట్లు విడి చేస్తూ కూర్చున్నాడు పీతాంబరం.

బైక్ మీద రామకృష్ణా బీచ్ కు చేరుకున్నారు ఏకాంబర్, నూకరత్నం. ముందు ఫ్రాంఛైజీ ప్రారంభోత్సవానికి పిలవడానికి ఎమ్మెల్యే ఇంటికి రావడం వలన ఎమ్మెల్యే గారి ఇల్లు వెదుక్కునే పని పడలేదు.

మూడంతస్థుల భవనం చుట్టూ విశాలమైన ఆవరణ. ఓమూల వున్న షెడ్డు లో తళతళా మెరుస్తున్న పెద్ద పెద్ద కార్లు రెండు ఉన్నాయి.  ఎమ్మెల్యే గారిని కలవడానికి వచ్చిన వాళ్ళంతా ఓమూల గుంపులు గుంపులుగా నిలబడి వున్నారు.

అక్కడక్కడా పహిల్వాన్ లా వున్న పది, పదిహేను మంది ధృడకాయులు చేతులు కట్టుకుని అన్ని దిక్కులు పరీక్షగా చూస్తూ నిలబడ్డారు.

ఏకాంబర్ నేరుగా ఎమ్మెల్యే గారు వున్న గది దగ్గరకు వెళ్ళాడు . నూకరత్నం బైక్ దగ్గరే నిలబడింది.

సార్! ఎమ్మెల్యేగారున్నారా? వినయం గా తలుపు దగ్గ నిలబడ్డ గన్మేన్ ని అడిగాడు,. లోపలున్నారు. మీరు సార్ ని కలవడానికొచ్చారా? మీరు సార్ ని కలవడానికొచ్చారా? అక్కడ పి.ఎ గారున్నారు. ఆయన దగ్గరకు వెళ్ళండి. చెప్పాడు గన్మేన్.

థేంక్యూ అంటూ ఆ ప్రక్కనే ఓ చిన్న రూం దగ్గర కూర్చున్న పి.ఎ దగ్గరకు వెళ్ళాడు. ఏకాంబర్.

ఏం పని మీద వచ్చారు? పి.ఎ అడిగాడు.

నేను సార్ కి ఫోన్ చేసాను. సారే రమ్మన్నారు సార్. చాలా నమ్రతగా చెప్పాడు ఏకాంబర్.

ఎమ్మెల్యే గారే రమ్మన్నారా/ లోపల ఎవరితోనో మాట్లాడుతున్నారు. వాళ్ళు వచ్చాకా మీరు వెళ్ళురుగాని, వేరే ఇతర సమస్యలయితే సార్ని కలవక్కరలేదు. నాతో చెప్తే నేను మీ పని పూర్తి చేస్తాను. చెప్పాడు పి.ఎ

లేదు సార్! నేను సార్ ని పర్సనల్ గా కలవాలని వచ్చాను చెప్పాడు ఏకాంబర్.ఇంతలో లోపల వున్నవాళ్ళు బయటకు వచ్చేసారు.మెరు వెళ్ళండి సార్ ఏకాంబర్ తో పి.ఎ అన్నాడు.

ఎమ్మెల్యే గదిలోకి వెళ్ళబోతూ బైక్ దగ్గరున్న నూకరత్నం కేసి చూసాడు ఏకాంబర్. ఆమె కూడా ఏకాంబర్ ని చూసి వడివడిగా ఎమ్మెల్యే గది దగ్గరకు వచ్చింది.

ఇద్దరూ తలుపులు నెట్టుకుంటూ ఎమ్మెల్యే అబద్ధాలరావు లోపలకు వెళ్ళారు.

ఆ గది ఎంత రిచ్ గా అలంకరించి వుంది. గదం తా శీతలీకరణ చేయించడం వలన మంచు గడ్డ మీద నిలబడ్డట్టు ఒక్కసారే ఇద్దరి శరీరాలు జలదరించాయి. రా.. అమ్మా! నువ్వు.. ఏకాంబర్ కేసి చూస్తూ గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు ఎమ్మెల్యే.

నేను సార్! ఏజెంట్ ఏకాంబర్! మీరే కదా సార్ మా సర్వీస్ సెంటర్ ని ప్రారంభించి ఆశీర్వదించారు చిన్నగా నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ ఏజెంటు ఏకాంబర్ ! గోపాలపట్నం లో కదా! గుర్తుంది. రండి కూర్చోండి.! ఎందుకో నన్ను కలవాలన్నారు కదా! ఇప్పుడే అరగంట క్రితం ఫోన్ చేసినట్టుంది.     గుర్తు చేసుకుంటూ అన్నాడు

ఎమ్మెల్యే.

సార్... మీరేమీ అనుకోనంటే.. మీతో మాట్లాడుతాను పర్వాలేదు కదా?! చాలా నమ్రతగా అన్నాడు ఏకాంబర్.

మీరు నా నియోజక వర్గం లో వున్న వాళ్ళు , నాకు ఓటేసి గెలిపించిన వాళ్ళు. మీతో మాట్లాడ్డానికే కదా నేనిక్కడ వున్నది. నవ్వుతూ అన్నాడు ఎమ్మెల్యే.

చాలా కృతజ్ఞతలు సార్! రెండు చేతులతో దండం పెడుతూ అన్నాడు ఏకాంబర్.

ఈ అమ్మాయి ఆ రోజు సర్వీస్ సెంటర్ ప్రారంభోత్సవానికి వచ్చింది కదూ ! నాకు బాగా గుర్తుంది. ఏమమ్మా బాగున్నావా? నవ్వుతూ నూకరత్నాన్ని పలకరించాడు ఎమ్మెల్యే.


అవును సార్1 మా సర్వీస్ సెంటర్ లోనే ఈమె కూడా తన ఫ్రాంచైజీ నడుపుతోనదని చెప్పాడు ఏకాంబర్.

ఒక ఒరలో రెండు కత్తులన్న మాట. ఎలా? చిన్నగా నవ్వుతూ అన్నాడు ఎమ్మెల్యే.

ఎమ్మెల్యే మేడిపండి అబద్ధాలరావు అలా అనేసరికి ఉలిక్కిపడ్డాడు ఏకాంబర్. నిజమే! ఆయన అన్నదాంట్లో గూడార్థం వుంది. కానీ తామిద్దరూ ఒకటే అని రెండు వ్యాపారాలు కలిసే వున్నాయని గ్రహించలేదు.

మా ఇద్దరిలో ఒకరికి ఒకరం పోటీ కాదు సార్! సార్ ది ఇన్స్యూరెన్స్ వ్యాపారం. నాది చిట్స్, రికవరీస్. ఒకరికి ఒకరం సహాయపడతాం గాని, పోటీ పడం సార్! టక్కున అంది నూకరత్నం..



జరిగిన కథ:

ఏకాంబర్ కోసం వచ్చిన వాళ్ళందరూ పీతాంబరం షాపులో ఏదో ఒక వస్తువైనా కొనుక్కుపోతుంటారు. ఇదేదో బాగానే వుంది అని అనుకుంటాడు ఏకాంబర్ తండ్రి. కానీ ఏకాంబర్ నేం బోర్డ్ తన షాపు ముందర తగిలిస్తానంటే తను చేసిన గొడవ, ఏకాంబర్ కళ్ళల్లో తిరిగిన నీళ్ళు ఒక్కసారిగా గుర్తుచేసుకుంటాడు పీతాంబరం.

....................................................

శెహభాష్! ఈ రోజుల్లో అందరూ మీలా వుంటే వివాదాలు రావు. విభేదాలే వుండవు. ఆల్ ది బెస్ట్. ఇలాగే మీరిద్దరూ కలకాలం కలిసి మెలిసి ఉండాలని కోరుకుంటున్నాను. పకపకా నవ్వుతూ అన్నాడు ఎమ్మెల్యే.

మీ అభిమానానికి ధన్యవాదాలు సార్! నమ్రతగా అన్నాడు ఏకాంబర్.

నాతో పనుందన్నారు కదా చెప్పండి. నా చేతనైన సహాయం చేస్తాను. అంటూ అడిగాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు.

మీరు చెయ్యగలరు సార్! మీ చేతుల్లోనే వుంది. నర్మగర్బం గా అంది నూకరత్నం.

నీ పేరేంటమ్మా! నువ్వు చాలా బాగా మాట్లాడుతున్నావే! పనేం దో చెప్పకుండానే నాతో పని అయిందనిపించేస్తున్నావ్.. నవ్వుతూ అన్నాడు ఎమ్మెల్యే.

పనంటే పని కాదు సార్! టక్కున అన్నాడు ఏకాంబర్.

"పనో ... సహాయమో... ఏదో ఒకటి చెప్పండి! అంటూ బజర్ నొక్కాడు ఎమ్మెల్యే.

ఆ బజర్ శబ్దం వినగానే తలుపు దగ్గర నిలబడ్డ గన్ మేన్ వినయం గా తలుపు తీసుకుని లోపలకు వచ్చాడు.

పీ.ఏని ఓసారి హుకూం జారీ చేసాడు ఎమ్మెల్యే.

ఏకాంబర్, నూకరత్నం ఇద్దరూ ఒకేసారి డీలా పడిపోయారు. తమ సోదంతా వినబుద్ధికాక పీ.ఏని పిలిచి తమని బయటకు వెళ్ళి పీ.ఏ తో మాట్లాడుకోమనడు కదా! ఇద్దరూ మనసులోనే దేవుళ్ళకు మొక్కుకున్నారు.

క్షణం లో పీ.ఏ గది లోకి వచ్చాడు.చేతిలో చిన్న నోట్ పేడ్ వుంది. వినయంగా నిలబడి ఎమ్మెల్యే కేసి చూసాడు.

నా కోసం బయట వున్నారా?? తీక్షణం గా అడిగాడు ఎమ్మెల్యే.

మిమ్మల్ని కలవాల్సిన వాళ్ళెవరూ లేరు సార్! బయట వున్న వాళ్ళంతా రేషన్ కార్డుల కోసం, ఇళ్ళ స్థలాల కోసం వచ్చిన వాళ్ళే వాళ్ళ పేర్లు రాసుకుని పంపిచేస్తున్నాను. వినయంగా చెప్పాడు పీ.ఏ.

వాళ్ళందరినీ పంపించేసే ముందు నాకోసారి కనిపించమను. లేకపోతే గదిలో వుండి కూడా తమని పట్టించుకోలేదని ప్రచారం చేస్తారు. వాళ్ళతో వినయంగా వుండు, వెళ్ళు అన్నాడు.

అలాగే సార్! వీళ్ళు వెళ్ళే వరకూ ఎవరినీ లోపలకు పంపించను సార్.. వెళ్తూ అన్నాడు పీ.ఏ.

అలాగే అని ఇక చెప్పండి ఏకాంబర్ ! అంటూ ఏకాంబర్ కేసి చూస్తూ అన్నాడు ఎమ్మెల్యే.

సార్! మీరు నా మాట కాదనకూడదు. సంశయంగా అన్నాడు.

మీ మాట నేనెందుకు కాదంటాను. చెప్పండి! ఏకాంబర్ మాట వింటూనే సస్పెన్స్ తట్టుకోలేక స్థిరంగా అడిగాడు ఎమెల్యే.

సార్! మీ పేర ఓ పాలసీ రాసుకుంటాను సార్! నెమ్మదిగా అన్నాడు ఏకాంబర్.

పాలసీయా? ఆశ్చర్యం గా అన్నాడు ఎమ్మెల్యే.

అవును సార్! ఈ నెలాఖరులోగా నా టార్గెట్ పూర్తి కావాలి. దాని కోసమే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను. ఆశగా అన్నాడు

ఏకాంబర్.పాలసీలు నాకెందుకయ్యా! ఉద్యోగులకి, బీదవాళ్ళకి అవసరం గాని, ఇంటి యజమాని చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి భీమా కావాలి గానీ, నా లాంటి వాళ్ళకెందుకయ్యా! నేను పోయినా నా పెళ్ళాం పిల్లలు రోడ్డున పడే చాన్సే లేదు.. తరగని ఆస్థి ఉంది. నా తర్వాత నా కొడుకో,

పెళ్ళామో ఎమ్మెల్యే అయిపోతారు. నాకెందుకు ఇన్సూరెన్స్ పాలసీలు ఏకాంబర్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు.

ఎమ్మెల్యే మాటలు వింటూనే ఏకాంబర్ కి మెదడు మొద్దుబారిపోయింది. ఆయన మీద ఎన్నో ఆశలు పెట్టుకుని వచ్చాడు . ఏం చేయాలో.. ఏం మాట్లాడాలో అర్ధంకాక క్షణం కళ్ళు తేలేసాడు.

సార్! మీకు అక్కరలేకపోవచ్చు సార్! పోనీ మీ వద్ద పని చేసిన వాళ్ళచేతనైన చిన్న పాలసీ కట్టించి హెల్ప్ చెయ్యండి సార్ రిక్వెస్ట్ చేస్తూ అంది నూకరత్నం.

కరక్టేనమ్మా అంటూనే ఒక్కసారి కుర్చీకి జేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు ఎమ్మెల్యే మేడి పండు అబద్ధాలరావు.

నీకు మతిపోయిందా? ఈయన కాకపోతే వేరే వాళ్ళయితే మన టార్గెట్ ఎలా ఫుల్ ఫిల్ అవుతుంది. వాళ్ళు చిన్నా చితకా పాలసీలే కదా రాస్తారు. నూకరత్నం చెవిలో గుసగుసగా అన్నాడు ఏకాంబర్.

ఒక మనిషికి పాలసీ ఎంతవరకు రాయించొచ్చు..కుర్చీలో నుండి ముందుకు వంగి హఠాత్తుగా అన్నాడు ఎమ్మెల్యే.

ఆ మాటకు ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఏకాంబర్ కి నోట మాట రాలేదు. ఆలోచిస్తే ఒక్క క్షణం కూర్చున్నాడు.

చెప్పండి! సార్ ఏదో అడుగుతున్నారు కదా! మౌనం గా కూర్చున్నా ఏకాంబరాన్ని చేత్తో తడుతూ అంది నూకరత్నం.

ఎంతో అంటే... ఆ మనిషి ఆదాయాన్ని బట్టి, ఆరోగ్య పరీక్షలను బట్టి పాలసీ ఇస్తాం సార్! బాగా పెద్ద పెద్ద వ్యాపార వేత్తలు కోట్లలో ఇన్సూరెన్స్ కట్టినవాళ్ళున్నారు. అహెప్పాడు ఏకాంబర్.

నా దగ్గర పని చేస్తున్న వాళ్ళు ఓ ఇరవై మంది వున్నారు. మనిషికి ఓ పది లక్షలు ఇన్సూరెన్స్ చేయించాక చనిపోతే ఎంత వస్తుంది? సూటిగా ఏకాంబర్ కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు ఎమ్మెల్యే.

ఒక రకం పాలసె అయితే పదిలక్షలకు మూడు రెట్లు అంటే ముప్పై లక్షల వరకూ పాలసీదారు

చనిపోతే ఇస్తారు. పాలసీ కంప్లీట్ అయ్యేవరకూ రావచ్చు. తరగావచ్చు.. చెప్పాడు ఏకాంబర్.

పది లక్షల పాలసీకి ఎంత డబ్బు కట్టాల్సి వస్తుంది. కుతూహలం గా అడిగాడు ఎమ్మెల్యే.

ఇది పాలసీ కట్టే అతని వయసుని బట్టి ఎంత కట్టాలో చెప్పగలను సార్! ఉదాహరణకి పాతికేళ్ళ కుర్రాడికి అయితే నలభై వేల రూపాయలు ఏడాదికి కాట్టాల్సి వుంటుంది. బ్యాగ్ లో వున్న రెడీ రెల్ నార్ తీసి చూసి చెప్పాడు ఏకాంబర్.

సరే మా వాళ్ళందరినీ పిలిపిస్తాను. చూసి చెప్పండి. అన్నాడు ఎమ్మెల్యే.

వాళ్ళంతా ఏం చేస్తుంటారు సార్! కుతూహలం గా అడిగాడు ఏకాంబర్. ఇరవై మంది ఒక్కసారే పాలసీలు ఇస్తారనే సరికి ఆనందం గుండేల్లో నుండి తన్నుకొస్తున్నా బయటకి గుంభనం గా వున్నాడు.

వాళ్ళం తా ఎలా పాలసీ కట్టగలరు సార్! వారికి అంత ఆదాయం వుండాలి కదా? అనుమానంగా అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా అనడంతోనే ఎమ్మెల్యే మేడి పండు అబద్ధాలరావు ఒక్కసారే పెద్ద పెట్టున పకపకా నవ్వాడు. ఆ నవ్వుకి చుట్టుపక్కల వున్నవాళ్ళు వచ్చెయ్యాలి. కానీ ఏసీ గది కావడం వలన ఎమ్మెల్యే నవ్వు గది దాటి బయటకు వెళ్ళలేదు.

అదేంటి సార్! అలా నవ్వేసారు? ఆశ్చర్యం గా అంది నూకరత్నం.

మా వాళ్ళ ఆదాయం గురించి అడిగితే నాకు నవ్వు ఆగలేదు. మీకు తెలుసా? మా వాడి ఒక్కొక్కడి ఆదాయం నెలకి రెండు, మూడు లక్షల్లకు పైనే వుంటుంది. అన్నాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు.

ఇంతలో పీ.ఏ తలుపు తోసుకుని లోపలకు వచ్చాడు.ఏందయ్యా! ఏమిటి విశేషం? ఎవరైనా వచ్చారా? పీ.ఏ ని చూస్తూ అడిగాడు ఎమ్మెల్యే.

సార్!... వాళ్ళు...వాళ్ళు వచ్చారు సార్! ఎమ్మెల్యే కేసి చూస్తూ ఏకాంబర్ కేసి మార్చి చూస్తూ నీళ్ళు నములుతూ అన్నాడు పీ.ఏ.

చెప్పవయ్యా! వాళ్ళేనా? ఫ్లై ఓవర్ బ్రిడ్జి కాంత్రాక్టర్ కదా! అడిగాడు ఎమ్మెల్యే.

అవును సార్! అన్నాడు పీ.ఏ.

వాళ్ళని ఆ కోమా రూం లోకి పంపించు.. ఏకాంబర్! మీరు ఓ పది నిముషాలు కూర్చుంటారు కదా! ఏకాంబర్ కేసి చూసి అంటూనే

కుర్చీలోనుండి లేచి ఆ ప్రక్కనే ఉన్న మరోగదిలోకి వెళ్ళాడు ఎమ్మెల్యే.

పీ.ఏ బయటకి వెళ్ళి ఎవరో ఇద్దర్ని ఓ పెద్ద సూట్కేస్తో లోపలకు తీసుకువచ్చాడు. ఆ ఇద్దర్నీ ఎమ్మెల్యే గారు వెళ్ళిన కోమా రూం లోకి పంపించి బయటకు వెళ్ళిపోయాడు పీ.ఏ.

ఏకాంబర్ కి, నూకరత్నానికి ఆనందంగానే వుంది. పది నిముషాలు కాదు గంటైనా ఎదురుచూస్తూ కూర్చోగలరు

ఒకసారి ఇరవై మంది దగ్గర రెండు కోట్లు ఇన్స్యూరెన్స్ పాలసీ వస్తుందంటే మాటలా?! టార్గెట్ దాటి పోతుంది.

ఈ దెబ్బతో మనసులోనే అనుకున్నాడు ఏకాంబర్.

పావుగంటలో కోమా రూం న్నుండి ఎమ్మెల్యే, ఆయనతో పాటు ఆ పెద్దమనుషులిద్దరూ బయటకు వచ్చారు. ఇప్పుడు ఆ ఇద్దరి చేతుల్లో ఏమీ లేదు. లోపలకు వెళ్ళినప్పుడు తీసుకువెళ్ళిన సూట్కేసు లేదు.

ఆ సూట్కేసు చూసి మురిసిపోయింది నూకరత్నం. ఎంతో అందంగా, కొత్తదనం గా, ఆకర్షణీయంగా ఉంది ఆ సూట్ కేసు. ఆ విషయమే ఏకాంబర్ చెవిలో చెప్పింది.

ఆఘమేఘాల మీద లోపలకు వచ్చాడు పీ.ఏ.

పీ.ఏ గారు! మన వాళ్ళందరికీ పాన్ కార్డులు, వాటి రిటన్స్ వీళ్ళకి చూపించండి. నా బాడీగార్డులు ఇరవై మందితో వీళ్ళు ఇచ్చిన ఫారాల మీద సంతకాలు చేయించండి. మన దగ్గర వున్న వాళ్ళ ఐ.డీ కార్డులు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్స్ అనీ ఇవ్వండి. వీళ్ళు ఏమడిగితే అవి జిరాక్స్ చేసి ఇవ్వండి. అంటూ పీ.ఏ ని పంపించేసి ఏకాంబర్ కేసి తిరిగి అన్నాడు ఎమ్మెల్యే.

మీరు మావాళ్ళందరికీ పదేసి లక్షల ఇన్స్యూరెన్స్ చేయండి. దానికి కావలిసినవన్నీ మా పీ.ఏ మీకిస్తాడు. సరేనా? అన్నాడు ఎమ్మెల్యే.థాంక్యూ సార్!... థాంక్యూ ఆనందం గా అన్నారు ఏకాంబర్, నూకరత్నం లు ఇద్దరూ కోరస్ గా,

ఉండుండుండండీ! పాలసీలు పూర్తిగా రాయాలి, కంప్లీట్ కావాలి. అప్పుడు చెప్పండి ధన్యవాదలు. నవ్వుతూ చెప్పాడు ఎమ్మెల్యే.అంతంత ఆదాయం వున్న వాళ్ళకి ఇన్స్యూరెన్స్ ఇవ్వడం తప్పులేదు సార్! స్టాండర్డ్ ఏజ్ ప్రూఫ్ వుండాలి అంతే! అన్నాడు ఏకాంబర్.

అవన్నీ మా పీ.ఏ తో మాట్లాడి మిగతా వర్క్ కంప్లీట్ చెయ్యండి నేను ఇంట్లో రెస్ట్ తీసుకుంటాను అంటూ గది బయటకు వచ్చాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాల రావు.

ఆయన వెనుకే ఏకాంబర్, నూకరత్నం బయటకు వచ్చారు. ఇద్దరికీ మహదానందంగా వుంది. ఏకాంబర్కైతే గాల్లో తేలిపోతున్న ట్టే వుంది. ఒక్కసారే టార్గెట్ ను మించి వ్యాపారం దొరికింది. ఇన్స్యూరెన్స్ అయితే టార్గెట్ మించిపోయింది. పాలసీల సంఖ్య తక్కువైనట్టుంది. మనసులోనే అనుకున్నాడు ఏకాంబర్.ఇన్స్యూరెన్స్ పోటీలో ఇన్స్యూరెన్స్ తోపాటు ప్రీమియం, పాలసీల సంఖ్య కూడా ఇంత వుండాలని నిర్దేశిస్తారు. ఆ మూడు కండీషన్స్ పూర్తయితేనే పోటీలో నెగ్గినట్టు. అవార్డులకు, రివార్డులకు అర్హత సాధించినట్టు.

ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు గదిలోనుండి బయటకు రావడం చూసి ఆ ఆవరణలో గుంపులు గుంపులుగా నిలబడ్డ జనమంతా ఒక్కసరి "దండాలండయ్యా" అంటూ అరిచాడు.

వాళ్ళందరికీ తిరిగి నమస్కారం చేస్తూ చిన్న చిరునవ్వు నవ్వి ఇంట్లోకి వెళ్ళిపోయాడు ఎమ్మెల్యే.

ఏకాంబర్ నూకరత్నం నేరుగా వెళ్ళి పీ.ఏ రూం లో ఖాళీగా వున్న కుర్చీల్లో కూర్చున్నారు.

సార్! మీకు అభ్యంతరం లేకపోతే ఒక గంట పోయాక వస్తే మనం కూర్చుందాం. ఇక్కడ వున్న వాళ్ళందరినీ పంపించేస్తే నేను ఖాళీ అయిపోతాను చెప్పాడు పీ.ఏ.

అలాగే సార్! ముందా పని కానివ్వండి. మేము గంటలో బయటకు వెళ్ళి వస్తాం. అంటూ ఏకాంబర్ , నూకరత్నం ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో నుండి రోడ్డు మీదకు వచ్చారు.






జరిగిన కథ : ఏకాంబర్, నూకరత్నం ల సఖ్యతను ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు

మెచ్చుకుంటాడు. తనకు పాలసీలు కట్టవలిసిన అవసరం లేదని ఎమ్మెల్యే అనగానే, తన దగ్గర పని చేసే వాళ్ళతోనైనా పాలసీ కట్టించండి... అని అడుగుతుంది నూకరత్నం. ................................ ఆ తరువాత ....................................................

ఎక్కడికి వెళ్దాం? ఏకాంబర్ కళ్ళోక్లి చూస్తూ అంది నూకరత్నం.

ఇక్కడే వుందాం. అదిగో! అలా ఖాళీ మాత గుడి దగ్గరకెళ్ళి దర్శనం చేసుకుని అక్కడ నీడలో కూర్చుందాం. అన్నాడు ఏకాంబర్.

నాకు బాగా ఆనందం గా వుంది. ఆయన పాలసీ రాయిస్తే చాలనుకున్నాను. కానీ ఒక్కసారే ఇరవై మందంటే ఆశ్చర్యం గా వుంది అంది నూకరత్నం.

నాకు అలానే వుంది. టార్గెట్ రీచ్ అయిపోతాను. ప్రీమియం కూడా ఎక్కువే వస్తుంది. కానీ, పాలసీల సంఖ్య తక్కువనిపిస్తోంది సాలోచనగా అన్నాడు.

ఎన్ని తక్కువుంటాయి? అడిగింది నూకరత్నం.

ఈ ఇరవై కాక ఇంకో ముప్పై పైనే వుండాలి. అదే ఆలోచిస్తున్నాను నడుస్తూ అన్నాడు ఏకాంబర్.

ఓ ఐడియా చెప్పనా? వున్నట్టుండి అంది నూకరత్నం.

నూకరత్నం కేసి ప్రశ్నార్థకం గా చూసాడు ఏకాంబర్.

వీళ్ళకే ఒక్కొకరికి రెండు పాలసీలుగా విడదీసి రాస్తేనో? ఆలోచిస్తూ అంది నూకరత్నం.

గుడ్ ఐడియా నూకరత్నం మాట వింటూనే ఎగిరి గంతేసాడు ఏకాంబర్.

ఎమ్మెల్యే గారు ఒప్పుకుంటారా? కుతూహల గా అడిగింది.

దానికి లక్ష మార్గాలున్నాయి. అది నేను మాట్లాడుతాను. డోంట్ వర్రీ. ఇంకో పది తక్కువ వస్తాయి చూద్దాం అన్నాడు ఏకాంబర్.

ఇద్దరు కాళీ మాతా మండపంలో పావుగంట పాటు కూర్చున్నారు. ఇద్దరికీ ఆనందం గానే వుంది. ఏకాంబర్ అయితే తన సమస్య ఇంత ఈజీగా పరిష్కారం అవుతుందని ఊహించనైనా లేదు.

ఇంతలో సడెన్ గా నూకరత్నం సెల్ మ్రోగింది. వ్యానిటీ బ్యాగ్ లో వున్న సెల్ రింగ్ వినిపించే సరికి గబుక్కున బ్యాగ్ జిప్ తీసి సెల్ తీసుకుంది.

ఎన్.ఎ.డి చిట్ మేనేజర్ కరీం లైన్ లో ఉన్నాడు.

సార్! చెప్పండి సెల్ చెవి దగ్గర పెట్టుకుంటూ అంది నూకరత్నం.

మేడం మీరు సాయంత్రం ఆఫీసుకు రాగలరా? అడిగాడు మేనేజర్.

వస్తాను సార్! ఏనేమన్నా వుందా? కుతూహలం గా అంది నూకరత్యాం.

మొన్న జగదాంబ థియేటర్ రంగారావు గారిచ్చిన రిఫరెన్స్ లు పట్టుకుని వెళ్ళాం మేడం. మరో రెండు థియేటర్ వాళ్ళు ఒక షాపింగ్ మాల్ ఓనర్ గారూ ఓన్ క్రోర్ చిట్స్ కట్టడానికి ఇంట్రస్టింగ్ గా వున్నారు. మీరూ ఏకాంబర్ సారూ వస్తే సాయంత్రం వాళ్ళని కలిసి వద్దామని చెప్పాడు బ్రాంచి మేనేజర్ కరీం.

కరీం మాటలు వింటూనే ఆనంద డోలికల్లో తేలిపోయింది నూకరత్నం.

అలాగే సార్! తప్పక వస్తాము అంటూ కాల్ కట్ చేసి ఏకాంబర్ కేసి చూసింది నూకరత్నం.

అప్పటికే నూకరత్నం సంభాషణలను బట్టి ఎన్.ఏ.డి. బ్రాంచి కరీం తో మాట్లాడుతోందని గ్రహించాడు ఏకాంబర్. ఆమె మొహం లో తొణికిసలాడుతున్న ఆనందాన్ని గమణించి ఏదో శుభవార్త అని అనుకున్నాడు.

అంబర్! గుడ్ న్యూస్ మరో ముగ్గురు ఒన్ క్రోర్ చిట్స్ కట్టడానికి సుముఖం గా ఉన్నారట. మా బి.ఎం చెప్తున్నారు. ఇదంతా నీ క్రెడిట్టే సంతోషం గా చేయి పట్టుకుని ముద్దు పెట్టుకుంటూ అంది నూకరత్నం.

నాదేముంది, దారి చూపించాను. దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సింది మీరు. అయినా మీ వాళ్ళు మంచి వాళ్ళే. వాళ్ళు కాళ్ళు అరిగేలా తిరిగి కష్టమర్లని మోటివేట్ చేసి ఆ క్రెడిట్ నీకు ఇస్తున్నారు. వాళ్ళని మెచ్చుకోవాలి చిన్న చిరు నవ్వు నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.నిజమే అంబర్! నాకిప్పుడు కరీం గారు ఫోన్ చేసి ఈ విషయం చెప్పకపోయినా నేనేమీ చేయలేను. ఆ చిట్స్ మూడు కమీషన్ కోసం ఆశపడి వేరే ఎవరి కోడ్ లో వేసినా నేనేం మాటలాడలేను. కానీ వాళ్ళు నిజాయితీగా నాతో ముందు అన్న మాటకే కట్టుబడ్డారు ఆనందం గా అంది.సాయంత్రం వేగం గా వెళ్ళు లేచి నిలబడుతూ అన్నాడు ఏకాంబర్.

ఏం తమరు రారా? మా బ్రాంచి మేనేజర్ గారైతే మిమ్మల్ని వెంటబెట్టుకు రమ్మన్నారు. మీ గోల్డెన్ లెగ్ పడితే గానీ సక్సెస్ కాదు స్థిరం గా అంది నూకరత్నం.

తప్పదంటావా? సాలోచనగా అన్నాడు ఏకాంబర్.

మీరు లేకుండా నేనొక్కదాన్ని ... అదీ సాయంత్రం  కదా! ఎలా వెళ్ళను? గోముగా ఏకాంబర్ కళ్ళోల్లకి చూస్తూ అంది నూకరత్నం. పద, ముందు ఈ పని ముగిస్తే సాయంత్రానికి రెడీ కావచ్చు అంటూ గుడి మెట్లు దిగాడు ఏకాంబర్.

ప్రేమగా ఏకాంబర్ చేయిని రెండు చేతులతో  పట్టుకుని అతని మీద ఒదిగిపోతూ ముందుకు నడిచింది  నూకరత్నం.ఇద్దరూ తిరిగి ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు.

ఎమ్మెల్యే గారికి ఇంటి ఆవరణ అంతా ఇప్పుడు ఖాళీగా వుంది. . ఎమ్మెల్యే గారి అనుచరులంతా ఒక దగ్గర గుమిగూడి బాతాఖాణీ కొడుతున్నారు.

ఇద్దరూ మౌనం గా పి.ఏ గదిలోకి వెళ్ళారు.

రండి! రండి! మీ కోసం ఇదిగో ఈ ఫైల్సన్నీ తీస్తున్నాను. అంటూ అతను ఏవో కాగితాలు చెక్ నడిచింది చేరుకుంటున్నాడు

థేంక్స్ సార్! మీ వాళ్ళందరిన్నీ పిలిపించండి సార్! నమ్రతగా అన్నాడు ఏకాంబర్.

అదిగో బయట వున్నారు. ఇద్దరు ముగ్గురు బయట వసూళ్ళకి వెళ్ళారు. ఫోన్ చేసాను పని ముగించుకుని వచ్చేస్తుంటారు అన్నాడు పీ.ఏ.అలాగే సార్! అన్నాడు ఏకాంబర్.

ఇద్దరూ పి.ఏ ఎదురుగా అతి వినయం గా నిలబడ్డారు.అయ్యో!... నిలబడి వుండిపోయారే! ఆ కుర్చీల్లో కూర్చోండి సార్... సార్... మనలో మన మాట . మా ఎమ్మెల్యే గారు నా పేర కూడా పాలసీ రాయిస్తున్నారా? ఆశగా అడిగాడు పి.ఏ.ఏమో సార్! మా వాళ్ళ ఇరవై మంది దాకా వుంటారు. వాళ్ళందరికి ఒక్కొకరికీ పది లక్షల రూపాయల పాలసీ రాయమని అన్నారు, అన్నాడు ఏకాంబర్.

ఇరవై మందా....!? అనుకుంటూ తన దగ్గరున్న పేపరులో వాళ్ళ తాలూకా జాబితా అంతా చూస్తూ మౌనం గా తన పని చేసుకోబోతున్నాడు

.పి.ఏ మొహం కేసి ఆతృతగా చూస్తున్న ఏకాంబర్ ఇక వుండబట్టలేక అడిగేసాడు.

సార్! ఇరవై మంది లేరా? అందులో మీ పేరు ఉంది కదా? కుతూహలం గా అడిగాడు ఏకాంబర్.

సార్ సెక్యూరిటీ టీం వాళ్ళే ఇరవై మంది వున్నారు. గన్మేన్. నేనూ లేము. పోనీలెండి! వాళ్ళంతా రోజూ రిస్క్ జాబ్ లో వుంటారు. మాదేముంది. సార్ వెనుకే వందిమాగదుల్లా తిరగడమే నవ్వేస్తూ అన్నాడు పి.ఏ.

సారీ సార్! అన్నాడు ఏకాంబర్.

మీరెందుకు సారీ చెప్తారు. సార్ కి తెలుసుకదా! ఎవరికి ఏదవసరమో నవ్వేస్తూ అన్నాడు పి.ఏ.

సార్! ఈ ఇరవై మందికి జీతం ఎంతుంటుందంటారు? మనసులోనే వాళ్ళు అందరూ పది లక్షల రూపాయల పాలసీ కట్టగల స్థోమత వున్న వాళ్ళేనా అన్న అనుమానం తో అడిగాడు ఏకాంబర్.జీతమా, పాడా? వుండడానికి ఇల్లు ఇచ్చారు. నెలా నెలా ఇంటి బత్యం పంపిస్తారు. వీళ్ళకిక్కడ మస్తుగా మందు విందు వుంటాయి. అప్పుడప్పుడు ఇంటి అవసరాలకి అవసరమైతే పదో పరకో ఇక్కడ నా దగ్గర ఖాతా లో వాడుకుంటారు.

అదీ ఒక్కొకడికీ వెయ్యి రూపాయలు దాటితే ఇక ఆ నెల వాడకం బంద్ చెప్పాడు పి.ఏ. అదెలా రాత్రి పగలూ ఇక్కడ వుంటారు కదా కనీసం ఎంటొ కొంత జీతం ఇస్తున్నారేమో అన్నుకున్నాను అన్నాడు ఏకాంబర్.

వీళ్ళకెవరిస్తారండీ పని. చదువు సంధ్యల్లేని పోరంబోకులు పనీ పాటాలేని పైలా పచ్చీసులు. ఎమ్మెల్యే గారు ఏదో జాలిపడి చిన్నప్పటినుంచీ వీళ్ళని మేపుతున్నారు. పెళ్ళిళ్ళు చేసారు. ఇళ్ళు, వాకిలీ ఇచ్చారు. ఇంకా వాళ్ళకి జీతాలెందుకండీ బాబూ! ఎమ్మెల్యే గారిలానే వీళ్ళది రాజయోగం, నిలబడ్డం...కలబడ్డం... ఎదురొచ్చిన వాళ్ళని కుళ్ళబొడవడం. ఇదే వీళ్ళ పని. ఎమ్మెల్యే గార్ని కంటికి రెప్పలా కాపాడడమే వీళ్ళ

పని అన్నాడు పి.ఏ

అందరూ రాత్రి పగలూ ఇక్కడే వుంటారా?! ఆశ్చర్యం గా అడిగాడు ఏకాంబర్.

అవసరమైతే వుంటారు. లేదంటే కొందరు పగలు, కొందరు రాత్రి పనిని పంచుకుంటారు. అన్నాడు పి.ఏ.సార్! మీరేమీ అనుకోనంటే చిన్న ప్రశ్న? లోలోన భయం గా ఆందోళనగా అన్నాడు ఏకాంబర్.

అడగండి సార్! ఇందులో అనుకోవడానికి ఏముంటుంది నవ్వుతూ అన్నాడాయన.

ఎమ్మెల్యే గారు వీళ్ళందరిజ్కీఎ అంత పెద్ద పాలసీలు రాయమంటె ఎలా సార్? దానికి డబ్బు వీళ్ళు ఎలా కట్టగలరు? ఆతృతగా అడిగాడు.ఓస్ అదా మీ అనుమానం? అందుకేగా మీకోసం ఈ ఫైల్స్ తీస్తున్నది ఇదిగోనండి. ఇవి వాళ్ళందరి ఇంకంటాక్స్ రిటర్న్లు ఇవి వాళ్ళ పేర వున్న బస్సులు, క్రేన్ లు వగైరా అంటూ రెండు ఫైల్స్ ఏకాంబర్ చేతికి అందించాడు పి.ఏ.

ఆ ఫైల్స్ రెండూ చూస్తూ ఆశ్చర్యం గా నోరు వెళ్ళబేట్టేసాడు ఏకాంబర్. ఒకో వ్యక్తికి నెలకి రెండు లక్షల వరకూ ఆదాయం వస్తుంది. దానికి ఇంకంటాక్స్ కూడా కడుతున్నారు. అంతా వాస్తవ ఆదాయమే.

ఆ ఇరవై మంది బ్యాంకు పాస్ బుక్స్ కూడా ఏకాంబర్ చేతికి ఇచ్చి చూడమన్నాడు పి.ఏ.

ఇవి చాలు కదా! పాన్ కార్డులు, బ్యాంకు పాస్ బుక్కులు, వీళ్ళందరి ఆధార్ కార్డుల జిరాక్సులు ఇస్తే చాలు కదా! అడిగాడు పి.ఏ.

చాలు సార్ చాలు. వీళ్ళకి వ్యక్తిగతం గా ఇంతంత ఆదాయం వుందంటే పది లక్షలేమిటీ పాతిక

లక్షలైనా పాలసీ రాయొచ్చు ఆనందం గా అన్నాడు ఏకాంబర్.

మీకు కావలిసిన వన్నీ ఒక పేపరుపై రాసి ఇవ్వండి సర్! అవన్నీ ప్రక్కనే జిరాక్స్ సెంటర్ లో జిరాక్స్ చేయిద్దాం అన్నాడు పి.ఏ.సార్ ఈ ధరఖాస్తు ఫారాలన్నింటి మీద వాళ్ళ సంతకాలు కావాలి. ఒక్కొక్కర్నే లోపలకు పిలవండి సార్. నేను వాళ్ళ వివరాలు రాసుకుని సతకాలు తీసుకుంటాను. చెప్పాడు ఏకాంబర్.

ఏకాంబర్ అలా అనడం తరువాయి పి.ఏ కేకతో బిలబిలమంటూ వచ్చి వరుసలో నిలబడ్డారు.

ఎందుకు? ఏమిటీ? అని ప్రశ్నించకుండా ఏకాంబర్ సంతకాలు పెట్టమన్న దగ్గరల్లా సంతకాలు పెట్టి కొద్ది దూరం గా జరిగి నిలబడ్డారు.అందరివీ సంతకాలు అయ్యాయికదా! ఇక మీరు వెళ్ళిరండిరా వాళ్ళతో అన్నాడు పి.ఏ.

అయ్యా! సంతకాలు తీసుకున్నారు. మరి మా గొంతు తడపరా! అందరిలో ఎత్తుగా, లావుగా వున్నవాడు ఒకడు తన గుబురు మీసాలు మెలేస్తూ వినయం గా అన్నాడు.

ఒరేయ్ నాయనలారా! ఈ సంతకాలు మీ కోసమే తీసుకున్నారు. మీ పేర ఒక్కొక్కరికి మన ఎమ్మెల్యే గారు పది లక్షల రూపాయలు పాలసీ కడుతున్నారు. దీనికి లంచం కావాలా? నవ్వుతూ అన్నాడు పి.ఏ.

అదేంటీ పి.ఏ గారు మీరే మర్చిపోయారు. అయ్యగారు ఎప్పుడూ సంతకాలు తీసుకున్నా మా అందరికీ ముందుకు పైకం ఇస్తూనే వుండేవారుకదా! మర్చిపోయారా? మళ్ళీ అతడేఅన్నాడు.

ఇంతలో మేడిపండు అబద్ధాలరావు లోపలనుండి వస్తూ ఆ మాటలు విన్నాడు.

పి.ఏ ఇచ్చెయ్యవయ్యా మనిషికో వంద ఇచ్చెయ్ వస్తూనే అన్నాడు ఎమ్మెల్యే.

మరిక పి.ఏ మారు మాట్లాడకుండా తలో వంద రూపాయలు ఇచ్చి సంతకాలు తీసుకున్నారు.

సార్! పదహారుమందే వచ్చారు. మిగతా నలుగురు రావాలి తను నింపిన దరఖాస్తులు లెక్కేస్తూ అన్నాడు.ఏకాంబర్.

ఇద్దరు మార్కెట్టుకు వెళ్ళారు. వచ్చేస్తారు. మరో ఇద్దరు ఒంట్లో బాగోలేక ఇళ్ళదగ్గరే వుండిపోయారు ఎలా? అడిగాడు పి.ఏ.

వాళ్ళిద్దరూ బజార్లోకి ఎందుకు వెళ్ళారు? పి.ఏని అడిగాడు ఎమ్మెల్యే.

ఏదో ఆటోలో గొడవ సార్! ఎవడో ఆటోవాడు ఫోన్ చేస్తే వాళ్ళిద్దరూ పరిగెత్తుకెళ్ళారు. అని పి.ఏ ని పిలిచి చెప్తుండగానే ఎమ్మెల్యే ఇంటి ఆవరణలోకి రెండు ఆటోలు రివ్వున దూసుకువచ్చాయి.

ఆటోలు ఆవరణలోకి రావడంతోనే ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరవు గారు పి.ఏ దగ్గరనుండి బయట పోర్టికోలోకి చూసారు.

ఆటోల్లోనుండి డ్రైవర్లను వారిద్దరి మెడలమీద చేతులు వేసి కాలర్ పట్టుకుని ఇద్దరు ధృడకాయులు బలవంతం గా ఆటోల్లోనుండి లాకు వచ్చారు.

ఆటోలు రెండు ఎమ్మెల్యే గారి ఇంటి ఆవరణలోకి రావడంతోనే అక్కడే వున్న ఎమ్మెల్యే గారి కాపలాదారులందరూ ఆ ఆటోల చుట్టూ వలయంలా చుట్టుముట్టేసారు.

వృత్తాకారం లో నిలబడి సిద్ధంగా వున్న వీధి గూండాల్లా పిడికిలి బిగించి మధ్యలో ముద్దాయిలా వున్న ఆటో డ్రైవర్ల చుట్టూ చుర చుర చూస్తూ ఉన్నారు.

మధ్యలో ఆటో డ్రైవర్లను మెడలు వంచి లాక్కొచ్చిన ఎమ్మెల్యే మనుషులిద్దరూ ఆ ఇద్దరు డ్రైవర్లను కాళ్ళ మీద పడేల గట్టిగా తోసేసారు.ఎత్తుగా లావుగా ఎనుబోతుల్లా వున్న ఎమ్మెల్యే గారి మనుషుల చేతుల్లో గిలగిలలాడుతున్న ఆటో డ్రైవర్లు ఇద్దరూ వాళ్ళు అలా గట్టిగా నెట్టేసరికి అమాంతం వెళ్ళి ఎమ్మెల్యే కాళ్ళమీద పడిపోయారు.

ఏమైందిరా ఏంది ఈ గోల కోపంగా ఎమ్మెల్యే అడిగాడు.ఈల్లిద్దరూ ఈ ఆటోల్ని అమేస్తున్నారయ్యా! మాకా విషయం తెలిసి ఆర్టీవో ఆఫీసు దగ్గరకెళ్ళి పట్టుకొచ్చాం ఆ ఇద్దరిలో ఒకడన్నాడు.



జరిగిన కథ : నూకరత్నం, ఏకాంబర్ కలిసి కాళీ మాత గుడికి వెళ్ళి దర్శనం చేసుకుని వస్తుండగా నూకరత్నానికి చిట్ మేనేజర్ ఫోన్ చేసి కోటి రూపాయల చిట్టీ కట్టడానికి వేరే థియేటర్ ఓనర్, షాపింగ్ మాల్ ఓనర్ రెడీ గా వున్నారని చెపుతాడు. ఆ ఆనందాన్ని తట్టుకోలేక ఇదంతా ఏకాంబర్ చేసిన సహాయమే అని అతని చేయిని ముద్దు పెట్టుకుంటుంది నూకర త్నం. ..............................................ఆ తరువాత

ఇద్దరిలో ఒకడన్నాడు.

"ఏరా! నిజమేన? ఆటోలు తోలుకు బ్రతకండిరా అని ఈ ఆటోలు మీకిస్తే నాకే ఎగనామం పెట్టి మోసం చేద్దామనుకున్నార్రా?" కోపంగా ఇద్దర్నీ ఒకరి తర్వాత ఒకర్ని బలంగా తన్నాడు ఎమ్మెల్యే అబద్ధాలరావు.

ఎమ్మెల్యే అలా ఎగిరి తంతాడని ఊహించని ఆటో డ్రైవర్లు ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు ఎగిరి పడ్డారు.

" ఈ ఆటోలు అమ్మేయడానికి వీళ్ళ దగ్గర్నుంచి జెరాక్స్ కాగితాలే కదరా!" ఆలోచిస్తూ అన్నాడు ఎమ్మెల్యే.

" ఇదిగోనయ్యా అక్కడ ఈళ్ళ దగ్గర లాక్కున్న కాగితాలు" అంటూ ఇద్దర్లో ఒకడు " సీ" బుక్స్ రికార్డు, ఇన్స్యూరెన్స్ పేపర్లు అన్నీ ఎమ్మెల్యే చేతికిచ్చాడు.

అవి చూస్తూనే ఎమ్మెల్యే అదిరిపడ్డాడు.

"అమ్మ నా కొడుకుల్లారా! దొంగ సీ బుక్ పుట్టిస్తార్‌రా? అరేయ్, ఈ నాకొడుకుల్ని బొక్కలిరగదియ్యండ్‌రా !" అంటూ పోర్టికోలో ఉన్న కుర్చీలో  కూర్చున్నాడు ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు.

అంతే!

ఎమ్మెల్యే నోట ఆమాట రాగానే చుట్టూ రాక్షసుల్లా నిలబడ్డ రౌడీలు కబేళా మీద పడ్డ రాబందులకుమల్లే ఆ ఆటో డ్రైవర్లి మీదపడి ఇష్ట మొచ్చి నట్టు కాళ్ళతో తంతూ, చేతుల్తో పిడిగుద్దులు గుద్దుతూ బంతాట ఆడుకున్నారు.

ఆటో డ్రైవర్లు ఇద్దరూ బట్టలు చిరిగి శరీరమంతా అక్కడక్కడా గీరుకుపోయి రక్తం చిందుతూ శవాల్లా పడిఉన్నారు.

"ఇక చాలు, వీళ్ళని ఆ బీచ్ దగ్గర పడేసి రండ్‌రా!" అన్నాడు గంభీరంగా ఎమ్మెల్యే.

ఆ దృష్యం చూడలేక ఏకాంబర్ కి ముచ్చెమటలు పట్టాయి. గూండాయిజమంటే ఇలా ఉంటుందా అనుకున్నాడు. నూకరత్నమైతే ఆ దృశ్యం చూడలేక తల దించుకుని మౌనంగా ఉండిపోయింది.

ఆ ఆటో డ్రైవర్లిద్దర్నీ బీచ్ దగ్గర పడేసి వచ్చిన ఎమ్మెల్యే గూండాలందరూ తిరిగి ఎవరి స్థానంలో వాళ్ళు మరబొమ్మల్లా వెళ్ళి నిలబడి వేటకుక్కల్లా కాపలా కాస్తూ నిలబడ్డారు.

ఆటో వాళ్ళని లాకువచ్చిన ఇద్దరు రౌడీలు ఎమ్మెల్యే దగ్గర చేతులు కట్టుకుని నిలబడి జరిగిందంతా చెప్తున్నారు.

" అయ్య! మన ఆటో డ్రైవర్ పి.యే. గారికి ఫోన్ చేసి చెప్పాడయ్యా!వీళ్ళిద్దరూ పది రోజులుగా ఇదే ప్లాన్ లో ఉన్నారట. ఈరోజు ఆటోలు తీసుకుని ఆర్టీవో ఆఫీసు కాడకు వెళ్ళడం చూసి పి.యే. గారికి ఫోన్ చేసాడట. ఆ వెంటనే మేమిద్ధరం వెళ్ళాం. " ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు వినయంగా చెప్పారు.

"సరిసరి!ఆటో అద్దెలన్నీ రోజూ సక్రమంగా వసూలు చేస్తున్నారా?" గదమాయిస్తూ అడిగాడు ఎమ్మెల్యే.

" అయ్యో! రోజూ ఆటో బాడుగలన్నీ వసూలు చేసి పి.యే.గారికి అణా పైసలతో కట్టేస్తున్ నామయ్యా!" అన్నారిద్దరూ.

"సరే ఇక మీరు వెళ్ళండి" అన్నాడు ఎమ్మెల్యే.

వాళ్ళిద్దరూ తమతం స్థానాల్లోకి వెళ్ళి నిలబడ్డారు.

ఎమ్మెల్యే పోర్టికోలోనుంచి పి.ఏ. గదిలోకి వచ్చాడు.

"పి.యే గారూ ఇలాంటి దొంగవెధవలకి ఎలా అయ్యా ఆటోలు అద్దెకిచ్చావ్? నీకు బుద్ధుందా??" కోపంగా పి.యే.మీద విరుచుకు పడ్డాడు." లేదండయ్యా! మన ఆటో డ్రైవర్లలోనే ఎవరో వీళ్ళని తీసుకువచ్చి పని లేదు. ఆటో ఇస్తేతోలుకు బ్రతుకుతాడంటే కొత్త ఆటోలు తెప్పించి ఇచ్చానయ్యా" నమ్రతగా అన్నాడు పి.యే.

ఎమ్మెల్యే గదిలోకి రావడంతోటే ఏకాంబర్,నూకరత్నం గబాలున లేచి నిలబడ్డారు.

"మీరు అందరి దగ్గరా కాగితాల మీద సంతకాలు పెట్టించుకుంటే ఎంత డబ్బు కట్టాలో లెక్కేసి చెప్పండి మా పి.యే ఇస్తాడు తీసుకోండి.! రశీదులు రేపు సాయంత్రానికల్లా మా పి.యే చేతికి అప్పగించండి." అన్నాడు ఎమ్మెల్యే.

" అలాగే సార్!" నమ్రతగా అన్నాడు ఏకాంబర్.

"పి.యే.గారూ ఇందాకల వచ్చాడే, అతనిచ్చిన డబ్బు ఆ సూట్ కేస్ లో ఉంది కదా! వీళ్ళని ఎంతో అడిగి ఇచ్చెయ్యండి! ఏజెంట్ గారితో వచ్చిన అమ్మాయికి ఆ సూట్ కేస్ బహుమతి గా ఇచ్చెయ్యండి." అంటూ ఏకాంబర్ కేసి, నూకరత్నం కేసి నవ్వుతూ చూసాడు ఎమ్మెల్యే." థేంక్సండీ!" వినయంగా అంది నూకరత్నం.

" ఉదయం నుండీ ఈయనతో పడిగాపులు పడి ఉన్నారు కదా! అందుకు..ఆ! ఏకాంబర్ గారూ రేపు రశీదులన్నీ తెచ్చి ఇవ్వడం మర్చిపోకండి. మీ పనంతా ఈరోజే కంప్లీట్ చేసుకోండి. ఆ రశీదులు చాలా ముఖ్యం. ఇంకం టాక్సు కోసం మా ఆడిటర్ గారు తెమ్మన్నారు. ఇవి కడితే ఏదో కొంత ట్యాక్స్ మిగులుద్దటటకదా     మీకు లాభం, మాకు లాభం

అందుకే మీరు అడగ్గానే మా పి.యే.గారుచెప్పింది గుర్తొచ్చి ఈల్లందరి పేర పాలసీలు కడుతున్నాను. నేను వెళ్ళాలి. పని కానివ్వండి." అంటూ ఎమ్మెల్యే లోపలకు వెళ్ళిపోయారు.

బయట ఉన్న ఇద్దర్నీ పిలిచి సంతకాలు తీసుకున్నాడు ఏకాంబర్. ఇరవై మందికి నలభై పాలసీ పేపర్ల మీద సంతకాలు తీసుకున్నాడు. వాటికి కావల్సినపేపర్లన్నీ తీసుకున్నాడు. బ్యాంకు పాస్ బుక్స్, పాన్ కార్డులు, ఆధార్ కార్డులు, అన్నీ తీసుకుని ఎమ్మెల్యే గారింటికి కొద్ది దూరంలో ఉన్న జిరాక్స్ సెంటర్ కి వెళ్ళాడు ఏకాంబర్.

క్షణాల్లో జెరాక్స్ తీయించుకుని వచ్చేసాడు. ఎందుకైనా మంచిదని అన్ని కాపీలు నాలుగేసి జెరాక్స్ తీయించి తన దగ్గర భద్రపరుచుకున్నాడు.ఇంటి దగ్గర ఉండిపోయిన ఇద్దరి గురించి పి.యే. ని అడిగాడు ఏకాంబర్.

" సార్ మిగతా ఇద్దరి సంగతి?"" మీరు వెళ్తార? మా వాడ్ని ఒకడ్ని మీతో పంపిస్తాను. వీళ్ళందరి ఇళ్ళు ఒకే దగ్గర. కంచరపాలేం హైవే ప్రక్కన " వాంబే గృహాలు" ఉన్నాయి చూశారా, అందులోనే ఉంటున్నారు" చెప్పాడు పి.యే.

" ఓ, తెలుసు సార్!" ఆనందంగా అన్నాడు ఏకాంబర్.

" వాళ్ళిద్దరి దగ్గరా సంతకాలు తీసుకోండి. ఈ ఇరవైమందికి ఏడాదికి ఎంత ప్రీమియం కట్టాలో చెప్తే, ఆ డబ్బు ఆ కొత్త సూట్ కేస్ తో సహా ఇచ్చేస్తాను " నవ్వుతూ అన్నాడు పి.యే.

" సుమారు పన్నెండు లక్షల వరకూ అవుతుంది సార్.! అన్ని రైడ్ లు జత చేసి కాలిక్యులేట్ చేయ్యాలి. మా డెవలప్ మెంట్ ఆఫీసరు     గారుంటే పని క్షణాల్లో అయ్యేది" నీళ్ళు నములుతూ అన్నాడు ఏకాంబర్.

ఓ పని చెయ్యండి సార్. పన్నెండు లక్షలూ ఇచ్చేస్తాను. మిగిలితే రశీదులతోబాటు తెచ్చివ్వండి. ఏమైనా కట్టాల్సివస్తే నాకు ఫోన్ చెయ్యండి. మావాడితో మీకు ఆ డబ్బు పంపిస్తాను." చెప్పాడు పి.యే.

" మీఇష్టం సార్. సార్, మరో విషయం. మన వాళ్ళందరికీ ఒకే ముద్దగా పది లక్షల రూపాయల పాలసీ కడితే మెడికల్ ప్రాబ్లం వస్తుందని రెండుగా చీల్చి అయిదేసి లక్షల చొప్పున రెండు పాలసీలు రాసాను పర్వాలేదు కదా" భయం భయం గా అడిగాడు ఏకాంబర్, పి.యే. ని." గొప్పగా చెప్పారు. పళ్ళు రాలగొట్టుకోవడానికి ఎన్ని రాళ్ళైతే ఏం సార్! ఎమ్మెల్యే గారు చెప్పినట్టు పదిలక్షలయింది కదా!" అన్నాడు పి.యే. పకపకా నవ్వుతూ.

" థేంక్యూ సార్! మీరేమంటారోనని భయపడ్డాను." అన్నాడు ఏకాంబర్.

" ఉండండి! లోపల ఉన్న సూట్ కేస్ తెస్తాను" అంటూ వెళ్ళాడు పి.యే.

ఆనందంగా నూకరత్నం కేసి చూసాడు ఏకాంబర్.

" నిజంగా మెడికల్ ప్రాబ్లం అవుతుందా?" గుసగుసగా అంది నూకరత్నం.

"పది లక్షలు కాదు, పాతిక లక్షలున్నా ఆ ప్రాబ్లం రాదు. వీళ్ళంతా ముప్పై ఏళ్ళలోపు వాళ్ళే కదా! చిన్న అబద్ధం....తప్పదు కదా!" అన్నాడు ఏకాంబర్.

లోపలినుండి సూట్ కేస్ తో డబ్బు తెచ్చి ఏకాంబర్ ముందు పెట్టాడు పి.యే.

టీ పాయ్ మీద సూట్ కేస్ తెరిచి  లోపల ఉన్న నోట్ల కట్టలన్నీ ఏకాంబర్ కి చూపించి పన్నెండు లక్షలు లెక్క అప్పజెప్పాడు పి.యే." ఇక మేము వెళ్తాము సార్. మీవాడ్ని పంపిస్తే దార్లో మిగిలిన ఇద్దరి దగ్గరా సంతకాలు తీసుకుని ఆఫీసుకు వెళ్ళిపోతాం" చెప్పాడు ఏకాంబర్.  "అలాగే!" అంటూ బయట నిలబడ్డ ఒక అనుచరుడ్ని పిలిచి ఏకాంబర్ వాళ్ళతో పంపించాడు పి.యే.

" ఇదిగో, నా బైక్ మీద వెళ్ళి వీళ్ళకి మనవాళ్ళ ఇల్లు చూపించి వెంటనే వచ్చేయ్, అదును దొరికింది కదాని ఇంట్లో కూర్చోక" అంటూ మిగిలిన ఇద్దరి పేర్లూ చెప్పాడు పి.యే.

ఆ అనుచరుడు బైక్ మీద ముందు వెళ్తూంటే అతన్ని ఫాలో అయ్యారు ఏకాంబర్, నూకరత్నం లు.ఎమ్మెల్యే ఇంటి దగ్గర బైక్ స్టార్ట్ చేసే ముందే డెవలప్ మెంట్ ఆఫీసర్ రాజనాల రాజేంద్రకి ఫోన్ చేసి విషయం అంతా చెప్పాడు ఏకాంబర్ ఆనందంగా.

ఏకాంబర్ చెప్పింది వింటూనే ఎగిరి గంతేసి 'క్షణాల్లో గోపాలపట్నంలో ఉంటానూ అంటూ ఫోన్ పెట్టేసాడు రాజనాల

రాత్రి పది గంటలకి ఇల్లు చేరుకున్నాడు ఏకాంబర్.

ఇంట్లో అందరూ టీవీ ముందు కూర్చుని ఉన్నారు. వస్తూనే ఆకలిగా ఉందని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు ఏకాంబర్." ఏరా! నీ టార్గెట్ ఎంత వరకూ వచ్చింది?" టీవీ ముందునుండి లేస్తూ అడిగింది ఏకాంబర్ తల్లి పర్వతాలు.

" అయిపోయిందమ్మా! ఒక్కరోజులో అద్భుతం జరిగినట్టు జరిగింది " ఆనందంగా అన్నాడు ఏకాంబర్.

" నమ్మకంతో పనిచేస్తే ఏ పనన్నా తప్పకుండా సక్సెస్ అవుతుందిరా !" అంటూ తండ్రి పీతాంబర, కూడా టీవీ ముందు నుండి కొడుకు దగ్గరకు వస్తూ అన్నాడు.

" మీ ముగ్గురూ ఇంతవరకూ పడుకోలేదేం? ఎప్పుడూ నేను వచ్చే సరికి గాఢ నిద్రలో ఉండేవారు" అన్నాడు ఏకాంబర్.

"ఉదయం నువ్వు ఆందోళనగా వెళ్ళడం చూసాం కదరా టైం కూడా లేదు, టార్గెట్ కంప్లీట్ కాలేదన్నావు కదా! ఏం చేస్తున్నావో?!" ఎలా నీటార్గెట్ కంప్లీట్ అవుతుందోనని మాకూ ఆందోళన కలిగిందిరా." అంది తల్లి.

" నిజమేనమ్మా! ఈసారి నేను వెనకబడిపోతానేమోననే అనుకున్నాను. కానీ రత్నం ఉంది కదా! మంచి ఐడియా ఇచ్చింది. అంతే. నా కళ్ళను నేనే నమ్మలేనంతగా పాలసీలు దొరికాయి" సంతోషంగా అన్నాడు ఏకాంబర్.

" అదే అనుకున్నాన్రా, మన షాపుకొస్తావని ఎదురుచూసాను. నువ్వు రాకపోయేసరికి ఏదో పనిలో ఉన్నావనుకున్నాను. నేనూ నాకు బాగా తెలిసిన కష్టమర్లని పాలసీ గురించి అడిగాను. కడతాను, మీ అబ్బాయిని నా దగ్గరకు పంపమన్నార్రా" కొడుక్కి ఎదురుగా డైనింగ్ టేబుల్ మీద కూర్చుంటూ

అన్నాడు తండ్రి పీతాంబరం.

" మీరూ ఇంకా భోజనం చెయ్యలేదా ?" తండ్రి తన ఎదురుగా కూర్చోవడంతో ఆశ్చర్యంగా అడిగాడు ఏకాంబర్.

" లేదురా, నువ్వు వస్తే కలిసి భోంచేస్తానని టీవీ ముందు కూర్చున్నారు. " తల్లి పర్వతాలు అంది.

ఎప్పుడూ లేంది తండ్రి తనకోసం ఆలోచించడం ఏకాంబరానికి ఆనందం కలిగించింది. తను వచ్చేవరకూ భోజనం కూడా చెయ్యకుండా తండ్రి ఎదురు చూస్తున్నాడని తల్లి చెప్పగానే మనసంతా ఉప్పొంగిపోయింది. అదీగాకుండా షాపుకొచ్చిన కష్టమర్స్ ని తన కోసం, తన టార్గెట్ కంప్లీట్ చేయడం కోసం తండ్రి నోరు విడిచి పాలసీ అడిగాననేసరికి ఆనందం పట్టలేకపోయాడు.

" థేంక్స్ నాన్నా! నాకోసం పాలసీ కూడా అడిగారు." అంటూండగానే ఏకాంబర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గబుక్కున నీళ్ళు తుడుచికున్నాడు.

" మేము కాకపోతే నీకోసం ఇంకెవరు ఆలోచిస్తార్రా? భోజనం చెయ్యి నాన్నా!"కొడుకు తల ప్రేమగా నిమురుతూ అంది తల్లి పర్వతాలు." నువ్వు బాగుంటే మేము బావున్నట్టే కదరా! నీ ఆనందమే మా ఆనందం. ఉదయం నువ్వంత ఆందోళనగా కనిపించడం నేనెప్పుడూ చూడలేదు. షాపులో ఉన్నానేగానీ నీగురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. అంతలో ఒక కష్టమర్ వచ్చాడు. అడిగాను. అంతే! ఇందులో గొప్పతనం ఏముంది? పర్వతాలూ..ఆ చారు ఇలా అందుకో!" కంచంలో పప్పు అన్నం కలుపుకుంటూ అన్నాడు పీతాంబరం.

" మీ తండ్రీ కొడుకుల ముచ్చట్లు ఆపి ముందు భోజనాలు చెయ్యండి" ముసిముసిగా నవ్వుతూ అంది తల్లి పర్వతాలు." అమ్మా నాకు నిద్రొస్తోంది. టీవీ కట్టేస్తున్నాను. " అంటూ అంతవరకూ టీవీ ముందు కూర్చున్న మంగ టీవీ కట్టేసి వెళ్ళిపోయింది.

" అలాగే! వెనక స్విచ్ కూడా ఆపేసి వెళ్ళు" డైనింగ్ టేబుల్ దగ్గర నుండే అరిచింది పర్వతాలు.

" అవునంట! మీరు షాపు దగ్గరకు రమ్మన్నారట కదా, ఎందుకు నాన్న?" భోజనం చేస్తూ అడిగాడు ఏకాంబర్.


"అదేరా! మన ఇంటి గురించి" అన్నాడు పీతాంబర్.

" అదా, మనం అన్నీ సబ్ మిట్ చేసాక రెండు మూడు నెలలకు మా హెడ్డాఫీసు నుండి ఆర్డర్ వస్తుందట నాన్నా! ఈలోగా మనం ఇల్లు పడగొట్టి చదును చేయించాలి." అన్నాడు ఏకాంబర్.

" మీ ఇద్దరూ ఇంటి గురించే ఆలోచిస్తున్నారు గానీ ఇంట్లో ఆడ పిల్ల ఉంది, దాన్నో ఇంటిదాన్ని చెయ్యాలని చూడరా?" కోపంగా అంది పర్వతాలు. " సంబంధాలు చూస్తున్నాం కదా కుదరనీ" అన్నాడు పీతాంబరం.

" మంచి సంబంధం చూడండి నాన్న! కట్న కానుకలకి వెనుకాడకండి! ఇల్లు కట్టడం ఆపేసైనా ముందు చెల్లెలి పెళ్ళి ఘనంగా చేద్దాం" అన్నాడు ఏకాంబర్.

" మానాయనే! చూడండి..చిన్నోడికున్నంత బాధ్యత కూడా మీకు లేదు" మొగుడి మీద విరుచుకుపడుతూ అంది పర్వతాలు



జరిగిన కథ : ఎమ్మెల్యే అనుచరులందరితో పాలసీలు కట్టించి ఇంటికి చేరుకున్న ఏకాంబరానికి భోజనం చేయకుండా తనకోసం తండ్రి ఎదురు చూడడం ఆనందాన్నిస్తుంది. తల్లి, తండ్రి, ఏకాంబరం మాటల మధ్యలో ఇల్లు కట్టే ప్రస్తావన, చెల్లెలి పెళ్ళి విషయం వస్తుంది....

......................................ఆ తర్వాత....

" పెద్దాడికి కూడా ఈ విషయం ఫోన్లో చెప్పానే పర్వతం. వాడు కూడా ఎన్నాళ్ళనుంచో ఉద్యోగం చేస్తున్నాడు కదా! ఇంటికి కూడా ఎప్పుడూ సరిగా డబ్బు పంపించలేదు కదా! అందుకే చెల్లి పెళ్ళికి అయిదు లక్షలన్నా నువ్వు సర్దాలిరా అని చెప్పాను " అన్నాడు పీతాంబరం.

" ఏమన్నాడు? సరేనన్నాడా? " ఆశగా అంది పర్వతాలు.

" నా మాటలన్నీ విని సరే నాన్న! ఇంటికొస్తాగా, అప్పుడు మాట్లాడుకుందాం. అంటూ ఫోన్ కట్ చేసాడు." చెప్పాడు పీతాంబరం.

' పెద్ద కొడుకు అంత నిర్లిప్తంగా మాట్లాడాడనేసరికి ఒక్కసారే డీలా పడిపోయింది పర్వతాలు. పెద్దాడే ఇంటిని ఓ దారికి తెస్తాడనుకుంది. వాడే ఓ దారీ తెన్నూ లేకుండా పోయాడు ' మౌనంగా మనసులోనే మధన పడింది.

" అమ్మా ! ఎందుకమ్మా బాధపడతావ్? అన్నయ్య వస్తానన్నాడు కదా! వచ్చాక ఆలోచిద్దాం. ఈలోగా మంచి సంబంధం చూడండి " భోజనం ముగించి డైనింగ్ టేబుల్ దగ్గర నుండి లేచాడు ఏకాంబర్.

" సరేరా ! నువ్వెళ్ళి పడుకో! రేపు మళ్ళీ ఉదయాన్నే లేవాలి కదా! " అన్నాడు పీతాంబరం.

" అలాగే నాన్నా! " అంటూ అక్కడినుండి వెళ్ళి డ్రస్ మార్చుకుని హాల్లోనే ఓ మూలనున్న మంచం వాల్చుకుని మేను వాల్చాడు ఏకాంబర్.

భార్యాభర్తలిద్దరూ కొడుకుకేసి చూస్తూ మురిసిపోయారు.

ఆ వారంలోనే ఏకాంబర్ అన్న నీలాంబర్ ఇంటికొచ్చాడు. పెట్టేబేడా సర్దుకుని మరీ వచ్చేసాడు. పెద్దకొడుకు అలా సామాన్లన్నీ సర్దుకుని రావడం చూస్తూనే తల్లి పర్వతాలు గుండె గుబేల్మంది. నీలాంబర్ వచ్చీరావడంతోనే సామాన్లన్నీ ఇంట్లో పడేసి ఊరిమీదకు పోయాడు. ఆరాత్రి తండ్రి వచ్చి నిలదీసి అడిగితే అసలు విషయం చెప్పాడు. నీలాంబర్ పని చేస్తున్న సాఫ్ట్ వేర్ కంపెనీలో సగం మందికి పని లేదని ఉద్యోగాలు తీసేసారని చెప్పాడు. ఒక్క వాళ్ళ కంపెనీలోనే కాదని, అన్ని కంపెనీల్లోనూ సాఫ్ట్ వేర్ ఉద్యోగులందరూ ఉద్యోగాలు ఊడి రోడ్డున పడ్డారని చెప్పాడు. పెద్ద కొడుకు చెప్పింది వింటూనే భార్యాభర్తలు ఇద్దరూ అచేతనంగా ఉండిపోయారు. ఎంతో ఉన్నతంగా ఎదుగుతాడనుకున్న పెద్దకొడుకు ఇలా కుదేలై కనిపించేసరికి వాళ్ళు తట్టుకోలేకపోయారు.

" ఈ అయిదేళ్ళ నుండి ఉద్యోగం చేస్తున్నావు కదరా ఆ జీతం అంతా ఏమైంది? " కోపం తట్టుకోలేక అడిగాడు పీతాంబరం.

" ఖర్చయిపోయింది నాన్నా! ఈరోజు ఇలాంటి గడ్డు పరిస్తితి ఎదురవుతుందని తెలిస్తే జాగ్రత్త పడేవాణ్ణి. నెలనెలా వేలల్లో జీతం చేతికందడంతో కండకావరంతో కిందామీదా ఆలోచించకుండా జల్సాగా తిరిగేసాను. తప్పయిపోయింది మీరు ఫోన్ చేసారు కదా అప్పుడు...అప్పుడు..మీకు సమాధానం చెప్పలేక సిగ్గుతో చచ్చిపోయాను నాన్నా !" బాధగా తల దించుకుంటూ అన్నాడు నీలాంబర్. పెద్దకొడుకు అలా అనేసరికి ఇక వాళ్ళు ఏమీ మాట్లాడలేకపోయారు. ఏకాంబర్ కూడా సోఫాలో కూర్చుని

ఉన్నాడు. అన్న నీలాంబర్ చెప్పిందంతా వింటూనే కూర్చున్నాడు గానీ ఏం మాట్లాడలేదు. " ఏకాంబర్ గాడిలా నేనూ స్కూలు ఎగ్గొట్టి చదువుకోకుండా ఉండి ఉంటే బావుండేది నాన్నా! వాడిలా నేనూ ఇక్కడే ఏదో ఒకటి చేసుకుని హాయిగా ఇంట్లోనే వుండేవాణ్ణి. " విచారంగా ఏకాంబర్ ప్రక్కనే కూలబడి ఏడుస్తూ అన్నాడు నీలాంబర్.

అన్న అలా అనేసరికి అదిరిపడ్డాడు ఏకాంబర్. పెద్ద కొడుకు అలా అనేసరికి తండ్రి పీతాంబరానికి కోపం తారాస్థాయికి చేరింది. " చదువుకోవడం కాదురా! నీకు కనీస సంస్కారం లేక ఇలా తయారయ్యావు. ఎదుటివాడ్ని చులకనగా చూడడం మాని నీ ఏడుపు నువ్వు ఏడుచుంటే బాగుపడేవాడివి. ఆడికి చదువు అబ్బకపోయినా సన్స్కారం అబ్బింది. అదే ఈ రోజు వాడికి మాకు తిండి పెడుతోందిరా! " కోపంగా అన్నాడు పీతాంబరం. " నేనేమన్నానని అలా కోపంగా అరుస్తారు? ఇంత చదువు చదివి మీకు ఏ విధంగా సహాయపడలేక పోతున్నాను కదా అని అన్నాను " అన్నాడు నీలాంబర్. " చాల్చాలు . ఇన్నాళ్ళు నువ్వు మాకు ఉపయోగపడింది చాలు. నెలకు వేలకువేలు సంపాదించడం గొప్ప కాదురా అందులో అర్ధ రూపాయి వెనకేసినవాడు గొప్పవాడు. ఉద్యోగం సద్యోగం లేకపోయినా బాధ్యతైనవాడు బంధాలకు కట్టుబడి బ్రతుకు తాడురా! " అన్నాడు పీతాంబరం. తండ్రి మాటలు వింటూనే చిరాగ్గా లేచి గదిలోకి వెళ్ళిపోయాడు నీలాంబర్. " ఊరుకోండి ! ఉద్యోగం పోయి వాడేదో బాధలో నోటికొచ్చింది అంటే మీరూ రెచ్చిపోతారా? చూడండి, బాధపడి ఎలా వెళ్ళిపోయాడో ! " బాధగా అంది పర్వతాలు. భార్య చెప్పింది విని పీతాంబరం కూడా కోపంలో తానూ వాడ్ని బాధపెట్టేసానని మనసులో మధనపడ్డాడు. అన్న అలా బాధగా గదిలోకి వెళ్ళడంతో ఏకాంబర్ మనస్సు చివుక్కుమంది.

గబాలున లేచి అన్న దగ్గరకు వెళ్ళాడు. " ఎందుకురా! నీలాంబర్ బాధపడతావ్ ! ఇప్పుడేమయింది ? బోడి ఉద్యోగమేగా పోయింది. నీ టాలెంట్ కి వంద ఉద్యోగాలు నీ కాళ్ళ దగ్గరకు వస్తాయి. " అంటూ అన్న నీలాంబర్ ప్రక్కకు వెళ్ళి భుజం మీద చెయ్యివేసి ఓదార్పుగా అన్నాడు. " లేదురా నేను ఎన్నో ప్రయత్నాలు చేసాను. చేసి ఛెసి విసిగిపోయి ఇలా ఇంటికి వచ్చాను. అసలు విషయం తెలిస్తే అమ్మా నాన్నా ఇంకా బాధపడతారు " దాదాపు ఏడుస్తూనే అన్నాడు నీలాంబర్. గదిలో ఉన్న అన్నదమ్ములిద్దరి మాటలు వింటూ శిలల్లా నిలబడ్డారు భార్యాభర్తలిద్దరూ. అలివేలు మంగ మాత్రం గదిలో మూలనున్న మంచం మీద హాయిగా నిద్రపోతోంది.

" ఏమైందిరా ! ..నాతో చెప్పరా! ఎందుకింత ఆందోళన పడుతున్నావ్ ? " అన్న భుజాలని అనునయంగా నిమురుతూ అన్నాడు ఏకాంబర్.

" నీకు తెలీదురా!.. మీకెవరికీ తెలీదు. నా ఉద్యోగం పోయి ఆర్నెల్లయ్యింది. ఈ ఆర్నెల్లు ఎన్నో కంపెనీల చుట్టూ తిరిగాను. జీతం లేక చేతిలో ఉన్న డబ్బు అయిపోయి ఒకపూట తిని తినక ఎన్ని రాత్రుళ్ళు మిమ్మల్నందరినీ తల్చుకుని ఏడ్చానో నాకు తెలుసు. ఒకోసారి ఎవరికీ చెప్పకుండా ఎటైనా పారిపోదామనుకొన్నాను...ఒకోసారి ఇలా ఇంటికి తిరిగి రాకుండా ఆత్మహత్య చేసుకుందామనుకునేవాడ్ని. కానీ, అంతపనీ చెయ్యడానికి ధైర్యం చాలక ఇలా తల దించుకుని తిరిగొచ్చాన్రా! తల ఎత్తుకుని వెళ్ళిన వాడ్ని తల దించుకుని వచ్చాను ..." తమ్ముడి ఒళ్ళో తల పెట్టుకుని భోరున ఏడుస్తూ చెప్పాడు నీలాంబర్.

గది బయట నిలబడి నీలాంబర్ చెప్పిందంతా వింటున్న పీతాంబరం, పర్వతాలు అదిరిపడ్డారు. భయంతో బెంబేలెత్తిపోయారు. ఆందోళనగా గదిలోకి వెళ్ళి ఏకాంబర్ ఒడిలో వాలిపోయి ఉన్న నీలాంబర్ ని పట్టుకుని ఇద్దరూ వలవలా ఏడ్చేసారు. " ఒరేయ్ పెద్దా! నీ సంపాదన కోసం మేము నిన్ను పెంచలేదురా! నువ్వు దర్జాగా ఉంటావని..రాజాలా బ్రతకాలని....కళ్ళల్లో పెట్టుకుని కడుపులో దాచుకుని మిమ్మల్ని పెంచుకున్నమురా! మీరు మాకు వారసులే కాదురా! మా యింటి దీపాలు. మీరే లేకపోతే మేము ఏమైపోవాలి ? నేనూ మీ నాన్న ఎవరికోసం బ్రతకాలిరా? " భోరున ఏడుస్తూ నీలాంబర్ ని కౌగిలించుకుంది పర్వతాలు. పీతాంబరం మౌనంగా కొడుకు తల నిమురుతూ నిలబడ్డాడు.

" నీలాంబర్ ! నీకు మేమంతా ఉన్నాం కదరా ! ఈ పిచ్చి ఆలోచనలు మానేయ్. నువ్వే పదిమందికి ఉద్యోగాలు ఇవ్వగల తెలివైన వాడివిరా ! " చిన్నగా నవ్వుతూ అన్నని రెండు చేతుల్తో ఆలింగనం చేసుకున్నాడు ఏకాంబర్. " ఉద్యోగం పోయి ఏం చేయాలో దిక్కు తోచకుండా ఉన్నాన్‌రా ! నేను ఉద్యోగాలు ఇవ్వడం ఏమిటి ? చిన్నప్పట్నుంచీ నిన్ను హేళన చేసేవాడ్నని ఇప్పుడు నన్ను హేళన చేస్తున్నావా ఏకాంబర ?! " చటుక్కున ఏకాంబర్ చేతుల్లోనుంచి విడివడి తమ్ముడి కళ్ళల్లోకి బేలగా చూస్తూ అన్నాడు నీలాంబర్.

" అయ్యో లేదన్నయ్యా, నేను ఎందుకు ఎగతాళి చేస్తాను..నిజమే చెప్తున్నాను. ఎవరో పని ఇస్తారని నువ్వెందుకన్నయ్యా వెదకటం ? నువ్వే పని కల్పించుకో ! నువ్వే పదిమందికి పని కల్పించే స్థాయికి ఎదుగుతావ్.." సూటిగా అన్న కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

" అవున్‌రా, తమ్ముడు చెప్పింది విను " అంది తల్లి పర్వతాలు.

" ఏం విననమ్మా ! వీడేదో సినిమా డైలాగులు చెప్తూంటే ...నేను పని కల్పించుకోవడమేమిటి? పదిమందికి పని కల్పించడమేమిటి ? " చిరాగ్గా మొహం పెట్టి అన్నాడు నీలాంబర్. " మరి మీ నాన్న చేస్తున్న పనేమిట్‌రా " ? తల్లి పర్వతాలు సూటిగా నీలాంబర్ కేసి చూస్తూ అంది.తల్లి అలా అనేసరికి ఒక్కసారే ఉలిక్కిపడ్డాడు నీలాంబర్. " నిజమే కదా నాన్నది డిపార్ట్ మెంటల్ స్టోర్. అందులో అయిదుగురు అమ్మాయిల్ని జీతానికి పెట్టి నడిపిస్తున్నాడు తమ్ముడు ఏకాంబర్ చెప్పింది ఇదే సూత్రమా! ప్రతీ ప్రశ్నకి జవాబు ఉన్నట్టే ప్రతి సమస్యకి పరిష్కారం ఉంటుంది. ప్రతీ లెక్కా ఎలా చెయ్యాలో సూత్రం ఉంటుంది. అలాగే
జీవితానికి..జీవించడానికి...బ్రతకడానికి..బ్రతికించడానికి..ఎన్నెన్ని నిజాలు ! ఈ నిజాలు ఇజాలు చదువు సంధ్యలు లేని ఏకాంబర్ ఎలా తెలుసుకోగలిగాడు.. విషయం అర్థమయి ఆశ్చర్యంగా తమ్ముడు ఏకాంబర్ కళ్ళల్లోకి సంతోషంగా చూసాడు నీలాంబర్.

" అవున్‌రా పెద్దోడా ! అమ్మకే ఈ జీవిత సత్యం అర్థమయిందంటే..చదువుకున్నవాడివి నీకు అర్థం కాదా ? " అన్నాడు పీతాంబర్." నిజమే నాన్నా తమ్ముడూ,    మీరు అన్నట్టు పని కల్పించుకుంటాను. నేనూ మీలా ఎక్కడో చిన్న డిపార్ట్ మెంటల్ స్టోర్ పెడతాను. మరి దానికి డబ్బో?!" అదీగాక అందులో మెలకువలు నాకు తెలియాలి కదా ! " అన్నాడు. " చదివేకొద్దీ ఉన్నమతి పోతుందంటారు. ఎందుకో అనుకున్నాను..ఇదిగో..నిన్ను చూస్తుంటే ఆ సామెత నిజమేననిపిస్తోంది " తల్లి పర్వతాలు చిరాగ్గా అంది.

" నేనేమన్నా నమ్మా నాన్నలా వ్యాపారం చెయ్యాలంటే అనుభవం, డబ్బు కావాలన్నానంతే..." అన్నాడు నీలాంబర్.

" నాన్న చేసిన వ్యాపారం నువ్వెందుకు చేస్తావు? నీకు తెలిసిన నీకు అనుభవ ఉన్న వ్యాపారం చేస్తావు కానీ.." అన్నాడు ఏకాంబర్.

అవున్‌రా ! నువ్వు పూర్తిగా తమ్ముడు ఏం చెప్తాడో విను. ఆ తర్వాత మాట్లాడు. నీ అభిప్‌రాయం చెప్పు " అన్నాడు తండ్‌రి పీతాంబరం." అలాగే " అంటూ మంచం మీద బుద్ధిగా సర్దుకు కూర్చున్నాడు నీలాంబర్.

" నీకు తెలిసింది కంప్యూటర్. అదే నీ వ్యాపార వస్తువు. అర్థం కాలేదా ? నీవు నేర్చుకున్నది, నీకు తెలిసింది " కంప్యూటర్ సెంటర్ " పెట్టి పదిమంది పిల్లలకి నేర్పించన్నయ్యా చిన్న ఇన్స్టిట్యూట్ ప్‌రారంభించు. నీతోబాటు పదిమందికి ఉపాధి ఇవ్వొచ్చు. వందమందికి విద్య నేర్పించొచ్చు. " అన్నాడు ఏకాంబర్.

" ఎస్...నువ్వన్నది కరెక్టేరా..కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ పెడతాను..నాలా నిరుద్యోగులుగా ఉన్నవాళ్ళని ఫేకల్టీలుగా తీసుకుంటాను. బావుందిరా నీ ఐడియా...బావుంది..మరి ఇన్స్టిట్యూట్ పెట్టడానికి కంప్యూటర్లూ వగైరా ఎన్నో కొనాలి. దానికి డబ్బెలారా? " ఆందోళనగా అన్నాడు నాలాంబర్.

" ఆ విషయం మాకొదిలెయ్యరా నేనూ తమ్ముడూ చూసుకుంటాం. " అన్నాడు పీతాంబరం. " అదెలా నాన్న ? మీరే ఇప్పుడు ఎంతో ఇబ్బందుల్లో ఉన్నారు. చెల్లెలి పెళ్ళి చెయ్యాలి. మీకు డబ్బు ఎలా దొరుకుతుంది ? " తండ్‌రికేసి బేలగా చూస్తూ అన్నాడు నీలాంబర్.

'పెద్దవాడు పాడైపోయాడనుకొన్నాం చుట్టూ ఉన్న స్నేహితుల వలన అక్కడి పరిస్తితుల వలన పాడైపోయాడు గానీ, బాధ్యత తెలిసిన వాడే...' కొడుకు మాటలు విని మనసులోనే మురిసిపోయాడు పీతాంబరం. " ఆ విషయాలు అన్నీ నీకెందుకురా ! చెల్లెలి పెళ్ళి ఇంకా కుదరలేదుకదా కుదిరాకా నీ వ్యాపారం కూడా కుదుటపడ్డాక నువ్వు కూడా చెల్లెలి కోసం డబ్బు సర్దవా ఏంటి? " చిన్నగా నవ్వుతూ కొడుక్కి ధైర్యం చెప్పింది పర్వతాలు. " అమ్మా ! బుద్ధొచ్చిందమ్మా ! ఇన్నాళ్ళూ చేతినిండా డబ్బు చూసి కళ్ళు మూసుకుపోయి పబ్ లకీ, పార్టీలకీ తగలేసాను. డబ్బు విలువ ఇప్పుడు అర్థమైందమ్మా ! నేనేం తప్పు చేసానో తెలుసుకున్నాను.." బాధగా అన్నాడు నాలాంబర్.

" సరి సరి చాలా పొద్దుపోయింది. పడుకోండి. ఏమైనా మాట్లాడుకోవాలంటే తెల్లారి లేచాక మాట్లాడుకుందాం ' అంటూ పీతాంబరం తన గదిలోకి వెళ్ళిపోయాడు. మొగుడి వెంట పర్వతాలు కూడా వెళ్ళిపోయింది. " గుడ్ నైట్ నీలాంబర్ హాయిగా పడుకో రెపు ఏం చేయాలో ఎలా చేయాలో ఆలోచిద్దాం ! " అంటూ హాల్లోకొచ్చి తన మంచం మీద వాలిపోయాడు ఏకాంబర్.

ఉదయం లేస్తూనే గబగబా తయారయి బయలుదేరాడు ఏకాంబర్. తల్లి పర్వతాలు లేచి పెరట్లో అంట్లు తోముకుంటోంది. తండ్రి పీతాంబరం వరండాలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు. బ్యాగ్ భుజాన వేసుకుని ఇంట్లోనుండి బయలుదేరబోయాడు ఏకాంబర్. ఇంతలో గదిలోనుండి నీలాంబర్ నిద్ర కళ్ళతోనే హాల్లోకి వచ్చాడు. " ఏరా ఏకాంబర్ ! బయటకు వెళ్తున్నావా?" అడిగాడు తమ్ముడ్ని. " అవున్రా ! కష్టమర్లని ఇళ్ళ దగ్గర కలిస్తేనే నా పని సులువు అవుతుందని వేగంగా వెళ్దామనుకున్నాను. లేవలేకపోయాను. లేటయిపోయింది. " అన్నాడు ఏకాంబర్. " రాత్రి మనం అనుకున్నది ఏం చేద్దాం ? " అడిగాడు నీలాంబర్.



జరిగిన కథ : కూతురి పెళ్ళికి పెద్దకొడుకు నీలాంబర్ నుండి సాయం అందుతుందని ఆశిస్తున్న పీతాంబర్, పర్వతాలుకు, నీలాంబరే హఠాత్తుగా పెట్టే బేడా సర్దుకుని వచ్చేసి, ఉద్యోగం ఊడిందని చెప్పడంతో హతాశులవుతారు. ముగ్గురూ కల్సి అతనిని ఓదార్చి, ఏదైనా చేసి బ్రతకొచ్చని ధైర్యం చెబుతారు. తానే ఏదోక దారి చూపిస్తానని ఏకాంబరే భరోసా కూడా ఇస్తాడు.

..................................

నువ్వు నాన్నతో బయలుదేరి గోపాలపట్నం మన ఆఫీసు దగ్గరకు వచ్చేయ్. నేను పదో గంటకి ఆఫీసుకు వస్తాను. అక్కడ మాట్లాడుదాం. " అంటూ హాల్లోనుండి వరండాలోకి వచ్చాడు ఏకాంబర్.

" అలాగే ! " అంటూనే బాత్ రూం కేసి నడిచాడు నీలాంబర్.

ఇంతలో పెట్లో అంట్లు తోముతున్న పర్వతాలు కెవ్వున కేకేసుకుంటూ ఇంట్లోకి పరిగెత్తుకొచ్చింది.

పర్వతాలు కెవ్వున కేల వేస్తూ పరుగుపరుగున ఇంట్లోకి వస్తూ గుమ్మం తన్నుకుని పడబోతున్న తల్లిని బాత్‌రూం కేసి వెళ్తున్న నీలాంబర్ చటుక్కున వెళ్ళి పడిపోకుండా ఒడిసి పట్టుకున్నాడు.

వరండాలో ఉన్న పీతాంబరం, ఏకాంబర్ ఇద్దరూ పర్వతాలు కేక వింటూనే గాభరాగా హాల్లోకి వచ్చారు. గదిలో ఆదమరచి నిద్రపోతున్న అలివేలుమంగ కూడా పర్వతాలు గావుకేక విని ఉలిక్కిపడి మంచం మీద నుండి లేచి హాల్లోకి వచ్చింది.

హాల్లోకి వచ్చి ఆయాసంతో నిలబడ్డ పర్వతాల్ని ఒడిసి పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టాడు నీలాంబర్.

" ఏమైందమ్మా ? ఎందుకలా అరిచావు ? " ఆతృతగా అడిగాడు ఏకాంబర్.

" ఏమైంది పర్వతం ? ఎందుకలా భయపడిపోయావ్ ? " ఆందోళనగా భార్య ప్రక్కనే కూర్చుంటూ అడిగాడు పీతాంబరం.

" ఏమైందమ్మా ? " అంటూ అలివేలుమంగ, నీలాంబర తల్లి ప్రక్కనే నిలబడ్డారు.

" పెరట్లో... పెరట్లో..కంచె అవతల ..." కంగారుగా అంది పర్వతాలు.

" ఏమైందమ్మా ? " అడిగాడు నీలాంబర్.

" పాము...పాము.." భయంతో, ఆయాసంతో చెప్పలేకపోతోంది పర్వతాలు.

" పాము కనిపించింది! అంతేనా ? " రోజూ చూస్తున్న పామే కదా అన్నట్టు అన్నాడు పీతాంబరం.

" కాదు..కాదు..పాము..పాము రెండు ముక్కలు అయి పడి ఉంది " ఆందోళనగా అంది పర్వతాలు.

" పాము చచ్చిపోయింది కదా , మరిక భయమెందుకు? చూద్దాం రండిరా ! " అంటూ పెరట్లోకి ఇద్దరు కొడుకుల్ని తీసుకుని వెళ్ళాడు పీతాంబరం.

వాళ్ళ వెనకే అలివేలు మంగ, ఆ వెనకే పర్వతాలు ఉండబట్టలేక వెళ్ళారు.

పెరట్లో కంచెకి దగ్గర్లోనే పాము శరీరం భాగాలుగా తెగి పడి ఉంది. మధ్యలో ఒక భాగం లేదనిపించింది పీతాంబరానికి.

" పాముని ఇలా ఎవరు నరికి ఉంటారు నాన్నా ? " కుతూహలంగా అడిగాడు నీలాంబర్.

" ఎవరూ నరికి చంపలేదురా ! ముంగిస ఇక్కడెక్కడో తిరుగుతోంది అదె పాముని చంపి మూడు భాగాలుగా చేసి మధ్య భాగం తినేసి

పోతుందని అంటారు. బహుశా, ఇది ముంగిస పనే అయి ఉంటుంది. " ఆలోచిస్తూ అన్నాడు పీతాంబరం.

" పోనీలే నాన్నా ! పెరట్లో పాము భయం పోయింది కదా ! లేకపోతే రోజూ భయంతో ఝుడుస్తూ పెరట్లో తిరిగేవాళ్ళం." అన్నాడు ఏకాంబర్." ఏమో! ఇలాంటి పాములు ఎన్ని ఉన్నాయో మనకేం తెలుస్తుందిరా ! అయినా, ఎంత వేగంగా ఇల్లు ఖాళీ చేస్తే అంత మంచిది " భయం భయంగా అంది పర్వతాలు.

" సరి సరి. బయట మున్సిపాలిటీ వాళ్ళుంటే దీన్ని తీసి పారెయ్యమని చెప్పాలి..పదండి పదండి..." అంటూ పీతాంబర్ తిరిగి హాల్లోకి వచ్చేసాడు.

తండ్రి వెనకే కొడుకులిద్దరు, కూతురు అనుసరించారు. పర్వతాలు షాక్ నుండి తేరుకోలేకపోయింది. వంటగదిలోకి వెళ్ళి నిలబడిందేగానీ చచ్చిన పామే కళ్ళల్లో కదలాడుతోంది.

అన్న నీలాంబరాన్ని ఆఫీసుకి రమ్మని ఏకాంబర్  ఇంట్లో నుండి బయటకు వచ్చి బైక్ మీద కూర్చుని స్టార్ట్ చేశాడు.పదవుతుండగా గోపాలపట్నం ఫ్రాంచైజీ ఆఫీసులో అడుగుపెట్టాడు ఏకాంబర్. ఉదయం పాము గొడవలో పడి ఆలస్యంగా వూరుమీద పడడం వలన కస్టమర్లందరూ  అప్పటికే ఆఫీసులకీ, పనులమీద ఇంటినుండి వెళ్ళిపోయారు. అలవాటు ప్రకారం రాత్రి రాసుకున్న జాబితాలో ఉన్న వాళ్ళందరి ఇళ్ళకూ వెళ్ళాడు. కస్టమర్ల ఇళ్ళ దగ్గర " వచ్చానని " హాజరు వేయించుకుని వచ్చేసాడే గానీ పని కాలేదు.చిరాగ్గా ఫ్రాంచైజీ ఆఫీసుకు వచ్చాడు. ' ఒక రోజు తిరుగుడు దండగైందని మనసులోనే నొచ్చుకున్నాడు. ఇంట్లో అన్న నీలాంబర్ తో మాట్లాడుతూ సగం కాలం వృధా అయితే, పెరట్లో పాడు పాము చావు సగం కాలం తినేసింది ' ఆలోచిస్తూ తన కేబిన్ లోకి వెళ్ళి కూర్చున్నాడు ఏకాంబర్.

ఇంతలో నూకరత్నం స్వీటు పాకెట్  పట్టుకుని ఏకాంబర్ చాంబర్ లోకి అడుగు పెట్టింది.

" హేపీ న్యూస్ అంబర్ గారూ ! " అంటూ స్వీటు పెట్టె తెరిచి స్వీటు తీసుకోవలసిందిగా కళ్ళతోనే అభ్యర్థిస్తూ స్వీటు పెట్టె ఏకాంబర్ ముందుంచింది నూకరత్నం.

" ఏంటో ?! " పరాకు నుండి తేరుకుంటూ అన్నాడు ఏకాంబర్.

" మీ దయ వలన శ్రీరాం చిట్స్ లో పది క్లోట్ల రూపాయల చిట్స్ ఇచ్చాను. ఈ మూడు నెలలు పోటీలో నేనే స్టేట్ టాపర్ నయ్యానట. నిన్న రాత్రే బ్రాంచి మేనేజర్ కరీం గారు ఫోన్ చేసారు. " సంతోషంగా చెప్పింది నూకరత్నం.

" కంగ్రాట్స్..! దీనితో సరిపెట్టేద్దామన? " నవ్వుతూ అడిగాడు.

" ఏం కావాలో చెప్పండి ! ఇదంతా మీ చలవే కదా ! లేకపోతే నా మొహానికి ఇంత పెద్ద మొత్తంలో చిట్స్ చెయ్యగల  సత్త ఉందా ? " అంది.నువ్వూ, నేనూ ఇలా ఉన్నామంటే మన గాడ్ ఫాదర్ బాబా ! ఆయనే మన ఇద్దర్నీ నడిపిస్తున్నారు. " అన్నాడు ఏకాంబర్." నిజమేనండీ ! " ఆనందంగా అంది నూక రత్నం.

" ఈ స్వీట్లు మన ఆఫీసులో ఉన్న వాళ్ళందరికీ పంచారా ? " అడిగాడు ఏకాంబర్." ముందు మీకు చెప్పకుండా తమరితో నా సంతోషం పంచుకోకుండా ..మిగతా వాళ్ళతో ఎలా పంచుకుంటాను? రాత్రయితే తమకు వెంటనే మీకు ఫోన్ చేద్దామనుకున్నాను. కానీ , స్వయంగా చెప్పి మీ కళ్ళల్లో కదిలే ఆనందాన్ని చూడాలనిపించి ఫోన్ చెయ్యలేదు. " చిలిపిగా ఏకాంబర్ కళ్ళల్లోకి చూస్తూ అంది నూకరత్నం.

" సరిసరి! ముందు వాళ్ళందరికీ చెప్పి సంతోషం షేర్ చేసుకో! వాళ్ళకి నువ్వు ఇన్స్పిరేషన్ కావాలి

ఆలస్యమైతే ఫీల్డ్ మీదకు బయలుదేరతారు. " అంటూ తన బ్యాగ్ తెరచి కస్టమర్ల ఫైల్స్ తీసాడు ఏకాంబర్.

" వస్తానుండండి " అంటూ గదిలో నుండి బయటకు రాబోయింది నూకరత్నం.

" రత్నం ! ఈ ఫైల్స్ చెక్ చేస్తే ఇన్స్యూరెన్స్ ఆఫీస్ లో ఇచ్చేద్దాం. ఇవన్నీ 'పాలసీ' లోన్ ఫైల్స్. అడుగున రెండు హౌసింగ్ ఫైనాన్స్ ఫఐల్స్ కూడా ఉన్నాయి చూడండి " అంటూ ఫైల్స్ నూక రత్నానికి అందించాడు ఏకాంబర్.

ఏకాంబర్ ఇచ్చిన ఫైల్ తీసుకుని మరో చేత్తో స్వీట్ బాక్స్ పట్టుకుని బయటకు వచ్చింది నూకరత్నం.

నూకరత్నం వెనుదిరిగి వెళ్ళిపోతుంటే చూస్తూ కూర్చున్న ఏకాంబర్ సీట్లో నుండి లేచి ఆమె వెనకే గదిబయటకు వచ్చాడు." నేనూ వస్తాను. వాళ్ళందిరికీ థేంక్స్ చెప్పాలి." నూకరత్నం వెనుకే నడుస్తూ ఆమెతో చెప్పాడు ఏకాంబర్.

" రండి, ఇద్దరం కలిసి వాళ్ళకి స్వీట్లు ఇచ్చి మన ఆనందాన్ని అందరికీ పంచుదాం." సంబరంగా అంది నూకరత్నం.బాస్ లిద్దరూ కూడబలుక్కున్నట్టు కలిసి కట్టుగా తమ దగ్గరికే రావడం చూసి కలక్షన్ కు బయలుదేరుతున్న యువతీయువకులు ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు.

ప్రాంచైజీ ప్రారంభం నుండీ చూస్తున్నారు. ఇంత చనువుగా ఎప్పుడూ తమకి కనిపించలేదు. తామంతా కలక్షన్స్ కి బయలుదేరేముందు ఏకాంబర్ సార్ వస్తూనే చాంబర్ లోకి వెళ్ళిపోవడం గమనించేవారు. సాయంత్రం ఎప్పుడో గానీ కనిపించేవారే కాదు. ఏకాంబర్ సార్, నూకరత్నం మేడం మంచి ఫ్రెండ్స్ అని మాత్రమే తెలుసు. కానీ, వాళ్ళని ఇంత చనువుగా, జోడీగా కలిసి ఉండడం గానీ, రావడం గానీ ఎవరూ చూడలేదు. ' అందరి మనస్సుల్లోనూ అదే భావన.

" డియర్ ఫ్రెండ్స్! మీకో గుడ్ న్యూస్ మీ మేడం నూకరత్నం గారు శ్రీరాం చిట్స్ లో సాధించిన ఘనత ఏంటో చెప్పమంటారా? హుషారుగా అన్నాడు ఏకాంబర్.

అందరూ బ్యాగ్ లు తగిలించుకుని ఫీల్డ్ మీదకు బయలుదేఅడానికి సిద్ధంగా ఉన్నారు. అందరి ముందు నిలబడి మైకులో ప్రసంగించినట్టే నటిస్తూ చెప్పాడు ఏకాంబర్.

ఏకాంబర్ చేసిన ప్రకటన విని అందరూ ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ 'చెప్పండి సార్! చెప్పండి!"

అంటూ ఏక కంఠంతో అరిచారు." ముందు మీరంతా మేడం స్వయంగా ఇస్తున్న స్వీట్లు తలా ఒకటి తీసుకోండి! " రెండో చేత్తో స్వీటు తీసుకోవాలనుకునేవారు సిగ్గు పడకుండా తీసుకోండి. " నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ చెపుతూండగానే స్వీటు బాక్స్ పట్టుకెళ్ళి తీసుకోమని ఒక్కొక్కరి ముందూ ఉంచింది. అందరూ ఆ బాక్స్ లో తలా ఒకటీ తీసుకున్నారు. స్వీటు తీసుకుని తింటూనే " కంగ్రాట్స్ మేడం " అంటూ అభినందించారు.

" విషయం వినకుండానే మేడం ని అభినందించారు. స్వీట్లు కూడా తినేసారు. ఇక విషయం మీకిప్పుడు చెప్పినా చప్పగానే ఉంటుంది కదా, అయితే మానేస్తాను." టక్కున అన్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ చేస్తున్న చమత్కార ప్రసంగానికి మౌనంగానే అటూ ఇటూ తిరుగుతూ మనసులోనే ముసిముసిగా నవ్వుకుంటోంది నూకరత్నం. ఇంతలో వాచ్ మెన్ భార్య పద్మ టీ తయారు చేసి ఫ్లాస్కులో పోసి పట్టుకువచ్చింది. నేరుగా కిచెన్ లో కి వెళ్ళి అందరికీ కప్పుల్లో పోసి ట్రే లో పట్టుకు వచ్చింది.

" పద్మక్కా ! నువ్వు ముందీ స్వీటు తిను " అంటూ స్వీటు బాక్స్ లో స్వీటు తీసి పద్మ నోట్లో పెట్టింది నూకరత్నం. " అయ్యో ఎలా అమ్మా ! " అంటూ పెదవులు కదిపి మాట్లాడేసరికి స్వీటు కింద పడిపోయింది.

రెండు చేతుల్తో ట్రే లో టీ పట్టుకున్న పద్మ నొచ్చుకుంటూ అంది " రత్నం తల్లీ చూసావా అనవసరంగా స్వీటు నేలపాలయ్యింది. "" పోనీలే అక్కా ! ఇందులో ఇంకా చాలా ఉన్నాయి. ఇవి పట్టుకు వెళ్ళి పిల్లలకి ఇవ్వు. ఆ ట్రే నాకివ్వు. " అంటూ పద్మ చేతిలో టీ ట్రే తీసుకుని మిగిలిన స్వీట్స్ తో ఉన్న అట్టపెట్టె ఆమె చేతికి ఇచ్చింది నూక రత్నం.

" నేనందరికీ ఇస్తా కదమ్మా ! మీకెందుకు శ్రమ " నొచ్చుకుంటూ అంది పద్మ.

"ఈరోజు వెరీ స్పెషల్.నువ్వు మరో స్వీటు తీసుకుని తిను. నేనందరికీ టీలు ఇచ్చి వస్తాను. " టీ ట్రే తో అందరి దగ్గరకు వెళ్ళింది. స్వీటు తింటూనే అందరూ తలో కప్పు తీసుకున్నారు.

" సార్ ! మమ్మల్ని ఊరించకండి సార్. చెప్పెయ్యండి. మేడం ఏం సాధించారో మాకు ఆతృతగానే ఉంది. విషయం తెలుసుకోకుండా వెళ్తే ఫీల్డ్ లో హుషారుగా తిరగలేము. ప్లీజ్ చెప్పెయ్యండి. " అన్నారిద్దరు ముగ్గురు టీ త్రాగుతూనే.

" ఒకే ఒకే ..మీ అందరికీ ఫీల్డ్ మీదకెళ్ళే టైం అయ్యింది. చెప్పేస్తున్నాను. ఆ విషయం చెప్పేముందు మీ అందరికీ నా తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకోవాలి. డియర్ ఫ్రెండ్స్...థాంక్యూ వెరీ మచ్. " అంటూ ఆగాడు ఏకాంబర్.

అప్పటికే నూకరత్నం వచ్చి ఏకాంబర్ చేతిలో టీ కప్పు పెట్టింది. టీ సిప్ చేస్తూ కౌంటర్ టేబుల్ మీద స్టైల్ గా కూర్చున్నాడు.

" ఎందుకు సార్ థేంక్స్? మీరు మాకు ధన్యవాదాలు చెప్పాల్సినంత సహాయం ఏం చేసాం సార్ ? " అన్నారెవరో." మీ అందరూ నేను అడక్కుండానే సంఖ్యాబలం కోసం నా టార్గెట్ ఫుల్ ఫిల్ చేయడానికి తలో పాలసీ రాసారు. ఆ సమయంలో ఆ చివరి క్షణం లో మీ అందరూ అలా పాలసీ ఇచ్చి ఆదుకోకపోతే నేను నా టార్గెట్ ని రీచ్ అయ్యేవాడ్ని కాదు. " అలా అన్నప్పుడు ఏకాంబర్ గొంతు బొంగురు పోయింది." గొప్పగా చెప్పారు సార్. అదంతా మీకు తెలీదు. మేడం గారే మా అందరికీ మనిషో పాలసీ ఇవ్వాలని కోరారు. అదీ నెలకి రెండొందలే కదాని అందరం ఆనందంగా పాలసీ కట్టాము. ఆ డబ్బు కూడా మేడం గారే ఆర్నెల్లకోసారి కడతామని నెలనెలా మా జీతాల్లో తీసుకుంటామని చెప్పారు. దీంట్లో మా సహాయం ఏముంది సార్? " అన్నాడింకో కుర్రాడు.

" మీకు, మేడం గారికి నా ధన్యవాదాలు. ఇకపోతే మీ మేడం నూకరత్నం గారు శ్రీరాం చిట్స్ లో ఏజంటని తెలుసు కదా క్వార్టర్లీ చిట్ కాంపిటీషన్ లో స్టేట్ లెవల్ లో టాపర్ గా నిలిచారు మీ మేడం నూకరత్నం. పదికోట్ల రూపాయల విలువగల చిట్స్ చేసి స్టేత్ టాపర్ అయ్యారని రాత్రే తెలిసింది. ఇది మనందరికీ గర్వకారణం. ఆనందదాయకం. ఇంత వ్యాపారం చేసినందుకు బహుమతి కూడా ఇస్తున్నారు. మేడం గారు ఇక నుండీ ఎక్కడికి వెళ్ళాలన్నా నడవ కూడదని కంపెనీ వారి ఆదేశం. 'స్కూటీ బహూకరిస్తున్నారు. హేట్సాఫ్ నూకరత్నం గారూ! అవునా ఫ్రెండ్స్ " బిగ్గరగా గొంతెత్తి చెప్పాడు ఏకాంబర్.

" ఎస్సార్. గ్రేట్ అచీవ్ మెంట్ మేడం..కంగ్రాట్స్ ! ఆల్ ద బెస్ట్." అంటూ అందరూ వచ్చి నూకరత్నం చెయ్యి లాక్కుని అభినందనలు తెలిపారు.అందరి సంతోషానికి, సంబరంగా వాళ్ళందరూ చెప్తున్న శుభాకాంక్షలకి నిండుగా పులకించిపోయింది నూకరత్నం.

" డియర్ ఫ్రెండ్స్ ! మీ అందరికీ ఫీల్డ్ మీదకు వెళ్ళే సమయం ఆసన్నమయింది. చూసారుగా మీరూ మేడం నూకరత్నం లా తలుచుకున్నది సాధించాలి. మీరంతా మా దగ్గరే అయిదారువేల రూపాయల జీతానికి ఉండిపోవాలని మేము కోరుకోవడం లేదు. చూస్తున్నారుగా, మీరు తెచ్చే ఫ్రాంఛైజీల కలక్షన్లకు వచ్చే కమీషన్ అంతా మీ జీతాలకే సరిపోతోంది. మేడం కి రూపాయి మిగలడం లేదు. అయినా ఆమె బాధపడలేదు. మొక్క నాటిన వెంటనే ఫలాలు ఆశించలేము కదా ! అందుకే తను కూడా చిట్స్ కంపెనీల్లో ఏజంటుగా చేరి కష్టపడుతోంది. కేవలం మూడు నెలల్లో పది కోట్ల చిట్ వ్యాపారం చేయడం మాటలు కాదు. కమీషన్ ఎంతొస్తుందో మీకు తెలుసా! మీరూ మాలా బాగుపడాలని.



జరిగిన కథ : పెరట్లో కనిపించిన చచ్చిన పాముని చూసి భయంతో కెవ్వున కేక వేసి అందర్నీ పిలిచి చూపిస్తుంది పర్వతాలు. ఆ హడావుడి వల్ల ఏకాంబర్ కి కస్టమర్ల ఇళ్ళకు వెళ్ళేందుకు లేటయి ఎవర్నీ కలవలేక పోతాడు.     ఆ చికాకులో ఒంటరిగా కూర్చుని ఉన్న ఏకాంబర్ దగ్గరకు స్వీట్ పాకెట్ తో వచ్చి తాను అత్యధికంగా టార్గెట్ ని అధిగ మించినట్లుగా చెబుతుంది నూకరత్నం. ఇద్దరూ కలిసి స్టాఫందరికీ స్వీట్స్ పంచి ఈ ఆనందాన్ని షేర్ చేసుకుంటారు. అందరూ ఇలాగే అభివృద్ధి సాధించాలని చిన్న స్పీచ్ ఇచ్చి ఉత్తేజ పరుస్తాడు ఏకాంబర్...

ఆ తర్వాత...

మీరూ స్వయంకృషితో ఎదగాలని కోరుకుంటూ సెలవా మరి " అంటూ ముగించాడు ఏకాంబర్.

ప్రసంగం ముగియగానే అందరూ ఆనందంగా చప్పట్లు కొడుతూ ఆప్యాయంగా ఏకాంబర్ దగ్గరకు వచ్చి ' షేక్ హ్యాండ్స్ ' ఇచ్చారు.

ఏకాంబర్ చెప్పిందంతా దూరంగా ఉండే పద్మక్క వింది. ఆ విషయం వింటూనే నూకరత్నం దగ్గరకు వచ్చి ఆప్యాయంగా కౌగలించుకుంది.

కలక్షన్ టీం అంతా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. ఆఫీసులో అమ్మాయిలు ముగ్గురు తమ సీట్లో కూర్చున్నారు.

ఏకాంబర్, నూకరత్నం సంతోషంగా మాట్లాడుకుంటూ ఏకాంబర్ కేబిన్ లో కూర్చున్నారు.

ఇంతలో ఏకాంబర్ సెల్ కి తల్లి పర్వతాలు ఫోన్ చేసింది. సెల్ డిస్ ప్లే లో ఇంటి నెంబర్ చూస్తూనే టక్కున సెల్ తీసాడు.

" హలో..చెప్పమ్మా ! " అన్నాడు ఏకాంబర్.

" ఒరేయ్ చిన్నోడా నువు అర్జెంటుగా నాన్నని తీసుకుని ఇంటికొచ్చేయ్ " ఆతృతగా అంది పర్వతాలు.

" ఏమైందమ్మా ! ఇంకా పాము గొడవేనా ? " అడిగాడు ఏకాంబర్.

" అయ్యో ! ఉదయాన్నెప్పుడో చచ్చిన పాము గురించి ఎందుకురా ఫోన్ చేస్తాను. నువ్వు నాన్నని తీసుకుని ఇంటికి రా ! ఇక్కడ మాట్లాడుకుందాం ! " అంటూనే ఫోన్ కట్ చేసింది పర్వతాలు.

విషయం చెప్పకుండా తల్లి ఫోన్ కట్ చేసేసరికి విసుగ్గా కుర్చీలోనుంచి లేచాడు ఏకాంబర్. అలా విసురుగా లేచేసరికి ఏకాంబర్ కూర్చున్న రివాల్వింగ్ చైర్ గిర్రున తిరిగి తిరిగి ఆగింది.

" మీ అమ్మ గారా ? " తెలిసినా అడిగింది నూకరత్నం.

" ఆ ! ఎందుకో అర్జెంటుగా ఇంటికి రమ్మంటోంది. నాన్న గారిని కూడా వెంటబెట్టుకు రమ్మంటోంది.ఏమైందో ? ఏమో ఇంట్లో మా అన్నయ్య ఉన్నాడో? వాడికేమైందోనని గాబరాగా ఉంది. " ఆందోళనగా ఉంది " అన్నాడు ఏకాంబర్.

" మీ అన్న కేమౌతుంది ? బాగానే ఉన్నారు కదా ! " అయోమయంగా అడిగింది నూకరత్నం.

" ఏం కాలేదు, ఏం చేసుకున్నాడేమోనని భయంగా ఉంది " బ్యాగ్ భుజాన తగిలించుకుంటూ అన్నాడు ఏకాంబర్.

" అబ్బ ! అర్థమయ్యేట్లు చెప్పండి. మీ అన్నగారు పుణేలో కదా ఉన్నారు, ఆయనకేమౌతుంది ? " ఆందోళనగా ఏకాంబర్ కి అడ్డుపడి అడిగింది నూక రత్నం. ఉద్యోగం ఊడి ఇంటికొచ్చేసాడు ఫ్రెర్ట్రెడ్ గా ఉన్నాడు. నేను ధైర్యం కూడా చెప్పను. కొంపతీసి వాడేమైనా అఘాయిత్యం చేసుకున్నాడేమోనని గుండెల్లో ఆందోళనగా ఉంది. వస్తా! వచ్చాక మాట్లాడదాం " అంటూ మరిక అక్కడ ఒక్క క్షణం నిలబడకుండా క్రిందకి దిగి పోయాడు.

బైక్ మీద నేరుగా తండ్రి డిపార్ట్ మెంటల్ స్టోర్ కి వెళ్ళాడు. బైక్ స్టాండ్ వేస్తూ షాపు గోడకు తగిలించిన తన నేం బోర్డు కేసి ఓ క్షణం చూసి వెంటనే తండ్రి దగ్గరకు వెళ్ళాడు.

" పదరా! నేనూ నీకోసమే చూస్తున్నాను. మీ అమ్మ ఇపుడే ఫోన్ చేసింది. " అంటూ అప్పటికే షాపు పని పిల్లలకి అప్పగించి రెడీగా ఉన్నాడు పీతాంబరం.

తండ్రీ కొడుకులిద్దరూ బైక్ మీద ఇంటికి బయల్దేరారు.

" ఏమైంది నాన్నా? అమ్మ ఇంత కంగారుగా ఎందుకు పిలిచింది? " బైక్ నడుపుతూనే తండ్రిని అడిగాడు ఏకాంబర్.

" ఇంటికి పెళ్ళిళ్ళ పేరయ్య వచ్చాడట, అది దాని కంగారు. " చెప్పాడు పీతాంబరం.

" పెళ్ళిళ్ళ పేరయ్య వస్తే నేనెందుకు ? " సంశయంగా అడిగాడు.

"నీకోసం కాదురా! మీ చెల్లెలి కోసం. మొన్న చూసి వెళ్లిన పెళ్లికొడుకు వాళ్లు కబురు చేశారట, రేపే తాంబూలాలకి ఏర్పాట్లు చేసుకోమని. అందుకే ఆందోళన పడుతోంది మీ అమ్మ" చెప్పాడు తండ్రి.

"అదేంటి! ఇంత హఠాత్తుగానా? అయినా, వాళ్లు కట్నకానుకలు ఎక్కువ అడిగారని అమ్మ చెప్పింది. అందుకే, ఏ కబురూ చెప్పలేదందని!" అడిగాడు ఏకాంబర్. "అది నిజమేరా! నేను మధ్యవర్తితో ఇంతే ఇవ్వగలమని మన స్థోమతు తెలియజేశాను. అది వాళ్లకి నచ్చిందట! ముహూర్తాలు లేవని, రేపే వస్తామని, తాంబూలాలు కూడా తీసేసుకుందామని కబురు చేశారట! మీ అమ్మ చెప్పిందిరా!" అన్నాడు పీతాంబరం.

"దీనికింత కంగారెందుకు నాన్నా! మీరున్నారు, ఇంట్లో అన్నయ్య వున్నాడు. మళ్లీ నేనెందుకు?" అన్నాడు ఏకాంబర్."ఆడపిల్ల తల్లి కదరా ఆందోళన ఉంటుంది. ఇంట్లో మొదటి శుభకార్యం. అందులోనూ ఆడపిల్ల పెళ్లి కదా! భయం, బెంగ రెండూ వుంటాయి. అందుకో తనకి ఏంచేయాలో... ఏం మాట్లాడాలో తోచక మనకి ఫోన్ చేసింది" బోధపరిచాడు పీతాంబరం.

"మీరున్నారు కదా నాన్నా!" అన్నాడు ఏకాంబర్.

"నేనుంటే మీ అమ్మకి నమ్మకంరా! నువ్వుంటే ధైర్యంరా! మీ అమ్మకే కాదు. నాకూనూ!" నెమ్మదిగా అన్నాడు పీతాంబరం.

"ధైర్యమా?!" తండ్రి మాటలు అర్థం కాలేదు ఏకాంబర్ కి.

"అవున్రా! రేపు తాంబూలాలు తీసుకోవాలంటే మా ప్రక్కన నువ్వు నిలబడితే అదే చాలురా!" అన్నాడు పీతాంబరం.

ఏకాంబరానికి అప్పుడర్థమయింది పీతాంబరం మాటల్లోని గూఢార్థం.

"అదేంటి నాన్నా! చెల్లి పెళ్లి మీకే కాదు! మాకూ బాధ్యత కదా! దేనికీ మీరు వెనుకాడకండి! ధూంధాంగా చేద్దాం. మనింట్లో మొదటి పెళ్లి బంధువులందరి మధ్య ఘనంగా జరగాలి" అన్నాడు ఆనందంగా.

చిన్నకొడుకు అంతలా భరోసా ఇచ్చేసరికి పీతాంబరం గుండెల్లో దాగి రగిలిపోతున్న ఆందోళన ఆనందంగా మారి మనసును తేలిక పరచింది."నాకు తెలుసురా! పెద్దోడు చేజారిపోయాడని భయపడ్డా. నువ్వున్నావన్న కొండంత ధైర్యంతోనే కదరా పెళ్లివాళ్లకి కబురు చేశాను. నువ్వున్నావనే!" కళ్లల్లో అతడికి తెలియకుండానే జాలువారిన కన్నీటిని తుడుచుకుంటూ అన్నాడు పీతాంబరం.

తండ్రి మాటలు వింటూనే ఇంటికేసి బాణంలా బైకుమీద దూసుకుపోతున్నాడు ఏకాంబర్.

బైకుమీద కూర్చుని సంతోషంగా చిన్నకొడుకు ఏకాంబర్ నడుం చుట్టూ చేతులు బిగించాడు పీతాంబరం.

ధైర్యం కూడా పీతాంబరం గుండెల్నిండా ఆవహించుకున్నట్టయింది.

ఆ రోజు సాయంత్రం వేగంగానే ఇంటికి చేరుకుంది నూకరత్నం. ఆఫీసు మూసేసి దార్లో స్వీట్లు, పళ్లు కొనుక్కుని ఇంటికి బయల్దేరింది. మనసంతా చాలా ఉల్లాసంగా వుంది నూకరత్నానికి.

ఇంటికి వెళ్లిన వెంటనే తన ఆనందాన్ని అమ్మ, చెల్లాయి, తమ్ముడితో పంచుకోవాలి. ఈ రెండు నెలలు సాదాసీదాగానే గడచింది. నెలనెలా ఎంతోకొంత మిగిలిన డబ్బే తల్లి చేతిలో పెడుతోంది. కలెక్షన్ బాయ్ ల జీతాలు పోను మిగిలిన నాలుగు వేలో, అయిదు వేలో అమ్మకిస్తూంటే అమ్మే ఆశ్చర్యపోయేది.

"నెలనెలా ఒకేలా జీతమివ్వరా రత్నం?" ఒక్కోసారి ఎక్కువ, ఒక్కోసారి తక్కువ ఇస్తున్నావు" అని అడిగేది.

బట్టల షాపులో అయితే నెలనెలా మూడువేలు వచ్చేవి. అమ్మ చేతికిచ్చేది. అక్కడ మానేసి కొత్త కొలువు ఎంచుకున్నానని చెప్పానేగానీ, తనే సొంతంగా ఫ్రాంఛైజీ ప్రారంభించానని చెప్పలేకపోయాను. అలా చేస్తే ఏకాంబర్ గురించి చెప్పాల్సి వస్తుందని భయపడి మానేసింది.ఫ్రాంఛైజీ ప్రారంభించినరోజే లక్షల్లో డబ్బు ఇంటికి పట్టుకెళ్తే ఎన్నో చీవాట్లు పెట్టింది. హద్దులు మీరి బాధ్యతలు స్వీకరించకూడదని తిట్టింది.

బట్టల షాపులో మానేసి సొంతంగా తానే పదిమంది కుర్రాళ్ళతో ఫ్రాంఛైజీ నడుపుతున్నానంటే పెళ్లి చేసుకుని ఇంటికి పోవాల్సిన దానికి ఇన్ని వేషాలెందుకుంటుందని భయపడే చెప్పలేదు.ఈరోజు ఉదయం ఏకాంబర్ కి 'తన గురించి, తను సాధించిన చిట్ బిజినెస్ గురించి అందరికీ ఎంత ఉత్కంఠగా చెప్పాడు. అలానే ఇంట్లో కూడా ఊరించి ఊరించి చెప్పాలి. నాలుగు నెలలు ఆగితే తన చేతికి పది లక్షల రూపాయల కమీషన్ చెక్కుతో పాటు పోటీలో బహుమతిగా ఇచ్చే స్కూటీ గురించి కూడా చెప్పాలి.

మనసులోనే పరి పరి విధాలు ఆలోచిస్తూ నడుస్తోంది నూకరత్నం.

రైల్వే బ్రిడ్జి దాటి చంద్రనగర్ లోకి చేరుకుంది. అప్పటికి ఆరు దాటి ఏడవుతోంది. చీకటి ఆకాశాన్ని ఆక్రమించేస్తోంది.

ఆనందంగా త్రుళ్లుతూ ఇంట్లోకి అడుగు పెట్టింది నూకరత్నం. ఇంట్లో అంతా నిశ్శబ్దంగా వుంది. ఇంట్లో ఎవరో కొత్తవాళ్లున్నారనడానికి సాక్ష్యంగా గుమ్మంలో చెప్పులు కుప్పగా పడి వున్నాయి.

నెమ్మదిగా తలుపు దగ్గరకు వెళ్లి చేత్తో తలుపు నెట్టింది నూకరత్నం.

ఇంట్లో అందరూ నిశ్శబ్దంగా కూర్చుని వున్నారు. ఏమైందబ్బా! కొంపదీసి అమాకి ఏంకాలేదు కదా! అనుకుంటూనే ఇంట్లో అడుగు పెట్టింది నూకరత్నం.

వంటగది గోడకి చేరగిలబడి వున్న తల్లిని చూస్తూనే చెంగున వెళ్లి "అమ్మా..." అంటూ ఆనందంగా స్వీటు తీసి నోట్లో పెట్టబోయింది నూకరత్నం.

అంతే...!

కోపంగా నూకరత్నం చేతిలో వున్న స్వీటు బాక్సుని తీసి నేలకేసి కొట్టింది తల్లి. ఆ హఠాత్పరిణామానికి అదిరిపడింది నూకరత్నం.

"ఎవరితో తిరిగి తెస్తున్నావే ఈ ముష్టి స్వీటు?" కటువుగా అంది నూకరత్నం తల్లి.

"అమ్మా...!" గొంతు పగిలేలా అరచింది నూకరత్నం.

"అడుగత్తా" రోజూ చెట్టాపట్టాలేసుకు తిరుగుతున్న ఆ కుర్రాడెవరో అడుగు...!" అంటున్న బావకేసి చూసి ఉలిక్కిపడింది. ఇంట్లో ఓ మూల మంచం మీద మౌనంగా కూర్చున్న చెల్లి, తమ్ముడూ ఏడుస్తున్నారు.

ఇద్దరు బావలు, వాళ్ల భార్యలు పనిగట్టుకు వచ్చినట్టున్నారు. అందరూ మంచం మీదే బొమ్మల్లా కూర్చున్నారు.

"ఏంటమ్మా నువ్వంటున్నది?" ఏడుస్తూ అంది నూకరత్నం.

" నేననలేదే ! మీ బావే నిన్ను కళ్ళారా చూసాడట. అదిగో అడుగుతున్నాడుగా చెప్పేడు " నూకరత్నం తల్లి కూడా గొల్లుబ ఏడుస్తూ అంది." అదేం చెప్తుందత్తా ! బట్టల కొట్లో మానేసి బజారున పడ్డానని చెప్తుందా ! నాలుగు రోజులుగా దీని ఆటలు, ఆగడాలు అన్నీ కని పెడుతూనే ఉన్నాను. నేను చూడలేదనుకుని జగదాంబ జంక్షన్ లో అవ్వ! ఆ కుర్రాడ్ని వాటేసుకుని నాకు కనిపించకుండా దాక్కోవడానికి ఎన్ని చిన్నెలు చేసింది. అదిగో ! ఆరోజు నుండి దీన్ని నీడలా వెంబడిస్తున్నాను. ఇంటి

దగ్గర్నుంచి బYఅటపడింది మొదలు వూరిమీదే తిరుగుతోందత్తా! బలాదూర్ గా బజారున పడింది. " కోపంతో రుసరుసలాడిపోతూ అన్నాడు నూకరత్నం బావ.

నూకరత్నానికి నరనరాన కోపం లావాలా ప్రవహిస్తోంది.

" నేను ఫ్రాంచైజీ సొంతంగా నడుపుతున్నాను. చాలా చిట్ కంపెనీల్లో ఏజెంట్ గా చేస్తున్నాను. ఎవరి దగ్గరా తల వంచి బ్రతకడం లేదు. తల ఎత్తుకు తిరుగుతున్నాను. ' మార్కెటింగ్ వ్యాపారం' అంటే తిరగాలి కద బావా! " చాలా సౌమ్యంగా చెప్పడానికి ప్రయత్నించింది నూకరత్నం." మగాళ్ళతో రాసుకు పూసుకు తిరగడమా! నీ భాగోతం ఎవడికి తెలీదు. మార్కెటింగ్ చేయడం అంటే మానం గీనం మంటగలుపుకోడమా?" అన్నాడు అతను.

" బావ, మర్యాదగా మాట్లాడు. వింటున్నా కదా అని తప్పుడు మాటలు మాట్లాడకు. " రోషంగా అంది నూకరత్నం.తిరగడం నీకు తప్పు కాకపోవచ్చు. పేరూ వూరూ ఉన్న వాళ్ళం. మాకు తల వంపులుగా వుంది. బ్రతకలేక మా ఇంటికి వచ్చారు. మా నాన్నే బ్రతికుంటే నిన్ను ఇలా చూస్తే చంపేసేవారు. " రెండో బావ దిగ్గున లేచి అన్నాడు.

" పెద్దవాళ్ళని గౌరవం కూడా లేకుండా అవేం మాటలే రత్నం ? అయినవాళ్ళు కాబట్టే కదా మన ఇల్లుని వెదుక్కుని వచ్చి నీ మంచి కోసమే కదా చెప్తున్నారు. " అంది తల్లి.

" అయినవాళ్ళెవరమ్మా మామయ్య చనిపోగానే మనల్ని రోడ్డుమీద వదిలేసారు. ఇన్నాళ్ళూ చచ్చామో బ్రతికామో చూడ్డానికి రాని వాళ్ళు ఇవాళ ఇలా కూడా బ్రతక్కూడదని మనని శాసిస్తున్నారు, శపిస్తున్నారు " కోపంగా బాధగా అంది నూకరత్నం.

" నువ్వెలా పోతే మాకేంటి? మా నాన్న పరువు, మా పరువు పోతుందనే నీ భాగోతం అంతా అమ్మకి చెప్పాలని వచ్చాం. నువ్వేమో ఎక్కడో గుట్టుగా ఉద్యోగం చేసుకుంటున్నావనుకుంటోంది మీ అమ్మ ." నూకరత్నం బావలు ఇద్దరూ ఒక్కసారే అన్నారు.

అంతవరకూ మౌనంగా కూర్చున్న వాళ్ళ భార్యలు కూడా లేచి అన్నారు.

" మనకెందుకు ఆ అమ్మాయి ఎలా పోతే ? మీ ధర్మం కొద్దీ వచ్చి చెప్పారు. ఇక పోదాం పదండి. " అంటూ రుసరుసలాడిపోయారు." ఎలా పోతామే ? స్వయంగా మా నాన్న చెల్లెలి కూతురు రోడ్డున పడి భ్రష్టు పట్టి పోతుంటే చూస్తూ ఊరుకోవాలా ? " కోపంగా అన్నాడు పెద్ద బావ." రత్నం.. ఏం జరిగిందో ..ఏం చేస్తున్నావో చెప్పవే...." తల్లి కోపంగా అంది.

" నేనేం తప్పు చేయలేదమ్మా బట్టల కొట్లో పని చేస్తున్న నాకు ఆ మహానుభావుడే దారి చూపించాడు. నా కాళ్ళ మీద నేను నిలబడడానికి నాచేత ఫ్రాంచైజీ ప్రారంభింపజేసాడు. ఆయనతోనే నన్ను బావ చూసాడు " చెప్పింది నూకరత్నం.

" బ్రతకడానికి దారి చూపిస్తే దాసోహం అయిపోవాలా? " కోపంగా అన్నాడు చిన్న బావ.



జరిగిన కథ: ఏకాంబర్, నూకరత్నం మధ్య సంబంధాన్ని గురించి నీచంగా అభివర్ణిస్తూ నూకరత్నం బావలు ఆమెను నిలదీస్తారు. తల్లి కూడా వాళ్ళ మాటలు విని నిజమేననుకుని అదే సందేహాన్ని వ్యక్తం చేసేసరికి హతాశురాలౌతుంది నూకరత్నం.

.......................................................

బావా! మీకు అంతే తెలుసు. ఆ రోజు, ఆయన నాకెంత ఉపకారం చేసాడో తెలుసా?! రోషం గా అంది నూకరత్నం.

ఏం చేసాడు?! ఏం చేసాడు? ఒక మగాడు ఆడదానికి ఏమి ఆశించి   చేస్తాడో? ఏం పొందాలని చూస్తాడో మాకు తెలుసు పెద్ద బావ పచ్చిగా అన్నాడు.

ఆయన ఎలాంటి స్వార్ధపరుడు కాదు. ఇవేళ నేను శ్రీరాం చిట్స్ లో పదిహేను కోట్ల రూపాయల చిట్స్ కట్టించానంటే దానికి కారణం ఆయన. నా కలలో ...కూడా చూడలేనంత కమీషన్ పది లక్షలు... పది లక్షల రూపాయలు సంపాదించేలా సహాయం చేసాడు ఆయన.   కోపంతో ఊగిపోతూ అంది నూకరత్నం.

నూకరత్నం నోట పదిలక్షల రూపాయలు పలికేసరికి నూకరత్నం వాళ్ళ బావలు, వారి భార్యలు అశ్చర్యం గా నోళ్ళు వెళ్ళబెట్టి ఆశ్చర్యపోయారు.

ఏంటీ.. పదిలక్షల ఆదాయం నీకు చూపించి నీ దగ్గర ఏదీ లాభం పొందలేదా? నువ్వే వాడి ఒళ్ళో వాలిపోయాక ఇక పొందడానికి నీ దగ్గర ఏం మిగిలిందని రెండో బావ వ్యంగ్యం గా అన్నాడు.

షటప్... ఆయన అందరిలాంటి వాడు కాదు. ప్రపంచం లో అందరూ బాగుండాలి. అందరూ నా వాళ్ళనుకునే   స్వార్ధం ఆయనది. అంతే కానీ, ఎవరు ఎలా పోతే పోనీ నేను బాగుండాలి అని అనుకునే రాక్షసుడు కాదు, ఆయన గురించి తప్పుగా మాట్లాడకండి. సూటిగా వాళ్ళకేసి చూస్తూ అంది నూకరత్నం.

అంత కావలిసినవాడయిపోయాడా? అయితే మాతో మీకు పనేముందమ్మా? అత్తా మేం వస్తాం, అత్తా నీ కూతురుకి ఆడెవడో దేవుడట కదా! మేమంతా రాక్షసులం, చూడు అదెలా వాగుతోందో! నీ కూతురు నీ ఇష్టం. మధ్యలో మాకెందుకు, పదండి పోదాం అంటూ భార్యలను తీసుకుని నలుగురు బయలుదేరారు.

నలుగురు కోపం గా గదిలోనుండి బయటకు రావడానికి ద్వారం దగ్గర కొచ్చేసరికి ఎదురుగా నిలబడ్డ వ్యక్తులను చూసి ఆశ్చర్యపోయారు.వాళ్ళు అలా ఆశ్చర్యం గా నిలబడిపోవడంతో నూకరత్నం, వాళ్ళ

గుమ్మం కేసి చూసారు.

గుమ్మం దగ్గర తల్లి పర్వతాలుతో పాటే నిలబడి వున్నాడు ఏకాంబర్.

ఏకాంబర్ ని వాళ్ళమ్మని చూస్తూనే నూకరత్నం గుండెలు పగిలిపోయాయి. ఇంట్లో జరిగిన గొడవం తా వినేసే వుంటారు, అనుకుని మనసులోనే రోదిస్తూ గబాలున తల్లి దగ్గరకు వెళ్ళి నిలబడింది.

అమ్మా! ఏకాంబర్ గారని ఇన్స్యూరెన్స్ ఏజెంట్ ఆయన. వాళ్ళ అమ్మగారు. నేను పని చేస్తోన్న ఫ్రాంచైజీ వీళ్ళ ఆఫీసులోనే వుంది. బావలు చెప్తున్నది ఈయన గురించే...

నూకరత్నం తల్లి ఆశ్చర్యం గా గోడకు చేరగిలబడి వుంది. కూతురి నోట పది లక్షలు వినడమే షాకయి నిలబడిపోయింది.చెల్లిలి తాంబూలాల కోసం నూకరత్నం వాళ్ళని పిలవాలని తల్లిని తోడు తీసుకుని వచ్చాడు ఏకాంబర్. ఇక్కడకొచ్చేసరికి నూకరత్నాన్ని అందరూ తిడుతున్న దృశ్యం కంటపడేసరికి ఏకాంబర్ సిగ్గుతో చితికిపోయాడు. తన వలనే పాపం నూకరత్నం మాటపడుతోందని గ్రహించాడు.

ఆ సమయం లో ఇంట్లోకి వెళ్ళకూడదని ఏకాంబర్ తిరిగి వెనక్కి వెళ్ళిపోదామని తల్లిని వెనక్కి లాగాడు. అయితే అందుకు పర్వతాలు ఒప్పుకోలేదు.

రండి...రండి   ఆంటీ రండి అంబర్ సార్! నూకరత్నం గబాలున వారికి ఎదురొచ్చి ఆహ్వానించింది.

నూకరత్నం పెద్ద బావకి నోటమాట రావటం లేదు. జగదాంబ జంక్షన్ లో కనిపించిన కుర్రాడు నేరుగా తల్లిని తోడు తీసుకుని ఇంటికి రావడంతో షాకయ్యాడు.

అత్తా నేను చెప్పానే! ఈ కుర్రాడితోనే నేను నూకరత్నాన్ని చూసాను. గోపాలపట్నం లో అపార్ట్ మెంట్ లో రోజూ ఇద్దరూ కలుస్తున్నారు. తేరుకుంటూ అన్నాడు నూకరత్నం పెద్దబావ.

అవును సార్! అది మా ఆఫీసు. మా ఆఫీసుకు రండి సార్ ! నవ్వుతూ లోపలికి అడుగుపెట్టి అన్నాడు ఏకాంబర్.

అవునమ్మా! మీ అమ్మాయి మావాడి అఫీసులోనే వుంటూ స్వయం గా తనూ తన కాళ్ళ మీద నిలబడడానికి ప్రయత్నిస్తోంది. నా కొడుకు మీ అమ్మాయికి చేయూతనిస్తున్నాడు. చెప్పింది ఏకాంబర్

తల్లి పర్వతాలు.

మీకెవరికి అభ్యంతరం లేకపోతే నేను నూకరత్నాన్ని పెళ్ళిచేసుకుంటాను. నూకరత్నానికి కావలిసిన వాళ్ళంతా ఇక్కడే వున్నారు. మీరు అందరూ అంగీకరిస్తే చిన్నగా నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

ఈ కుర్రాడే కదండీ మామయ్యగారు చనిపోయినప్పుడు మనకి సహాయం చేసింది చటుక్కున అంది నూకరత్నం పెద్దబావ భార్య.

అవునన్నాయ్యా నువ్వు గుర్తు పట్టలేదా ఈయనే మన నాన్నగారి ఫ్రెండ్ ఏజెంటు ఏకాంబర్ ఆనందం గా అన్నాడు చిన్న బావ.అయ్యో నేనింతవరకూ గుర్తుపట్టలేదురా! ఏడాది అయ్యుంటది కదా! మర్చిపోయాను అన్నాడు పెదబావ.

రండమ్మా కూర్చోండీ అంటూ నూకరత్నం ఇద్దరి బావల భార్యలు ఏకాంబర్ తల్లి పర్వతాల్ని ఆదరం గా ఆహ్వానించారు.

వాతావరణం మారుతోందని గ్రహించింది నూకరత్నం. అందరూ ఏకాంబర్ మాటలకు ముగ్ధులవుతున్నారు. తనూ సరదాగా మాట్లాడాలి అనుకుంది.

బావా లోపలికి రండి గుమ్మం దగ్గరే మాటలేంటీ అంది నవ్వుతూ...

నూకరత్నం తల్లి కూడా పరిస్థితుల్ని అర్ధం చేసుకుంది. నవ్వుతూ పర్వతాలు దగ్గరకు వెళ్ళింది.

నా కొడుకు ఊరికే అనటం లేదండీ.. మీ అమాయిని మా అబ్బాయికిచ్చి పెళ్ళిచేద్దాం. మా ఇంట్లో అందరం వాడి మాటకు ఎదురుచెప్పం. మీ అందరికీ ఇష్టమేనా నవ్వుతూ అడిగింది పర్వతాలు.

అయ్యో అదెంత మాట మా మరదలు పిల్లకి ఇంత మంచి మొగుడు దొరుకుతుంటే సంతోషం కదండీ అన్నాడు నూకరత్నం  పెద్దబావ...

ఆయన మాటలకు  అందరూ ఆనందం గా వంతపాడారు. అపటికే కిందపడ్డ స్వీట్ బాక్స్ తీసి చేత్తో పట్టుకుంది నూకరత్నం చెల్లెలు.మీ అబ్బాయి వలనే నూకరత్నం ఈ రోజు ఇంత దర్జాగా, ధైర్యం గా అందర్నీ ఎదిరించి మాట్లాడుతోందమ్మా!

దీనికింత ధైర్యం ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోయాను. సొంతం గా వ్యాపారం చేసే స్థాయికి ఎదిగిందంటే అంతా మీ దయ తల్లి.అత్తా మనం ఇంతవరకూ తిట్టింది తూలనాడింది అదెక్కడ రోడ్డున పడుతుందోననే కదా! బంగారం లాంటి కుర్రాడ్ని పెళ్ళాడాలనుకుంటే అంతకంటే మనకి ఆనందం ఏముందత్తా.. మా వలన ఏదైనా తప్పుజరిగితే క్షమించత్తా! ఇద్దరు బావలు నూకరత్నం తల్లి చేతులు పట్టుకున్నారు.

ఒరేయ్ భడవలూ! నేనున్నా లేకపోయినా నూకరత్నం మంచి చెడ్డలు మీరే కదరా చూసుకోవాలి. అదేమన్నా తప్పుగా మాట్లాడుంటే మీరు కూడా మనసులో పెట్టుకోకుండా దాన్ని ఆశీర్వదించండి ఆనందం గా అంది నూకరత్నం తల్లి.

సరి సరి బంధువుల మధ్య అయిన వాళ్ళ మధ్య క్షమాపణలు ఉండవు. రేపు ఉదయం మా అమ్మాయి అలివేలుమంగకి తాంబూలాలు తీసుకుంటున్నాము. మీరంతా సకుటుంబ సపరివారసమేతం గా విచ్చేసి పెళ్ళికూతుర్ని ఆశీర్వదించండి.

మీరూ తప్పక రావాలి.. ఇదే పిలవడం నూకరత్నం బావలకి కూడా చెప్పింది పర్వతాలు.

అందరూ ఆనందం గా వస్తామంటూ ఏకాంబర్ కి, పర్వతాలుకి చెప్పి బయట రోడ్డు వరకూ వచ్చి సాదరం గా సాగనంపారు తల్లీ కొడుకుల్నీ..అత్తా  ఇక మేము వెళ్తాం, మరదలు పిల్ల పెద్దింటికి వెళ్తున్నావ్ మమ్మల్ని మర్చిపోకు పెద్దబావ నూకరత్నం తో హాస్యమాడాడు.

మా కంటూ మీరే కదా బావ పెద్ద దిక్కు మీ వలనే కదా మేము ఈ ఊరొచ్చాం కోపంలో నేను ఏమన్నానో తెలీదు. నా మీద కోపం పెట్టుకోకండి ఏడుస్తూ ఇద్దరి బావల కాళ్ళమీద పడింది నూకరత్నం.

ఇవన్నీ కుటుంబ కలహాలు, ఇట్టే మాయమైపోతాయి. లే!లే! నీ దగ్గర మేము చిట్స్ కట్టొచ్చా నూకరత్నాన్ని బుదిరిస్తూ చిన్నగా నవ్వుతూ అడిగాడు చిన్న బావ.

మీరు చిట్స్ కడతారా? వుండండి చిట్స్ లిస్ట్ తీస్తాను అంటూ తన బ్యాగ్ కోసం వెళ్ళబోయింది నూకరత్నం.

టైం వుంది కదా! నీకు తీరికయినప్పుడు మీ అమ్మని తీసుకుని ఇంటికిరా అప్పుడే చిట్స్ రాస్తాం ఇద్దరు బావలు అన్నారు.

అలాగే ఆనందంగా అంది నూకరత్నం.

ఏకాంబర్ వాళ్ళింటి ఎదురుగా ఉన్న కళ్యాణ మండపంలో తాంబూలాల కార్యక్రమం ఏర్పాటు చేసారు. పెళ్ళికొడుకు వాళ్ళు వందమంది పై చిలుకు వస్తున్నామని పెళ్ళిళ్ళ పేరయ్యతో కబురుచేసారు.

ఏకాంబర్ వాళ్ళ బంధువులు, మిత్రులు అంతా కలిసి రెండొదలమంది దాటి పోవడంతో తాంబూలాల కార్యక్రమం కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసాడు పీతాంబరం.

ఉదయం నుండి పేరంటాళ్ళు, అమ్మలక్కలు హడావిడి . నూకరత్నం తల్లి, చెల్లి, తమ్ముడ్ని వెంట తీసుకుని ఉదయం తొమ్మిది గంటలకే హాజరయిపోయింది.

ఫ్రాంచైజీ ఆఫీసులో యువతీ యువకులందరూ ముందే వచ్చి ఏర్పాట్లలో ఏకాంబర్ కి తోడుగా నిలిచారు. ఏకాంబర్ మిత్రుడు అనిల్ భార్యను వెంటబెట్టుకు వచ్చాడు. శంకర్రావు, రామక్రిష్ణ, ఆచారి కళ్యాణమండపం లో పని వాళ్ళ దగ్గర నిలబడి పర్యవేక్షిస్తున్నారు.

ఏకాంబర్ అన్న నీలాంబర్ మాత్రం తనకేమీ పట్టనట్టు ఎక్కడ కూర్చున్నవాడు అక్కడే వుండిపోతున్నాడు.

పీతాంబరం, పర్వతాలు అంతా గమనిస్తూనే వున్నారు. అంతా ఏకాంబర్ ఒక్కడి భుజస్కందాల మీదే వేసుకుని తిరుగుతున్నాడు. నీలాంబర్ చూస్తే సర్వం పోగొట్టుకున్న వాడిలా డీలా పడి కూర్చుంటున్నాడు.



జరిగిన కథ : నూకరత్నం బావలు తలోమాట అంటూంటే రెచ్చిపోయి తానూ ఎదురు తిరుగుతుంది నూకరత్నం...ఈలోగా ఏకాంబర్ చెల్లి నిశ్చితార్థానికి ఆహ్వానించడానికి తన తల్లిని తీసుకుని వీళ్ళ ఇంటికి వస్తాడు. ఇక్కడి దృశ్యం చూసి ఆశ్చర్యపోతాడు....ఏకాంబర్ ని పోల్చుకుని పలకరిస్తారు అందరూ. .........................................................

ఏకాంబర్ కూడా అన్న నీలాంబర్ ని ఓ కంట కని పెడుతూనే ఉన్నాడు. పూనే నుండి వచ్చిన దగ్గరనుండి అలాగే ఉంటున్నాడు.

నూకరత్నం కూడా ఓ దగ్గర కూర్చోకుండా అలివేలుమంగ దగ్గరే వుండి ఆమె అలంకరణతో పాలుపంచుకుంటోంది.

ఏకాంబర్, నూకరత్నం అనుకోకుండా ఎదురుపడితే చిన్నగా నవ్వేసుకుంటూ ఎవరి పనుల్లో వాళ్ళు బిజీగా ఉన్నారు.

పది గంటలయ్యేసరికి పెళ్ళివారు బస్సులోనూ, కార్లలోనూ కళ్యాణ మండపం దగ్గరకు చేరుకున్నారు.

పెళ్ళి ఏర్పాట్లన్నీ ఘనం గా నిర్వహించడం చూసి పెద్దవాళ్ళు అందరూ ఆశ్చర్యపోయారు. పీతాంబరం తో పెళ్ళికొడుకు తండ్రి అదేమాట అనేసాడు.

కట్నం తక్కువనిపించినా బావగారూ! తాంబూలాల ఏర్పాట్లే ఇంత ఘనం గా చేస్తున్నారు. రేపు పెళ్ళి ఎంత అదరగొడతారో అనిపిస్తోంది. అంటూ ప్రశంసల వర్షం కురిపించాడు.

అంతే మా చిన్నోడి ఏర్పాట్లండీ! నాదేముంది..వాడికి చెల్లంటే ప్రాణం అన్నాడు పీతాంబరం.

తాంబూలాలు అయ్యి మధ్యాహ్నం బోజనాలు పూర్తయ్యాక ఇరుపక్షాల వియ్యాల వారు కలిసి ముహూర్తాలు పెట్టుకోవడానికి బ్రాహ్మణ వీధికి వెళ్ళారు. కాళిదాసు పండితున్ని కలిసి పెళ్ళి ముహూర్తం కూడా నిర్ణయించాక మగపెళ్ళివారు కదిలి వెళ్ళారు.

నూకరత్నం వాళ్ళు అంతవరకూ ఏకాంబరం అమ్మగారికి సహాయాం గా వుండిపోయారు. నూకరత్నం ఇద్దరు బావలు సతీసమేతం గా విచ్చేసారు.

ఏకాంబర్ మాత్రం మధ్య మధ్యలో నూకరత్నాన్ని ఓరకంట చూస్తూ మాట్లాడడానికి ప్రయత్నిస్తూ తల్లి గాని, చెల్లిగాని, తండ్రి గానీ చూస్తే సిగ్గుపడి పారిపోతున్నాడు.

నూకరత్నం కూడా పెళ్ళికూతురిలా ముస్తాబై వచ్చింది. ధగధగా మెరిసే చీరలో వాలు జడ ఊపుకుంటూ సంబరం అంతా నాదే అన్నట్టు కళ్యాణ మండపమంతా కలియతిరిగేది.

నూకరత్నాన్ని చూసి ఏకాంబరం బంధువులు, చుట్టుపక్కల వాళ్ళు ఆరా కూడా తీసేవారు.

ఆ తాంబూలాల వేడుకలో గమ్మత్తైన విషయం నూకరత్నం కంట పడింది.

ఉద్యోగం పోయిందన్న విచారం లో ఉన్న నీలాంబర్ చుట్టూ అలివేలుమంగ స్నేహితురాళ్ళతో ఒక అమ్మాయి పదేపదే తిరగడం గమనించింది. మౌన మునిలా కూర్చున్న నీలాంబర్ కూడా తన ప్రక్కనే తిరుగుతూ టైం ఎంతయిందనో, వాళ్ళేరండి? వీళ్ళేరండి? అనో ప్రశ్నిస్తూ వుండడం ఆమె వాలకం ఓరకంట గమనిస్తూనే వున్నాడు.

అదే విషయం భోజనాలు వడ్డిస్తున్నప్పుడు ఏకాంబర్ తో చెప్పింది నూకరత్నం. అప్పుడు కూడా భోజనం చేస్తున్న నీలాంబర్ కే ఆ అమ్మాయి కొసరి కొసరి వడ్డిస్తూ అటూ ఇటూ తిరగడం ఏకాంబర్ కి చూపించింది.

ఓ ఆ అమ్మాయా? మంగ స్నేహితురాలే కాదు మాకు దూరపు బంధువు కూడా, అమ్మకి వేలు విడిచిన అన్నయ్య కూతురు. పోనీలే ఈ విధంగా నైనా నీలాంబర్ మనలో పడుతాడు నవ్వుతూ అన్నాడు.

నూకరత్నం, ఏకాంబర్ లే కాదు ఆ అమ్మాయి నీలాంబర్ చుట్టూనే తిరగడం పీతాంబర్ కూడా ఓరకంట గమనించాడు. భార్య పర్వతాలుతో కూడా చెప్పి గమనించమన్నాడు.

ఆ అమ్మాయి పీతాంబరం, పర్వతాలుకి బాగా నచ్చేసింది చూద్దాం. భగవంతుడు కూడా రాసి పెట్టాలి కదా! అన్నుకున్నారిద్దరూ.తాంబూలాలు అయిన ఆరునెలల తరువాత పెళ్ళి ముహూర్తం ఖరారయింది. అంత సమయం దొరికితే ఆర్థికం గా కూడా సర్దుకోవచ్చనుకున్నాడు పీతాంబరం.

ఆ నెల్లోనే నీలాంబర్ చేత కంప్యూటర్ సెంటర్ పెట్టించాడు ఏకాంబర్. దానికి కావలిసిన షాపు కూడా గోపాలపట్నం లోనే తండ్రి డిపార్ట్ మెంట్ స్టోర్ పక్కనే చూసాడు. ఫర్నిచర్లకి, కంప్యూటర్లకి నూకరత్నం ద్వారా బ్యాంకు లోను సంపాదించాడు. ఆ బ్యాంకు రుణానికి ఏకాంబరే జామీన్నుగా వుండు ఇప్పించాడు.

మొదట షాపు దొరకలేదు. అడ్వాన్స్ ఎక్కువ అడిగారు. ఏం చేయాలో ఏకాంబర్ కి అర్ధం కాలేదు. షాపు లేకపోతే బ్యాంకు లోను కూడా మంజూరు కాదు.

తండ్రికి, తల్లికి ఈ విషయం వివరించాడు. అప్పుడు పీతాంబరే మన డిపార్ట్మెంట్ షాపు తీసేసి అన్నయ్యకి ఇచ్చేస్తాన్‌రా! అని ముందుకు వచ్చాడు. దానికి ఏకాంబర్ అంగీకరించలేదు.

మీరు మీ షాపు మూసేసి ఇంట్లో కూర్చుంటే మీ ఆరోగ్యం పాడవుతుంది. రోజూ ఏదో పని చేసే మీరు ఖాళీగా వుండలేరు వద్దు అంటూ బోధపరిచాడు.

నిజమేనండి! చిన్నోడు చెప్పింది కరక్టే! అమ్మినా అమ్మకపోయినా షాపు తెరచి కూర్చోవడం వలన మనసు వుంటుంది. శరీరానికి కూడా పని దొరుకుతుంది. చూద్దాం! ఎక్కడో ఒక దగ్గర పెద్దోడికి షాపు దొరక్కపోదు. అంది పర్వతాలు.

నెల తిరక్కుండానే

అదే రోడ్డు లో నాలుగైదు షాపుల దూరం లో షాపు ఖాళీ అవుతోందని తెలియగానే పరుగుపరుగున వెళ్ళి అడ్వాన్స్ ఇచ్చి ఖరారు చేసుకున్నాడు ఏకాంబర్.

నీలాంబర్ షాపు తెరిచిన వేళా విశేషమో కానీ తాంబూలాలలో చూసిన అమ్మాయితోనే నీలాంబర్ కి పెళ్ళి కూడా కుదిరిపోయింది.నీలాంబర్ కి పెళ్ళి కుదరడం ఎక్కువగా ఏకాంబర్ కి సంతోషం కలిగించింది. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న వాడిలా తిరిగే నీలాంబర్ కూడ కంప్యూటర్ సెంటర్ ప్రారంభించగానే విధ్యార్థులతో మమేకమై రాత్రి, పగలు అదే ధ్యాసలో వున్నాడు. విధ్యార్థులు కూడా నీలాంబర్ కంప్యూటర్ సెంటర్ లో జాయిన్ అవడానికి క్యూ కడుతున్నారు. ఏకాంబర్ తల్లి తండ్రులు పీతాంబర్, పర్వతాలు కూఅడా చాలా సంబరపడిపోతున్నారు. కూతురి పెళ్ళి అయిపోయింది. పెద్దోడి సంబంధం కూడా కుదిరిపోయింది. అమ్మాయి పెళ్ళయితే గానీ మిగతా విషయాలు మాట్లాడ్డం కుదరదని నిక్కచ్చిగా చెప్పేసింది పర్వతాలు.

అలివేలు మంగ పెళ్ళయ్యేకే ఇద్దరన్నదమ్ములకీ ఒకేసారి చేద్దామని పర్వతాలు ఆలోచన, దానికి పీతాంబర్ కూడా సుముఖం గానే వున్నాడు. నీలాబర్ అత్తవారు కూడా మీ ఇష్టం



జరిగిన కథ : ఏకాంబర్ చెల్లెలు అలివేలు మంగ ఎంగేజ్ మెంట్ వేడుకలకి నూకరత్నం, ఆమె బావలు కూడా వస్తారు. నీలాంబర్ ఒక అమ్మాయితో చనువుగా ఉండడం గమనించి నూకరత్నం ఏకాంబర్ తో చెప్తుంది. ఆ అమ్మాయి తమకి వరసకి మరదలు అవుతుందని, నీలాంబర్ ఆ అమ్మాయిని ఇష్టపడితే మంచిదేనని అంటాడు ఏకాంబర్.

"రాత్రంతా మీరు పడుకోనిచ్చార్రా?! ఆలస్యంగా పడుకోవడం వలన లేవలేకపోయాను.." సోఫాలో కూర్చుంటూ అన్నాడు నీలాంబర్.

" రోజూ అయిదు గంటలకే వెళ్తావు కదా అన్నయ్య !     ఈ రోజు ఆలస్యమైతే పాపు ఎవరు తీస్తారు? " కుతూహలంగా అడిగింది చెల్లెలు మంగ."

ఇద్దరబ్బాయిలు ఉన్నారు కదమ్మా! వాళ్ళూ వచ్చేస్తారు. ఒక తాళాల జత వాళ్ళ దగ్గర కూడా ఉంది." చెప్పాడు నీలాంబర్.

" రత్నం గారూ! అన్నయ్యకి టీ కావాలి " హాల్లో నుంచే అరిచాడు ఏకాంబర్.

" ఇదిగో తెస్తున్నా " అంటూ వంట గదిలోనుంచే కేక వేసింది నూకరత్నం.

అన్నదమ్ములిద్దరూ చెల్లెలితో సరదాగా కబుర్లాడుకుంటూ కూర్చున్నారు. నూకరత్నం కూడా టీ గ్లాసు నీలాంబర్ చేతికిచ్చి తనూ బాతాఖాణీలో పాలుపంచుకుంది.

ఇంతలో ఎవరో ఒకామె ఇంటిముందుకొచ్చి 'ఏకాంబర్ బాబూ' అని గట్టిగా పిలిచేసరికి నలుగురూ కబుర్లలోనుండి బయటపడ్డారు.

' అన్నయ్యా! నీకోసమే ఎవరో వచ్చారు. వాకిట్లో నిలబడి పిలుస్తున్నారు.' సోఫాలో నుండి లేచి గుమ్మం దగ్గరకు వచ్చి చూస్తూ అంది అలివేలుమంగ.

" నాకోసమా?" ఆశ్చర్యంగా లేచి నిలబడ్డాడు నీలాంబర్.

" అబ్బ నీ కోసం కాదురా అన్నయ్యా! చిన్నన్నయ్య కోసం " చిరాగ్గా అంటూ వాళ్ళదగ్గరకు వచ్చింది.

" అయ్యో! ఎవరో ఏమో! లోపలకు రమ్మనకపోయావా?" గభాలున లేచి నిలబడి అన్నాడు ఏకాంబర్.

" ఎవరో ఏమో వెళ్ళి చూడరా!" అన్నాడు నీలాంబర్.

అన్న మాట వింటూనే వీధి గుమ్మం దగ్గరకు వచ్చాడు ఏకాంబర్.

వీధి వాకిట్లో నిలబడి ఉంది ఒకామె.

"మీరు" సంశయంగా అడిగాడు ఏకాంబర్.

" నేను రైల్వే గార్డు రామారావు గారి భార్యను బాబు.మీతో మాట్లాడాలని వచ్చాను." అంది ఆమె గొంతులో నుండి తన్నుకొస్తున్న దు:ఖాన్ని ఆపుకుంటూ.

'రైల్వే గార్డు రామారావూ పేరు వింటూనే క్షణం ఆలోచిస్తూ ఉండిపోయాడు ఏకాంబర్.

రైల్వేగార్డు    రామారావు! ఎస్. గుర్తొచ్చింది.ఏజెంటుగా చేరిన కొత్తలో తనే పిలిచి పాలసీ రాసిన మంచి మనిషి దాదాపు అయిదేళ్ళు దాటి పోయింది. ఆ తర్వాత ఆయన్ని కలవడం కుదరలేదు. రైల్వే ఉద్యోగి కావడం వలన నెలనెలా పాలసీ మొత్తం జీతంలో వసూలు అయిపోతుంది.

మొదటి రెండు వాయిదాలే కట్టి పాలసీ రాయించాడు. అయితే ఆ రెండు వాయిదాల మొత్తం అయిదు వేలు రూపాయలు బలవంతంగా తను వద్దన్నా వినకుండా ఇచ్చేసాడు.

అలాంటి మంచి మనిషి గుర్తుకు రాకపోవడమేమిటి?!" అనుకుంటూనే ఆమెను ఆనందంగా ఇంట్లోకి ఆహ్వానించాడు ఏకాంబర్." రండి! రండమ్మా! సార్ బావున్నారా?" యధాలాపంగా అడిగాడు.

" ఏం బాగు బాగు బాబూ ఆర్నెల్లుగా రైల్వే ఆసుపత్రిలో ఉన్నారు. ఏ క్షణాన ఏమౌతుందోనని ఆందోళనగా ఉంది" దాదాపు ఏడుస్తూనే మెట్లెక్కుతూ గుమ్మం అరుగు మీద అచేతనంగా కూర్చుండిపోయింది ఆమె.

"అయ్యో! ఏమైందమ్మా!" అంటూ ఆమెని రెండు చేతులతో పొదివి పట్టుకుని నెమ్మదిగా నడిపించుకుంటూ ఇంట్లోకి తీసుకెళ్ళాడు ఏకాంబర్."

రత్నం గారు కొంచెం మంచినీళ్ళు తీసుకురండి" ఆతృతగా చెప్పాడు ఏకాంబర్.

"అలాగే" అంటూ గబాలున వంటగదిలోకి వెళ్ళి నీళ్ళగ్లాసుతో వచ్చింది నూకరత్నం.

"తీసుకోండమ్మా" నూకరత్నం చేతిలో ఉన్న నీళ్ళగ్లాసుని తీసుకుని ఏకాంబర్ కేసి కృతజ్ఞతగా చూసింది ఆమె.

"చెప్పమ్మా! నేనెలా సహాయపడగలను?" ఆమె ప్రక్కనే సోఫాలో కూర్చుంటూ అన్నాడు ఏకాంబర్.

ఆమెతో ఏకాంబర్ మాట్లాడుతుంటే నీలాంబర్, అలివేలుమంగ, నూకరత్నం ఉత్సుకతతో చూస్తూ నిలబడిపోయారు.

"ఏంలేదు బాబూ! ఆయన నీ దగ్గర ఇన్స్యూరెన్స్ ఏదో కట్టారట కదా! ఆయన ఆసుపత్రిలో చేరి ఆర్నెల్లు కావస్తోంది. జీతం రావడం లేదు. ఆ విషయం నీతో చెప్పి రమ్మని నా కూతురు పంపించింది బాబూ" నెమ్మదిగా చెప్పింది ఆమె.

" ఆర్నెల్లయిపోతోందా...అయ్యో మంగా నా గదిలో ల్యాప్ టాప్ ఉంది కదా ఇలా పట్టుకుని రా" చెల్లెలికి చెప్పాడు ఏకాంబర్.

"అలాగే అన్నయ్యా" అంటూ గబాలున గదిలోకి వెళ్ళి, అరక్షణంలో ల్యాప్ టాప్ పట్టుకుని వచ్చింది అలివేలుమంగ.

"రత్నం గారూ ల్యాప్ టాప్ తెరిచి నా కోడ్ తో ల్యాప్స్ అయిన పాలసీల లిస్ట్ లో సార్ పేరు, పాలసీ నంబరు ఉందేమో చూడండి. " ఆతృతగా అన్నాడు.

"అలాగే" అంటూనే అలివేలు మంగ చేతిలో ల్యాప్ టాప్ తీసుకుని సోఫాలో కూర్చుంది నూకరత్నం.

"భోగాపురపు రామారావు, సాలరీ సేవింగ్స్ స్కీం లో ఉంటుంది " చెప్పాడు ఏకాంబర్.

నూకరత్నం కూడా ఆతృతగా కంప్యూటర్ లో ఫైల్స్ అన్నీ వెతికింది.

" లేదు సార్, ఇంకా పాలసీ ల్యాప్స్ అయినట్టు లేదు. సార్ పేరు ఎక్కడా కనిపించడం లేదు. " చెప్పింది.

" ప్రస్తుతానికి పాలసీ ల్యాప్స్ కాలేదమ్మా. ఆరు నెలలు వరుసగా వాయిదా చెల్లించకపోతే పాలసీ ల్యాప్స్ అవుతుంది. పొరపాటున ఏదన్నా జరిగితే క్లైం ఒక్క రూపాయి కూడా రాదు." ఆమెతో చెప్పాడు ఏకాంబర్.

" అంటే...?" అయోమయంగా ఏకాంబర్ కేసి చూస్తూ అంది ఆమె.

" సార్ కి జీతంలో కదమ్మా పాలసీ ప్రీమియం కట్ అయి కంపెనీకి చేరేది, అలా ప్రతీ నెలా రికవరీ అయి పాలసీ ప్రీమియం కంపెనీకి చేరితేనే సార్ పేర కట్టిన పాలసీ నడుస్తుంది. ఒకవేళ ఎవరైనా వరసగా ఆరునెలలు కట్టకపోతే ఆ పాలసీ ల్యాప్స్ అయిపోతుంది." చెప్పాడు ఏకాంబర్."అదే..ల్యాప్స్ అంటే నాకర్థం కావడంలేదు బాబూ..." అంది ఆమె ఆందోళనగా.

" పాలసీ చనిపోతుందని అర్థమమ్మా...అప్పుడు ఆ పాలసీ వలన ఎలాంటి లబ్ధి చేకూరదు. జరగరానిది ఏదన్నా జరిగితే అయిదు లక్షల రూపాయల ఇన్స్యూరెన్స్ ఇవ్వరు." ఆమెకి అర్థమయ్యేలా చెప్పాడు ఏకాంబర్.

" మరి ఇప్పుడెలా బాబూ" ఆందోళనగా అంది ఆమె.

" సార్ కి జీతం రావటం లేదు కదమ్మా వాళ్ళ ఆఫీసు వాళ్ళు కూడా కట్టలేరు కదా? మనమే ఆ వాయిదాలు నేరుగా ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళ్ళి కట్టుకోవడం మంచిది" చెప్పాడు ఏకాంబర్.

"అమ్మో జీతం రాక, ఇంటి పోషణే దినదినగండంగా ఉంది బాబూ. ఆయన ఆసుపత్రిలో పడ్డ దగ్గర్నుండి నానా యాతన పడుతున్నాం బాబూ.

రైల్వే ఆసుపత్రి కనక ఆయన మందులూ గట్రా వాళ్ళే ఇస్తున్నారు." బాధగా అంది ఆమె.

" అయ్యో " అంటూ గబాలున తన జేబులో నుండి వెయ్యి రూపాయల నోట్లు పది తీసి ఆమెకి ఇవ్వబోయాడు ఏకాంబర్.

"వద్దు బాబూ. భగవంతుడి దయవలన ఏదో నడుస్తోంది. ఈ పాలసీ విషయమై నీకు చెప్పి పోదామని వచ్చాను బాబు. ఎవరి దగ్గరన్న చేబదులు అడిగి నాలుగైదు రోజుల్లో వచ్చి నిన్ను కలుస్తాను బాబు." అంటూ ఆమె సోఫాలో నుండి లేచి నిలబడింది." మీకు ఎలాంటి సహాయం అవసరమైనా నాకు ఫోన్ చెయ్యండమ్మా" అంటూ తన విజిటింగ్ కార్డ్ తీసి ఆమెకి ఇచ్చాడు ఏకాంబర్.

" వస్తానమ్మా, వస్తాను బాబూ" అంటూ అక్కడ ఉన్న నలుగురికీ చెప్పి ఆమె నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయింది."ఎవర్రా చిన్నన్న?!" ఏకాంబర్ ప్రక్కకు వస్తూ అడిగింది మంగ.

" వాళ్ళాయన నా కస్టమర్. పాపం చాలా మంచాయన. మంచాన పడ్డాడట." బాధగా అన్నాడు ఏకాంబర్.

" ఇలా అందరికీ డబ్బు సాయం చేస్తూంటావా?" ఆశ్చర్యంగా అడిగింది మంగ.

"అవసరమైన వాళ్ళకి..తప్పేముంది..?" ఆశ్చర్యంగా అడిగాడు ఏకాంబర్.

"తప్పులేదు. డబ్బులొస్తున్నాయి కదాని ఇలా దానమిస్తూ పోతే నాలా రోడ్డున పడాల్సి వస్తుందిరా.!" గబాలున అన్నాడు నీలాంబర్.

" నీ సంగతి వదిలెయ్ అన్నయ్యా! నేను ఊరికే ఎవరికీ ధారపోయడంలేదు. కష్టాల్లో ఉన్న వాళ్ళకి ఏదో నాకు చేతనైన చిన్న సహాయం. అయినా ఎవరూ అంత తొందరగా తీసుకోరు కూడా."

" నువ్వు పడ్డ కష్టం ఇంకేం మిగులుతుందిరా." అంది మంగ.

" కష్టమర్లందరూ నా దగ్గర పాలసీలు కట్టబట్టే కదా నేనీరోజు ఇలా ఉన్నాను.వాళ్ళుంటేనే నేనుంటాను. ఆ విషయం మీకు తెలుసా" కోపంగా అన్నాడు ఏకాంబర్.

" అవునులేరా. నీ తెలివి కన్నా వాళ్ళ తెలివితక్కువే ఎక్కువగా కనిపిస్తోంది     చస్తేగానీ చేతికందని డబ్బు కోసం అప్పులు చేసి తిప్పలు పడుతూంటారు. " గబుక్కున అనేసాడు నీలాంబర్.

" అన్నయ్యా" ఆశ్చర్యంగా..ఆందోళనగా అంది అలివేలుమంగ.

" అదేంటన్నయ్యా, అలా మాట్లాడుతున్నావ్. ఆలోచించే మాట్లాడుతున్నావా?" నీలాంబర్ కేసి చూసి అన్నాడు ఏకాంబర్.

" ఈ ఇన్స్యూరెన్స్     అంటే నాకు ఎలర్జీరా. ఐ డోంట్ లైక్ దిస్ బ్లడీ ఎంబ్‌రాసింగ్ సేవింగ్స్." అంటూ లేచి వెళ్ళిపోయాడు నీలాంబర్.

" మీ పెద్దన్నయ్య అలా మాట్లాడుతున్నారేంటండీ?" ఆశ్చర్యంగా అంది నూకరత్నం.

"మావాడి మనస్తత్వం అంతే లెండి రత్నం గారూ. నేనన్నా, నా పనులన్నా మా అన్నయ్యకు ఎలర్జీ. వదిలెయ్యండి నేనలా వీధిలోకి వెళ్ళివస్తాను " అంటూ తన బ్యాగ్ సర్దుకుని నిలబడ్డాడు ఏకాంబర్.

" సరేలే వెళ్ళిరండి. అలా వీలైతే మన ఫ్రాంఛైజీ ఒకసారి చూసి రండి " ల్యాప్ టాప్ బ్యాగ్ లో పెడుతూ అంది నూకరత్నం.



జరిగిన కథ ; ఏకాంబర్, నీలాంబర్, వాళ్ళ చెల్లెలు అలివేలు మంగ కూర్చుని మాట్లాడుకుంటూండగా ఏకాంబర్ కోసం ఎవరో ఒక స్త్రీ వచ్చి ఇంటి ముందు నిలబడి పిలుస్తుంది.. రైల్వే ఉద్యోగి రామారావు భార్యనని చెప్తుంది..తన భర్తకు ఆరోగ్యం ఏమీ బాగా లేదనీ, పాలసీ విషయం ఎలా అని అడుగి వివరాలు కనుక్కుని వెళ్ళిపోతుంది............

............................................

" మీరూ ఇంటిపని కాగానే ఒసారి ఆఫీసుకి వెళ్ళిరండి. అమ్మావాళ్ళు రేపు వచ్చేస్తారు కదా " అన్నాడు ఏకాంబర్.

" నీకు ఫోన్ చేసారా అన్నయ్యా?" ఆనందంగా అంది మంగ.

" విజయనగరంలో ఉన్నారు. అక్కడ అందరికీ కార్డులు ఇచ్చెయ్యగానే వచ్చేస్తామన్నారు. నేను వెళ్తాను." అంటూనే వీధి గుమ్మం లోకి వచ్చాడు ఏకాంబర్.

గదిలోకి వెళ్ళిన నీలాంబర్ కూడా వీధి గుమ్మం దగ్గరకు వచ్చాడు.

" వస్తావా అన్నయ్యా? నేను మీ షాపు కేసే వెళ్తున్నాను." బైక్ స్టార్ట్ చేస్తూ అన్నాడు ఏకాంబర్.

" ఆ..ఆ..వచ్చేస్తాను.. ఉండు " అంటూ లోపలకు పరుగున వెళ్ళి తన లాప్ టాప్ భుజాన తగిలించుకుని వచ్చాడునీలాంబర్.

ఇద్దరన్నదమ్ములూ ఏమీ జరుగనట్లు నవ్వుకుంటూ బైక్ మీద వెళ్తుంటే నూకరత్నం ఆశ్చర్యపోయింది.

" ఇది మా ఇంట్లో ఎప్పుడూ మామూలే వదినగారూ! పదండి ! మీరూ ఆఫీసుకు వెళ్ళాలి కదా! తొందరగా ఇంటిపని ముగించేద్దాం " నవ్వుతూ నూకరత్నం భుజం మీద చెయ్యి వేసి లోపలకు తీసుకెళ్తూ అంది మంగ.

" ఈరోజు నువ్వూ నాతో మా ఆఫీసుకు వస్తున్నావు అంతే" అంటూ మంగని గట్టిగా కౌగిలించుకుని అంది నూకరత్నం.

" అయ్యబాబోయ్! ఈ ఉక్కు కౌగిలి మా బక్కన్న ఎలా తట్టుకుంటాడు " పకపకా నవ్వుతూ అంది మంగ.

" చీ! పో! " అంటూ వంటగదిలోకి పరుగు తీసింది నూకరత్నం.

ఆరోజు...

వైజాగ్ నుంచి నేరుగా గోపాలపట్నంలో ఉన్న సర్వీస్ సెంటర్ కి చేరుకున్నాడు ఏకాంబర్. చెల్లెలి పెళ్ళి దగ్గర పడుతున్న కొద్దీ ఆందోళన పడుతున్నాడు. అన్ని పనులూ సక్రమంగా జరుగుతున్నాయో, లేదో..అని ఆలోచిస్తూనే అఫీస్ లోకి అడుగుపెట్టాడు ఏకాంబర్. నూకరత్నంతోబాటు ఉన్న ఇద్దరమ్మాయిలు కంప్యూటర్ల ముందు కూర్చుని ఏదో పనిలో ఉన్నారు. ఎప్పుడూ ఆలస్యంగా వచ్చే ఏకాంబర్ ఈరోజు ఇంత తొందరగా ఆఫీసుకు వచ్చేసరికి ఆశ్చర్యపోయింది నూకరత్నం.

" రండి అంబర్ సార్. ఈరోజు ఇంత వేగంగా వచ్చేసారు. ఏదైనా విశేషమా?" నవ్వుతూ పలకరించింది.

" పెళ్ళి దగ్గర పడుతూంటే ఎందుకో మనసంతా ఆందోళనగా ఉంటోంది. కేటరింగ్ చేసే అతన్ని రమ్మన్నాను. వచ్చాడా?" అడిగాడు ఏకాంబర్." వచ్చాడు. మీ అన్నని కలవమని పంపించాను." చెప్పింది నూకరత్నం." అయ్యో! నాన్నకీ విషయం తెలిస్తే తట్టుకోలేడు..." ఆందోళనగా అన్నాడు ఏకాంబర్.

" ఏ విషయం?" ఆశ్చర్యంగా అంది నూక రత్నం.

" మూడు వేలమందికి భోజనాలకి ఆర్డర్ ఇచ్చాను. ఆ కేటరింగ్ ఆయనేమో 'మూడున్నర లక్షలూ అడుగుతున్నాడు. కూర్చుని మాట్లాడదామని ఇక్కడికి రమ్మని చెప్పాను" తలమీద చెయ్యి వేసుకుని కుర్చీలో కూలబడిపోయాడు ఏకాంబర్." మీ బంధువులంతమంది వస్తారా?" మరింత ఆశ్చర్యంగా అంది నూకరత్నం.

" మన కస్టమర్లందరూ మన బంధువులు కాదా?" ఈ అయిదేళ్ళలో నాకు 'పాలసీ' ఇచ్చిన వాళ్ళందరికీ పెళ్ళికి రమ్మని ఆహ్వానిస్తున్నాను." అన్నాడు ఏకాంబర్.

" మంచి పని చేస్తున్నారు..ఈ విషయం మీ నాన్నగారికి చెప్పలేకపోయారా?" ఏకాంబర్ పక్కకు వచ్చి నిలబడి లాలనగా భుజం మీద చెయ్యి వేసి అంది నూకరత్నం.

" చెప్పలనే అనుకున్నాను. అన్నిటికీ లెక్కలు వేసుకుని 'అమ్మో' అని భయపడిపోతున్నారు. పెళ్ళి కార్డులు కూడా ఆయన చేతికి మూడు వందలే ఇచ్చాను. కళ్యాణమండపం బుక్ చేస్తే ఇంత పెద్దది ఎందుకురా అని తినేసాడు. ఇంకేం చెప్తాను?" చిరాగ్గా అన్నాడు ఏకాంబర్.

ఇంతలో కేటరింగ్ అతన్ని వెంటబెట్టుకుని పీతాంబరం అక్కడికి వచ్చాడు.

వస్తూనే గాబరాగా ఏకాంబర్ దగ్గరకు వచ్చాడు.

"ఏరా! ఇతనితో మూడువేలమందికి భోజనాలు ఏర్పాటు చెయ్యాలన్నావట, నిజమేనా? నీకసలు మతుందా? మనం పంచింది మూడువందల కార్డులే కదా! కాదూ కూడదంటే ఓ ఆరొందలమంది పెళ్ళికొస్తారు..అంతే కదా!" కొడుకుతో అన్నాడు పీతాంబరం.

" నువ్వు పంచిన కార్డులే కాదు కదా! నేను కూడా మా ఆఫీసు స్టాఫ్ కి, ఇన్స్యూరెన్స్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫీసర్లకి ఇంకా నా కస్టమర్లకి చాలామందికి కార్డులు ఇచ్చాను." తల దించుకునే అన్నాడు ఏకాంబర్.

" మీ కస్టమర్లకి, ఆఫీసర్లకి ఇచ్చావా? మంచిపని చేసావ్...మీ చెల్లి పెళ్ళి కదా వాళ్ళందరికీ ఎందుకులే అనుకున్నాను. ఎలాగూ ఎదర నీ పెళ్ళి, అన్న పెళ్ళి ఉంది కదా అప్పుడు చెప్తావేమో అనుకున్నాను., మంచిపని చేసావ్" ఆనందంగా అన్నాడు పీతాంబర్.

" నాన్నా..." ఆనందంగా తల ఎత్తి తండ్రి కళ్ళల్లోకి చూసాడు ఏకాంబర్.

" నిజమేరా! మన ఇంట్లో మొదటి పెళ్ళి మన బాగు కోరుకున్న వాళ్ళందరినీ పిలవడం మంచిదేగా, అయితే ఈ కేటరింగ్ కుర్రాడితో నువ్వు మాట్లాడు నేను షాపుకెళ్తాను..." అంటూ వెళ్ళిపోయాడు పీతాంబరం.

కేటరింగ్ కుర్రాడ్ని తీసుకుని తన కేబిన్ లోకి వెళ్ళాడు ఏకాంబర్.

కేబిన్ లో కూర్చుని కేటరింగ్ కుర్రాడితో మాట్లాడుతున్న ఏకాంబర్ కేసి చూస్తూ మనసులోనే నవ్వుకుంది నూకరత్నం.

'తండ్రీ కొడుకులిది ఒకరిమీద ఒకరికి ఎంత వాత్సల్యం..?!" మనసులోనే అనుకుంది.

ఇంతలో ఒకతను గాభరాగా పరిగెడుతున్నట్టే ఆఫీస్ లో అడుగు పెట్టాడు. క్షణం ఆయాసపడుతూ నిలబడ్డాడు.

" ఎవరు కావాలండీ?" ఆఫీసులో వాళ్ళకి ట్రే లో టీ లు తీసుకొస్తున్న పద్మ అతన్ని చూస్తూ అడిగింది.

పద్మ గొంతు విని కంప్యూటర్లలో మునిగి ఉన్న నూకరత్నం, ఇద్దరమ్మాయిలు ఒక్కసారే తల ఎత్తి చూసారు.

పద్మ ట్రే లో టీలు పట్టుకుని ఏకాంబర్ చాంబర్ లోకి వెళ్ళింది.

" ఎవరు కావాలండీ?" నూకరత్నం అతన్ని దగ్గరకు రమ్మని సైగ చేస్తూనే అడిగింది.

"ఏజెంటుగారు లేరామ్మా?" ఆతృతగా అన్నాడతడు.

"ఏకాంబర్ గారేనా?" అంది నూకరత్నం.

"అవునమ్మా"అన్నాడతడు.

"అదిగో! ఆ కేబిన్ లో ఎవ్వైతోనో మాట్లాడుతున్నారు. విషయం ఏంటో మాకు చెప్పండి...ఫర్వాలేదు.."అడిగింది నూకరత్నం.

" నన్ను ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావు  గారు పంపించారమ్మా" నూకరత్నం ఎదర ఉన్న కుర్చీలో కూర్చుంటూ అన్నాడతడు.

"ఎమ్మెల్యేగారా?" ఆశ్చర్యంగా అంటూనే చటుక్కున నిలబడి గబాలున ఏకాంబర్ కేబిన్ దగ్గరకు వెళ్ళింది నూకరత్నం.

కేబిన్ లో కూర్చున్న ఏకాంబర్ టీ సిప్ చేస్తూనే నూకరత్నాన్ని చూస్తూ గబాలున లేచి బయటకు వచ్చాడు.

" ఎవరతను?" కౌంటర్ దగ్గర కూర్చున్నతన్ని చూస్తూనే అడిగాడు ఏకాంబర్.

"ఎమ్మెల్యే గారు పంపించారట..మీతో ఏదో చెప్పాలని     వచ్చినట్టున్నాడు" ఆనందంగా అంది నూకరత్నం.

"ఏం చెప్పాలట?" అనుకుంటూ కౌంటర్ వైపు నడిచాడు ఏకాంబర్.

ఏకాంబర్ వెనకే దగ్గరగా నడుస్తూ రహస్యంగా అతని చెవిదగ్గర అంది నూకరత్నం...

"ఏమో మళ్ళీ ఓ నలభై, ఏభై పాలసీలు రాయిస్తారేమో నాకు చాలా ఆనందంగా ఉంది " అంది నూకరత్నం.

"అంతలేదు...కొంపదీసి మొన్న పాలసీలు కట్టిన వాళ్ళల్లో ఎవడికైనా ఏదైనా ప్రమాదం జరగలేదు కదా!" మనసులోని అనుమానాన్ని నూకరత్నం ముందు బయటపెట్టాడు ఏకాంబర్.

"పాలసీలు కట్టి ఆర్నెల్లు కూడా అయినట్టు లేదు కదా " సాలోచనగా అంది నూకరత్నం.

ఇద్దరూ అలా గుసగుసలాడుకుంటూండగానే కౌంటర్ దగ్గరకు చేరుకున్నారు.

"ఎమ్మెల్యే గారేం చెప్పారు బాబూ?" ఆప్యాయంగా అతన్ని అడిగాడు ఏకాంబర్.

"మిమ్మల్ని వెంటబెట్టుకుని రమ్మన్నారండీ" అన్నాడతను.

"ఇప్పుడా?" ఆలోచిస్తూ అన్నాడు ఏకాంబర్.

"అవునండయ్యా" అంటూ నిలబడ్డాడు అతను.

"వెళ్దాం..ఒక్క అయిదు నిముషాలు ఆగు...." అంటూ వెంటనే కేబిన్ లో ఉన్న కేటరింగ్ కుర్రాడి దగ్గరకు వచ్చి ఏదో చెప్పి పంపించేసాడు.ఆ కేటరింగ్ కుర్రాడు వెళ్తూ వెళ్తూ "సార్ ! భోజనాల మెనూ కోసం మీ నాన్నగార్ని కలవమంటారా?" అడిగాడు.

"అబ్బ, చెప్పిందంతా వదిలేసి మళ్ళీ మొదటికొచ్చావా? కాస్త చీకటి పడ్డాక మా ఇంటికి రావయ్యా! అక్కడ అందరం ఉంటాం..అందరి అభిప్రాయాలు తెలుసుకోవచ్చు కదా!"

"అవును సార్! అయితే, ఈరోజే ఏడు గంటలకి మీ ఇంటిదగ్గరుంటాను." అంటూనే ఆ కేటరింగ్ కుర్రాడు వెళ్ళిపోయాడు."పదవోయ్..మనం వెళ్దాం..రత్నం గారూ నేనిక మళ్ళీ ఇటు రాను...మీరు ఆఫీస్ చూస్ మూసేసి వెళ్ళిపోండి.." అంటూ అతన్ని తీసుకుని వెళ్ళాడు ఏకాంబర్." మీరు టీ త్రాగండమ్మా! చల్లారిపోతున్నది..పాపం ఏకాంబర్ బాబు టీ కూడా సరిగ్గా త్రాగలేదు" నొచ్చుకుంటూ అంది పద్మ.



జరిగిన కథ:

చెల్లెలి పెళ్ళి పనుల్లో ఆఫీసు బిజీలో తలమునకలై వున్న ఏకాంబర్ దగ్గరకి ఎమ్మెల్యే అనుచరుడొకడు వచ్చి తీసుకెళతాడు. .......................................................

"ఆయన గారికి టీ త్రాగేంత వీలుందా! ఇటు వాళ్ళ చెల్లెలి పెళ్ళి....అటు కస్టమ్స్ సర్వీసు..రెండూ ముఖ్యమేగా" టీ త్రాగుతూ అంది నూకరత్నం.

నలుగురితో కలిసి టీ త్రాగుతోందే గానీ నూకరత్నం మనసంతా ఏకాంబర్ చుట్టే తిరుగుతోంది.

"ఆ ఎమ్మెల్యే గారు ఎందుకు ఇంత అర్జెంటుగా కబురు పెట్టారో..? ఏం జరిగిందో.." ఆలోచిస్తూనే ఉంది...

బైక్ మీద ఎమ్మెల్యే అనుచరుడ్ని వెనక ఎక్కించుకుని రివ్వున బీచ్ వైపు దూసుకుపోతున్నాడు ఏకాంబర్.

ఆరోజు రాత్రి

ఏకాంబర్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు ఇంటిల్లిపాది. కేటరింగ్ కుర్రాడు వచ్చి అరగంటపైనే అయింది. ఇంటికొస్తే అందరం మాట్లాడుకుని మెనూ ఖరారు చేస్తామని చెపాడు ఏకాంబర్. అందుకే సాయంత్రం ఆరో గంటకే ఏకాంబర్ వాళ్ళ ఇంటికి వచ్చాడు అతను. ఏడున్నరవుతుండగా ఇల్లు చేరుకున్నాడు ఏకాంబర్.

"ఏరా ! ఇంత ఆలస్యమైందేం? ఈ కేటరింగ్ కుర్రాడ్ని ఇంటికి పిలిచి ఆలస్యం చేయడం భావ్యం కాదు కదరా!" కొడుకు గుమ్మంలో అడుగు పెట్టగానే ఎదురెళ్ళి అన్నాడు పీతాంబరం.

" ఆఫీసుకెళ్ళాల్సొచ్చింది నాన్నా. చెల్లెలి పెళ్ళయ్యేంత వరకు వెళ్ళకూడదనుకున్నాను..తప్పింది కాదు.." భుజాన వున్న బ్యాగ్ సోఫాలో పెడుతూ అన్నాడు ఏకాంబర్.

"సరి సరి.. ముందు ఈ కేటరింగ్ కుర్రాడితో మాట్లాడి పంపించెయ్యండి.." వంటగదిలో నుండి వస్తూ అంది పర్వతాలు.

" మీరు మాట్లాడారు కద నాన్నా! నాకోసం ఆలోచించకండి...కూరలెన్నో, స్వీట్లు ఎన్నో..ఏదో చెప్పెయ్యండి..." అన్నాడు ఏకాంబర్.

"నువ్వు ఉదయంబే చెప్పావటకదరా! ఆ మెనూ బాగానే ఉంది..నాకు నచ్చింది. నాన్న కూడా ఆ ఐటంస్ అయితే బాగానే ఉంటాయన్నారు. కాకపోతే, రేటు ఎక్కువ అయిపోతుందని భయపడుతున్నాను.." అన్నాడు నీలాంబర్.

"మెనూ నచ్చింది కదన్నయ్యా...ఓకే చెయ్యండి... డబ్బు సంగతి నేను చూసుకుంటాను. మా ఆఫీసులో వాళ్ళంతా వస్తారు.కస్టమర్లు కూడా పెద్దపెద్దవాళ్ళు వస్తారు. మెనూ ఇంత రిచ్ గా లేకపోతే బావుండదు." చెప్తూనే బ్యాగ్ తీసుకుని గదిలోకి వెళ్ళాడు ఏకాంబర్.

"బాబూ! మా చిన్నబ్బాయి చెప్పిన మెనూనే ఖాయం చేసెయ్యండి. మిగతా విషయాలన్నీ రేపు ఉదయం వాడూ, మీరూ మాట్లాడుకోండి.." కేటరింగ్ కుర్రాడితో చెప్పాడు పీతాంబరం.

"సరే సార్! నేను రేపు ఏకాంబర్ సార్ని కలుస్తాను..వస్తాను.." అంటూనే లేచి వెళ్ళిపోయాడు కేటరింగ్ కుర్రాడు.

"ఇన్ని వేల మందికి భోజనాలంటే నాకెందుకో భయంగా ఉంది నాన్నా..ఏకాంబర్ గాడేమో ఆలోచన...పాలోచన లేకుండా తొందరపడుతున్నాడు." తండ్రి ప్రక్కనే కూర్చుంటూ అన్నాడు నీలాంబర్.

"నీకు చేతనైన సహాయం నువ్వు చెయ్యరా! మిగతాదంతాతమ్ముడే చూసుకుంటాడు. పదిమందిలో తిరుగుతున్నాడు కదా, ఈమాత్రం హోదాగా చెయ్యకపోతే బావుండదు " పెద్ద కొడుక్కి చెప్తూ పెళ్ళాం కేసి చూసాడు పీతాంబరం.

"నిజమేకదరా పెద్దోడా..! చెల్లి పెళ్ళి ఘనంగా చేద్దామని తమ్ముడి ఆశ...చెయ్యనీ.."ఆనందంగా అంది పర్వతాలు.

"మీ అందరి మాట ఒకటైనప్పుడు నాదేముంది? కానివ్వండి.." అంటూ అక్కడినుండి లేచి వెళ్ళిపోయాడు నీలాంబర్.

"వాడంతేలెండి..మీరు కానివ్వండి....రండి..భోజనాలు చేద్దాం..." అంటూ పర్వతాలు వంటగదికేసి వెళ్ళింది.

ఇంతలో టీవీ దగ్గరున్న సెల్ ఫోన్ మ్రోగింది. పర్వతాలు డైనింగ్ టేబుల్ దగ్గర వంటసామాన్లు

సర్దుతోంది. "చిన్నన్నయ్యా! నీ సెల్ ఫోన్ మ్రోగుతోంది. " పెరట్లోకి వెళ్ళిన ఏకాంబర్ ని పిలుస్తూ సెల్ తీసి చూసింది అలివేలుమంగ.

"రత్నం వదిన ఫోన్ చేస్తోందే?! ఎందుకో! " అని మనసులోనే అనుకుంటూ సెల్ చెవి దగ్గర పెట్టుకుంది అలివేలుమంగ.

"హలో వదినగారూ ! అన్నని ఇంట్లో కూడా హాయిగా ఉండనివ్వరా!" నవ్వుతూ అంది అలివేలు మంగ.

" నీ పెళ్ళయ్యేవరకూ మమ్మల్ని కూడా మీ అన్న గారు నిద్రపోనివ్వడం లేదమ్మా తల్లీ ! భోజనాలు అయ్యాయా!" కుశల ప్రశ్నలు అడిగింది అట్నుండి నూకరత్నం.

రెడీ అవుతోంది...అన్నయ్య ఇప్పుడేగా వచ్చాడు.." అంది అలివేలుమంగ.

"ఉన్నారా, ఒకసారి ఫోన్ ఆయనకిస్తావా?" అంది రత్నం.

"పెరట్లో ఉన్నాడు. అదిగో వస్తున్నాడు...ఇస్తానుండు. " అంటూనే సెల్ పట్టుకుని ఏకాంబర్ కి ఎదురెళుతూ "నీకేరా చిన్నన్న" అంటూ సెల్ ఫోన్ ఏకాంబర్ చేతికిచ్చింది మంగ.

"ఎవరూ?!" అంటూనే సెల్ చేతిలోకి తీసుకుని 'హలో' అన్నాడు ఏకాంబర్.

"ఎమ్మెల్యే గారింటికి వెళ్ళారు కదా, ఏమైంది..?" ఆతృతగా అడిగింది రత్నం.

"నేను ముందే చెప్పాను కదా ! ఎమ్మెల్యేగారి అనుచరుడొకరు చనిపోయాడు. ఆ విషయం చెప్పడానికే పిలిచాడాయన." చెప్పాడు ఏకాంబర్."అయ్యో, ఎలా..?" ఆశ్చర్యంగా అంది రత్నం.

"ఎవరో చంపేసి బీచ్ లో పడేసారు" చెప్పాడు ఏకాంబర్.

భోజనానికి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోబోతున్న పీతాంబరం, భర్తకి అన్నం వడ్డించబోతున్న పర్వతాలు ఆ మాట వింటూనే అదిరిపడ్డారు."ఎవర్రా? ఎవర్ని చంపేశారు?" ఆతృతగా అడిగాడు పీతాంబరం.

ఎవరో....ఎమ్మెల్యేగారి అనుచరుడ్ని చంపేసి సముద్రం ఒడ్డున పడేసారు.." సెల్ చేత్తో పట్టుకుని తండ్రితో చెప్పాడు ఏకాంబర్."ఫోన్ లో ఎవర్రా? ముందు వాళ్ళతో మాట్లాడి ఆ సెల్ ఆపరా! భోజనం చెయ్యవా?" కొడుక్కేసి లాలనగా చూస్తూ అంది పర్వతాలు.

"రత్నం మాట్లాడుతోందమ్మా!" అంటూనే సెల్ చెవి దగ్గర పెట్టుకుని ' రేపు మాట్లాడుదాం, ఉంటా రత్నం. గుడ్ నైట్ " అంటూ కాల్ కట్ చేసాడు ఏకాంబర్.

"ఎమ్మెల్యే నిన్నెందుకు రమ్మన్నాడు?" అడిగింది తల్లి పర్వతాలు.

"వాళ్ళ అనుచరులందరికీ నా దగ్గరే ఇన్సూరెన్స్ చేయించాడమ్మా! అందులో చనిపోYఇనతను కూడా ఉన్నాడు " విచారంగా అన్నాడు ఏకాంబర్.

"అయ్యో పాపం...అయినా వాళ్ళమధ్యేకదరా నీ దగ్గర పాలసీలు కట్టింది..?" అన్నాడు తండ్రి పీతాంబరం."ఆర్నెల్లవుతోంది.."అన్నాడు ఏకాంబర్.

"క్లైం వస్తుందా?" ఆశ్చర్యంగా అడిగాడు పీతంబరం."ఎందుకు రాదు నాన్నా, సహజ మరణమైతే ఎంక్వైరీ ఉంటుంది. ఇది అనుకోని 'ప్రమాదం' కదా!

పోస్టుమార్టం రిపోర్ట్, మిగతా అన్ని ఫారాలు సరిగ్గా సబ్మిట్ చేస్తే వారంలోపే వారంలోపే క్లైం సెటిల్ అవుతుంది. " డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ అన్నాడు ఏకాంబర్.

"ఎంతొస్తుందేమిటి?" కొడుకు ఏకాంబర్ ముందు కంచం పెడుతూ అడిగింది పర్వతాలు. ఇంతలో నీలాంబర్, అలివేలు మంగ వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

"ఎంతొచ్చినా ఏముందమ్మా పాపం, అతని భార్యని చూస్తే జాలేసిందమ్మా..చిన్న పిల్లలు..చదువుకున్న పిల్లలానే ఉంది...భరత శవం మీద పడి ఏడుస్తూంటే నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయమ్మా" బాధగా అన్నాడు ఏకాంబర్.

"అక్కడకు నువ్వెందుకెళ్ళావన్నయ్యా?" చిన్నన్న కళ్ళల్లో కన్నీటి ఛాయ చూసి బేలగా అడిగింది మంగ.

" వాళ్ళందరి పేర పాలసీలు కట్టారు కదమ్మా! చనిపోయిన శవాన్ని కూడా నాకు చూపించాలేమోనని ఎమ్మెల్యేగారు నాకు కబురు పెట్టారట....పాలసీ క్లైం కి ఎలా అప్లై చేయాలో తెలుసుకోవడానికట " నిర్లిప్తంగా అన్నాడు ఏకాంబర్.

"అందుకే అంటారు, ఇల్లు కాలి ఒకడేడుస్తుంటే చుట్ట అంటించుకుంటాను నిప్పు ఇవ్వమన్నాడట ఎవడో...అలా ఉంది," చీదరింపుగా అన్నాడు పీతాంబరం.

"అవున్నాన్నా...ఎమ్మెల్యే ఆరాలన్నీ క్లైం కోసమేగానీ కనీసం చనిపోయిన అనుచరుడి కోసం రెండు కన్నీటిబొట్లు కూడా జారవిడిచాడో, లేదో?" బాధగా అన్నాడు ఏకాంబర్.

"సరిసరి, ఆ గొడవ ఆపి భోజనం చెయ్యండి.." అందరికీ కూరలు వడ్డిస్తూ అంది పర్వతాలు.

" ఈ గొడవల్లో పడి పెళ్ళి ఏర్పాట్లు మర్చిపోగలవు జాగ్రత్త " చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు పీతాంబరం.

"లేదు నాన్నా! ఎలా మర్చిపోతాను..కానీ కస్టమర్ల కాల్స్ కూడా రిసీవ్ చేసుకోవాలి కదా! అందులో అర్జెంటు పనులుంటే తప్పదు." భోజనం చేస్తూ అన్నాడు ఏకాంబర్.

"అంతేకదండీ!" అంది పర్వతాలు.

అందరూ ఒకేసారి మౌనంగా ఉండిపోయారు. ఎవరి మానాన భోజనాలు కానిచ్చేసారు.

ఆ మర్నాడు సాయంత్రం ఇంటికొస్తున్నప్పుడు ఎమ్మెల్యే మేడిపండి అబద్ధాలరావు నుండి ఫోన్ వచ్చింది. హడావుడిగా ఉన్న ఏకాంబర్ తర్వాత వస్తానన్నా వినకుండా వెంటనే రమ్మని హుకుం జారీ చేసేసరికి ఇక తప్పదన్నట్లు వెళ్ళాడు ఏకాంబర్.

ఏకాంబర్ వెళ్ళేసరికి ఎమ్మెల్యే గారింటి దగ్గర వరండాలో దిగాలుగా నిలబడి ఉంది చనిపోయినతని భార్య. పిల్లలు ఇద్దరూ ఆమెని చుట్టుకుని రెండు చేతుల్తో పట్టుకుని ఉన్నారు.

ఎమ్మెల్యే గారి అనుచరులంతా తలోమూల మిలట్రీ జవాన్ల లాగా స్టడీగా నిలబడి ఉన్నారు.

ఏకాంబర్ ఎమ్మెల్యేగారింటిముందు ఆగేసరికి గేటు దగ్గరున్న గూర్ఖా సలాం చేసి గేటు బార్లా తెరిచాడు.లోపలకు అడుగు పెట్టీపెట్టగానే ఎమ్మెల్యేగారి పీయే ఎదురొచ్చి మరీ లోపలకు తీసుకెళ్ళాడు.

ఎమ్మెల్యేగారిని కలవడానికి హాల్లోకి వెళ్తూనే వరండాలో తన ఇద్దరు పిల్లల్ని పట్టుకుని నిలబడ్డ ఆమెని ఓరకంట చూస్తూనే లోపలకు వెళ్ళాడు ఏకాంబర్.

"రండి రండి ఏజెంట్ ఏకాంబర్ గారూ! మీకు శ్రమ కలిగిస్తున్నాను " అంటూ నవ్వుతూ పలకరించాడు ఎమ్మెల్యే.



జరిగిన కథ : చెల్లెలి పెళ్ళిపనుల్లో హడావుడిగా ఉన్న ఏకాంబర్.. ఎమ్మెల్యే ఫోన్ కాల్ రావడంతో అతడింటికి వెళతాడు...

ఆ తర్వాత

" చెప్పండి సార్ ! ఇంత అర్జెంటుగా రమ్మన్నారు " నిలబడే అడిగాడు ఏకాంబర్.

" ముందు సోఫాలో కూలబడండి. నిన్న చనిపోయాడుగా మా బండోడు. అదిగో ఆడి పెళ్ళాం బిడ్డలు. మీ

ఇన్స్యూరెన్స్ కంపెనీవోళ్ళకి ఏం కాగితాలు కావాలో రాయించి సంతకాలు తీసుకోండి. " ఆర్డర్ వేస్తున్న ట్టే అన్నాడు ఎమ్మెల్యే.ఇక ఏం మాట్లాడినా ప్రయోజనం ఉండదని తన దగ్గరున్న క్లైం ఫారాలు ఇచ్చి దగ్గరుండి వివరాలు అడిగి ఎమ్మెల్యే గారి పి.ఏ. తో నింపించాడు ఏకాంబర్.

కాగితాలన్నింటి మీద మౌనంగా తలవంచుకుని వచ్చి సంతకాలు చేసింది ఆమె. బాగా చదువుకున్న దానికిమల్లే ఇంగ్లీషులో సంతకాలు చేసింది. సంతకం చూసి ఆశ్చర్యం కలిగింది ఏకాంబరానికి.

" ఏం చదువుకున్నారమ్మా? " అప్రయత్నంగా ఆమెని అడిగాడు ఏకాంబర్.

" ఇంటర్ వరకూ నండీ.." ఎంతో వినయంగా అంది ఆ అమ్మాయి.

'పాపం, పాతికేళ్ళు కూడా ఉండవు. ఈ బండోడికి బంతిపువ్వులాంటి అమ్మాయి ఎలా బలయిపోయిందో ' మనసులోనే అనుకున్నాడు ఏకాంబర్.

" చూస్కోండి సంతకాల కోసం మళ్ళా మళ్ళా ఆ పిల్లని ఇసిగించకండి. " అంటూ పి. ఏ. కేసి చూసాడు ఎమ్మెల్యే.

అతను వెంటనే తన గదిలోకి వెళ్ళి బండోడి మరణ ధృవీకరణ పత్రం, పోస్టుమార్టం రిపోర్ట్, ఎఫ్.ఐ.ఆర్ కాపీలు తెచ్చి ఏకాంబర్ చేతికి ఇచ్చాడు. వాటితోబాటే బండోడి పాలసీ బాండులు రెండూ ఇచ్చాడు.

క్షణం ఆశ్చర్యం గా వాటికేసి చూస్తూండి పోయాడుఏకాంబర్.

సామాన్యులకైతే నెలరోజులైనా దొరకని సర్టిఫికెట్లు, ఎమ్మెల్యే గారి పరపతి, పలుకుబడి మూలంగా రెండోరోజుకే ఎగురుకుంటూ వచ్చాయని అనుకున్నాడు మనసులోనే.

" నువ్వెళ్ళమ్మా...పి.ఏగారు! బయట ఉన్న మనోళ్ళని దీన్ని, పిల్లల్ని తీసుకుని ఇంటికాడ ఇడిచిపెట్టి రమ్మనండి.." అంటూ పి.ఏ. నికూడా బయటకు పంపించేశాడు ఎమ్మెల్యే అబద్ధాలరావు.

" క్లైం ఫారాలు, సర్టిఫికెట్లు సర్దుకుని బ్యాగ్ లో పెట్టుకున్నాడు ఏకాంబర్.

" ఏజెంట్ గారు..మా బండోడికి ఎంతొస్తుందో చెప్పలేదు" ఏకాంబర్. చెవి దగ్గర గుసగుసగా అన్నాడు ఎమ్మెల్యే.

"రెండు పాలసీలు పదిలక్షలకు చేసాం కదా సార్. ఈ పాలసీ మొత్తం ఎంతో దానికి మూడు రెట్లు వస్తుంది. యాక్సిడెంటల్ డెత్ కదా ! " అన్నాడు ఏకాంబర్.

" నాకర్థం కాలేదు." ఏకాంబర్ దగ్గరికి జరిగి అన్నాడు ఎమ్మెల్యే.

"ముప్పై లక్షలు వస్తుంది సార్. " చెప్పాడు ఏకాంబర్.

" వారంలో వస్తుందా? " అడిగాడు ఎమ్మెల్యే.

"అన్నీ కరెక్టుగానే ఇస్తున్నాం కదా సార్.వారంలోపే చెక్కు వచ్చేస్తుంది. " చెప్పాడు ఏకాంబర్. " చెక్కు మీరే నా దగ్గరకు తేవాలి. నా ముందే ఆ పిల్ల చేతిలో పెట్టండి " హుందాగా అన్నాడు ఎమ్మెల్యే.

అతను చెప్పింది విన్నాడే కానీ ఏం చెప్పాలో అర్థం కాలేదు ఏకాంబరానికి. అల్లాగేనన్నట్టు తలవూపి లేచి నిలబడ్డాడు.

" సార్ ఇక నేను వెళ్తాను. ఇవి రేపే ఆఫీసులో ఇస్తాను. వస్తాను." అంటూ హాల్లోనుంచి రాబోయిన ఏకాంబర్ చటుక్కున ఆగి తిరిగి వెనక్కి వెళ్ళాడు.

"ఏందయ్యా ఏదైనా మర్చిపోయావా?" ఎమ్మెల్యే నవ్వుతూ అడిగాడు.

" లేదు సార్! వచ్చేవారంలో మా చెల్లెలి పెళ్ళి..మీకు కార్డు ఇద్దామని." అంటూనే బ్యాగ్ లో పెళ్ళి కార్డు తీసి ఆయన చేతికి ఇచ్చాడు." శుభం.తప్పకుండా వస్తాను. మీ చెల్లెలి పెళ్ళి పనుల్లో పడి ఆ కాగితాలు మర్చిపోయేవు జాగ్రత్త వారంలో చెక్కు నా చేతిలో పెడితే నీకు దిమ్మతిరిగిపోయే బహుమతి ఒకటి ఇస్తానయ్యా" అన్నాడు ఎమ్మెల్యే.

"అలాగే సార్. వస్తాను. పెళ్ళికి తప్పకుండా రావాలి." చెప్పాడు ఏకాంబర్.

" నా పని కూడా ఈ వారంలోగావాల" గదమాయించాడు ఎమ్మెల్యే.

తలవూపుతూ అక్కడినుండి బయటపడ్డాడు ఏకాంబర్.

అప్పటికే రాత్రి ఎనిమిది కావస్తోంది. ఇంకా చాలామందికి పెళ్ళికార్డులు పంచాల్సి ఉంది. మనసులోనే కార్డులు ఇవ్వాల్సిన వారిల్లు గుర్తు చేసుకుంటూ పోర్టికోలోకి వచ్చాడు ఏకాంబర్.

బైక్ డ్రైవ్ చేస్తున్నాడు ఏకాంబర్. బీచ్ రోడ్డంతా వీధిలైట్లు వెలగక చీకటిగా ఉంది.ఎదురుగా ఏమీ కనిపించడంలేదు.

అతడి మనసంతా చికాగ్గా వుంది. ఏర్పాట్లన్నీ ఎక్కడివక్కడే వున్నాయి. ఇప్పటికింకా కార్డులే పంపకం జరగలేదు.బైక్ డ్రైవ్ చేస్తున్నాడే కానీ ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో తిరుగుతున్నాయి.ఎదురుగా రాక్షసిలా భయంకరంగా కళ్ళను మసకబరుస్తూ మిరుమిట్లుగొలిపే లైట్లతో లారీ దూసుకువస్తోంది.

లారీ మీదమీదకు వచ్చేసరికి హఠాత్తుగా ఎదురున్న లారీని చూసాడు ఏకాంబర్. అప్పటికే ఆలస్యమైపోయింది. లారీని తప్పించబోయి ప్రక్కనున్న డివైడర్ ని గుద్దేసాడు.

అంతే....బైక్ ఓమూల....ఏకాంబర్ ఓ మూల ఎగిరి పడ్డారు. లారీ మాత్రం క్షణం ఆగకుండా రయ్ మంటూ ముందుకు దూసుకుపోయింది.

********************                    ************                    ******************

ఫ్రాంచైజీ ఆఫీసు మూసేసి ఇల్లు చేరుకుంది నూకరత్నం. ఆ రోజు కలెక్షనంతా ఆఫీసు లాకర్ లో పెట్టిందే గానీ భయంభయంగానే ఇల్లు చేరుకుంది.

రోజూ సాయంత్రం   ఏకాంబర్ వస్తే అప్పగించేసేది, లేదా,తానే బ్యాగ్ లో,భద్రపరచుకునేది, ఈ రోజెందుకో బ్యాగులో పట్టలేదని ధైర్యం గా గోడ్రెజ్ బీరువాలో వున్న లాకర్ లో దాచి పెట్టి వచ్చేసింది. తీరా ఇంటికి వచ్చాక ధ్యాసం తా ఆ డబ్బు మీదేవుంటోంది. తప్పు చేసానా? అన్న దిగులు పీడిస్తోంది.

అన్య మనస్కంగానే బ్యాగ్ మంచం మీద పడేసి బాత్‌రూం లోకి వెళ్ళింది. స్నానం చేసి వచ్చింది.ఆలోచనలు ఇంకా వదలటంలేదు.నైటీ ధరించి వంట గది దగ్గరకు వచ్చింది నూకరత్నం. చెల్లెలు, తమ్ముడు ఓ మూల కూర్చుని బుద్ధిగా చదువుకుంటుంన్నారు

ఏకాంబర్ చెల్లెలి పెళ్ళి ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయి రత్నం? తల్లి అడిగింది.

ఏమో నమ్మా ఈ రోజు ఆయన కలవనే లేదు. ఇంకా కార్డులు పంచుతూ ఊరి మీద తిరుగుతున్నారేమో అంది నూకరత్నం.

ఆకలి దంచేస్తోందమ్మా.... అన్నం పెట్టవూ... నీరసం గా అంది నూకరత్నం.

అంతలో గదిలో వదిలేసిన సెల్ ఫోన్ మోగింది.

అదిగో ఆ మహానుభావుడే అయి వుంటాడు.... ఉదయం నుండి కలవలేదు కదా! అంటూ హుషారుగా పరుగున వచ్చి సెల్ తీసింది.

హలో ......ఆనందం గా అంది...

హలో ...రత్నం... ఒక్కసారి గోపాలపట్నం రాగలవా... అవతలనుండి ఏకాంబర్ లోగొంతుతో మాట్లాడేసరికి అదిరిపడింది నూకరత్నం.

ఏమైంది?...అలా మాట్లాడుతున్నారేమిటీ? ఎక్కడున్నారు? ఆతృతగా అడిగింది నూకరత్నం.

శర్మ హాస్పిటల్లో వున్నాను. చిన్న ఆక్సిడెంట్... నువ్వు వెంటనే రా? ప్లీజ్ అట్నుంచి ఫోన్ కట్ అయిందని గ్రహించి సెల్ పట్టుకుని అచేతనం గా మంచం మీద కూలబడిపోయింది నూకరత్నం.

ఏమైందే? అటునుంచి ఏకాంబరేనా మాట్లాడేది? ఆతృతగా అడిగింది నూకరత్నం తల్లి.

నేను గోపాలపట్నం వెళ్ళాలమ్మా! అర్జెంటూ గాబరాగా నైటీ విప్పేసి చీర కట్టుకుంది.

ఈ సమయం లో ఒక్కదానివే ఎలా వెళ్తావే? నీతో తమ్ముడ్ని తోడు తీసుకెళ్ళు. అంది తల్లి.

అలాగే అంటూ తమ్ముడ్ని తోడు తీసుకుని బయలుదేరింది నూకరత్నం.

రోడ్డు మీదకు రావడంతోనే ఖాళీగా వెళ్తున్న ఆటో ఆపి ఎక్కి కూర్చుని శర్మ హాస్పిటల్ కి వెళ్ళమంది నూకరత్నం.

ఆటో లో కూర్చుని తమ ఫ్రాంచైజీ లో పనిచేస్తున్న యువకులందరికీ ఫోన్ చేసి శర్మ హాస్పిటల్ కి అర్జెంటుగా రమ్మని చెప్పింది.

అర్ధగంటలో శర్మ హాస్పిటల్ ముందు ఆటోదిగి పరుగుపరుగున హాస్పిటల్ రిసెప్షన్ కౌంటర్ దగ్గరకు వెళ్ళింది.

రత్నం... ఎవరో తననే పిలిచేసరికి రిసెప్షన్ దగ్గర నిలబడి ఏకాంబర్ కోసం వాకబు చేయబోతున్న నూకరత్నం గబుక్కున పిలుపు వినిపించి తల త్రిప్పి చూసింది.

రిసెప్షన్ ప్రక్కనే ఒక బల్ల మీద కూర్చుని వున్నాడు ఏకాంబర్.




జరిగిన కథ: ఎమ్మెల్యే ఇంటి నుండి వస్తున్న ఏకాంబరానికి ఎదురుగా లారీ రావడంతో అదుపుతప్పి యాక్సిడెంట్ అవుతుంది.

ఆ తరువాత.....................................

గాబరాగా ఏకాంబర్ దగ్గరకు వెళ్ళింది. ప్రక్కనే కూర్చుని ఆందోళనగా చూసింది. అప్పటికే  కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

" ఏమైంది అంబర్?" అంటూ రెండు చేతుల్తో ఒళ్ళంతా తడిమింది.

" చిన్న యాక్సిడెంట్. ఎమ్మెల్యేగారింటినుంచి వస్తూంటే లారీ ఎదురొచ్చింది. తప్పించబోయి డివైడర్ ని గుద్దేసాను. అదృష్టం కొద్దీ పెద్దగా గాయాలేమీ కాలేదు. ఇదుగో, హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పింది. కాలికి, చేతులకు చిన్న చిన్న గాయాలయ్యాయి." అంటూ చేతి ముడుకులకు, కాళ్ళకు తగిలిన రక్కులు చూపించాడు ఏకాంబర్.

"ఎక్కడ జరిగింది? ఎవరు ఇక్కడికి తీసుకొచ్చారు? " దు:ఖాన్ని దిగమ్రింగుకుంటూ అంది రత్నం.

" బీచ్ రోడ్ లోనే ఏదో ఆలోచిస్తూ బైక్ డ్రైవ్ చేస్తున్నాను. నెమ్మదిగా నడపడం వలన సేవ్ అయ్యాను . ఎవరో ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు వచ్చి హెల్ప్ చేసారు. బైక్ ఏం పాడవలేదు. నేనే అక్కడనుండి నెమ్మదిగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చేసాను." చెప్పాడు ఏకాంబర్.

" నువ్వలా ఫోన్ లో నీరసంగా మాట్లాడి యాక్సిడెంట్ అని చెప్పేసరికి నా గుండె జారిపోయింది. " దాదాపు ఏడుస్తున్నట్టే అంది రత్నం." చ..చ...నీకు చెప్పేవాడినే కాదు. ఫస్ట్ ఎయిడ్ చేయించుకుని ఇంటికెళ్ళిపోదామని అనుకున్నాను. ఈ దెబ్బలు రేపటికి ముదిరి లేవలేనేమోననుకున్నాను. అందుకే నిన్ను పిలిచాను. ఈ బ్యాగ్ లో ఎమ్మెల్యే అనుచరుడి క్లెయిం ఫారాలు ఉన్నాయి. రేపు ఉదయం ఎలాగైనా మా ఆఫీసుకు పంపించెయ్యాలి నీకు తెలిసిందంతా నింపెయ్యి. తెలియనిది ఏదన్నా ఉంటే నాకు ఫోన్ చెయ్యి." చెప్పాడు ఏకాంబర్." అలాగే" అంటూ ఏకాంబర్ దగ్గరున్న బ్యాగ్ లోనుండి క్లైం ఫారాలు తీసింది. అన్నీ సరి చూసుకుని తన బ్యాగ్ లో పెట్టుకుంది.

ఇంతలో ఫ్రాంచైజీ కలక్షన్ బోయ్ లు వచ్చారు. అందరూ శర్మ హాస్పిటల్ లోపలకు వచ్చి రిసెప్షన్ కౌంటర్ ప్రక్కనే కూర్చున్న ఏకాంబర్, నూకరత్నం లను చూసి వారి దగ్గరకు వచ్చారు.

" ఏమైంది మేడం? అంత ఆతృతగా రమ్మని చెప్పారు? సార్ కి ఏమైంది? " ఆతృతగా అడిగారందరూ.

" మీ మేడం మీ అందర్నీ కంగారెత్తించారా? ఏం కాలేదు. చిన్న చిన్న గాయాలు. అంతే. " నవ్వుతూ అన్నాడు ఏకాంబర్.

" అదేంటి సార్? కాళ్ళు. చేతులకి దెబ్బలు బాగా తగిలినట్టున్నాయే?" ఒక అబ్బాయి అన్నాడు.

ఇంతలో కాంపౌండర్ వచ్చి డాక్టర్ గారు రమ్మన్నారనేసరికి ఏకాంబర్ నెమ్మదిగా లేవబోయాడు.

గబాలున చెయ్యి పట్టుకుని నూకరత్నమే దగ్గరుండి డాక్టర్ గదిలోకి తీసుకెళ్ళింది.

ఏకాంబర్ ని పరీక్షించిన డాక్టర్ తేలికగా నూకరత్నంతో అన్నాడు.

" మీరంతా కంగారు పడాల్సినంత గాయాలు కావు మేడం ఇవి. చిన్న చిన్న గాయాలు. రెండురోజులు రెస్ట్ తీసుకుంటే మానిపోతాయి. మీరు పరధ్యాన్నంగా బైక్ డ్రైవ్ చెయ్యకండి సార్. మీ ప్రాణం మీ చేతుల్లోనే ఉంటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మనకే ప్రమాదం." అంటూ నవ్వి ఇంజెక్షన్ చేసారు.

" థాంక్యూ డాక్టర్..వస్తాం." అంటూ తన బ్యాగ్ లో అయిదొందల నోటు తీసి డాక్టర్ చేతికి ఇచ్చింది నూకరత్నం.

*****************   *******************   **********

ఫ్రాంచైజీ కుర్రాడు బైక్ నడుపుతూంటే వెనక కూర్చుని వస్తున్న ఏకాంబరాన్ని చూస్తూనే ఉలిక్కిపడ్డారు ఏకాంబరం తల్లిదండ్రులు. జరిగిన

విషయం ఫ్రాంచైజీ కుర్రాడి ద్వారా, ఏకాంబరం ద్వారా విని, ఇంకా పెద్ద ప్రమాదమేం జరక్కుండా తప్పిపోయినందుకు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

********* ********* ***********

ఆ మర్నాడు.

ఉదయం పదవుతుండగా మెల్లిగా లేచి బుజానికి బ్యాగ్ తగిలించుకుని బయల్దేరబోతున్న ఏకాంబరాన్ని వారించి, ఈరోజు రెస్ట్ తీసుకోమన్నాడు తండ్రి పీతాంబరం.నువ్వొక్కడివే ఉన్నావా ఇంట్లో? మీ నాన్న, అన్న లేరా? వాళ్ళు చేస్తారు... నువ్వీరోజు బయటకెళ్ళడానికి వీల్లేదు" అంటూ వారించింది తల్లి పర్వతాలు.

మీ అమ్మ చెప్పింది తలకెక్కిందా? ఇంట్లోనే ఉండి రెస్ట్ తీసుకో" అంటూ ఏకాంబర్ దగ్గనుంచి బ్యాగ్ తీసుకున్నాడు తండ్రి పీతాంబరం.

వచ్చేవారం..............



జరిగిన కథ: యాక్సిడెంట్ అయిన ఏకాంబర్ ని చూడడానికి హాస్పిటల్ కి వస్తుంది నూకరత్నం. ఇంటికి చేరుకున్న ఏకాంబర్ ని చూసి తల్లితండ్రులు ఆందోళన చెందుతారు.

ఆ తరువాత...............

తండ్రి చెప్పేసరికి మరి మారు మాట్లాడలేక పోయాడు ఏకాంబర్.

" మంగగారు..

నమస్కారం అంకుల్! నమస్తే ఆంటీ " అంటూ హాల్లోకి వచ్చింది నూకరత్నం.

" బాగున్నావా తల్లీ... రారా! " అంటూ ఆహ్వానించింది పర్వతాలు.

" తమరేమిటీ ఆఫీసువదిలి ఇటు వచ్చారు? " ప్రశ్నించాడు ఏకాంబర్.

" ఎలా వున్నారో చూద్ధామని వచ్చాను " అంది నూకరత్నం.

" బానే వున్నాను. పెళ్ళి పనులు చూస్తే అలానే వున్నాయి. పెళ్ళేమో ఇంకా నాల్రోజుల్లోనే వుంది. గాబరాగా ఉంది. కాస్త భయం గా వుంది."     నెమ్మదిగా అన్నాడు.

అన్నీ కాంట్రాక్ట్ కి ఇచ్చేసారు కదా! ఇంకా మీకేం పని వుంది అంది నూకరత్నం.

పని సరే మరి మనీ ఏర్పాటు చేసుకోవాలిగా, ఇంకా చిన్న చిన్న ఏర్పాట్లు వున్నాయిలే అన్నాడు ఏకాంబర్.

చిన్న పనులే అయితే మాకూ చెప్పొచ్చు కదా సార్!

బ్యాగ్ తెరచి చెక్కు తీసి ఏకాంబర్ చేతికి ఇచ్చింది నూకరత్నం.

ఇదేమిటీ? ఇంతెందుకు?! అయోమయం గా చెక్కు కేసి చూస్తూ అన్నాడు ఏకాంబర్.

అలివేలిమంగ పెళ్ళికి అవసరమవుతుందేమో కదా! ఈ సమయం లో మీకు ఉపయోగం గా వుంటుందని తల దించుకుని అంది నూకరత్నం.

ఎనిమిది లక్షలా ...? నీ కమీషన్ ఇచ్చేస్తున్నావే?! ఓరకంట నూకరత్నం కేసి చూస్తూ చెక్కులో వున్న మొత్తం చదువుతూ అన్నాడు ఏకాంబర్.

అంతా ఇవ్వలేదు ఇంకా కొంచెం అకౌంట్ లో వుంటుంది. అది కావాలన్నా తీసుకోండి     అంటూ చెక్కు

బుక్ తీయబోయింది నూకరత్నం.

నూకరత్నం కళ్ళల్లోకి చూసాడు ఏకాంబర్.

చాలా థేంక్స్ రత్నం! నీకున్న అభిమానానికి నా మనసెంతో సంతోషం గా వుంది. ఇది చాలు. ఈ డబ్బు నాకొద్దు. ఇప్పుడు అంత అవసరం కూడా లేదు అంటూ ఆమె చేతిలో చెక్కు పెట్టి ఆమె రెండు చేతులు ఆప్యాయం గా పట్టుకుని ముద్దాడాడు ఏకాంబర్.

అంత ఇదిగా ఆ అమ్మాయి ఏదో ఇస్తూంటే వద్దంటావేం రా తీసుకో టిఫిన్ ప్లేటుతో గదిలోకి వస్తూ అంది పర్వతాలు.

అలా చెప్పండాంటీ! అంటూ చెక్కు ఏకాంబర్ చేతిలో పెట్టి పర్వతాలు చేతిలో వున్న టిఫిన్ ప్లేటు తీసుకుంది నూకరత్నం.

పెళ్ళి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.. ఇంకా రెండు రోజులే వుంది పెళ్ళి.     పెళ్ళి ముహూర్తం దగ్గర పడుతున్న కొద్దీ ఆందోళనగా వుంది ఏకాంబర్ కి. పెళ్ళి వాళ్ళకి ఇస్తామన్న కట్నకానుకల కోసం తను ఇన్స్యూరెన్స్ కంపెనీలో అప్పు కోసం ధరఖాస్తు చేసాడు. అదీ ఇంకా శాంక్షన్ కాలేదు. నూకరత్నం ఇచ్చిన చెక్కు మార్చబుద్ధి కాలేదు. తన చెల్లి పెళ్ళి తన కష్టం తోనే చెయ్యాలనుకున్నాడు. కానీ, సమయం చూస్తే మించిపోతుంది. ఏం చేయాలో అర్ధం కావడం లేదు.

అమ్మానాన్న చూస్తే ఎంతో సంతోషం గా వున్నారు. చెల్లాయిని పెళ్ళికూతుర్ని చేసే ఏర్పాట్లలో బంధువులందరిని పిలవడానికి వెళ్ళారు.నీలాంబర్ తనకేమీ పట్టనట్టు తన కంప్యూటర్ సెంటర్ కి వెళ్ళిపోయాడు. అలివేలుమంగ పెళ్ళి ముహూర్తం దగ్గర పడుతున్న కొద్దీ ఉత్సాహంగా, ఉల్లాసం గా తిరుగుతోంది. ఏకాంబర్ సెల్ ఫోన్ మోగింది. గబాలున ఫోన్ తీసి చూసాడు. ఇన్స్యూరెన్స్ కంపెనీ మేనేజర్.హమ్మయ్య లోన్ సాంక్షన్ అయ్యింటుంది.

హలో సార్ గుడ్ మార్నింగ్ ఆనందంగా విష్ చేసాడు ఏకాంబర్.

ఏం మార్నింగోనయ్యా! చస్తున్నాం! రేపు మన కంపెనీ ఛైర్మెన్ గారు ముంబై నుండి వస్తున్నారట.

సార్! నా లోన్ సంగతి ఏమైంది సార్! ఆగలేక అడిగేసాడు ఏకాంబర్.

నీ లోన్ ఇంకా శాంక్షన్ ఆర్డర్ రాలేదు ఏకాంబర్! ముందు నేను చెప్పింది వినండి ప్లీజ్ అభ్యర్థించాడు బ్రాంచి మేనేజర్.చెప్పండి సార్! అయిష్టం గానే అన్నాడు ఏకాంబర్.

రేపు హోటల్ లో ఉదయం నుండి పదిగంటలకి ఎచీవర్స్ మీట్ వుంది కదా! నీకు మీ డెవలప్ మెంట్ ఆఫీసర్ చెప్పే వుంటాడు కదా!అయితే... అతృతగా అడిగాడు ఏకాంబర్.

మొన్న నువ్విచ్చిన క్లైం సెటిలయ్యిందట. దాని చెక్కు నామినీకి ఇచ్చి ప్రెస్ కి న్యూస్ రిలీజ్ చేద్దామంటున్నారు. మీరు అర్జెంటుగా బండ్ల రాజు గారి భార్యని తీసుకుని ఎలాగైనా రేపు తాజ్ హోటల్ మీటింగ్ కి రాక తప్పదు స్థిరం గా చెప్పాడు బ్రాంచిమేనేజర్.

వెంటనే మేడి పండు అబద్ధాలరావు గారికి ఫోన్ చేసాడు ఏకాంబర్.

నాలుగైదు సార్లు ఎమ్మెల్యే కి ఫోన్ చేసి విసిగిపోయి , ఎమ్మెల్యే పి.ఏ కి కాల్ చేసాడు.

సార్ హైదరాబాద్ లో వున్నారు. శాసన సభ జరుగుతోంది. ఈ పది రోజులు మీకు ఆయన దర్శనం జరగదు చెప్పాడు ఎమ్మెల్యే పీ.ఏ.బండ్ల రాజు భార్యకి విషయం చెప్పి రేపు తాజ్ హోటల్ కి వెళ్ళే ఏర్పాటు చెయ్యాలి. కాదు కూడదంటే తానే దగ్గరుండి తీసుకువెళ్ళక తప్పదు. ఆలోచిస్తూ బైక్ ని కంచెరపాలెం హైవేలో పరుగులెట్టిస్తున్నాడు. ఏకాంబర్.బండ్ల రాజు గారి భార్య పిల్లలు ఇక్కడే గా వుండేది. ఒకసారి ఆమెని పిలుస్తారా? అడిగాడు ఏకాంబర్.ఆల్లెక్కడున్నారు బాబు. బండోడు చనిపోయిన మరునాడే ఎమ్మెల్యే గారే ఆ ఇల్లు ఖాళీ చేసి ఇక్కడి నుండి తరిమేసారు. పాపం ఆ చిన్న పిల్లల్ని తీసుకుని గోడున ఏడుచుకుంటూ వెళ్ళిపోయింది అని అనుచరుడి భార్య చెప్పింది.ఇక్కడికి దగ్గర్లోనే వుంటుంది అని మరో అనుచరుడి భార్య చెప్పింది.

మీలో ఎవరో ఒకరు ఆమెని తీసుకుని బీచ్ రోడ్ లో వున్న తాజ్ హోటల్ కి రాగలరా... అడిగాడు ఏకాంబర్.

బండ్లరాజు చనిపోయాడు కదా.. అందుకని ఆయన క్లైం చెక్కును రేపు అక్కడ మీటింగులో ఇస్తారు అని చెప్పాడు ఏకాంబర్.

అప్పుడే ఇంటికొచ్చిన సత్యవతి వాళ్ళని చూస్తూనే ఏంటొదినా ఇలా వచ్చారు.. ఏంటి పని.. బైక్ మీద వచ్చి సడన్ బ్రేక్ వేసిన ఏకాంబరాన్ని చూస్తూ ఉలిక్కిపడి అడిగింది.

నీ కోసమే వచ్చాం.. ఈ బాబు గారు నిన్ను కలవాలంటే.. అని చెప్పారిద్దరూ...

మీ ఆయన పోయారు కదమ్మా! ఆయన పేర వున్న ఇన్స్యూరెన్స్ పాలసీ డబ్బు వచ్చింది. రేపు బీచ్ రోడ్ లో వున్న తాజ్ హోటల్ లో చెక్కు ఇస్తారు రండమ్మా.. అని తనొచ్చిన పని చెప్పాడు ఏకాంబర్.

అలాగే బాబూ తప్పక వస్తాము సత్యవతి తో పాటు అన్నారు ఆడవాళ్ళు ఇద్దరూ.

మీటింగ్ కోసం వచ్చాడే కానీ ఏకాంబర్ కి ముళ్ళ మీద కూర్చున్నట్టే వుంది. రేపే చెల్లెలి పెళ్ళి. ఏర్పాటలన్నీ అయిపోయినా, ఇంటికి వస్తున్న బంధువుల యోగక్షేమాలు తెలుసుకుంటూ సౌకర్యాలు ఏర్పాట్లు చేయాల్సిన పని ఆదుర్దాలో వున్నాడు.

ఇంతలో ఇన్స్యూరెన్స్ అదికారులు, డెవలప్ మెంట్ ఆఫీసర్లు ఏజెంట్లలో కలకలం బయలుదేరింది. అందరూ ఇన్స్యూరెన్స్ కంపెనీ చైర్మెన్ గారు వస్తున్నారనేసరికి ఆతృతగా మీటింగ్ హాల్లో నుండి గేటు దగ్గరకు వచ్చారు.

కంపెనీ చైర్మెన్ చేతుల మీదుగా సత్యవతికి చెక్కులు ఇప్పించారు.

ఆ సమావేశం లో జోనల్ టాపర్ గా ఏకాంబర్ ని వేదిక మీద ఘనం గా సన్మానించారు.

రాజనాలకు కూడా జోనల్ టాపర్ గా సన్మానం జరిగింది.

అందరూ హోటల్ నుండి బయటకు వచ్చారు.

అమ్మా ఇక మీరు ఇంటికి వెళ్ళిపోండి. నేను ఇంటికి వెళ్ళాలి. ఏకాంబర్ అన్నాడు వారితో.

ఈ చెక్కు ఎలా మార్చాలో నాకు తెలీదయ్యా.. నువ్వే ఏదోకటి చెయ్యాలి అంది సత్యవతికి.

అదేమిటీ?! మీకు మీ వారికి ఒక బ్యాంకు అకౌంట్ వుంది కదా! అందులో వేయండి. అన్నాడు ఏకాంబర్.

కూలీకి అయ్యగారి దగ్గర కాపలా కుక్కలా పడుండే మా బోటోళ్ళకి బ్యాంకు ఖాతా లెక్కడివయ్యా... అన్నారు మిగతా ఆడవాళ్ళిద్దరూ..ఏకాంబర్ ఆశ్చర్యం గా వారికేసి చూసాడు.|

అదేమిటీ మీ భార్యాభర్తలిద్దరి పేర బ్యాంకు అకౌంట్ వుందే అంటూ గబాలున తన బ్యాగ్ లో చూసాడు. మరణ దృవ పత్రం, అకౌంట్ కాపీ జిరాక్స్, డెత్ సర్టిఫికెట్ కాపీలు ఆమె చేతికి ఏకాంబర్ ఇవ్వబోతే.. మాకొద్దయ్యా... మీరే ఏమైనా చేయండి.. మాకేమీ తెలియదు అంది దీనంగా సత్యవతి.

వెంటనే మహారాణి పేట , కలెక్టరాఫీసు దగ్గరికి సత్యవతిని, ఆమెతో వచ్చిన వాళ్ళని తీసుకెళ్ళాడు.మేడం ఈ అకౌంట్ ఒకసారి చూస్తారా! అంటూ పాస్ బుక్ జిరాక్స్ కాపీ కౌంటర్ లో ఇచ్చాడు.

సార్ పాస్ బుక్ కావాలి ఇలా జిరాక్స్ కాపీలతో అకౌంట్ చూడకూడదు    కౌంటర్ లో వున్న అమ్మాయి సీరియస్ గానే ఏకాంబర్ కి సమాధానం చెప్పింది.

ముగింపు వచ్చే సంచికలో.................



జరిగిన కథ: లాగిన కొద్దీ కదిలిన డొంక లాగా ఎమ్మెల్యే మోసాలు బయటపడుతాయి. అటు చెల్లెలి పెళ్ళి ఇటు ఎమ్మెల్యే వ్యవహారం ఏకాంబర్ ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి.

ఆ తరువాత..................

.......................................................

భర్త పేర ఈమె పేర వుంది. ఆయన చనిపోయారు. ఈ డెత్ సర్టిఫిట్లు ఇవ్వాలి. అకౌంట్ నంబర్ కరెక్టో కాదో కన్ ఫర్మ్ చేసుకుందామని అన్నాడు ఏకాంబర్.

చకా చకా కంప్యూటర్లో చెక్ చేసి అది బండ్ల రాజు, బండ్ల సత్యవతి గార్ల ఎయిదర్ ఆర్ సర్వైవర్ అకౌంట్. ఇందులో లక్షా ఆరువేల రూపాయలు ఉన్నాయి. ఏమన్నా డబ్బు డ్రా చెయ్యాలంటే మీ దగ్గర చెక్కు బుక్కు వుంది కదా! అందులో రాసి ఇవ్వాల్సి వుంటుంది అంది.ఏకాంబర్ కి మతిపోయింది, సత్యవతికి, ఆమెతో వచ్చిన ఆడవాళ్ళకి ఏమీ అర్థం కావడం లేదు.

సార్ మీరు బ్రాంచి మేనేజర్ గారిని కలవండి సార్! డెత్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు కదా అంటూ ఆ అమ్మాయి మరో కస్టమర్ తో మాట్లాడుతూ వుండిపోయింది.

సత్యవతిని తీసుకుని బ్యాంకు మేనేజర్ కేబిన్ లోకి అడుగుపెట్టాడు ఏకాంబర్.

పాపం ! వీళ్ళందర్నీ అమాయకుల్ని చేసి వాళ్ళ పేర వ్యాపారాలు చేస్తూ బినామీ అకౌంట్ లు నిర్వహిస్తున్నాడు. మనసులోనే తిట్టుకున్నాడు ఏకాంబర్.

ఈలోగా డాక్యుమెంట్లు చూస్తున్న మేనేజర్. తల ఎత్తి వారికేసి చూసాడు.

చెప్పండి సార్! ఏం కావాలి? అడిగాడు బ్రాంచి మేనేజర్.

ఈమె పేర, ఈమె భర్త పేర మీ బ్యాంకులో ఒక అకౌంట్ వుంది అని జిరాక్స్ కాపీ ఆయన చేతికిచ్చాడు ఏకాంబర్...

ఒకే.. చెప్పండి నేనేం చేయాలి అన్నారు బ్రాంచి మేనేజర్..

కొత్త పాస్ బుక్ ఇప్పించాలి అన్నాడు ఏకాంబర్.

జాయింట్ అకౌంట్ కదా.. ఇద్దరూ కలిసి పాస్ బుక్ పోయిందని ధరఖాస్తు ఇవ్వాలి సార్ అన్నాడు మేనేజర్.

ఆయన ఈ మధ్య చనిపోయారు సార్! ఇదిగోనండీ డెత్ సర్టిఫికెట్ అని ఇచ్చాడు ఏకాంబర్. డెత్ సర్టిఫికెట్ చూస్తూ పోనీలేండి.. చెక్ బుక్ వుండాలి కదా మీదగ్గర సత్యవతిని చూస్తూ అన్నాడు మేనేజర్..

సార్ చెక్ బుక్ కూడా లేదు సార్.. చనిపోయే ముందు అవన్నీ తీసుకెళ్ళాడట సార్.. అని ఏకాంబర్ అన్నాడు.

సత్యవతి, ఏకాంబర్ ఆలోచనను అర్థం చేసుకుని అవును సార్! అంది దీనం గా..

మీరెవరో తెలీదు. ఇలా జిరాక్స్ కాపీ తో ఈవిడని గుర్తించడం చాలా కష్టం. అనుమానం గా చూస్తూ అన్నాడు మేనేజర్.

సార్ మేము ఆ అకౌంట్ లో వున్న డబ్బు తీసెయ్యాలని రాలేదు. ఇదిగోనండి! ఇది అందులో వేద్దామని వచ్చాం.

మేనేజర్ ముందుంచాడు ఏకాంబర్.

" వ్వాట్ ముప్పై లక్షలా! మేడం గారివేనా? " ఆశ్చర్యంగా అడిగాడు మేనేజర్.

ఇన్స్యూరెన్స్ చెక్కు సార్" చెప్పాడు ఏకాంబర్.

ఈ అకౌంట్ లోనుండి డబ్బు ఎక్కణ్ణుంచి వస్తున్నదీ, ఎటు పోతున్నదో మేనేజరు వివరంగా చెప్పేసరికి నిర్ఘాంతపోయారు ఏకాంబర్, సత్యవతి. తమ బ్యాంక్ లో వాళ్ళ పిల్లల పేర ఫిక్స్డ్ డిపాజిట్స్ చేయిస్తాననేసరికి అన్నీ చకచకా పూర్తిచేసాడు మేనేజర్." వస్తా సార్..." అని అక్కణ్ణుంచి బయల్దేరాడు ఏకాంబర్.

************

కళకళలాడుతున్న కళ్యాణ మండపం....

బిజీగా ఉన్నాడు ఏకాంబర్...

ఇంతలో స్కార్పియో లోంచి దిగాడు ఎమ్మెల్యే, అతడి అనుచరులు....

వస్తూనే నేరుగా ఏకాంబర్ దగ్గరకొచ్చి కాలరు పట్టుకుని ఎమ్మెల్యే దగ్గరకు లాకుపోయాడు.

" ఏరా డబ్బు నేను కడితే చెక్కు దానికిప్పిస్తావా? " ఆరోజు దినపత్రికల్లోని వార్తను చూపిస్తూ అరిచాడు ఎమ్మెల్యే. అప్పుడు చూసాడు ఏకాంబర్ ఆ పేపర్లు. నిన్నటిరోజున ముప్పై లక్షల చెక్కును ఇన్స్యూరెన్స్ కంపనీ చైర్మన్ సత్యవతికిస్తున్న ఫోటోలు అవి.ఓహో అదా విషయం అనుకున్నాడు.... ఇంతలో ఆహూతులందరూ ఏం జరుగుతోందో అర్థం కాక అక్కడకు చేరుకున్నారు. ఏకాంబర్ మీద దాడి చేయబోయిన ఎమ్మెల్యే అనుచరుల నుండి ఏకాంబర్ ని కాపాడేందుకు స్వయంగా అతడి అనుచరుల భార్యలే రక్షణ వలయంగా నిలబడ్డారు. అప్పటికేమీ చేయలేక అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు ఎమ్మెల్యే, అతడి అనుచరులు.

*****************

ఆ మర్నాడు...

ఏకాంబరాన్ని ఈడ్చుకు రమ్మని పురమాయించిన ఎమ్మెల్యేకి, తాము ఆపని చేయలేమనీ, ఎందుకంటే తమ భార్యలు ఏకాంబరానిక్

ఏమన్నా జరిగితే ఊర్కోమన్నారని ఖరాఖండీగా చెప్పేసారు అతడి అనుచరులు.....

అందుకని వేరే గూండాల ద్వారా ఏకాంబరాన్ని అంతం చేయడానికి నిశ్చయించుకున్నాడు ఎమ్మెల్యే.

****************

అనుచరుల పేర ఎమ్మెల్యే అకౌంట్స్ ఓపెన్ చేసి ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీకి బస్సులు నడిపించడం, ఆ ఆదాయాన్ని మరోవైపు మళ్ళించడం అంతా ఏకాంబర్ ద్వారా తెలుసుకున్న అనుచరులలో ఇప్పుడు చతన్యం వచ్చింది. తామే స్వయంగా ఆ బస్సులను నడుపుకోని ఉపాధి పొందేందుకు దృఢంగా నిశ్చయులైనారు. దగ్గరుండి ఈ విషయాలన్నీ తమకు చెప్పి చైతన్యవంతులను చేసినందుకు అనుచరులకూ, చనిపోయిన బండోడి భార్యకు చెక్కు ఇప్పించినందుకు అనుచరుల భార్యలకూ ఏకాంబర్ గొప్పగా కనిపించి, మార్గ దర్శకుడయ్యాడు.ఏకాంబర్, ఎమ్మెల్యే అనుచరులున్న చోటికి రొప్పుతూ వచ్చిన పీ.ఏ. ఏకాంబరాన్ని చంపించేందుకు మరో గూండాను పంపబోతున్నాడని చెప్పేసరికె, అనుచరులందరూ ఏకాంబర్ ని

కాపాడేందుకు అవసరమైతే ఎమ్మెల్యేని ఎదిరిస్తామని ముక్త కంఠం తో అన్నారు. అప్పుడు పీ.ఏ.." ఏంటిరా మీరు ఎదిరించేదీ? ఎదిరించిన బండోడు ఏమైపోయాడో తెలుసుగా" అంటూ నాలిక్కరుచుకున్నాడు... ఆ తర్వాత ఏకాంబర్, ఎమ్మెల్యే అనుచరుల బలవంతం మీద అతడు చెప్పిన విషయం విని అందరికీ మతిపోయింది...

." అది సార్ జరిగిన విషయం... తమ పేర అకౌంట్స్ ఉన్న విషయం తెలిసి వాటి గురించి నిలదీసిన బండోడు శవమై సముద్రంలో తేలాడు.... ఇప్పుడు ఏకాంబరాన్ని చంపించడానికి ఫలానా గూండాలను పురమాయించి దాడి జరిపించాడు..."

పోలీస్ కమీషనర్ ముందు సాక్ష్యం చెప్పాడు పీ.ఏ.

ఆ వారంలోనే స్పీకర్ పర్మిషన్ తో ఎమ్మెల్యే మేడిపండు అబద్ధాలరావుని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.ఏజెంట్ ఏకాంబర్ వలన ఎమ్మెల్యే చేసే మోసాలన్నీ బయట పడ్డాయని ఆధారాల్తో సహా దిన పత్రికలన్నీ కోడై కూసాయి. విశాఖపట్నం లో ఇప్పుడు " ఏజెంట్ ఏకాంబర్ " జగమెరిగిన బ్రాహ్మడయ్యాడు. అతను తిరక్కుండానే పాలసీదారుల నుండి పిలుపులు వస్తున్నాయి.

*************

పీతాంబరం అనుకున్నట్టుగానే ఒకే వేదిక మీద రెండు పందిళ్ళలో ఇద్దరు కొడుకులవీ పెళ్ళిళ్ళు జరిపించాడు....

xxxxxxxxxxxxxxxxxx శుభం xxxxxxxxxxxxxxxxxxxx